


అదే పెన్న! అదే పెన్న! నిదానించి నడు!
విదారించు నెదన్, వట్టి ఎడారి తమ్ముడు!
ఏదీ పెన్న? ఏదీ పెన్న? ఏదీ పినాకినీ?
ఇదే పెన్న! ఇదే పెన్న! ఇదూ పినాకిని!
ఏదీ నీరు? ఏదీ హెూరు? ఇదే ఇసుక వాలు!
అదే పెన్న! అదే పెన్న! నిదానించు నడు!
విదారించు నెదన్, వట్టి ఎడారి తమ్ముడు!
ఇంత మంచి పెన్న తల్లి ఎందు కెండి పోయెనో?
ఇంతమంచి కన్నతల్లి ఎందు కిట్లు మారెనో?
ఇంత మంచి పెన్నతల్లి ఎందుకిట్లు మారెనో?
ఇంత మంచి కన్నతల్లి ఎందుకెండి పోయెనో?
ఈ యేటి కాల్వ లోతుల పాయలుగా పారు,
నీటి ప్రతి బొట్టున, నీ చాయల రైతుల నెత్తిటి
చాయల సమ్మిళితమై విచారము గొల్పున్

– విద్వాన్ విశ్వం

Anantha prasthanam

అనంత ప్రస్థానం



డా॥ వై.వి. మల్లారెడ్డి

అనంత మాగ్నా కార్ట

# అనంత ప్రస్థానం

(మరింత సమగ్రంగా మీ ముందుకు)

ద్వితీయ ముద్రణ



డా॥ వై.వి. మల్లారెడ్డి

# అనంత ప్రస్థానం

డా॥ వై.వి. మల్లారెడ్డి



**కదలిక ప్రచురణలు**

అనంతపురం

**ANANTAPRASTHANAM**
by
**Dr. Y. V. Malla Reddy**

Published by
**Imam**
**Kadalika Prachuranalu**
Yerranelakottalu, R.C. Nagar, Anantapur.
Ph: 08554 - 277789.

First Edition: **June - 2007**

Second Edition: **April - 2017**

Copies : **2000**

Cover & Book Designed by:
**Venkatesulu**
9177620950

Composed by:
**Sri Navatha Digitals**
Anantapur, Cell: 9177620950

Printed at:
**Vipla Printers**
Hyderabad.

**Price: Rs. 150-00**

Copies available at:
**Kadalika Prachuranalu**
Yerranelakottalu,
R.C. Nagar, Anantapur.
and **all leading book stalls**

***The contents of this book can be freely used by any body for any social cause, quoting the author and publisher***

*"ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో..*

*ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారుతారో..*

*ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో..*

*ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా*

*'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో..*

*అక్కడ..*

*వ్యవస్థకు సంబంధించిన పున:సమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం.*

*అప్పుడు తమ గురించి, తమకు సంబంధించిన వారి గురించి,*

*తమ చుట్టూరా ఉన్న వారి గురించి, తమ కార్యకలాపాలకు సంబంధించి*

*అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"*

**– రాబర్ట్ క్లిట్ గార్డ్ (సామాజిక వేత్త)**

# అంకితం



తమ పిల్లల భవిష్యత్తు కోసం, ప్రత్యేకించి నన్ను
పై చదువులు చదివించుకోవడం కోసం, నిరంతరం కరువు,
దారిద్ర్యాలతో పోరాడుతూ, శ్రమిస్తూ, దుర్భర జీవితాలను
అనుభవించిన నా తల్లిదండ్రులు శ్రీమతి వై. వెంకటమ్మ,
కీ.శే. శ్రీ వై. హరినారాయణ రెడ్డి.
ఈ ''అనంత ప్రస్థానం'' గౌరవ పాదాభివందనములతో
వారికి అంకితం.

డా॥ వై.వి. మల్లారెడ్డి

# పరిష్కృత అనంత ప్రస్థానము

*ఇదీ ప్రయాణము....*


| | | |
|---|---|---|
| i | Foreward - K.R.VENUGOPAL IAS (Retd) | 1 |
| ii | ముందు మాట కె.ఆర్. వేణుగోపాల్ ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) | 8 |
| iii | కరువును కదిలించే...- **అన్నే ఫెర్రర్.** | 14 |
| iv | ముందు మాట - మల్లారెడ్డి | 15 |
| v | మల్లారెడ్డి గురించి నా మాట **ఇమామ్ -ఎడిటర్, కదలిక.** | 17 |
| vi | అనంత జిల్లాకు లభించిన అపరూపమైన ఆణిముత్యం మల్లారెడ్డి **-ఎడిటర్, కదలిక.** | 17 |
| 1. | పెద్ద నోట్ల రద్దు - అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని ఆపగలదా? | 25 |
| 2. | సప్తసముద్రాలు, షట్చక్రవర్తులు.. ఒకే ఒక్క అనంతపురము. | 30 |
| 3. | రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి కోసం... | 36 |
| 4. | మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బహిరంగ రహస్యాలు... | 42 |
| 5. | అనంతపురం జిల్లాకు అనువైన పరిశ్రమలు, పారిశ్రామిక విధానాలు... | 48 |
| 6. | అనంతపురం జిల్లాకు భూతాపం ముప్పు: మరింత జటిలం కానున్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులు | 53 |
| 7. | జలసంపద జాతీయ పరిధిలోకి రావాలి.... | 64 |
| 8. | అనంతపురం జిల్లాకు 100 టి.ఎమ్.సి.ల నీరు కేటాయించాలి. | 71 |
| 9. | అనంతపురం జిల్లా త్రాగు నీటి అవసరాలు... | 77 |
| 10. | ఉపాధి హామీ పథకం ఉన్నా భారీగా వలసలు... | 82 |
| 11. | అనంతపురం జిల్లా కరువు స్వరూపము -ఆశలు రేకెత్తిస్తున్న... | 87 |
| 12. | అనంతపురం జిల్లా కరువును అధిగమించుటకు అనుసంధాన నీటి వినియోగం. | 94 |
| 13. | సమగ్ర జల వలయమే అనంతకు శ్రీరామరక్ష... | 99 |
| 14. | అనంత నీటిగోడు... | 104 |

15. అనంతపురం జిల్లాలో కరువు – ఎడారీకరణను నివారించే... 109
16. Combating drought & Desertification and mitigation... 116
17. Conjunctive Water Management : An approach to suc18. 128
**18.** Conjunctive Water Management 135
19. అంతర్జాతీయ భూమాత దినోత్సవం. 138
20. అనంత ఎడారిలో చెరువులు, కుంటలే ఒయాసిస్సులు. 142
21. అనంతపురము జిల్లాలో కరువును అధిగమించడానికి కీలక తడులే... 145
22. ఉపాధిహామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడాలి... 149
23. వర్షాధార భూములలో మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము... 153
24. సమగ్ర వ్యవసాయ విధానము... 158
25. వాతావరణ మార్పులకు తట్టుకొని అనంతపురం జిల్లా వ్యవసాయాన్ని కాపాడుకొనే విధానాలు... 161
26. అంతర్జాతీయ కరువు ఎడారీ నివారణదినం... 167
27. జలవనరులను కాపాడుకుందాం ! ఎడారీకరణను నివారిద్దాం... 173
28. ఉపాధి హామీ పథకం గ్రామీణ ఉపాధి ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు... 177
29. World Water Day 181
30. “అనంత ప్రస్థానం” – 2 190

# *Foreward*



I have had the honour of knowing Dr.Malla Reddy as a much-admired activist and later as a close friend and sometimes a co-worker for nearly a quarter of a century. I had come to see him in Anantapur in 1994 immediately after the Employment Assurance Scheme (EAS) designed in the Prime Minister's Office, a healthy precursor to a national level rural employment guarantee programme, had been put on ground. I followed this up with my next visit to Anantapur in 1995 for discussions with him in the context of the programme for poverty eradication based on social mobilisation of the poor through Self Help Groups, - an idea that the SAARC Independent South Asian Commission for Poverty Alleviation had advocated in its report Meeting the Challenge, and unanimously approved by the Dacca SAARC summit of 1993. This report had been co-authored by me as a member of that Commission.The visit to Anantapur was because Prime Minster Narasimha Rao had agreed to my proposal that the strategies advocated in the Commission's report should be implemented over a large area covered by the three most backward districts of Andhra Pradesh, namely, Anantapur, Kurnool and Mahabubnagar as a pilot. My next visit to the District was when in the year 2002, as the Special Rapporteur of the National Human Rights Commission of India (NHRC), I investigated the deaths by suicide of farmers of Andhra Pradesh on behalf of the NHRC in NHRC Case No. 441/1/2001 – 2002, including by visiting and meeting the families of the victims of suicide deaths. Then came our joint association with the memorable work of the Commission on Farmers' Welfare in 2004 chaired by the outstanding economist Jayati Ghosh,- he as member and me as special invitee. By far the most intensive work I have done in Anantapur district with Dr.Malla Reddy was the conduct of the social audit of the ICDS programme led and coordinated by me on behalf of the Council for Social Development, New Delhi in 2008 – 2009, in which effort Dr.Malla Reddy played an unforgettable, stellar role. This effort also gave me the privilege to work

# అనంత ప్రస్థానం

డా॥ వై.వి. మల్లారెడ్డి



**కదలిక ప్రచురణలు**

అనంతపురం

**ANANTAPRASTHANAM**
by
**Dr. Y. V. Malla Reddy**

Published by
**Imam**
**Kadalika Prachuranalu**
Yerranelakottalu, R.C. Nagar, Anantapur.
Ph: 08554 - 277789.

First Edition: **June - 2007**

Second Edition: **April - 2017**

Copies : **2000**

Cover & Book Designed by:
**Venkatesulu**
9177620950

Composed by:
**Sri Navatha Digitals**
Anantapur, Cell: 9177620950

Printed at:
**Vipla Printers**
Hyderabad.

**Price: Rs. 150-00**

Copies available at:
**Kadalika Prachuranalu**
Yerranelakottalu,
R.C. Nagar, Anantapur.
and **all leading book stalls**

***The contents of this book can be freely used by any body for any social cause, quoting the author and publisher***

*"ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో..*

*ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారుతారో..*

*ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో..*

*ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా*

*'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో..*

*అక్కడ..*

*వ్యవస్థకు సంబంధించిన పున:సమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం.*

*అప్పుడు తమ గురించి, తమకు సంబంధించిన వారి గురించి,*

*తమ చుట్టూరా ఉన్న వారి గురించి, తమ కార్యకలాపాలకు సంబంధించి*

*అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"*

**– రాబర్ట్ క్లిట్ గార్డ్ (సామాజిక వేత్త)**

# అంకితం



తమ పిల్లల భవిష్యత్తు కోసం, ప్రత్యేకించి నన్ను
పై చదువులు చదివించుకోవడం కోసం, నిరంతరం కరువు,
దారిద్ర్యాలతో పోరాడుతూ, శ్రమిస్తూ, దుర్భర జీవితాలను
అనుభవించిన నా తల్లిదండ్రులు శ్రీమతి వై. వెంకటమ్మ,
కీ.శే. శ్రీ వై. హరినారాయణ రెడ్డి.
ఈ "అనంత ప్రస్థానం" గౌరవ పాదాభివందనములతో
వారికి అంకితం.

డా॥ వై.వి. మల్లారెడ్డి

# పరిష్కృత అనంత ప్రస్థానము

*ఇదీ ప్రయాణము....*


| | | |
|---|---|---|
| i | Foreward - K.R.VENUGOPAL IAS (Retd) | 1 |
| ii | ముందు మాట కె.ఆర్. వేణుగోపాల్ ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) | 8 |
| iii | కరువును కదిలించే...**- అన్నే ఫెర్రర్.** | 14 |
| iv | ముందు మాట - మల్లారెడ్డి | 15 |
| v | మల్లారెడ్డి గురించి నా మాట **ఇమామ్ -ఎడిటర్, కదలిక.** | 17 |
| vi | అనంత జిల్లాకు లభించిన అపరూపమైన ఆణిముత్యం మల్లారెడ్డి **-ఎడిటర్, కదలిక.** | 17 |
| 1. | పెద్ద నోట్ల రద్దు - అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని ఆపగలదా? | 25 |
| 2. | సప్తసముద్రాలు, షట్చక్రవర్తులు.. ఒకే ఒక్క అనంతపురము. | 30 |
| 3. | రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి కోసం... | 36 |
| 4. | మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బహిరంగ రహస్యాలు... | 42 |
| 5. | అనంతపురం జిల్లాకు అనువైన పరిశ్రమలు, పారిశ్రామిక విధానాలు... | 48 |
| 6. | అనంతపురం జిల్లాకు భూతాపం ముప్పు: మరింత జటిలం కానున్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులు | 53 |
| 7. | జలసంపద జాతీయ పరిధిలోకి రావాలి.... | 64 |
| 8. | అనంతపురం జిల్లాకు 100 టి.ఎమ్.సి.ల నీరు కేటాయించాలి. | 71 |
| 9. | అనంతపురం జిల్లా త్రాగు నీటి అవసరాలు... | 77 |
| 10. | ఉపాధి హామీ పథకం ఉన్నా భారీగా వలసలు... | 82 |
| 11. | అనంతపురం జిల్లా కరువు స్వరూపము -ఆశలు రేకిస్తున్న... | 87 |
| 12. | అనంతపురం జిల్లా కరువును అధిగమించుటకు అనుసంధాన నీటి వినియోగం. | 94 |
| 13. | సమగ్ర జల వలయమే అనంతకు శ్రీరామరక్ష... | 99 |
| 14. | అనంత నీటిగోడు... | 104 |

15. అనంతపురం జిల్లాలో కరువు – ఎడారీకరణను నివారించే... 109

16. Combating drought & Desertification and mitigation... 116

17. Conjunctive Water Management : An approach to suc18. 128

**18.** Conjunctive Water Management 135

19. అంతర్జాతీయ భూమాత దినోత్సవం. 138

20. అనంత ఎడారిలో చెరువులు, కుంటలే ఒయాసిస్సులు. 142

21. అనంతపురము జిల్లాలో కరువును అధిగమించడానికి కీలక తడులే... 145

22. ఉపాధిహామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడాలి... 149

23. వర్షాధార భూములలో మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము... 153

24. సమగ్ర వ్యవసాయ విధానము... 158

25. వాతావరణ మార్పులకు తట్టుకొని అనంతపురం జిల్లా వ్యవసాయాన్ని కాపాడుకొనే విధానాలు... 161

26. అంతర్జాతీయ కరువు ఎడారీ నివారణదినం... 167

27. జలవనరులను కాపాడుకుందాం ! ఎడారీకరణను నివారిద్దాం... 173

28. ఉపాధి హామీ పథకం గ్రామీణ ఉపాధి ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు... 177

29. World Water Day 181

30. "అనంత ప్రస్థానం" – 2 190

with another NGO leader, the redoubtable Ms.C. Bhanuja of REDS, Kadiri.Mr. K.S. Gopal, a pioneer institutional builder like Dr.Malla Reddy, Director, Centre for Environment Concern, Hyderabad was the lead NGO in this effort.

In all this, I have been a devoted witness to who Malla Reddy has been as a thinker, doer, social mobiliser and leader. I am therefore honoured to be invited by him to write the foreword to his book Ananta Prastanam.

This is a brilliantly written book on the district of Anantapur in Andhra Pradesh by an author, who has known the district like a child knows his mother. This is verily a biography of Anantapur District and the value of biographies as a concept was settled more than two thousand years ago by Plutarch. When we were students we were told to read biographies for they would inspire us to great goals and greater heights. Biographies are about lives and also about history of lives. Often about the character of those lives. This book on Anantapur is about its contemporary life, its people, its history in the sense of what its life has been in terms of its endowments over a long period, its contemporary predicaments, its climate historically and its consequences for its people today, - a life described with abiding love but a life that has seen and continues to see hardships almost without parallel but like all life where hope springs eternal in the human breast. It chronicles the current sorrows and woes besetting Anantapur and its loveable, long-suffering people by one of them, who also knows the answers to its questions and who is not afraid to bring those answers to the public domain in concrete terms. Not afraid because he has knowledge, has evidence, has worked among his people and in the field wetting his feet and soiling his hands, and above all has shared their sorrows as his own. The validity of this book and Malla Reddy's own life emerge from his having been an organic part of Anantapur district and her people, and thus his identification with their very soul.But then, it is not merely a story of Anantapur district but of upward of 600 drought-prone blocks of India quite a few of which are advancing towards desertification even as Anantapur district has been, and where all human development indices are in disarray.Hence its relevance to a huge segment of India's people, their agriculture, their livelihoods, their human needs as fundamental as drinking water, health and education and verily therefore their Right to Life. Malla Reddy aptly highlights that as a Constitutional question with implications for what we have been touting as a democratic way of life in India, a belief he questions with against and evidence.

The book's relevance is rooted in many truths, - the truth of loss of precious lives of farmers and their kin, not loss but taken of their own volition known euphemistically as suicide, not only because of Nature's chronic vagary

but the negligent indifference of the State to every aspect of human life here;the State's sheer lethargy to bestir itself to address the in-your- face conditions of persistently gross regional inequalities within Andhra Pradesh, within RayalaSeema and even within Anantapur district; inhuman consequences of human migration where the very core of human dignity, especially of women, stands violated on a daily basis in distant cities;the fact that this migration leaves behind without protection the old and the infirm, not to speak of little children, whose education the migrating parents strive to thus protect; the indifference of the Indian State to the indebtedness in which the Indian farmer is born and from which his or her life cannot be separated till death or suicide; the exacerbation of this existential position by a fast deteriorating health and education environment where greed and commerce have overtaken time-honoured concepts of care of the sick and the learning of the children, indulgently watched over by the State exulting in the name of economic reforms; and failure to stand by the victims of this cause on the part of the State either initially by way of prevention or even after the event by way of compassion and credible action. All this has been fully documented by Malla Reddy in this book backed by information and data, including that based on personal field level observations over a long period of time rendered poignant by the most recent experiences and studies of the latest happenings.

Why are these things happening, and happening repeatedly? This brings Malla Reddy to the very issue of Governance. Malla Reddy answers this question by devoting one full chapter to the obvious secrets of politics and corruption. He finds, as we all do, that there is no exception to the rule of corruption where political parties are concerned. Corruption comes multi-coloured. Partisan political considerations, which bring in huge dividends because of the corruption involved, inform economic decisions further influenced by hugely- centralised models of development or conveniently designed development programmes themselves. The most favoured economic model is the metropolitan model of development, not one that occurs naturally but one that is promoted artificially, as if the rural hinterlands mattered not at all. Never mind the experiences of the past, even the very recent past, in this model that brought not just rural distress but rural death particularly distinguished by suicides. Even the opposition, never mind the parties in power, allows its attention to be diverted by these distracting red herrings. As Talleyrand said of the Bourbons "they learned nothing and forgot nothing". The overall commitment to the farmers or rural livelihoods of the poor in terms of political priorities of Indian democracy would aptly justify these words of Talleyrand. Malla Reddy rightly concludes that this kind of politics which is now institutionalised totally discredits the very

concept of democracy and has actually demolished political institutions and structures of governance. This destruction of institutions has come in the form of political corruption; political interference in every day governance; in appointments and transfers including of civil servants at the highest levels compromising integrity of decision making, - these together resulting in bureaucratic collaboration in venal forms of politics and non-delivery of justice and grievance redress to the citizens, particularly in rural areas.In this environment, all dimensions of democratic governance have been upended, of which of course violations of human rights of the farmers in multiples waysare the most demonstrable.

There is much in this book that also partakes of the character of a “manual” of agricultural and irrigation administration in rain shadow areas, excepting that this manual comes in the form of a highly readable narrative and exciting ground level tips and answers to frequently asked questions of great significance to these areas. That it makes for absorbing reading to the interested and concerned practitioners of these sciences, will be seen from the chapters on the invaluable commodity that Water is to humankind and Conjunctive irrigation as the answer to the challenges of Anantapur district and drought-prone dry land agriculture everywhere in India. Every little detail is explained in an easily understood way as to how conjunctive use of water from the four sources of its availability, - rain water, ground water,local surface water and river water through a water grid that can be used to provide protective irrigation and additional irrigation for normal yields and also additional yields, by using appropriate technologies of irrigation like drip or sprinkler, in appropriately designed sowing and water devices, to suit the different manner of planting of crops, whether densely or sparsely. All this is based on original thinking derived from experience and observation, and testing and experimentation in the field at the farm and farmer’s level.

Every technology and equipment eventually needs in its application and use, financial resources. Malla Reddy points out how the funds from the Mahatma Gandhi National Rural Employment Guarantee programme could be used for the strategies advocated by him. The *raison detre* for this lies in the socio-economic truth of the dynamics of dry land and drought-prone agriculture. He furnishes a wealth of data to question that in an atmosphere where just one or two crops are the reality in a cycle of 14- 15 years, what is the difference between a small, marginal, medium or even a large farmer on the one hand and plain landless agricultural labourer on the other? I cannot agree more because that truth was what I also had seen personally in Anantapur district and

understood when, as mentioned earlier,I had investigated the deaths by suicide of farmers of Andhra Pradesh on behalf of the NHRC in 2002. In my report to the NHRC, I had anticipated Malla Reddy, when I wrote:

"I feel convinced that the Andhra Pradesh Government's failure to go to the rescue of the families of the suicide victims by way of initiating comprehensive relief measures to rehabilitate them agriculturally, educationally, economically and otherwise by all possible means including by creating and extending education, employment, credit and social security measures based on the particular need of each family has the definite potential of being classified as negligence leading to violation of human rights from now onwards. Continued inaction could attract Section 12(a) of the Protection Human Rights Act 1993."

If I apply the same principles in the light of the current facts given in Dr.Malla Reddy's book, then the Government of Andhra Pradesh has to be held responsible today in the year 2017 for continuing negligence under Section 12(a) of the Protection Human Rights Act 1993, as was the case in 2002 and held guilty of violation of the human rights of farmers of Anantapur district. The question to decide would be: how do we quantify the punishment that should be meted out to the State when the State, mandated to protect and promote the human rights of the citizens, promotes its destruction? The time to decide this question has arisen currently. Human Rights activists, jurists, intellectuals and social scientists should deliberate this question and find an answer, - an answer for the future of human rights in India.

Given all these facts, the warning of the author that continuing negligence of the people's sufferings in the drought prone areas of RayalaSeema and North Andhra could lead to a situation for the demand of a separate dispensation for these two areas as happened in the case of Telangana cannot be taken lightly. Political decision makers will do well to heed this warning, and avoid the mistakes of the past by redressing the grievances referred to in this book in the interest of maintaining the integrity of the present state of Andhra Pradesh. As a first step in this direction the State of Andhra Pradesh should accept the strong plea made by Malla Reddy to set up a State Level Commission of impartial experts in all subjects of importance to the comprehensive, scientific development of the Rayalaseema and North Andhra regions to deliberate on what needs to be done and make recommendations towards them based on their existential predicaments caused by nature's deficits and human negligence. The State Level Commission's work should culminate in concrete recommendations to bridge these deficits in terms, *inter alia*, of need for water,

industrialisation, employment, education and health. The Commission's work should be initiated forthwith and concluded within a time frame of 6 to 12 months, though obviously measures of implementation would have a longer timeframe but should be strictly monitored for time schedules and outcomes.

The message that comes out loud and clear from this book is that factional and dysfunctional party partisan politics should give way to sobriety and sanity and, what is more, all sections of the society, - political parties, intellectuals, academics, activists, experts and subject matter specialists, should come together with a frame of mind that places the interests of the nation and the common citizen above selfish and self-serving, parochial concerns leading to a unity of purpose and action that would help find solutions to life-threatening and nation-threatening issues such as river waters, undemocratic practices and venal politics dominated by corruption. For example, river waters including within states must be constitutionally mandated as the national wealth of India and placed firmly in the Constitution's Union List so that populist politics that pander to regional chauvinism get a short shrift. Rule of Law,as against the rule of regional politics, should reign supreme with justice and lawas laid down by the Supreme Court of India should be implicitly accepted as the law of the land. That is what Constitutional and federal form of governance is about, as given to us by BabasahebAmbedkar. The crass political culture that makes electoral success in the political arena as a touchstone against verdicts of the Supreme Court of India, - the self-serving corrupt political doctrine of approvals in the "people's court"let loose by all parties and subtly taken advantage of by corrupt corporate houses making the stock exchange index movements the arbiter of their malpractices, should be put an end to by alert public opinion.Marauding crowds on beaches cannot be allowed to frighten the Supreme Court of India, with the Central and State governments conveniently looking the other way. The dubious role that the national and state level political leaders have consistently played in transferring all responsibility to the High Courts and the Supreme Court whenever hard political decisions were needed to be taken and then conveniently complaining of "judicial over reach" when their corruption was exposed by courts needs to be brought to a halt by enlightened public opinion. There is no such thing as complete perfection in human affairs and that applies to the Supreme Court also as to neutral umpires in international cricket. Subject to all available judicial reviews, the nation should understand the Constitutional scheme in a manner that upholds the supremacy of our superior courts as the interpreters and upholders of the Constitution of India. This is the spirit in which Malla Reddy calls for honest political will and courageous public vigilance in this book.

To conclude, Malla Reddy's message in this book is that any paradigm of development should be inclusive. It cannot be built on the belief that it can bedivorced from moral and ethical values or from hard evidence-based technological approaches and scientific applications of lessons learned and tested out over a period of time; and it has to be informed by the urgency of compassion through the exercise of honest political will, strengthened by public vigilance of people's rights.

The discerning reader would find the validity of this conviction and passion in the pages that follow. This message echoes the imperative that Dr.Ambedkar had mandated for the success of our Constitution a day preceding its adoption by the Constituent Assembly in November 1949:

"However good a Constitution may be it is sure to turn out bad because those who are called upon to work it happen to be a bad lot. However bad a Constitution may be, it may turn out to be good if those who are called to work it happen to be a good lot. The working of a Constitution does not depend wholly upon the nature of the Constitution."

Time to remind ourselves of this, however late. After all, better late than never.

**- K.R.VENUGOPAL** IAS (Retd)
FORMERLY SECRETARY TO THE PRIME MINISTER;
SPECIAL RAPPORTEUR, NATIONAL HUMAN RIGHTS COMMISSION (NHRC).
18.02.2017
HYDERABAD

# ముందు మాట

అందరి ప్రశంసలూ అందుకున్న ఒక కార్యకర్తగా, ఒక సన్నిహితమిత్రుడిగా, కొన్ని సందర్భాలలో సహకార్యకర్తగా డా. మల్లారెడ్డితో నాకు దాదాపు పాతికేళ్ళ పరిచయం. 1994 ప్రధానమంత్రి కార్యాలయం ఉపాధి హామీ పథకాన్ని (ఈఏఎస్) రూపొందించి అనంతపురంలో దాని అమలు ప్రారంభించిన వెంటనే ఆయనను కలుసుకునే అవకాశం నాకు లభించింది. జాతీయస్థాయి గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ పథకం ఒక ఆరోగ్యకరమైన ఒరవడి. ఆ తర్వాత, స్వయం సహాయక బృందాల ద్వారా పేదల సామాజిక సమీకరణపై ఆధారపడిన దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆయనతో చర్చలు జరపడానికి 1995లో మరోసారి అనంతపురం వెళ్ళాను. దారిద్ర్య నిర్మూలననకు ఉద్దేశించి సార్క్ దేశ్యాలు ఏర్పాటుచేసిన స్వతంత్ర దక్షిణాసియా కమిషన్ తన నివేదిక (Meeting the Challenge ) లో ముందుకు తెచ్చిన ఆలోచన అది. 1993 ఢాకా సార్క్ సమ్మేళనం దానిని ఏకగ్రీవంగా ఆమోదించింది. కమిషన్ సభ్యుడిగా అనంతపురం, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలు మూడు భాగమయ్యే ఒక విస్తృత ప్రాంతంలో ఈ నివేదికలోని వ్యూహాలను ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్న నా ప్రతిపాదనను అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు ఆమోదించిన మీదట నేను అనంతపురం వెళ్ళాను.

ఆ తర్వాత 2002 లో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్. హెచ్. ఆర్.సి.) తరపున ప్రత్యేక ప్రతినిధి ( Special Rapporteur ) గా అనంతపురం జిల్లాను సందర్శించాను. ఎన్.హెచ్.ఆర్.సి. కేసు నెం. 441/1/2001-2002 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో రైతుల ఆత్మహత్యలపై దర్యాప్తు జరిపాను. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబ సభ్యులను ఆ సందర్భంలో కలుసుకున్నాను. ఆ తర్వాత 2004 లో ప్రముఖ ఆర్థికవేత్త జయతీఘోష్ అధ్యక్షురాలిగా ఉన్న రైతు సంక్షేమ కమిషన్ లో సభ్యుడిగా డా. మల్లారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడుగా నేను కలిసి చిరస్మరుణీయమైన పనిచేసే అవకాశం లభించింది. డా. మల్లారెడ్డితో కలిసి నేను చేసిన అన్నింటికంటే పెద్ద పని. 2008-2009లో ఢిల్లీలోని సాంఘిక అభివృద్ధి మండలి తరపున నా నాయకత్వంలో, సమన్వయంలో ఐ.సి.డి.ఎస్. కార్యక్రమంపై జరిపిన సోషియల్ ఆడిట్. ఇందులో డా. మల్లారెడ్డి ఎప్పటికీ మరచిపోలేని అద్భుతపాత్ర నిర్వహించారు. ఈ ప్రయత్నంలో కదిరిలోని ఆర్.ఇ.డి.ఎస్.కు చెందిన మరో ఎన్.జీ.ఓ. నాయకురాలు. అంతే అద్భుతవ్యక్తి అయిన సి.భానుజతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. డా. మల్లారెడ్డి సంస్థాగత నిర్మాణంలో అగ్రగామి అయిన కె. ఎస్. గోపాల్ డైరెక్టర్‌గా ఉన్న హైదరాబాద్‌లోని సెంటర్‌ఫర్ ఎన్విరాన్మెంట్ ఈ ప్రయత్నానికి మార్గదర్శనం చేసిన ఎన్,జీ.ఓ.

ఈ అన్ని సందర్భాలలో ఒక ఆలోచనాశీలిగా, సామాజిక సమీకర్తగా, ఒక నాయకుడిగా డా. మల్లారెడ్డిని అతి దగ్గరగా చూశాను. కనుక ‘అనంతప్రస్థానం ’ అనే ఈ పుస్తకానికి ముందుమాట

రాయమని నన్ను కోరడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాగురించి, ఒక బిడ్డకు తల్లి తెలిసినంత సన్నిహితంగా తెలిసిన ఒక రచయిత, ఎంతో దక్షతతో రచించిన గ్రంథమిది. ఇది వాస్తవానికి అనంతపురం జిల్లా జీవితచరిత్ర. ఒక ప్రక్రియగా జీవితచరిత్రలకు గల విలువ ఎలాంటిదో రెండువేల సంవత్సరాల క్రితమే ఫ్లూటార్క్ నిర్ధారించాడు. మనం విద్యార్థులుగా ఉన్నప్పుడు ఎత్తులకు ఎదగడానికి అవి స్ఫూర్తినిస్తాయి. జీవిత చరిత్రలు జీవితాలు, చరిత్రలూ కూడా తరచు అవి ఆ జీవితాల తాలూకు వ్యక్తిత్వాల గురించి చెబుతాయి. అనంతపురంపై రాసిన ఈ పుస్తకం దాని సమకాలీన జీవితం. ఇక్కడి ప్రజల గురించిన కథనం. సుదీర్ఘకాలంగా తనను వెన్నంటి వస్తున్న సానుకూలతలు, సామర్థ్యాల వెలుగులో దాని జీవితం ఎలా ఉంటూ వచ్చిందన్న అర్థంలో దాని చరిత్ర. దాని సమకాలీన దుస్థితినీ, చారిత్రకంగా దాని వాతావరణాన్ని, ఈ రోజున ప్రజలపై దాని పర్యవసానాలనూ చెబుతుంది. రచయిత అచంచలమైన ప్రేమతో చిత్రించిన జీవితం అది. అయితే ఆ జీవితం దాదాపు ఏ ప్రాంతంలోనూ చూడనన్ని కష్టాలను, కడగండ్లను చూసి, చూస్తున్న జీవితం కూడా. అదే సమయంలో, అలాంటి అన్ని జీవితాలలోలానే మానవహృదయంలోని నిరంతర ఆశాభావన ఇక్కడి జీవితాలలోనూ, వాటి చిత్రణలోనూ ఉప్పొంగుతూ ఉంటుంది.

అనంతపురం జిల్లాను ఆవరించిన వర్తమాన విషాదాలనూ, కష్టాలనూ ఈ పుస్తకంలో దండగుచ్చడమే కాదు. దీర్ఘకాలంగా అంతులేని కడగండ్లు పడుతున్న ప్రేమాస్పదులైన ఇక్కడ జనంలో ఒకరుగా ఈ రచయితకు, ఈ జిల్లా ముందుకు తెచ్చే ప్రశ్నలకు సమాధానం తెలుసు. వాటిని నిక్కచ్చిగా ప్రజాక్షేత్రంలోకి తీసుకురావడానికి ఆయన ఎంత మాత్రం వెనుకాడరు. ఎందుకంటే, వాటికి సంబంధించి ఆయనకు సంపూర్ణ పరిజ్ఞానం ఉంది. సాక్ష్యాధారాలు ఉన్నాయి. తన జనం మధ్య, ఈ నేల మీద పనిచేస్తూ తన పాదాలకూ, చేతులకూ మట్టి అర్హతకూ కారణం; అనంతపురం జిల్లాతో ఇక్కడి జనంతో విడదీయలేని భాగంగా కలిసిపోయి వాటి ఆత్మతో ఉభయులూ మమేకమైపోవడమే. అలాగని ఇది కేవలం అనంతపురం జిల్లా కథ మాత్రమే కాదు. భారతదేశ వ్యాప్తంగా 600కు పైగా ఉన్న దుర్భిక్ష పీడిత మండలాల కథ కూడా. అనంతపురం జిల్లాలానే వీటిలో కొన్ని ఎడారిగా మారే దిశగా పయనిస్తున్నాయి. వీటిలో అన్ని మానవ అభివృద్ధి సూచికలూ పరమ ఘోరంగా ఉన్నాయి. కనుక ఈ పుస్తకంలోని విషయం ఈ దేశ జనాభాలోని ఒక పెద్ద భాగానికి, వారి వ్యవసాయానికి, జీవనోపాధులకు; మంచినీరు, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక మానవావసరాలకు, మొత్తంగా వారి జీవించే హక్కుకు సంబంధించినదువతోంది. ఈ విధంగా మల్లారెడ్డి మనం ఎంతో ఘనంగా ఉగ్గడించే ఈ దేశ ప్రజాస్వామిక జీవన విధానంపై చూసే ప్రతికూల పర్యవసానాలతో సహా దీనిని ఒక రాజ్యాంగ ప్రశ్నగా ఎత్తి చూపుతూ, ప్రజాస్వామ్యంపై మన నమ్మకాన్నే ఎంతో ఆవేదనతో, సాక్ష్యాధారసహితంగా ప్రశ్నించడం ఎంతైనా సముచితం.

ఈ పుస్తకం ప్రాసంగికత అనేక సత్యాలలో వేళ్లానుకుని ఉంది. రైతులు వారి సంతానం రూపంలో సంభవిస్తున్న విలువైన ప్రాణనష్టం గురించిన సత్యం వాటిలో ఒకటి. ఇది నష్టం కాదు, ఆత్మహత్య అనే మాటతో పలచన చేస్తున్న స్వచ్ఛంధ ప్రాణత్యాగం, ఇందుకు కారణం, ప్రకృతి ఒక్కోసారి కలసిరాకపోవడం ఒక్కటే కాదు. ఇక్కడి మనిషి జీవితానికి సంబంధించిన ప్రతి ఒక్క అవసరంపై రాజ్యం ప్రదర్శించే తీవ్ర నిర్లక్ష్యపూరిత ఉదాసీనత, అనంతపురం జిల్లాలోనే కాక, రాయలసీమలో, మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్న ప్రాంతీయ అసమానతల వల్ల తలెత్తిన పరిస్థితులను చక్కదిద్దే విషయంలో రాజ్యంలో గూడుకట్టుకున్న నిష్క్రియత్వం, చలనరాహిత్యం. జనం ఉపాధి కోసం దైనందిన ప్రాతిపదికన దూరదూర నగరాలకు వలసపోవడం వల్ల సంభవించే అమానవీయ

పర్యవసానాలు మనిషి జీవితానికి, ప్రత్యేకించి మహిళలకు ఎంతో కీలకమైన గౌరవప్రద జీవన హక్కునే గల్లంతు చేస్తున్నాయి. ఈ వలసలు వృద్ధులను, ఇతర విధాలైన దుర్బలులను ఎలాంటి రక్షణా లేని పరిస్థితికి విడిచిపెడుతున్నాయి. ఇక చిన్న పిల్లల సంగతి చెప్పనే అవసరం లేదు. తల్లిదండ్రుల వలసలు వీరి చదువుకునే హక్కును హరిస్తున్నాయి. ఈ దేశపు రైతుకు పుట్టుకతోనే సంక్రమించి అతని మరణం వరకూ, లేదా ఆత్మహత్య వరకు వెన్నంటి వచ్చే రుణగ్రస్తతపట్ల భారతరాజ్యం ప్రదర్శించే అలవిమాలిన ఉదాసీనత మరొక సత్యం. త్వరితగతిన క్షీణించిపోతున్న ఆరోగ్యం, విద్య ఈ అస్తిత్వ పరిస్థితిని మరింత విషమింపజేస్తున్నాయి. రోగగ్రస్తులకు వైద్యసాయం అందించడం పిల్లలకు విద్య గరపడం వంటి అనూచానంగా వస్తున్న ఉత్తమాదర్శాలను విపరీతమైన ధనాశ, పచ్చి వ్యాపారధోరణులు కబళించివేస్తుంటే, రాజ్యం ఆర్థిక సంస్కరణల పేరిట దానిని కళ్ళప్పగించి చూస్తోంది. ప్రారంభంలోనే బాధితుల పక్షాన నిలబడి ఇలాంటి ధోరణులను నివారించడం, ఆ తర్వాతనైనా వారిపై సానుభూతి వహిస్తూ తగిన విశ్వసనీయ చర్య తీసుకోవడం, ఇలా రెండిటా రాజ్యం విఫలమైంది. ఈ అన్ని అంశాలను మల్లారెడ్డి ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచారు. వాటికి మద్దతుగా, తాజా పరిణామాలకు చెందిన అనుభవాలు, అధ్యయనాలతో మరింత పదును తేరిన తన చిరకాల క్షేత్రస్థాయి పరిశీలనాంశాలతో సహా అవసరమైన సమాచారాన్ని, ఇతర వివరాలను సమకూర్చారు.

ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయి. ఎందుకు పునరావృతమౌతున్నాయి? ఈ ప్రశ్నలు మల్లారెడ్డిని నేరుగా పరిపాలనా రంగంలోకి తీసుకొస్తున్నాయి. రాజకీయాలకు, అవినీతికి సంబంధించిన బహిరంగ రహస్యాలకు పూర్తిగా ఒక అధ్యాయాన్ని కేటాయించడం ద్వారా ఆయన ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అవినీతి విషయంలో ఏ రాజకీయపక్షమూ మినహాయింపు కాదన్న మనందరికీ తెలిసిన సత్యాన్నే ఆయన కూడా నిర్ధారిస్తారు. అవినీతి అనేది అనేక రంగులు ధరిస్తుంది. అవినీతికి అవకాశం ఉండడం వల్ల పాక్షిక రాజకీయ వైఖరులు మంచి లాభాలను తెచ్చిపెడతాయి. పెద్ద ఎత్తున కేంద్రీకృతం కాగల అభివృద్ధి నమూనాలు లేదా అవినీతికి అనుకూలించేలా రూపకల్పన చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి. రాజకీయనాయకులు ఎక్కువ మక్కువ చూసే ఆర్థిక నమూనా ఏదంటే, నగరాలకు చెందిన అభివృద్ధి నమూనా. అంటే సహజంగా సంభవించే నమూనా కాక, అసలు గ్రామీణప్రాంతాలను పట్టించుకోనవసరమే లేదన్నట్టుగా, కృత్రిమంగా పైకి తెచ్చే నమూనా అన్న మాట. అలాగే, గ్రామాలకు దుర్భర దారిద్ర్యాన్ని, ప్రత్యేకించి ఆత్మహత్యల రూపంలో మరణాలను తెచ్చి పెట్టే ఈ రకమైన నమూనా అమలులో గతానుభవాలనే కాదు, మరీ ఇటీవల అనుభవాలను కూడా పట్టించుకునే దిక్కులేదు. అధికారంలో ఉన్న పార్టీలే కాదు సరికదా, ప్రతిపక్షాలు కూడా అటువైపు దృష్టి మళ్ళించడం లేదు. ఫ్రెంచ్ రాజకీయనేత, దౌత్యవేత్త టల్లీరో (Talleyrand-1754–1838 ) బోర్బన్ల (Bourbons) ల గురించి అన్నట్టుగా "వాళ్ళు నేర్చుకున్నదీ లేదు, మరిచిపోయిందీ లేదు" . భారత ప్రజాస్వామ్యంలోని రాజకీయప్రాధాన్యాలపరంగా రైతుల పట్ల లేదా గ్రామీణ పేదల జీవనోపాదులపట్ల మొత్తం మీద చూపుతున్న నిబద్ధత ఎలాంటిదో చూసినప్పుడు, టల్లీరో అన్న పై మాటలు ఎంతైనా అర్థవంతమనిపిస్తాయి. నేడు వ్యవసస్థీకృతమైన ఇలాంటి రాజకీయాలు ప్రజాస్వామ్యం గురించిన మౌలిక భావనకే మచ్చ తెస్తున్నాయనీ, వాస్తవంగా అవి రాజకీయవ్యవస్థలను, పరిపాలనా పరమైన నిర్మాణాలను ధ్వంసం చేశాయనీ మల్లారెడ్డి చేసిన నిర్ధారణ ఎంతైనా సమంజసం, రాజకీయ అవినీతి; నిర్ణయాలు తీసుకోవడంలో నిజాయితీని బలిపెట్టి ఉన్నతస్థాయిలోని సివిల్ సర్వెంట్లతో సహా నియామకాలు, బదిలీలు జరపడం వంటి దైనందిన పరిపాలనలో రాజకీయ జోక్యం రూపంలో ఈ వ్యవస్థాగత విధ్వంసం సంభవిస్తోంది. ఈ రాజకీయ అనైతిక ధోరణులకు, ప్రజలకు న్యాయం

చేకూర్చకపోవడానికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని పౌరుల ఈతిబాధలకు నివారణ కల్పించకపోవడానికీ అధికారుల కుమ్మక్కు తోడవుతోంది. ఇలాంటి వాతావరణంలో, ప్రజాస్వామ్య పాలనకు చెందిన అన్ని కొలమానాలూ తలకిందులవుతున్నాయి. రైతులకు చెందిన మావన హక్కులను అనేక విధాలుగా ఉల్లంఘించడం వీటిలో మరీ కొట్టొచ్చినట్టు కనిపించే వాస్తవం.

ఎన్నో అంశాలు పొందుపరచిన ఈ పుస్తకానికి, వర్షాభావ ప్రాంతాలలోని వ్యవసాయానికీ, సేద్యపునీటి నిర్వహణకూ సంబంధించిన ఒక "మాన్యువల్" స్వభావం సిద్ధించింది. కాకపోతే ఈ మాన్యువల్ గొప్పగా చదివించే లక్షణాన్నీ సంతరించుకుంది. క్షేత్రస్థాయికి చెందిన చక్కని చిట్కాలు, తరచు అడిగే ప్రశ్నలకు సమాధానాలు అందించిన ఈ పుస్తకం ఈ ప్రాంతం వారకి మరింత ఉపయుక్తం. ఈ విషయాలలో ఆసక్తి, అభ్యాసం ఉన్నవారు ఈ పుస్తకంలో ఇట్టే లీనమైపోతారు. నీరు మానవాళికి ఎంత విలువైన సంపదో; అనంతపురం జిల్లాతోపాటు, దేశవ్యాప్తంగా ఉన్న దుర్భిక్ష పీడిత మెట్ట వ్యవసాయ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సవాళ్ళకు, సమీకృత సాగునీటి విధానం ( Conjunctive irrigation ) ఎలా సమాధానమో వివరించే అధ్యాయం ఒక ఉదాహరణ. ఈ విధానం కింద, బిందు సేద్యం లేదా తుంపర సేద్యం వంటి తగిన సాంకేతిక పద్ధతుల ద్వారా; నాట్లు వేయడానికి నీటి వాడకానికి తగిన విధంగా రూపొందించిన పరికరాల ద్వారా; సాధారణ దిగుబడిని సాధించడానికే కాక అదనపు దిగుబడిని సాధించడానికి ఉద్దేశించిన రక్షణాత్మక లేదా అదనపు సేద్య అవసరాలకు తోడ్పడేందుకు వర్షపు నీరు, భూగర్భ జలాలు, స్థానిక ఉపరితల జలాలు, నదీ జలాలనే నాలుగు జలవనరులను ఒక వాటర్ గ్రిడ్ ద్వారా ఎలా వినియోగించాలో, ప్రతి చిన్న వివరంతో సహా, తేలికగా అర్థమయ్యేలా ఈ పుస్తకం వివరిస్తుంది. రచయిత అనుభవం నుంచి, పరిశీలననుంచి స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో జరిపిన పరీక్షలు, ప్రయోగాల నుంచి సిద్ధించిన స్వతంత్ర ఆలోచనే ఈ వివరణ మొత్తానికి పునాది.

ఏ సాంకేతికతనైనా, ఏ సాధనాన్ని అయినా వినియోగించాలంటే ఆర్థిక వనరులు అవసరమౌతాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను తాను ముందుకు తెచ్చిన వ్యూహాలకు ఎలా వినియోగించవచ్చునో మల్లారెడ్డి విశదీకరించారు. మెట్ట భూములకు, దుర్భిక్షప్రాంత వ్యవసాయ స్థితిగతులకు చెందిన సాంఘిక, ఆర్థిక వాస్తవాలే ఇందుకు కారణం. 14-15 ఏళ్ల చక్రంలో ఒకటి, రెండు పంటలను మాత్రమే చూడగలిగిన పరిస్థితులలో ఒకవైపు చిన్న, సన్నకారు, మధ్యతరహా, పెద్దరైతు; మరోవైపు భూమిలేని వ్యవసాయ కార్మికుడు అనే తేడాలను తీసుకురావడం ఏ విధంగా అర్థవంతమన్న ప్రశ్నను నొక్కి చెప్పడానికి రచయిత ఈ పుస్తకంలో కావలసినంత సమాచారాన్ని అందించారు. ఆయనతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఎందుకంటే, ఇంతకుముందు చెప్పినట్టు 2002లో ఎన్.హెచ్.ఆర్.సి. తరపున ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలపై దర్యాప్తు జరిపిన సందర్భంలో అనంతపురం జిల్లాలో ఈ వాస్తవాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఎన్.హెచ్.ఆర్.సి. కి ఇచ్చిన నా నివేదికలో మల్లారెడ్డి అభిప్రాయాన్ని అప్పుడే ప్రతిబింబిస్తూ ఇలా రాశాను.

"ఆత్మహత్య చేసుకున్న బాధితుల కుటుంబాలకు వ్యవసాయపరంగా, విద్యపరంగా, ఆర్థికంగా పునరావాసం కల్పించడానికి అవసరమైన సమగ్ర సహాయచర్యలను ప్రారంభించడంలో; ప్రతి కుటుంబానికి, వారి వారి ప్రత్యేక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్య, ఉద్యోగం, రుణసదుపాయాలను కల్పించడం, సాంఘిక భద్రతా చర్యలు తీసుకోవడంతో సహా సాధ్యమైన ఇతర అన్ని మార్గాలలో ఆదుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఫల్యం ఇక మీదట మానవహక్కుల ఉల్లంఘనకు దారి తీయగల నిర్లక్ష్యంగా వర్గీకరించడానికి ఎంతైనా తగినదని నేను నిర్ధారణకు వచ్చాను. ఏ చర్యా తీసుకోని ఈ పరిస్థితి ఇలాగే కొనసాగడం మానవహక్కుల పరిరక్షణ చట్టం-1993లోని సెక్షన్ 12(ఎ) కింద చర్యకు అర్హం కాగలదు."

డా. మల్లారెడ్డి ఈ పుస్తకంలో పొందుపరచిన వర్తమాన వాస్తవాల వెలుగులో ఇవే సూత్రాలను కనుక నేను వర్తింపజేస్తే, 2002 కు సంబంధించిన కేసులో లానే, నేటి ఈ 2017లో కూడా కొనసాగుతున్న ఈ నిర్లక్ష్యానికి మానవహక్కుల చట్టం-1993లోని సెక్షన్ 12( ఎ) కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని బాధ్యురాలిని చేసి, అనంతపురం జిల్లాలో రైతుల మానవహక్కులను ఉల్లంఘించిన దోషిగా భావించవలసి ఉంటుంది. ఇక్కడ ఎదురౌతున్న ప్రశ్నల్లా, పౌరుల మానవహక్కులను పరిరక్షించి పెంపొందిచవలసిన రాజ్యమే వాటి విధ్వంసాన్ని ప్రోత్సహిస్తున్నప్పుడు మనం ఏవిధంగా శిక్ష విధించాలన్నది. ఈ ప్రశ్నపై నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చింది. మానవహక్కుల కార్యకర్తలు, న్యాయనిపుణులు, మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు ఈ ప్రశ్నపై ఆలోచన చేసి సమాధానం కనుక్కోవడం అవసరం. భారతదేశంలో మానవహక్కుల భవిష్యత్తుకు కూడా అది సమాధానం అవుతుంది.

ఈ వాస్తవాలన్నింటినే కాదు; రాయలసీమ, ఉత్తరాంధ్రలలోని దుర్భిక్షప్రాంతాల ప్రజల కడగండ్ల పట్ల కొనసాగుతున్న ఈ నిర్లక్ష్యం, తెలంగాణలా ఈరెండు ప్రాంతాలవారూ తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసే పరిస్థితికి దారితీయగలదని ఈ రచయిత చేసిన హెచ్చరికనూ తేలికగా తీసుకోలేం. రాజకీయ విధాన నిర్ణేతలు ఈ హెచ్చరికను గమనంలోకి తీసుకోవడం ఎంతైనా అవసరం. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రతను కాపాడడం కోసం, వెనకటి తప్పులు మళ్ళీ జరగకుండా ఈ పుస్తకం ఎత్తి చూపిన ప్రజల కడగండ్ల నివారణకు సంబంధించిన అన్ని ముఖ్యమైన అంశాలనూ పరిశీలించిడం కోసం నిష్పాక్షిక నిపుణులతో కూడిన ఒక రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఏర్పాటుచేయాలని మల్లారెడ్డి ఎంతో బలంగా చేసిన విజ్ఞప్తి అన్ని విధాలా ఆమోదయోగ్యం. ప్రకృతి వైఫల్యాలూ, మనిషి నిర్లక్ష్యమూ కలసి ఈ ప్రాంతాలకు తెచ్చి పెట్టిన ప్రస్తుత దరువస్థలను పరిశీలించి పరిష్కారాలను సిఫార్సు చేసే బాధ్యతను ఈ కమిషన్ కు అప్పగించాలి. నీరు, పారిశ్రామికీకరణ, ఉద్యోగ కల్పన, విద్య, ఆరోగ్యం మొదలైన అంశాలలో ఈ ప్రాంతాలు ఎదుర్కొంటున్న కొరతలను పూరించడానికి ఈ కమిషన్ కచ్చితమైన సిఫార్సులను చేయవలసి ఉంటుంది. వెంటనే కమిషన్ సిఫార్సుల అమలు ఎక్కువ సమయం తీసుకునే మాట నిజమే కానీ, నిర్ణీత సమయానికి అన్నీ జరుగుతున్నాయా లేదా, అమలు ఫలితాలు ఎలా ఉన్నాయన్నది ఎప్పటకప్పుడు గట్టిగా పర్యవేక్షిస్తూ ఉండాలి.

ముఠాతత్వం, నిష్క్రియత్వం నిండిన నేటి రాజకీయాలు; సంయమనానికీ, వివేకానికీ చోటు ఇస్తూ మెరుగుపడాలన్నది ఈపుస్తకం ఎలుగెత్తి అతి స్పష్టంగా అందిస్తున్న సందేశం. రాజకీయపార్టీలు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, నిపుణులు, ఆయా అంశాలలో ప్రత్యేక పరిజ్ఞానం ఉన్నవారు సహా అందరూ స్వప్రయోజనాలకూ, పాక్షిక చింతనలకూ అతీతమైన బుద్ధితో, కేవలం దేశ ప్రయోజనాలను, సామాన్య పౌరుల అవసరాలను మాత్రమే దృష్టిలో ఉంచుకుంటూ ఏకం కావాలసి ఉంది. ప్రజల జీవితానికీ, దేశానికీ కూడా ముప్పుగా మారిన నదీజలాల వివాదాలు, అప్రజాస్వామిక ధోరణులు, అవినీతి పెత్తనం చేస్తున్న భ్రష్ట రాజకీయాల వంటి సమస్యలకు పరిష్కారం కనుగొనడం, అందుకు కార్యాచరణ అన్నవి మాత్రమే లక్ష్యంగా వారు వ్యవహరించాలి.

ఉదాహరణకు, నదీ జలాలను భారతదేశ జాతీయ సంపదగా రాజ్యాంగబద్ధంగా ప్రకటిస్తూ వాటిని రాజ్యాంగంలోని యూనియన్ జాబితాలో చేర్చాలి. తద్వారా ప్రాంతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే జనాకర్షక రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుంది. ప్రాంతీయ రాజకీయాలు చెప్పిందే వేదంగా చలామణి అయ్యే బదులు చట్టబద్ధపాలన అనేది సర్వోన్నతం కావాలి. సుప్రీం కోర్టు నిర్దేశించిన న్యాయాన్నీ, పరిగణలోకి తీసుకున్న చట్టాలను మాత్రమే న్యాయంగా, చట్టంగా ఆమోదించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగబద్ధ, ఫెడరల్ స్వభావం కలిగిన పాలనకు అర్థం అదే. జాగృత

ప్రజాభిప్రాయం-భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులను కాక, రాజకీయక్షేత్రంలో ఎన్నికల విజయాన్ని మాత్రమే గీటురాయిగా తీసుకునే దుష్ట రాజకీయ సంస్కృతిని; "ప్రజా న్యాయస్థానం" ఆమోదాలే తమకు ముఖ్యమంటూ అన్ని రాజకీయపక్షాలూ గొప్పగా చెప్పుకునే స్వార్థ, అవినీతి పూరిత రాజకీయసిద్ధాంతాన్ని, దీని అవకాశంగా తీసుకుని అవినీతిభూయిష్ఠ కార్పొరేట్ సంస్థలు తమ తప్పుడు పనులను స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచి వెనుక కప్పిపుచ్చుకునే ధోరణిని అంతమొందించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమవైపు చూడనైనా చూడకుండా మొహం పక్కకు తిప్పుకుంటున్న దశలో స్వైరవిహారం సాగిస్తున్న దోపిడీ శక్తులు సుప్రీం కోర్టును కూడా భయపెట్టే పరిస్థితిని అనుమతించకూడదు. కఠిన రాజకీయ నిర్ణయాలు, తీసుకోవలసివచ్చిన ప్రతిసారీ తమ బాధ్యతను హైకోర్టుకో , సుప్రీం కోర్టుకో బదిలీ చేయడం; ఆ తర్వాత న్యాయస్థానాలు తమ అవినీతిని బట్టబయలు చేసినప్పుడు "న్యాయస్థానాలు తమ పరిధి మీరి వ్యవహరిస్తున్నా" యంటూ ఆడిపోసుకోవడం రూపంలో కేంద్ర రాష్ట్రస్థాయి నాయకులు ఆడుతున్న మోసపూరిత నాటకానికి చైతన్యవంతమైన ప్రజాభిప్రాయం తెరదించాలి.

అచ్చుగుద్దినట్టు పరిపూర్ణత అనేది ఎందులోనూ ఉండదు. అంతర్జాతీయ క్రికెట్‌లో తటస్థ అంపైర్లకు వర్తించినట్టే ఈ సూత్రం సుప్రీంకోర్టుకూ వర్తిస్తుంది. భారత రాజ్యాంగ ప్రతిపత్తిని నిలబెట్టేవిగా, రాజ్యాంగ విధివిధానాల అన్వయకర్తలుగా ఉన్నత న్యాయస్థానాల ఆధిక్యతను గుర్తించగల విధంగా అందుబాటులో ఉన్న న్యాయసమీక్షల దృష్ట్యా దేశం రాజ్యాంగ పథకాన్ని అవగాహన చేసుకోవాలి. ఈ స్ఫూర్తితోనే చిత్తశుద్ధి కలిగిన రాజకీయ సంకల్పం, ధైర్యవంతమైన ప్రజల నిఘా ఎంత అవసరమో మల్లారెడ్డి ఈ పుస్తకంలో నొక్కి చెబుతున్నారు. చివరిగా చెప్పాలంటే, ఎలాంటి అభివృద్ధి అయినా అందరినీ తనలోకి తీసుకునేలా ఉండాలన్నది మల్లారెడ్డి ఈ పుస్తకం ద్వారా ఇస్తున్న సందేశం, అభివృద్ధి అనేది నైతిక విలువల సమాధి మీద నిర్మించేది కాకూడదు; మనం ఇంతవరకూ నేర్చుకున్న, కాలపరీక్షకు నిలిచిన సాంకేతిక వైఖరులు, శాస్త్రీయమైన వర్తింపులకు సంబంధించిన పాఠాలకు తిలోదనాలు ఇచ్చేది కాకూడదు. ప్రజల హక్కు పట్ల పూర్తి నిఘాతో పరిపుష్టమైన చిత్తశుద్ధి కలిగిన రాజకీయ సంకల్పం, జనజీవితంపై సంపూర్ణ సానుభూతి పూర్వక అవగాహనతో అమలు చేయవలసినది.

విజ్ఞులైన పాఠకులు ఈ రకమైన చిత్తశుద్ధిని, తపనను ఈ పుస్తకంలోని ప్రతి పుటలోనూ దర్శిస్తారు. 1949 నవంబర్‌లో రాజ్యాంగ శాసనసభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించే ముందు ఒక రాజ్యాంగం ఎప్పుడు విజయవంతమౌతుందో చెబుతూ డా. అంబేద్కర్ అన్న ఈ కింది వాక్యాల ప్రతిధ్వని ఈ పుస్తక సందేశంలో వినిపిస్తుంది.

"అమలు చేసే వ్యక్తులు అయోగ్యులైనప్పుడు ఎంత మంచి రాజ్యాంగమైనా తప్పనిసరిగా అయోగ్యంగా మారుతుంది. అయితే, అమలు చేసే వ్యక్తులు యోగ్యులైనప్పుడు ఎంత అయోగ్యమైన రాజ్యాంగమైనా యోగ్యంగా మారుతుంది. ఒక రాజ్యాంగం పని తీరు కేవలం ఆ రాజ్యాంగ స్వభావంపైనే ఆధారపడి ఉండదు",

**కె.ఆర్. వేణుగోపాల్ ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)**

ప్రధాన మంత్రి కార్యదర్శి (రిటైర్డు)

ప్రత్యేక ప్రతినిధి,జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్.హెచ్.ఆర్.సి.)

18-02-2017

## కరువును కదిలించే...



డా.వై.వి. మల్లారెడ్డికి రాయలసీమ ప్రాంతంలోని అనంతపురము జిల్లా ఎదుర్కొనే కరువుల గురించి, ఆ కరువులకు గల మూలాల గురించి, కరువు నివారణకై అవసరమైన అనువైన చర్యలపై 40 సంవత్సరాల విస్తారమైన సమగ్రమైన అవగాహన వుంది. స్వతహాగా రైతు కుటుంబం నుంచి వచ్చిన అతనికి ఈ ప్రాంత పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు ఎదుర్కొనే కష్టములపైన అవగాహన, స్పందించే సహజ గుణం ఉంది. అతడు అందరికి అర్థమయ్యే తెలుగులో వ్రాసిన "అనంత ప్రస్థానం" అనంత జిల్లా సామాజిక, ఆర్థిక, భౌగోళిక మరియు రాజకీయ అంశములను సునిశితంగా స్పష్టంగా వివరిస్తూ అనంత సమగ్రాభివృద్ధికి చేసిన సూచనలు వాస్తవానికి అద్దం పట్టేలా వున్నాయి. కరువు నివారణకు శాశ్వత ప్రాతిపదికపై క్రమబద్ధీకరించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు విస్త్ర ృతంగా అవలంబించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు చేయడం, పాడి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం ఇవ్వడం, వైవిధ్య పంటలకు పెద్దపీట వేయడంతో పాటు రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవడం వంటి సూచనలు అభిలషణీయమైనవే గాక అవి ఆచరణాత్మకమైనవి కూడా. సామాజిక స్పృహతో వ్రాసిన ఈ పుస్తకం అందరిలో ఒక మంచి ఆలోచనను ప్రేరేపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. సమిష్టి కృషితోనే అనంతపురము జిల్లాను కరువు రహిత జిల్లాగా... ఒక సస్యశ్యామల ప్రాంతంగా రూపుదిద్ద వచ్చును. ఈ సందర్భంగా శ్రీ మల్లారెడ్డికి హృదయపూర్వక శుభాభివందనాలు నేను తెలియ జేస్తున్నాను.

**- అన్నే ఫెర్రర్**

**ఎక్సిక్యూటివ్ డైరెక్టరు**

**రూరల్ డెవలప్‌మెంటు ట్రస్టు**

**12-04-2017**

**అనంతపురం**

# ముందు మాట

నేను స్వాభావికంగా రచయితను కాదు. అనతపురము జిల్లాలోని భౌతిక పరిస్థితులు, నేను చేస్తున్న ఉద్యోగము నన్ను ప్రేరేపించగా మిత్రుడు ఇమాం ప్రోద్బలం అందుకు తోడై ఈ వ్యాసాలను వ్రాయడం జరిగింది. మన దేశంలో అనంతపురము జిల్లాది ఒక ప్రత్యేకమైన పరిస్థితి, ఇక్కడి భూ, భౌగోళిక, పర్యావరణ, వాతావరణ పరిస్థితులు మన వెనుకుబాటుకు కారణమైతే పాలకుల నిర్లక్ష్యం అగ్గికి ఆజ్యంగా తోడైంది.

70 సంవత్సరాల స్వాతంత్ర్య పరిపాలన వున్నా, అనంతపురము జిల్లా సమగ్రాభివృద్ధికి ఒక నిర్దిష్ట ప్రణాళిక కూడా లేదు. అంటే అభివృద్ధి ఏమి జరగలేదని నా భావం కాదు. జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చాలా వరకు విడివిడిగా, ముక్కలుగా వున్నాయేగానీ, ఒక నిర్దిష్టమైన సమగ్ర ప్రణాళిక వుండి, అందులో భాగాలుగా జరుగలేదు.

ప్రాంతీయ అభివృద్ధికి మూల కారకం నీరు. ప్రపంచంలోని ప్రాచీన నాగరికతలన్నీ నదులతో అనుసంధానమై వృద్ధి చెందినవే. వర్తమాన కాలంలో కూడా నీరు లేకుండా ప్రపంచంలో ఏ ప్రాంతమూ అభివృద్ధి చెందలేదు. నీటిని తరలించడం వల్లే రాజస్థాన్‌లోని కొన్ని ఎడారి ప్రాంతాలను సస్యశ్యామలం చేయడం జరిగింది. మన రాష్ట్రంలో గుంటూరు నుండి తూర్పుగోదావరి వరకు వున్న తీర ప్రాంతం కృష్ణా బారేజీ, గోదావరి బారేజీలను నిర్మాణంతోనే అభివృద్ధి దశ మొదలై మనకంటే దాదాపు నూరు సంవత్సరాల ముందుకెళ్ళిపొయ్యింది. అంతకు ముందు అక్కడి పరిస్థితులు మనకంటే భిన్నంగా లేవని సర్ అర్థర్ కాటన్ మరియు బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను బట్టి తెలుస్తుంది.

మన దేశంలో ఏ ప్రాంతమైనా అభివృద్ధి అయ్యింది అంటే అది వ్యవసాయాభివృద్ధితోనే మొదలైంది. వ్యవసాయాభివృద్ధిని అనుసరిస్తు మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సేవారంగము, విద్య, ఆరోగ్యము, మానవ వనరులు ఒకదానితో ఒకటి కలగలిసి సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. కాబట్టి నీరే అన్ని రకాల అభివృద్ధికి మూలాధారము. కాబట్టి నీటి పంపిణీలో సమతుల్యత పాటించ కుండా ప్రాంతీయ అసమానతలు సమిసిపోవు. ఒకే జిల్లాలో కూడా ప్రాంతీయ అసమానతలు రావడానికి కారణం నీటి పంపిణీ, వ్యవసాయాభివృద్ధి అసమానంగా జరగడమే.

వర్షాధార వ్యవసాయాన్ని కరువుల నుండి రక్షించకుండా మన జిల్లాలోని రైతులను, బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేయలేము. వర్షాధార రైతులు, రైతు కూలీలు, తీవ్రంగా పట్టణాలకు వలసదారి పడుతున్నారు. ఇట్లే ఇంకొక 4 లేక 5 సంవత్సరాలు కొనసాగితే మన జిల్లాలో వర్షాధార రైతులు, కూలీలు ఇతర గ్రామీణ వృత్తుల పై ఆధారపడిన వారు కనుమరుగై పోయే ప్రమాదం వుంది. అదే జరిగితే, అది అత్యంత మానవ విషాద ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానము ఎంతో వృద్ధి చెందిన ఈ కాలంలో విస్తారమైన భూములు జిల్లాలో వుండి వాటిని నిరుపయోగంగా వదిలి పట్టణాలకు విషాద పరిస్థితులలో వలసపోవలసి వస్తుంది. అంటే ఇది చాలా దురదృష్టకరము. మన రాష్ట్రంలో మొత్తంగా ఒక్క ఎకరం భూమి కూడా కరువుకు గురి

కాకుండా రక్షించుకొనేంత నీరు అందుబాటులో వుంది. కానీ అది సాధించాలంటే మన సాంప్రదాయ నీటి పంపిణీ విధానాలు, నీటి వినియోగ విధానాలు, పంటల విధానాలలో సమూలమైన మార్పులు రావలసి వుంది. ఏ ప్రాంతానికి, ఏ వర్గానికి హాని జరుగని విధంగా మన నీటి పంపిణీ విధానాలు, వినియోగ విధానాలు, పంట విధానాలు మార్చు కోవలసి వుంటుంది. అందుకు కావలసిందల్లా రాజనీతిజ్ఞత, రాజకీయ సంకల్పము.

వర్తమాన రాజకీయాలు చూస్తుంటే అటువంటి రాజనీతిజ్ఞతకు మనము నోచుకుంటామా అనే అనుమానము సగటు మనిషికి వస్తుంది. దిగజారుతున్న రాజకీయ విలువలు, సమాజంలో పెరుగుతున్న అవినీతి, నైతిక విలువల పతనం, స్వార్థచింతన, కులతత్వము మొదలగు సామాజిక రుగ్మతలు సగటు మనిషిని నిరాశకు ,నిస్పృహకు గురిచేస్తాయి. కానీ చారిత్రక వాస్తవాలు వేరుగా ఆశాజనకంగా వున్నాయి. పెరుగుట విరుగుట కొరకే అనే నానుడి చారిత్రక వాస్తవమే. ఎదుగుతున్న ప్రజాస్వామ్య ప్రక్రియలో పౌరసమాజమే అత్యున్నత ప్రామాణిక వ్యవస్థ. పౌర సమాజము నుండే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సంస్కరణలు ఉద్భవిస్తాయి. పౌర సమాజము మానవత్వ సమసమాజం వైపు నిరంతరమూ పయనిస్తునే ఉంటుంది. ఆ ప్రయాణంలో ఆటుపోట్లను అధిగమిస్తుంది. కాబట్టి నిరాశ, నిస్పృహల నుండే ఆశ, స్పృహలు ఉద్భవిస్తాయి.

అల్బర్ట్ ఐన్‌స్టీన్ గారు ఏమి చెప్పారంటే : దుర్మార్గుల వలన ఈ ప్రపంచములో నివసించడానికి ప్రమాదకరం లేదు. అయితే ఎవరైతే దుర్మార్గులను చూసి ఏమి చేయకుండా నిశ్చేష్టులుగా ఉంటారో వారే ఈ ప్రపంచానికి ఎక్కువ ప్రమాదకరం. కాబట్టి పౌర సంస్థలు, అభ్యుదయ వాదులు, సామాజిక సంస్కర్తలు, రచయితలు, కళాకారులు, పౌర సమాజంలో నిరాశను, నిస్పృహలను పారదోలాల్సి వుంది.

మిత్రుడు ఇమాంగారికి నేనెంతో ఋణపడి వున్నాను. సమకాలీ సమస్యలపైన, అనంతపురము పరిస్థితులపైన నన్ను వ్రాయడానికి ప్రోత్సహించడమే గాకుండా, తాను పట్టు పట్టి వాటిని ప్రచురించుటకు సంకల్పించి అనంత ప్రస్థానాన్ని మీ ముందుకు తెచ్చినారు. నా ఈ కొత్త అనంత ప్రస్థానానికి ముందు మాటలు వ్రాసిన శ్రీమతి అన్నె ఫెర్రర్ గారికి ధన్యవాదములు. ఆమె మన దేశంలోనే ఒక ప్రముఖ సమకాలీన సంఘ సేవకులు. శ్రీమతి అన్నె ఫెర్రర్ మరియు ఆమె కుటుంబముతో నాకు నా కుటుంబానికి 42 సంవత్సరాల సహచర్యము, సన్నిహిత్యము ఉంది. నేను ఈ స్థాయికి ఎదగడానికి వారిరువురు ఎంతో తోడ్పడినారు.

అదే విధంగా నేను విశేషంగా అభిమానించి, గౌరవించే శ్రీ కె.ఆర్. వేణుగోపాల్ గారికి అభినందనలు. మా మధ్య దాదాపు 25 సంవత్సరాల సమాలోచన, సాన్నిహిత్యము ఉంది. ఆయన మన దేశం గర్వించ దగ్గ అత్యున్నత సివిల్ సర్వీసు అధికారి. అంతే కాదు. మానవ హక్కుల పరిరక్షణకు, ప్రజారక్షణకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా వారి అభ్యున్నతికి నిరంతరము ఆలోచిస్తు, తన దైన శైలిలో నిరంతరము కృషి చేస్తున్నారు. రెండు రూపాయలకు కే.జీ. బియ్యము, సమగ్ర శిశు అభివృద్ధి పథకము లాంటి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసినవారు. నేను నేనుగా ఎదగడానికి సకల సదుపాయాలు కల్పించి, అన్ని విధాల సహకరించిన నా సతీమణి శ్రీమతి డోరీన్ రెడ్డిగారి ఋణం తీర్చుకోలేనిది. నా కుటుంబ భారాన్నంతా ఆమె తన భుజస్కంధాలపై మోస్తూ, తన ఉద్యోగ సమస్యలపై ఆలోచించడానికి, ఎదగడానికి ఆమె తోడ్పాటు లేనిదే నాకు సాధ్యమైవుండేది కాదు. చివరిగా, ముఖ్యంగా నేను పుట్టి పెరిగిన కుటుంబ నేపథ్యము, అక్కడి వ్యవసాయ పర్యావరణ జీవనోపాధుల పరిస్థితులు, జిల్లా ప్రజలు, సహచరులు, శ్రేయోభిలాషులు మొదలగు వారందరూ నా ఎదుగుదలలో భాగస్వాములుగా వున్నారు. అందరికీ ధన్యవాదములు

మీ

**వై.వి. మల్లారెడ్డి**

# మల్లారెడ్డి గురించి నా మాట

## 1) కుటుంబ నేపథ్యము :

డాక్టర్ వై.వి.మల్లారెడ్డిగారి పూర్తి పేరు యర్రగొండ వెంకట మల్లారెడ్డి. కదిరి తాలూకా, కదిరి పట్టణము నుండి 10 కి.మీ. దూరంలోని నీరుకుంట్లపల్లె అనే ఒక మారుమూల గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో తల్లి శ్రీమతి వెంకటమ్మ, తండ్రి శ్రీ యర్రగొండ హరినారాయణరెడ్డిగార్ల మూడవ సంతానముగా జూలై ఒకటవ తేదీన 1954వ సం॥న జన్మించారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్.డి.టి)లో పనిలో స్థిరపడిన తరువాత 1981వ సంవత్సరం ఆగస్టు 9వ తేదీన శ్రీమతి డోరీన్‌రెడ్డి గారిని వివాహమాడినాడు. ఆమె కూడా ఆర్‌డిటిలో పని చేసేవారు. వారి సంతానం ఏకైక కుమారుడు వై.భరత్‌రెడ్డి, కోడలు శ్రీమతి సంధ్య, మనువరాలు చిరంజీవి యశస్వినియాన్ (2014లో జన్మించింది). కొడుకు, కోడలు కార్పొరేటు రంగంలో ఉద్యోగంలో స్థిరపడినారు.

## 2) చదువు- ఉద్యోగము ః

ప్రాథమిక విద్య నీరుకుంట్లపల్లెలో తన తండ్రి మరియు ఇతర గ్రామస్థులతో ఏర్పాటు చేసిన బడిలో జరిగెను. (శ్రీ నబీసాబ్ మరియు శ్రీ మేలంగి వెంకటేశులు మొదటి గురువులు) తరువాత 6వ తరగతి కోసం ప్రవేశ పరీక్షలో నెగ్గి గాండ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు. తరువాత 7 నుండి 10వ తరగతి (1969) వరకు తన తల్లిగారి పుట్టిన గ్రామమైన నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివినాడు. ఇంటర్మీడియట్ (1969-1971) కదిరి జూనియర్ కళాశాలలో పూర్తి చేసి, బి.కాం., డిగ్రీ (1971-1974), బిసెంటు థియోసాఫికల్ కాలేజ్, మదనపల్లెలో చదివాడు. తనకు బంధువైన శ్రీ పాముదుర్తి బయపరెడ్డి (అప్పటి పార్లమెంటు సభ్యులు) గారి సూచన మేరకు న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని నిర్ణయించి, 1974వ సంవత్సరంలో అనంతపురములో సాయంత్రపు కాలేజీలో బి.యల్. కోర్సులో చేరినాడు. ఆ సందర్భంలోనే ఫాదర్ ఫెర్రర్ గారిచే స్థాపించబడిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్.డి.టి)లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగంలో చేరినాడు. పగలు ఉద్యోగం, సాయంత్రం కళాశాలలో చదువుకొనసాగించినాడు. తరువాత కొన్ని నెలలకే ఫాదర్ ఫెర్రర్ యొక్క వ్యక్తిత్వానికి, సిద్ధాంతాలకు, కార్యక్రమాలకు పూర్తిగా ప్రభావితుడై సాయంత్రపు కళాశాలో బి.యల్. చదువుకు స్వస్తిపలికి సామాజిక సేవలో పూర్తిగా నిమగ్నమైనాడు. ఆర్‌డిటిలో సూపర్‌వైజర్‌గా, కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా, టీమ్ లీడర్‌గా, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్‌గా వివిధ స్థాయిలలో పనిచేసి 1984వ సంవత్సరంలో కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సెక్టర్‌కు డైరెక్టర్‌గా నియమింపబడినాడు. అప్పటికి ఆర్‌డిటిలో ఉన్న డైరెక్టర్లలో మల్లారెడ్డి అతి చిన్న వయసున్న డైరెక్టర్. 1986వ సం॥ నుండి ఎకాలజీ సెక్టారుతో1990 సంవత్సరంలో ఇంగ్లాండ్‌లో ఎం.బి.ఏ. పూర్తి చేసుకుని వచ్చిన తరువాత ఎకాలజీ సెక్టార్‌తో పాటు మానవ వనరుల అభివృద్ధి (Human Resources Development) శాఖకు కూడా డైరెక్టర్‌గా పనిచేసినాడు.

తరువాత ఉద్యోగంలో స్థిరపడిన తరువాత ఇంగ్లండులోని హల్ (Hull) యూనివర్సిటీలో

1989–90 సంవత్సరంలో ఎం.బి.ఏ. చేసి డిస్టిక్షన్‌లో ఉత్తీర్ణత సాధించినా, తరువాత శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని శ్రీకృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్ ప్రేమ్‌చంద్‌గారి పర్యవేక్షణలో మానవ వనరుల నిర్వహణలో పిహెచ్.డి. చేసినాడు. ఈ రెండు చదువులు ఉద్యోగంలో చేరిన తరువాత పూర్తి చేసినాడు.

తరువాత 2002వ సంవత్సరం నుండి ఇప్పటివరకు యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్ (Action Fraterna Ecology Centre) అనే స్వయం ప్రతిపత్తి కలిగిన ఆర్‌డిటి అనుబంధ సంస్థకు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆర్‌డిటిలో పనిచేసే ప్రతి స్థాయిలోనూ రాణించి, సంస్థలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఫాదర్ ఫెర్రర్‌తోనూ శ్రీమతి అన్నె ఫెర్రర్‌తోనూ 1974వ సంవత్సరం నుండి అత్యంత సన్నిహితంగా పనిచేస్తూ సంస్థ ఎదుగుదలలోనూ, సంస్థ ఎదుర్కొన్న అనేక సవాళ్ళను అధిగమించడంలో చురుకైన పాత్ర పోషించినారు.

మల్లారెడ్డి నాయకత్వంలో ఆర్.డి.టి. మరియు ఎకాలజీ సెంటరు ద్వారా అమలు పరచిన అనేక గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసించబడినాయి. అంతేగాదు మన రాష్ట్రస్థాయిలోనూ, గ్రామీణాభివృద్ధికి సంబంధించి స్వచ్ఛంద సంస్థలు అమలు చేసే కార్యక్రమాలు సృజనాత్మకంగా, నూతనంగా ఉంటూ, కొత్త ఒరవడి కలిగియుండి, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే వాటర్‌షెడ్ కార్యక్రమాలకు ఆయన ఎకో–ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాము (Eco-employment Programme) అనగా" పర్యావరణ ఉపాధి కార్యక్రమము " అని పేరు పెట్టారు. అంటే వాటర్ షెడ్ కార్యక్రమాలు పర్యావరణ అభివృద్ధికి మరియు దారిద్ర్య వలసలను నివారించే ఉపాధి కల్పనకు రెండింటికి తోడ్పడాలని రూపకల్పన చేసి ప్రజల భాగస్వామ్యముతో విజయవంతంగా అమలు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించినారు. కేంద్ర ప్రభుత్వస్థాయిలో 1990 దశకం మొదలులో అప్పటి ఉపాధి హామీ పథకం (Employment Assurance Scheme ) విధి విధానాలను రూపొందించడంలో ఈ అనుభవం కొంత తోడ్పడింది. తరువాత 1994లో కేంద్ర ప్రభుత్వము విడుదల చేసిన "వాటర్ షెడ్ కార్యక్రమాల మార్గదర్శకాలు" (ఔఢవతీంష్టవఎ ఠ్రబఱఎవశ్రీఱఅవం) రూపొందించడానికి నియమించబడిన శ్రీ. హనుమంతరావు కమిటీ, ఆర్.డి.టి. అమలు చేస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాలలో పాటిస్తున్న ప్రజల భాగస్వామ్య విధానము (Participetory approach ) మరియు శ్రీ. అన్నాహజారే గారు రాలేగావ్ సిద్ధిలో అమలు చేస్తున్న ప్రజల భాగస్వామ్య విధానము, మరియు మైరాడాసంస్థ అమలు చేస్తున్న ప్రజల భాగస్వామ్య విధానము మొదలగు వాటిని అధ్యయనం చేసి మార్గదర్శకాలను రూపొందించబడినాయి.

ఉపాధి హామీ పథకం (1991) మరియు వాటర్‌షెడ్ మార్గదర్శకాలు (1995) ఈ కార్యక్రమాల విధివిధానాల రూపకల్పనలో శ్రీ. కె.ఆర్. వేణుగోపాల్ గారు (అప్పటి ప్రధానమంత్రి గారికి కార్యదర్శి) మరియు శ్రీ.బి.యన్. యుగంధర్ గారు (అప్పటి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి) గా పనిచేస్తున్న సందర్భంలో మల్లారెడ్డి గారితో వారికి ఉన్న సాహిత్యం, అనంతపురం జిల్లాతో వారికి వున్న అనుబంధం మరియు వారిరువురికి వున్న సామాజిక స్పృహ, కార్యదీక్ష తోడై పై పురోగమున కార్యక్రమాల విధాన రూపకల్పనకు అవకాశం ఏర్పడింది.

అలాగే శ్రీ. సత్యప్రకాశ్ టక్కర్ గారు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్‌గా, కార్యదర్శిగా వున్న సందర్భంలో కూడా అనేక కొత్త కార్యక్రమాలను రూపొందించడము జరిగింది. 1999వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వ అంతర్జాతీయ అభివృద్ధిశాఖ (Department for Interna-

tional Development (DFID)) ధన సహాయముతో ఆంధ్రప్రదేశ్ " గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధి పథకము" (A.P. Rural Liveklihoods Programme ) నకు రూపకల్పన శ్రీ. టక్కర్ గారితో కలిసి పనిచేయడం జరిగింది. శ్రీ. చంద్రబాబునాయుడు గారు తను అధ్యక్షులుగా జాతీయస్థాయి నిపుణులతో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ జల సంరక్షణ మిషన్( A.P. Water Conservation Mission ) లో మల్లారెడ్డి గారిని కూడా ఆహ్వానించడం జరిగింది. ఈ సంస్థలో శ్రీ. అన్నా హజారే, విలాస్‌రావు సోలంకి, చండీ ప్రసాద్‌భట్, సునీతా నారాయణన్, అనిల్ సింగ్, రాజేంద్రసింగ్ లాంటి ప్రముఖులతో పాటు శ్రీ. బి.యన్. యుంగధర్ గారు కన్వీనర్‌గా ఉన్నారు. ఈ సమయంలో భూగర్భజలాల వినియోగ నియంత్రణ సంస్థ ఆంధ్రప్రదేశ్ వాటర్, లాండ్, ట్రీస్ యాక్ట్ (Andhra Pradesh Water Land and Tree Act - APWALTA) చట్టము తీసుకునిరావడంలో మరియు దాని విధివిధానాలను నిర్ణయించడంలో మల్లారెడ్డి ప్రముఖపాత్ర పోషించినారు. ఈ చట్టము భూగర్భజలాల అభివృద్ధికోసం మరియు వాటి వినియోగాన్ని నియంత్రించడంతో పాటు వ్యవసాయ భూములలో వృక్షసంపదను పెంపొందించడానికి ఉద్దేశించబడినది. 2004వ సంవత్సరంలో శ్రీ. రాజశేఖర్‌రెడ్డి గారు శ్రీమతి. జయతీ ఘోష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంక్షేమ కమీషన్‌లో సభ్యుడిగా నియమింపబడినారు. ఆ కమీషన్‌లో వర్షాధార వ్యవసాయాన్ని కరువుల బారి నుండి రైతులను రక్షించడానికి తన వాదనలను బలంగా వినిపించి, తగిన సిఫారసులను చేయడానికి కృషిచేసినాడు.

మనదేశంలో గ్రామీణ నిరుద్యోగాన్ని, దారిద్ర వలసలను నివారించడానికి " ఉపాధి హామి" కేవలం ఒక పథకంగా కాకుండా చట్టబద్ధమైన కూలీల హక్కుగా ఉండాలని జాతీయ స్థాయిలో అనేక మంది సామాజిక కార్యకర్తలు, గ్రామీణ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు కనీసం 40 సంవత్సరాలుగా పోరాడుతున్న వారిలో మల్లారెడ్డి ఒకరు. ఎట్టకేలకు 2005వ సంవత్సరంలో శ్రీ. మన్మోహన్‌సింగ్ గారు ప్రధానమంత్రిగా వున్నప్పుడు, వామపక్షభావాలు గల శ్రీ.బి.యన్. యుంగధర్ గారు ప్లానింగ్ కమీషన్ సభ్యులుగా, తన చొరవతో "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టము" (National Rural Employment Guarantee Act ) తీసుకొని రావడం జరిగింది. ఆ చట్టము వచ్చిన తరువాత మన రాష్ట్రంలోని గ్రామాలలో ఉపాధి కల్పించడానికి అనువైన కార్యక్రమాలను నిర్ణయించడానికి కూలీలలను ఉపాధి మరియు పర్యావరణ వనరుల అభివృద్ధికి, రెండింటికి మేలు చేసే విధంగా విధాన రూపకల్పన చేయడంలో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ గారితో కలిసి మల్లారెడ్డి ప్రముఖపాత్ర పోషించడం జరిగింది. తాను అప్పటికే అమలు చేస్తున్న ఎకో–ఎంప్లాయ్‌మెంటు ప్రోగ్రాము యొక్క లక్ష్యాలు, విధివిధానాలు అందుకు బాగా ఉపకరించినాయి.

అనంతపురము జిల్లాలో మరియు గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసిన అనేక మంది ఉన్నతస్థాయి సివిల్ సర్వీసు అధికారులతో దగ్గరగా పనిచేసి, తన ఆలోచనలను, అనుభవాలను పంచుకొని విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడం జరిగింది. తాను కలిసి పనిచేసిన వారిలో శ్రీ.బి.యన్. యుంగధర్, శ్రీ.కె.ఆర్. వేణుగోపాల్, శ్రీ. సమరజిత్‌రాయ్, శ్రీమతి వై.వి.అనురాధ, శ్రీ.బి.జనార్ధనరెడ్డి, శ్రీ.శశిభూషణ్‌కుమార్, కెప్టెన్ ఎ.వి.ఎస్.రెడ్డి, శ్రీ. చంద్రమౌళి, శ్రీ.అనిల్‌కుమార్ పునీత్, శ్రీమతి సువర్ణ మొదలగు వారున్నారు.

వారందరి ఆలోచనలు అనుభవాలు ఆచరణలు ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకోవానికి సహకరించాయి అని చెప్పుకోవడం ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి.

## వివిధ దేశాల సందర్శన :

తన పనిలో భాగంగా అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరు కావడం జరిగింది. ఆ సదస్సులలో అనంతపురము జిల్లా యొక్క ప్రత్యేక సమస్యలైన వర్షాధార వ్యవసాయం, కరువు, ఎడారీకరణ, వ్యవసాయ సంక్షోభం, వలసలు మొదలగు సమస్యలపై తన వాణిని వినిపించడం జరిగింది. వరుసగా తాను పాల్గొనిన సదస్సులలో ప్రపంచ జల సదస్సులు ( World Water Forum ) మరియు ప్రపంచ వాతావరణ సదస్సులు ( World Climate Conference - COP Conference ) కూడా వున్నాయి.

## ఫుల్ బ్రైట్ స్కాలరు (Fullbright Scholar)

పతిష్టాత్మక ఫుల్‌బ్రైట్ స్కాలరుగా (Fullbright Scholar ) గా ఎంపికై భారత– అమెరికా పర్యావరణ నాయకత్వ ఫెలోషిప్ (Indo- American Environment Leadership Program) ను అందుకొని ఆమెరికా ప్రభుత్వ ఆహ్వానం మేరకు 2006 వ సంవత్సరంలో 6 నెలలు ఆమెరికాలోని వివిధ ప్రాంతాలు, విశ్వవిద్యాలాలు సందర్శించి అక్కడ వ్యవసాయ పరిస్థితులను, వారు కరువులను ఎలా ఎదుర్కొంటున్నారు, కరువులను అధిగమించడానికి ఆమెరికా ప్రభుత్వ విధానాలు, ఉపశమన కార్యక్రమాలు గురించి అధ్యయనం చేసినాడు. తాను సందర్శించిన దేశాలలో ఆమెరికా, మెక్సికో, ఇంగ్లాండు, జర్మనీ, నెదర్లాండ్సు, ఫ్రాన్సు, స్విట్జర్లాండు, చెక్ రిపబ్లిక్, ఇటలీ, స్పెయిన్, పోలెండు, డెన్మార్క్, స్వీడను, దక్షిణ ఆఫ్రికా, కెన్యా, జోర్డాను, నేపాలు, బాంగ్లాదేశ్, ఇండొనేషియా, జపాను, సింగపూర్, థాయిలాండు మొదలగునవి ఉన్నాయి.

20 మార్చి, 2017 ఇమామ్

అనంతపురము.

**మల్లారెడ్డి గారి గురించి క్లుప్తంగా పరిచయం చేయడానికి సాహసిస్తున్నాను.**

**ఎంత వరకు నేను సఫలీకృతుడౌతానో పాఠకులే నిర్ణయించాలి.**

మల్లారెడ్డి నాయకత్వంలో ఆర్.డి.టి. మరియు ఎకాలజీ సెంటరు ద్వారా అమలు పరచిన అనేక కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసించబడినాయి. అంతేగాదు మన రాష్ట్రస్థాయిలోనూ, దేశస్థాయిలో కూడా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు నమూనాలుగా తోడ్పడినాయి. గ్రామీణాభివృద్ధికి సంబంధించి స్వచ్ఛంద సంస్థలు అమలుచేసే కార్యక్రమాలు సృజనాత్మకంగా, నూతనంగా ఉంటూ, కొత్త ఒరవడి కలిగియుండి, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్థాయిలో వుండాలని ఆయన విశ్వసించారు. ఆయన సారథ్యంలో 1980వ దశకంలో నడిచిన వాటర్‌షెడ్ కార్యక్రమాలకు ఆయన ఎకో-ఎంప్లాయ్‌మెంటు ప్రోగ్రాము (Eco-employment programme అనగా పర్యావరణ ఉపాధి కార్యక్రమము) అని పేరు పెట్టారు. అంటే వాటర్‌షెడ్ కార్యక్రమాలు పర్యావరణ అభివృద్ధికి మరియు దారిద్ర్య వలసలను నివారించే ఉపాధి కల్పనకు రెండింటికి తోడ్పడాలని రూపకల్పన చేసి ప్రజల భాగస్వామ్యముతో విజయవంతంగా అమలు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చూపించినారు. కేంద్ర ప్రభుత్వస్థాయిలో 1990 దశకం మెదలులో అప్పటి ఉపాధి హామీ పథకం (Employment Assurance Scheme) విధి విధానాలను రూపొందించడంలో ఈ అనుభవం కొంత తోడ్పడింది. తరువాత 1994లో కేంద్ర ప్రభుత్వము విడుదల చేసిన "వాటర్‌షెడ్ కార్యక్రమాల మార్గదర్శకాలు" (watershed guidelines) రూపొందించడానికి నియమించబడిన శ్రీ హనుమంతరావు కమిటీ, ఆర్.డి.టి. అమలుచేస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాలలో పాటిస్తున్న ప్రజల భాగస్వామ్య విధానము (Participatory Approach) మరియు శ్రీ అన్నా హజారే గారు రాలేగాం సిద్ధిలో అమలుచేస్తున్న ప్రజల భాగస్వామ్య విధానము అధ్యయనం చేసి మార్గదర్శకాలను రూపొందించబడినాయి.

ఉపాధి హామీ పథకం (1991) మరియు వాటర్‌షెడ్ మార్గదర్శకాలు (1995) ఈ కార్యక్రమాల విధివిధానాల రూపకల్పనలో శ్రీ. కె. ఆర్. వేణుగోపాల్ గారు (అప్పటి ప్రధానమంత్రి గారికి కార్యదర్శి) మరియు శ్రీ యుగంధర్ గారు (అప్పటి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి) గా పనిచేస్తున్న సందర్భంలో మల్లారెడ్డి గారికి వారితో ఉన్న సాన్నిహిత్యం, అనంతపురం జిల్లాతో వారికి వున్న అనుబంధం మరియు వారిరువురికి వున్న సామాజిక స్పృహ, కార్యదీక్ష తోడై పై పురోగమన కార్యక్రమాల విధాన రూపకల్పనకు అవకాశం ఏర్పడింది.

అలాగే శ్రీ సత్యప్రకాశ్ టక్కర్ గారు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్‌గా, కార్యదర్శిగా వున్న సందర్భంలో కూడా అనేక కొత్త కార్యక్రమాలను రూపొందించడము జరిగింది. 1999 వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వ అంతర్జాతీయ అభివృద్ధి శాఖ (Department for International Development (DFID) ధనసహాయముతో ఆంధ్రప్రదేశ్ "గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధి పథకము" (A.P. Rural Livelihoods Programme)నకు రూపకల్పన శ్రీ టక్కర్ గారితో కలిసి పనిచేయడం జరిగింది. శ్రీ చంద్రబాబునాయుడు గారు తాను అధ్యక్షులుగా జాతీయస్థాయి నిపుణులతో

ఏర్పాటు చేసిన జల సంరక్షణ మిషన్ (A.P. Water Conservation Mission)లో మల్లారెడ్డి గారిని కూడా ఆహ్వానించడం జరిగింది. ఈ సంస్థలో శ్రీ అన్నా హజారే, విలాస్‌రావు సోలంకి, చండీ ప్రసాద్‌భట్, సునీతా నారాయణన్, అనిల్‌సింగ్, రాజేంద్రసింగ్ లాంటి ప్రముఖులతో పాటు శ్రీ యుగంధర్ గారు కన్వీనరుగా ఉన్నారు. ఈ సమయంలోనే భూగర్భజలాల వినియోగ నియంత్రణ కోసం ఆంధ్రప్రదేశ్ వాటర్, లాండ్, ట్రీస్ యాక్ట్ (Andhra Pradesh Water Land and Trees Act - APWALTA) చట్టము తీసుకునిరావడంలో మరియు దాని విధివిధానాలను నిర్ణయించడంలో మల్లారెడ్డి ప్రముఖపాత్ర పోషించినారు. ఈ చట్టము భూ గర్భజలాల అభివృద్ధిని మరియు వినియోగాన్ని నియంత్రించడంతో పాటు వ్యవసాయ భూములలో వృక్షసంపదను పెంపొందించడానికి ఉద్దేశింపబడినది.

2004 వ సంవత్సరంలో శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు శ్రీమతి జయంతి ఘోష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ కమీషన్‌లో సభ్యుడిగా వర్షాధార వ్యవసాయాన్ని కరువుల బారి నుండి రైతులను రక్షించడానికి తన వాదనలను బలంగా వినిపించి, మంచి సిఫారసులను చేయడానికి తోడ్పడినాడు.

మనదేశంలో గ్రామీణ నిరుద్యోగాన్ని, దారిద్ర్య వలసలను నివారించడానికి "ఉపాధి హామీ" కేవలం ఒక పథకంగా కాకుండా చట్టబద్ధమైన కూలీల హక్కుగా ఉండాలని జాతీయ స్థాయిలో అనేకమంది సామాజిక కార్యకర్తలు, గ్రామీణ కార్మికసంఘాలు, వామపక్ష పార్టీలు కనీసం 40 సంవత్సరాలుగా పోరాడుతున్న వారిలో మల్లారెడ్డి ఒకరు. ఎట్టకేలకు 2005 వ సంవత్సరంలో శ్రీ మన్మోహన్ సింగ్ గారు ప్రధానమంత్రిగా వున్నప్పుడు, వామపక్ష భావాలు గల శ్రీ యుగంధర్ గారు ప్లానింగ్ కమీషన్ సభ్యులుగా, తన చొరవతో "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టము" (National Rural Employment Guarantee Act) తీసుకొని రావడం జరిగింది. ఆ చట్టము వచ్చిన తరువాత మన రాష్ట్రంలో ఉపాధి కల్పించడానికి అనువైన కార్యక్రమాలను నిర్ణయించడానికి కూలీలకు ఉపాధి మరియు పర్యావరణ అభివృద్ధికి రెండింటికి మేలుచేసే విధంగా విధాన రూపకల్పన చేయడంలో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ గారితో కలిసి మల్లారెడ్డి ప్రముఖపాత్ర పోషించడం జరిగింది. తాను అప్పటికే అమలు చేస్తున్న ఎకో-ఎంప్లాయ్‌మెంటు ప్రోగ్రాము యొక్క లక్ష్యాలు , విధివిధానాలు అందుకు బాగా ఉ పకరించినాయి.

అనంతపురము జిల్లాలో మరియు గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసిన అనేకమంది ఉన్నత స్థాయి సివిల్ అధికారులతో దగ్గరగా పనిచేసి, తన ఆలోచనలను, అనుభవాలను ప్రభుత్వాలకు పంచడం జరిగింది. తనకు అనేక కార్యక్రమాల రూపకల్పనలో, అమలులో కలిసి పనిచేసిన వారిలో శ్రీ యుగంధర్, శ్రీ కె.ఆర్. వేణుగోపాల్, శ్రీ సమరాయత్ రాయ్, శ్రీ సత్యప్రకాష్ టక్కర్, శ్రీ సత్యనారాయణరావు, శ్రీ సోమేష్‌కుమార్, శ్రీ వెంకటరామిరెడ్డి, శ్రీ రాజశేఖర్, శ్రీమతి అనూరాధ, శ్రీ జనార్ధన రెడ్డి, శ్రీ శశిభూషణ్ కుమార్, కెప్టెన్ ఎ.వి.ఎస్.రెడ్డి, శ్రీ చంద్రమౌళి, శ్రీ అనిల్‌కుమార్ పునీఠ, శ్రీమతి సువర్ణ మొదలగు వారున్నారు.

వారందరి ఆలోచనలు అనుభవాలు ఆచరణలు ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకోవడానికి సహకరించాయి అని చెప్పుకోవడం ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి.

అనంతపురము.

తేదీ: 16-03-2017 **కదలిక ఇమామ్**

## ‘అనంత’ జిల్లాకు లభించిన అపూరూపమైన ఆణిముత్యం మల్లారెడ్డి

అదే పెన్న! అదే పెన్న!     నిదానించి నడు!
విదారించు నెదన్, వట్టి     ఎడారి తమ్ముడు!
ఏదీ పెన్న?   ఏదీ పెన్న? ఏదీ పినాకినీ?
ఇదే పెన్న! ఇదే పెన్న!  ఇదే పినాకిని!
ఏదీ నీరు? ఏదీ హోరు?   ఇదేఇసుక వాలు!
అదే పెన్న ! అదే పెన్న!    నిదానించి నడు!
విదారించు నెదన్, వట్టి     ఎడారి తమ్ముడు!
ఇంత మంచి పెన్న తల్లి ఎందు కెండి పోయెనో?
ఇంతమంచి కన్నతల్లి  ఎందు కిట్లు మారెనో?
ఇంత మంచి పెన్నతల్లి  ఎందుకిట్లు మారెనో?
ఇంత మంచి కన్నతల్లి  ఎందు కెండి పోయెనో?
ఈ యేటి కాల్వ లోతుల  పాయలుగా పారు,
నీటి ప్రతి బొట్టున, నీ చాయల రైతుల నెత్తుటి
చాయలు సమ్మిళితమై విచారము గొల్పున్

1956లో విద్వాన్ విశ్వం గారు రచించిన “పెన్నేటిపాట” నుండి పై విలువైన వాక్యాలను మనం ప్రస్తుత సందర్భంలో గౌరవించి గుర్తించుకోవాలి. పెన్నేటి పాట రాయలసీమ కావ్యంగా తెలుగు సాహిత్యంలో గౌరవం పొందింది. అనంతపురము జిల్లా పెన్నానదీ పరివాహక ప్రాంతంగా మనం గుర్తుంచుకోవాలి. కొంతభాగం హగరి నదివైపు క్రిష్ణా పరివాహక ప్రాంతంకూడా వున్నది. అయితే ప్రధానంగా ఇది పెన్నాపరివాహక ప్రాంతం. చిత్రావతి, పండమేరు, కుముద్వతి తదితర నదులన్నీ పెన్నా మద్దిలేరుపరివాహక ప్రాంతంలోనివే. నీటి కొరకు ఈ ప్రాంతం ఎంతగా తపించిపోయిందో తెలియజెప్పడానికి పై పెన్నేటిపాటను గుర్తుచేస్తున్నాము.

ఈ ప్రాంతంలో నీటి కోసం ప్రజలు అనేక పోరాటాలు, త్యాగాలు చేశారు. ఇందులో రాయలసీమలోనే మొట్టమొదటి కావ్యంగా ప్రసిద్ధిగాంచిన “ముసలమ్మ మరణం” కట్టమంచి రామలింగారెడ్డిగారు రచించారు. అనంతపురము చెరువుకట్ట తెగిపోకుండా కట్ట నిలబెట్టడానికి ఆనాడు ముసలమ్మ తన ప్రాణాలను త్యాగం చేశారు. నేటికి ముసలమ్మ కట్ట దగ్గర అనంతపురము, బుక్కరాయసముద్రము ప్రజలు టెంకాయలు కొట్టి పూజించడం జరుగుచున్నది.

తెలుగు సాహిత్యంలో 1942లోనే వెలువడిన గుత్తిరామకృష్ణగారి "గంజికోసరం" కథ ఎంతో పేరెన్నికగన్నది. గుత్తి రామకృష్ణగారు అనంతపురము జిల్లా కమ్యూనిస్టుపార్టీ స్థాపనలో కీలక పాత్ర వహించారు.

అనంతపురము జిల్లాలో కల్లూరు సుబ్బారావు, పప్పూరి రామాచార్యుల వారు ఈ ప్రాంతంలో క్రిష్ణా జలాలు రావడానికి 1937 సంవత్సరంలో పెద్దమనుషులు చేసుకొన్న శ్రీబాగ్ ఒప్పందంలో కీలక పాత్ర పోషించడం ఈ ప్రాంత పరిస్థితుల నేపథ్యాన్ని తెలియజేస్తుంది. అనంతపురము జిల్లాలో ప్రజానాయకులుగా పేరొందిన వారంతా ఇక్కడి కరువు పరిస్థితుల మీద స్పందించిన వారే! పోరాడినవారే! అనంతపురము జిల్లాకు నీటి ప్రాధాన్యత ఎంతటి కీలకమో తెలియజేయడానికి పై వాక్యాలను మీకు గుర్తుచేస్తున్నాము. ఈ పుస్తకానికి మేము అనంతపురము "జిల్లా మ్యాగ్నాకార్టా" గా అనంత ప్రస్థానంగా పేరు పెట్టడంలో చాలా సముచితమనే భావిస్తున్నాము.

అనంతపురము జిల్లాకు సంబంధించి డాక్టర్ వై.వి. మల్లారెడ్డిగారు చాలా లోతైన విశ్లేషణ చేశారు. ఆయన స్వాతంత్ర్యానికి మునుపు, ఆ తరువాత ఈ జిల్లాలో ప్రజానాయకులు అనుసరించిన విధానాలనే వారసత్వంగా స్వీకరించారు. ఎంతో బాధ్యతగా అనంతపురము జిల్లా భౌగోళిక పరిస్థితులను ఆకళింపుచేసుకున్నారు. లోతైన అధ్యయనం చేశారు. నిరంతరం జిల్లాలో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను చాలా బాధ్యతతో చలించిపోయి స్పందించారు. పరిస్థితులకు తగ్గట్టు ఆయన స్పందించి రచనలు చేశారు. ఆయన రచయిత కాదు. కవి కాదు. కానీ కేవలం జిల్లాలోని కరువు పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా అతను పనిచేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా పరిశీలించి ఆకళింపు చేసుకొన్న భావనలను బాధ్యతగా రచించడం ద్వారా తన బాధ్యతను నెరవేర్చారు. వరుస కరువులు, రైతుల ఆత్మహత్యలు, అప్పులు, వలసలు, ఈ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలను జీవచ్ఛవాలుగా ఎలా మార్చేసాయో ఎవరైనా తెలుసుకోవాలంటే ఆయన చేసిన రచనలు చదివితే అర్థమౌతుంది. నిరంతరం కరువు పరిస్థితులను చూచి ఈ పరిస్థితులను మార్చడానికి ప్రయత్నం చేయడం ద్వారా చేసేదేమి లేదని మేధావులనుకున్నవారు, కుహనా సామాజిక కార్యకర్తలు, ప్రజాసేవ పేరుతో పదవులు పొంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మల్లారెడ్డి గారు ఈ పరిస్థితులపై చలించిపోయి తన బాధ్యతగా ఈ వ్యాసాలు రాశారు. నీటి ప్రాధాన్యత గురించి అనంతపురం జిల్లాకు 100 టి.ఎం.సి.లు కేటాయించాలని, అనంతపురం జిల్లా త్రాగునీటి అవసరాలు, అనంతపురం జిల్లాలో భూతాపం ముప్పు మరింత జటిలం కానున్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులు, జల సంపద జాతీయ పరిధిలోకి రావాలి..., అనంత నీటిగోడు..., అనంతపురం జిల్లాలో కరువు – ఎడారీకరణను నివారించే...., combating drought & Desertification and mitigation.. Conjunctive Water Management : An approach to suc 18.

Conjunctive Water Management అనంతపురం జిల్లాలో కరువును అధిగమించడానికి కీలక తడులే..., వాతావరణ మార్పులకు తట్టుకొని అనంతపురం జిల్లా వ్యవసాయాన్ని కాపాడుకొనే విధానాలు... అనంతపురము జిల్లాలో దుర్భిక్షం– దారిద్ర్యం – ఒక కార్యాచరణ సాదృశ్యం.., అనంతలో నీటి సంక్షోభం – తక్షణ స్పందన అవసరం..., నీటి వినియోగంలో సమతుల్యమే సమగ్ర గ్రామీణాభివృద్ధికి పునాది.. ఈ వ్యాసాలు కాకుండా అనేక వ్యాసాలు అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను అధిగమించడానికి చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఆయన సూచనలు సలహాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో అనంతపురం జిల్లాకు వచ్చిన క్రిష్ణా కమిషన్‌కు రాష్ట్ర సమస్యలపై విభజన జరిగితే జరగబోయే వ్యతిరేక పరిణామాలపై ఆయన హెచ్చరిక చేస్తూ తగు సూచనలు సలహాలు చేశారు.

కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన జయతీఘోష్ కమిషన్‌లో చాలా చురుకైన పాత్ర వహించి అది ఒక విలువైన నివేదికగా వెలువడడానికి మల్లారెడ్డిగారి కృషి ఈ సందర్భంగా ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. ఈ పుస్తకంలోనే ఆయన రాసిన పెద్దనోట్లరద్దు పరిణామాలపై విశ్లేషణ బహుశా చాలా విలువైనదిగా నేను భావిస్తున్నాను.

నేడు అనంతపురము జిల్లా తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. వరుస కరువులతో బహుశా 20 సంవత్సరాలలో ఏ మూడు నాలుగు సంవత్సరాలో పంటలు పండిన దయనీయ పరిస్థితి ఈ జిల్లాది. గత మూడు సంవత్సరాలు వరుస కరువులు. ఈ సంవత్సరం తొలుత వర్షాలు బాగా కురువడంతో రైతులు వేరుశెనగ పంటను చాలా ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. సకాలంలో వర్షాలు కురువక ఈ సంవత్సరం కూడా కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించింది. వరుస కరువులు వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఎక్కువగా బోరు బావుల మీద, భూగర్భ జలాల మీద ఆధార పడగా దాదాపు 1,70,000 బోరు బావులు ఎండిపోయాయి. ఫలితంగా మెట్ట వ్యవసాయం తీవ్రంగా దెబ్బతినింది. నేడు దాదాపు 800 గ్రామాలకు ప్రభుత్వం త్రాగునీటిని ఇతర ప్రాంతాల నుండి ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతోంది. సత్యసాయి సేవా ట్రస్టు 400 గ్రామాలకు "సత్యసాయి త్రాగునీటి పథకం" ద్వారా కడప జిల్లాలోని చిత్రావతి నదిలో ఫిల్టర్ పాయింట్స్ వేసి అనంతపురం జిల్లాకు త్రాగునీటి సరఫరా అందిస్తోంది. గ్రామాల్లో పశుగ్రాసం ఒక తీవ్ర సమస్యగా మన ముందున్నది. రైతుల పాడిసంపద నశిస్తోంది. తమ పశువులను మేత లేక కబేళాలకు తరలిస్తుండడం రైతుల దైన్యపరిస్థితి మనకు స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో వాతావరణ పరిస్థితుల్లో తీవ్రమైన మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెలలోనే తీవ్రమైన వేడిని దాదాపు 42 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రతలను మనం అనుభవించాము. దుర్భర పరిస్థితుల్లో రైతులు విలవిలలాడుతూ పంటలకు పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోగా చేసిన అప్పులు అవి ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ఖర్చుచేసినవి వడ్డీకి వడ్డీ పెరిగిపోగా ఆత్మహత్యలకు పాల్పడిన పరిస్థితులను మనం చూశాం. ఒకప్పుడు గ్రామీణ ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస పోవడం జరుగుతుండేది. నేడు దాదాపు 4 లక్షల మంది ప్రజలు ఈ జిల్లా నుండి కర్నాటక, కేరళ రాష్ట్రాలకు వలస పోవడం జరిగిందని అక్కడ వలస పోయిన రైతులు, యువకులను నేటి ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా దాదాపు ప్రభుత్వ గెజిటడ్ లాగా గుర్తించబడిన ప్రతిష్ఠాత్మకమైన దిన పత్రిక 'ఈనాడు' పూర్తి పేజీలతో విశ్లేషణలతో కూడిన వరుసగా వార్తాకథనాలు రాష్ట్రంలో సంచలనం కలిగించాయి. అంతేకాదు కొందరు బిచ్చగాళ్ళుగా మరికొందరు పడుపు వృత్తిలో కొనసాగుతున్నారనే వార్తలు మనల్ని నివ్వెరపరుస్తాయి. మన గుండెల్ని జలదరింపజేస్తాయి. అదే ఒరవడిలో 'సాక్షి' దిన పత్రిక కూడా పూర్తి పేజీల కథనాలు ప్రచురించడం జరిగింది. నేడు సి.పి.ఐ. ఈ పరిస్థితులను గమనించడానికి ఎలక్ట్రానిక్ మీడియాను, ప్రింట్ మీడియాను వెంటబెట్టుకొని రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సి.పి.ఐ.కార్యదర్శి జగదీష్ తదితరులతో ఆ ప్రాంతంలో పర్యటించి పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వం వెంటనే ఈ పరిస్థితుల నుండి ప్రజలను కాపాడవలసిన బాధ్యతను గుర్తుచేస్తూ ఆందోళన చేపట్టేబాటలో నడవబోతున్నారు. అనంతపురం జిల్లా సభ్యసమాజం, పౌరసమాజం చాలా బాధ్యతతో తమవంతు కర్తవ్యం నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వేసవిలో చాలా తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులను మనం ఎదుర్కోబోతున్నాం. అధికార పార్టీ దాదాపు 13 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎమ్మెల్సీలను ఇందులో ఇద్దరు మంత్రులు, మరో ఇద్దరు క్యాబినేట్ ర్యాంకు గల మంత్రులు, మరో ఇద్దరు క్యాబినేట్‌హోదా గల పదవుల్లో కొనసాగుతున్నారు.

వీరు బాధ్యతగా జిల్లా ప్రజల పట్ల స్పందించాల్సిన అవసరం చాలా వుంది. అటుకానిచో వారిమీద ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత పౌరసమాజం, రాజకీయ వ్యవస్థమీద వున్నది.

జిల్లాలో పరిశ్రమలు ప్రత్యేకించి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే వైపుగా చర్యలు చేపట్టని పరిస్థితి కూడా మనం చూస్తూన్నాం. ఒక వైపు గ్రామీణ రైతులు సంక్షోభంలో వున్నారు. నేడు ఏ గ్రామానికి వెళ్ళినా కళ లేని నిస్తేజపూరితమైన వాతావరణం మనకు కనిపిస్తున్నది. చాలా దైన్యపరిస్థితుల్లో మన గ్రామీణ ప్రాంతాలు మనకు దర్శనమిస్తున్నాయి. మన హృదయాన్ని కలిచివేసేవిగా కంటతడి పెట్టించేవిగా వున్నాయి. ఈ జిల్లాలో ఈ సంక్షోభం నుండి బయటపడవేయగల శక్తి నీటి వనరులకు మాత్రమే వుంది. అలాకాక మానవ వనరులను వినియోగించుకొని ఈ ప్రాంతంలో పేదరికం, నిరుద్యోగం పరిష్కరించవచ్చు. విచిత్ర పరిస్థితి ఏమంటే ఎప్పుడూ లేనంత కరువు పరిస్థితులు నేడు జిల్లాలో నెలకొన్నాయి. ఎప్పుడూ లేనంత అతి తక్కువ నీటిని మనం తుంగభద్రా డ్యాం నుండి దాదాపు 11 టి.ఎం.సి.లు పొందాము. అలాగే అదృష్టం కొద్దీ హంద్రీ-నీవా నుండి 30 టి.ఎం.సి.ల నీటిని అనంతపురం జిల్లాకు ఒక వరం లాగా వచ్చాయి. ఈ జిల్లా నాయకులు,అధికారులు బాధ్యతతో ప్రవర్తించని మూలంగా ఆ నీటిని సద్వినియోగం చేసుకోలేదు. జీడిపల్లి, పి.ఎ.బి.ఆర్., మిడ్‌పెన్నార్, ఇంకా హంద్రీ-నీవా కాలువ నీటిని ధర్మవరం చెరువు తదితర ప్రాంతాలలో నిలువ చేసి వుండవచ్చు. వేసవిలో ఉత్పన్నమైయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు ఒక ప్రణాళికను రూపొందించి ఉండవచ్చు. హెచ్.ఎల్.సి. కాలువ దిగువన క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించి అపూర్వమైన నీటి సంపదను మనుషులు, పశువులకు త్రాగునీటిని అందించడానికి ప్రయత్నించి వుండవచ్చు. ఇంత నిర్వీర్యమైన బాధ్యతారహితమైన అధికార యంత్రాంగాన్ని ప్రజాప్రతినిధులను నేను 45 సంవత్సరాల పనిచేసిన సామాజిక కార్యకర్తగా ఎన్నడూ చూడలేదు. ఇది స్థూలంగా జిల్లా పరిస్థితి.

సామాజిక కార్యకర్తలుగా,కవులుగా, రచయితలుగా బాధ్యతగల పత్రికలుగా, మేధావులుగా చాలామంది తమ తమ పరిమితులమేరకు ఈ పరిస్థితులపై స్పందిస్తున్నారు. వారు కూడా తమ కార్యాచరణను ప్రజలకు అనుగుణంగా చేపడుతున్నారు. మల్లారెడ్డి ఒక ప్రత్యేకమైన తనదైన శైలితో ఈ జిల్లా సమస్యల మీద స్పందిస్తున్నారు. ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో కరువు పరిస్థితులను తట్టుకొని నిలదొక్కుకొనేందుకు అనేక రకాలైనటువంటి ప్రయోగాలతో రైతాంగానికి, ప్రభుత్వానికి తగువిధంగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సూచిస్తూ ఆచరణలో చూపిస్తూ పనిచేస్తున్నారు. ఆయన ఈ పుస్తకంలో రాసిన వ్యాసాలు మనోవేదనతో,బాధ్యతతో చాలా నమ్రతతో రాసినవిగా ఈ పుస్తకం చదివితే ఎవరికైనా అర్థమౌతుంది. 145 సంవత్సరాల జిల్లా వర్షపాత వివరాలు, అనంతపురం జిల్లా భౌగోళిక పరిస్థితులు అటవీ సంపద, మెట్టవ్యవసాయం మరియు నీటి వినియోగాన్ని క్రమ పద్ధతిలో వినియోగించుకోవడం ద్వారా జిల్లా కరువును నియంత్రించుకోవచ్చు అనే విలువైన భావనను మనకు కల్పిస్తారు. మల్లారెడ్డి గారికి ఎంతో సుఖప్రదమైన జీవితం గడపడానికి అవకాశాలున్నప్పటికీ ఆయనకు ఈ ప్రాంత పరిస్థితుల పట్ల ఏర్పడ్డ తీవ్రమైన ఆవేదన ఆక్రందనగా ఈ పుస్తకం రూపొందింది.

ఇటీవల కాలంలో జిల్లాకు 100 టి.ఎం.సి.లు కావాలనే నినాదం బలంగా చోటుచేసుకొంది. పాణ్యం సుబ్రహ్మణ్యం, గొడ్డు రామాంజినేయులు లాంటి సామాజిక స్పృహ గలవారు వందల గ్రామాలలో స్కూళ్ళల్లో ఈ అంశంపై ప్రచారం చేస్తున్నారు. లక్షల సంఖ్యలో కరపత్రాలు ముద్రిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి కార్యాచరణకు పూనుకొనడానికి తమ వంతు కర్తవ్యంగా కృషిచేస్తున్నారు.

మల్లారెడ్డిగారు సాంకేతిక నిపుణులైన పాణ్యం సుబ్రహ్మణ్యం మరియు గుజ్జుల ఎల్లమందారెడ్డి గార్లతో కలిసి ఈ జిల్లాకు 100 టి.ఎం.సి.ల నీటిని ఎలా కేటాయించాలి? ఎందుకు కేటాయించాలి? అనే అంశంపై ఒక సాధికారిక పత్రం లాంటిది ఈ పుస్తకంలో మీరు చూడవచ్చు. మొత్తంగా అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధికి తగిన కార్యాచరణను ఈ పుస్తకం మనకందిస్తుంది. ఈ జిల్లా సంక్షోభిత పరిస్థితులను, క్లిష్ట పరిస్థితులను అతి సునాయాసంగా ఒక ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు చెప్పిన విధంగా ఆయన వ్యాసాలు నడుస్తాయి. అనంతపురం జిల్లాకు తగిన కరువు పరిష్కారాలు ఉన్నాయని ఆయన చాలా దృఢంగా విశ్వసిస్తారు. కావాల్సినదల్లా చిత్తశుద్ధి, నిజాయితీతో కూడిన ఆచరణ ద్వారా ఈ జిల్లాలో కరువు తీవ్రతను తగ్గించవచ్చు అనే అంశం ఆయన వ్యాసాల్లో మనం గమనించవచ్చు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తారమైన భూమిగల జిల్లా అనంతపురం. ఈ జిల్లాలో కొంత ప్రాంతం తూర్పు, పశ్చిమ కనుమలకు మధ్యనుండడం వల్ల ఈశాన్య,నైరుతి రుతుపవనాలు ఈ ప్రాంతానికి చేరేనాటికి బలహీనపడతాయి. ఇది ఒక ప్రత్యేక అంశం. దీని వల్ల వర్షాలు సస్యానుకూలంగా ఉండవు. ఎక్కువ వర్షం కురిసి ప్రధానమైన వేరుశెనగ పంట నష్టపోయిన సందర్భాలున్నాయి. తక్కువ వర్షపాతంతో సస్యానుకూలంగా వర్షాలు కురవడం వల్ల పంటలు దిగుబడి వచ్చిన సందర్భం కూడా వుంది. ఇది ఈ జిల్లాలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా,గుంటూరులోని పంటలు పండే 25 లక్షల ఎకరాలకు సమానంగా అనంతపురం జిల్లాలో కేవలం వర్షాధారిత వేరుశెనగ పంట 25 లక్షల ఎకరాల్లో పండాలి. ఇది కేవలం వర్షాధారితం. ఇక సంక్షోభాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ పుస్తకానికి ముందుమాట రాయాల్సిందిగా శ్రీమతి అన్నే ఫెర్రర్‌గారిని కోరగా ఆమె ఎంతో బాధ్యతతో మల్లారెడ్డి గారిని దీవించి ముందుమాటను చాలా క్లుప్తంగా అయినా గొప్పగా రాసివ్వడం జరిగింది. అందుకు మేము అన్నే ఫెర్రర్‌గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

కరువు జిల్లా మ్యాగ్నాకార్టగా అనంత ప్రస్థానం పుస్తకానికి ముందుమాట రాయాల్సిందిగా గౌరవనీయులు శ్రీ కె.ఆర్.వేణుగోపాల్ ఐ.ఎ.ఎస్. గారిని వినయపూర్వకంగా నేను, మల్లారెడ్డిగారు విజ్ఞప్తి చేయగా ఆయన ఎంతో బాధ్యతతో పుస్తకాన్ని అర్థం చేసుకొని విలువైన ముందుమాటను రాసిపంపారు. తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ గారు రచించిన "మహాప్రస్థానం" పుస్తకానికి ముందుమాట రాసిన శ్రీ గుడిపాటి వెంకటాచలం గారి ముందుమాట గొప్పదా? లేక మహాప్రస్థానం గొప్పదా? అనే చర్చ ఒకటి జరుగుతూనే వుంది. "అనంత ప్రస్థానం" గా 10 సంవత్సరాలకు పూర్వం మేము ఈ పుస్తకంలోనే ప్రచురిస్తున్న వ్యాసాల సంపుటికి పేరు పెట్టాము. మరీ ఇప్పుడు మల్లారెడ్డిగారు రాసిన అనేక వ్యాసాలను ఆ పుస్తకంలోని వ్యాసాలతో కలుపుకుని ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము. ఇది చాలా విలువైనది, అనంతపురము జిల్లా కరువు పరిస్థితులకు అద్దం పట్టే రచనలు కలదిగా వుండడం వల్ల ఈ పుస్తకానికి కరువు జిల్లా మాగ్నాకార్ట 'అనంతప్రస్థానం' గా ద్వితీయ ప్రచురణ రాష్ట్రంలోని రచయితలకు, కవులకు, మేధావులకు, సామాజిక కార్యకర్తలకు, ఒక రకంగా అనంత జిల్లా కరువు పరిస్థితులను అధ్యయనం చేయాలనుకునే వారికి, ఈ పరిస్థితులను మార్చాలనుకునే వారికి ఒక దిక్సూచిలా ఈ పుస్తకం పనిచేయగలదని ప్రగాఢమైన విశ్వాసంతో ఈ పుస్తక ప్రచురణకు పూనుకున్నాము. మాకు ఎంతో మార్గదర్శకంగా కె.ఆర్.వేణుగోపాల్ గారు తన అమూల్యమైన ముందుమాటను రాసిచ్చారు. అందుకు మేమెంతో ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము. వేణుగోపాల్‌గారు అనంతపురం జిల్లా

పరిస్థితులపట్ల ఎంతో బాధ్యతగా ఆయన ఏమి చేశారనేది పాఠకులు ఆయన ముందుమాటను చదివితే అర్ధమౌతుంది.

అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను అధిగమించాల్సిన అవసరం జిల్లా పౌరసమాజం మీద సవాళ్ళు విసురుతున్నది. ఈ సవాళ్ళు అధిగమించి బాధ్యతగలిగిన పౌరులుగా మనం ప్రవర్తించి మన జీవితాన్ని ఒక సార్ధకత గలదిగా నిరూపించుకోవాలంటే మల్లారెడ్డిగారు సూచించిన, ఆశించిన, నిర్ధేశించిన మార్గంలో పయనించడానికి శక్తివంచన లేకుండా కృషిచేయడమే మన కర్తవ్యం. ఈసందర్భంగా మల్లారెడ్డి గారి పుస్తకాన్ని ప్రచురించడానికి నాకు అవకాశం కల్గించడం ఒక గొప్ప అదృష్టంగా నేను భావిస్తున్నాను. అనంతపురం జిల్లా పరిస్థితులను మార్చడానికి కరువును నిలువరించడానికి తగిన కార్యాచరణను సూచించే సత్తాగల పుస్తకాన్ని చదవాల్సిందిగా కోరుతున్నాను.

07-03-2017, **ఇమామ్ -ఎడిటర్, కదలిక.**

అనంతపురము

# పెద్ద నోట్ల రద్దు - అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని ఆపగలదా?

## 1) నల్ల ఆర్థిక వ్యవస్థ – నల్లడబ్బు, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం :

బహిర్గతం కాని అక్రమ సంపాదనలో నల్లడబ్బు నోట్ల రూపంలో ఉండేది కేవలం ఒక శాతం నుండి గరిష్టంగా ఆరు శాతం ఉండవచ్చని అంచనాలున్నాయి. అక్రమ సంపాదనలో చాలా భాగం నిరంతరమూ నోట్లేతర ఆస్తులుగా రూపాంతరం చెందుతూ ఉంటుంది. అంటే భూములు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, బంగారం లాంటి ఆస్తులుగా మారిపోతూ ఉంటుంది. ఇలాంటి ఆస్తులు నల్లవా, తెల్లవా అని నిర్ధారించడం కష్టం. మరి కొంత భాగం విద్య, ఆరోగ్య ఖర్చులతో పాటు విలాసవంతమైన జీవనానికి ఖర్చు చేస్తుంటారు. ఉదాహరణకు విదేశీ పర్యటనలు, విలాస వస్తువుల కొనుగోలు తదితర ఖర్చులు. ఇంకొంత మంది అక్రమ సంపాదనతో పిల్లల చదువు కోసం లక్షల ఫీజులు చెల్లిస్తుంటారు. ఆ ఫీజులుకు రశీదులు ఇస్తారు. తల్లిదండ్రుల చేతిలో నల్లడబ్బు కళాశాలల యాజమాన్యాలకు చేరినప్పుడు తెల్లడబ్బు అయిపోతుంది. రశీదులు ఇవ్వకుండా తీసుకునే డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు మాత్రం యాజమాన్యాల దగ్గర నల్లడబ్బుగా చేరి, తిరిగి నోట్లేతర ఆస్తులుగా మారిపోతూ ఉంటుంది. ఇలా నలుపు–తెలుపుగా మారుతూ మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా అంతర్లీనమై ఉంటుంది. కేవలం పెద్ద నోట్ల రూపంలో ఇండ్లలో దాచుకునేది అత్యల్పంగా ఉంటుంది. దొంగలకు, ఆదాయపు పన్ను అధికారుల దాడులకు భయపడడం, దాచుకునే అవకాశాలు లేకపోవడంతో పాటు నోట్ల రూపంలో విలువ తరుగుతుంది కావున దాచుకోవడం అరుదే. ఆస్తుల రూపంలో అయితే విలువ కూడా పెరుగుతుంది. అందుకే చాలావరకు నోట్ల రూపంలో అక్రమ సంపాదన అత్యల్పస్థాయిలో మాత్రమే ఉంటుంది.

## 2) విదేశాలలో దాచుకున్న నల్లడబ్బు :

మనదేశంలో అక్రమంగా సంపాదించి, దాన్ని నోట్ల రూపంలో గోప్యంగా ఇతర దేశాలకు తరలించి, అక్కడి బ్యాంకులలో దాచుకున్నది మాత్రం నూటికి నూరుపాళ్ళు నల్లధనంగానే ఉంటుంది. అది మనదేశ ఆర్థిక వ్యవస్థ నుండి పెద్ద మొత్తంలో తస్కరింపబడి, మన ఆర్థిక వ్యవస్థను బలహీనపరచి, వ్యక్తుల స్వంత ఆస్తిగా గోప్యంగా ఉంటుంది. ఈ విధంగా విదేశాలలో దాచిన నల్లడబ్బును మనం రాబట్టగలిగితే అది మన ఆర్థిక వ్యవస్థకు తోడై బలోపేతం చేస్తుంది. ఆ నల్ల ధనవంతులను తీవ్రంగా శిక్షించగలిగితే విదేశాలకు పోయే డబ్బు ఆగిపోతుంది.

## 3) మన దేశంలో అక్రమ సంపాదనకు మూలాలు ఎక్కడ?

అక్రమ సంపాదనను, నల్లడబ్బును, నల్ల ఆస్తులను అరికట్టాలంటే వాటి మూలాలను అరికట్టాలి. మన దేశంలో భారీగా అక్రమ సంపాదన, అక్రమ ఖర్చులు చేస్తున్న వర్గాలలో ప్రధాన రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు, బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామికవేత్తలు, గుత్తేదార్లు, కొంతమంది కీలకస్థాయి అధికారులు ఉంటారు. తరువాత స్థానంలో కింది స్థాయి రాజకీయ నాయకులు,

గుత్తేదార్లు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు ఉంటారు. అయితే అక్రమ సంపాదన అన్ని స్థాయిలలోనూ, అన్ని రంగాల్లోనూ ఉందనేది బహిరంగ రహస్యమే..! అన్ని స్థాయిలలోనూ, అన్ని రంగాలలోనూ కొంతవరకు నిజాయితీ గల సంస్థలు, నిజాయితీ గల వ్యక్తులు ఉన్నది కూడా వాస్తవమే..!

అయితే అక్రమ సంపాదనకు మూలం మొదటిది రాజకీయ పార్టీలు ఎన్నికలలో పెట్టే అక్రమ ఖర్చులు. రెండోది అవినీతికి పాల్పడే కొంత శాతం రాజకీయ నాయకులు, అధికారులు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, అత్యధిక శాతం రాజకీయ నాయకులు అక్రమ సంపాదన చేసి, ఎన్నికల సమయంలో అందులో కొంత భాగాన్ని అక్రమంగా ఖర్చు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే! పారిశ్రామిక సంస్థలు, పెట్టుబడిదారులు, గుత్తేదార్లు ప్రభుత్వ వనరుల అక్రమ దోపిడీ ద్వారానూ, అక్రమంగా పారిశ్రామిక లైసెన్సులు పొందడం ద్వారానూ, హెచ్చించిన కాంట్రాక్టుల ద్వారానూ, అక్రమంగా సంపాదించి, పార్టీలకు, నాయకులకు నల్లధనం లేదా ఆస్తుల రూపంలో ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమే. కాబట్టి రాజకీయ వర్గాలు, అధికార వర్గాలు, పారిశ్రామిక వర్గాలు ఒకరినొకరు ప్రజాధనం, ప్రభుత్వ వనరుల దోపిడీ ద్వారా అక్రమార్జన చేసి అన్యోన్యంగా పోషించుకుంటున్నారనేది బహిరంగ రహస్యమే! ఈ అక్రమ దోపిడీ పరస్పర పోషణ పైస్థాయిలో భారీ మొత్తంలో మొదలై క్రింద గ్రామస్థాయి వరకు అన్ని స్థాయిలలో వివిధ మోతాదులో ఉండటమే అవినీతికి, అక్రమార్జనకు మూలం. అన్ని స్థాయిలలోనూ వ్యక్తులుగా కొంత శాతం నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉండేవాళ్ళూ ఉన్నారు. కానీ వ్యవస్థలుగా దాదాపు అన్ని రంగాలలోనూ అక్రమార్జన ఒక భాగంగా ఉందనడం కఠోర వాస్తవం! అయితే ఏ వ్యవస్థలైతే దేశ ప్రజలకు ఆదర్శవంతంగా ఉండి, సహజవనరులను, పర్యావరణాన్ని, ప్రజా ధనాన్ని రక్షించి, సుపరిపాలన అందించాలో ఆ వ్యవస్థలే "కంచే చేనును మేసినట్లు" అన్న చందంగా అక్రమార్జనకు, నల్ల ఆర్థిక వ్యవస్థకు పునాదులుగా ఉన్నాయి.

## 4. పెద్ద నోట్ల రద్దుతో నల్లధనాన్ని అరికట్టవచ్చునా?

ఇంతకు ముందే చెప్పినట్లు నోట్ల రూపంలో ఉండే అక్రమ ఆస్తులు ఆరు శాతానికి లోపే. కాబట్టి నల్లధన వ్యవస్థపై నోట్ల రద్దు ప్రభావం పరిమితంగానే ఉంటుంది. నల్ల ధన వ్యవస్థను అరికట్టాలంటే నల్ల ధన మూలాల నుండి ప్రవాహాన్ని అరికట్టాల్సి ఉంటుంది. కాబట్టి పెద్ద నోట్ల రద్దు ముక్కుతుడుపు మాత్రమే. ముక్కుతుడుపు ద్వారా పడిశం అనే జబ్బు మానదు. ముక్కుతుడుపు పడిశానికి మందు కాలేదు. వాస్తవంగా పెద్దనోట్లు రద్దు కాలేదు. పాతనోట్ల స్థానంలో కొత్త నోట్లను ఇంకా పెద్ద రూ. 2,000 ల నోటును విడుదల చేశారు. అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని అరికట్టాలంటే రాజకీయ పార్టీలు, నాయకులు, బడా పారిశ్రామికవేత్తలు, గుత్తేదార్లు, ప్రభుత్వ అధికారుల మధ్య గల అక్రమ లావాదేవీలను, అవినీతిని పై నుండి క్రింది వరకు అరికట్టాలి. ఎన్నికల ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించాలి. అవినీతికి, అక్రమ సంపాదనకు పాటుబడే వారిని కఠినంగా శిక్షించాలి. ప్రస్తుతం జరుగుతున్న అవినీతికి, అక్రమ లావాదేవీలకు దాదాపు అన్నింటికీ రాజకీయ, ప్రభుత్వ వర్గాల అండదండలు ఉన్నాయి. అక్రమార్జనను, అక్రమ ఖర్చులను అరికట్టడానికి దృఢమైన రాజకీయ సంకల్పం కావాలి. అత్యున్నత స్థాయిలో రాజకీయ పార్టీలలో పూర్తిగా పరివర్తన రావాలి. రాజకీయ ఎన్నికల సంస్కరణలు రావాలి. నీతికి, నిజాయితీకి, నిస్వార్థ రాజనీతిజ్ఞతకు, జవాబుదారీతనానికి, పారదర్శకతకు పెద్దపీట వేయాలి. అప్పుడే ఈ అక్రమార్జన ప్రవాహం ఆగి ఈ జబ్బు నుండి ఉపశమనం లభిస్తుంది.

## 5. పాత పెద్ద నోట్ల రద్దుతో ఏమవుతున్నది?

ఒక కథ ఇందుకు సరిగ్గా అద్దం పడుతుంది. ఒక పెద్ద చెరువులో కొన్ని మొసళ్ళు ఉండేవి.

ఆ మొసళ్ళకు భయపడి చెరువుకు నీళ్ళ కోసం ఇతర జంతువులు వచ్చేవి కావు. కాబట్టి చెరువు యజమాని మొసళ్ళను చంపాలని భావించి, చెరువులోని నీటినంతటినీ వదిలేసినాడు. పర్యవసానంగా చెరువులోని చేపలు, కప్పలు, మిగిలిన చిన్న ప్రాణులన్నీ చనిపోయినాయి. మొసళ్ళు నీటి లోపల, నీటి బయట కూడా నడవగలవు కాబట్టి భూమి మీద ప్రాకి ఇంకో చెరువును చేరుకున్నాయి. ఇదే జరుగుతున్నది పాత నోట్ల రద్దుతో, పెద్ద పెద్ద నల్ల కుబేరులకు ఇలాంటి పరిస్థితులలో ఎలా బయటపడాలో బాగా తెలుసు. కాబట్టి వారు చాలా మంది తప్పించుకొనుచున్నారు. వారికి రాజకీయ అండదండలు కూడా ఉంటాయి. అవినీతి అధికారులు కూడా వారికి సహకరిస్తారు. వారెవరు డబ్బు కోసం వారానికి 4, 5 రోజులు క్యూలలో ఇబ్బందులు పడుతున్నట్లు ఎక్కడా అనుపించలేదు. అయితే సాధారణ ప్రజలు, ముఖ్యంగా రైతులు, దిన కూలీలు, చిన్న వ్యాపారులు, చిన్న హోటళ్ళు, వృద్ధులు, దివ్యాంగులు, రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నా, చితక జీవనోపాధులు ఛిన్నాభిన్నమవుతున్నాయి. నీటి బయట పడేసిన చేపల్లా గిలగిల కొట్టుకుంటున్నారు. రైతులు పంటను అమ్మడానికి లేదు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనడానికి లేదు. అన్ని రంగాలలోనూ కూలీలకు కూలీ పుట్టడం లేదు. నిర్మాణరంగం స్తంభించి పోయింది. చిన్న వ్యాపారాలు మూసేయవలసి వచ్చింది. బ్యాంకులో డబ్బున్నా రోగులు చచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. వందలాది మంది వృద్ధులు, రోగులు క్యూలలో నిలబడలేక చనిపోతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్లు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. పాలక, ప్రభుత్వ వర్గాలు పాతనోట్ల రద్దును సర్జికల్ స్ట్రైక్‌గా అభివర్ణించారు. కానీ ఇది మధ్యతరగతి, పేద వర్గాల మీద బ్లాంకెట్ బాంబింగ్‌గా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నది. రాజకీయ, ధనిక వర్గాలు తప్ప మిగిలిన జనాభా వారానికి మూడు నాలుగు రోజులు బ్యాంకుల, ఏటియంల ముందు క్యూలలోనే గడపాల్సివస్తుంది. బ్యాంకులో అకౌంటు లేకుండా ఉండే కూలీలు, చిన్న వ్యాపారులు ఆర్థిక వ్యవస్థ నుండి బయటకు నెట్టివేయబడి జీవనోపాదులు కోల్పోయి, నిరుద్యోగులుగా తిండి కోసం తిప్పలు పడుతున్నారు.

మన దేశంలో ప్రభుత్యోగులు 1.75 కోట్ల మంది ఉన్నారు. ప్రైవేటు సంస్థలలో (పరిశ్రమలు) 1.14 కోట్ల మంది ఉన్నారు. మొత్తంగా సంఘటిత రంగంలో (Organised Sector) 2.89 కోట్ల మంది మాత్రమే ఉన్నారు. ఇదే అసంఘటిత రంగంలో (Unorganised Sector) చిన్న ఉద్యోగులుగా, కూలీలుగా పనిచేసే వారు ఏకంగా 44 కోట్ల మంది ఉన్నారు. ఈ అసంఘటిత రంగంలోని 44 కోట్ల మందికి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. ఈ బాధలన్నీ కొన్ని నెలలలో తొలగిపోవచ్చునని చెపుతున్నారు. కానీ కొన్ని వర్గాలకు ఈ బాధలు కొన్ని సంవత్సరాల కాలం తప్పకపోవచ్చు. పాత పెద్ద నోట్ల రద్దు వలన ధన ప్రవాహం ఆగిపోతే ఈ ఇబ్బందులను ప్రజలు సహిస్తారు.

## 6. పాత నోట్ల రద్దు వలన ఎవరికి మేలు జరుగుచున్నది?

పాత నోట్ల రద్దు వలన ముఖ్యంగా బ్యాంకులకు మేలు జరుగుచున్నది. ప్రస్తుతం బ్యాంకులలో నిరర్థక ఆస్తులు (Non-Performing Assets) ఆమోద స్థాయికి మించి పెరిగిపోయాయి. విజయ మాల్యా లాంటి బడా పారిశ్రామికవేత్తలు లక్షల కోట్లలో బ్యాంకుల నుండి అప్పులు తీసుకుని మొండి బకాయిలుగా మిగిలిపోయారు. దానివలన బ్యాంకులు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి ప్రభుత్వం అదనపు పెట్టుబడిని బ్యాంకులకు ఇవ్వాల్సివస్తోంది. ఈ తరుణంలో పాత నోట్ల రద్దు మూలంగా ప్రజల దగ్గర చెలామణిలో ఉన్న నగదంతా బ్యాంకులకు చేరుతోంది. అంటే బ్యాంకులలో డిపాజిట్లు పెరిగి, నిరర్థక ఆస్తుల శాతం తగ్గిపోయి, సంక్షోభం నుండి బయటపడగలవు. అదనంగా పెద్ద నోట్ల రూపంలో ఉన్న నల్లధనం కొంత వివిధ మార్గాల ద్వారా తెల్ల ధనంగా మారుతోంది.

తద్వారా పన్నుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కొంత ఆదాయం పెరుగుతుంది. ఎంత మొత్తం ఈ విధంగా తెల్ల ధనంగా మారింది, ప్రభుత్వానికి పన్ను రూపంలో ఎంత అదనంగా వస్తుందనేది తెలుసుకోవాలంటే ఇంకొంత కాలం పడుతుంది. దీని మూలంగా తాత్కాలికంగా దేశస్థాయిలో ఉత్పాదకత తగ్గి జిడిపి వృద్ధి రేటు తగ్గుతుందని అందరూ ఒప్పుకుంటున్నారు. తిరిగి వృద్ధి రేటు ఎప్పుడు, ఎలా పుంజుకుంటుంది అనే దానిపై వాస్తవ అంచనాలు లేవు. దీర్ఘకాలంలో మంచి సత్ఫలితాలనిస్తుందని పాలక, ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి.

## 7. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ తొందరలో సాధ్యమా?

నల్ల ధన ప్రవాహాన్ని ఆపడానికి ప్రభుత్వం ఎంచుకున్న ముఖ్యమార్గం పాత పెద్ద నోట్ల రద్దుతో పాటు నగదు రహిత ఆర్థిక వ్యవస్థను వేగవంతంగా తీసుకుని రావడం. అంత వేగంగా నగదు రహితవ్యవస్థను సాధించడం సాధ్యమా? ప్రస్తుతం మనదేశంలోని జనాభా దాదాపు 130 కోట్లు అయితే, అందులో కేవలం 5 కోట్ల మంది మాత్రమే క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను కొన్ని లావాదేవీలకు మాత్రమమే ఉపయోగిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడగల సమాచార – సాంకేతిక పరిజ్ఞానం (Information and Communication Technology-ICT) మన దేశంలో ఉంది. అయితే అది కేవలం 5 శాతం మందికి అందుబాటులో ఉంటే 95 శాతం మందికి అది అందనంత దూరంలో ఉంది. ఈ వ్యత్యాసాన్ని డిజిటల్ డివైడ్ (Digital Divide) అంటారు. మన దేశంలో దాదాపు 50 శాతం జనాభా వాస్తవ నిరక్షరాస్యులుగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులు అందరికీ అందుబాటులో లేవు. అంతర్జాలం సదుపాయం (Internet) అందరికీ అందుబాటులో లేదు. సాంకేతిక మౌలిక సదుపాయాలు విస్తారంగా అభివృద్ధి చెందలేదు. స్మార్ట్ ఫోను (Smart Phone) లాంటి సాంకేతిక పరికరాల కొనుగోలు శక్తి అందరికీ లేదు. అసంఘటిత రంగంలో అధికంగా, నగదు ఆధార లావాదేవీలు ముఖ్యంగా రైతులు, వివిధ రంగాలలోని చిన్న పరిశ్రమలు, చేతివృత్తులు, గ్రామీణ వర్తకం, దిన కూలీలు, చిన్న మార్కెట్లు, చిన్న వ్యాపారులు, చిన్న హోటళ్ళు తదితరాలు ఉన్నాయి. ఇవి మన జనాభాలో అత్యధిక మందికి బ్రతుకుతెరువులుగా ఉంటూ ఆర్థిక వ్యవస్థలో కూడా సింహభాగంగా ఉన్నాయి. వీరందరూ చాలావరకు బ్యాంకులకు, సమాచార సాంకేతిక విప్లవానికి దూరంగా ఉంటున్నారు. కాబట్టి మన దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ తీసుకరావడానికి తీవ్రంగా ప్రయత్నించినా కొన్ని సంవత్సరాలైనా పడుతుంది. కాబట్టి ఇది సత్వర పరిష్కారం కావడానికి అవకాశం లేదు. ప్రస్తుతం ప్రపంచంలో స్వీడన్, నార్వే, డెన్మార్క్ లాంటి బాగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో మాత్రమే అధిక స్థాయిలో నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయి. ఇంకా అమెరికా, యూరప్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా దాదాపు 50 శాతం నగదు లావాదేవీలు జరుగుతున్నాయి.

## 8. అక్రమ సంపాదనను, నల్లధనాన్ని ఎలా అరికట్టాలి?

మొట్టమొదటగా మనం గుర్తించాల్సిన అంశాలు రెండు.

(1) మనదేశంలో నైతిక విలువల పతనం తారాస్థాయికి చేరింది.

(2) రాజకీయ వ్యవస్థ మరియు పెట్టుబడిదారీ వ్యవస్థ రెండు కలగలిసి ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడింది.

పై రెండు అంశాలు కలిసి పరస్పర అక్రమ పోషణతో మనదేశ ప్రజలలో అనైతికతను, అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని, రహస్య సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. మొదటగా చట్టాలను ఉల్లంఘించేది రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలే అనే భావన సాధారణ ప్రజలలో ఉంది. ఇటువంటి

పరిస్థితులలో అక్రమ సంపాదనకు అన్ని స్థాయిలలో ముగింపు కావాలంటే రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం దృఢమైన రాజకీయ సంకల్పం రావాలి, లేదా ఈ వ్యవస్థపై ప్రజలు తిరుగుబాటైనా చేయాలి. తద్వారా నైతిక విలువల పునరుద్ధరణ జరిగి రాజకీయ, ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలలో పరివర్తన జరగాలి. అంటే సమస్యను మూలాల నుండి పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అందుకు విడివిడి (Piece Meal) చర్యలుగాకుండా ఒక సమగ్రమైన బహుముఖ వ్యూహం కావాలి. రాజకీయ పార్టీల నిధుల సేకరణలోనూ, ఖర్చు పెట్టడంలోనూ పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం రావాలి. ఎన్నికల ఖర్చులను ప్రభుత్వమే భరించి పార్టీలు, వ్యక్తులు ఖర్చుపెట్టే విధానం పోవాలి. పారిశ్రామిక సంస్థలకు వనరులు, లైసెన్సులు, కాంట్రాక్టులు, రుణాల మంజూరు తదితర అంశాలు పూర్తి పారదర్శకంగా జరగాలి.

రాజకీయ వర్గాల లాలూచీతోనే విజయ మాల్యా, లలిత్‌మోడి లాంటి వాళ్ళు ప్రజాధనాన్ని దోపిడి చేసి ఇంగ్లాండుకు వెళ్ళిపోయి సుఖంగా ఉంటున్నారు. తారాస్థాయిలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్న రాజా, కనిమొళి, మారన్, కల్మాడీలు కూడా బాగానే ఉన్నారు. వారి కేసులు పరిష్కారమయ్యే వరకు వారు జీవించి ఉండకపోవచ్చు. ఇటువంటి వారిని కఠినంగా, త్వరగా శిక్షించే విధంగా చట్టాలు, అమలు వ్యవస్థలు ఉండాలి. వారికి సహకరించిన రాజకీయ నాయకులను, ప్రభుత్వాధికారులను కూడా కఠినంగా శిక్షించాలి. రాజకీయ అవినీతిని అరికట్టేందుకు ఉద్దేశింపబడిన లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను పటిష్టపరచి, కఠినంగా ఆచరణలోకి తీసుకునిరావాలి. సమాచార హక్కు చట్టానికి ఇంకా పదునుపెట్టి అన్ని స్థాయిలలో పారదర్శకత తీసుకునిరావాలి. రాజకీయ పార్టీలు సమాచార హక్కు క్రిందికి తీసుకునిరావాలి. అవినీతి నిరోధక చట్టాలు, అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, బంధుప్రీతికి బలైపోకుండా కఠినంగా అమలుచేయాలి. కాబట్టి చాలావరకు సమస్యకు మూలాలుగా ఉన్న మన రాజకీయ వ్యవస్థ, ఎన్నికల సంస్కరణలతో మొదలు కావాలి. అక్కడ నుండి అన్ని స్థాయిల నుండి గ్రామ స్థాయి వరకు సంస్కరింపబడాలి. ప్రస్తుతం "ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి" అనే నానుడి ఈ రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలకు చక్కగా వర్తిస్తుంది. అన్ని స్థాయిలలో సమన్వయంతో సుపరిపాలనను ప్రజలకు అందించాల్సిన బాధ్యత రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలపై ఉంది. కాబట్టి ఆ వ్యవస్థలు రెండూ ప్రక్షాళన చెంది, దేశానికి ఆదర్శంగా ప్రజాస్వామ్య విలువలను, నైతిక విలువలను ఆచరించి, చట్టాలను గౌరవించి, ఇతర వ్యవస్థలకు, ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలబడాలి. పైన చెప్పిన విధంగా పరివర్తన, సంస్కరణలు తీసుకుని రాకుండా కేవలం పెద్ద నోట్ల రద్దుతో మరియు నగదు రహిత వ్యవస్థ కోసం ప్రయత్నించడంతో సమస్యకు పరిష్కారం వస్తుందని భావించడం అసమంజసం, అసమగ్రం కూడా. ఇప్పటికే ఉన్న చట్టాలనుగానీ ముందుకు చేసే చట్టాలనుగానీ కఠినంగా యదార్థంగా రాజీపడకుండా అమలు చేస్తారనే నమ్మకం కూడా ప్రజలలో కల్పించాల్సి ఉంది.

దురదృష్టకరమేమిటంటే పెద్ద నోట్ల రద్దు తరువాత మీడియాలో జరుగుతున్న చర్చ కంటితుడుపుగా ఉంది. సమస్య మూలాల్లోకి వెళ్ళి సంస్కరణలు, శాశ్విత పరిష్కారాల వైపు పోవడం లేదు. రాజకీయ పార్టీలు చర్చలను శాసిస్తు, అప్రధాన అంశాల వైపు మళ్ళించి, ఒకరినొకరు తప్పుపట్టుకోవడంతో కాలాన్ని హరిస్తూ సరిపెడుతున్నాయి. రాజకీయ పార్టీలు రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనకు, ఎన్నికల సంస్కరణలకు సిద్ధంగా, మరింత చురుకుగా ప్రజల్లోకి చొచ్చుకునిపోవాల్సి ఉంది.

– డా॥ వై.వి.మల్లారెడ్డి, డైరెక్టరు,

ఏ.ఎఫ్.ఎకాలజీ సెంటర్, అనంతపురము.

## సప్త సముద్రాలు, షట్చక్రవర్తులు, సప్తఋషులు, ఏడు వింతలు, అష్టదిగ్గజాలు....

## కానీ ఒకే ఒక్క అనంతపురము

### అనంతపురం జిల్లా ప్రత్యేకతలు ప్రాముఖ్యాలు

### 1. ఎండబారిన (Arid) ఎడారి (Desert) అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితి :

అడుక్కు తినేవాడికి అవిటివాడు అవసరమైనట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి (విభజనకు ముందు తరువాత కూడా) అడుక్కోవడానికి చిక్కిన ఏకైక అవిటి జిల్లా అనంతపురము. రాష్ట్రానికి నీటి కోసం బచావత్ ట్రిబ్యునల్ ముందుగానీ, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందుగానీ, రాష్ట్ర అభివృద్ధి నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం ముందుగానీ, ప్రపంచ బ్యాంకు ముందుగానీ... అనంతపురము జిల్లా కరువును దారిద్ర్యాన్ని, వెనుకబాటుదనాన్ని ఎరగా చూపుతారు. తీరా కేటాయింపుకొచ్చేసరికి, తినే కూరలో కరివేపాకును తీసేసినట్లు తీసి ప్రక్కన పెడతారు. అందుకే అనంతపురము జిల్లా "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా వుంది.

అనంతపురము జిల్లా రాష్ట్రంలోనేగాక, మన దేశంలోనే అత్యధిక విస్తీర్ణం కల్గిన జిల్లాలలో ఒకటి. జిల్లా విస్తీర్ణము 19.13 లక్షల హెక్టార్లు (48 లక్షల ఎకరాలు). దీని భౌగోళిక పరిస్థితులు దేశంలోని ఏ ఇతర జిల్లాలతో పోల్చుకున్నా, భిన్నంగా, తీవ్రంగా, ప్రత్యేకంగా వుంటాయి. దక్షిణ భారతదేశంలో నట్టనడిబొడ్డున వుంటూ, "వర్షచ్ఛాయా ప్రాంతా"నికి కేంద్ర బిందువుగా అనంతపురము జిల్లా వుంది. దక్షిణ భారతంలోని వర్షచ్ఛాయా ప్రాంతము (Rain Shadow Area) అనంతపురం జిల్లా నడిబొడ్డు నుండి, అంటే కూడేరు, ఆత్మకూరు మండలాలు కేంద్రబిందువుగా, అతి తక్కువ వర్షపాతం 340 మి.మీ.తో మొదలై చుట్టూ వున్న కడప, కర్నూలు, చిత్తూరు, బళ్ళారి, చిత్రదుర్గ, తుముకూరు, చిక్కబళ్ళాపురు జిల్లాల వైపు వ్యాపిస్తూ, వర్షపాతం కొంత మెరుగవుతూ పోతుంది. అందుకే దక్షిణ భారతదేశంలోనే అత్యల్ప సగటు వర్షపాతం (552లి మి.మీ.) గల జిల్లాగా అనంతపురం జిల్లా వుంది. తూర్పున బంగాళాఖాతానికి, పశ్చిమాన అరేబియా సముద్రానికి, ఇరువైపులా 350 కి.మీ. సమదూరంలో వుంది. తూర్పున తూర్పు కనుమలు (నల్లమలై అడవులు) పడమర పడమటికనుమలకు కూడా దాదాపు సమాన దూరంలో వుండడం కారణంగా ఇటు నైరుతి ఋతుపవనాలు, అటు ఈశాన్య ఋతుపవనాలు కూడా అనంతపురం చేరే లోపల మేఘాలు బలహీనపడి వర్షాచ్ఛాయ / వర్షాభావ ప్రాంతంగా ఏర్పడిందని చెపుతుంటారు. జిల్లాలో నైరుతి వైపున ఉన్న మండలాలపైన నైరుతి ఋతుపవనాల ప్రభావం కొంత ఎక్కువగా వుండి వర్షపాతం కూడా కొంత మెరుగ్గా వుంటుంది. అలాగే ఆగ్నేయ మండలాలపైన ఈశాన్య ఋతుపవనాల ప్రభావం కొంత మెరుగ్గా వుంటుంది. వర్షాకాలం సాధారణంగా జూన్ నెల మొదటి వారంలో నైరుతి రుతుపవనాలతో మొదలవుతుంది. సెప్టంబర్ చివరి నాటికి నైరుతి ఋతుపవనాలు బలహీనపడతాయి. నైరుతి రుతుపవన కాలంలో దాదాపు 335 మి.మీ. సగటు వర్షం కురుస్తుంది. అక్టోబరు మొదటలో ఈశాన్య రుతుపవనాలు మొదలయి నవంబరు వరకు వుంటాయి. అయితే

బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్ల మీద ఆధారపడి ఈశాన్య రుతుపవనాల వర్షాలు ఉంటాయి. ఈ కాలంలో దాదాపు 157 మి.మీ. సగటు వర్షం కురుస్తుంది. కాబట్టి వర్షాధార పంటకాలము జూన్ నెల నుండి నవంబరు వరకు వుంటుంది. నవంబరు నుండి మే వరకు ఋతుపవనాల ప్రభావం వుండదు. కానీ ఎండాకాలంలో (మార్చి నుండి మే వరకు) కొన్ని అకాల వర్షాలు సాధారణంగా పడతాయి. ఎండాకాలంలో సగటు వర్షపాతం 64 మి.మీ. గా వుంటుంది.

అనంతపురం జిల్లా సగటు వర్షపాతం 552 మి.మీ. వున్నా ఇక్కడ "తేమ ఆవిరి" **(Potential Evapotranspiration, PET)** దాదాపు 2,000 మి.మీ.గా అంచనా వేయబడింది. నేల నుండి మరియు ఆకుల నుండి తేమ ఆవిరి కావడాన్ని "భాష్పీకరణ" లేదా తేమ ఆవిరి అంటారు. ఉష్ణోగ్రత వలన మరియు గాలి వీయడం వలన తేమ ఆవిరి అవుతుంది. చలికాలంలో (డిశంబరు-జనవరి) ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 13 నుండి 20 డిగ్రీల సెల్సియస్‌గానూ, అత్యధికంగా 25 నుండి 30 డిగ్రీలు గానూ వుంటాయి. ఫిబ్రవరి నుండి ఉష్ణోగ్రతలు పెరగటం మొదలై ఎండకాలంలో అత్యల్పంగా 25 నుండి 30 డిగ్రీలు అత్యధికంగా 35 నుండి 45 డిగ్రీల వరకు పోవచ్చు. తీవ్రమైన ఎండకాలం మార్చి నుండి మే నెల వరకు వుంటుంది. కాబట్టి ఎండకాలములో వేడికి, గాలికి తేమ ఆవిరి ఎక్కువగా వుంటుంది. అయితే వర్షాకాలంలో కూడా 35 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు మరియు గాలి కాలం కూడా తోడవటం వలన "తేమ ఆవిరి" ఎక్కువగా వుంటుంది. అనంతపురము జిల్లాలో లోతు తక్కువగా వున్న ఎర్ర నేలలు 80 శాతం, నల్లనేలలు 20 శాతం వున్నాయి. లోతు లేని ఎర్రనేలలలో వారం, పది రోజులలో తేమ ఆవిరైపోతుంది. అందుకే ఈ జిల్లా "ఎండబారిన" **(Arid District)** జిల్లాగా, ఎడారి జిల్లా **(Desert District)** గా కూడా పరిగణించబడింది. దక్షిణ భారతదేశంలో ఒక్క అనంతపురము జిల్లా మాత్రమే, ఎండబారిన ఎడారి జిల్లాగా కేంద్ర ప్రభుత్వము గుర్తించి 1993వ సంవత్సరంలో ఎడారి నివారణ పథకాన్ని **(Desert Development Program - DDP)** ప్రారంభించింది.

జిల్లాలోనే వర్షపాతంలో మండలాల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు వున్నాయి. అత్యల్పంగా ఆత్మకూరులో సగటు వర్షపాతం 340.9 మి.మీ. కూడేరులో 346.6 మి.మీ. చెన్నేకొత్తపల్లి 353.7 మి.మీ. వుండగా అత్యధికంగా బుక్కపట్నంలో 700.4 మి.మీ. ముదిగుబ్బలో 693.5 మి.మీ. వుంది. సగటు వర్షపాతానికి వాస్తవంగా కురిసే వర్షపాతానికి వ్యత్యాసము **(Deviation)** 30 శాతంపైగా (హెచ్చుతగ్గులు) వుంటుంది. మరియు క్రమరహితంగా, చెదురు ముదురుగా, అక్కడక్కడగా పడుతుంది. ఈ కారణాల వలన జిల్లాలో వర్షపాత పరిస్థితులు గ్రామాల మధ్య కూడా వ్యత్యాసము ఎక్కువగా వుంది. సాధారణంగా పదునుకు (20 మి.మీ) మించి వర్షం పడే "వర్షపు దినాలు" **(Rainy Days)** ఒక సంవత్సరంలో కేవలం 10 నుండి 20 వరకు వుంటాయి. వర్షాధార పంటకాలము జూలై-నవంబరు మధ్య వర్షపు రోజులు కేవలము 7 నుండి 15 రోజులు మాత్రమే ఉంటాయి. 20 మి.మీ. (పదును)కు మించి పడే వర్షాలే వర్షాధార పంటలకు ఉపయోగకరంగా వుంటాయి.

## ఇంత దౌర్భాగ్యము ఎక్కడైనా వుంటుందా?

అత్యధిక వర్షాధార భూమి కలిగి, అత్యల్ప వర్షపాతం కలిగి, మన యావత్ భారతదేశంలోనే అత్యధికంగా కరువుకు గురవుతున్న జిల్లాగా, ఎండబారిన జిల్లాగా, ఎడారి జిల్లాగా, ప్రసిద్ధి చెందింది ఒక్క అనంతపురం జిల్లా మాత్రమే. గత 16 సంవత్సరాలలో ఏకంగా 14 సంవత్సరాలు కరువులు వచ్చిన జిల్లా మనదేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా వుండదు.

తూ.గోదావరి, ప.గోదావరి, కృష్ణా, గుంటూరు లాంటి జిల్లాలలో ఒక్క సంవత్సరానికి మూడు

పంటలు పండుతుంటే, అనంతపురము జిల్లాలో 20 సంవత్సరాలలో కూడా మూడు పంటలు పండని పరిస్థితి! ఎంత దౌర్భాగ్యము!

ముఖ్యమైన సమస్య ఏమంటే ఒక వర్షానికి ఇంకొకవర్షానికి మధ్య వ్యవధి వరుపు **(Dry spell)** లేదా బెట్ట చాలా సందర్భాలలో 25 నుండి 45 రోజుల వరకు కూడా వుండటం వలన వరుస కరువులు, తీవ్ర కరువులు సంభవిస్తున్నాయి. పంటకాలములో (జూన్ నుండి నవంబరు వరకు) రెండు, మూడు తడవలుగా ఈ వరుపు / బెట్టలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం ఎంత వర్షపాతం పడింది అనేదానికంటే, వర్షపాతం పంటల ఎదుగుదలకు సరిపోయే విధంగా ఒక క్రమ పద్ధతిలో పడిందా అనేది ముఖ్యము.

ఈ మధ్యకాలంలో ఈ వరుపులు **(Dry Spells)** జూలై–సెప్టంబరు మధ్య కాలంలో ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ నెలలలో వర్షాధార పంటలు ఎదిగే దశలో వుంటాయి. కాబట్టి వరుపులకు తట్టుకోలేక కరువులకు కారణమవుతున్నాయి. కరువులు అన్ని మండలాలను దాదాపు సమానంగా కబలిస్తూ వుంటాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత 16 సంవత్సరాలలో, (1999 నుండి 2015 వరకు) కేవలం రెండు సంవత్సరాల (2000 మరియు 2007)లో మాత్రమే దాదాపు సాధారణ పంటలు పండినాయి. మిగిలిన 14 సంవత్సరాలు వివిధ మోతాదులలో కరువులు సంభవించినాయి. దీనిని బట్టి అనంతపురము జిల్లాలో వరుస కరువులు ఎంత తీవ్రంగా వున్నాయో అర్థమవుతుంది.

## 1.1 అనంతపురము జిల్లాలో అడవుల పరిస్థితి : చెట్లు లేని అడవి ఇక్కడ ప్రత్యేకం!

అనంతపురం జిల్లా విస్తీర్ణంలో 10 శాతం అడవి వున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. ఆశ్చర్యమేమిటంటే, ఇదంతా దాదాపు “చెట్లు లేని అడవి”! కేవలం 2 శాతం అడవి మాత్రం కొంత వృక్ష జాలంతో నిండి వుంది.

## 1.2 అనంతపురము జిల్లాలో నదుల పరిస్థితి : నీళ్లు లేని నదులు ఇక్కడే సాధ్యం!

అనంతపురం జిల్లాలో పెన్నా, చిత్రావతి నదులతో పాటు, పాపాగ్ని, వేదవతి (హగరి) నదులు ఉన్నాయి. వేదవతి మినహా మిగిలిన నదులన్నీ కర్నాటకలోని దేవనహళ్లి దగ్గరున్న నంది కొండల దగ్గర నుండి పుట్టుకొని వస్తాయి. ఒకప్పుడు ఈ నదులు సరాసరి మూడు సంవత్సరాలకొకసారి పారేవి. ఇప్పుడు 6 సం॥ నుండి 10 సంవత్సరాల కొకసారి మాత్రమే పారుతున్నాయి. అది కూడా ఆద్యంతము వరకు కాకుండా ఉధృతంగా వర్షము పడిన కొన్ని చోట్ల కొన్ని గంటల నుండి గరిష్టంగా రెండు మూడు రోజులు మాత్రమే సాధారణంగా పారుతాయి. భూగర్భ జలాలు పై పొరలలో పుష్కలంగా వున్న 1980 సం॥నకు ముందు ఈ నదులలో కొంత స్థాయిలో సజీవ ప్రవాహము కొన్ని నెలలుగా వర్షాకాలం నుండి ఫిబ్రవరి, మార్చి వరకు కూడా వుండేది. బోరు బావులు ఎక్కువై భూగర్భజలాలు అడుగంటిన కారణంగా, ఉధృతమైన వర్షాలు వచ్చిన చోట్ల మాత్రమే కొన్ని గంటలు ఈ నదులు పారుతున్నాయి.

## 1.3 అనంతపురము జిల్లాలో సాంప్రదాయ నీటి వనరులు : ఇన్ని సముద్రాలు, సాగరాలు, చెరువులు.... ప్రపంచంలో ఎక్కడా వుండవు!

బ్రహ్మ సముద్రము, చోళసముద్రము, బుక్కరాయ సముద్రం, రామసాగరం, కొత్త చెరువు, నల్ల చెరువు, రాయల చెరువు, దేవర చెరువు, కూడేరు, ఓ.డి. చెరువు, అంతరగంగ, కదదరకుంట... ఇలా అనంతపురం జిల్లాలో అనేక గ్రామాల పేర్లు నీటితో సంబంధం వుంటుంది. కానీ నీటికి మాత్రం కరువు వుంటుంది. అనంతపురం జిల్లాలో వున్న ముఖ్య నీటి వనరులు సాంప్రదాయ చెరువులు, కుంటలు.

ఇవి చాలా వరకు విజయనగర రాజుల కాలములో, అంటే 14-15 శతాబ్దాలలో కట్టినవి, నూరు ఎకరాలకు మించి సాగుబడి కల్గిన చెరువులు 303 వున్నాయి. నూరు ఎకరాలకు తక్కువ సాగుబడి కల్గిన చెరువులు 963 వున్నాయి. అదనంగా దాదాపు మూడు వేల చిన్న కుంటలు, చెక్‌డ్యాములు ఉన్నాయి. అనంతపురము జిల్లాలోని అన్ని చెరువుల, కుంటల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యము దాదాపు 20 టి.ఎం.సి.లు. 40 సంIIల క్రితం ఇవి సరాసరి మూడు సంవత్సరాలకొకసారి నిండేవి, నిండుతున్నాయి. జిల్లాలో భూగర్భ జలాలు పూరించడానికి ఏకైక వనరు ఈ చెరువులు, కుంటలు మాత్రమే. ఈ మధ్య కాలంలో ఈ చెరువులు కుంటలు ప్రత్యక్షంగా పంటలకు గాకుండా చాలా వరకు భూగర్భ జలాలను పూరించే ఊట చెరువులుగా మాత్రమే ఉపయోగపడుతున్నాయి. అయితే భూగర్భజలాల వినియోగం మాత్రము పూర్వం కంటే చాలా ఎక్కువగా వున్నది. అనంతపురం జిల్లాలో దాదాపు రెండు లక్షల నుండి రెండున్నర లక్షల బోరు బావులున్నాయి.

## 2. అనంతపురము జిల్లా జనాభా :

అనంతపురము జిల్లా జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 40,83,315. స్త్రీ, పురుష నిష్పత్తి ప్రతి వెయ్యి మంది పురుషులకు 977 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతం 64.28 వుండగా, పురుషులు 74.09 శాతం మరియు స్త్రీలు 54.31 శాతంగా వున్నది. గ్రామీణ జనాభా దాదాపు 30 లక్షలు, గ్రామీణ కుటుంబాలు దాదాపు 7.5 లక్షలు. దాదాపు 7 లక్షల రైతు కుటుంబాలు వుండగా వారిలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులు, ప్రధానంగా ఎస్.సి., ఎస్.టి మరియు బి.సి. వర్గాల వారు. మొత్తం జనాభాలో షెడ్యూలు కులాలు 14 శాతం, షెడ్యూలు తెగలు 3.5 శాతం ఉన్నారు. వెనుకబడిన వర్గాలు 50% శాతం (అంచనా) ఇతరులు 32.5 శాతం (అంచనా) వున్నారు.

## 3. అనంతపురము జిల్లా వ్యవసాయ భూమి : 25 శాతం మెట్ట భూమి ఒక్క అనంతపురం జిల్లాలోనే వుంది!

### 3.1 వరుస కరువులకు గురవుతున్న వర్షాధార భూమి :

అనంతపురం జిల్లాలో సాగుకు అనుకూలమైన భూమి **(cultivable land)** దాదాపు 12 లక్షల హెక్టార్లు (30 లక్షల ఎకరాలు) ప్రస్తుతం సాగులో వున్న భూమి 10.83 లక్షల హెక్టార్లు (27 లక్షల ఎకరాలు). అందులో పూర్తిగా వర్షాధారం క్రింద ఏకంగా 9.65 లక్షల హె, (24లక్షల ఎకరాలు) అంటే 89 శాతం! వరుస కరువులకు గురవుతున్న ఈ వర్షాధార భూమి మన జిల్లాలో దాదాపు 6 లక్షల కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. మొత్తం మన రాష్ట్రంలో 13 జిల్లాలలో వర్షాధారం పైన ఆధారపడిన భూమి 39.11 లక్షల హెక్టార్లు కాగా అందులో ఆశ్చర్యకరంగా 25 శాతం భాగం (9.65 లక్షల హె.) ఒక్క మన అనంతపురం జిల్లాలోనే వున్నది. మన ఒక్క జిల్లాలోని వర్షాధార భూమి శ్రీకాకుళం (1.41 ల.హె), విజయనగరం (1.71ల.హె), విశాఖపట్నం (2.23 ల.హె), తూ.గోదావరి (1.62 ల.హె). ప.గోదావరి (1.15 ల.హె), నెల్లూరు (0.9 ల.హె) - ఈ ఆరు జిల్లాలోని వర్షాధార భూమి మొత్తం 9.02 ల.హె. కంటే ఇంకా ఎక్కువగా (9.65 ల.హె) అనంతపురము జిల్లాలో వున్నది! ఆశ్చర్యంగా వుంది కదూ!

ఈ వాస్తవం తెలియని కొంత మంది ప్రభుత్వాధికారులు, ఇతర జిల్లాల రాజకీయ నాయకులలో కూడా ఒక దురభిప్రాయం వుంది. పంటల పెట్టుబడి రాయితీ, పంటల భీమా లాంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ఒక్క అనంతపురం జిల్లా వాళ్లే, మొత్తంగా దోచుకుంటున్నారనే దురభిప్రాయం వుంది. ఒక ముఖ్యమంత్రే ఈ దురభిప్రాయాన్ని నాతో వెలిబుచ్చినారు. ఒక్క అనంతపురం

జిల్లాలో వర్షాధార భూమి ఇతర ఆరు జిల్లాల కంటే ఎక్కువని, అంతేగాక గడచిన 14 సంవత్సరాలలో 12 సంవత్సరాలు కరువుకు గురైన జిల్లా కూడా ఒక్క అనంతపురమే అనీ, అందుకే విస్తీర్ణ ఆధారంగా ఎక్కువ పెట్టుబడి రాయితీ, పంటల భీమా మొత్తం సహజంగానే అనంతపురం జిల్లాకు కేటాయింపబడుతుందని సూటిగా చెప్పినాను. అంతేగాని ప్రభుత్వాలకు మా జిల్లా రైతులపై ప్రేమ ఎక్కువై మాత్రము ఎక్కువ మొత్తం కేటాయించడం లేదని తెల్పినాను.

వర్షపాతం పడే తీరును బట్టి **National Bureau of Soil Sciences & Land Use Planning (NBSS&LUP)** బెంగుళూరు వారు అనంతపురం జిల్లాలో మూడు స్థాయిలలో పంటల నిడివి **(Length of Growing Period)** (అంటే విత్తినప్పటి నుండి కోత వరకు పంటకాలం) అనుకూలంగా వుంటుందని సూచించినారు. దాని ప్రకారం పడమటి అంచున వున్న హీరేహాల్, బొమ్మనహాల్, విడపనహాల్, కనేకల్లు, రాయదుర్గం, గుమ్మగట్ట, అమరాపురం, అగలి మండలాలలో 70-90 రోజులు పంట నిడివి గల పంటలకు అనుకూలం. తూర్పువైపున పూర్వపు కదిరి తాలూకా లోని అన్ని మండలాల నుండి తాడిపత్రి, తాలూకాలలోని మండలాలలో 120-150 రోజుల పంటల నిడివికి అనుకూలం అని చెప్పడం జరిగింది. మిగిలిన అత్యధిక భాగం ఉత్తరం నుండి దక్షిణం వరకూ, నిలువునా, 44వ జాతీయ రహదారి కిరువైపుల వున్న మధ్య మండలాలలో 90-120 రోజుల నిడివిగల పంటలకు అనుకూలం అని తెల్పినారు. వర్షం పడే తీరును బట్టి, నేలలను బట్టి ఈ విధంగా విభజించడం జరిగింది.

## 3.2 గాలిలో దీపం లాంటి బోరు బావుల క్రింద నీటి సాగు :

ఇక నీటి సాగు భూమి తీసుకుంటే మన జిల్లాలో కేవలం 1.18 లక్షల హె. (3 లక్షల ఎకరాలు) మాత్రమే. అంటే మొత్తం సాగు భూమిలో 10.9 శాతం. మన రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ భూమి 67.19 లక్షల హెక్టార్లు. అందులో మొత్తం నీటిసాగు భూమి 28.08 ల.హె,. అంటే రాష్ట్రస్థాయిలో నీటిసాగు భూమి సగటు 41.8%. మొత్తం రాష్ట్రంలో సాగునీటి కింద వున్న భూమి 28.08 లక్షల. హె.లలో అనంతపురం జిల్లా వాటా 1.18 ల.హె.తో కేవలం 4 శాతం మాత్రమే! మొత్తం మన దేశంలోనే ఇంత తక్కువ నీటిసాగు కల్గిన జిల్లా వుండదంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఇందులో తుంగభద్ర ఎగువకాలువ క్రింద 20 వేల నుండి 30 వేల హెక్టార్లు మాత్రము నదీ జలాల నీటి సాగు వున్నది.

కాబట్టి మిగిలిన సాగు నీరు కూడా గాలిలో దీపం లాంటి భూగర్భజలాలపైన ఆధారపడినదే. భూగర్భజలాలను తోడడానికి రైతులే స్వయంగా బోర్లు వేయడానికి వేల కోట్లలో ఖర్చు పెట్టుకున్నారు. ఇంకా పెట్టుకుంటూనే వున్నారు. బోరు బావుల త్రవ్వకానికి గత 30 సంవత్సరాలలో రైతులు దాదాపు 6 వేల కోట్లు (ఇప్పటి ధరలలో) ఖర్చు పెట్టి వుంటారని అంచనా. ఒక పక్క వర్షాధార వ్యవసాయం విఫలం కావడం, ఇంకొక పక్క ఉన్న బోర్లు ఎండిపోవడంతో ఎక్కువగా కొత్త బోర్లు వేస్తున్నారు. 2015 సంవత్సరం మొదలులో దాదాపు 2 లక్షల బోరుబావులు పనిచేస్తుండగా 2015 ఎండాకాలంలో దాదాపు 1.5 లక్షల బోర్లు ఎండిపోయినట్లు అంచనా. తిరిగి అక్టోబరు, నవంబరు నాటికి వర్షాల కారణంగా లక్ష బోర్లు కొంత నీటితో పునరుద్దరింపబడినట్లు అంచనా. 30 సంవత్సరాల క్రితం ఒక్కసారి చెరువులు నిండితే దాదాపు మూడు సంవత్సరాల పాటు బోరుబావులలోనూ, దిగుడు బావులలో కూడా నీరుండేవి. ఇప్పుడు చెరువులు నిండిన సంవత్సరం మాత్రమే బోర్లలో నీరుండే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే భూగర్భ జలాల తోడడం విపరీతంగా పెరిగిపోయింది. అంటే బోరుబావుల క్రింద సాగు గాలిలో దీపం లాగా వుంటుందనడానికి ఇది నిదర్శనం. వరుస కరువులు, బోరు బావులు పదే పదే విఫలం కావడం వలననే అనంతపురం జిల్లాలో రైతులు పీకల లోతు రుణభారంలో మునిగిపోయి, 1999 నుండి 2015 మధ్యకాలంలో దాదాపు మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు.

## 4. అనంతపురం జిల్లాలో పరిశ్రమలకు శాశ్విత కరువు:

అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల కరువులు సర్వ సాధారణమైతే, పరిశ్రమలకు అన్ని ప్రభుత్వాలు శాశ్వితంగా కరువు ప్రకటించాయి. 42 లక్షల జనాభా వున్న జిల్లాలో భారీ మధ్య తరహా పరిశ్రమలలో ఉద్యోగులు కేవలం 4836** మంది. వారిలో కేవలం 711** మంది మాత్రమే మహిళా ఉద్యోగులు. ఇక ఫ్యాక్టరీల చట్టం క్రింద నమోదు కాబడిన పరిశ్రమలన్నింటిలోనూ కలుపుకుంటే కేవలం 21,285** మంది మాత్రమే ఉద్యోగులు వున్నారు. వారిలో కేవలం 2500** మంది మాత్రమే మహిళా ఉద్యోగులు.

అనంతపురం జిల్లాలో పరిశ్రమలకు అనేక అనుకూల పరిస్థితులున్నాయి. జిల్లాలో భూమి విస్తారంగా, చౌకగా, అవరోధాలు లేకుండా లభ్యమవుతుంది. మానవ వనరులు బాగున్నాయి. కేవలం 75 కి.మీ. దూరంలో బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, రైల్వేలైను, 44వ నంబరు నాలుగు లైన్ల రహదారి బెంగుళూరు – హైదరాబాదులనే కాకుండా దేశంలోని చాలా ముఖ్య పట్టణాలను కలుపుతుంది. అనంతపురం జిల్లాలో పరిశ్రమలు రాకపోవడానికి ప్రత్యేక ఆకర్షణీయ పారిశ్రామిక విధానాలు లేకపోవడం, తీవ్రమైన నీటికొరత, ఆధిపత్యపోరు, నిర్బంధ వసూళ్లు, సాంఘిక అభద్రత మొదలగునవి ముఖ్య కారణాలు. అనంతపురము జిల్లాలోని పారిశ్రామిక ఔత్సాహికులు కూడా ఇతర ప్రాంతాలకు పోయి పరిశ్రమలు స్థాపిస్తున్నారు. కానీ అనంతపురము జిల్లాలో పరిశ్రమలు స్థాపించదానికి ముందుకు రావడం లేదు. పరిశ్రమలు స్థాపించదానికి అనుకూల పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యమే పరిశ్రమల లేమికి కారణం.

**ముగింపు :**

పై విషయాలను గమనిస్తే అనంతపురము జిల్లా ప్రత్యేకత, ప్రాముఖ్యత అర్థమవుతుంది. ప్రకృతి శాపం కొంతైతే దశాబ్దాల పాలకుల శాపం అందుకు తోడైంది. పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు, పౌర సంస్థలు, మేధావులు, విషయ నిపుణులు ఏక లక్ష్యంతో పనిచేసినపుడే మన జిల్లాలో ఏదైనా మార్పు మొదలవుతుంది. పార్టీ రాజకీయాలకు, వర్గ రాజకీయాలకు అతీతంగా మన జిల్లా అభివృద్ధి కోసం ప్రాధాన్యతలు, ప్రాథమ్యాల విషయంలో ఏకాభిప్రాయం సాధించవలసి వుంది. అభివృద్ధి కోసం అన్ని పార్టీలు వర్గాలు, సంస్థలు కలిసి ఏకోన్ముఖులై పని చేయవలసి వుంది.

అయితే ఒక్క విషయం మాత్రం తీవ్రంగా పరిగణించాలి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు, లేదా రాయలసీమలోని ఇతర జిల్లాలతో పాటు మన జిల్లాను కూడా పాలకులు, ప్రభుత్వాలు ఒకటిగా భావిస్తే ఇక మన జిల్లా అభివృద్ధి గురించి శాశ్వితంగా మర్చిపోవచ్చు. అన్ని ప్రధాన రంగాలలోనూ వెనుకబడి వున్న మన జిల్లాకు నికర నదీజలాల కేటాయింపు, పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు మొదలగు విషయాలలో గట్టి రాజకీయ నిర్ణయాలు తీసుకొని తీవ్రమైన మినహాయింపులు **(exceptions)** ఇచ్చి అభివృద్ధి కోసం అవకాశాలు కల్పించినపుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

* జిల్లా సగటు వర్షపాతం 521 మి.మీ. 544 మీ.మీ. 552 మీ.మీ. ఇట్లా వేర్వేరు చోట్ల చెప్తుతుంటారు. ప్లానింగ్ శాఖ, వాతావరణ శాఖ వారు సరాసరి లెక్కించే సంవత్సరాలను బట్టి, మరియు ఆ శాఖ క్రింద ఉన్న **Rain Gauge Sations** ను బట్టి కొంత తేడాలు వుండడం సాధారణమే. ఈ తేడాలకు ఏమి ప్రాముఖ్యత లేదు.

**** According to Hand Book of Statistics 2010 of Anantapur District.**

తేదీ : 13-12-2015

# రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి కోసం ఏకైక చివరి అవకాశం.ఇప్పుడు మేల్కొకనపోతే భవిషత్తు శూన్యమే !

**వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక కోసం ఒక సాధికార కమీషన్ వెంటనే వేయాలి.**

**1. పరిచయము :**

**ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టము 2014లోని క్లాజులు :**

94 (1) రెండు రాష్ట్రాలలోను పరిశ్రమలు స్థాపించడానికి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి పన్ను మినహాయింపులతో సహా తగిన ఆర్థిక చర్యలు రెండు రాష్ట్రాలలోనూ కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది.

94(2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం భౌతిక, సాంఘిక, మౌలిక సదుపాయాల కల్పనతో సహా అవసరమైన ఇతర కార్యక్రమాలను, కేంద్ర ప్రభుత్వము చేపడుతుంది.

పై రెండు క్లాజుల ముఖ్య ఉద్దేశ్యము రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసి, సమతుల, సమగ్ర అభివృద్ధితో పాటు, ప్రాంతీయ సమన్యాయం సాధించడం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా (స్పెషల్ కేటగిరి స్టేటస్) ఇస్తామని అప్పటి ప్రధాని శ్రీ మన్‌మోహన్‌సింగ్ చేసిన ప్రకటనతో పాటు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వము నడుపుతున్న బి.జె.పి. కూడా 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని పదే పదే ప్రకటనలు చేస్తూ వారి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగింది.

రాష్ట్ర విభజన చట్టములోని పై రెండు క్లాజులు మరియు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో లభించే వెసులుబాటును కలుపుకొని రాయలసీమ మరియు ఉత్తరాంధ్రల వెనుకబాటును అధిగమించి సమతుల అభివృద్ధి సాధించడానికి అరుదైన అవకాశాలు కల్పిస్తున్నాయి. పునర్వ్యవస్థీకరణ చట్టములోనే ఇటువంటి వెసులుబాటు ఉండడం మరియు పాలక, ప్రతిపక్షాలు రెండూ కూడా ప్రత్యేక హోదాకు అనుకూలంగా వుండడం ఒక అరుదైన అవకాశం. ఈ అరుదైన అవకాశాన్ని పోగొట్టుకుంటే, తిరిగి ఇటువంటి అవకాశము మరెప్పుడూ రాకపోవచ్చు.

అయితే ప్రభుత్వపరంగా ఈ అరుదైన అవకాశానికి సంబంధించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి దిశగా కార్యాచరణ లేకపోవడం చాలా దురదృష్టం. ఈ అవకాశం రాయలసీమకు, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు మరియు ఉత్తరాంధ్ర జిల్లాలకు వున్న ఒక్కగానొక్క అవకాశం. ఈ అవకాశాన్ని జార విడుచుకుంటే , వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్రల భవిష్యత్తు అంధకారమే. దేశంలోనే అత్యంత వెనుకబాటుకు, నిర్లక్ష్యానికి గురైన అనంతపురము జిల్లా అభివృద్ధి గురించి ఇక ముందు ప్రస్తావించవలసిన అవసరం కూడా ఉండకపోవచ్చు.

మన రాష్ట్రంలో విభజనకు ముందుగానీ, తరువాత గానీ వెనుకబడిన ఆప్రాంతాల సమతుల అభివృద్ధి కోసం ఒక సమగ్ర ప్రణాళిక లేదు. అవి ఎందుకు వెనుకబడి వున్నాయో, మూల కారణాలేమో

శాస్త్రీయంగా నిపుణులతో సమగ్ర విశ్లేషణ కూడా లేదు. ఎక్కడికి చేరాలనే గమ్యం తెలియనపుడు, ఏ బస్సునైనా ఎక్కవచ్చు అన్న నానుడిలాగా ఎవరికి తోచింది వారు ఏదో కావాలని ప్రభుత్వాలను అడుగుతుంటారు. ఆ **(piece meal** ) విధంగా వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యంకాదు. అందుకే ప్రథమంగా ఒక సమగ్ర ప్రణాళిక కావాలి. అటువంటి ఒక సమగ్ర సాధికార ప్రణాళిక రచన కోసం ఒక సాధికార కమీషన్‌ను వెంటనే నియమించాలి. ఆ సాధికార కమీషన్‌లో సాగునీరు, వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు మొదలగు రంగాల నిపుణులు సభ్యులుగా ఉండాలి. 6 నెలలు లేదా ఒక సంవత్సరకాలంలో వెనుకబడిన ప్రాంతాల సమగ్ర, సమతుల్య అభివృద్ధి కోసం ఒక సాధికార ప్రణాళికను రచించాలి.

## 2. కొత్త రాజధాని మరియు పట్టిసీమపై చూపిస్తున్న అత్యుత్సాహములో కొంత భాగమైనా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధిపై చూపించకపోవడం అభద్రతా భావాన్ని ,అనుమానాలను, రాయలసీమలో ఆవేశాలను కూడా కల్పిస్తున్నది.

ప్రభుత్వము అత్యుత్సాహముతో దృష్టి అంతా రాజధాని మరియు పట్టిసీమ అంశములపైనే పెట్టి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం ముఖ్యంగా రాయలసీమ వాసులలో అభద్రతాభావానికి, అనుమానాలకు దారి తీస్తున్నది. అందుకు ప్రతి స్పందనగా మిగిలిన రాజకీయ పార్టీలు కూడా రాజధానితో, పట్టిసీమతో ముడిపడిన సమస్యలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గూర్చి తగినంతగా ఏకరువు పెట్టకపోవడమూ రాయలసీమవాసులను బాధిస్తున్నది. ప్రపంచస్థాయి రాజధాని నిర్మిస్తే మిగిలిన సమస్యలన్నీ తీరిపోతాయనే విధంగా, పట్టిసీమ నిర్మిస్తే రాయలసీమ సస్యశ్యామలమవుతుందనే విధంగా ప్రభుత్వ తీరు వుండడం సాధారణ ప్రజలకు పట్టిసీమ విస్మయాన్ని కల్గిస్తున్నది. పాలనావసరాలకు అవసరమైన రాజధాని కావాలని అందరూ కోరుకుంటున్నారు. అదనంగా తొమ్మిది ఉపరంగాలను అనగా విద్య, వైద్య, న్యాయ, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, సేవా సంస్థలు మొదలగు అన్ని రంగాల అభివృద్ధి కూడా రాజధాని చుట్టూ జరగాలని ప్రణాళికలు రూపొందించడం అనేక విమర్శలకు అనుమానాలకు దారితీస్తున్నది. అదనంగా కోస్తా పారిశ్రామిక కారిడార్ ( **Coastal Industrial Coridar** ) ఓడరేవుల అభివృద్ధి మొదలగు వాటికి అధిక ప్రాధాన్యతతతో తీవ్ర ప్రయత్నాలు జరుగుచున్నవి. అంతేకాక 13వ షెడ్యూలులో కనబరచిన వివిధ సంస్థలు, హాస్పిటల్స్, మౌలికవసతుల కల్పనలో కూడా కోస్తా ప్రాంత జిల్లాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతున్నది. పై ధోరణి రాయలసీమ జిల్లాలను ముఖ్యంగా అనంతపురం జిల్లాను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన నెలకొని ప్రజలలో తీవ్ర నిరాశ నిస్పృహలను రేకెత్తిస్తున్నాయి.

## 3. ప్రత్యేక రాయలసీమరాష్ట్ర వాదన సాధారణ ప్రజలలో బలపడుచున్నది :

పైన చెప్పిన ధోరణులతో పాటు, హంద్రీనీవా, గాలేరు-నగరి లాంటి సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాయలసీమ తీవ్ర వివక్షకు, నిర్లక్ష్యానికి గురి అవుతున్నట్లు భావించడం జరుగుచున్నది. హంద్రీనీవా, గాలేరు నగరి లాంటి సీమ ప్రాజెక్టులను ప్రక్కన పెట్టి, పట్టిసీమకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుచున్నది. తద్వారా ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, కోస్తా నాయకుల ధోరణి చూస్తుంటే ఆంధ్ర ప్రాంతముతో కలిసి వుంటే, తిరిగి మోసపోతామని, ప్రత్యేక రాష్ట్రం వస్తేనే రాయలసీమ అభివృద్ధి అవుతుంది అనే వాదనకు బలం చేకూరుతున్నది. ఇటువంటి భావన సాధారణ ప్రజలతోపాటు, పాలక పక్షంతో సహా, అన్ని రాజకీయ పార్టీల నాయకులలోనూ, మేధావులలోనూ, పౌరసంస్థలలోనూ కూడా బలపడుతున్నది.

రాజధాని నిర్మాణానికి పాలనావసరాలకు అనుగుణంగా నిర్మించుటకు ప్రాధాన్యతనిచ్చి పరిశ్రమల వికేంద్రీకరణకు, సాగునీటి పంపిణీలో అసమానతలు తగ్గించడానికి, మౌలికవసతుల కల్పనలో, కేంద్ర సంస్థల కేటాయింపులు, మొదలగు అంశాలలో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన సమయమిది. రాయలసీమ జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలు ఏ ఏ రంగాలలో వెనుకబడి వున్నాయో శాస్త్రీయ అధ్యయనం చేసి, కోస్తా జిల్లాలకు ధీటుగా వెనుకబడిన జిల్లాలను అన్ని రంగాలలోనూ సమగ్ర అభివృద్ధి చేయడానికి తగిన విధాన నిర్ణయాలతోపాటు ప్రాంతీయ న్యాయం దృష్టితో నిర్దిష్ఠ ప్రణాళికలు రూపొందించాల్సిన సమయమిది. ప్రాంతీయ సమతుల సమగ్ర అభివృద్ధికి అత్యవసర ప్రాధాన్యత ఇచ్చి తగిన ప్రణాళికలు రూపొందించడానికి, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక సాధికార కమీషన్‌ను నియమించాల్సిన సమయమిది. ఈ అంశాలపైన పౌర సమాజంతో ముఖ్య శ్రద్ధదారులైన రైతులు, నిరుద్యోగులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, మేధావులు మొదలగు వారితో చర్చించాల్సిన సమయమిది. అటువంటి చర్యలేవీ తీవ్రంగా తీసుకోకపోవడం ప్రాంతీయ వాదాన్ని బలపరుస్తూ, చాలా నిరాశ నిస్పృహలను మరియు ఆవేశాలను కూడా కల్గిస్తున్నది.

## 4. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పొరపాట్లనే తిరిగి చేస్తున్నాము :

గత 25 సంవత్సరాలుగా అన్ని రంగాల అభివృద్ధి హైదరాబాదు చుట్టూ కేంద్రీకృతమై జరగడం ద్వారా విభజన కారణంగా మనం హైదరాబాదు కోల్పోయి చాలా నష్టపోవడం జరిగింది. అట్లాకాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ జరిగి రాయలసీమ, ఉత్తరాంధ్రలలో కూడా సాగునీరు, వ్యవసాయం, పశుపోషణ, పాడి అభివృద్ధి, పరిశ్రమలు, పర్యాటక రంగము, పట్టణాల అభివృద్ధి, సంస్థల అభివృద్ధి మొదలగు రంగాలలోని సమతుల అభివృద్ధి జరిగివుంటే, తెలంగాణా విడిపోయినా మనము ఇప్పుడు ఈ దుస్థిలో వుండేవాళ్ళము కాదు. కేంద్రీకృత అభివృద్ధి అనే పెద్ద పొరపాటు నుండి మరి విభజనానంతరం ప్రస్తుత దుస్థితి నుంచి మనం ఏమి పాఠము నేర్చుకున్నట్లు? తిరిగి అన్ని రంగాల అభివృద్ధి రాజధాని చుట్టూ, లేదా ఇప్పటికే అన్ని రంగాలలోనూ అభివృద్ధిలో ముందున్న కోస్తా ప్రాంతములోని 4 జిల్లాలలో కేంద్రీకరించడం ఏ విధంగా సమంజసము? తెలంగాణా నుండి సీమాంధ్రను విడగొట్టినట్లే, కోస్తాంధ్ర నుండి రాయలసీమ, ఉత్తరాంధ్రను కూడా ముందుకు విడగొడతారనే భావన బలంగా నెలకొనుచున్నది.

స్వాతంత్ర్యానికి పూర్వము నుండి కూడా రాయలసీమ ప్రజలకు కొంత కోస్తా ప్రాంత నాయకులపై అపోహలున్న మాట వాస్తవం. శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘనతోపాటు, సాగు నీటి విషయంలోనూ, ప్రాంతీయ అసమానతలు తొలగించే అనేక విషయాలలో నిర్లక్ష్యానికి గురై అనేక విధాలుగా మోసపోతున్నామనే భావన బలంగా వుంది.

ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, ప్రయత్నాలు, అటువంటి భావనను తొలగించే బదులు ఇంకా బలపర్చేవిగా ఉంటున్నాయి. తద్వారా రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్దేశ్యంతో పౌర సమాజం నుండి అనేక చిన్నా, చితక సంస్థలు పుట్టుకొస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలలోనూ అంతర్గతంగా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కావాలనే వారు పెరుగుతున్నారు. మేధావులలోనూ, రచయితలు, కళాకారులలోనూ, పౌరసంస్థలలోనూ, చివరకు సాధారణ ప్రజలలో కూడా ఇటువంటి భావన బలపడే పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి.

## 5. రాష్ట్రాన్ని మరియొక్కసారి విడగొట్టడం పరిష్కారం కాకపోవచ్చు :

ఇప్పటికే తెలంగాణా-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అనేక వివాదాలు నిత్యమూ నడుస్తున్నాయి.

మహారాష్ట్ర, కర్ణాటకలతో చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల వివాదాలు ముందునుంచి వుండనే వున్నాయి. ప్రత్యేక రాష్ట్రంగా రాలయసీమ విడిపోతే మరిన్ని వివాదాలు, భావోద్వేగాలు పెరిగి, సంక్లిష్టత పెరిగి, పరిస్థితి మరింత జటిలం కావడం ఖాయం. తెలుగు ప్రజల మధ్య వివాదాలు, వైషమ్యాలు, ఉద్వేగాలతో దూరం పెరగడం కూడా ఖాయం. తద్వారా రాయలసీమకు ఏమైనా ప్రయోజనాలు ఉంటాయని అనుకుంటే పొరపాటు కావచ్చు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమేర్పడితే కొంతవరకు యిప్పుడున్న ఆవేశాలు చల్లారవచ్చు. కానీ నీటి వనరులు, విద్యుచ్ఛక్తి, సంస్థలు, రాష్ట్రఅప్పులు, ఇతర ఉమ్మడి ఆస్తుల పంపకాలలోనూ, నిర్వహణలోనూ ఏకాభిప్రాయం వచ్చే పరిస్థితే వుండకపోవచ్చు. ముఖ్యంగా నదీ జలాలు, విద్యుచ్ఛక్తి లాంటి కీలక వనరుల అనుదిన నిర్వహణలో అనేక వివాదాలు, ఆవేశాలు ఏర్పడతాయి. మూడు రాష్ట్రాల తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు, కొట్లాటలు నిత్యకృత్యంగా చోటు చేసుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు.

శాస్త్రీయంగా ఆలోచిస్తే సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో చిన్న రాష్ట్రాలు శ్రేయస్కరం కానేకాదు. పెద్ద పెద్ద దేశాలు కూడా ఆర్థిక సమాఖ్యలుగా కలిసిపోయి, వనరులను జోడించుకొని, ఖర్చులు తగ్గించుకొని ఏవిధంగా ప్రపంచ పోటీకి తట్టుకోవాలని తీవ్రంగా ఆలోచన చేస్తున్న సందర్భం. ఒక్కొక్క దేశానికీ ఉన్న వనరులను ఇతర దేశాలవనరులతో జోడించి, సమన్వయం చేసుకొని, అన్ని దేశాలు సమతుల్యంగా అభివృద్ధి చెందే విధంగా సమిష్టిగా, సమాఖ్యలుగా సహకరించుకుంటున్న సందర్భం. యూరోపియన్ యూనియన్, బ్రిక్స్, ఆఫ్రికా ఫోరం, ఆసియా ఫోరం లాంటి అంతర్జాతీయ సమాఖ్యలుగా కలయికలు జరుగుతున్న సందర్భం. విద్వేషాలతో విడిపోయి భేషజాలతో చీటికి మాటికి కొట్లాడుకుంటూ, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొడుతూ, అనాగరికంగా తిరోగమించడం ఏ మాత్రం సమంజసం కాదు. విజ్ఞత అంతకంటే కాదు. చిన్న రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహణ ఖర్చులను, రాజధాని నిర్మాణం, ఇతర మౌలిక వసతులకయ్యే ఖర్చులను భరించలేవు. గవర్నర్లు, మంత్రివర్గాలు, ఉద్యోగ వర్గాలకు అయ్యే జీతభత్యాలు కూడా భారమైపోయే పరిస్థితి. ఇక అభివృద్ధి ఎట్లా సాధ్యమౌతుంది?

## 6. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వము చేపట్టవలసిన కనీస చర్యలు :

### 6.1 వెనుకబడిన ప్రాంతాల ప్రజలలో నమ్మకాన్ని కల్గించే చర్యలు వెంటనే చేపట్టాలి.

అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా, ప్రాంతీయ అవసరాలకనుగుణంగా, ప్రాంతీయ అసమానతలు తొలగిపోయే విధంగా, ప్రభుత్వ విధి విధానాలు, ప్రణాళికలు, ప్రాధాన్యతలు, కార్యక్రమాలు రూపొందించవలసియున్నది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల సాధారణ ప్రజలలో తమ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కట్టుబడి చిత్తశుద్ధితో, రాజకీయ సంకల్పంతో తీవ్రంగా పనిచేస్తున్నాయనే నమ్మకాన్ని కల్గించవలసివుంది. ముఖ్యంగా గమనించాల్సిన అంశము ఏమంటే, ప్రభుత్వాలపైన రాజకీయ పార్టీల పైన ప్రజలకు నమ్మకము బాగా సన్నగిల్లింది. తెలంగాణా విడిపోయే సందర్భంలో వివిధ పార్టీల హామీలు, అదే సమయంలో వచ్చిన ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు గుప్పించిన హామీలు, కొత్త ప్రభుత్వాలు, ఏర్పడి ఒకటిన్నర సంవత్సరమైనా నెరవేరని హామీలు మొదలగు పరిణామాలు రాజకీయ వ్యవస్థలపై ప్రజలలో నమ్మకాన్ని మరింత దిగజార్చినాయి. కాబట్టి కేవలం మాటలద్వారా గాకుండా నిర్దిష్ట చర్యల ద్వారా ప్రజలలో నమ్మకాన్ని కల్గించవలసి వుంది. ఇప్పటికే అభివృద్ధి లో ముందున్న కోస్తా ప్రాంత నాయకులు, మరియు ఆ ప్రాంత ప్రజల ఆలోచనలలో కూడా ఒక పరివర్తన రావాల్సిన అవసరముంది. ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి, సమ్మిళితంగా,

అన్ని ప్రాంతాల ప్రజలు సగౌరవంగా జీవించడానికి అవసరమైన చర్యలు, విధానాలు రూపకల్పనలో వారు చొరవ చూపించాల్సిన అవసరముంది. ముఖ్యమంత్రి ఏ ప్రాంతం వారైనా “రాజకీయ పలుకుబడి” కోస్తా ప్రాంతం చేతుల్లో వుంటుందనే భావన, నదీజలాల కేటాయింపుల వంటి కీలక అంశాలలో వారి మాటే చెల్లుతుందనే భావన సాధారణ ప్రజలలో వున్నది. కాబట్టి వారు ప్రాంతీయ అసమానతలు తొలగించి, అన్ని ప్రాంతాలకు న్యాయం చేయడానికి, ఆ దిశగా ఇచ్చి -పుచ్చుకోవడానికి సిద్ధంగా వున్నామనే భావన కల్గించాలి. వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి పరచడానికి ఆర్థిక వనరులతోపాటు, సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, సంస్థలు మొదలగు వాటిని సమన్యాయంగా పంచుకోవడానికి రాజకీయ నిర్ణయాలు, త్వరగా తీసుకొనవలసి వుంది. ఉదాహరణకు – ప్రాంతాల వారీగా నీటి కేటాయింపులు, మొదలగునవి రాజకీయ సంకల్పానికి, కఠినమైన రాజకీయ నిర్ణయాలకు సబంధించిన అంశాలు. నదీజలాల వినియోగంలో పైతట్టు ప్రాంతములలోని ప్రాజెక్టులు పూర్తి కానపుడు మిగులు జలాలను కోస్తా ప్రాంతం వారు సహజంగానే ఇప్పటి వరకు అధికంగా వాడుకుంటున్నారు. సమన్యాయం ప్రాతిపదికగా నీటి కేటాయింపులు చేసినపుడు, అటువంటి కొన్ని నిర్ణయాలు కోస్తా ప్రాంతీయులకు కొంత అసౌకర్యంగా కూడా వుండవచ్చు. సమతుల అభివృద్ధి లక్ష్యంగా కీలక వనరుల కేటాయింపులు లేకుండా, సమన్యాయం ప్రాతిపదికగా రాజకీయ  నిర్ణయాలు లేకుండా, కేవలం తూతూ మంత్రంగా, అప్పుడు కొన్ని- ఇప్పుడు కొన్ని చిన్నా చితక కార్యక్రమాలకు కొన్ని నిధులను కేటాయించడము ద్వారా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి .జరుగదు. ప్రభుత్వాలు, పార్టీలు, రాజనీతిజ్ఞతతో ఆలోచించి, రాజకీయ సంకల్పంతో తగిన చర్యలు చేపట్టవలసి వుంది. లేకపోతే పరిణామాలు చేయి దాటిపోయి తీవ్రంగా వుండవచ్చు.

## 6.2 రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల సమతుల, సమగ్రాభివృద్ధి ప్రణాళిక కోసం వెంటనే ఒక సాధికార కమీషన్ వేయాలి :

వెనుకబడిన ప్రాంతాలలో జిల్లాల వారీగా వివిధ రంగాలపై లోతుగా అధ్యయనం చేసి, వెనుకబాటుతనానికి మూల కారణాలను గుర్తించి, అన్ని జిల్లాలకు సమన్యాయం, సమగ్ర సమతుల అభివృద్ధి సాధించడానికి ప్రతిజిల్లాకు విడివిడిగా నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేయవలసి వుంది. అటువంటి నిర్దిష్ట సమగ్ర ప్రణాళికలు తయారు చేయడానికి కీలక రంగాలలో నిపుణులతో కూడిన ఒక సాధికారక కమీషన్‌ను వేయవలసి వుంది. వ్యవసాయం, సాగునీరు, పశుపోషణ, పాడి అభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, గ్రామీణ జీవనోపాధులు, సేవా సంస్థలు, మానవ వనరులు మొదలగు అంశాలలో నిపుణులను, అనుభవజ్ఞులను ఆ కమీషనులో సభ్యులుగా చేర్చి “జిల్లా బహుళ రంగ సమతుల అభివృద్ధి ప్రణాళికా కమీషన్ ( **District Multi-Sectoral Planning Commission for Equillable Development** ) ని వేయవలసి వుంది. ఆ కమీషన్ విస్తృతంగా వివిధ వర్గాల ప్రజలతోనూ, సంబంధిత అందరు శ్రద్ధదారులతోనూ ప్రజాప్రతినిధులతోనూ, రాజకీయ పార్టీలతోనూ, మేధావులతోనూ, నిపుణులతోనూ లోతుగా చర్చలు జరిపి, సమస్యలను అర్థము చేసుకొని, ప్రజల భాగస్వామ్యముతో వారి స్థూల ఆమోదముతో జిల్లాలవారి ప్రణాళికలు తయారు చేయవలసి వుంది. ప్రస్తుతము అమలు జరుగుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఎందుకు ఇవ్వడం లేదో కూడా కమీషన్ అధ్యయనం చేయవలసి వున్నది. కార్యక్రమాలలోని లోపాలను సరిదిద్దడంతో పాటు, కార్యక్రమాలు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, సాంఘిక పరిస్థితులు నిర్దేశించవలసి వున్నది.

ఇటువంటి ఒక సాధికార ప్రణాళిక ప్రతి జిల్లాకు లేనపుడు అభివృద్ధి సాధ్యం కాదు. చిన్నాచితకా కార్యక్రమాలతో, పిల్లలకు ఏడుపు మాన్పడానికి ఇచ్చే పప్పులు-బెల్లంలాగా కొన్ని నిధులను అప్పుడప్పుడు విడుదల చేయడం ద్వారా శాశ్వత సమగ్ర అభివృద్ధి సాధ్యంకాదు. ప్రాధాన్యతలతో కూడిన నిర్దిష్ట ప్రణాళికలు లేకుండా కేవలం " అధికంగా "నిధులివ్వండని ప్రభుత్వాలను అడగడం భావ్యం కాదు. ఈ విధంగా గత 70 ఏండ్లుగా నానా రకాల కార్యక్రమాలు ముక్కలు ముక్కలుగా **(piece meal )** అమలౌతున్నాయి. కానీ జిల్లాలు అభివృద్ధి కాలేదు. అందుకే ఒక సమగ్ర సాధికార అభివృద్ధి ప్రణాళిక తప్పనిసరి. అటువంటి ప్రణాళికలు అమలు చేయుటకు అవసరమైన విధానాపరమైన నిర్ణయాలను తీసుకొని వనరులను కేటాయించి, ప్రణాళికలు ఆమలు చేయమని అడగడం, సాధించడం, జరిగిప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు పోవడం జరుగుతుంది.

## 6.3 పునర్వ్యవస్థీకరణ చట్టము 94వ నిబంధన ప్రకారము సమగ్ర ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వంతో రాజీలేని లాబియింగ్ చేసి సాధించాలి :

ఆ విధంగా తయారు చేసిన సమగ్ర సమతుల అభివృద్ధి ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టములోని 94వ నింబంధన క్రింద ఉన్న క్లాజుల ఆధారంగా, ప్రత్యేక హోదా ఆధారంగా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో లాబీయింగ్ చేయవలసి వుంది. తద్వారా సమగ్ర ప్రణాళిక అమలు గరిష్టంగా 5 సంవత్సరాల కాలవ్యవధి నిర్ణయించి, అవసరమైన నిధులను, కేంద్ర ప్రభుత్వల నుండి సమీకరించవలసి వుంది. ఈ ప్రయత్నాలు గట్టిగా జరిగి, కేంద్ర -రాష్ట్రప్రభుత్వాలు, నాబార్డు, బ్యాంకులు లాంటి ఇతర సంస్థలు సానుకూలంగా స్పందించి, ఆ దిశగా క్షేత్రస్థాయిలో చర్యలు కనపడినపుడు మాత్రమే ప్రజలలో ప్రభుత్వాలపైన, రాజకీయ వ్యవస్థలపైన విశ్వాసం ఏర్పడుతుంది. ఉత్తుత్తి మాటలతో, దిన దిన వాగ్దానాలతో ప్రజలలో నమ్మకం పెరగదు. ప్రణాళిక తయారు చేయుటలో భాగస్వామ్యం వహించినట్టే దానిని అమలు చేయడంలో కూడా భాగస్వామ్యం వహించే విధంగా ప్రజలను, ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను, రాజకీయ పార్టీలను, ఇతర సంస్థలను కూడా సమాయత్త పరచవలసి వుంది.

## 6.4 ముగింపు

తక్షణమే ప్రతిజిల్లాకు ఒక బహుళరంగ సమతుల జిల్లా అభివృద్ధి ప్రణాళిక కమీషన్ (District Multi-Sectoral Planning Commission for Equiltable Development) ను వేయుటకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ఇతర పౌర సంస్థలు, మేధావులు, శాస్త్రజ్ఞులు, నిపుణులు ప్రభుత్వాన్ని ఒప్పించడమే తక్షణ కర్తవ్యము.

**(కదలిక నుండి)**

తేదీ :25-09-2015

# మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసము చేస్తున్న బహిరంగ రహస్యాలు

## 1. పరిచయము :

'మానవజాతి నశించి పోవటమంటూ జరిగితే అది అణుబాంబుల వల్లనో, అంటురోగాల వల్లనో కాదు, నైతిక విలువల పతనం వల్ల మాత్రమే ' – ఐన్‌స్టీన్ మహాశయుని ఈప్రవచనం ఈ రోజు మన దేశ పరిస్థితికి అత్యంత సందర్భోచితం.

మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశం అని గర్వంగా భావిస్తుంటాము కూడా. సాంఘిక సమానత్వానికి, సామాజిక న్యాయానికి , మత ప్రమేయం లేని పరిపాలనకు, మానవ విలువలకు, స్వతంత్రగా ఆలోచించడానికి, నచ్చిన వృత్తులు చేపట్టడానికి, భావప్రకటనా స్వాతంత్ర్యానికి, జవాబుదారీతనానికి, పరిపాలనలో పారదర్శకతకు ప్రజాస్వామిక వ్యవస్థలు ప్రాధాన్యతనిస్తాయి. అందుకే మన రాజ్యాంగ నిర్మాతలు అన్ని "యిజాలు" పరిశీలించి మన దేశం సంపూర్ణ ప్రజాస్వామిక దేశంగా వర్ధిల్లడానికి కావలసిన పునాదులు వేశారు. రాజ్యాంగాన్ని నిర్మించారు. స్వాతంత్ర్యం నాటికి మన సమాజంలో ప్రధానంగా నిరక్షరాస్యత, దారిద్ర్యము, సాంఘిక ఆర్థిక అసమానతలు, భూస్వామ్య విలువలు, కుల వివక్ష మొదలగు సమస్యలు తాండవిస్తున్న పరిస్థితి, రాజ్యాంగంలో ప్రజాస్వామిక, పురోగామి విధానాల్ని రూపొందించినంతమాత్రాన వెంటనే నిజమైన ప్రజాస్వామిక దేశంగా మారిపోతుందని ఎవరూ అనుకోలేదు. అందుకే రాజ్యాంగ నిర్మాత డా॥బి.ఆర్. అంబేద్కర్ 1950లో భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెడుతూ తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్త పరిచాడు. 'ప్రతి ఒక్కరికి ఓటు విలువతో రాజకీయ సమానత్వాన్ని సాధించినప్పటికీ, సామాజికంగా, ఆర్థికంగా మనం అనేక వైరుధ్యాలున్న ప్రజాస్వామ్య దశలోకి ప్రయాణం చేస్తున్నాము. సాధ్యమైనంత తొందరలో మనం ఈ అసమానతల్ని రూపుమాపకపోతే, నిరాదరణకు గురువుతున్న వర్గాలు అణగారిన వర్గాలు ఈ రాజ్యాంగాన్ని బద్దలు కొడతారు.

అంటే కేవలం రాజ్యాంగంలో ప్రజాస్వామిక మూల సూత్రాలు పొందుపరిచినంత మాత్రాన ఒక్కసారిగా దేశం ప్రజాస్వామికంగా మారిపోదని ఆనాటి మన నాయకులకు బాగా తెలుసు. అయితే ఒక పరిణామక్రమంలో సంపూర్ణమైన ప్రజాస్వామిక దేశంగా క్రమంగా ఎదగాలని ఆనాటి నాయకులు ఆకాంక్షించారు. స్వాతంత్ర్యానికి ముందే ఒక గొప్ప దార్శనికతతో గ్రామ స్వరాజ్యం, అధికార వికేంద్రీకరణ, పరిపాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం లాంటి లోతైన భావనలను మన ప్రజాస్వామ్య ప్రాథమ్యాలుగా మన జాతిపిత మహాత్మగాంధీ గారు సూత్రీకరించారు. స్వాతంత్ర్యం వచ్చి 68 సంవత్సరాలు పూర్తవుతున్న దశలో మన ప్రజాస్వామ్య పరిణామాల గమనాన్ని, పురోగతిని ఒక్కసారిగా వెనక్కు తిరిగి చూసుకుంటే కొన్ని అంశాలలో తీవ్ర ఆశాభంగం కలుగుతుంది. దేశం సంపూర్ణ ప్రజాస్వామిక దేశంగా పరిణతి చెందడమంటే, ప్రభుత్వాలు, వ్యవస్థలు, రాజకీయ పార్టీలతోపాటు ప్రభుత్వాలలో, ప్రజల సామాజిక జీవనంలో, ప్రజాస్వామ్య వ్యవస్థలలో ప్రజాస్వామిక విలువలు ప్రతిఫలించాలి. కానీ దాదాపు 7 దశాబ్ధాలు గడిచినా, ఊహించని విధంగా కొన్ని అవాంఛనీయ

అప్రజాస్వామిక పరిణామాలు మన ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తూ తిరోగమనం వైపు వేగంగా నెట్టుతున్నాయి. మన ప్రజాస్వామ్య లక్ష్యాలనే తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. అలాంటి తీవ్ర అవాంఛనీయ అప్రజాస్వామిక పరిణామాలేమిటో కొన్నింటిని పరిశీలిద్దాం.

## 2. లోతుగా నాటుకొని పోయిన రాజకీయ -పారిశ్రామిక వర్గాల అపవిత్రబంధం :

వాణిజ్యం, పరిశ్రమలు పూర్తి పారదర్శకతతో కలుపుగోలుగా అభివృద్ధి చెందాలనేది మన ప్రవచిత సిద్ధాంతము. అయితే ప్రజలందరికీ చెందిన వనరులను (సహజ వనరులతో సహా) స్వార్థ రాజకీయ కోసం, అన్యాయంగా, ఆశ్రిత పక్షపాతంగా పారిశ్రామిక వర్గాలకు మన ప్రభుత్వాలు కట్టబెట్టడం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో మన దేశంలో ఒక బలమైన 'ఆశ్రిత పెట్టుబడిదారి వ్యవస్థ" ఏర్పడిందనేది కూడా బహిరంగ రహస్యమే. ప్రధాన స్రవంతిలోని రాజకీయ పార్టీలు మరియు పారిశ్రామిక వర్గాల స్వార్థపూరిత అపవిత్ర చీకటి కలయిక కారణంగా కొందరి సంపద విస్ఫోటనంలా పెంచుతూ ప్రజలకు దారిద్ర్యాన్ని పంచుతున్నది. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు పారిశ్రామిక వర్గాలు పెద్ద మొత్తంలో నల్లధనం సమకూర్చడం. అందుకు పరిహారంగా అత్యంత విలువైన, అరుదైన సహజ వనరులను, కాంట్రాక్టులను వారికి అప్పగించడం జరుగుచున్నది. ఆ నల్లధనాన్ని ఎన్నికల సమయంలో అనధికారంగా ప్రజలను ప్రలోభపెట్టడానికి పార్టీలు ఉపయోగించడం లేదా నాయకులు కూడబెట్టుకోవడం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. రాజకీయ పార్టీలు బహిరంగ పరచే తెల్లధన జమా ఖర్చులకు, వాస్తవ ఖర్చులకు సంబంధం లేదనేది బహిరంగ రహస్యమే! ఈ దుర్మార్గపు కలియిక మన సమాజంలో అన్ని స్థాయిలలో అవినీతికి, సమాంతర నల్లధన వ్యవస్థకు గట్టి పునాదులు వేసి అవినీతిని, చీకటి ఒప్పందాలను, రహస్య సంస్కృతిని పెంచి పోషిస్తున్నది. దీని కారణంగానే అనేక స్కాములలో చీకటి ఒప్పందాలతో వేలకు వేల కోట్ల రూపాయలు రహస్యంగా చేతులు మారడం మనం అందరం వింటున్నదే! ఈ దుష్పరిణామము కేంద్ర స్థాయి నుండి, రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి చివరకు గ్రామపంచాయతీ స్థాయి వరకు ప్రాకింది. ఇదంతా అందరికీ తెలిసిన బహరంగ రహస్యమే ! ఈ దుష్ట పరిణామము దేశ వ్యాప్తంగా అన్ని రంగాలలో అవినీతికి కారణభూతమై ప్రజాస్వామ్య పునాదులను సమాజంలో నీతి నిజాయితీలను ధ్వంసం చేస్తున్నది. మన ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బ తీయడానికి తీవ్రమైన ఒక క్యాన్సరు లాగా ఈ పరిణామం పనిచేయుచున్నది. ఈ పరిణామమే మన దేశంలో అనేక అప్రజాస్వామిక, అసాంఘిక, అనర్థాలకు అతి ముఖ్యకారణమౌతున్నది. ఈ అపవిత్ర కలయికను ఛేదించకుండా మన దేశంలో అవినీతిని, నల్లధనాన్ని, ఆశ్రిత పక్షపాతాన్ని, గుప్త సంస్కృతిని ఛేదించలేము. నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించనూ లేము.

## 3. ఎన్నికల ఖర్చులు -బహిరంగ ఉల్లంఘనలు-తప్పుడు నివేదికలు :

పార్లమెంటుకు, శాసనసభకు, చివరకు పంచాయతీ సంస్థలకు ఎన్నిక కావడానికి కూడా లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టవలసిన స్థితికి రావడం బహిరంగ రహస్యమే ! తత్కారణంగా, అక్రమంగా ఖర్చు పెట్టకల్గిన వారికి మాత్రమే ఎన్నికలలో గెలిచే అవకాశం దొరకుతుంది. ఈ ప్రక్రియలో అవినీతి సొమ్మును ప్రజలకు పంచి, ప్రజలను కూడా అవినీతి చట్రంలోకి దించేస్తున్నారు. అవినీతి పరులకు, ప్రకృతి వనరులను, స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొట్టే వర్గాలకే చాలవరకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం లభిస్తోంది. లేదా బడా పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు వీరికి పెద్ద మొత్తంలో నల్లధనం సమకూర్చి బదులుగా వారికి అక్రమంగా ప్రజావనరుల అప్పగింత, పరిశ్రమల మంజూరు, కాంట్రాక్టుల అప్పగింత ద్వారా దేశ సంపదను అప్పనంగా కట్టబెట్టడం

జరుగుచున్నది. ఎన్నికల ఖర్చుల మీద అధికారికంగా పరిమితులున్నా, లెక్కకు మించి నిధులు విపరీతంగా ఖర్చు చేయడం బహిరంగ రహస్యమే. తప్పుడు ఖర్చును, ముందుకు రానున్న ఎన్నికలలో పెట్టబోయే ఖర్చును భర్తీ చేసుకోవడానికి, తరతరాలకు దురాశతో కూడ బెట్టుకొనడానికి రాజకీయ నాయకులు అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడ వలసి వస్తున్నది. ఎన్నికల రాజకీయాలలో డబ్బే ముఖ్యమైనందున, డబ్బు ఖర్చు చేయుటకు ఇష్టంలేని, లేదా డబ్బులేని నిజాయితీపరులు రాజకీయాలలోకి రావడానికి ఏమాత్రం మొగ్గు చూపుట లేదు. ఈ పరిణామంతో రాజకీయాలలో నీతివంతులకు స్థానం లేదనే భావన సమాజంలో నెలకొన్నది. ఒక వేళ ఎవరైన నీతి వంతులు సాహసం చేసి రాజకీయాలలోకి వచ్చినా మనుగడ సాగించలేక పోవడమో లేక అవినీతిపరులుగా మారిపోవడమో జరుగుచున్నది.

## 4. ప్రభుత్వ కార్యాలయాల పనిలో రాజకీయ నాయకుల అనవసర జోక్యం :

మన జాతీయ రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వ విధి విధానాలు కార్యక్రమాలు రూపకల్పన చేయడానికి పాలక వర్గాలకు మన రాజ్యాంగము ఇచ్చిన హక్కు -బాధ్యత. ఆ విధి విధానాలను, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయడం వివిధ ప్రభుత్వ శాఖల అధికార కార్యాలయాల బాధ్యత. మన రాజ్యాంగము ప్రకారము ప్రభుత్వ కార్యాలయాల అనుదిన కార్యక్రమాలలో రాజకీయ ప్రతినిధులు జోక్యం చేసుకోరాదు. కానీ ప్రభుత్వ కార్యాలయాల పనిలో పాలక పక్ష రాజకీయ వర్గాల స్వార్థ ప్రయోజనాల కోసం అనవసర జోక్యం, అన్యాయంగా ప్రభావితం చేయడం, తద్వారా సామాన్యులకు న్యాయం జరగడం ఎంత కష్టమో అందరికీ తెలిసిన రహస్యమే ! పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తించడం కష్టమైపోతున్నది. ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించే దాదాపు అన్ని పనులలోనూ రాజకీయ నాయకుల జోక్యం వల్ల ప్రభుత్వ కార్యక్రమాల అమలులో గాడితప్పుతున్నాయి. చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, రాజకీయ వర్గాలు కుమ్మక్కై అవినీతి, ఆశ్రితపక్షపాతాలు పెరిగిపోతున్నాయి. ఇందు మూలంగా ప్రభుత్వ కార్యక్రమాల ఫలితాలు రాజకీయ ప్రోద్భలం లేని సామాన్యులకు దక్కడం కష్టమైపోత్తున్నది. సిపార్సులు లేకపోతే ప్రభుత్వ కార్యాలయాలలో పనులు జరుగవు అనే భావన దినదినానికి సాధారణ ప్రజలలో బలపడుతున్నది. తగిన సిఫార్సులు ఉంటే అర్హత లేక పోయినా కార్యక్రమాలు పొందవచ్చుననే భావన కూడా వుంది. ఈ పరిణామంతో ప్రభుత్వ కార్యక్రమాల నుండి లబ్ది పొందుటకు అర్హులైన సాధారణ ప్రజలు, అనర్హులు కూడా అధికార పార్టీ రాజకీయ నాయకుల చుట్టు తిరిగి, మొదట వారిని సంతృప్తి పరచి, వారి ద్వారా ప్రభుత్వ కార్యాలయాలలో పనులు చేయించుకోవలసి వస్తున్నది. ఇందుమూలంగా పైరవీకారులు, దళారీలు, మధ్యవర్తులు తయారై క్రింది స్థాయిలో అవినీతిని పెంచి, ప్రభుత్వ-ప్రజల సంబంధాలను కలుషితం చేస్తున్నాయి. తద్వారా సాధారణ ప్రజలకు ప్రజాస్వామ్యము పైన ప్రభుత్వ కార్యాలయాలపైన నమ్మకము లేకుండా పోతున్నది.

## 5. అధికారుల బదిలీలలో రాజకీయ నాయకుల జోక్యం :

చాల వరకు సామాన్య ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకూ బదిలీలలో రాజకీయ నాయకుల ప్రమేయం, అవినీతి వుండడం వల్ల న్యాయబద్దంగా, నిష్పక్షపాతంగా ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించాల్సిన అధికారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకుల కనుసన్నలలో మెలగాల్సి వస్తోంది. బదిలీల కోసం రాజకీయ వర్గాలను సంతృప్తి పరచడం వారికి అవసరమౌతున్నది. దీని ఫలితంగా నీతి, నిజాయతీగల కొంత మంది ఉద్యోగులలో నిరాశ నిస్సహాయతతోపాటు, మరి కొంతమందిలో లంచగొండితనం కూడా పెరిగి పోతున్నాయి. కార్యాలయాల నిర్వహణలో పారదర్శకత అరుదై పోతున్నది. బదిలీల కోసం చాలామంది అధికారులు, ఉద్యోగులు రాజకీయ నాయకుల చుట్టూ తిరగడం, అదే

విధంగా రాజకీయ నాయకులు కూడా తమకు అనుకూలురైన అధికారుల కోసం వెతికి బదిలీలు చేయించుకోవడం బహిరంగ రహస్యమే. ఈ పరిస్థితి కుల, వర్గ రాజకీయాలను కూడా ప్రోత్సహిస్తున్నది. ముఖ్యంగా ఈ పరిణామం పోలీసు, రెవిన్యూ లాంటి కీలక శాఖలలో బలంగా వున్నదని అందరికీ తెలిసిందే! దీని మూలంగా సాధారణ ప్రజలకు అనుదినం సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు రాజకీయ నాయకుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా పనిచేయడం పరిపాటి అవుతున్నది.

## 6. ప్రజలను పట్టి పీడిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి :

ఒక ప్రభుత్వ ఉద్యోగి గానీ, ఒక సాధారణ పౌరుడు గానీ నీతి, నిజాయితీగా జీవించడం ఒక పెద్ద సవాలుగా మారింది. రాజకీయనాయకుల కనుసన్నలలో పని చేస్తున్నంత కాలం ప్రభుత్వ ఉద్యోగుల మనుగడకు ఢోకాలేని పరిస్థితులు ఏర్పడడంతో ప్రజలకు జవాబుదారీతనంగానూ, పారదర్శకంగానూ ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు సామాన్య ప్రజల పీడన కేంద్రాలుగా మారిన సందర్భాలే అధికం. కొంత మంది ఉద్యోగస్తులు ఉద్యోగం తెచ్చుకోవడానికి కూడా ఎక్కువ మొత్తంలో వెచ్చించవలసి వస్తున్నది. అందు మూలంగా వారు అవినీతిని పాటించడం, ప్రోత్సహించడం జరుగుచున్నది. కార్యాలయ వ్యవస్థలలో అవినీతి ఒక భాగమైపోయినందున నీతి-నిజాయితీ గల ఉద్యోగులు అవినీతి వ్యవస్థలో ఇమడ లేక సమస్యలను ఎదుర్కొన వలసి వస్తున్నది. లేదా అవినీతిలో భాగం పంచుకోవలసి వస్తున్నది. పట్టాదారు పాసుపుస్తకం కావాలన్నా, పొలానికి కరెంటు కావాలన్నా, పోలీసు కేసు పెట్టాలన్నా, లంచాలు ఇవ్వాల్సిందే అనే భావన సాధారణ ప్రజలలో నెలకొంది. నెలరోజుల్లోనే గతుకులు పడే రోడ్లు, కూలిపోయే బిల్డింగులు, బ్రిడ్జులు, అవినీతి కంపును గురించే చెబుతాయి. ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి ఉన్నదని తెలియని వారెవరైనా ఉన్నారా? అందరు అధికారులు అవినీతిపరులు కారనేది వాస్తవమైనా నీతిగా పారదర్శకంగా ప్రభుత్వ కార్యాలయాలలో పనిజరగడం అరుదుగానే ఉందని అందరికీ తెలిసిన (రహస్య) సత్యం. దీని కారణంగా సాధారణ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపైన, మన ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేకుండా పోతున్నది.

## 7. రాజకీయ నాయకులు వారి మనసాక్షిని చంపుకొని నిస్సిగ్గుగా నీతివంతులమని సమర్ధించుకోవడం :

స్వాతంత్రం తరువాత మొదటి దశకాలంలో బాధ్యతగల పదవులలో వున్న రాజకీయ నాయకులపై ఏవైనా అవినీతి ఆరోపణలు వచ్చిన వెంటనే పదవుల నుంచి తప్పుకొని నిష్పక్షపాతంగా విచారణకు అవకాశం కల్పించే సంప్రదాయముండేది. రానురాను పరిస్థితి తీవ్రంగా మారిపోయింది. ఇప్పుడు కేవలం ఆరోపనలే కాదు క్రింది కోర్టులలో అవినీతి నిరూపణ జరిగి కటకటాలపాలైనా, ఏ మాత్రం సిగ్గు, లజ్జ లేకుండా పదవులలో కొనసాగుటకు రాజకీయ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తారు. శిక్ష అనుభవించి గానీ, బెయిలుపై గానీ, జైలు నుంచి బయటికి వచ్చిన వారికి ఘనకార్యాలు సాధించిన హీరోలుగా ఆర్భాటంగా వీరోచిత స్వాగతం లభిస్తున్నది. చాలా మంది పదవులను అనుభవించిన రాజకీయ నాయకుల చరిత్ర చూస్తే ప్రభుత్వ నిధుల కైంకర్యం, ప్రకృతి వనరుల దురాక్రమణ, కోట్ల ఆస్తుల అక్రమ సంపాదనలు బహిరంగ రహస్యాలే ! తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వ్యక్తులకు అధికారంలో వున్న కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా బాసటగా నిల్చి వారిని రక్షించడానికి సహాయపడి విపరీత, వికృత సంఘీభావం, సమర్థించే రాజకీయ వ్యవస్థలు, ఇవన్నీ కూడా బహిరంగంగా సమర్థించుకోవడమూ సర్వసాధారణమే. నీతి, నిజాయితీ, మనస్సాక్షి లాంటి భావనలను తుడిచి వేసే ప్రయత్నం జరుగుచున్నది.

**8. ద్వంద్వ నీతి ఒక బహిరంగ రహస్యమే : నీతి -నిజాయితీ గురించి – అవినీతిని, అన్యాయాల్ని పాటించడం మన రాజకీయ సంస్కృతి :**

రాజకీయాలలో ఉన్నవారు, ఉన్నత పదవులలో ఉన్నవారు ధర్మాలతో, న్యాయంగా, స్వచ్ఛంగా, నిష్పక్షపాతంగా, నీతి నిజాయితీలతో ప్రజలకు మార్గదర్శకంగా వుండాలని మన రాజ్యాంగము నిర్దేశిస్తున్నది. దానినే సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు. సామాన్య ప్రజలలో చాలా వరకు న్యాయం, నీతి, నిజాయితీలు, మాటకు నిలబడే లక్షణాలను మనం గమనించగలం. చాలా మంది రాజకీయ నాయకులు, కొంత మంది అధికారులు, పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టర్లు, ఒక పక్క నీతి, నిజాయితీలను గురించి గంభీరమైన ఉపన్యాసాలిస్తూనే, ఇంకో ప్రక్క ఏ మాత్రం సిగ్గు, లజ్జ లేకుండా అవినీతి అక్రమాలకు పాల్పడడం మనం గమనిస్తూనే వున్నాము. ప్రతిపక్షంలో వున్నప్పుడు ఎదుటి వ్యక్తిలోగానీ, ప్రభుత్వంలో గానీ కనపడిన తప్పు, అధికారంలోకి రాగానే తమ విషయంలో ఒప్పుగా సమర్థించుకోవడం ప్రస్తుత ప్రతిపక్ష, అధికార వర్గాలలో పెరుగుతున్న వికృత ద్వంద్వ నీతి. చాలా మంది రాజకీయ నాయకులు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, ధనవంతులు అక్రమార్జనతో నల్లధనంలో మునిగి, విలాసవంతమైన జీవనం సాగిస్తూన్నారనేది బహిరంగ రహస్యమే ! ఇదే వర్గాలు మన ప్రజాస్వామ్య గమ్యాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక ప్రామాణీకరణను భ్రష్టు పట్టిస్తూ తిరోగమనం వైపు నడిపిస్తున్నారు. దౌర్భాగ్యమేమంటే బాహాటంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం లాంటి తప్పులు కనపడుతున్నా, వీరిని కూడా సమర్థించే, కీర్తించే కొన్ని వర్గాలు పౌర సమాజంలో పుట్టుకొని రావడం నైతిక విలువల పతనానికి పరాకాష్ట. 68 సంవత్సరాలలో నైతిక విలువల విషయంలో మనం ఎంత వెనక్కు పోయినామో బహిరంగ రహస్యమే.

**9. ముగింపు :**

పైన తెల్పిన అప్రజాస్వామ్య, అసాంఘిక తిరోగమన పోకడలు జాతీయ స్థాయి నుండి రాష్ట్రలస్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో, జిల్లా స్థాయిలో, చివరకు గ్రామస్థాయి వరకు అఖండంగా బలంగా వ్యాపిస్తున్నాయి. ఒక గ్రామ పంచాయితీ స్థాయిలో కూడా ఆ స్థాయి రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగ వర్గాలు పైన చెప్పిన అప్రజాస్వామ్య, అవినీతి తిరోగమన పోకడలనన్నింటినీ పాటిస్తున్నారు. ప్రజాస్వామ్య మంటే కేవలం ఓటు హక్కుకు పరిమితమైన రాజకీయ స్వేచ్ఛ కాదు. ప్రజాస్వామ్యమనేది నీతి, నిజాయితీని పెంచి పోషిస్తూ సమాజాన్ని ఉన్నతమైన సామాజిక, ఆర్థిక వ్యక్తిగత, మానవ విలువలవైపు పురోగమించడానికి తోడ్పడాలి. దైనందిన జీవితంలో సమానత్వం, సామాజిక న్యాయం, నీతి, నిజాయితీ, ఆత్మగౌరవం, సమాన అవకాశాలు, పారదర్శకత, జవాబుదారీతనం, అభిప్రాయాలు చెప్పగలిగే స్వేచ్ఛ, తగిన ఏ వృత్తినైనా స్వీకరించ గలిగే స్వేచ్ఛ, ఉన్నప్పుడు, ఇవన్నీ సమాజంలో అంతర్భాగమైనపుడు ఆ సమాజం, దేశం నిజమైన ప్రజాస్వామిక దేశంగా పరిణతి చెందుతుంది. అయితే మన ప్రజాస్వామ్యంలో ప్రజలకు, సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ధనికులు, రాజకీయ పార్టీలు, పాలకులు, పారిశ్రామిక వర్గాలు తిరోగమనం వైపు ప్రజాస్వామిక విలువలను, వ్యవస్థలను తమ స్వార్థం కోసం దిగజార్చడం బహిరంగ రహస్యం. ఈ బహిరంగ రహస్యాలు ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని, భారత జాతి లక్ష్యాలను, పురోగమనాన్ని అపహాస్యం చేస్తున్నాయి. మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పుకుంటున్నాం. అయితే వున్న ప్రజాస్వామ్య వ్యవస్థను, కూడా అంతే వేగంగా ధ్వంసం చేసుకొంటున్నాము. ఈ పోకడలు ఇట్లే కొనసాగితే మన ప్రజాస్వామ్య పునాదులు పగిలిపోతాయి. చీకటి వ్యవహారాలు, ద్వంద్వనీతి, రాక్షసనీతి రాజ్యమేలే పరిస్థితి ఏర్పడుతుంది.

## ప్రతిఘటన పౌర సమాజం నుండే రావాలి :

పౌర సమాజంలో, సాధారణ ప్రజలలో, మీడియాలో ఈ తిరోగమన శక్తులను ప్రతిఘటించాలనే పురోగామి భావనలు బలంగా వున్నాయి. రాజకీయ, అధికార, పారిశ్రామిక, ధనిక వర్గాలలో కూడా ఈ దుష్పరిణాలమాలను నిరసించే వారు. పురోగమనం కావాలని కోరుకొనేవారు కొందరు ఉన్నారు. అన్ని వర్గాల నుండి, అన్ని స్థాయిలలోనూ ప్రజాస్వామ్య పురోగామి వ్యక్తులు, శక్తులు, వ్యవస్థలు నిరాశావాదంతో అచేతనంగా ప్రేక్షకపాత్రకు పరిమితం కాకుండా స్పందించి, పురోగమనం వైపు చొరవ చూపాలి. పౌర సమాజంలోని పురోగామి వ్యక్తులు, శక్తులు, వ్యవస్థలు చేయి చేయి కలిపి ఏకం కావాలి, ఎదిరించాలి. అప్రజాస్వామ్య పోకడలను, అవినీతి, అన్యాయాలను బలంగా, సంఘటితంగా ప్రతిఘటించాలి. మన ప్రజాస్వామ్య గమనాన్ని పురోగమనం వైపు దారి మళ్లించాలి. మన సమాజంలో నీతిని, అవినీతిని, మానవ విలువలను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం మనందరి అత్యవసర బాధ్యతగా భావించాలి.

తేదీ : 08-03-2016

## అనంతపురం జిల్లాకు అనువైన పరిశ్రమలు, పారిశ్రామిక విధానాలు

### 1. పరిశ్రమలు లేకపోవడంతో చిన్న ఉద్యోగాల కోసం కూడా బయటకు పోవాల్సిందే :

అనంతపురం జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చెందకపోవడానికి ముఖ్య కారణం ప్రోత్సాహకకరమైన విధానాలు, కనీస మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకపోవడమే, 42 లక్షలకు పైగా జనాభా వున్న జిల్లాలో భారీ, మధ్య తరహా పరిశ్రమలో కేవలం 4836 మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారు. పారిశ్రామికంగా మన జిల్లా ఏ స్థాయిలో వెనుకబాటులో ఉందో ఇది ఒక నిదర్శనం. కరువులు, దారిద్ర్యం కారణంగా చాలా మంది విద్యార్థులు పదవ తరగతికే చదువు మానుకొంటున్నారు. తరువాత ఇంటర్, డిగ్రీ పోస్టు గ్రాడ్యుయేషన్, బి.ఇ. చదివిన వారు కూడా వేల సంఖ్యలో నిరుద్యోగులుగా వుంటున్నారు. చిన్న గేట్‌మ్యాన్ ఉద్యోగం నుండి ఏ స్థాయి ఉద్యోగం కావాలన్నా బెంగళూరు-హైదరాబాద్, చెన్నై నగరాలకు ఇతర పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వెళ్లాల్సిందే ! పైగా విద్య ఒక వ్యాపారంగా మారడం, అనేక విద్యా సంస్థలు పుట్టుక రావడం, విద్యలో నాణ్యత వున్నా లేక పోయినా, లక్షల సంఖ్యలో ప్రతి సంవత్సరం చదువు ముగించి, నిరుద్యోగులు ఉత్పత్తి అవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో అన్నో, ఇన్నో ఉద్యోగాలు కల్పిస్తున్న పరిశ్రమలు రెండే రెండు అవి ఒకటి ప్రైవేటు విద్యారంగము, రెండవది ప్రైవేటు వైద్య రంగము.

### 2. మన జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన అంశాలు :

44వ నెంబర్ జాతీయ రహదారి అనంతపురము మీదుగా బెంగళూరు-హైదరాబాద్‌లను కల్పుతున్నది, గుంతకల్లు, గుత్తి, ధర్మవరము రైల్వే జంక్షన్లుగా వుండి, దేశం నలువైపులకు రైల్వే రవాణా సౌకర్యాలు కలిగియున్నది. అదనంగా బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయము జిల్లా సరిహద్దుకు కేవలం 75 కి.మీ. దూరంలో వుండటం కూడా మంచి అనుకూలము. ప్రముఖంగా మానవవనరులు మన జిల్లాలో ఒక ముఖ్యమైన వనరు. తక్కువ వేతనాలకే పని చేస్తారు. ఎందుకంటే అనంతపురంలో రూ. 7500 జీతం బెంగుళూరులో రూ. 15000తో సమానం. ప్రత్యేకంగా హిందూపురంలో పట్టు ఆధార పరిశ్రమలు, గుంతకల్లు రైల్వే అనుబంధ పరిశ్రమలు, తాడిపత్రిలో సిమెంటు ఆధార పరిశ్రమలు, రాయదుర్గంలో దుస్తులు తయారీ రంగములలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి మంచి అవకాశాలు వున్నాయి. పప్పు-చిరుధాన్య ఆధార ఆహార ఉత్పత్తులు, పండ్ల ఆధార పరిశ్రమలు, వేరుశనగ, ఆముదం లాంటి ఇతర ఆహార ఉత్పత్తుల పరిశ్రమల స్థాపనకు జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయి. ఏ ఇతర తయారీ రంగ పరిశ్రమలకైనా జిల్లా అంతటా కూడా అనుకూల పరిస్థితులు వున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా పరిశ్రమలకు అవసరమైన భూమి మన జిల్లాలో విస్తారంగా లభిస్తున్నది. ఎటువంటి అవరోధాలు లేకుండా రైతులే ముందుకు వచ్చి, రాష్ట్రంలో మరెక్కడా లేనంత తక్కువ ధరలకు అమ్మడానికి గానీ, దీర్ఘకాల కౌలుకుగానీ ఇవ్వడానికి సిద్ధంగా వున్నారు. ప్రస్తుతమున్న పారిశ్రామిక వాతావరణంలో పరిశ్రమలకు ముఖ్యంగా తయారీ రంగ పరిశ్రమలకు అవసరమైన భూమి విస్తారంగా, అవరోధాలు

లేకుండా లభించడము అతి కష్టమైనదే కాకుండా అతి ఖరీదైన అంశము కూడా. అనంతపురం జిల్లాలో అతి తక్కువ ధరకే భూమి లభిస్తుండడం బాగా అనుకూలమైన అంశం.

## 3. పరిశ్రమల స్థాపనకు ప్రతికూల అంశాలు :

### 3.1 తాగునీరు కూడా లేకపోవడం :

ప్రతికూల అంశాలలో నీటి కొరత ముఖ్యమైనది. ప్రస్తుతమున్న జనాభాకే తాగునీరు సదుపాయం సరిగా లేదు. తాగునీరు సదుపాయం కూడా లేని చోట పరిశ్రమలు స్థాపించడానికి ఎవరూ ముందుకు రారు.

### 3.2 ప్రశాంతత, ప్రజాస్వామ్య వాతావరణం లేదనే అభిప్రాయం :

ఇంకొక ముఖ్యమైన ప్రతికూల అంశము మన జిల్లాలో రాజకీయ, సాంఘిక ప్రజాస్వామ్య వాతావరణం పారిశ్రామికవేత్తలకు సానుకూలంగా లేకపోవడం. అనంతపురం జిల్లాలో వర్గ కక్షలు, హింసా రాజకీయాలు, అధిపత్య పోరు, నిర్బంధ వసూళ్ళు అభద్రతా భావం మొదలగు వాటితో ప్రశాంతత, సాంఘిక సానుకూలత లేదనే అభిప్రాయం కాంట్రాక్టర్లలోనూ, పారిశ్రామిక వర్గాలలోనూ ప్రచారంలో వుంది.

### 3.3 పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇతర జిల్లాలతో పోటీ పడే విధంగా లేవు :

పరిశ్రమల స్థాపనకు ఇతర జిల్లాలతో పోటీపడే విధంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకపోవడం తగినంత ఆర్థిక ప్రోత్సాహకాలు లేకపోవడం తీవ్ర అవరోధము.

## 4. ఇతర జిల్లాలతో పోటీ పడే విధంగా పరిశ్రమల స్థాపనకు సానుకూల విధానాలను అనుకూల పరిస్థితులను ప్రభుత్వం కల్పించాలి :

ఒక వికలాంగుడు ఒక సకలాంగునితో పరుగు పందెంలో పోటీ పడలేడు. తెలంగాణా విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు "ప్రత్యేక హోదా" ఏ విధంగా అవసరమో, అనంతపురము జిల్లా ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడలేదు. కాబట్టి ప్రత్యేక ప్రోత్సాహకాలను, అనుకూల పరిస్థితులను ఇతర ప్రాంతాలతో పోటీ పడే విధంగా ప్రత్యేక హోదా కల్పించినపుడు మాత్రమే ఇక్కడ పరిశ్రమలు వస్తాయి. అటువంటి విధానాలను, పరిస్థితులను కల్పించడానికి ధృడమైన రాజకీయ సంకల్పం కావాలి. తగిన విధంగా మినహాయింపులు కల్పించి అవకాశాలు కల్పించాలి.

### 4.1. జిల్లాలో విస్తారంగా ప్రత్యేక తయారీ జోన్లను అభివృద్ధి చేయాలి.

అనంతపురం జిల్లాలో వ్యవసాయోత్పత్తుల ఆధార పరిశ్రమలకు బాగా అవకాశాలు వున్నాయి. అనంతపురం జిల్లాలో వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆముదం, కూరగాయలు, బొప్పాయి, చీనా, దానిమ్మ, అరటి, మామిడి, చింత, జామ, సపోట మొదలగు వ్యవసాయ ఉత్పత్తులు పండుతున్నాయి. అయితే ఇవేవీ మన జిల్లాలో ప్రోసెస్సింగ్ జరుగలేదు. విలువను జోడించడం లేదు. కాబట్టి ఈ ఉత్పత్తుల ప్రోసెస్సింగ్, విలువ జోడించే పరిశ్రమలు స్థాపిస్తే ఇటు రైతులకు అటు, నిరుద్యోగులకు ఉభయ తారకంగా వుంటుంది.

అనంతపురం జిల్లాలో దుస్తుల తయారీ, జ్యూవెలరీ, తోలు వస్తువులు, చేనేత, అనుబంధ పరిశ్రమలకు విడిభాగాలను అమర్చుట మొదలగు వాటి తయారీకి మంచి అవకాశము ఉన్నట్లు నిపుణులు చెపుతున్నారు.

అనంతపురం జిల్లాలో వ్యూహాత్మక ప్రదేశాలలో "ప్రత్యేక తయారీ జోను" ఏర్పర్చాలి. జాతీయ స్థాయిలో ఉధృత ప్రచారంలో భాగంగా తయారీ రంగ పరిశ్రమల స్థాపనకు అవసరమైన ప్రత్యేక ప్రోత్సాహకాలతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలి. ఎన్నిక చేసుకొన్న వ్యూవహాత్మక ప్రదేశాలలో విస్తారంగా వేల ఎకరాలలో భూమి సేకరించి, రోడ్లు, నీరు, విద్యుచ్ఛక్తి లాంటి మౌలిక వసతులతో ప్రత్యేక తయారీ జోన్లను అభివృద్ధి చేసి, సిద్ధంగా వుంచి, పారిశ్రామిక ఔత్సాహికులను ఆహ్వానించవలయును. అదేమంత కష్టమయిన విషయంకాదు. ఎందుకంటే, మన జిల్లాలో భూమి ధర చాలా తక్కువ. అమరావతి ప్రాంతములో సేకరించడానికి ఒక్క ఎకరాకు పెట్టే ఖర్చుతో మన జిల్లాలో 100 ఎకరాలు సేకరించవచ్చు. సాధారణంగా తయారీ రంగ పరిశ్రమలకు ఎక్కువ విస్తీర్ణంలో భూమి కాలసి వుంటుంది. కాబట్టి వాటిని అమరావతిలోగాకుండా వికేంద్రీకరించి, అనంతపురము లాంటి వెనుకబడిన ప్రాంతాలకు తరలించడం అన్ని విధాల శ్రేయస్కరం. తయారీ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, వివిధ రకాల పన్నులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్థిక జోన్లకు ఇచ్చే రాయితీలను వేరే ప్రాంతాలలో 5 సం॥రాలు ఇస్తుంటే, మన జిల్లాలో 10 సంవత్సరాలు ఇచ్చే విధంగా విధానాలు ఉండాలి. ఈ విధమైన పన్ను రాయితీల వలన ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, అధికంగా ఏమీ ఖర్చు వుండదు. అదనంగా పరిశ్రమలలో వారు స్థానికులకు ఇచ్చే ఉద్యోగాల సంఖ్యను బట్టి కూడా ప్రోత్సాహకాలు ఎక్కువగా వుండే విధంగా ప్రోత్సహకాలు, పన్ను రాయితీలు, విధానాలు వుండాలి. జిల్లాలో పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 5 టీఎంసీల నికర జలాలను కేటాయించవలయును. ప్రత్యేక తయారీ జోన్లకు అవసరమైన నీటి సదుపాయం సిద్ధంగా కల్పించవలయును. అదే విధంగ ప్రభుత్వం ఒక సులభమైన ఏక గవాక్ష పరిష్కార విధానము ప్రకటించి, అవసరమైన అనుమతులు, లైసెన్సులను వ్యయము, కాలయాపన లేకుండా తెచ్చుకొనుటకు వీలు కల్పించాలి.

## 4.2. లేపాక్షి-కర్నూలు పారిశ్రామిక నడవ ఏర్పాటు :

లేపాక్షి-కర్నూలు రహదారికి ఇరువైపులా పరిశ్రమలను స్థాపించుటకు ప్రోత్సాహకరమైన విధానాలతో పాటు, భూమిని సేకరించి మౌలిక సదుపాయాలు కల్పించవలయును. దక్షిణమున బెంగుళూరు, ఉత్తరమున హైదరాబాద్ నగరాలు, విమానాశ్రయాలు ఉన్నాయి. ఆ నగరాల చేరువలో పరిశ్రమలు స్థాపించుట అధిక ఖర్చుతో కూడుకున్నందున, ఇక్కడ తక్కువ ఖర్చు, అధిక దీర్ఘకాల ప్రోత్సాహకాలు వుండటం వలన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణా, మూడు రాష్ట్రాల నుండి కూడా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడానికి మంచి అవకాశం వుంటుంది.

## 4.3 సానుకూల రాజకీయ, సాంఘిక పరిస్థితులు :

ముఖ్యంగా రాజకీయ వర్గాలు, ప్రభుత్వాలు కలిసి ఒక ధృఢ రాజకీయ సంకల్పంతో, పార్టీ రాజకీయాలకతీతంగా జిల్లాలో ఓ ప్రశాంత, సానుకూల, ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించాలి. ఇటువంటి వాతావరణం ఆచరణలో కనపడాలి. జిల్లాలో అవినీతికి, నిర్బంధ వసూళ్లకు, ఆధిపత్యానికి, ఇతర ఒత్తిడులకు ఆస్కారం లేని సాంఘిక వాతావరణాన్ని కల్పించాలి. పార్టీలకతీతంగా పదవులకతీతంగా రాజకీయ నాయకులు కూడా క్రమ శిక్షణ గల పెట్టుబడిదార్లుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. ప్రస్తుతం మన జిల్లాలోని రాజకీయ నాయకులు, ఇతర పారిశ్రామికవేత్తలు కూడా ఇతర ప్రాంతాలకు, ఆఫ్రికా, అమెరికా, సింగపూర్ వంటి ఇతర దేశాలకు కూడా వెళ్లి పరిశ్రమలు స్థాపిస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చి ఇక్కడే పరిశ్రమలు స్థాపిస్తామనే వాతావరణం రావాలి.

## 4.4 లాభదాయక పరిశ్రమల వివరణాత్మక నివేదికలు :

వివిధ పరిశ్రమలకు పరిశ్రమల లాభదాయక నివేదికలను వివరంగా ప్రభుత్వమే తయారు చేసి, ఔత్సాహికులకు అందుబాటులో వుంచవలయును. అనంతపురం జిల్లాలో ఎటువంటి లాభసాటి పరిశ్రమలు స్థాపించడానికి ఏ రంగాలలో, ఏ ఉత్పత్తులకు అవకాశాలున్నాయో, అవి ఎట్లా లాభసాటిగా వుంటాయో తెలిపే ప్రాజెక్టు రిపోర్టులను విపులంగా నిపుణులచే తయారు చేయించాలి. ఆ పరిశ్రమలను "ప్రత్యేక పారిశ్రామికలో గానీ, జిల్లాలో ఇతర ప్రాంతాలలో గానీ ఏర్పాటు చేస్తే ఎటువంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు వున్నాయో రాయితీలు ఎన్ని సంవత్సరాలు వుంటాయో కూడా ప్రాజెక్టు రిపోర్టులలో పొందుపరచవలయును.

## 5. అనంతపురం జిల్లాలో అత్యధిక ప్రాధాన్యతతో పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వవలసిన పరిశ్రమలు :

అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది నిరుద్యోగులు పదవ తరగతి, ఇంటర్ డిగ్రీ చదివినవారున్నారు. తరువాత ఎక్కువ మంది బిటెక్, బిఈ చదివిన నిరుద్యోగులు కూడా ఉన్నారు. కాబట్టి అనంతపురము జిల్లాలో ఉద్యోగ ప్రాధాన్య పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఎంత ఎక్కువ మంది స్థానికులకు ఉద్యోగాలు ఇస్తే ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు అంత ఎక్కువగా వుండాలి. అనంతపురం జిల్లాలో ఉత్పత్తి అయ్యే ధాన్యాలు, పండ్లు, నూనె గింజలు, కూరగాయలపై ఆధారపడిన పరిశ్రమలతో పాటు, దుస్తుల తయారీ, చేనేతతో, తోలు వస్తువుల తయారి, జువెలరీ, విడిభాగాలను అమర్చుట, విడిభాగాల ఉత్పత్తి, పెద్ద పరిశ్రమలకు విడిభాగాలు తయారు చేసే అనుబంధ పరిశ్రమలు మొదలగు వాటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. సాఫ్టువేరు ఉత్పత్తుల కంటే హార్డువేరు ఉత్పత్తి రంగములో తక్కువ నైపుణ్యము గల వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని భావిస్తారు. అట్లాంటి హార్డువేరు రంగ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వవలయును. అట్లే ఎలక్ట్రానిక్ గోడ గడియారాలు మొదలగు పరిశ్రమలలో విడిభాగాలు తయారు చేయడం సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొన్నా, వాటిని ఒక గడియారంగా అమర్చడానికి పెద్ద చదువులు అవసరం లేని, మానవ వనరులు ఎక్కువగా అవసరమవుతాయి. ఉదా : గుజరాత్‌లో గోడ గడియారాలను నిరక్షరాస్యులైన స్త్రీలు అమర్చుతున్నారు. కొన్ని రంగాలలో స్త్రీలకు మంచి అవకాశాలు వుంటాయి. అటువంటి వాటిని గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలి. స్థానికులు ఉద్యోగ ప్రాధాన్యత లేని పెట్టుబడి ప్రాధాన్యత లేదా సాంకేతిక ప్రాధాన్యత గల పరిశ్రమలను మన జిల్లాలో స్థాపించడం వలన మన జిల్లాకు పెద్ద ప్రయోజనం వుండదు అనే విషయాన్ని గుర్తించాలి.

## 6. రైతులకు భాగస్వామ్యం కల్గించే పరిశ్రమలు :

సౌరశక్తి ఉత్పాదన మరియు పవన శక్తి ఉత్పాదనకు అనంతపురం జిల్లా వాతావరణం బాగా అనుకూలం. అయితే ఈ పరిశ్రమలకు ప్రస్తుతమున్న విధానం రైతులకు లాభదాయకంగా లేదు, పైగా రైతులు జీవనోపాధిని, భూమిని రెండిటినీ కోల్పోతున్నారు. 16 సంవత్సరాల క్రితం నేను ఒక వ్యాసంలో అనంతపురం జిల్లాలో ఎండకు, గాలికి పండే పంటలు వస్తాయని, తద్వారా అనంతపురము రైతుకు చాలా మంచి రోజులు వస్తాయని చెప్పాను. ఎండకు, గాలికి ఏమి పంటలు పండుతాయని చాలా మంది నన్నడిగితే సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు అనంతపురం రైతులు సులభంగా పండించే రోజులు వస్తాయని సమాధానం చెప్పాను. కానీ ప్రస్తుతం సౌర, పవన శక్తి పరిశ్రమ జిల్లాకు వస్తూ వున్నాయి. కానీ రైతులకు మంచి రోజులు రాలేదు. వారిని నిరాశ్రయులను చేస్తూ, పారిశ్రామికవేత్తలకు లాభాలు పండిస్తున్నది. కాబట్టి విధానంలో కొంత మార్పులు చేసి రైతులను పరిశ్రమలో భాగస్వాములను

చేసే విధంగా విధానాలు ప్రోత్సహకాలు ఉండవలయును. భూములున్న రైతులను పరస్పర సహకార సంఘాలుగా లేదా ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పరచి, ఆ రైతుల ద్వారా భూమిని సౌరశక్తి లేదా పవన శక్తి కోసం సమీకరించి వారే స్వయంగా కానీ, లేదా రైతులు-పెట్టుబడిదారుల సహభాగస్వామ్యముతో గానీ స్థాపించుటకు ప్రోత్సాహకాలు ఇవ్వవలయును. లేదా రైతుల భూములను దీర్ఘకాల కౌలుకు తీసుకొని ప్రతి సంవత్సరం రైతుకు కౌలు ఆదాయం వుండే విధంగా విధానాలు వుంటే, రైతులు నిరాశ్రయులు కాకుండా చూడవచ్చు. కనీసం రైతులు పండించే పంటలపై ఆధారపడిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే, వ్యవసాయోత్పత్తుల ధరలు కొంత వరకు స్థిరంగా వుంటాయి. తద్వారా రైతులు కూడా ప్రయోజనం పొందుతారు. కాబట్టి ఏ పరిశ్రమలలో అయితే రైతులను భాగస్వాములను చేయడానికి లేదా ప్రయోజనాలు చేకూర్చడానికి అవకాశం ఉందో గుర్తించి, వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటికి అనువైన పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వవలయును.

## 7. ముగింపు :

పైన చెప్పిన అన్ని విధానాలను, పద్ధతులను అవసరమైన విధంగా పాటించవలసి వుంటుంది. అన్ని పరిశ్రమలలోనూ ఒకే విధంగా చేయుటకు అవకాశాలు ఉండకపోవచ్చు. ఏ పద్ధతులు, విధానాలు లక్ష్యాన్ని సాధించగలవో పరిస్థితులను బట్టి నిర్ణయించవలయును. కేవలం పరిశ్రమలు స్థాపించడం మన లక్ష్యం కాదు. జిల్లాలో చదువుకొన్న నిరుద్యోగులకు, రైతులకు, రైతు కూలీలకు వివిధ స్థాయిలలో జీవనోపాధి భద్రత కల్పించడం మన లక్ష్యం. ముఖ్యంగా అర్ధ చదువులు చదివిన స్థానికులకు ఉపాధి కల్పించడం మన లక్ష్యం. జిల్లాలో ఆ లక్ష్యాలను నెరవేర్చే పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా అనంతపురం జిల్లాను పరిశ్రమల ప్రధాన స్రవంతిలోకి తీసుకొనిరావడం జరుగవలయును.

తేదీ : 03-12-2015

# అనంతపురం జిల్లాకు భూతాపం (Global Warming) ముప్పు
# మరింత జటిలం కానున్న వ్యవసాయం - వాతావరణ పరిస్థితులు

## 1. పరిచయము :

ప్రస్తుత కాలంలో ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న ముఖ్య సమస్య భూతాపం ((Global Warming) పెరగడం, దాని పర్యవసానంగా వాతావరణంలో వేగంగా మార్పులు చోటు చేసుకోవడం. వాతావరణంలో ముఖ్యంగా వస్తున్న మార్పులు – ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగడం, రుతువులు గతి తప్పడం, తీవ్ర వరదలు, వరుస కరువులు, సునామీలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా రావడం, ఉత్తర ధృవంలోని మంచుగడ్డలు కరిగిపోవడం, హిమాలయాల్లాంటి ఎత్తైన పర్వత శిఖరాలలో మంచు గడ్డలు కరిగి నీరైపోవడం, తద్వారా సముద్ర మట్టాలు పెరగడం, గోవా, చెన్నై, విశాఖపట్టణంలాంటి తీర పట్టణాలు ముంపుకు అయ్యే ప్రమాదం, మాల్దీవులు, ఫిజి, శ్రీలంక లాంటి ద్వీపదేశాలు సముద్రంలో కలిసి పోయే ప్రమాదం పొంచి వుండడం లాంటి అనేక దుష్ప్రభావాలు జరుగనున్నట్లు ఆధారలతో శాస్త్రజ్ఞులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

ఈ మార్పులు వ్యవసాయముపైనా, ఇతర జీవనోపాదులపైన, ప్రజారోగ్యంపైన, పర్యావరణం పైన, ముఖ్యంగా అన్ని రకాల జీవరాశులపైన ఇప్పటికే తీవ్ర దుష్ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. ఈ దుష్ప్రభావాలు ముందు కాలంలో ఇంకా తీవ్రంగా వుండబోతాయని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఈ వాతావరణ మార్పులు ఏ ఒక్క ప్రాంతానికో, దేశానికో పరిమితం కాకుండా, ప్రపంచమంతటా సంభవిస్తూ ప్రజలపైనా, పర్యావరణంపైనా ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

## 1.1. వాతావరణము (Climate ) అంటే?

ఒక ప్రదేశములో ఒక సమయములో సాధారణంగా వుండే వర్షపాతం, ఉష్ణోగ్రత, వాయుపీడనం, గాలిలో తేమ, ఎండ, మేఘావృతము, గాలి– ఈ అన్నీ కలయికల ద్వారా ఏర్పడే వాతావరణ స్థితిని “ వాతావరణము” (weather) అని అంటాము. ఒక ప్రదేశములో ఒక సమయంలో వాతావరణం సాధారణంగా ఎట్లా వుండవచ్చునో ముందుగానే అంచనా వేయడానికి 30 సంవత్సరాల దీర్ఘకాల వర్షపాతం,ఉష్ణోగ్రత వాస్తవ గణాంకాలను తీసుకొని సగటు వర్షపాతం మరియు సగటు ఉ ష్ణోగ్రత లెక్కిస్తారు. ఈ విధంగా లెక్కించిన దీర్ఘకాల సగటు వాతావరణాన్ని సాధారణంగా తెలుగులో వాతావరణమనే అంటారు. కానీ ఇంగ్లీషులో క్లైమేట్ (Climate) అని అంటారు. Climate (వాతావరణం) అంటే ఒక ప్రదేశములో సాధారణంగా ఉండే దీర్ఘకాల సగటు వర్షపాతం మరియు ఉ ష్ణోగ్రత అని అర్థం చేసుకోవచ్చు.

## 1.2 వాతావరణ మార్పు (Climate change ) లు :

వాతావరణంలో ముఖ్య అంశాలైన వర్షపాతము, ఉష్ణోగ్రతలలో ఒక సంవత్సరానికి ఇంకొక సంవత్సరానికి వుండే తేడాలను “వాతావరణ వ్యత్యాసము” (Climate Variability ) అంటారు. ఉ

దా. వరుసగా 5 సంవత్సరాల వాస్తవ వర్షపాతము ( actual rainfall ) చూచినపుడు ఒక సంవత్సరానికి మరుసటి, సంవత్సరానికి వర్షపాతములో హెచ్చుతగ్గులు కనబడతాయి. ఈ హెచ్చుతగ్గులను సాధారణ సగటు వర్ష వ్యత్యాసము (Climate Variability ) అంటారు. దీర్ఘకాలంలో, అంటే 30 సంవత్సరాలకు వాస్తవ వర్షపాతాన్ని లేదా ఉష్ణోగ్రతలను లెక్కించి దీర్ఘకాల సగటు (Climate Variability ) ను నిర్ణయిస్తారు. అంటే ఉదాహరణకు 1941 నుండి 1970 సంవత్సరాల వాస్తవ వర్షపాతాన్ని తీసుకొని సగటు లెక్కిస్తారు. తరువాత అదే విధంగా 1971 నుండి 2000 సంవత్సరము వరకు సగటు వర్షపాతము లెక్కిస్తారు. ఆ విధంగా ప్రతి 30 సంవత్సరాలకు దీర్ఘకాల సగటును లెక్కిస్తారు. మొదటి సగటుతో తరువాత సగటు వర్షపాతములను పోల్చి చూచినపుడు సగటు వర్షపాతములలో వ్యత్యాసము కనపడవచ్చును. ఈ వ్యత్యాసములను వర్షపాతములో వస్తున్న “ మార్పు”లుగా భావిస్తారు. అలాగే ఉష్ణోగ్రతలలో కూడా 30 సంవత్సరాల దీర్ఘకాల సగటులను లెక్కిస్తారు. సగటు ఉష్ణోగ్రతలలోనూ మరియు సగటు వర్షపాతంలోనూ కాలక్రమేణా వచ్చే దీర్ఘకాల మార్పులు పెరగడం జరుగుచున్నది. అందుకే భూతాపం (Global Warming ) పెరుగుతున్నదని అంటున్నాము. భూతాపం పెరగడం వలన మొత్తము వాతావరణ మార్పులకు కారణమవుచున్నది.

సంవత్సరానికి సగటు ఉష్ణోగ్రత మరియు వర్షపాతం లెక్కించినట్లే ఒక నెలకు కూడా సగటు ఉష్ణోగ్రత మరియు వర్షపాతము లెక్కిస్తారు. ఒక దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, మండలానికి కూడా సగటు లెక్కిస్తారు. దీనిని సాధారణ సగటు వర్షపాతమని, సాధారణ సగటు ఉష్ణోగ్రత అని అంటారు. అంటే ఒక చోట వర్షపాతముగానీ, ఉష్ణోగ్రత కానీ ఒక సమయంలో ఎట్లా వుండబోతుందో అంచనా వేయడానికి ఇది పనికి వస్తుంది. ఒక ప్రాంతములో వర్షపాతము మరియు ఉష్ణోగ్రతలలో మార్పు వచ్చినపుడు వాటి ప్రభావంతో ఆ ప్రాంతములో మిగతా అన్ని వాతావరణ అంశాలలోనూ (గాలిలో తేమ, ఆవిరి, భాష్పీకరణ మొ॥) మార్పులు వస్తాయి.

ప్రపంచ స్థాయిలో వేగంగా చోటు చేసుకొంటున్న వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి విపత్తులు (వరదలు, పరుపులు, వరుస కరువులు, సునామీలు, వడగాలులు, మొ॥) అనూహ్యంగా, అకాలంలో కూడా ఎక్కువగా వస్తున్నాయి. ప్రజా జీవనంపైన మరియు పర్యావరణం పైన తీవ్ర దుష్ప్రభావాలను కలుగజేస్తున్నాయి.

**1.3. వాతావరణంలో మార్పులు ఎందుకు వస్తున్నాయి?**

**పరిశ్రమలు విడుదల చేసే కర్బన ఉద్గారాలు :**

ప్రపంచంలో మొత్తము దాదాపు 200 దేశాలు వున్నాయి. వాటిలో దాదాపు 100 దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెంది వున్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఆమెరికా, ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, జపాన్ మొదలగునవి. వాతావరణంలో మార్పులు రావడానికి కారణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ధనిక దేశాలలోని పరిశ్రమలు వస్తువుల ఉత్పత్తి చేసే ప్రక్రియలో ఆ పరిశ్రమల నుండి కర్బన ఉద్గారాలను (బొగ్గుపులుసు వాయువులను) గాలిలోకి వదలడం, తద్వారా భూతాపం పెరగడం, అందుమూలంగా పర్యావరణ మార్పులు జరగడం జరుగుతున్నది. కాబట్టి పర్యావరణ మార్పులకు ముఖ్యకారణం కర్బన ఉద్గారాలను విడుదల చేసే పరిశ్రమలు నడపడానికి మరియు జన జీవనానికి విద్యుచ్ఛక్తి అవసరమౌతుంది. ఆ విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు బొగ్గులాంటి ఖనిజ నిక్షేపాలను వాడటం వలన కర్బన ఉద్గారాలు (విషవాయువులు) ఎక్కువగా వెలువడుతాయి. అదే విధంగా అభివృద్ధి చెందిన దేశాలలో పెట్రోలు, డీజిలు మరియు ఇతర పెట్రోలియం ఉత్పత్తులు రవాణా (ఫ్యాక్టరీలు, లారీలు, రైల్లు

మొ..) కు పరిశ్రమలకు విరివిగా ఉపయోగించడం వలన కర్బన ఉద్గారాలు ఎక్కువగా గాలిలోకి కలుస్తాయి.

## విలాసవంతమైన, వస్తుదాహ, వినిమయ జీవన విధానము :

అభివృద్ధి చెందిన దేశాలలో పౌరులు రవాణా గృహవసరాలకు (లైట్లు, గృహోపకరణాలు, ఎ.సీలు, ఫ్రిజ్‌లు, కార్లు మొదలగునవి) అధికంగా వాడటం వలన కూడా ఉద్గారాలను అధికంగా గాలిలోకి వదలడం జరుగుతున్నది. పారిశ్రామిక అభివృద్ధి చెందిన ధనిక దేశాలలో ప్రజలు మరియు ఇతర దేశాలలోని ధనికులు కూడా వారి అవసరాలకు మించి ఆడంబరంగా, వస్తుదాహంతో విలాసవంతమైన జీవిత విధానాన్ని అలవాటు చేసుకోవడం, ఆ జీవన విధానానికి సరిపోయే విధంగా అత్యధికంగా పారిశ్రామికంగా ఉత్పత్తులు చేయడం జరుగుచున్నది. ఈ విలాసవంత జీవన విధానాన్ని జీవితానికి "వస్తుదాహ జీవన విధానము" లేదా " వినిమయ జీవన విధాన" (consumerstic life style ) మని కూడా అంటారు. వస్తుదాహమున్న సమాజంలో వ్యక్తులు వారి "అవసరాలు" తీరడంతో సంతృప్తి చెందక వస్తువులను ఆడంబరంగా, విలాసాల కోసం, హోదా (Social status ) కోసం నిరంతరాయంగా కొంటూవుంటారు. ఉదా. సాధారణ టి.వి.తో సంతృప్తి చెందక పెద్ద టి.వి. కొనడం, పక్క ఇంట్లో కూడా పెద్ద టి.వి. వుంటే దానికంటే పెద్ద టి.వి. కొనాలని భావించడం, ఇలా అంతేలేని నిరంతర వస్తుదాహంతో విలాస వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఈ వస్తు దాహాన్ని పెంచడానికి, వినియోగదారుల ఎడతెగని కోరికలను, నిత్య అసంతృప్తిని నిరంతరాయంగా పెంచడానికి పరిశ్రమలు వ్యాపార ప్రకటనలను ఉధృతం చేసి వినియోగంలో ఒక వస్తువులను" ఒకసారి ఉపయోగించి పారేయి " ( use and throw ) సంస్కృతిని పెంచే విధంగా మరియు కొత్తకొత్త వస్తువుల ఉత్పత్తిని అధికంగా చేస్తారు. వస్తు దాహ జీవన విధానముపైన నిర్మించిన ఆర్థిక వ్యవస్థను " మార్కెట్ ఆర్థిక వ్యవస్థ" (Market Economy ) అంటారు. మార్కెట్టు ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన పోటీ వ్యవస్థను పోషిస్తుంది. ఒక దేశం 20 లేదా 30 శాతం ధనికులను, మధ్య తరగతి వారిని సృష్టించి మిగిలిన 70 శాతం జనాభాను పేదరికంలో వుంచుతుంది. పేదలను, బలహీనులను దోపిడీ చేస్తుంది. ప్రకృతి వనరులను, పర్యావరణాన్ని వస్తువుల ఉత్పత్తి కోసం విచక్షణారహితంగా వినియోగించుకొని భావి తరాల భవిష్యత్తును కొల్లగొడుతుంది.

ఈ జీవన విధానంలో మన భారత దేశం లాంటి వర్తమాన దేశాలలోను, మరియు మనకంటే బీద దేశాలలో కూడా, ఒక ప్రక్క ఒక దేశంలోని తక్కువ మంది ధనికులు మంచి జీవనం గడుపుతూ, సహజ వనరులను, వస్తువులను, ఘోరంగా అవసరాలకు మించి వృధా చేస్తుంటే, ఇంకొక ప్రక్క ఎక్కువ జనాభా దారిద్ర్యంలో మగ్గుతూ, కనీస అవసరాలు కూడా తీర్చుకో లేని స్థాయిలో దుర్భర జీవనాన్ని గడుపుతుంటారు. ఈ కొందరి ఆడంబర జీవనం కోసం విరివిగా వస్తుత్పత్తి జరిగి పరిమితంగా వున్న సహజ వనరులు (అనగా నేల, నీరు, బొగ్గు, పెట్రోలు మొదలగునవి) వేగంగా ఒక ప్రక్క తరిగిపోతూ, ఇంకొక పక్క కర్బన ఉద్గారాలు ఎక్కువగా గాలిలోకి వదలడం జరుగుతుంది. తద్వారా భూతాపం పెరుగుతుంది. తద్వారా వాతావరణం మార్పులు వేగంగా వస్తాయి. తద్వారా మానవాళి మనుగడకే ముప్పు వస్తున్నది. అంటే ప్రపంచంలో ప్రకృతి ప్రసాదించిన వనరులను కొందరు మాత్రమే అత్యధికంగా వినియోగించుకోవడం జరుగుతుంది. మిగిలిన అధిక జనాభా కనీస అవసరాలు కూడా తీరని దుర్భర జీవనం గడపడం జరుగుతుంది.

కాబట్టి పర్యావరణ మార్పులకు ముఖ్యకారణం అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రజలు మరియు ఇతర దేశాలలోని ధనిక వర్గాల **విలాసవంతమైన, వస్తుదాహ జీవన విధానము.**

## 1.4 భూతాపాన్ని తగ్గించాలంటే :

సుస్థిర అభివృద్ధి విధానము ప్రపంచములోని అన్ని దేశాలు పాటించాలిః

భూతాపాన్ని తగ్గించాలంటే సుస్థిర అభివృద్ధి (Sustainable Development ) విధానంలో వస్తువుల ఉత్పత్తి, వాటి వినియోగము జరగాలి. అంటే ప్రస్తుతమున్న ఆడంబర, వస్తుదాహ జీవన విధానం మారాలి. నిరాడంబర, సమన్యాయ జీవన విధానము పాటించాలి. సహజ వనరులు తరగని విధంగా అందరి మానవ జీవనావసరాలకు సమన్యాయం ప్రాతిపదికగా ఉపయోగించుకోవాలి. ఒక ప్రక్క సహజ వనరులను ఉపయోగించుకుంటూ అదే సమయంలో వాటిని సంరక్షించి, పెంపొందించే విధంగా మన ప్రభుత్వ విధానాలు, ప్రజల జీవన విధానము, ఉత్పత్తి విధానము, వినియోగ విధానము ఉండాలి.

పరిశ్రమలు కర్బన ఉద్గారాలను తగ్గించాలంటే ప్రజల అవసరాలకు తగినంత మాత్రమే వస్తుత్పత్తి జరగాలి. మరియు పరిశ్రమలు తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వస్తువుల ఉత్పత్తి జరగాలి. ఉదాహరణకు పవన విద్యుత్తు, సౌర విద్యుత్తు లాంటి "తరగని విద్యుత్తు" (Renewable Energy ) ను ప్రోత్సహించి, బొగ్గు ఆధార విద్యుత్తు ఉత్పత్తిని బాగా తగ్గించి వేయాలి. వృక్ష సంపద, ఖనిజ సంపద లాంటి " పరిమిత " సహజ వనరుల వినియోగాన్ని బాగా తగ్గించి " సుస్థిర సహజ వనరుల నిర్వహణ" (Sustainable Natural Resources Management ) ఉండాలి. అంటే ఎంత వృక్ష సంపద ఉపయోగిస్తామో అదే సమయంలో అంత వృక్ష సంపదను తరగని విధంగా పెంచాలి. పరిశ్రమలు వస్తువుల ఉత్పత్తికి ప్రస్తుతం వినియోగించే శాస్త్ర, సాంకేతిక పద్ధతులలో మార్పు వచ్చి తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేసే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. కర్బన ఉద్గారాలను కట్టడి చేసే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించుటకు పరిశోధనలు ఉధృతం చేయాలి. కర్బన ఉద్గారాలను పీల్చుకునే (carbon sequestration ) పర్యావరణ పరిస్థితులను కల్పించాలి. విడుదల అయ్యే కర్బన ఉద్గారాలకు దీటుగా పీల్చుకొనే కర్బన నిలయాల (carbon sinks) ను విస్త ృతంగా ఏర్పాటు చేయాలి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొనే అభివృద్ధిని "సుస్థిర అభివృద్ధి" ((Sustainable Development ) అని అంటారు.

**ఈ విధానాలను ప్రపంచంలోని అన్ని దేశాలు పాటించాలి.**

**ప్రపంచములోని అన్ని దేశాలు నిరాడంబర జీవన విధానము మరియు సంరక్షణ నీతిని విధిగా పాటించాలిః**

అన్నిటి కంటే ముఖ్యంగా, విలాసవంతమైన, ఆడంబర వస్తు దాహ జీవన విధానంలో మార్పులు రావాలి. ఈ ప్రత్యామ్నాయ జీవన విధానంలో మూడు ముఖ్య అంశాలు భాగం కావాలి. 1) " నిరాడంబర జీవన విధానం " (simple living ) ప్రజలందరూ పాటించాలి. అంటే తమ అవసరాలకు తగినంతగా మాత్రమే వస్తువులను వనరులను ఉపయోగించుకోవాలి. 2) సమన్యాయం పాటించి, ధనికులకు పేదలకు మధ్య తేడా బాగా తగ్గి, సమన్యాయంగా, సమ్మిళిత అభివృద్ధి (inclusive development ) జరిగి అందరి అవసరాలు తీరాలి. 3) ప్రభుత్వముతో పాటు, ప్రజలందరిలో "పర్యావరణ స్పృహ మరియు సంరక్షణ నీతి " ( Environmental Consciousness and Ethics of Conservation ) వచ్చి, వనరుల వినియోగంలోనూ, సంరక్షణలోనూ ప్రభుత్వము మరియు ప్రతి పౌరుడు బాధ్యతగా ప్రవర్తించాలి. ఈ మూడు అంశాలు దైనందిక ప్రజా జీవనంలో, ప్రజల సంస్కృతిలో భాగం కావాలి. ప్రభుత్వ విధానలలోను, ప్రజా జీవనంలో ఈ మూడు మార్పులు వచ్చేది మొదలైతే పారిశ్రామిక ఉత్పత్తులలోనూ, మరియు ఉత్పత్తి విధానములలోనూ, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలోనూ కూడా తగిన

విధంగా మార్పులు వస్తాయి.  ఈ మార్పులు సమాజంలో వచ్చినపుడు సుస్థిర అభివృద్ధి (Sustainable Development)  సాధ్యమౌతుంది.

**మహాత్మ గాంధీ గారి నిరాడంబర జీవన సందేశమే మానవాళి భవిష్యత్తుకు శిరోధార్యము :**

ఈ సందర్భంలో మన జాతిపిత మహాత్మా గాంధీ గారు దశాబ్దాల క్రిందనే పాటించి, బోధించిన "నిరాడంబర జీవన" విధానం మనకు మార్గదర్శకమయితే పర్యావరణ మార్పులు దానంతటవే ఆగిపోతాయి.  దీనికి సంబంధించి మహాత్మగాంధీ గారు ఇంకొక విషయం కూడా ప్రస్ఫుటంగా చెప్పారు. అదేమిటంటే "అందరి అవసరాలు తీర్చేన్ని వనరులు మనకు ప్రకృతి ప్రసాదించింది. కానీ కొందరి దురాశను సంతృప్తి పరిచేన్ని వనరులు ప్రకృతి ప్రసాదించలేదు". మహాత్మగాంధీ గారు చెప్పిన ఈ రెండు సందేశాలు ప్రపంచ మానవాళికి మార్గదర్శకాలు కాకపోతే మానవ జాతి భవిష్యత్ మనుగడే తీవ్ర ప్రశ్నార్థకం.

## 2. అనంతపురము జిల్లాలో సంభవించనున్న పర్యావరణ మార్పులు :

**ప్రస్తుత పరిస్థితే దారుణంగా వుంది :**

అనంతపురము జిల్లాలో సాధారణ సంవత్సర సగటు వర్షపాతము 552 మి.మీ. మనదేశంలో వర్షపు సంవత్సరం అంటే జూన్ 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు. మన జిల్లాలో నైరుతి రుతుపవనాల రాకతో వర్షాకాలము సాధారణంగా జూన్ 7వ తేదీ (కొన్ని రోజులు వెనుక ముందు) మొదలై దాదాపు సెప్టెంబరుకు నైరుతి రుతుపవనాల వర్షాకాలం ముగుస్తుంది. ఈశాన్య రుతుపవనాలు అక్టోబరులో మొదలై నవంబరుతో ముగుస్తాయి.

అనంతపురము జిల్లాలో ఇప్పటికే కొన్ని ముఖ్యమైన అనానుకుల (unfavourable ) వాతావరణ సమస్యలు ఉన్నాయి.  అవి 1) తక్కువ నిడివి (short duration ) గల వర్షాకాలము (జూన్ నుండి నవంబరు వరకు)  2) తక్కువ వర్షదినాలు మరియు తక్కువ వర్షపాతము, 3) వర్షానికి–వర్షానికి వరుపు (dry spells ) లు (బెట్టలు), 4) అధిక ఉష్ణోగ్రతల కారణంగా అధికంగా తేమ ఆవిరి, భాష్పీకరణం (Evapotranspiration) జరగడం, 5) ఒకే దినములో అత్యల్ప ఉష్ణోగ్రతలకు మరియు అత్యధిక ఉష్ణోగ్రతలకు తేడా ఎక్కువగా వుండడం, 6) సగటు సంవత్సరం వర్షపాతం 552 మి.మీ. వుండగా ఆ వర్షపాతము 200 మి.మీ. వరకు (Deviation ) తక్కువ లేదా ఎక్కువగా కురవడం, లేదా 200 మి.మీ. పెరిగి 750 మి.మీ. వరకు వర్షము పడుతుంది.  వర్షపాతములో ఇంత వ్యత్యాసము వ్యవసాయాన్ని, గ్రామీణ జీవనోపాధులను తీవ్ర అనిశ్చితికి గురిచేస్తున్నది. పై కారణాల వల్ల మన జిల్లా వాతావరణం వ్యవసాయానికి, పరిశ్రమలకు, ఇతర జీనవోపాధులకు, పర్యావరణానికి చాలా "అనానుకూలం"  (unfavourable ) గా వుంటూ, జీవాశ్రయానికి వీలు లేకుండాపోతున్నది.  జీవరాశు లు నశించి ఎడారీకరణ వేగంగా జరుగుచున్నది.

**భూతాపం మూలంగా రానున్న వాతావరణ మార్పులు గోరుచుట్టుపై రోకలి పోటు :**

ఈ పరిస్థితులలో గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా రానున్న వాతావరణ మార్పులు మన జిల్లా పరిస్థితిని మరింత దుర్భరం గావించనున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞుల నివేదికలు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సు (UNFCCC) యొక్క ఒక నివేదిక ప్రకారము మన జిల్లా వాతావరణంలో రాబోవు కాలములో తీవ్రమైన మార్పులు వస్తాయని అంచనా వేయడం జరిగింది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ మార్పుల సదస్సు (UNFCCC) అనే సంస్థ ప్రపంచంలోని అన్ని దేశాల (194 దేశాలు) సభ్యత్వం కలిగి వాతావరణ మార్పులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవడానికి ప్రపంచదేశాలు ఏర్పాటు చేసుకొన్న ఐక్యరాజ్యసమితి యొక్క అనుబంధ సంస్థ.

## 2.1 వర్షపాతములో రానున్న మార్పులు :

మొదట 1961-1990 వ సంవత్సరాలలో పర్యావరణాన్ని (అంటే వర్షపాతము, ఉష్ణోగ్రతలు) గీటురాయిగా తీసుకొని 2021-2050 మధ్య సంవత్సరాలు ఒక కాల వ్యవధి గానూ, మరియు 2071-2098 మధ్య సంవత్సరాలు ఇంకొక కాల వ్యవధి గానూ తీసుకొని వాతావరణ మార్పులు అంచనా వేయడం జరిగింది.

ఈ సంస్థ నివేదిక ప్రకారము 1961-90 సంవత్సరాల సగటు వర్షపాతములో పోల్చుకున్నప్పుడు 2021-2050 సంవత్సరాలలో సంవత్సర సగటు వర్షపాతం 14.4 శాతం తగ్గుతుంది. మరియు 2071-2098 సంవత్సరాలకు అదనంగా 8.7 శాతం తగ్గే అవకాశము ఉందని అంచనా వేయడం జరిగింది. అందులో నైరుతి రుతుపవనాల సగటు వర్షపాతము (జూన్-సెప్టెంబరు) 2021-2050 సంవత్సరాలలో 17 శాతం మరియు 2071-2098 సంవత్సరాలలో 29.4 శాతం తగ్గే అవకాశం ఉందని అంచాన వేయడం జరిగింది. నైరుతి రుతుపవనాల నెలలో వర్షపాతం తగ్గుదల కారణంగా కరువుల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం వుంది. ఎందుకంటే మన జిల్లాలో వర్షాధార పంటలకు నైరుతి రుతుపవనాలే ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.

జూలై నెలలో వర్షపాతము 2071-2098 సంవత్సరాలలో (1961-1990 నాటితో పోల్చుకున్నప్పుడు) 39.6 శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. జూలై నెలలో వర్షపాతం ఇంత ఎక్కువగా తగ్గడం వలన అదనులో విత్తనం పడదు. దాని మూలంగా 2071-2098 సంవత్సరాలకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ రెండు నెలల వర్షపాతంలో ఇంత ఎక్కువ స్థాయిలో మార్పు వర్షాధార పంటలకు (ఖరీఫ్) మరింత తీవ్ర నష్టం చేస్తుంది.

డిసెంబరు - మార్చి నెలలో వర్షపాతం సాధారణం కన్నా పెరుగుతుందని అంచనా వేయబడింది. ఈ పెరుగుదల రబీ పంటలకు కొంత మేలు చేయవచ్చు. జూలై- సెప్టెంబరు నెలలో తగ్గిన వర్షము డిసెంబరు- మార్చి నెలలో పెరుగుదల వలన కొంతవరకు పూరించబడినప్పడికీ సాంవత్సరిక సగటు వర్షపాతము మొత్తము మీద దాదాపు 20 శాతము 2071-2098 నాటికి తగ్గుతుందని అంచనా వేయబడింది.

## ఉష్ణోగ్రతలలో మార్పులు :

అనంతపురము జిల్లాలో సంవత్సర సగటు గరిష్ట ( mean maximum temperature) ఉష్ణోగ్రతలు 1961-1990 సంవత్సరాల కాల వ్యవధితో పోల్చుకున్నప్పుడు 2021-2098 వ సంవత్సరాలలో 4.7 సెంటిగ్రేడు డిగ్రీలు పెరుగుతుందని అంచనా వేయబడింది. అంటే, వర్షపాతము తగ్గుతూ, వేడి ఎక్కువవుతున్నది. ఈ రెండు మార్పులు వర్షాధార (ఖరీఫ్) పంటలపై తీవ్ర ప్రతికూల ప్రభావము చూపి పంట దిగుబడులు బాగా తగ్గిపోయే అవకాశం వుంది. తరువాత రబీ సీజనులో -అంటే అక్టోబరు-మార్చి నెలల కాలములో కూడా 2021-2050 సంవత్సరాల కాలవ్యవధిలో 3.9 డిగ్రీలు మరియు 2071-2098 సంవత్సరాల కాల వ్యవధిలో 5.2 డిగ్రీలు పెరుగుతుందని అంచనా వేయబడింది. ఎండకాలములో ముఖ్యంగా ఏప్రిల్, మే నెలలో సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 2021-2050 సంవత్సరాల కాల వ్యవధిలో 2.8 డిగ్రీలు, 2071-2098 సంవత్సరాల కాలవ్యవధిలో 4.8 డిగ్రీలు పెరగనున్నట్లు అంచనా వేయబడింది. కాబట్టి ఎండాకాలము ఇంకా తీవ్రము కానున్నది. అంటే ఈ శతాబ్ధము చివరకు అనంతపురము జిల్లాలో చలికాలము దాదాపు లేకుండా పోయే పరిస్థితి కనపడుతుంది.

సంవత్సర సగటు కనిష్ట ఉష్ణోగ్రతలలో 2021-2050 సంవత్సరాల కాల వ్యవధిలో 2.9

డిగ్రీలు మరియు 2071-2098 సంవత్సరాల కాల వ్యవధిలో 5.2 డిగ్రీలు పెరగవచ్చునని అంచనా వేయబడింది. జూన్-సెప్టెంబరు నెలల మధ్యకాలములో కనిష్ట ఉష్ణోగ్రతలు 2.2 డిగ్రీలు మరియు 2071-2098 సంవత్సర కాల వ్యవధిలో 4.2 డిగ్రీలు పెరగవచ్చని అంచనా వేయబడింది. అక్టోబరు-మార్చి నెలలలో 2021-2050 సంవత్సరాల కాల వ్యవధిలో 3.4 డిగ్రీలు మరియు 2071-2098 సంవత్సరాల కాల వ్యవధిలో 5.3 పెరగవచ్చని అంచనా వేయబడింది. ఈ మార్పులు పంటల దిగుబడి పైన, ఇతర గ్రామీణ జీవనోపాదులపైన మరియు ప్రజల ఆరోగ్యము పైన, పశు పక్షాదులు, వృక్షాలు, సూక్ష్మజీవులు, ఇతర జీవరాశుల పైన తీవ్ర దుష్ప్రభావాన్ని కలుగజేస్తాయి.

**ముగింపు :**

పై మార్పులు ఒక్క రోజులోనో ఒక్క సంవత్సరంలో ఉన్న ఫలంగానో రావు. నెమ్మదిగా 20 నుండి 30 సంవత్సరాలలో మార్పుల పోకడలు ప్రస్పుటమౌతుంటాయి. ఇంకొక ముఖ్యమైన విషయమేమంటే, పారిశ్రామిక అభివృద్ధికి ముందు శతాబ్దాలలో కూడా వాతావరణంలో మార్పులు వస్తుండేవి. అయితే చిన్న మార్పు రావాడానికి కొన్ని శతాబ్దాలు పట్టేది. ఉదాహరణకు ఉష్ణోగ్రతలో చిన్న మార్పు రావడానికి నూర్ల సంవత్సరాలు పట్టేది. ప్రస్తుతము 20 లేక 30 సంవత్సరాలలో మార్పు వస్తున్నది. కాబట్టి పారిశ్రామిక విప్లవం తరువాత కర్బన ఉద్గారాల కారణంగా భూతాపం పెరిగి వాతావరణంలో మార్పుల వేగం విపరీతంగా పెరిగిపోయింది.

సగటు వర్షపాతములోనూ మరియు సగటు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలలోనూ మార్పులను బట్టి వాయు పీడనం, గాలిలో తేమ, మేఘావృతము మొదలగు అంశాలలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. మొత్తము మీద దీర్ఘకాలములో అన్ని నెలలలోనూ వాతావరణ మార్పులు వస్తాయని అంచనా వేయబడింది. అంటే అన్ని రుతువులు గతి తప్పుతాయి. అకాల వర్షాలు, వరదలు, వరుపులు, కరువులు, సునామీలు అనూహ్యంగా సంభవిస్తాయి. ఎండాకాలములో ప్రస్తుతము మే నెల తీవ్రమైన వేడి నెలగా వుంది. రాబోవు కాలంలో ఏప్రిల్ నెల తీవ్రమైన వేడి నెలగా మార్పు చెందనుంది. శీతాకాలము దాదాపు కనుమరుగవుతుంది. ఈ మార్పులకు తట్టుకొనే విధంగా మన వ్యవసాయంలో పంటలలో, పంటల సరళిలో అనేక మార్పులను తీసుకొని రావలసి వుంటుంది.

ఐక్య రాజ్య సమితి వాతావరణ మార్పులు ఆధ్వర్యంలో ఈ వాతావరణ మార్పుల వేగాన్ని తగ్గించడానికి కొని చర్యలను ఇప్పటికే చేపట్టింది. అయితే ఇప్పటికే చేపట్టిన చర్యలు సమస్య తీవ్రతకు ఏ మాత్రము సరిపోవు. కాబట్టి వాతావరణ మార్పులను తగ్గించడానికి ప్రపంచములోని అన్ని దేశాలు 2015 డిసెంబరు నెలలో పారిస్ నగరంలో కలిసి ఈ విషయంలో వేగంగా ఉధృతంగా స్పందించాల్సిన అవసరాన్ని ఏకగ్రీవంగా అంగీకరించి ఒక స్థూల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించినాయి. ఈ ఒడంబడికను యిక ఉల్లంఘించడానికి వీలులేని అంతర్జాతీయ చట్టస్థాయిని త్వరలో కల్పిస్తారు. ఈ ఒప్పందానికి అనుగుణంగా ప్రతి దేశంలో వాతావరణ మార్పులను అరికట్టడానికి అమలు చేయవలసినవి వివరణాత్మక నిర్దిష్టత కార్యాచరణను 2021 వ సంవత్సరంలోపల తయారు చేసి, సభ్యదేశాల ఆమోదము తీసుకోవలసి వుంది. ఈ కొత్త అంతర్జాతీయ ఒప్పందము క్రింద ప్రపంచములోని అన్ని దేశాలు వారి వారి స్థాయిలో వాతావరణ మార్పులను అరికట్టడానికి నిర్దిష్ట కార్యక్రమాలు అమలు చేయవలసి వుంటుంది. ఈ అంతర్జాతీయ ఒప్పందాన్ని ఉల్లంఘించుటకు ఏ దేశానికి అవకాశముండదు. ఈ కార్యక్రమాన్ని కార్యాచరణను ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సదస్సు పర్యవేక్షణ క్రింద అమలు చేస్తారు.

తేదీ : 11-06-2016

## STATEMENT SHOWING THE RECEIPT OF RAINFALL FOR THE LAST 140 YEARS(IN M.Ms.) IN ANANTAPUR DIST.,

| | SOUTH-WEST MONSOON | | | | NORTH-EAST MONSOON | | WINTER PERIOD | | | HOT WEATHER PERIOD | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| YEAR | June | July | August | September | October | November | December | January | February | March | April | May | Total |
| Dist.NORMAL | 47.0 | 53.2 | 78.8 | 131.8 | 92.8 | 46.3 | 7.9 | 3.4 | 5.0 | 4.2 | 19.2 | 54.3 | 544.0 |
| 1876-77 | 53.8 | 17.3 | 32.5 | 31.8 | 0.5 | 3.6 | -- | 0.5 | -- | 31.8 | 0.8 | 64.0 | 236.6 |
| 1877-78 | 105.7 | 36.1 | 35.3 | 164.6 | 231.4 | 33.8 | 2.3 | -- | -- | 2.5 | 13.2 | 42.4 | 667.3 |
| 1878-79 | 113.0 | 145.3 | 193.0 | 201.2 | 184.7 | 55.9 | 2.5 | 0.3 | 20.6 | 1.5 | 1.0 | 208.8 | 1127.8 |
| 1879-80 | 35.1 | 135.9 | 53.6 | 64.5 | 78.2 | 11.4 | -- | -- | -- | 1.5 | 7.1 | 58.7 | 446.0 |
| 1880-81 | 88.6 | 23.1 | 87.1 | 43.4 | 197.9 | 73.7 | 2.3 | -- | -- | 3.3 | 16.5 | 33.5 | 569.4 |
| 1881-82 | 24.6 | 5.6 | 104.9 | 131.3 | 40.6 | 65.0 | 2.5 | 8.4 | -- | 2.0 | 6.1 | 55.1 | 446.1 |
| 1882-83 | 16.3 | 27.2 | 140.7 | 119.1 | 46.5 | 141.7 | -- | - | -- | 14.2 | 14.2 | 19.8 | 539.7 |
| 1883-84 | 74.4 | 46.7 | 194.6 | 9.4 | 192.5 | 38.6 | 12.2 | 4.1 | -- | -- | 5.1 | 24.4 | 602.0 |
| 1884-85 | 24.1 | 11.7 | 32.3 | 32.5 | 97.5 | 49.0 | 11.4 | -- | -- | 14.2 | 2.0 | 41.9 | 316.6 |
| 1885-86 | 30.2 | 72.1 | 27.9 | 89.2 | 170.7 | 18.3 | 24.4 | -- | -- | 1.0 | 4.1 | 51.6 | 489.5 |
| 1886-87 | 55.9 | 124.2 | 171.2 | 55.4 | 125.2 | 59.4 | 15.5 | -- | -- | -- | 2.0 | 60.7 | 669.5 |
| 1887-88 | 40.4 | 28.4 | 201.4 | 178.3 | 73.7 | 73.9 | 14.0 | -- | -- | -- | 33.8 | 51.3 | 695.2 |
| 1888-89 | 28.4 | 42.4 | 34.5 | 152.1 | 40.1 | 125.7 | 1.5 | -- | -- | -- | 7.9 | 31.0 | 463.6 |
| 1889-90 | 69.6 | 94.5 | 59.4 | 295.9 | 251.5 | 21.6 | 3.0 | -- | -- | 4.8 | 26.7 | 32.8 | 859.8 |
| 1890-91 | 43.4 | 27.2 | 60.2 | 108.7 | 105.9 | 100.8 | 14.5 | -- | -- | 3.3 | 13.0 | 7.4 | 484.4 |
| 1891-92 | 49.3 | 38.4 | 43.4 | 8.4 | 89.2 | 22.6 | 1.3 | -- | 0.8 | -- | 19.3 | 18.3 | 291.0 |
| 1892-93 | 167.1 | 118.1 | 165.9 | 92.2 | 110.0 | 4.8 | 16.8 | 1.5 | 3.8 | 18.5 | 24.5 | 62.5 | 785.7 |
| 1893-94 | 97.1 | 101.9 | 49.8 | 71.6 | 157.5 | 54.9 | -- | -- | 0.5 | 3.0 | 27.7 | 37.6 | 601.6 |
| 1894-95 | 24.6 | 62.2 | 165.9 | 59.9 | 162.3 | 22.9 | -- | -- | 0.8 | -- | 38.1 | 39.1 | 575.8 |
| 1895-96 | 44.7 | 61.0 | 43.7 | 224.3 | 159.3 | 30.2 | 7.1 | -- | -- | 0.8 | 5.3 | 61.7 | 638.1 |
| 1896-97 | 72.1 | 34.3 | 58.2 | 62.0 | 10.4 | 38.4 | 3.3 | 0.3 | 2.5 | 1.0 | 9.1 | 30.7 | 322.3 |
| 1897-98 | 85.1 | 39.1 | 97.3 | 304.3 | 64.4 | 2.3 | 4.8 | -- | 2.5 | -- | 25.7 | 40.6 | 666.1 |
| 1898-99 | 43.9 | 22.9 | 30.8 | 188.5 | 27.9 | 90.4 | 12.2 | -- | -- | -- | 44.7 | 20.0 | 481.3 |
| 1899-1900 | 11.4 | 5.1 | 49.3 | 233.9 | 52.8 | 8.4 | -- | -- | -- | -- | 41.4 | 25.1 | 427.4 |
| 1900-01 | 46.5 | 127.5 | 44.5 | 194.3 | 76.7 | 2.5 | 3.0 | 3.6 | 39.4 | -- | 8.9 | 67.1 | 614.0 |
| 1901-02 | 36.6 | 27.4 | 21.1 | 145.3 | 66.8 | 49.0 | 6.1 | 5.1 | -- | -- | 26.4 | 36.1 | 419.9 |
| 1902-03 | 78.2 | 34.3 | 57.4 | 153.7 | 160.3 | 15.7 | 3.8 | 1.3 | -- | -- | 13.5 | 51.8 | 570.0 |
| 1903-04 | 64.0 | 88.9 | 87.0 | 207.0 | 110.8 | 202.4 | 5.3 | 2.0 | -- | 1.0 | 16.0 | 102.6 | 887.0 |
| 1904-05 | 33.8 | 47.0 | 17.3 | 74.4 | 161.0 | -- | 1.5 | 2.3 | 3.0 | 14.0 | 7.9 | 53.8 | 416.0 |
| 1905-06 | 37.8 | 24.4 | 194.3 | 26.4 | 113.0 | 3.6 | 0.5 | 18.3 | -- | -- | -- | 13.5 | 431.8 |
| 1906-07 | 69.9 | 79.5 | 133.6 | 141.2 | 115.1 | 8.1 | 99.3 | 0.3 | -- | 1.0 | 46.7 | 5.8 | 700.5 |
| 1907-08 | 47.5 | 135.1 | 21.8 | 103.9 | 16.0 | 54.1 | 4.8 | 9.9 | 0.3 | 13.7 | 6.4 | 32.8 | 446.3 |
| 1908-09 | 46.5 | 41.9 | 18.0 | 186.4 | 30.7 | | -- | 21.6 | 0.3 | -- | 38.9 | 87.4 | 471.7 |

| YEAR | SOUTH-WEST MONSOON | | | | NORTH-EAST MONSOON | | WINTER PERIOD | | | HOT WEATHER PERIOD | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| YEAR | June | July | August | September | October | November | December | January | February | March | April | May | Total |
| Dist.NORMAL | 47.0 | 53.2 | 78.8 | 131.8 | 92.8 | 46.3 | 7.9 | 3.4 | 5.0 | 4.2 | 19.2 | 54.3 | 544.0 |
| 1909 - 10 | 33.8 | 36.1 | 236.7 | 179.8 | 26.2 | 6.9 | 0.3 | -- | -- | -- | 9.9 | 36.8 | 566.5 |
| 1910 - 11 | 40.6 | 162.3 | 124.7 | 193.5 | 116.1 | 87.4 | -- | -- | -- | 2.5 | 20.1 | 58.7 | 805.9 |
| 1911 - 12 | 58.9 | 48.8 | 52.3 | 96.8 | 78.5 | 11.2 | 5.3 | -- | 5.1 | 2.3 | 8.9 | 20.6 | 388.7 |
| 1912 - 13 | 40.6 | 54.4 | 132.1 | 228.3 | 129.0 | 100.6 | -- | -- | -- | -- | 2.3 | 74.4 | 761.7 |
| 1913 - 14 | 53.1 | 83.1 | 10.7 | 164.6 | 87.9 | | 2.0 | -- | -- | -- | 14.5 | 47.0 | 462.9 |
| 1914 - 15 | 38.1 | 45.2 | 93.0 | 127.0 | 32.5 | 29.5 | 2.5 | 16.5 | -- | 38.6 | 10.4 | 67.8 | 501.1 |
| 1915 - 16 | 61.0 | 118.1 | 27.7 | 235.2 | 52.8 | 102.9 | 0.5 | -- | -- | -- | 6.4 | 81.3 | 685.9 |
| 1916 - 17 | 31.8 | 212.9 | 132.6 | 158.2 | 154.9 | 71.1 | -- | -- | 81.8 | 5.8 | 9.4 | 45.4 | 903.9 |
| 1917 - 18 | 90.9 | 33.8 | 148.8 | 225.0 | 114.6 | 76.5 | 0.3 | 6.9 | -- | 3.3 | 14.2 | 94.0 | 808.3 |
| 1918 - 19 | 22.4 | 12.4 | 28.7 | 182.9 | 1.0 | 113.5 | 8.9 | 5.1 | -- | 13.7 | 41.1 | 56.6 | 486.3 |
| 1919 - 20 | 62.5 | 73.4 | 13.7 | 324.4 | 39.9 | 98.3 | 6.6 | 21.8 | 0.5 | -- | 3.6 | 24.9 | 669.6 |
| 1920 - 21 | 18.8 | 14.5 | 54.9 | 118.4 | 41.7 | 16.5 | -- | 4.6 | -- | -- | 60.2 | 8.6 | 338.2 |
| 1921 - 22 | 57.9 | 88.4 | 34.3 | 61.2 | 241.8 | 57.2 | -- | 40.1 | -- | -- | 9.1 | 46.5 | 636.5 |
| 1922 - 23 | 16.8 | 25.7 | 47.8 | 10.2 | 96.3 | 153.9 | 0.5 | 15.2 | 14.5 | 16.3 | 20.3 | 37.6 | 455.1 |
| 1923 - 24 | 38.9 | 43.4 | 11.2 | 114.0 | 19.8 | | 0.3 | -- | -- | -- | 17.8 | 58.9 | 304.3 |
| 1924 - 25 | 46.5 | 51.3 | 81.5 | 181.4 | 33.8 | 66.8 | -- | -- | -- | -- | 25.4 | 103.9 | 590.6 |
| 1925 - 26 | 14.7 | 43.7 | 80.3 | 122.7 | 98.9 | 52.8 | 55.6 | 15.2 | -- | 1.5 | 38.1 | 43.8 | 567.3 |
| 1926 - 27 | 89.2 | 42.4 | 16.8 | 149.4 | 84.1 | 3.3 | -- | -- | 1.0 | -- | 1.5 | 32.0 | 419.7 |
| 1927 - 28 | 65.0 | 88.9 | 48.5 | 194.8 | 42.4 | 106.4 | -- | -- | 33.5 | 4.3 | 20.8 | 32.5 | 637.1 |
| 1928 - 29 | 62.5 | 93.0 | 75.9 | 85.1 | 145.8 | 5.6 | 5.1 | 2.8 | 17.0 | 2.3 | 32.0 | 62.0 | 589.1 |
| 1929 - 30 | 26.4 | 15.2 | 24.1 | 228.6 | 112.3 | 85.6 | 6.4 | 3.3 | 2.3 | 10.4 | 4.6 | 109.7 | 628.9 |
| 1930 - 31 | 54.1 | 35.3 | 45.0 | 143.0 | 188.5 | 50.0 | 30.2 | -- | -- | 3.3 | 2.3 | 39.6 | 591.3 |
| 1931 - 32 | 83.6 | 21.6 | 10.9 | 143.8 | 31.5 | 43.9 | 9.4 | -- | 8.6 | -- | 5.8 | 56.4 | 415.5 |
| 1932 - 33 | 41.0 | 44.2 | 146.7 | 83.1 | 113.3 | 66.0 | 0.8 | -- | 2.5 | 3.0 | 25.1 | 102.4 | 628.1 |
| 1933 - 34 | 17.5 | 82.6 | 195.3 | 67.3 | 110.7 | 18.3 | 37.1 | 1.5 | 0.5 | -- | 28.4 | 28.2 | 587.4 |
| 1934 - 35 | 41.9 | 66.0 | 22.4 | 5.3 | 72.1 | 39.1 | 0.8 | -- | 1.3 | 3.3 | 35.3 | 33.0 | 320.5 |
| 1935 - 36 | 65.8 | 36.8 | 259.3 | 50.3 | 118.9 | -- | 1.0 | -- | 8.6 | 13.7 | 11.4 | 76.5 | 642.3 |
| 1936 - 37 | 52.6 | 28.4 | 31.0 | 160.8 | 55.9 | 103.6 | 4.1 | -- | 13.0 | 5.8 | 86.4 | 45.5 | 587.1 |
| 1937 - 38 | 36.1 | 49.3 | 27.2 | 126.5 | 143.8 | 24.6 | 5.1 | -- | 1.3 | 5.3 | 2.3 | 74.4 | 495.9 |
| 1938 - 39 | 31.5 | 47.2 | 327.2 | 232.2 | 13.0 | 3.0 | -- | 0.5 | -- | 14.7 | 45.0 | 18.0 | 732.3 |
| 1939 - 40 | 74.7 | 31.0 | 94.7 | 127.0 | 87.9 | 52.3 | -- | -- | -- | -- | 43.4 | 122.9 | 633.9 |
| 1940 - 41 | 37.3 | 29.7 | 47.5 | 104.1 | 209.8 | 66.3 | 1.0 | 1.8 | 8.9 | -- | 9.7 | 29.2 | 545.3 |
| 1941 - 42 | 20.6 | 39.9 | 60.7 | 163.8 | 95.3 | 22.9 | 71.4 | 2.3 | 1.0 | -- | 18.8 | 33.0 | 529.7 |
| 1942 - 43 | 121.2 | 22.1 | 81.0 | 31.8 | 27.9 | 11.9 | 2.5 | 7.1 | -- | -- | 24.9 | 126.2 | 456.6 |
| 1943 - 44 | 13.0 | 22.4 | 35.6 | 120.4 | 140.2 | 47.8 | -- | -- | 17.8 | 38.1 | 4.3 | 21.3 | 460.9 |
| 1944 - 45 | 100.3 | 95.3 | 17.0 | 116.8 | 182.1 | 21.1 | -- | -- | -- | -- | 23.4 | 61.2 | 617.2 |
| 1945 - 46 | 20.6 | 79.0 | 58.4 | 69.3 | 29.0 | 24.1 | -- | -- | 1.0 | 4.6 | 8.9 | 74.4 | 369.3 |
| 1946 - 47 | 14.2 | 37.3 | 106.2 | 142.0 | 70.9 | 114.8 | 34.0 | 1.8 | 1.5 | -- | 6.4 | 11.5 | 540.6 |
| 1947 - 48 | 66.8 | 58.2 | 94.5 | 190.5 | 59.2 | 7.4 | 6.1 | 0.8 | -- | 0.3 | 36.6 | 54.9 | 575.3 |
| Dist.NORMAL | 47.0 | 53.2 | 78.8 | 131.8 | 92.8 | 46.3 | 7.9 | 3.4 | 5.0 | 4.2 | 19.2 | 54.3 | 544.0 |

| | SOUTH-WEST MONSOON | | | | NORTH-EAST MONSOON | | WINTER PERIOD | | | HOT WEATHER PERIOD | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| YEAR | June | July | August | September | October | November | December | January | February | March | April | May | Total |
| 1948 - 49 | 21.1 | 46.7 | 90.7 | 84.8 | 58.1 | 89.7 | -- | -- | -- | -- | 4.1 | 72.4 | 467.6 |
| 1949 - 50 | 43.4 | 65.5 | 127.7 | 161.0 | 114.3 | 11.2 | -- | -- | 5.1 | -- | 2.0 | 69.3 | 599.5 |
| 1950 - 51 | 33.8 | 88.6 | 88.9 | 102.6 | 117.3 | 30.7 | -- | -- | -- | 17.8 | 2.5 | 78.7 | 560.9 |
| 1951 - 52 | 52.8 | 63.5 | 17.8 | 135.3 | 17.8 | 8.6 | -- | -- | -- | 10.4 | 19.1 | 84.6 | 409.9 |
| 1952 - 53 | 7.6 | 50.8 | 38.1 | 40.6 | 106.6 | | 35.5 | -- | -- | -- | 50.4 | 22.9 | 352.5 |
| 1953 - 54 | 55.8 | 137.1 | 20.3 | 134.6 | 218.5 | 0.2 | -- | -- | -- | -- | 10.2 | 40.6 | 617.3 |
| 1954 - 55 | 30.4 | 109.2 | 63.5 | 35.5 | 124.4 | | -- | -- | -- | 10.2 | 30.5 | 106.7 | 510.4 |
| 1955 - 56 | 30.4 | 55.4 | 101.6 | 167.6 | 104.1 | 25.4 | 2.5 | 12.7 | 1.0 | -- | 50.9 | 47.7 | 599.3 |
| 1956 - 57 | 56.9 | 99.3 | 28.4 | 170.0 | 222.2 | 70.1 | 8.3 | -- | 2.3 | 10.9 | 16.0 | 53.1 | 737.5 |
| 1957 - 58 | 110.7 | 52.1 | 47.0 | 77.7 | 87.1 | 42.1 | 0.2 | -- | -- | -- | 25.4 | 91.4 | 533.7 |
| 1958 - 59 | 30.5 | 85.5 | 106.7 | 121.9 | 111.7 | 35.5 | -- | -- | -- | -- | 12.7 | 48.8 | 553.3 |
| 1959 - 60 | 106.6 | 81.3 | 63.5 | 170.2 | 25.4 | | -- | -- | -- | -- | 12.7 | 50.8 | 510.5 |
| 1960 - 61 | 25.4 | 51.8 | 12.7 | 231.1 | 35.5 | 55.9 | -- | -- | -- | -- | 15.2 | 76.0 | 503.6 |
| 1961 - 62 | 73.6 | 35.7 | 35.5 | 30.2 | 137.2 | 15.5 | -- | -- | -- | -- | 38.1 | 45.7 | 411.5 |
| 1962 - 63 | 43.2 | 85.5 | 124.4 | 83.8 | 149.8 | 10.1 | 68.4 | -- | -- | 6.3 | 30.8 | 40.6 | 642.9 |
| 1963 - 64 | 30.5 | 33.0 | 101.6 | 106.7 | 152.4 | 6.3 | -- | -- | -- | -- | 6.3 | 10.1 | 446.9 |
| 1964 - 65 | 80.9 | 134.6 | 35.5 | 210.8 | 40.2 | 43.2 | -- | -- | -- | -- | 20.3 | 10.1 | 575.6 |
| 1965 - 66 | 43.2 | 22.8 | 132.0 | 86.3 | -- | 5.1 | 33.0 | 32.0 | -- | -- | 15.3 | 38.1 | 407.8 |
| 1966 - 67 | 83.8 | 66.0 | 88.1 | 137.2 | 81.3 | 86.3 | 12.7 | -- | -- | 10.2 | 10.2 | 65.9 | 641.7 |
| 1967 - 68 | 43.2 | 116.2 | 17.8 | 121.9 | 119.8 | 12.1 | 10.2 | -- | 16.7 | 16.4 | 30.3 | 39.8 | 544.4 |
| 1968 - 69 | 42.0 | 39.4 | 6.2 | 184.9 | 83.0 | 28.8 | 10.2 | -- | -- | -- | 5.4 | 91.2 | 491.1 |
| 1969 - 70 | 21.9 | 23.7 | 163.3 | 27.4 | 142.9 | 8.5 | 11.2 | 0.6 | 1.1 | -- | 11.3 | 108.4 | 520.3 |
| 1970 - 71 | 18.7 | 25.0 | 69.7 | 147.5 | 117.3 | 3.4 | -- | 1.6 | 1.0 | 2.3 | 13.3 | 41.5 | 441.3 |
| 1971 - 72 | 23.1 | 25.7 | 96.4 | 117.2 | 165.8 | 6.8 | 1.4 | -- | -- | -- | 8.3 | 113.9 | 558.6 |
| 1972 - 73 | 43.8 | 13.3 | 6.5 | 140.2 | 147.4 | 42.0 | 8.4 | -- | -- | -- | 2.9 | 17.2 | 421.7 |
| 1973 - 74 | 66.9 | 26.1 | 91.5 | 193.8 | 177.3 | 21.5 | 2.1 | -- | -- | 0.9 | 12.9 | 107.4 | 700.4 |
| 1974 - 75 | 45.3 | 50.3 | 30.7 | 217.7 | 164.6 | 2.7 | -- | -- | -- | 12.4 | 2.5 | 48.0 | 574.2 |
| 1975 - 76 | 21.3 | 128.5 | 87.3 | 127.9 | 247.9 | 72.4 | 1.0 | -- | -- | -- | 23.7 | 13.6 | 723.6 |
| 1976 - 77 | 48.5 | 33.2 | 117.6 | 17.2 | 34.4 | 31.8 | -- | -- | -- | 3.4 | 14.8 | 134.4 | 435.3 |
| 1977 - 78 | 76.7 | 69.1 | 100.6 | 100.3 | 126.9 | 60.7 | -- | -- | 2.1 | 0.9 | 19.1 | 37.4 | 593.8 |
| 1978 - 79 | 30.3 | 76.0 | 42.1 | 161.5 | 54.0 | 62.3 | 22.8 | -- | 12.7 | 0.4 | 5.9 | 36.1 | 504.1 |
| 1979 - 80 | 48.2 | 45.0 | 61.2 | 228.2 | 47.3 | 108.4 | -- | -- | -- | 3.7 | 13.7 | 46.1 | 601.8 |
| 1980 - 81 | 51.0 | 32.8 | 39.3 | 101.6 | 48.4 | 46.6 | 4.7 | 3.8 | -- | 14.6 | 10.0 | 47.6 | 400.4 |
| 1981 - 82 | 37.8 | 76.8 | 81.7 | 276.1 | 86.1 | 40.8 | 6.8 | -- | -- | 0.7 | 15.7 | 44.6 | 667.1 |
| 1982 - 83 | 69.2 | 67.3 | 12.6 | 138.5 | 65.6 | 121.6 | -- | -- | 0.1 | -- | 0.1 | 50.5 | 525.5 |
| 1983 - 84 | 79.8 | 25.1 | 100.9 | 179.2 | 41.2 | 3.5 | 21.4 | -- | 2.9 | 33.8 | 15.0 | 10.9 | 513.7 |
| 1984 - 85 | 8.5 | 113.8 | 10.6 | 77.9 | 59.5 | 5.3 | 7.8 | 0.9 | -- | 2.8 | 13.2 | 29.0 | 329.3 |
| 1985 - 86 | 34.5 | 57.3 | 17.6 | 48.3 | 75.9 | 13.4 | 2.1 | 11.7 | 11.9 | -- | 7.5 | 14.4 | 294.6 |

| | SOUTH-WEST MONSOON | | | | NORTH-EAST MONSOON | | WINTER PERIOD | | | HOT WEATHER PERIOD | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| YEAR | June | July | August | September | October | November | December | January | February | March | April | May | Total |
| Normals: | 46.9 | 55.8 | 71.7 | 122.1 | 96.4 | 34.9 | 9.2 | 2.5 | 3.6 | 3.6 | 19.4 | 54.3 | 520.4 |
| 1986 - 87 | 65.8 | 15.8 | 42.4 | 128.9 | 37.6 | 38.2 | 3.9 | -- | -- | 0.8 | 0.3 | 21.4 | 355.1 |
| 1987 - 88 | 66.0 | 6.4 | 95.4 | 66.6 | 170.2 | 30.5 | 11.8 | -- | 0.4 | 5.4 | 32.4 | 87.2 | 572.3 |
| 1988 - 89 | 11.7 | 138.1 | 233.3 | 250.5 | 21.1 | 4.6 | 16.9 | -- | -- | 12.4 | 8.4 | 10.0 | 707.0 |
| 1989 - 90 | 44.7 | 258.0 | 21.7 | 208.4 | 21.5 | 4.1 | 1.8 | 0.1 | -- | 4.8 | 1.1 | 98.4 | 664.6 |
| 1990 - 91 | 47.0 | 31.5 | 43.7 | 42.1 | 110.6 | 68.0 | 4.3 | 1.9 | -- | 1.8 | 22.6 | 53.4 | 426.9 |
| 1991 - 92 | 115.1 | 14.8 | 23.9 | 79.1 | 184.9 | 59.5 | -- | -- | -- | -- | 6.5 | 52.4 | 536.2 |
| 1992 - 93 | 61.6 | 41.7 | 59.7 | 72.9 | 83.6 | 80.4 | -- | -- | -- | -- | 5.1 | 24.2 | 429.2 |
| 1993 - 94 | 66.1 | 40.4 | 88.6 | 92.7 | 149.0 | 36.0 | 53.8 | 11.7 | 1.6 | -- | 18.4 | 36.8 | 595.1 |
| 1994 - 95 | 19.5 | 42.9 | 30.4 | 27.3 | 167.3 | 21.7 | 0.1 | 3.1 | 0.0 | 1.1 | 6.9 | 39.5 | 359.8 |
| 1995 - 96 | 31.2 | 104.5 | 131.3 | 88.9 | 71.0 | 5.6 | 0.0 | 0.0 | 0.0 | 0.0 | 32.5 | 27.3 | 492.3 |
| 1996 - 97 | 170.0 | 45.1 | 120.5 | 187.1 | 187.7 | 4.5 | 13.3 | 4.0 | 0.0 | 12.4 | 6.6 | 6.4 | 757.7 |
| 1997 - 98 | 70.0 | 10.2 | 64.2 | 168.0 | 47.1 | 49.5 | 25.8 | 0.0 | 0.1 | 0.5 | 14.7 | 27.3 | 477.5 |
| 1998 - 99 | 23.9 | 109.9 | 159.0 | 146.0 | 139.8 | 36.9 | 4.5 | 0.2 | 5.7 | 1.3 | 7.3 | 58.1 | 692.5 |
| 1999 -2000 | 31.8 | 41.1 | 92.4 | 125.3 | 110.0 | 24.3 | 0.3 | 0.0 | 29.5 | 0.0 | 10.6 | 53.3 | 518.7 |
| Normals: | 64.0 | 67.0 | 89.0 | 118.0 | 111.0 | 35.0 | 10.0 | 2.0 | 1.0 | 3.0 | 13.0 | 40.0 | 552.0 |
| 2000 - 2001 | 70.3 | 54.5 | 171.5 | 75.9 | 159.4 | 5.5 | 5.5 | 0.3 | 0.0 | 2.3 | 59.4 | 9.9 | 614.3 |
| 2001 - 2002 | 18.9 | 20.9 | 69.2 | 244.1 | 226.2 | 11.7 | 1.0 | 6.6 | 1.6 | 0.1 | 18.6 | 83.2 | 702.1 |
| 2002 - 2003 | 38.3 | 21.5 | 38.0 | 59.5 | 105.1 | 14.3 | 1.0 | 0.0 | 0.1 | 4.9 | 7.4 | 0.2 | 290.3 |
| 2003 - 2004 | 21.2 | 40.7 | 71.6 | 46.1 | 171.6 | 1.4 | 0.0 | 1.3 | 0.0 | 11.3 | 32.8 | 125.2 | 523.4 |
| 2004 - 2005 | 18.2 | 108.3 | 14.8 | 121.5 | 69.8 | 10.7 | 0.0 | 1.5 | 5.3 | 1.5 | 28.0 | 53.9 | 433.6 |
| 2005 - 2006 | 48.8 | 145.4 | 98.0 | 134.4 | 190.9 | 49.5 | 11.9 | 0.0 | 0.0 | 40.8 | 11.7 | 59.8 | 791.2 |
| 2006 - 2007 | 79.2 | 21.8 | 15.4 | 86.0 | 45.2 | 74.2 | 0.9 | 0.0 | 0.0 | 0.0 | 19.8 | 65.5 | 407.9 |
| 2007 - 2008 | 150.7 | 73.3 | 122.2 | 197.4 | 94.6 | 9.4 | 17.4 | 0.0 | 21.1 | 84.6 | 0.4 | 57.8 | 828.8 |
| 2008 - 2009 | 62.5 | 87.4 | 108.6 | 211.2 | 111.9 | 48.6 | 0.5 | 0.5 | 0.0 | 6.7 | 4.7 | 71.4 | 713.9 |
| 2009 - 2010 | 55.3 | 9.0 | 102.9 | 191.3 | 61.5 | 67.1 | 4.0 | 4.4 | 0.9 | 2.5 | 33.5 | 83.3 | 615.6 |
| 2010 - 2011 | 77.3 | 107.8 | 149.8 | 68.8 | 72.9 | 150.8 | 3.5 | 0.0 | 0.6 | 0.0 | 33.3 | 57.6 | 722.3 |
| 2011 - 2012 | 47.0 | 85.4 | 113.0 | 26.2 | 91.6 | 24.3 | 3.0 | 0.6 | 0.0 | 5.4 | 65.7 | 33.5 | 495.7 |
| 2012 - 2013 | 19.2 | 76.4 | 111.0 | 68.9 | 68.4 | 62.1 | 4.7 | 0.0 | 6.1 | 0.7 | 12.4 | 25.8 | 455.7 |
| 2013 - 2014 | 47.1 | 34.0 | 34.2 | 239.0 | 84.9 | 8.8 | 0.1 | 0.0 | 0.0 | 18.2 | 12.9 | 57.8 | 538.6 |
| 2014 - 2015 | 44.9 | 35.7 | 56.8 | 35.0 | 84.9 | 11.7 | 4.1 | 0.8 | 0.2 | 13.4 | 65.2 | 51.6 | 404.3 |
| 2015 - 2016 | 62.9 | 20.2 | 88.0 | 148.2 | 89.4 | 99.6 | 5.8 | 10.2 | 0.1 | 0.2 | 0.4 | 82.6 | 607.6 |
| 2016 - 2017 | 94.5 | 102.8 | 18.1 | 41.9 | 7.1 | 1.7 | 17.7 | 0.4 | | | | | |

# జల సంపద జాతీయ పరిధిలోకి రావాలి. జల వినియోగంలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా జల విధానాలు సవరించాలి

శ్రీ పాణ్యం సుబ్రమణ్యం, విశ్రాంత సాగునీటి నిపుణులు,

డా॥వై.వి. మల్లారెడ్డి, డైరెక్టర్, ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురము

## 1. పరిచయము :

నీరు ప్రకృతి ప్రసాదములలో ముఖ్యమైనది. విలువైనది. సమస్త జీవకోటికి ఆధారమైనది. జీవకోటి మనుగడకు అవసరమైన మూల పదార్థాలలో ఒకటైన త్రాగు మరియు సాగునీటి కోసం, విద్యుచ్ఛక్తి కోసం, ఆర్థికాభివృద్ధి కోసం, పారిశ్రామికీకరణ కోసం, సామాజిక సంక్షేమం కోసం, ఈ నీరే మౌలిక సోపానం, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి మూలాధారమైనది. దాదాపు 70 శాతం జనాభా గ్రామీణులు. వీరికి వ్యవసాయం ప్రధానమైన వృత్తి. వారి జీవనోపాధికి సోపానం నీటి లభ్యత. నీరెంతో అరుదైనది. అమూల్యమైనది. రానురాను నీరు మరింత అరుదైన వనరుగా మారుతున్నది. నీరు ప్రకృతిలో సమృద్ధిగా లభ్యమైతుందనే భ్రమ కలుగుతుంది. కాని నిశితంగా పరిశీలిస్తే లభ్యమయ్యే నీటిలో కేవలం 0.5 శాతము మాత్రమే మానవ వినియోగానికి వీలవుతుంది. మిగతా 99.5 శాతం, సముద్రాలు, ఉత్తర–దక్షిణ ధృవాలే. మంచు కొండలలో వున్నవి. వర్షాలు కురవటంలో ఒకే సంవత్సరంలో హెచ్చు తగ్గులుంటాయి. వర్షాలు కురిసే ప్రాంతాలలో హెచ్చు తగ్గులుంటాయి. నీరు మనకు ఎక్కడ అవసరమైతే అక్కడ సహజంగా దొరకదు. అన్ని కాలాలలో లభ్యం కాదు. అవసరమైన అన్ని ప్రాంతాలకు, అవసరాలకనుగుణంగా, నీటి లభ్యతలో లోటు లేర్పడినప్పుడు, ఆలోటును ప్రభుత్వాలు సవరించి తీర్చవలయును. నీటిని అందరి అవసరాలు తీర్చుటకు, ప్రాంతాల మధ్య అసమానతలు, విబేధాలు రాకుండా సమన్యాయం సాధించుటకు, సమగ్ర నీటి నిర్వహణ విధానాలు మరియు కార్యాచరణ అవసరము.

మనదేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు, స్వతంత్ర భారతదేశంలో సుమారు 7 దశాబ్దాలు సుదీర్ఘ కాలం గడిచినా, త్రాగు నీటకి కూడా అలమటిస్తున్న ప్రాంతాలు ఉన్నాయి. కనీస స్థాయి సాగునీటి సౌకర్యం పొందని దుర్భిక్ష ప్రాంతాలు ఉన్నాయి. ఇటువంటి సమస్యలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఈ పరిస్థితికి అశాస్త్రీయ, అసమగ్ర జలవిధానాలు, నీటి వినియోగంపై సమగ్ర ధృక్పథం లోపంతో బాటు ప్రభుత్వాల ముఖ్యంగా చారిత్రాత్మకంగా వివిధ ప్రాంతాలలో చోటు చేసుకున్న అసమానతల కారణంగా, వివిధ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య జిల్లాల మధ్య, మండలాల మధ్య, గ్రామాల మధ్య, చివరకు కుటుంబాల మధ్య కూడా జల వివాదాలు రోజు రోజుకు పెరుగుతుండడం చూస్తున్నాము. దినదినానికి పెరుగుతున్న నీటి అవసరాలు ఈ వివాదాలను మరింత ఉధృతం చేస్తున్నాయి. ఈ నాగరిక ప్రపంచంలో, దేశాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు, మానవాభ్యుదయానికి

ఈ వివాదాలు ఒక గొడ్డలి పెట్టు. మనమందరం విశాల ధృక్పథంతో, శాస్త్రీయ, సమగ్ర విధానంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించకపోతే భావితరాలకు మనం సంక్రమింపజేసే ఈ దురవస్థ అన్ని స్థాయిలలోనూ జల వివాదాలు కాస్త జల యుద్ధాలుగా పరిణమించే అపాయముంది.

## 2. పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి వినియోగంలో ఏర్పడిన అసమానతలు :

23 జిల్లాల సమగ్ర ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ చిన్న, పెద్ద 40 నదులు ప్రవహిస్తున్నాయి. అందులో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి ముఖ్యమైనవి. 75శాతం ఆధారిత నదీజల పరిమాణం 2769 శతకోటి ఘనపుటడుగులు (శ.కో.ఘ./టి.ఎం.సి.) పై ఉపరితల నీటి (నదీజలాలు) లభ్యతతో బాటు సుమారు 1140 శ.కో.ఘ. అడుగుల భూగర్భ జలాలు కూడా లభ్యమౌతున్నవి. గోదావరి నదిలో లభ్యమయ్యే 1480 టి.ఎం.సి.లలో ఇప్పటికి సమగ్రరాష్ట్రం వినియోగిస్తున్నది కేవలం 720 టి.ఎం.సి.లు మాత్రమే. క్రిష్ణానది నుండి అంచనా వేసిన 811 టి.ఎం.సి.లు పూర్తిగా వినియోగిస్తున్నాము. అయితే గోదావరి నదీలోయ నుండి సుమారు 3000 టి.ఎం.సి.లు ,కృష్ణానది లోయ నుండి సుమారు 1000 టి.ఎం.సి.లు మొత్తం 4000 టి.ఎం.సి.లు వృథాగా దాదాపు ప్రతి సంవత్సరం కూడా బంగాళాఖాతంలో చేరిపోవుతున్నవి. ఒక టిఎం.సి.తో, సుమారు 5000 ఎకరములలో వరిపైరు, లేక 10 వేల నుండి 12 వేల ఎకరములలో ఆరుతడి పైర్లు పండించవచ్చు.

మన పూర్వ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో 23 జిల్లాల్లో మొత్తం వ్యవసాయ భూమి 270 లక్షల ఎకరములు.లభ్యమయ్యే సాగునీరు స్థూలంగా దాదాపు 3860 (భూగర్భజలాలతో కలిసి) శతకోటి ఘనపుటడుగులు. ఒక శాస్త్రీయ పద్ధతి పాటించి, సమన్యాయం లక్ష్యంగా జల విధానాలను సవరించి నీటి పంపిణీ చేసి, అనుసంధాన నీటి వినియోగం **(conjunctive water use)** రక్షక తడులు లాంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రాష్ట్రంలో ఎక్కడా దుర్భిక్ష ప్రాంతాలు ఉండవు. ప్రాంతీయ అసమానతలు ఉండవు. ఆధునిక ప్రపంచంలో ఏమూల, కరువు కాటకాలు ఉన్నా, అభివృద్ధికి నోచుకోకున్నా అవి మానవ సంస్కృతికే మచ్చ. మన జాతి గత చరిత్రను, భారత నాగరికతను ఒకసారి పరిశీలిస్తే, నీరు, నదులు ప్రజలను ప్రాంతాలను కలిపి ఏకం చేసినాయి. నీరు, నదుల ఆధారంగానే మానవాభ్యుదయం, నాగరికత అభివృద్ధి చెందింది. కానీ ఈనాడు ఆ నీరు, నదులే నేడు కుటుంబాలను, ప్రాంతాలను, రాష్ట్రాలను విరోధులుగా విడదీస్తున్నది.

కనీసం 1000 మిల్లీలీటర్లు సగటు వర్షం అదనుకు పడితే వర్షధార వ్యవసాయం ఫలప్రదమవుతుంది. 800 మి.మీ. కంటే తక్కువ వర్షం పడే ప్రాంతాలలో వర్షాధార వ్యవసాయం కరవులకు గురై జూదంగా మారుతుంది. 1972 సం॥ ఇరిగేషన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం 1000 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలలో, (ఒక బ్లాకు స్థాయిలో) వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం భూమికి నమ్మకమైన సాగు నీటి సౌకర్యం కల్పిస్తే తప్ప దుర్భిక్ష ప్రాంతాలకు మనుగడ లేదని స్పష్టంగా పేర్కొన్నది. ఒక బ్లాకు స్థాయిలో 30 శాతం అని చెప్పడానికి ముఖ్యకారణం, బ్లాకుల మధ్య కూడా సగటు వర్షపాతంలో తేడాలుండటం, నీటి సాగులో తేడాలుండడం వలననే, విస్త ృతంగా పరిశీలించిన పిమ్మట పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తరచూ కరువుకు గురయ్యే దుర్భిక్ష ప్రాంతాలుగా 60 తాలూకాలను గుర్తించింది. అవి, 1.అనంతపురము జిల్లాలో 10 తాలూకాలు, 2. కర్నూలు జిల్లాలో 13 తాలూకాలు, 3. కడప జిల్లాలో 8 తాలూకాలు, 4. చిత్తూరు జిల్లాలో 7 తాలూకాలు, 5. మహబూబ్ నగర్ జిల్లాలో 10 తాలుకాలు, 6. నల్గొండ జిల్లాలో 7 తాలూకాలు, 7. రంగారెడ్డి జిల్లాలో 4 తాలూకాలు తీవ్ర కరువుకు గురయ్యే తాలూకాలుగా తేల్చింది. అతిపెద్ద జిల్లాలైన మహబూబ్‌నగర్,

అనంతపురము, నల్గొండ మరియు కర్నూలు జిల్లాల్లో కరువు ప్రభావం ఎక్కువ. ఈ ప్రాంతాలలో వర్షపాతం చాలా తక్కువగా వుండగా, అనంతపురం జిల్లాల్లో అత్యల్పంగా సగటు వర్షపాతం కేవలం 550 మి.మీ. కల్గిన జిల్లాగా చరిత్ర కెక్కింది. ఈ అత్యల్ప వర్షపాతం కూడా చాలా అస్థిరమైనది, అపనమ్మకమైనది.2004 సం॥ వరకు, ప్రభుత్వం గణాంక వివరాలను బట్టి, ఆంధ్రప్రాంతంలోని 9 జిల్లాల్లో 66.17 లక్షల ఎకరములకు అనగా వ్యవసాయ భూమిలో 69.50 శాతం సాగునీటి సౌకర్యం పొందుతుండగా తెలంగాణా 9 జిల్లాల్లో 27 శాతంతో, 46.57 లక్షల ఎకరములకు మరియు రాయలసీమ ప్రాంతంలోని 4 జిల్లాల్లో కేవలం 18.11 శాతంతో 17.93 లక్షల ఎకరములకు మాత్రమే సాగు నీటి సౌకర్యం కల్పించుటకు మౌలిక వసతులు ఏర్పడినవి. కానీ, దురదృష్టవశాత్తూ, రాయలసీమకు సంబంధించి, నిర్దేశించిన సాగు నీటి ఆయకట్టులో కేవలం 50 శాతం మాత్రమే నీటి సాగులోనికి వచ్చుచున్నది. అనంతపురం జిల్లాలో 2004 సం॥ వరకు నీటి సాగు వసతి వున్నది కేవలం 3.5 లక్షల ఎకరములకు మాత్రమే. అనగా సాగు వసతి కేవలం 13.5% ప్రాంతములో లభ్యమయ్యే నీటిని మినహాయించి, మిగిలిన నీటిని పొందడం ప్రజలకు హక్కుగా, సమకూర్చడం ప్రభుత్వ బాధ్యతగా పరిగణించాలి.

నీటి వినియోగ పద్ధతులలో కూడా హేతుబద్ధమైన సంస్కరణలను తీసుకొని రావాలి. అనుసంధాన నీటి వినియోగం ద్వారా కరువు పీడిత వర్షాధార పంటలకు "రక్షక తడులు" **(Protective irrigation)**ఏర్పాటు చేసి కరువుల బారి నుండి రైతులను రక్షించవలసిన అవసరం చాలా వుంది. నీటి పంపిణీలో సామాజిక న్యాయం కావాలంటే, 80 శాతం పైగా వున్న వర్షాధార సన్న చిన్న రైతులకు రక్షక తడుల అవకాశం కల్పించాలి. తద్వారా కరువు పీడిత ప్రాంతాలలో లక్షలాది బడుగు బలహీన రైతులకు కరువుల బారి నుండి రక్షణ ఏర్పడుతుంది. వర్షపు తడులు, భూగర్భజలాలు, స్థానిక ఉపరితల నీరు, నదీజలాలు అన్నింటినీ హేతుబద్ధంగా, అనుసంధానం చేసి, ఏ నీరు వృథా కాకుండా, వర్షాధార పంటలు, ఆరుతడి పంటలు రెండూ ప్రయోజనం పొందే విధంగా నీటి వినియోగం జరగాలి. అనుసంధాన నీటి వినియోగం యొక్క ముఖ్య లక్ష్యాలు 1. వర్షాధార పంటలను కరువులకు గురికాకుండా రక్షక తడులతో కాపాడడం. 2. భూగర్భ జలాలను పూరించడం ద్వారా బోరుబావులను రక్షించడం, తద్వారా నీటిసాగు పంటలను రక్షించడం. నీటి లభ్యత మరియు ఆ ప్రాంత వ్యవసాయ-వాతావరణ పరిస్థితుల ఆధారంగా అనువైన పంటల సరళిని నిర్దేశించాలి.

ఇచ్చిపుచ్చుకొనే సుహృద్భావ ధోరణితో, అంతరాష్ట్ర, అంతర్‌జిల్లాల జలవివాదాలు పరిష్కరించుకోకపోతే, దేశం అంతటా తీవ్ర అలజడి, ఆందోళనలు, సాంఘిక వైషమ్యాలు, విచ్ఛిన్నకరపోకడలు బలంగా పుంజుకొంటాయి. పరిపాలన సమస్యగా మారి, రాష్ట్రాభివృద్ధితో బాటు దేశాభివృద్ధికి మరింత ఆటంకం కాగలవు. సవరించిన జలవిధానాల ద్వారా వెనుకబడ్డ ప్రాంతాలకు కనీస నీటి కేటాయింపులు చేసి సమన్యాయం చేసి తీరాలి. నీటి పంపిణీలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా జలవిధానాలు రూపొంది, అమలుకు నోచుకోవాలంటే, నీటి వినియోగంలో అనుసంధాన నీటి వినియోగం **(conjunctive water use)** కరువు ప్రాంతాలలో వర్షాధార పంటలకు రక్షక తడులు **(Protective irrigation)** లాంటి సంస్కరణలు, హేతుబద్ధమైన పంట విధానాలు రావాలంటే, నీటిని జాతీయ సంపదగా గుర్తించి రాష్ట్రాలకతీతంగా కేంద్ర ప్రభుత్వం పరిదిలోకి తీసుకోవాలి. నీటితో పాటు జల విద్యుత్పాదన కూడా కేంద్ర పరిధిలోకి తీసుకుంటే, వివాదాలు తగ్గి దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

నదీజలాల అభివృద్ధి రాష్ట్రాల పరిధిలో వుండుట వల్లనూ, నదీజలాల పంపిణీకి సంబంధించి నిర్దిష్టమైన ప్రాంతీయ ప్రాధాన్యత క్రమము లేనందు వల్లనూ, రాష్ట్రాల స్థాయిలో ఆర్థిక వనరుల లేమివలననూ, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య పోటీ తత్వము, జల వివాదాలు ఉండడం వలననూ నదీజలాల అభివృద్ధి బాగా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కూడా పర్యావరణానికి భంగం కలుగకుండా నిల్వ చేసి, సాగునీరు, త్రాగునీరు, పారిశ్రామిక, పర్యాటక మొదలగు ఇతర అవసరాలకు వాడుకోవాల్సి వుంది. నదులలోని జీవ జలాలను పూర్తిగా వినియోగించునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి వుంది. అయితే పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లకుండా ఆశయాలు సాధించాలి.

సాగుభూమికి మాత్రమే. ఇది కూడా స్థానిక వర్షపాతము పై ఆధారపడిన శ్రీకృష్ణదేవరాయలు కాలం నుండి కట్టించిన చెరువులను, రైతులు త్రవ్వుకున్న బావులు, బోరు బావులు కూడా కలుపుకొని. ఈ ఆయకట్టులో వాస్తవంగా సాగు క్రింద పంటలు పండించుకుంటున్నది చాలా సంవత్సరాలలో కేవలం 2 లక్షల ఎకరములకు మించుట లేదు. ఎందుకంటే చెరువులు 5 సం॥ ఒక్కసారి కూడా నిండడం లేదు. భూగర్భజలాలు పూరించడం లేదు. అందుకే బోరు బావులు గాలిలో దీపాలైనాయి.

**3. నీరు జాతీయ సంపదగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలి. జల పంపిణీలో వినియోగ విధానాలలో ప్రాంతీయ సమన్యాయం, సామాజిక న్యాయం లక్ష్యాలుగా సమగ్ర మార్పురావాలి.**

సాగు నీటి రంగంలో నీటి కేటాయింపుల్లో ఈ అసమానతలు ఏర్పడుటకు ముఖ్య కారణం. అంతరాష్ట్ర నదీ జలాల పంపకంలో అనుసరిస్తున్న సూత్రాలలో ముఖ్యమైనది. FIRST IN TIME FIRST IN RIGHT. అనగా ముందుగా కట్టిన ప్రాజెక్టుల హక్కులకు భంగం కల్గకుండా తర్వాత కట్టే ప్రాజెక్టులను చూడటం. ఈ సూత్రం ప్రాంతీయ సమన్యాయానికి విరుద్ధంగా వున్నది. వెనుకబడిన రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ భారీ ప్రాజెక్టులు ముందుగా కట్టుకోలేక పోవడం, ఉన్న ప్రాజెక్టులు రాష్ట్రసరిహద్దుల మార్పిడి కారణంగా వేరే ప్రాంతాలలో (తుంగభద్ర ప్రాజెక్టును కర్ణాటకలో) చేర్చబడుట, భౌగోళిక పరిస్థితుల అననుకూలత, రాజకీయ నిర్లక్ష్యం వగైరా కారణాల ద్వారా కనీస నీటి కేటాయింపులు పొందజాలకున్నవి. సాగునీటి సౌకర్యం తక్కువగా ఉన్న ప్రాంతాలు పారిశ్రామిక, ఆర్థిక, విద్య, వైద్య, సాంస్కృతిక రంగాలలో కూడా వెనుకబడి యుండడం గమనించదగ్గ ముఖ్య అంశం. నీటి పంపిణీ విషయంలో ప్రాంతీయ సమన్యాయం, సామాజిక న్యాయం లక్ష్యాలుగా నెరవేరాలంటే, అనాదిగా అమలవుతున్న కాలం చెల్లిన అసంబద్ధ, అశాస్త్రీయమైన జల పంపిణీ మరియు వినియోగ విధానాలను సవరించుకోవలసిన తక్షణ అవసరం చాలా వుంది. ప్రతి వెనుకబడిన ప్రాంతము వ్యవసాయకంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన కనీస నీటి పరిమాణ స్థాయిని హేతుబద్ధంగా గుర్తించాలి. రెండవ ప్రాధాన్యతగా గ్రామీణ జీవనోపాధులకు ముఖ్య ఆధారమైన వ్యవసాయానికి కనీసం 30 శాతం భూమికి నమ్మదగిన నీటి సాగు ఉండే విధంగా నీటి అవసరాలు గుర్తించాలి. మూడవ ప్రాధాన్యతగా పారిశ్రామిక అవసరాలకు విద్య, వైద్య ఇతర సంస్థల అవసరాలను గుర్తించాలి. నాల్గవ ప్రాధాన్యతగా పర్యావరణం, జీవవైవిధ్యం ఒక స్థాయిలో స్థిరంగా ఉండటానికి నీటి అవసరాలను గుర్తించాలి. ప్రాంతాలను బట్టి సమన్యాయం ప్రాతిపదికగా నీటి ప్రాధాన్యతాక్రమాలు మారవచ్చు. పై అవసరాలు కనీస స్థాయిలో తీరుటకు ఎంత నీరు అవసరమో గుర్తించి, ఇప్పటికీ ఆ అసమానతలు ఉండవు. ఆధునిక ప్రపంచంలో ఏమూల, కరువు కాటకాలు ఉన్నా, అభివృద్ధికి నోచుకోకున్నా అవి మానవ సంస్కృతికే మచ్చ. మన జాతి గత చరిత్రను, భారత నాగరికతను

ఒకసారి పరిశీలిస్తే, నీరు, నదులు ప్రజలను ప్రాంతాలను కలిపి ఏకం చేసినాయి. నీరు, నదుల ఆధారంగానే మానవాభ్యుదయం, నాగరికత అభివృద్ధి చెందింది. కానీ ఈనాడు ఆ నీరు, నదులే నేడు కుటుంబాలను, ప్రాంతాలను, రాష్ట్రాలను విరోధులుగా విడదీస్తున్నది.

కనీసం 1000 మిల్లీలీటర్లు సగటు వర్షం అదనుకు పడితే వర్షధార వ్యవసాయం ఫలప్రదమవుతుంది. 800 మి.మీ. కంటే తక్కువ వర్షం పడే ప్రాంతాలలో వర్షాధార వ్యవసాయం కరవులకు గురై జూదంగా మారుతుంది. 1972 సం॥ ఇరిగేషన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం 1000 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలలో, (ఒక బ్లాకు స్థాయిలో) వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం భూమికి నమ్మకమైన సాగు నీటి సౌకర్యం కల్పిస్తే తప్ప దుర్భిక్ష ప్రాంతాలకు మనుగడ లేదని స్పష్టంగా పేర్కొన్నది. ఒక బ్లాకు స్థాయిలో 30 శాతం అని చెప్పడానికి ముఖ్యకారణం, బ్లాకుల మధ్య కూడా సగటు వర్షపాతంలో తేడాలుండటం, నీటి సాగులో తేడాలుండడం వలననే, విస్తృతంగా పరిశీలించిన పిమ్మట పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తరచూ కరువుకు గురయ్యే దుర్భిక్ష ప్రాంతాలుగా 60 తాలూకాలను గుర్తించింది. అవి, 1.అనంతపురము జిల్లాలో 10 తాలూకాలు, 2. కర్నూలు జిల్లాలో 13 తాలూకాలు, 3. కడప జిల్లాలో 8 తాలూకాలు, 4. చిత్తూరు జిల్లాలో 7 తాలూకాలు, 5. మహబూబ్ నగర్ జిల్లాలో 10 తాలుకాలు, 6. నల్గొండ జిల్లాలో 7 తాలూకాలు, 7. రంగారెడ్డి జిల్లాలో 4 తాలూకాలు తీవ్ర కరువుకు గురయ్యే తాలూకాలుగా తేల్చింది. అతిపెద్ద జిల్లాలైన మహబూబ్‌నగర్, అనంతపురము, నల్గొండ మరియు కర్నూలు జిల్లాల్లో కరువు ప్రభావం ఎక్కువ. ఈ ప్రాంతాలలో వర్షపాతం చాలా తక్కువగా వుండగా, అనంతపురం జిల్లాల్లో అత్యల్పంగా సగటు వర్షపాతం కేవలం 550 మి.మీ. కల్గిన జిల్లాగా చరిత్ర కెక్కింది. ఈ అత్యల్ప వర్షపాతం కూడా చాలా అస్థిరమైనది, అపనమ్మకమైనది.2004 సం॥ వరకు, ప్రభుత్వం గణాంక వివరాలను బట్టి, ఆంధ్రప్రాంతంలోని 9 జిల్లాల్లో 66.17 లక్షల ఎకరములకు అనగా వ్యవసాయ భూమిలో 69.50 శాతం సాగునీటి సౌకర్యం పొందుతుండగా తెలంగాణా 9 జిల్లాల్లో 27 శాతంతో, 46.57 లక్షల ఎకరములకు మరియు రాయలసీమ ప్రాంతంలోని 4 జిల్లాల్లో కేవలం 18.11 శాతంతో 17.93 లక్షల ఎకరములకు మాత్రమే సాగు నీటి సౌకర్యం కల్పించుటకు మౌలిక వసతులు ఏర్పడినవి. కానీ, దురదృష్టవశాత్తూ, రాయలసీమకు సంబంధించి, నిర్దేశించిన సాగు నీటి ఆయకట్టులో కేవలం 50 శాతం మాత్రమే నీటి సాగులోనికి వచ్చుచున్నది. అనంతపురం జిల్లాలో 2004 సం॥ వరకు నీటి సాగు వసతి వున్నది కేవలం 3.5 లక్షల ఎకరములకు మాత్రమే. అనగా సాగు వసతి కేవలం 13.5% ప్రాంతములో లభ్యమయ్యే నీటిని మినహాయించి, మిగిలిన నీటిని పొందడం ప్రజలకు హక్కుగా, సమకూర్చడం ప్రభుత్వ బాధ్యతగా పరిగణించాలి.

నీటి వినియోగ పద్ధతులలో కూడా హేతు బద్ధమైన సంస్కరణలను తీసుకొని రావాలి. అనుసంధాన నీటి వినియోగం ద్వారా కరువు పీడిత వర్షాధార పంటలకు "రక్షక తడులు" **(Protective irrigation)**ఏర్పాటు చేసి కరువుల బారి నుండి రైతులను రక్షించవలసిన అవసరం చాలా వుంది. నీటి పంపిణీలో సామాజిక న్యాయం కావాలంటే, 80 శాతం పైగా వున్న వర్షాధార సన్న చిన్న రైతులకు రక్షక తడుల అవకాశం కల్పించాలి. తద్వారా కరువు పీడిత ప్రాంతాలలో లక్షలాది బడుగు బలహీన రైతులకు కరువుల బారి నుండి రక్షణ ఏర్పడుతుంది. వర్షపు తడులు, భూగర్భజలాలు, స్థానిక ఉపరితల నీరు, నదీజలాలు అన్నింటినీ హేతుబద్ధంగా, అనుసంధానం చేసి, ఏ నీరు వృథా కాకుండా, వర్షాధార పంటలు, ఆరుతడి పంటలు రెండూ ప్రయోజనం పొందే విధంగా నీటి వినియోగం జరగాలి.

అనుసంధాన నీటి వినియోగం యొక్క ముఖ్య లక్ష్యాలు 1. వర్షాధార పంటలను కరువులకు గురికాకుండా రక్షక తడులతో కాపాడడం. 2. భూగర్భ జలాలను పూరించడం ద్వారా బోరుబావులను రక్షించడం, తద్వారా నీటిసాగు పంటలను రక్షించడం. నీటి లభ్యత మరియు ఆ ప్రాంత వ్యవసాయ–వాతావరణ పరిస్థితుల ఆధారంగా అనువైన పంటల సరళిని నిర్దేశించాలి.

ఇచ్చిపుచ్చుకొనే సుహృద్భావ ధోరణితో, అంతరాష్ట్ర, అంతర్‌జిల్లాల జలవివాదాలు పరిష్కరించుకోకపోతే, దేశం అంతటా తీవ్ర అలజడి, ఆందోళనలు, సాంఘిక వైషమ్యాలు, విచ్ఛిన్నకరపోకడలు బలంగా పుంజుకొంటాయి. పరిపాలన సమస్యగా మారి, రాష్ట్రాభివృద్ధితో బాటు దేశాభివృద్ధికి మరింత ఆటంకం కాగలవు. సవరించిన జలవిధానాల ద్వారా వెనుకబడ్డ ప్రాంతాలకు కనీస నీటి కేటాయింపులు చేసి సమన్యాయం చేసి తీరాలి. నీటి పంపిణీలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా జలవిధానాలు రూపొంది, అమలుకు నోచుకోవాలంటే, నీటి వినియోగంలో అనుసంధాన నీటి వినియోగం **(conjunctive water use)** కరువు ప్రాంతాలలో వర్షాధార పంటలకు రక్షక తడులు **(Protective irrigation)** లాంటి సంస్కరణలు, హేతుబద్ధమైన పంట విధానాలు రావాలంటే, నీటిని జాతీయ సంపదగా గుర్తించి రాష్ట్రాలకతీతంగా కేంద్ర ప్రభుత్వం పరిదిలోకి తీసుకోవాలి. నీటితో పాటు జల విద్యుత్పాదన కూడా కేంద్ర పరిధిలోకి తీసుకుంటే, వివాదాలు తగ్గి దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

నదీజలాల అభివృద్ధి రాష్ట్రాల పరిధిలో వుండుట వల్లనూ, నదీజలాల పంపిణీకి సంబంధించి నిర్దిష్టమైన ప్రాంతీయ ప్రాధాన్యత క్రమము లేనందు వల్లనూ, రాష్ట్రాల స్థాయిలో ఆర్థిక వనరుల లేమివలననూ, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య పోటీ తత్వము, జల వివాదాలు ఉండడం వలననూ నదీజలాల అభివృద్ధి బాగా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కూడా పర్యావరణానికి భంగం కలుగకుండా నిల్వ చేసి, సాగునీరు, త్రాగునీరు, పారిశ్రామిక, పర్యాటక మొదలగు ఇతర అవసరాలకు వాడుకోవాల్సి వుంది. నదులలోని జీవ జలాలను పూర్తిగా వినియోగించునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి వుంది. అయితే పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లకుండా ఆశయాలు సాధించాలి. కుంటుపడింది. ప్రాంతీయ అసమానతలు, వివాదాలు, ఉద్యమాలు పేట్రేగి, సమతుల అభివృద్ధికి తీవ్ర అవరోధంగా వున్నది.

**ముగింపు :**

నదీజలాలను జాతీయ సంపదగా పరిగణించి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో సద్వినియోగ పరుచుకోవాలి. దేశంలో ఆర్థికాభివృద్ధికి, మానవాభివృద్ధికి పునాదులు గ్రామీణ భారతంలో వుండాలి. వ్యవసాయం గ్రామీణ జీవనోపాధులు, దేశాభివృద్ధికి చోదక శక్తులుగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల జల అవసరాలు తీర్చడానికి, ప్రాంతీయ సమన్యాయం సాధించడానికి నదుల అనుసంధానమే ముందున్న ఏకైక పరిష్కార మార్గం. కరువు సమస్యకు వ్యవసాయాభివృద్ధికి, ఆహార భద్రతకు, పారిశ్రామికాభివృద్ధి, మరియు దేశ సర్వతోముఖాభివృద్ధికి శాశ్వత పునాది నదుల అనుసంధానం.

ఏ నదీ జలాలైనా ఆ నదీ పరివాహక ప్రాంతంలో సమన్యాయం ప్రాతిపదికగా అవసరమైన మేర వినియోగించుకున్న తరువాత, మిగులు నీటిని, నీటి లభ్యత తక్కువైన ప్రాంతాలకు మళ్లించాలి. సాధ్యమైనంత వరకు పర్యావరణానికి భంగం కలుగని రీతిలో జలాశయాల నిర్మాణం జరగాలి. జనాభా పెరిగే కొద్దీ ఎదురయ్యే నీటి సమస్యను అధిగమించడానికి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాల నుండి అల్ప వర్షపాతం కల్గిన ప్రాంతాలకు సమన్యాయం ప్రాతిపదికగా అవసరాలను బట్టి, అత్యంత ప్రాధాన్యత

కల్పించి నీటిని తరలించే విధంగా నిర్దిష్టంగా జాతీయ జల విధానాలు ఉండాలి. ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి నీటి వాలు పారుదల పద్ధతిలో గాని, ఎత్తిపోతల పద్ధతిలో గాని రవాణా చేయడం తప్పనిసరి అవుతుంది. సాగు నీటి నిర్వహణలో రైతులకు అర్థవంతమైన భాగస్వామ్యాన్ని కల్పించాలి.

గోదావరి జలాలను సాధ్యమైనంత వరకు కృష్ణా నది ప్రాంతం దిగువనున్న అన్ని ప్రాజెక్టుల అవసరాలను తీర్చుటకు ఉపయోగించవలయును. అందుకనుగుణంగా చేపట్టిన, పోలవరం, పులిచింతల, నాగార్జున సాగర్ టైలుపాండు, దుమ్ముగూడెం ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేయాలి. అలా ఆదా చేసిన నీటిని కృష్ణా నదిపై ఎగువ నున్న ప్రాంతాలకు, సమన్యాయం ప్రాతిపదికగా కనీస సాగు నీటి వసతి, త్రాగునీటి వసతి కల్పించుటకు హంద్రీనీవా సుజల స్రవంతి ,గాలేరు నగరి, తెలుగు గంగ, వెలుగొండ, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలి. ఈ ప్రక్రియంతా సాఫీగా జరగాలంటే జల వనరులు కేంద్ర పరిధిలోనికి తీసుకురావాలి. నీటి పంపిణీ ప్రాధాన్యతపై నిర్దిష్టమైన విధి విధానాలుండాలి.

వర్షాభావంతో పంటలకు స్థిరమైన నీటి వసతి కరువైన పరిస్థితులలో అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా “అనుసంధాన నీటి వినియోగం” **(conjunctive water use)** ద్వారా వృథాకాకుండా ఉపయోగించుకోవాల్సి వుంది.

సాగునీరు, త్రాగునీరు, పారిశ్రామిక, పర్యాటక మొదలగు ఇతర అవసరాలకు వాడుకోవాల్సి వుంది. నదులలోని జీవ జలాలను పూర్తిగా వినియోగించునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి వుంది. అయితే పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లకుండా ఆశయాలు సాధించాలి.

తేదీ : 25-04-2014

# అనంతపురము జిల్లాకు 100 టి.ఎం.సీ.ల నీరు కేటాయించాలి

1.పాణ్యం సుబ్రమణ్యం, విశ్రాంత సాగునీటి నిపుణులు.

2.డా॥వై.వి.మల్లారెడ్డి, డైరెక్టరు, ఎకాలజీ సెంటరు

## పరిచయము :

నదీ జలాల పంపిణీలో ప్రాంతీయ సమన్యాయం ఒక ముఖ్య ప్రాతిపదిక కావాలి. ప్రస్తుతం త్రాగునీరు, సాగునీరు మరియు ఇతర అవసరాలకు నీటి కేటాయింపులలో మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు వున్నాయి. కోస్తా ప్రాంతములోని కొన్ని జిల్లాలకు అత్యధిక సాగునీటి మరియు త్రాగునీటి సౌకర్యం వుండగా, రాయలసీమ జిల్లాలకు, ముఖ్యంగా అనంతపురము జిల్లాకు అతి తక్కువగా వున్నది. అనంతపురం జిల్లా దేశములోనే అత్యల్ప వర్షపాతం కలిగి, అతి తక్కువ నీటిసాగు గలిగి, వరుస కరువులకు గురువుతున్న ఏకైక జిల్లా. ప్రస్తుతము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని మొత్తము వ్యవసాయ భూమి 67.19 లక్షల హె.లలో 16 శాతము అనగా 16.83 లక్షల హె., మరియు వర్షాధార భూమి 39.97 లక్షల హె.లలో ఏకంగా 25 శాతము అంటే 9.65 లక్షల హెక్టార్లు ఒక్క అనంతపురము జిల్లాలోనే వున్నది. మన రాష్ట్రంలోని మొత్తం సాగునీటి సౌకర్యం గల భూమి 28.8 లక్షల హె.లలో కేవలం 1.18 హె.లు అంటే కేవలం 4.2 శాతం మాత్రమే అనంతపురం జిల్లాలో వున్నదంటే ఇది పాలకులకు ప్రజలకు కనువిప్పు కల్గించాల్సిన కఠోర, నిష్ఠుర వాస్తవం. అందుకే త్రాగునీరు, పరిశ్రమలు, సాగునీటి పంపిణీలోనూ, నీటి ప్రాజెక్టుల నిర్మాణ ప్రాధాన్యతలోనూ అనంతపురం జిల్లాకు సమన్యాయం ప్రాతిపదికగా ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. అనంతపురము జిల్లాకు సాగునీరు, త్రాగునీరు మరియు పరిశ్రమలకు కలిపి కనీసం 100 టి.ఎం.సీ.ల నీరు కేటాయించాలని పౌర సంస్థలు, కొంతమంది రాజకీయ నాయకులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు చాలా కాలంగా డిమాండు చేస్తున్నారు. ఈ డిమాండుకు అనుగుణంగా అనంతపురము జిల్లాకు 100 టి.ఎం.సీ.ల నీరు ఇవ్వటం ఎట్లా సాధ్యమౌతుందో "ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్" **(Institute of Engineers)** లెక్కలతో వేసి తేల్చి చెప్పడం జరిగింది. కరువుకు నిలయంగా వున్న అనంతపురము జిల్లాకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి సాగునీటి నిపుణులైన ఇంజనీర్ల సూచన మేరకు అనంతపురము జిల్లాకు 100 టి.ఎం.సీ.ల నీరు కేటాయించడం న్యాయం, సమంజసం, అత్యవసరం.

## అనంతపురము జిల్లా పరిస్థితి :

అనంతపురము జిల్లా అతి విశాలమై సుమారు 19130 చ.కి.మీ. వైశాల్యం కల్గి, 63 మండలాలు, దాదాపు 28 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి కల్గివుంది. ఇందులో కేవలం 3.0 లక్షల ఎకరాలకు మాత్రం, ముఖ్యంగా గాలిలో దీపం లాంటి నమ్మకం లేని భూగర్భజలాలపై ఆధారపడి సాగునీటి వసతి వుంది. త్రాగునీటి అవసరాలకు, పరిశ్రమలకు ఇతర అవసరాలకు చుక్క నీటి కేటాయింపు లేదు. జిల్లాలో 42 లక్షల జనాభా గల్గి దాదాపు 30 లక్షల జనాభా గ్రామాలలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ జిల్లాలో ప్రస్తుతం వివిధ నీటి వనరుల క్రింద, ముఖ్యంగా భూగర్భజలాల

క్రింద సాగవుతున్న సుమారు 3.0 లక్షల ఎకరములు మినహాయించి, మిగతా దాదాపు 25 లక్షల ఎకరములు కేవలం వర్షాధారంపై ఆధారపడింది. దేశంలోనే రెండవ అత్యంత అల్పంగానూ, అస్థిరంగానూ కేవలం 550 మి.మీ. సగటు వర్షపాతం కల్గిన కరువు జిల్లాగా గుర్తింపబడింది. ఇరిగేషన్ కమీషను 1972 ప్రకారం, 1000 మి.మీ. సగటు వర్షపాతానికి తక్కువ వున్న ప్రాంతాలు తరచు కరువులకు గురౌతాయిని తెల్పింది. అంతేగాక ఒక తాలుకా స్థాయిలో మొత్తము వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం అయినా నమ్మకమైన నీటిసాగు ఉన్నప్పుడే అక్కడ వ్యవసాయ మనుగడ వుంటుందని తేల్చి చెప్పడం జరిగింది. మరి కేవలం 550 మి.మీ. సగటు వర్షపాతంతో 10 శాతం కూడా సాగునీరు లేని అనంతపురము జిల్లా కరువుల తీవ్రత త్రాగునీటి కొరత ఎంత తీవ్రంగా వుంటుందో ఊహించుకోవచ్చు. గడచిన 10 సంవత్సరాలలో దాదాపు 8 సంవత్సరాలు కరువులకు గురైనట్లు ప్రభుత్వముచే ప్రకటించబడింది !

అందుకే ఇరిగేషను కమీషను 1972 సూచనల మేరకు నదీ జలాల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత కల్పించవలసిన జిల్లాగా గుర్తింపబడింది. ఈ జిల్లా యొక్క త్రాగునీరు, సాగునీరు, పరిశ్రమల కనీస అవసరములు తీరుటకు కనీసం 100 టి.ఎం.సీ.లు పొందవలసియున్నదని నిపుణుల అంచనా. ఇప్పటికే లభ్యమౌతున్న నీటిని మినహాయించగా అదనంగా కనీసం 70 టి.ఎం.సీ.ల నదీ జలాలను అనంతపురము జిల్లాకు బదలీ చేయవలసిన ఆవశ్యకత వున్నది. ఈ అదనపు నీటిని పొందుటకు, ప్రస్తుతం అమలౌతున్న అన్ని ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు అదనపు నదీ జలాలను కేటాయించి సత్వరమే వాటి నిర్మాణాలను పూర్తి చేయవలసి వుంది. అదనపు జలాలు కేటాయించాలంటే జాతీయ స్థాయిలో లేదా కనీసం రాష్ట్రస్థాయిలో నదుల అనుసంధానంతో పాటు, నీటి వినియోగంలో సంస్కరణలు, పంటల సరళిలో మార్పులు, అనుసంధాన నీటి వినియోగం లాంటి విధానాలను అమలు చేయవలసియున్నది. అనంతపురం లాంటి తీవ్ర కరువు ప్రాంతాలలో జిల్లా వ్యాప్తంగా కరువును అధిగమించాలంటే, పంట కాలంలో రెండు లేక మూడు రక్షక తడులు **(Protective irrigation)** ప్రతి సంవత్సరం తప్పని సరిగా ఇవ్వవలసి వుంటుంది. కలుషిత నీటిని శుద్ధి చేసి అనువైన అవసరాలకు పునర్వినియోగం చేయవలయును. అనుసంధాన నీటి వినియోగం **(conjunctive use of water)** కూడా తప్పని సరిగా పాటించవలసి వుంటుంది. తక్కువ నీరు అవసరమయ్యే పంటలను మాత్రమే ప్రోత్సహించవలసి వుంటుంది. జాతీయ జల విధానాన్ని సవరించి అత్యధిక సాగునీటి సౌకర్యం పొందుతున్న ప్రాంతాలలో నీటి వినియోగంలో సంస్కరణలు చేసి, నీటి కేటాయింపులు సర్దుబాటు చేయుట ద్వారా కరువు, దరిద్రపీడిత అనంతపురం లాంటి జిల్లాల్లో కనీస నీటి అవసరాలు తీరే విధంగా చర్యలు వెంటనే చేపట్టవలసివుంది. ఇది మన ప్రభుత్వాల ముందున్న తక్షణ అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశం. దీనిని సవాలుగా స్వీకరించి, అన్ని పార్టీల నాయకులు, పౌర సంస్థలు ఏకోన్ముఖంగా ప్రయత్నించితే తప్ప, రానున్న కాలంలో అనంతపురం జిల్లా మనుగడ ప్రశ్నార్థకం కాక తప్పదు. భావి తరాల ఆశలు అడియాశలు కాక తప్పవు. తరతరాలుగా కొనసాగిన ఈ దుర్భర పరిస్థితులను సవరించకపోతే పాలకులను ప్రజలను భావితరం సహించదు, క్షమించదు.

### పట్టిక 1 ః

నిపుణుల అంచనా ప్రకారము అనంతపురము జిల్లా కనీసం నీటి అవసరాలు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రవాహ తరుగును. జలాశయాలలో ఇంకుడు తరుగును మరియు ఆవిరి నష్టాలను దృష్టియందుంచుకొని లెక్కించడము జరిగింది.

| వ.నెం. | అవసరము | టి.ఎం.సి (శ.కో.ఘ.అ.)TMC |
|---|---|---|
| 1. | త్రాగునీటి అవసరాలకు (పెరిగే జనాభా 2030 సం॥రానికి 52 లక్షలు మరియు పశువుల జనాభా 60 లక్షలు దృష్టియందుంచుకొని) | 13.00 |
| 2. | జిల్లాలోని సుమారు 2,560 చెరువులు, కుంటలు నింపుటకు ప్రవాహ తరుగు, ఆవిరి నష్టములను కలిపి) | 20.00 |
| 3. | తుంగభద్ర ఎగువ కాలువ పథకము రెండు దశలకు 1,45,236 ఎకరములకు ఒక పంటకు (ప్రవాహ తరుగు, జలాశయాలలో ఇంకుడు మరియు | 26.85 |
| 4. | ఆవిరి నష్టములు కలిపి) పి.ఎ.బి.ఆర్. (ధర్మవరం కాలువ) 50,000 ఎకరాలకు మరియు చాగల్లు | |
| 5. | పథకము క్రింద 50,000 ఎకరాలకు (ప్రవాహ తరుగు, ఆవిరి నష్టాలను కలిపి) హంద్రీనీవా సుజల స్రవంతి పథకం క్రింద 3,45,000 ఎకరముల | 12.50 |
| 6. | సాగు భూమికి (ప్రవాహ తరుగు, ఆవిరి నష్టాలను కలిపి) మధ్యతరహా ప్రాజెక్టులైన అప్పర్ పెన్నారు, చెన్నరాయగుడి ప్రాజెక్టు, పెన్నా కుముద్వతి, భైరవాని తిప్ప మరియు యోగివేమన ప్రాజెక్టు క్రింద ఉద్దేశించిన | 27.48 |
| 7. | 42,530 ఎకరములకు (రవాణ ఆవిరి నష్టాలను కలిపి) అనంతపురం జిల్లాలో పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించవలసిన కనీస నీటి పరిమాణం | 4.35<br>5.00 |
| | మొత్తం = 109 (rounded off to 110 T.M.C.) | 100 టి.ఎం.సి |

## గమనిక :-

కాలువలలో ప్రవాహ తరుగుగా పరిగణించిన నీరు గానీ జలాశయాల గర్భంలో భూమిలోనికి ఇంకే (ఇంకుడు) నీరు గానీ నిజానికి నష్టము కాదు. అవి భూగర్భ జలాలుగా మారి మార్గమధ్యంలోని గ్రామాలకు రైతులకు, ఇతర జీవరాశులకు, పర్యావరణానికి ఉపయోగపడుతాయి.

## టేబులు 2 :

జిల్లాలోని భారీ నీటి పారుదల పథకములకు కేటాయించిన నీరు మరియు తుంగభద్ర ఎగువ కాలువ క్రింద వాస్తవంగా ప్రస్తుతం లభ్యమౌతున్న నీరు.

| | | |
|---|---|---|
| 1. | 1. తుంగభద్ర ఎగువ కాలువ పథకము క్రింద లభ్యమౌతున్న నీరు (21.73 టి.ఎం.సి.(-) 10.73, టి.ఎం.సి =11.00.<br>పూడిక నష్టము, ప్రవాహ తరుగు, మరియు ఆవిరి నష్టాలు 10.73 టి.ఎం.సీ.లు చివరలో వివరణ చూడండి) | 11.00 టి.ఎం.సి. |
| | 2. హంద్రీనీవా సుజల స్రవంతికి ఉద్దేశించిన నీరు | 22.90 టి.ఎం.సి. |
| | 3. అరకొర వర్షాల వల్ల జిల్లాలో లభ్యమయ్యే ఉపరితల జలాలు (సుమారు 5 సం॥ ఒక మంచి వర్షపు సం॥7 ప్రాతిపదికగా) | 5.00 టి.ఎం.సి. |
| 2. | మొత్తం ప్రస్తుతం లభ్యమౌతున్న నీరు = 38.90 లేక 39 టి.ఎం.సి.లు | 39.00 టి.ఎం.సి. |
| 3. | అదనంగా పొందవలసిన నీరు (110.00 టి.ఎం.సి.లు–39.0 టి.ఎం.సి.) | 71.00 టి.ఎం.సి |

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్లు (ఆంధ్రప్రదేశ్ శాఖ), విశ్వేశ్వరయ్య భవనంలో 17-11-2003వ తేదీన ప్రముఖ సాగునీటి నిపుణుడు డా॥ శ్రీరామకృష్ణయ్య స్మారక సేవాసమితి వారి కోరిక పై అనంతపురం జిల్లాకు, ఎవరి నీటి హక్కులకు భంగము కలుగకుండా, అదనంగా 88.33 టి.ఎం.సి.ల నీరు కేటాయించుటకు సాధ్యమని సూచించడం జరిగింది.

**పట్టిక 3:**

అనంతపురము జిల్లా నీటి కొరత తీర్చుటకు ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్లు సుమారు 83 టి.ఎం.సి.ల నీరు కేటాయించుటకు సాధ్యమేనని సూచించిన మార్గాలు.

| | | |
|---|---|---|
| 1. | నాగార్జున సాగర్ ఆయకట్టులో పంట మార్పిడి విధానం ద్వారా ఆరుతడి పైరులను ప్రోత్సహించుట ద్వారా ఆదా అయ్యే నీరు అనంతపురమునకు మళ్లించుట ద్వారా | 19.33 టి.ఎం.సి. |
| 2. | పి.ఎ.బి.ఆర్. మరియు చాగల్లు పథకములకు కె.సి.కెనాల్ కోటా నుండి బదిలీ చేయుట ద్వారా | 10.00 టి.ఎం.సి. |
| 3. | గోదావరి నది నుండి నీటిని కృష్ణా నదికి మళ్ళించుట ద్వారా అనంతపురమునకు కేటాయించుటకు వీలగు నీటి పరిమాణం | 20.00 టి.ఎం.సి. |
| 4. | పులిచింతల ప్రాజెక్టు ద్వారా ఆదా చేసి అనంతపురమునకు మళ్లించుట ద్వారా | 10.00 టి.ఎం.సి. |
| 5. | తుంగభద్ర మరియు కృష్ణా నదుల నుండి మిగులు జలాల ద్వారా | 20.00 టి.ఎం.సి. |
| | మొత్తం అనంతపురం జిల్లాకు కేటాయించుటకు వీలగు నీరు | 82.33 టి.ఎం.సి. |

**ముగింపు :**

నదీ జలాలను జాతీయ సంపదగా పరిగణించి కేంద్ర ప్రభుత్వ ఆధీనము క్రిందకు తీసుకొని రావాలి. కేంద్ర ప్రభుత్వము నీటి వినియోగంలో సమన్యాయం ప్రాతిపదికగా కేటాయింపులు చేయాలి. భవిష్యత్తు తరాల జల అవసరాలు తీర్చడానికి, ప్రాంతీయ సమన్యాయం సాధించడానికి రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి నదుల అనుసంధానమే ముందున్న ప్రధాన పరిష్కార మార్గం. అదనంగా అనుసంధాన నీటి వినియోగం **(Conjucntive Water Management)** పంటల సరళిలో మార్పులు, నీటి వినియోగంలో సంస్కరణలు, నీటి పునర్వినియోగం లాంటి పద్ధతులను ప్రవేశ పెట్టవలయును. వివిధ ప్రాంతాలలో కరువు సమస్యకు వ్యవసాయాభివృద్ధికి, ఆహార భద్రతకు, పారిశ్రామికాభివృద్ధి, మరియు దేశ సమతల సర్వతోముఖాభివృద్ధికి శాశ్వత పరిష్కారము నదుల అనుసంధానముతో పాటు, ఈ సంస్కరణల ద్వారానే సాధ్యం అవుతుంది.

ఏ నదీ జలాలైనా ఆ నదీ పరివాహక ప్రాంతంలో సమన్యాయం పై సంస్కరణలు ప్రాతిపదికగా అవసరమైన మేర వినియోగించుకున్న తరువాత, మిగులు నీటిని నీటి లభ్యత తక్కువైన రాయలసీమ (ముఖ్యంగా అనంతపురము) లాంటి నీటి కొరత ప్రాంతాలకు మళ్లించాలి. సాధ్యమైనంతవరకు పర్యావరణానికి భంగం కలుగని రీతిలో నదులపై చిన్న, చిన్న జలాశయాల నిర్మాణం జరగాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకుల ఇష్టాయిష్టాలకు అతీతంగా, ప్రస్తుత జనాభా అవసరాలకు, భావితరాలకు ఎదురయ్యే

నీటి సమస్యను అధిగమించడానికి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాల నుండి అల్ప వర్షపాతం కల్గిన ప్రాంతాలకు సమన్యాయం ప్రాతిపదికగా అవసరాలను బట్టి, అత్యంత ప్రాధాన్యతనిచ్చి నీటిని కేటాయించే విధంగా "జాతీయ జల విధానాలు" హంద్రీనీవా సుజలస్రవంతి, గాలేరు నగరి, తెలుగు గంగ, వెలుగొండ ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలి. నదుల కనీసం ప్రవాహం ఉండునట్లుగా ప్రాంతాలకతీతంగా నీటి వినియోగపు రక్షణ కల్పించాలి. నదుల నీటి ప్రవాహం ఏర్పడితే నదుల వెంబడి గల పలు గ్రామాలకు తక్కువ ఖర్చుతో నీటి అవసరాలు తీరుతాయి.

## తుంగభద్ర ఎగువ కాలువ నీటి కేటాయింపు రవాణా నష్టాలు మరియు వినియోగంపై వివరణ :

తుంగభద్ర ఎగువకాలువ పథకము ద్వారా అనంతపురం జిల్లాలోని ఆయకట్టుకు నికరంగా లభ్యమయ్యే నీరు = 21.73 −10.73 = 11 టి.ఎం.సి.లు మాత్రమే అని అంచనా వేయబడినది.

తుంగభద్ర జలాశయం నుంచి వాడుటకు కేటాయించిన నీటి పరిమాణం 230 టి.ఎం.సి.లు. కానీ రిజర్వాయరు పూడిక కారణంగా నీటి నిల్వ సామర్థ్యం కేవలం 100 టి.ఎం.సి.లు మాత్రమే. అనగా ఎంత నీరు లభ్యమైననూ దాదాపు 30 నుండి 35 టి.ఎం.సి.లు మనం వినియోగించుకో లేకుండా వున్నాము. దీనికి తోడు అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాలలో అనగా రబీ సీజనులో రిజర్వాయరు లోకి నీటి చేరిక గణనీయంగా తగ్గిపోవుచున్నది. ఎందుకంటే ప్రాజెక్టు ఎగువ ప్రాంతములో నదీ ప్రవాహం నుండి అత్యధిక వినియోగం వలన ఆశించినంత మేరకు రబీ సీజనులో రిజర్వాయరులోకి నీటి చేరిక జరుగుట లేదు. పై రెండు కారణాల వలన తుంగభద్ర ప్రాజెక్టు క్రింద ఆధారపడిన మూడు రాష్ట్రాలు కూడా కేటాయించిన నికరజలాలలో దాదాపు 40 శాతం నీటి వినియోగాన్ని కోల్పోవుచున్నవి. పూర్తి స్థాయిలో 230 టి.ఎం.సీ.లు వినియోగించుకొనవలెనన్న ఖరీఫ్ సీజనులో ఉధృత స్థాయిలో వరద ప్రవాహం ఉన్నపుడు ఆ నీటిని ఒడిసి పట్టుకొనిన యెడల అన్ని రాష్ట్రములు తమ నీటి వినియోగమును పూర్తి స్థాయిలో పొందవచ్చును. వరదల సమయంలో నీటిని వరద కాలువల రూపేణ నదిలోకి పొర్లిపోకుండా ఆ నీటిని మళ్లించుకొని జలాశయాలలో నిల్వచేసుకొనుట ద్వారా నీటి వినియోగ శాతం పెంచుకోవచ్చును. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రిజర్వాయరు నుండి ప్రారంభమై 105 కి.మీ. వద్ద మన రాష్ట్ర సరిహద్దు చేరుతున్నది. ఈ కాలువ లైనింగు లేని కారణంగా మరియు నియంత్రణ లోపాల (జలచౌర్యం) కారణంగా, మొదట్లో అంచనా వేసిన ప్రవాహ తరుగు 1.25 టి.ఎం.సి.లే అయినా ప్రస్తుతం సుమారు 6.నుండి 7 టి.ఎం.సి.ల ఈనీటిని ప్రవాహ తరుగుగా లెక్కించడం జరుగుతుంది.

తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ క్రింద సుదూర ప్రాంతాలకు నీరు తరలించి 3 జిల్లాలకు 32.5 టి.ఎం.సి.ల తుంగభద్ర జలాలు మరియు 7.88 టి.ఎం.సి. ల పెన్నా నది నీటిని కలుపుకొని, సుమారు 2.94 లక్షల ఎకరములకు సాగునీటిని అందించుటకు, ఉద్దేశించబడింది. పెన్నా నదిలో మధ్య పెన్నార్ డ్యాం వరకు స్థానిక వర్షాల మూలంగా 2.00 టి.ఎం.సి. ల నీరు లభ్యమగునని అంచనా వేయడం జరిగింది. 2.00 టి.ఎం.సి. లు కలుపుకొని తుంగభద్ర ఎగువ కాలువ అనంతపురము జిల్లా పరిధి మేరకు, మొదట దశలోని ప్రధాన కాలువ 17.21 టి.ఎం.సి. లు రెండవ దశలో భాగంగా గుంతకల్లు బ్రాంచి కాలువ ఆయకట్టుకు గాను 4.52 టి.ఎం.సి.లు మొత్తము 21.73 టి.ఎం.సి.ల నీటితో సుమారు 1,45,236 ఎకరముల ఆయకట్టు స్థిరీకరించబడింది.

| వ.నెం. | ప్రధాన కాలువ | ప్రధాన కాలువ నిడివి కి.మీ. | ఉపకాల్వల నిడివి. కి.మీ. | మొత్తం మీ. | ఆయకట్టు ఎకరములు |
|---|---|---|---|---|---|
| | మొదటి దశ | | | | |
| 1. | ఎగువకాల్వ ప్రధాన కాలువ | 84.24 | 64.04 | 148.68 | 35.541 |
| 2. | మధ్యపెన్నా దక్షిణ కాలువ | 96.56 | 125.83 | 222.39 | 33.176 |
| 3. | మధ్య ఎగువ ఉత్తర కాలువ | 58.30 | 51.21 | 109.51 | 13.325 |
| 4. | తాడిపత్రి బ్రాంచి కాలువ | 30.58 | 57.15 | 87.73 | 31.131 |
| 5. | గుంతకల్లు బ్రాంచి మరియు గుత్తి సబ్ బ్రాంచి కాలువ | 67.81 | 110.65 | 178.46 | 32.063 |
| | మొత్తము | 337.49 | 408.88 | 746.77 | 1,45,236 |

అనంతపురము జిల్లా పరిధిలోని (రెండు దశలకు కలిపి) 1,45,236 ఎకరముల ఆయకట్టుకు నీరు సుమారు 750 కి.మీ. దూరం ప్రవహిస్తుంది. ప్రధాన కాలువ ఉపకాలువల ద్వారా మరియు కొంత మేర సహజ వాగుల ద్వారాను 750 కి.మీ. ప్రవహించి, కణేకల్లు చెరువు పి.ఎ.బి.ఆర్., యం.పి.ఆర్, ముచ్చుకోట, మరియు సుబ్బరాయసాగరు రిజర్వాయరు ద్వారా పొలాలకు చేరవలసి వున్నది. తుంగభద్ర రిజర్వాయరు పూడిక నష్టాలకు అదనంగా చాలా దూరము ప్రధాన మరియు ఉప కాలువల ద్వారా నీరు ప్రవహించవలసి వున్నందు వలన ప్రవాహ తరుగు మార్గమధ్యలో జల చౌర్యం మరియు జలాశయాలలో ఇంకుడు తరుగు అన్నీ కలిపి సుమారు 10.73 టి.ఎం.సి.లుగా అంచనా వేయబడినది.కాబట్టి అనంతపురము జిల్లాకు తుంగభద్ర ఎగువకాలువ నుండి నికరంగా అనంతపురమునకు లభ్యమయ్యేది 21.73 టి.ఎం.సి. లలో తరుగులు 10.73 టి.ఎం.సి.లు తీసివేస్తే నికరంగా మిగిలేది వాస్తవంగా 11 టి.ఎం.సి.లు మాత్రమే అని అంచనా వేయబడింది.

తేదీ : 13-04-2016

# అనంతపురము జిల్లా త్రాగు నీటి అవసరాలు

1. పాణ్యం సుబ్రమణ్యం, విశ్రాంత సాగునీటి నిపుణులు,

2. డా॥ వై.వి. మల్లారెడ్డి, డైరెక్టరు, ఎకాలజీ సెంటరు

## 1. పరిచయము :

అనంతపురము జిల్లాలో తరతరాలుగా కరువులు విలయతాండం చేస్తూ, వ్యవసాయాన్ని గ్రామీణ జీవితాన్ని తీవ్రసంక్షోభంలోకి నెట్టేసిన విషయం అందరికీ తెలిసిందే ! కరువును అధిగమించడంతో విఫలమైనట్టే, తాగునీటి సరఫరాలో కూడా అంతకంటే ఇంకాఘోరంగా విఫలమైనాము.

అనంతపురము జిల్లాలో ప్రజలు త్రాగునీటి కొరతతో అనేక యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. చాలా గ్రామాలకు టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కడవ నీటి కోసం కిలోమీటర్ల వరసబిందెలు కనబడుతాయి. కడవ నీటికోసం కిలోమీటర్లు నడుస్తున్న గ్రామాలున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని దిన కూలీపైన బతికే పేద కుటుంబాలు పనులకు వెళ్ళకుండా ముఖ్యంగా స్త్రీలు కడవ నీటికోసం గంటలు గంటలు సమయం వెచ్చించాల్సి వస్తున్నది. నీళ్ళు కావాలంటే తిండి వదులు కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కొన్ని గ్రామాలకు మూడు రోజులకొకసారి గానీ ట్యాంకర్లు రావు. ట్యాంకరు వచ్చినపుడు యుద్ధభూమిని తలపించే విధంగా కడవ నీటికోసం పోరాటం చేయవలసి వస్తున్నది. అనంతపురము జిల్లాలో గత కొన్ని సంవత్సరాల క్రితం వరకు చాలా వరకు త్రాగునీరు భూగర్భ జలాలపై ఆధారపడిన బోరు బావుల నుండి చేతి పంపుల ద్వారా లభించేది. గత కొన్ని సంవత్సరాలుగా భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు ఎండి పోవడముతో తుంగభద్ర ఎగువ కాలవ నీటిని వ్యవసాయానికి తగ్గించి, త్రాగు నీటికోసం కొన్ని స్కీముల ద్వారా కొన్ని పట్టణాలకు, గ్రామాలకు కేటాయిస్తున్నారు. ఉదాహరణకు శ్రీరామరెడ్డి త్రాగునీటి సరఫరా పథకము, శ్రీ.జె.సి.నాగిరెడ్డి త్రాగునీటి సరఫరా పథకము, అనంతపురము పట్టణ నీటి సరఫరా పథకము మొదలగునవి. ఇప్పటి వరకు తాగునీటికోసం కేటాయిస్తున్న తుంగభద్ర ఎగువకాల్వ నీరు కూడా వ్యవసాయానికి కేటాయించిన నీటి నుండి వాడుకుంటున్నవే ! అంతేకాక, తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నా మన జిల్లాలో పశువులకు కూడా తాగునీరు అవసరమనే అంశాన్ని ఏ ప్రభుత్వమూ, ఎక్కడా పరిగణలోకి తీసుకోలేదు.

అనంతపురము జిల్లా తాగు నీటి సమస్యను విడిగా చూడలేము. వ్యవసాయము, పరిశ్రమలు, పర్యావరణ, క్రీడలు వీటకన్నింటికి నీటి సమస్య తీవ్రమైనది. అన్ని రంగాల నీటి సమస్యలకు సమగ్ర పరిష్కారంగా అనంతపురము జిల్లాకు 100 టి.ఎం.సి.ల నదీ జలాలు అందించాలనే డిమాండు ఎప్పటి నుంచో వుంది. ఈ నదీ జలాలతో భూగర్భ జలాలను, ఉపరితల జలాలను, వర్షపు తేమను అనుసంధానం చేసి అనుసంధాన నీటి వినియోగ **(Conjucntive Water Management)** విధానం పాటిస్తే అన్ని రంగాల నీటి సమస్యలకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని మేము పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి, పౌర సమాజం దృష్టికి తీసుకొని రావడం జరిగింది.ఈ తీవ్రమైన నీటి సమస్యను పరిష్కరించుటకు

అనుసంధాన నీటి వినియోగ విధానమే శాశ్వత సమాధానమనే విషయాన్ని ప్రభుత్వము దృష్టికి తీసుకొని రావడానికి మేము ఇంకొకసారి ఈ వ్యాసం ద్వారా ప్రయత్నిస్తున్నాము.

## 2. అనంతపురము జిల్లా జనాభా మరియు పశుసంపద :

అనంతపురము జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారము 40,81,148 మంది జనాభా వుంది. అందులో పట్టణాలు మరియు నగరాలలో 11,45,711 మంది మరియు గ్రామాలలో 29,35,437 మంది నివసిస్తున్నారు. గ్రామాల నుండి పట్టణాలకు వలసలు ఎక్కువగా వుండుట వలన పట్టణాల జనాభా వేగంగా పెరుగుతున్నది.

అనంతపురము జిల్లాలో పశుసంపద పశుసంవర్ధక శాఖ 2012లో నిర్వహించిన పశుగణన ప్రకారము క్రింది విధంగా వున్నది.

**పట్టిక :1**

**అనంతపురము జిల్లాలో పశుసంపద :**

| | | | |
|---|---|---|---|
| **1.** | **ఆవులు, ఎద్దులు** | **-** | **6,15,667** |
| **2.** | **ఎనుములు** | **-** | **3,70,511** |
| **3.** | **గొర్రెలు** | **-** | **38,78,601** |
| **4.** | **మేకలు** | **-** | **7,85,100** |
| **5.** | **పందులు** | **-** | **21,809** |
| **6.** | **గాడిదలు** | **-** | **6,295** |
| **7.** | **కుక్కలు** | **-** | **53,375** |
| **8.** | **కోళ్లు** | **-** | **96,638** |
| | | **-** | **58,21,996** |
| | **మొత్తం** | **-** | **60,000,00** |

## 3. భవిష్యత్తు అవసరాలు దృష్టిలో వుంచుకొని, పెరుగనున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి డిమాండు లెక్కించవలయును :

తాగునీటి అవసరాలు లెక్కించేటప్పుడు భవిష్యత్తులో కనీసం రాబోవు 20 సంవత్సరాలలో జనాభా మరియు పశుసంపద ఎంతవరకు పెరుగుతుందో అంచనా వేసి, అప్పటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని " డిమాండు లెక్కించవలసి వుంటుంది. చాలా దేశాలలో రాబోవు 30 నుండి 50 సంవత్సరాల వరకు జనాభా పెరుగుదల అంచనావేసి తాగు నీటి డిమాండు లెక్కిస్తారు.

మన జిల్లా డిమాండు లెక్కించుటకు 2011 నుండి 2030 వ సం॥ వరకు జనాభా పెరుగుదలను మరియు పశువుల జనాభా పెరుగుదలను అంచనా వేసి, అప్పటి అవసరాలకు అనుగుణంగా లెక్కించడం జరిగింది. నీటి తలసరి దిన అవసరం **(per capita water requirement per day)** పట్టణాలలో 165 లీటర్లుగా మరియు గ్రామాలలో 135 లీటర్లుగా లెక్కించడం జరిగింది. అదే విధంగా పెద్ద పశువులకు నీటి తలసరి దిన అవసరం 70 లీటర్లుగానూ చిన్న పశువులకు (గొర్రెలు, మేకలు మొ॥) 10 లీటర్లుగానూ లెక్కించడం జరిగింది.

## 4. 2030వ సం॥ నాటికి మనుషులకు, పశువులకు అవసరయ్యే తాగునీరు :

అనంతపురము జిల్లా తాగునీటి కోసం మనుషులకు, పశువులకు కలిపి 2030 సం॥ నాటికి దాదాపు 12.8 టి.ఎం.సి.ల నీరు సంవత్సరానికి అవసరమౌతుందని లెక్కించడము జరిగింది. నాగరికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో నీటి అవసరాలు కూడా అంతే వేగంగా పెరుగుతాయి. పైన లెక్కించింది కేవలం తాగునీటి కనీస అవసరాల కోసం మాత్రమే !

**పట్టిక : 2**

**అనంతపురము జిల్లాకు 2030 సం॥ జనాభా ప్రకారము ఒక దినమునకు తాగునీటి అవసరము :**

| వ.నెం. | వివరము | పరిమాణము |
|---|---|---|
| **1.** | **పట్టణాలు, నగరాలకు, 14,415 లక్షల జనాభాకు తలసరి దిన నీటి అవసరం 165 లీటర్ల ప్రకారము (మిలియన్ లీటర్లు)** | **237.80** |
| **2.** | **గ్రామీణ జనాభా 36.93 లక్షల జనాభాకు తలసరి దిన నీటి అవసరం 135 లీటర్ల ప్రకారము (మిలియన్ లీటర్లు)** | **498.15** |
| **3.** | **ఆవులకు ఎనుములకు 13.4 లక్షల తలసరి దిన నీటి అవసరం 70 లీటర్ల ప్రకారము (మిలియన్ లీటర్లు)** | **93.08** |
| **4.** | **గొర్రెలు, మేకలు మొదలగు చిన్న పశువులు (54.4 లక్షలకు -తలసరి దిన అవసరము 10 లీటర్ల ప్రకారము (మిలియన్ లీటర్లు)** | **54.40** |
| **5.** | **మొత్తము ఒక దినమునకు (మిలియన్ లీటర్లు)** | **884.15** |
| **6.** | **మొత్తము ఒక సంవత్సరమునకు = 884.15×365 రోజులు (మిలియన్ లీటర్లు)** | **3.22,715** |
| **7.** | **884.15 మిలియను లీటర్లను టి.ఎం.సిలకు మార్చినపుడు** | |
| **11.397** | **884.15×28.316** | **11.397** |
| **8.** | **అదనంగా పండుగలకు, తిరుణ్ణాలకు ఆధ్యాత్మిక అవసరాలకు** | **1,603** |
| **9.** | **మొత్తము ఒక సంవత్సరమునకు అవసరమయ్యే నీరు (టి.ఎం.సీ.లు) (11.397 + 1.603)** | **13.00** |

**1. టి.ఎం.సి = శతకోటి ఘనపుటడుగులు**

### 5. అదనపు వ్యవసాయేతర నీటి అవసరాలు :

అదనంగా క్రీడలకు, విద్యాసంస్థలకు, హోటల్సు, హాస్పిటల్సు, ఈతకొలనులు, వినోదం, పట్టణ సౌందర్యం (పార్కులు, లాన్లు మొ॥) అవసరాలు కూడా పెరుగుతాయి. అవన్నీ కూడా నాగరికత పెరుగుతున్నప్పుడు అవసరాలేగాని, విలాసాలు అనడానికి లేదు. అనంతపురము జిల్లా కరువు జిల్లా కాబట్టి మీకు కనిష్టంగా కూడా ఈత కొలనులు అవసరము లేదు. కనీస వినోదం అవసరం లేదు. పట్టణాలలో పార్కులు అవసరంలేదు అంటే అది తీవ్రమైన వివక్ష మరియు అన్యాయమౌతుంది. విదేశాలనుండి లక్షల కోట్లు వెచ్చించి వేలకిలోమీటర్లు రవాణా చేసి దిగుమతి చేసుకొనే పెట్రోలు, డీజలు కూడా అన్ని ప్రాంతాల అవసరాలకు తగినంతగా సమకూర్చుతుంటే, మన రాష్ట్రంలోనే క్రింది ప్రాంతాలలో లభ్యమయ్యే మన నీటిని సమంగా కాకపోయినా, కనీస అవసరాలకు సరిపడ అయినా కేటాయించి అందించకపోవడం తీవ్ర అన్యాయం కాదా? అనంతపురము జిల్లాకు జలక్రీడా ప్రాంగణాలు **(Water sports complexes)** నీటి వినోద పార్కులు **(Water entertainment parks)** లాంటివి కావాలని కోరడం భావ్యం కాకపోవచ్చు.

### 6. పరిశ్రమలకు నీటి కేటాయింపులు :

మన జిల్లాలో పరిశ్రమలు స్థాపించుటకు నీటి కొరత ఒక ముఖ్యమైన అవరోధంగా వున్నది. అనంతపురము జిల్లాలో పారిశ్రామిక నడవలు **( Industrial corridors)** నిర్మించి, పారిశ్రామిక వాడలు **(Indutrial Estates )** ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని మౌలిక వసతులతో పాటు, తగినంత నీటిని నమ్మకంగా సరఫరా చేయగల్గినప్పుడే పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తారు. అనంతపురము జిల్లా లాంటి అత్యంత వెనుకబడిన జిల్లాలో పరిశ్రమలు స్థాపించడానికి ఎవరైన ఔత్సాహికులు ముందుకు రావాలంటే, ఇక్కడ కల్పించే మౌలిక సదుపాయాలతో పాటు, దీర్ఘకాల పన్ను మినహాయింపులు, విద్యుత్తు సబ్సిడీలు మొదలగునవి ఇతర ప్రాంతాలకంటే అధికంగా వుండాలి.

### 7. ముగింపు :

అనంతపురము జిల్లా యొక్క వ్యవసాయము, తాగునీరు, పరిశ్రమల అవసరాలకు కనీసం 100 టి.ఎం.సి.ల నీరు అవసరమౌతుందని నిపుణుల అంచనా వేయబడింది. ఈ అంచనా ఆధారంగా జిల్లాకు 100 టి.ఎం.సి. ల నదీ జలాలు కేటాయించవలయుననే డిమాండును కొంతమంది రాజకీయ నాయకులు, మేధావులు, పౌరసంస్థలు, కవులు, రచయితలు చాలా కాలంగా ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నారు. అలాగే వ్యవసాయానికి "అనంత జలవలయం" **(Anantapur Water Grid)** ద్వారా అనుసంధాన నీటి వినియోగ విధానం ప్రాతిపదికగా చెరువులను, కుంటలను, నదీ జలాలతో నింపే కార్యక్రమం చేపట్టాలని, తద్వారా శాశ్వతంగా కరువు నివారణ చేయాలని డిమాండు కూడా సాధారణ ప్రజల నుండి ప్రోద్బలము బలంగా వుంది. ఈ రెండు డిమాండ్లను ప్రజలతో కూడా కలిసి ఇంకా తీవ్రంగా ప్రభుత్వాలకు వినిపించవలసి వుంది. అప్పుడే స్పందించే అవకాశం వుంది.

అనంతపురము జిల్లాలో త్రాగునీటి కోసం, వ్యవసాయం కోసం ప్రజలు తరతరాలుగా పడుతున్న కష్టాల తీవ్రమైన సమస్యగా ప్రభుత్వము ఇప్పటికైనా గుర్తించవలయును. జిల్లాలో నీటి కొరతను శాశ్వతంగా పరిష్కరించుటకు తక్షణ బాధ్యతగా స్వీకరించవలయును. జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా, "ప్రథమ ప్రాధాన్యత" గా గుర్తించి, 100 టి.ఎం.సి. ల నికరజలాలను కేటాయించి ఆ నీటిని వ్యవసాయానికి, పరిశ్రమలకు అన్ని పట్టణాలకు, గ్రామాలకు,

ప్రజలకు, పశువులకు జిల్లా వ్యాప్తంగా సమతులంగా, సమన్యాయంగా అందించుటకు అవసరమైన మౌలిక సదుపాయాలను, "పంపిణీ వ్యవస్థ" **(Distribution System)** నిర్మించవలయును. టాంకర్లతో సరఫరా, బోరుబావులు లాంటి అరకొర తాత్కాలిక ఏర్పాట్లకు సాధ్యమైనంత తొందరగా చరమగీతం పాడవలయును. జిల్లాలో సమన్యాయం ప్రాతిపదికన అన్ని గ్రామాలకు వ్యవసాయానికి, తాగునీటి కోసం, మరియు తగిన విధంగా పరిశ్రమలకు, క్రీడలకు, పర్యావరణ అవసరాలకు, వినోదానికి అందించే విధంగా పంపిణీ వ్యవస్థను నిర్మించవలయును.

**పాలకులు, ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొని తగిన విధంగా స్పందిస్తాయని ఆశిద్దాం !**

తేది : 14-04-2014

# ఉపాధి హామి పథకం అమలవుతున్నా భారీగా వలసలెందుకు వెళ్ళుతున్నారు?

## 1. పరిచయము:

రాయలసీమ జిల్లాల నుండి పొట్టకూటి కోసం ఎండాకాలంలో దీన వలసలు సాధారణమే. కానీ, 2015-16 సంవత్సరంలో జిల్లాల నుండి రైతులు, కూలీలు భారీగా పంటకాలంలో కూడా వలసలు వెళ్ళుతున్నారు. ఒక్క అనంతపురము జిల్లా నుండే గత ఒక సంవత్సర కాలంలో దాదాపు 6 లక్షల మంది దీన వలసలు వెళ్ళినట్లు అంచనా. ఈ మధ్య ఈనాడు పత్రికలో పతాక శీర్షికన "సొంతూరు పొమ్మంది... పొరుగూరు ఉరిమింది'' అనే విశ్లేషణాత్మక వ్యాసం వెలువడిన తరువాత ప్రభుత్వాధికారులలోనూ, రాజకీయ నాయకులలోనూ, పౌర సంస్థలలోనూ ఈ విషయం పై చర్చ ఉత్పన్నమైనది. ఉపాధి హామీ పథకం క్రింద పని కల్పిస్తున్నా దీన వలసలెందుకు ఇప్పుడు ఇంత భారీగా తీవ్రస్థాయిలో ఉన్నాయి అనే ప్రశ్న తలెత్తింది.

గత 20 సం॥లలో కేవలం రెండు, మూడు సంవత్సరాలు మాత్రమే వర్షాధారం క్రింద సాధారణ పంట పండింది. మిగిలిన అన్ని సంవత్సరాలు కరువులు వివిధ స్థాయిలలో సంభవించినాయి. రెండు లక్షలకు పైగా ఉన్న బోరు బావులు 2015-16 సం॥లో ఎండిపోయి దాదాపు 30,000 కు పడిపోయి నీటి సాగు నామమాత్రమైంది. జిల్లాలో రైతులు, రైతు కూలీలు ఇంతకు మునుపెన్నడు లేని దయనీయ దుస్థితిలోకి నెట్టబడినారు. కాబట్టి ఇది దాదాపు రెండు దశాబ్దాల వరుస కరువుల ప్రభావం వల్ల, మరియు భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల తీవ్ర సంక్షోభం ఏర్పడి దీన వలసల తీవ్రత తారా స్థాయికి చేరింది. భారీ వలసలతో పాటు, రైతుల ఆత్మహత్యలు, చిన్న ఆర్థిక నేరాలు, కుటుంబ విచ్ఛిన్నాలు కూడా ఉధృతమవుతున్నాయి. 20 సం॥ క్రితం జిల్లాలో కటిక దారిద్ర్యం వుండేది. అరుదుగా ఆకలి చావులు కూడా వుండేవి. కరువు వచ్చిందంటే ఆకలి తీరడానికి కొన్ని కరువు పనులు కల్పిస్తే సరిపోయేది. రెండు రూపాయలకు కిలో బియ్యం సహాయంతో కేవలం ఆకలి తీరితే కరువు గడిచిపోయేది. కొంతమంది పిల్లలు మాత్రమే చదువుకొనేవారు. వారి చదువు చాలా వరకు గవర్నమెంటు విద్యా సంస్థలలో వుండేవి. ఆరోగ్యం కూడా మరియు వాతావరణ మార్పు ప్రభావం ః

గత 20 సం॥లలో ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే రెండు ముఖ్య పరిణామాలు చోటు చేసుకొన్నాయి.

**అవి :**

1. ఆర్థిక సంస్కరణలు, తద్వారా గ్రామీణ జీవనంలో సంభవించిన పెను మార్పులు, పెరిగిన అవసరాలు, ఖర్చులు.
2. వాతావరణలో మార్పులు, తద్వారా వర్షం పడేతీరును మరియు ఋతుక్రమంలో సంభవించిన మార్పుల కారణంగా పెరిగిన వరుసకరువులు.

## 2.1. గ్రామీణ జీవనంలో పెరిగిన అవసరాలు :

ప్రజా ఉద్యమాలు, ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వ విధానాలలో ప్రైవేటీకరణ సరళీకరణలు, ప్రపంచీకరణల కారణంగా ప్రజల జీవన సరళిలో, వారి అవసరాలలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. పొట్ట కూటి కోసం తాపత్రయపడే స్థితి నుండి, గ్రామీణ ప్రజలలో 'అభివృద్ధి' ఫలాలు తాము కూడా అందుకోవాలనే తపన మొదలైంది.

వివిధ పోరాటాలు, ఉద్యమాలు, ప్రభుత్వాలు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు ఒక దానికొకటి తోడై సామాజికంగా, ఆర్థికంగా బలహీనంగా వున్న వర్గాలు జన జీవన ప్రధాన స్రవంతిలో అంతర్భాగమౌతున్నాయి. సామాజికస్థాయి, ఆత్మగౌరవం పెంపొందినాయి. జీవన ప్రమాణాలు పెరిగినాయి. దైనందిన జీవనంలో "అవసరాలు" పెరుగుతున్నాయి. తమ పిల్లలను చదివించుకోవాలనే ఆకాంక్ష, ఆరోగ్యాన్ని కాపాడుకొనాలనే ఆకాంక్ష పెరిగింది. అదే సమయంలో ప్రభుత్వ రంగములోని విద్య, వైద్య సంస్థలు నిర్వీర్యమై నాణ్యత లోపించి, ప్రైవేటు విద్య, వైద్య సేవలు వ్యాపార వ్యవస్థలుగా మారి, నాణ్యత ప్రశ్నార్థకంగా వున్నా, సామాన్యునికి అందని స్థాయిలో ప్రియమైపోయినాయి. ప్రస్తుతం ప్రతి గ్రామీణ రైతు, కూలీ కుటుంబము నుండి కనీసం ఇద్దరు పిల్లలు కేజీ నుండి పిజి వరకు ఏదో స్థాయిలో చాలా వరకు ప్రైవేటు చదువులకు వెళ్తున్నారు. ప్రభుత్వం కొన్ని ఫీజులు భరించినా, చదువులకు ప్రతి కుటుంబంలోనూ ఒకరైనా రక్తపోటు, చక్కెర వ్యాధి లేదా ఇతర దీర్ఘ వ్యాధులకు గురై కనీసం వెయ్యి రూపాయలు ప్రతినెలా వైద్యంపై ఖర్చు పెడుతున్నారు. ఇందుకు అదనంగా తల్లీ, పిల్లల ఆరోగ్యానికి, కాన్పులకు సంవత్సరంలో రెండు మూడుసార్లైనా ఐదు వేల నుండి పది వేల వరకూ ఖర్చులు వస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ ఒకటి రెండు సెల్‌ఫోన్లు అవసరమైపోయినాయి. వాటి ఖర్చు అయిదు వందలైనా వుంటుంది. ఇక డిష్ టివి.ఖర్చు, వంటగ్యాస్ ఖర్చు, ప్రయాణ ఖర్చులు, తిండి ఖర్చులు, పండుగలు మొదలగు ఖర్చులు కూడా సహజంగానే తోడైనాయి. పైగా అభివృద్ధి క్రమంలో ఆవిర్భవించినవి "కనీస అవసరాలు" మాత్రమే. ఏవీ విలాసాలు కావు. అదనంగా పంటల కోసం, కరువులు తట్టుకోవడానికి, వివాహాది శుభకార్యాలకు, విపత్తుల కారణంగా చేసిన అప్పులు, వాటి పైన వడ్డీలు భారంగా మారిపోయినాయి. చాలా కుటుంబాలలో పెళ్ళీడు వచ్చిన పిల్లలు మరియు చదువుకున్న నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగుల బాధ్యతలు కుటుంబాలపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయి. ఎంత బీద కుటుంబమైనా ప్రతి నెలా ఒకటవ తేదీ వస్తే పైన తెల్పిన విధంగా తప్పని సరిగా చెల్లించాల్సిన ఖర్చులు సాధారణమైపోయినాయి. కాబట్టి పెరిగిన అవసరాలు తీరడానికి ప్రతినెలా ఆదాయం వచ్చే మార్గాలను తప్పని సరిగా చూసుకోవాలి.

## 2.2. పర్యావరణంలో మార్పుల కారణంగా పెరిగిన వరుస కరువులు :

చెంపదెబ్బకు గోడదెబ్బ తోడైనట్లు గత 20 సం॥లలో వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు పడే తీరులో, ఋతుక్రమంలో మార్పులు వచ్చి, ఊహించని విధంగా వరుస కరువులు వస్తున్నాయి. గత 16 సంవత్సరాలలో కేవలం రెండు సంవత్సరములు మాత్రమే సాధారణ పంట వచ్చింది. 14 సంవత్సరాలు కరువు !

## 3. ప్రస్తుతమున్న ఉపాధిహామీ పథకం పెరిగిన అవసరాలు తీర్చే స్థాయిలో లేదు :

ఇటువంటి పరిస్థితులలో ఉపాధిహామీ పథకం కేవలం ఆకలైతే తీర్చ గలిగేదేమోగానీ, పెరిగిన అవసరాలు తీర్చే పరిస్థితిలో లేదు. ఒక కుటుంబానికి 100 రోజుల పని దినాలు మాత్రమే వుంటాయి. కుటుంబంలో ఇద్దరు పనిచేస్తే 50 రోజుల తర్వాత పనుండదు. ముగ్గురు పని చేసేవారుంటే 33

రోజులు తర్వాత పనుండదు. కొన్ని సంవత్సరాలలో అదనంగా మరో 50 పని రోజులు పెంచినా పెద్ద మార్పు వుండదు. అవసరానికి తగిన విధంగా ప్రతినెలా కనీసం 25 రోజులు సంవత్సరమంతా పని లభించే పరిస్థితి లేదు. అప్పుడప్పుడు పనులు అవసరమైన వారిని మాత్రము కొంత వరకు ఆదుకుంటూ వుంది. పని చేసినా సమయానికి కూలీ చేతికందుతుందనే నమ్మకము లేదు. పైగా వరుస కరువులతో వ్యవసాయ కూలి పనులు బాగా తగ్గినాయి. అందువలననే ప్రతినెల నిలకడగా కొంత ఆదాయం వచ్చే చోటుకు దీనావస్థలో వలసలు తప్పని రైతులు, కూలీలు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెనుకబడిన రాయలసీమ జిల్లాలలో మెట్ట రైతులే కూలీలు, కూలీలే మెట్ట రైతులు. ఇలా వలసలు వెళ్లే వాళ్ళు వరుస కరువులకు గురైన మెట్ట రైతులు, బోరు బావులు ఎండిపోయిన రైతులు, కొత్తబోరు వేయించి విఫలమై అప్పుల పాలైన రైతులు, బోరు బావుల క్రింద అధిక ఖర్చులతో పంటలు పండించి, ధరలు పడిపోయి అప్పుల పాలైన రైతులూ మరియు రైతు కూలీలు అందరూ వున్నారు.

## 4. వలసలు వెళ్ళిన చోట వారి జీవన పరిస్థితులు దయనీయం :

అంతస్తులను, ఆత్మగౌరవాన్ని పక్కన పెట్టి ఎక్కడ పని దొరికితే అక్కడికి, ఎట్లాంటి పనినైనా చేయడానికి సిద్ధమై వెళ్ళుతున్నారు. వలసలు పోయిన చోట ఎలాంటి దుర్భర పరిస్థితులలోనైనా జీవించడానికి సిద్ధమౌతున్నారు. సత్రాలలోనూ, దేవాలయాలలోనూ, బ్రిడ్జిల క్రింద, రోడ్ల మీద, ఎక్కడైనా నివసించడానికి సిద్ధమౌతున్నారు.

అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుండి ఎక్కువగా కర్నాటక, కేరళ రాష్ట్రాలకు వలసలు వెళ్లుతునారు. అయితే అత్యధికంగా దీన వలసలు వెళ్తున్నది దగ్గరలో వున్న బెంగుళూరు నగరానికి, బెంగుళూరు హోసూరు మధ్య మరియు హెబ్బాలు, యలహంకల మధ్య వలస వెళ్లిన తెలుగు వారు చాలా వరకు కేంద్రీకృతమైనారు. బెంగుళూరు ఎలక్ట్రానిక్ సిటీ దగ్గర తోగూరు అనే గ్రామం, దాని చుట్టు ప్రక్కల అంతా వలసపోయిన రాయలసీమ వారే. వీరిలో చాలా మందితో నేను మాట్లాడటం జరిగింది. ప్రతి కుటుంబం వెనుక ఒక చితికిపోయిన దీన చరిత్ర వుంది. బాగా బ్రతికిన రైతులు, పది మందికి కూలీ కల్పించిన రైతులు, అన్నం పెట్టిన రైతులు హమాలీలుగా, గేట్ మ్యాన్‌లుగా, అంట్లు తోమే వాళ్ళుగా, మారిపోయిన ప్రక్రియ నన్ను ఏడ్పించింది. వ్యవసాయం, గ్రామీణ వ్యవస్థలు ఏ విధంగా ఛిద్రమై పోయినాయో విని అవాక్కయ్యాను. ఏడు –ఎనిమిది ఏళ్ళ చిన్న పిల్లలను "ప్రైవేటు కాన్వెంటు " స్కూళ్లలో చేర్చి, ఇంత దూరంగా వుంటూ వారిని చూడకుండా ఉండలేకపోతున్నామని అనేక మంది తల్లులు కంట తడి పెట్టారు. " మా అమ్మను పలకరించే వారు కూడా గ్రామంలో లేరని " ఒక మధ్య వయస్కుడు విలపించాడు. ఒకప్పుడు మగవారు మాత్రమే వలస వెళ్ళి భార్య,, బిడ్డలు, వృద్ధులు ఇంటి దగ్గర వుండేవారు. ఇప్పుడు భార్య భర్త ఇద్దరూ వలస వెళ్లి వృద్ధులు ఇంటి దగ్గర వుంటున్నారు. పిల్లలను మాత్రము ప్రైవేటు విద్యా సంస్థలలో చేర్చుతున్నారు. పిల్లల చదువు కోసం వారు ఎంతటి త్యాగానికైనా సిద్ధమౌతున్నట్లు వారు నాతో చెప్పారు. మగవారు చాలా వరకు ఒకే చోట గేటు మ్యాన్ గానో, వాచ్‌మ్యాన్ గానో, హమాలీ గానో యితర దిన కూలీలుగానో వుంటున్నారు. రూ, 250 నుండి 400 రూ. వరకూ దినకూలీతో నెలకు రూ.7 వేల నుండి రూ. 10 వేల వరకు వస్తుంది. కొంతమంది మగవారు గుడ్డలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, కార్లు తుడవడం మొదలగు ఏ పనైనా చేస్తున్నారు. కొంతమంది చదువు కొన్న యువకులైతే సేల్సుమెన్‌లుగా షాపులలో పనిచేస్తున్నారు. ఇక స్త్రీలు ఒక్కొక్కరు దినానికి 5 నుండి 7 ఇండ్లలో పనిచేస్తున్నారు. ఒక్కొక్క ఇంటిలో ఒక గంట నుండి రెండు గంటలు పనిచేస్తారు. ఇల్లు వూడ్చడం, అంట్లు తోమడం, వంట చేయడం వీరు సాధారణంగా చేస్తున్న పనులు. ఒక్కొక్క ఇంటి నుండి నెలకు రూ. 1500 నుండి రూ. 2000 వరకు కూలీ

తీసుకుంటున్నారు. ఆ విధంగా స్త్రీలు నెలకు రూ. 7,500 నుండి రూ. 9,000 వరకు సంపాదిస్తున్నారు. సబ్సిడి స్టోరు బియ్యం తెచ్చుకోవడానికి మాత్రం నెలకు ఒక రోజు వూరికి పోతారు. అప్పుడే స్కూలు, కాలేజీలలోని పిల్లలను చూసి ఫీజులు, వడ్డీలు ఇతర చెల్లింపులు చేస్తారు. సబ్సిడీ బియ్యం లేకపోతే జీవనం చాలా భారమైపోయేదని వారు చెప్పారు. వలసపోయిన చోట స్త్రీలు, పురుషులు ఇద్దరు పని చేసి సంపాదిస్తేగాని పిల్లల చదువులు, ఆరోగ్యం అప్పులు, వడ్డీలు లాంటి నెల ఖర్చులు చెల్లించలేమని వాపోతున్నారు.

వలస పోయిన వారందరిలోనూ ఒకే ఒక బలమైన కోరిక. " మాపిల్లలను చదివించుకోవడానికి మేము ఇన్ని బాధలు అనుభవిస్తున్నాం. మాతో ఈ బాధలు అంతం కావాలి. మా పిల్లలకు మంచి ఉద్యోగాలు వచ్చి వారు బాగా, గౌరవంగా జీవించాలి". కొన్ని అరుదైన సందర్భాలలో మాత్రమే చిన్న పిల్లలను వారితో తీసుకొనిపోయి అడుక్కునే దానికి పంపడం, ఇతర అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నారు.

వలసలు వెళ్లే వారి గ్రామాలలో ఉపాధిహామీ పనులు ఉన్నా, ఎక్కువ కూలీ కోసం వలసలు పోతున్నారని, వారు విలాసవంతమైన జీవనం కోసం వలసలు పోతున్నారనేది చాలా అరుదు. కొంతమంది యువకులు, భార్యాబిడ్డలు లేని వారు, ఇతర కుటుంబ బాధ్యతలు లేని వారు కొద్ది సంఖ్యలో మాత్రమే అలాంటి వారు వుంటారు.

వలసలు పోతున్న వారిలో బోరు బావులు ఎండిపోయిన వారు ఈ సంవత్సరం అధికమైనారు. ఆశ్చర్యకంగా కొంతమంది బోరు బావులలో నీరు ఉన్నా కూడా వలస వెళ్తున్నారు. నీటి ఆధారం క్రింద టమేటా లాంటి పంట పెట్టడం కోసం లక్షలలో ఖర్చు పెట్టి, తీరా పంట వచ్చే సమయానికి ధరపడిపోయి పూర్తిగా నష్టపోయి, పాత అప్పులు తీర్చలేక, మళ్లీ పంట పెట్టడానికి కొత్త అప్పులు పుట్టక, వ్యవసాయంపై నమ్మకం లేక వలసలు పోయిన వారు కూడా వున్నారు.

## 5. అప్పుల విషవలయంలో రైతులు :

రాయలసీమ వర్షాధార వ్యవసాయం, బోరుబావుల క్రింద వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో మునిగిపోయి, రైతులను కనీవిని ఎరుగని దుస్థితికి చేర్చినాయి. వీరిలో నూరుశాతం వ్యవసాయం మీద నమ్మకం పొయ్యింది. వేరే ఏ వృత్తి చేసే అవకాశం లేక, గత్యంతరం లేక తీవ్ర నిరాశ, నిస్పృహలతో జీవనాన్ని సాగిస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు కరువులను, వలసలను అరికట్టలేకపోతున్నాయి. కొంత మాత్రంగానే ఉపాధిహామీ, పంటల భీమా, పెట్టుబడి రాయితీలు రైతులకు ఉపయోగపడుతున్నాయి. ఒక్క అనంతపురం జిల్లా ఉదాహరణ తీసుకుంటే 25 లక్షల ఎకరాలు వర్షాధార పంట పెట్టడానికి 7 లక్షల మంది రైతులు కనీసం రూ. 2,500 కోట్లు పెట్టుబడి ప్రతి సంవత్సరం పెడుతున్నారు. వర్షాధార పంటలు సాధారణంగా పండితే సంవత్సరానికి దాదాపు రూ. 5,000 కోట్ల విలువైన పంట వచ్చే అవకాశం వుంది. అయితే వరుసగా కరువులే వస్తున్నాయి. పంటల భీమా, పెట్టుబడి రాయితీ రెండూ కలుపుకొన్నా అనంతపురం జిల్లాకు సంవత్సరానికి రూ. 500 కోట్లకు మించి రావడం లేదు. పెట్టుబడిలో 20 శాతం ఖర్చు పూడ్చుకొనే ఉపశమనం కూడా పంటల భీమా, పెట్టుబడి రాయితీల నుండి రాలేదు. దాదాపు ప్రతి సంవత్సరం అదే స్థాయిలో నష్టపోతున్నారు. వ్యవసాయంలో అప్పులు ఈ విధంగా వుంటే, అదనంగా పిల్లల చదువుల కోసం, ఆరోగ్యం కోసం, వివాహాది కార్యక్రమాలకు, పండుగలకు చేసిన అప్పులు, వడ్డీలు వాటికి మించి వున్నాయి. అందుకే అప్పుల ఊబిలో కూరుకొని పోయినారు. బ్యాంకులో పంట రుణాలు, బంగారుపై అప్పులు, అదనంగా ప్రైవేటు అప్పులు. ఒక ప్రక్క వర్షాధార వ్యవసాయం వరుస కరువులతో సంక్షోభంలో

వుంటే, దానిని అధిగమించడానికి విపరీతంగా కొత్త బోర్లు వేయడం, అవి విఫలం కావడం జరుగుతున్నది. ఇప్పటికే వున్న బోర్లు ఎండిపోతుంటే పంటలు రక్షించుకోవడానికి అదే పొలంలోనే లెక్క లేనన్ని బోర్లు వేయడం అవి కూడా విఫలం కావడం జరుగుచున్నవి. ఈ విచ్చలవిడి బోర్లు వేసే ప్రక్రియ లక్షల మంది రైతులను అప్పుల అగాధంలోకి నెట్టేసింది. కొంతమంది నీరుసాగయ్యే రైతులు టమేట, అరటి లాంటి పంటలను అధిక ఖర్చులతో పండించుతున్నారు. అయితే కొన్ని సందర్భాలలో వాటి ధరలు పూర్తిగా పడిపోయి కోలుకోలేనంతగా దెబ్బతింటున్నారు. ఒక ప్రక్క వ్యవసాయంపై ఆశలు లేవు. ఇంకొక ప్రక్క చాలా కుటుంబాలలో పెళ్లీడుకొచ్చిన పిల్లలు, చదువులు ముగించుకొని ఉద్యోగాలు రాని నిరుద్యోగులు, జీవనం గడవడానికి కూడు, గుడ్డలపై దినదినానికి పెరుగుతున్న ఖర్చులు గ్రామీణ కుటుంబాలపై తీవ్ర ఒత్తిడి కలుగచేస్తున్నాయి. తాము తాకట్టు పెట్టిన బంగారు నగలు వేలం వేస్తున్నట్లు బ్యాంకులు ఇస్తున్న ప్రకటనలు, అప్పులు తీర్చమని బ్యాంకులు, ప్రైవేటు అప్పు ఇచ్చిన రుణదాతలు చేస్తున్న ఒత్తిడులు రైతులను అవమానానికి, మానసిక క్షోభకు గురి చేస్తున్నాయి. ఈ ఒత్తిడి వల్ల నిరాశ వల్ల, నిస్సహాయత వల్ల కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు కూడా చెడిపోతున్నాయి. ఒత్తిడికి తట్టుకోలేక వేరే మార్గము కానరాక కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంత మంది ఆర్థిక విషయాలపై తల్లిదండ్రులతో, అన్నదమ్ములతో, అత్తమామలతో వివాదాలు పెట్టుకుంటున్నారు. చిన్న పిల్లలను, వృద్ధులను యాచక వృత్తిలోకి దింపుతున్నారు. ఈ మధ్య కుటుంబ హత్యలు కూడా ఎక్కువవుతున్నాయి. అంటే ఆస్తుల కోసం తల్లిదండ్రులను, భార్యాభర్తలను, అన్నదమ్ములను కూడా చంపుకోవడం, మరియు కుటుంబమంతా ఆత్మహత్యలు చేసుకోవడం అక్కడక్కడ జరుగుచున్నవి. మానవ సంబంధాలన్నీ వ్యాపార,ఆర్థిక సంబంధాలుగా మారిపోయి, కుటుంబ అనుబంధాలు, అనురాగాలు, స్నేహ సంబంధాలు, నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి.

### 6. అనుసంధాన నీటి వినియోగం ద్వారా కరువులను అధిగమించి, వ్యవసాయాన్ని గ్రామీణ జీవనోపాధులను లాభసాటిగా మార్చాలి :

కరువు పీడిత ప్రాంతాలలో కరువు నుండి పంటల రక్షించేవిధంగా "అనుసంధాన నీటి వినియోగం" అమలు చేసి ప్రతి ఎకరాలో పంటను, ప్రతి సంవత్సరము కరువు నుండి రక్షించే అవకాశం వుంది. ఆ దిశగా అవసరమైన పరిశోధనలను ప్రయోగాలను ఏ.యఫ్.ఎకాలజీ సెంటరు విజయవంతంగా చేసింది. రాయలసీమ తరచు కరువుకు గురయ్యే వర్షాధార భూమి (అనంతపురం జిల్లాలో 26 లక్షల ఎకరాలు, కర్నూలు జిల్లాలో 17 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 6.3 లక్షల ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 6 లక్షల ఎకరాలు ) మొత్తం దాదాపు 55 లక్షల ఎకరాలు వుంది. కేవలం 55 టి.ఎం.సి. ల నీటితో రాయలసీమలో వున్న 55 లక్షల ఎకరాల వర్షాధార భూమిని ప్రతి ఎకరాను కరువు నుండి రక్షించ వచ్చును. ఈ దిశగా ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు చేపడితే వాటిని చూసి, రైతులలో కొంత 'ఆశ' చిగురించే అవకాశం వుంది. కేవలం వాగ్దానాలను నమ్మే పరిస్థితులలో రైతులు లేరు. స్వల్పకాలంలో ఉపాధిహామీ పథకాన్ని తగిన విధంగా సవరించి, ఎడారి నివారణ కార్యక్రమాలను అమలు చేయడానికి ఉపయోగించి, వ్యవసాయానికి అవసరమైన విధంగా భూసార సంరక్షణ, వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవడం, పచ్చదనాన్ని పెంచడం లాంటి కార్యక్రమాలను సంవత్సరం పొడవునా, లేబరు డిమాండుకు సరిపోయే విధంగా పనులు ఉధృతంగా చేపట్టి దీనవలసలను అరికట్టవచ్చును. ప్రభుత్వరంగములోని విద్య, వైద్య వ్యవస్థలలో నాణ్యతను పునరుద్ధరించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య, వైద్యసౌకర్యాలు గ్రామీణ ప్రజలందరికీ అందించే విధంగా తీర్చిదిద్దగలిగితే సగం బాధలు తగ్గిపోతాయి.. పై కార్యక్రమాలను జోడించి ఒక నిర్దిష్టకాల వ్యవధి గల పక్కా ప్రణాళికగా రూపొందించాలి. గ్రామీణ ప్రజల భాగస్వామ్యముతో, గ్రామ పంచాయితీల భాగస్వామ్యముతో అమలు చేస్తే, వ్యవసాయముతోపాటు, ఇతర గ్రామీణ జీవనోపాధులను పునరుద్ధరించవచ్చును. అలా చేయడానికి ధృడమైన రాజకీయ సంకల్పం కావాలి. పక్కా ప్రణాళికలు, వ్యూహాలతో పనికి ఉపక్రమించాలి.

తేదీ : 18-10-2015

# అనంతపురముజిల్లా కరువు స్వరూపము -
# ఆశలు రేకిత్తిస్తున్న పరిష్కార మార్గాలు

## 1. పరిచయము:

ప్రతి సంవత్సరము మార్చి నెల 22 వ తేదిన ॥ ప్రపంచ జల దినోత్సవము॥ నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. ॥ ప్రపంచ జల దినోత్సవాన్ని 1993 వ సంవత్సరము నుండి ప్రపంచ దేశాలన్ని ప్రతి సంవత్సరం మార్చి 22వ తేదీన జరుపుకొంటున్నాయి. జీవరాశులన్నింటికీ నీరే ప్రాణం. ఈ నాటికి ప్రపంచ జనాభాలో మూడవ వంతు మందికి రక్షిత మంచి నీరు త్రాగడానికి కూడా లభించడం లేదు . కొన్ని ప్రాంతాలలో వరదలతో ప్రజలు సమస్యలను ఎదుర్కొంటూ వుంటే, మరికొన్ని ప్రాంతాలలో తీవ్ర కరువులకు గురవుతున్నారు. ఆయా ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యల వైపు ప్రజల దృష్టి మళ్ళించి, అవగహన పెంపొందించి, ప్రజాభిప్రాయాన్ని వినిపించి, వాటిని పరిష్కరింప చేసే ప్రయత్నమే ఈ ప్రపంచ జల దినోత్సవము యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

## 1.1 అనంతపురం జిల్లా ప్రస్తుత పరిస్థితి:

ఈ నేపథ్యములో, మన అనంతపురం జిల్లా తీవ్ర నీటి కొరతతో వేగంగా ఎడారీకరణ జరుగుతున్నది. గ్రామాలలో వ్యవసాయం, ఇతర జీవనోపాధులు నశించి జన జీవనం దుస్సాధ్యమైపోతున్నది. జిల్లాలో పడే సంవత్సర సరాసరి వర్షపాతము 552 మి.మీ. పంట అవసరాలకు అనుగుణంగా వర్షాలు పడక కరువులు వస్తున్నాయి . ప్రతి ఐదు సంవత్సరాలలో నాలుగు సంవత్సరాలు జిల్లాను కరువు కబళిస్తూ రైతులను గ్రామీణ జీవనోపాధులను విచ్ఛిన్నము చేస్తున్నాయి. జిల్లా విస్తీర్ణము దాదాపు 50 లక్షల ఎకరాలు. జిల్లాలో వ్యవసాయ భూమి దాదాపు 27 లక్షల ఎకరాలు వుంటే అందులో సాగు నీటి సౌకర్యం కేవలం 3నుండి 4లక్షల ఎకరాలకు మాత్రం ఉంది . జిల్లాలో సుమారు రెండు లక్షల బోరు బావులు గత సంవత్సరము వరకు దాదాపు 3 లక్షల ఎకరాలకు వ్యవసాయానికి నీరు అందించేవి. అదనంగా దాదాపు 60 వేల ఎకరాలు తుంగభద్ర ఎగువకాలువ ద్వారా సాగుతున్నది . అంటే దాదాపు 24 లక్షల ఎకరాలు (90 శాతము ) వ్యవసాయము వర్షాధారము పై ఆధారపడి ఉంది . ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే , మన జిల్లాలో వర్షధార వ్యవసాయం కనుమరుగయ్యే దుర్భర శాశ్విత కరువు పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని సంవత్సరాలు వర్షపాతం సాధారణ స్థాయికన్నా తక్కువగా కురవడం వల్ల భూగర్భ జలమట్టం దాదాపు అడుగంటి పోయినాయి. మన జిల్లాలో దాదాపు 5000 వరకు చిన్న నీటి స్థాయిలో వర్షాలు కురవడం లేదు. సరాసరి 10 సం॥ ఒకసారి మాత్రమే నిండుతున్నాయి. చెరువులు , కుంటలు పూడికకు గురై , నీటి సామర్థ్యం బాగా తగ్గి నీరు ఇంకింపజేసుకొనే సామర్థ్యం కూడా తగ్గిపోయింది. మరికొన్ని కట్టలు , మరవలు బలహీనమై నీటిని నింపుకోలేకుండా వున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు నోచుకోకపోడం వల్ల , వర్షపు నీటిని భూగర్భజలంగా మార్చే వ్యవస్థ బలహీనమైపోయింది. ఇదేకాకుండా, వర్షాలు పడే తీరు మారుతున్నందు వల్ల వాగులు

పారకుండా పోయి చెరువులు నిండడం కూడా చాలా అరుదైపోయింది . ప్రతి సంవత్సరము వేసవి కాలంలో వేల సంఖ్యలో బోరుబావులు ఎండిపోతున్నాయి. విచ్చలవిడిగా కొత్తబోర్లు వేయడం వలన భూగర్భజలాలు వేగంగా అడుగంటి పోతున్నాయి. ఆశ చావక, చాల మంది రైతులు , వ్యవసాయం పొలాల్లో పంటలు ,పండ్లు మొక్కలు రక్షించుకోవడానికి ఒక్కో రైతు పదుల సంఖ్యలో బోర్లు వేసి నీళ్లు పడక , అప్పులపాలై చివరకు  కొంత మంది ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

## 1.2 తీవ్ర నీటి కరువుగా నిల్చిపోయిన 2015 వ సంవత్సరము:

కనీసం గత 50 ఏళ్ళుగా ఇంత తీవ్ర కరువును చూడలేదు . 2014 సం॥లో జూన్ నుండి సెప్టెంబర్ వరకు 338 మి.మీ. కురవాల్సి వుంటే , కేవలము 172 మి.మీ మాత్రమే కురిసింది .పంటకాలంలో సగం భూములు విత్తనం కూడా వేయలేదు . వేసిన సగం కూడా దాదాపు పూర్తిగా ఎండిపోయింది . వర్షాధార రైతులు , కూలీలు  తీవ్ర దుర్భిక్షానికి గురైనారు .గత ఆరు నెలలలో దాదాపు 6 లక్షల మంది తాత్కాలికంగా వివిధ ప్రాంతాలకు కూలీ కోసం వలసలు వెళ్ళినట్లు అంచనా . తీవ్రగడ్డి కొరత ఏర్పడి లక్షలాది పశువులు కబేళాలకు అత్యల్ప  ధరకు అమ్మేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోయి రెండు లక్షల బోరు బావులలో లక్షన్నర బోరు బావులు  పూర్తిగా ఎండి పోయినట్లు అంచనా .దశాబ్దాలుగా పెంచి పోషించిన చీనీ, దానిమ్మ , జామ , సపోటా , నిమ్మ మామిడిలాంటి పండ్ల తోటలు కూడా ఎండి పోతున్నాయి . మనుషులకు , పశువులకు తాగునీటి కొరత తీవ్రమై అత్యధిక గ్రామాలకు  ప్రభుత్వము ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నారు. రాబోయే ఏప్రిల్ , మే .జూన్ నెలలు ఈ పరిస్థితులను ఇంకా తీవ్రతరం చేస్తాయి.

మన  జిల్లాలో దాదాపు 5లక్షల ఎకరాలు  అడవీ ప్రాంతం ఉన్నా అందులో వృక్ష సంపద లేదు . అదే విధంగా దాదాపు మరి యొక 5లక్షల ఎకరాలు బోడికొండలు , గుంటలు , వంకలు, వాగులు ఉన్నా , అందులో కూడా వృక్ష సంపద  లేదు . అడవులు వృక్ష సంపద తగినంతగా ఉన్నప్పడే వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు మారుతాయి. అంతేగాకుండా మనకు పడే వర్షపు నీటిలో దాదాపు 40 శాతం ఆవిరైపోతున్నది. వృక్ష సంపద విస్తారంగా ఉంటే నీటి ఆవిరి తగ్గుతుంది.

## 2. మనకు సంభవించే కరువుల రకాలు వాటి ప్రభావము :

అనంతపురం జిల్లాలో  వర్షం తీరును బట్టి మూడు రకాలైన కరువులు సంభవిస్తూ ఉంటాయి . అయితే జిల్లా అంతటా ఒకే రకమైన  కరువు పరిస్థితి  వుండకపోవచ్చు . మన జిల్లాలో సగటు వర్షపాతం 552 మి.మీ. అయితే ,ఆత్మకూరు కూడేరు మండలాలో 300 మి.మీ. కంటే తక్కువ కూడా పడుతుంది . బుక్కపట్నం , గాండ్లపెంట. తలుపుల మండలాలో 650 మి.మీ. వరకు పడుతుంది . కాబట్టి ఒక్కొక్క మండలములో ఒక్కొక్క పరిస్థితి వుంటుంది. అంతేకాక నైరుతి వైపున మండలాలలో నైరుతి ఋతుపవనాల ద్వారా ఎక్కువ వర్షం పడుతుంది . తూర్పు , ఆగ్నేయ  దిశలో వున్న మండలాలలో ఈశాన్య ఋతుపవనాల వర్షం అధికంగా వుంటుంది.

## 2.1 పంట కరువు:

వర్షాధార పంటలు  ముఖ్యంగా వేరుశనగ పంట జూలై నెల నుండి  అక్టోబరు నెల వరకు 20 నుండి 25 రోజుల కొక్కసారి (దాదాపు 25 మి.మీ , ఒక పదును ) 5సార్లు 5 పదులు వర్షము పడితే వర్షాధార పంట అవసరాలకు అనుగుణంగా దాదాపు 125 మి.మీ. వర్షము పడితే వర్షాధార పంటలకు కరువులుండవు. కావున వర్షాధార పంటలకు సంబంధించి ఎంత ఎక్కువగా వర్షం వచ్చింది

అనే దానికంటే ,పంట అవసరాలకు అనుగుణంగా సమయానికి వచ్చిందా లేదా అనేదే ముఖ్యమైన విషయం . ఎక్కువగా వర్షాలు వచ్చి కరువు వచ్చిన సంవత్సరాలు ఉన్నాయి. తక్కువ వర్షము వచ్చి బాగా పంటలు పండిన సంవత్సరాలు కూడా ఉన్నాయి

పంటలకు కావలసిన సమయంలో తగినంత వర్షము పడక పోవడం వలన పండకపోతే 'పంట కరువు' అంటాము . కొన్ని సంవత్సరాలలో జూన్– జూలై నెలలలో వర్షాలు పడక రైతులు విత్తనం వేయలేక పోతారు. ఆలస్యంగా ఆగష్టులో వర్షాలు వచ్చినా వేరుశనగ విత్తనం ఆలస్యంగా విత్తినపుడు సాధారణ పంట రాదు .గత రెండు , మూడు సంవత్సరాలు సరియైన సమయంలో విత్తనం వేయలేకపోవడం వలన కరువులు వచ్చినాయి. అయితే సాధారణంగా జూలైలో విత్తనం వేసిన తరువాత ఆగష్టు నెలలో వేరుశనగ పంట పూత , పిందె దశలో వర్షాలు దెబ్బతీసి పంట కరువు ఏర్పడుతుంది. తరువాత సెప్టెంబర్ –అక్టోబర్ నెలలో సక్రమంగా వర్షాలు వచ్చినా పంట నష్టము జరిగిపోయి వుంటుంది . ఇట్లాంటి సంవత్సరాలలో చూడడానికి వేరుశనగ పంటల పచ్చగా కనబడతాయి , కానీ కాయలు ఉండవు. అందుకే దీనిని ' పచ్చకరువు అని కూడా అంటారు . కొన్ని సంవత్సరాలలో అక్టోబర్ – నవంబరు నెలలలో పంట వడిపే దశలో తుపానులు సంభవించి 4 లేక 5 రోజులు జడి వానలు వచ్చి వేరుశనగ కాయలు భూమిలోపలే మొలకెత్తి పోయి పంటనష్టము జరుగుతూ వుంటుంది. పైన చెప్పిన పలువిధాలుగా పంట కరువులు సంభవిస్తూ వుంటాయి. మన జిల్లాలో దాదాపు 24 లక్షల ఎకరాల భూమి వర్షాధారముపై ఆధారపడి వుంది . దాదాపు 7 లక్షల సన్న చిన్న కారు రైతులు ,వ్యవసాయకూలీలు వర్షాధార పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. పంట కరువులు వచ్చినపుడు వీరి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

## 2.2 నీటి కరువు :

చెరువులు, కుంటలు నిండే వర్షాలు పడక, భూగర్భజలాలు తగ్గిపోయి, చెరువులు, కుంటలు, బోరు బావుల క్రింద నీటి సాగు పంటలు పెట్టలేక పోయిన పరిస్థితులను నీటి కరువు అంటాము . ఈ సంవత్సరాలలో త్రాగునీటి సమస్య, మేత సమస్య కూడా తీవ్రమౌతుంది. దీని ప్రభావం ముఖ్యంగా చెరువులు, కుంటల క్రింద సాగు రైతులు, బోరు బావులున్న రైతులు, వ్యవసాయ కూలీలు, చేపల పెంపకం చేసేవారు, పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపుదారుల మొదలగు వారిపైన తీవ్రంగా వుంటుంది. దాదాపు రెండు లక్షల కుటుంబాలపైన ప్రత్యక్షంగానూ, ఒక లక్ష కుటుంబాల పైన పరోక్షంగానూ నీటి కరువు ప్రభావం వుంటుంది.

ఇటువంటి నీటి కరువులు మనకు తరచూ సంభవిస్తున్నాయి. ముఖ్యంగా బోరు బావుల క్రింద వ్యవసాయం విచ్చల విడిగా పెరిగిపోవడం వలన భూగర్భ జలాలు బాగా తరిగి పోవడం వలన, భూగర్భ జలాలను పూరించడం తక్కువై పోతున్నందు వలన కూడా నీటి కరువులు ఎక్కువై పోతున్నాయి. నీటి కరువు సంవత్సరాలలో వృక్ష సంపద కూడా నశించి పోతుంది . వంకలు, వాగులలో, చెరువులు, కుంటలలో కూడా తేమ వుండదు, గడ్డి మొలవదు. బోడి కొండలు, అడవులలో కూడా గడ్డి పెరగదు.

నీటి కరువులు రావడానికి ముఖ్యకారణం వంకలు , వాగులు పారి చెరువులు కుంటలు నిండే తీరులో వర్షము రాకపోవడం . ఒకే వారంలో ఒక మంచి పదును వానపడిన తరువాత ఒకటి రెండు రోజులకు ఒక 50 నుండి 70 మి.మీ. వర్షము పడితే వంకలు, వాగులు పారి కుంటలు, చిన్న చెరువులు నిండిపోతాయి. ఆ తరువాత ఒక వారములో మరియొక సారి 50 నుండి 70 మి.మీ వర్షము పడితే మిగిలిన పెద్ద చెరువులు కూడా దాదాపు నిండి పోతాయి. సాంకేతికంగా ఆలోచించినప్పుడు

కేవలం రెండు వందల మి. మీ వర్షము తోనే అన్ని కుంటలు చెరువులు నిండే పరిస్థితి రావచ్చు. కొన్ని సంవత్సరాలలో జూన్ - జూలై నెలలో ఒకసారి చెరువులు, కుంటలు నిండి తరువాత సెప్టెంబర్- అక్టోబర్ నెలలో కూడా మరియొక సారి నిండే విధంగా వర్షాలు. అయితే గత 15 సంవత్సరాలలో కేవలం రెండు సంవత్సరాలలో మాత్రమే కుంటలు, చెరువులు నిండే విధంగా వర్షాలు వచ్చినాయి,మిగిలిన 13 సంవత్సరాలు వివిధ మోతాదులలో నీటి కరువులే.

## 2.3 పంట - నీరు కరువు:

పై రెండు కరువులు ఒకేసారి వస్తే అది - నీటి కరువు అంటాము. అన్ని వర్గాలపైన తీవ్రంగా వుంటుంది. అంటే పుండుపై కారం చల్లినట్లు. గ్రామీణ జీవనోపాధులు విచ్ఛిన్నమవుతాయి. ఇటువంటి కరువులు 15 సంవత్సరాలు క్రింద అరుదుగానే వచ్చేవి కానీ, భూగర్భజల వినియోగం నియంత్రణ లేకుండా పెరిగిన తరువాత నీటి కరువులు తోడవుతున్నాయి. ఈ సంవత్సరం (2014-15)తీవ్రమైన పంట - నీటి కరువుకు ఒక ప్రబల నిదర్శనము.

## 3. ఆశలు రేకితిస్తున్న పరిష్కార మార్గాలు:

గత కొన్ని సంవత్సరాలు ప్రభుత్వాలు, పరిశోధన సంస్థలు చేసిన ప్రయోగాలు పరిశోధనల వల్ల పై కరువులకు కొంత వరకు పరిష్కార మార్గాలు, దూరంగా నైనా కనిపిస్తున్నాయి. వీటిని అమలు చేయుటకు కొంత సమయం పడుతుంది. అయితే రైతులతో కొంత ఆశను రేకిత్తిస్తున్నాయి.

## 3.1 హంద్రీనీవా ప్రాజెక్టు జలాలతో కుంటలు చెరువులు:

ఈ ప్రయోగాన్ని తీవ్ర పంట -నీటి కరువు వున్న ఈ సంవత్సరంలో ప్రభుత్వం కొంత ఎక్కువ స్థాయిలో చేపట్టగలిగింది. జిల్లాలో దాదాపు 50 చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు జలాలను తరలించింది . తద్వారా ఆ చెరువుల క్రింది ప్రాంతాలలో భూగర్భజలాలు పెరిగి బోరుబావులు సజీవంగా వున్నాయి . దీని ఫలితాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పంటలు , పశువులు , పక్షులు , సూక్ష్మజీవావరణం స్థానిక పర్యావరణం అన్ని లబ్ది చెందినాయి.

కాబట్టి రాబోయే సంవత్సరాలలో దీనిని జిల్లా వ్యాప్తంగా విస్తరించవలసి వుంది. హంద్రీనీవా నీటిని మొత్తంగా చెరువులు, కుంటలు, పేరూరు, ప్రాజెక్టు, బి.టి. ప్రాజెక్టు, పెడపల్లి ప్రాజెక్టు, చెన్నరాయగుడి ప్రాజెక్టు లాంటి మధ్యతరహా ప్రాజెక్టులు నింపడానికే ఉపయోగించాలి. ఆవిధంగా నింపడానికి అవసరమైన బ్యాలన్సింగు రిజర్వాయర్లును, కాలవల వ్యవస్థను వెంటనే నిర్మించవలసి వుంది. (ప్రాజెక్టు నీటితో చెరువులను నింపే వ్యవస్థకు నేను 2003 సం॥లోనే ॥అనంత జల వలయం॥ అని పేరు పెట్టడం జరిగింది ) తద్వారా మన జిల్లాలోని దాదాపు రెండు లక్షల బోరుబావులకు రక్షణ కల్పించినట్లు అవుతుంది. పశుపక్షాదులకు, పర్యావరణానికి నీరు అందుతుంది. తాగునీటి అవసరాలు కూడా గ్రామాలలో దీని ద్వారా తీసుకోవచ్చు. అంతేగాక వర్షాధార పంటలకు రక్షక తడులు కూడా ఇచ్చి, కరువు నుండి తప్పించుకోవచ్చును.

ప్రస్తుత మన ప్రభుత్వం ప్రకటించిన “త్రాగునీటి వలయం” ను కూడా ఈ అనంత జలవలయంలో అనుసంధానం చేయవచ్చు. తద్వారా ఖర్చు తగ్గించి ప్రయోజనాలను ఎక్కువ చేయవచ్చు. అనంత జలవలయం ద్వారా అనంతపురం జిల్లాలోని అన్ని మండలాలకు దాదాపు సమానంగా ప్రయోజనం సమాకూర్చవచ్చు. అంతేగాక, దాదాపు అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం కూడా జరుగుతుంది.

అయితే కొత్త బోరు బావులను , భూగర్భ జల వినియోగాన్ని సమగ్రంగా నియంత్రించవలసి వుంది. భూగర్భ జలాలను వ్యక్తిగత వనరుగా కాకుండా , సామాజిక వనరుగా గుర్తించి , పక్క రైతులతో కొంతవరకు నీటిని పంచుకొనుట తప్పని సరి చేయాలి.

### 3.2 సామాజిక తుంపర సేద్యం:

ఈ పద్ధతి జైన్ ఇరిగేషన్‌వారు కర్నాటకలోని హువేరి జిల్లా షిగ్గాన్‌లోనూ. మహరాష్ట్రలోనూ ప్రయోగాత్మకంగా చిన్న స్థాయిలో చేపట్టి మంచి ఫలితాలు సాధించినారు . ఈ పద్ధతి ముఖ్యంగా వర్షాధార పంటలను కరువుల నుండి కాపాడడానికి అవసరమైన రెండు లేక మూడు రక్షక తడులను సమకూర్చడానికి ఉద్దేశించపడినది. వర్షాధార పంట కాలంలో ఒకటి, రెండు వర్షాలు సమయానికి రాక పోవడం వలన పంట కరువులు వస్తున్నట్లు చెప్పకున్నాం. అందుకు పరిష్కారంగా అవసరమైనపుడు “రక్షక తడుల” వ్యవస్థను ఏర్పాటు చేయగలిగితే కరువులను అధిగమించవచ్చు.

కరువుకు గురయ్యే వర్షాధార పంటలున్న 50 లేక 100 ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకొని, అందులో ఎత్తు ప్రాంతములో ఒక నీటి కుంటను ఏర్పాటు చేసుకోవలయును. లభ్యత ఉన్న చోట నుండి నీటిని తరలించి నీటికుంటలో నిల్వయుంచుకొనవలెను. యూనిట్‌లోని పంటలకు తుంపర సేద్యం ఇచ్చుటకు అవసరమైన పరికరాలు (స్థిరంగా కానీ సంచార పద్ధతిలోగాని) అమర్చుకోవలయును. ఆ విధంగా సామాజిక తుంపర సేద్య సదుపాయము ఏర్పాటు చేసుకొనవలెను. వర్షాలు ఆలస్యమైనపుడు వెంటనే రక్షకతడి ఇవ్వవచ్చును. ఆ విధంగా కనిష్టంగా మూడు రక్షక తడులు ఇచ్చుకోగలిగితే ఏ వర్షాధార పంట కరువుకు గురి కాదు. వర్షాధార పంటలను కరువు నుండి కాపాడటానికి ఇది ఒక ముఖ్య పరిష్కార మార్గంగా కన్పిస్తుంది.

### 3.3 సహభాగ భూగర్భ జల యాజమాన్యము:

ఈ పద్ధతి ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామాలలో మన ప్రభుత్వంవారు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యముతో చేపట్టడం జరిగింది. దగ్గర , దగ్గర బోరుబావులున్న కొంతమంది రైతులతో వారి భూములకు ఆనుకొని వున్న కొన్ని భూముల రైతులను కలుపుకొని ఒక యూనిట్ గా చేసి రెండు రకాల రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటుచేయవలయును. బోరుబావులు లేని రైతుల భూములకు వర్షాధార పంటలకు అవసరమైనపుడు రక్షక తడులు ఇచ్చే విధంగా వారి మధ్య ఒక ఒప్పందం చేసుకొంటారు. అందుకు ప్రతిఫలంగా బోరుబావులు లేని రైతులు కొత్త బోరు బావులను వేయకూడదు. మరియు యూనిట్‌లోని భూమికంతకు తుంపర సేద్యానికి అవసరమైన ఏర్పాటును ప్రభుత్వ ఆర్థిక సహాయముతో కలుగచేస్తుంది .తద్వారా ఇప్పటికే ఉన్న బోరుబావులకు రక్షణ ఏర్పడుతుంది. వారి భూములకు శాశ్వితంగా తుంపర సేద్యసదుపాయం కూడా ఏర్పడుతుంది. ఈ సాముహిక భూగర్భ జల యాజమాన్య పద్ధతి మన జిల్లాలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామలలో జరుగుచున్నది. మంచి ఫలితాలనిచ్చుచున్నది.

### 3.4. పొలం కుంటలు ఆధారంగా రక్షకతడులు:

ఎకాలజీ సెంటర్ వారు ఈ పద్ధతిని కొంతమంది రైతులతో విజయవంతగా పాటింప చేయడం జరిగింది. వర్షాధార భూములలో అనువైన చోట్లలో ప్రతి రెండు, మూడు ఎకారలకు ఒక పొలం కుంటను నిర్మించుకొని, నీరు ఇంకిపోకుండా లైనింగ్ చేసుకొనవలయును. సాధారణంగా వర్షాకాలంలో రెండు ,మూడు సార్లు పొలంకుంట నిండే అవకాశముంది. ఆ నీటిని వర్షాధార పంటకు అవసరమైనపుడు రక్షక తడుల కోసం రైతులే ఉపయోగించుకోవచ్చును. రైతులు ఆ విధంగా ఉపయోగించుకోవచ్చును.

రైతులు ఆ విధంగా ఉపయోగించుకోవడానికి ఒక చిన్న నీటి పంపును (లేదా ఒక ట్రాక్టరును) తోడడానికి పెట్టుకొని సంచార తుంపర పరికరాలను ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఈ పద్ధతిని రైతులే స్వయంగా నిర్వహించుకోవచ్చును. ఈ పద్ధతి పండ్ల తోటలున్న రైతులు కూడా పాటించవచ్చును. పొలంకుంటలను నిర్మించడానికి ఇప్పటికే ఉపాధి హామీ కార్యక్రమం క్రింద అవకాశం వుంది. సిమెంటు లైనింగ్ చేయడానికి కూడా ఇదే కార్యక్రమం క్రింద ఇవ్వగలిగితే అందరు రైతులకు తగినన్ని పొలం కుంటలు అందుబాటులోకి వస్తాయి. సంచార బిందు లేద తుంపర పరికరాలను స్వంతంగా కొననవసరం లేకుండా ఒకటి రెండు రోజులకు బాడుగకు తీసుకొనవచ్చును.

3.5 ఈ పద్దతి కూడా ఎకాలజీ సెంటర్ ఈ సంవత్సరంలో (2014-15) దాదాపు వెయ్యి ఎకరాలలో విజయవంతగా ప్రయోగం చేయడం జరిగింది . ముఖ్యంగా కంది లాంటి సాలుకు వాలుకు నీరు పారే విధంగా అమర్చి రక్షక తడి ఇవ్వడం జరిగింది .ఒక ట్రాక్టరు టాంకరు ద్వారా నీటిని తరలించి సంచార బిందు సేద్యం పరికరాలను ఒక్కొక్క సాలుకు వాలుకు నీరు పారే విధంగా అమర్చి రక్షక తడి ఇచ్చి వేలాది మంది రైతులకు ప్రదర్శన చేసి చూపడం జరిగింది. ఈ పద్దతిని ఎకాలజీ సెంటరు 200 పైగా గ్రామలలో 1000 ఎకరాలకు ఒకసారి రక్షక తడి ఇచ్చి వేలాదిమంది రైతులకు ప్రదర్శన చేసి చూపడం జరిగింది. రెండు రక్షక తడులు ఇవ్వగలిగితే ఇంకా మంచి ఫలితాలు వస్తాయని రైతులు చెప్పినారు . అయితే చాలా గ్రామాలలో నీరు లభించడము సమస్యగా వుంది . అందుకే పొలం కుంటలు నిర్మించుకుంటే నీటి లభ్యత సులభం కావచ్చు.

## 3.6. నీటి గొర్రు:

వ్యవసాయం పరిశోధన కేద్రం , అనంతపురం వారు నీటి గొర్రు పరికరమును నిర్మించడం జరిగింది. ఎకాలజీ సెంటర్ నుండి దానికి క్షేత్రస్థాయిలో వివిధ పంటలకు ప్రయోగత్మకంగా వాడి సమర్థవంతగా పని చేసే విధంగా పరికరాన్ని మెరుగు పర్చడం జరిగింది.

జూన్- జూలై నెలలో విత్తనం వేసుకొనుటకు ఈ పరికరం తయారు చేయడబడింది. అదునులో విత్తనం వేసుకొనుటకు ఈ పరికరం విత్తనము మొలకెత్తి రెండు, మూడు వారాలు మొక్క పెరుగుటకు అవసరమైన నీటిని కూడా భూమిలోకి ఒకేసారి చేరవేస్తుంది. ఈ పరికరమును వేరుశనగ, కొర్ర , జొన్న, కంది పంటలను విత్తుటకు ప్రయోగం చేయడం జరిగింది. మంచి ఫలితాలు కన్పించినాయి. ఇందుకు కూడా నీటి లభ్యత ముఖ్య సమస్యగా గుర్తించినాము. పొలంకుంటలు ఉంటే నీటి సమస్యను కొంత వరకు పరిష్కరించవచ్చు. రక్షక తడులు ఇచ్చుకునే అవకాశాలు ఉన్నప్పుడు నీటి గొర్రు చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.

## 3.7. కరువుకు తట్టుకోగల మిశ్రమ పంటల విధానము:

40 సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లాలో చిరుధాన్యాలు , పప్పుదినుసులతో కలిపి మిశ్రమ (తిండి) పంటల విధానం ఉండేది . మిశ్రమ పంటలో ముఖ్యంగా సద్ద , జొన్న , కొర్ర , సాము , కంది , అలసంద , అనుములు , పెసర , నూగులు , మినుములు , ఊదర్లు , బరిగెలు , అరికెలు లాంటి పంటలు ఉండేవి . (ఉదా: సజ్జ, కొర్ర) మరికొన్ని కొంత ఎక్కువ లోతు (కంది) వేర్లు పారేవి ఉండేవి . ఇటువంటి భిన్నత్వం గల పంటల విధానము వేల సంవత్సరాల రైతుల అనుభవాలపై ఆధారపడి కరువుకు తట్టుకోనే విధంగా రూపాంతరము చెందింది. ఒక పొలంలో కనీసం 4 లేక 5 రకాల పంటలు జూన్ నెలలో విత్తే వారు.

ఇలాంటి మిశ్రమ పంట ఉన్నందువలన వర్షాభావ పరిస్థితుల వలన కొన్ని పంటలు కరువుకు గురయినా ,కొన్ని పంటలైనా పండేవి . చాలా అరుదుగా విత్తిన అన్ని పంటలు కరువుకు గురయ్యేవి . ఇటువంటి మిశ్రమ పంట విధానము మన వర్షాధార పరిస్థితులకు చాలా వరకు తట్టుకుంటుంది.

ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా తిండి పంటలతో పాటు వేరుశెనగ, ఆముదము, ప్రత్తిలాంటి కొన్ని నగదు పంటలను కూడా కలిపి అనువైన విధంగా కరువుకు తట్టుకోగల మిశ్రమ పంట విధానము మన వర్షాధార పరిస్థితులకు చాలా వరకు తట్టుకోవచ్చును.

**ముగింపు:**

పైన చెప్పిన కరువు పరిష్కార మార్గాలు ప్రయోగాత్మకంగా ఆచరణలో మంచి ఫలితాలు సాధించినాయి. ఒక స్థాయి వరకు కరువులను అధిగమించుట సాధ్యమే అనే ఒక ఆశాజనక భావన కల్గించినాయి. ఇంత వరకు పంటల భారమంతా వాన దేవుడి పైననే ఉన్నట్లు భావించే వాళ్లం. ఇప్పుడు ప్రభుత్వాలు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రయత్నం చేసి, ఉన్న అవకాశాలను, సాంకేతిక పరిజ్ఞానము సక్రమంగా ఉపయోగించు కొంటే కరువుల నుండి ఉపశమనం కల్గుతుంది అనే నమ్మకం కల్గుచున్నది, వాటిని విస్తృతంగా జిల్లా వ్యాప్తంగా అమలు చేయుటకు అవసరమైన విధానాలను కార్యక్రమాలను ప్రభుత్వము త్వరగా చేపట్టవలసి వుంది.

తేదీ : 08-03-2015

# అనంతపురము జిల్లా కరువును అధిగమించుటకు అనుసంధాన నీటి వినియోగ విధానము

# (Conjunctive Water Use & Management for Combating Drought)

## 1. అనంతపురము జిల్లాలో వర్షాధార పంటలకు సంబంధించిన కొన్ని వాస్తవాలు

- అనంతపురము జిల్లాలో దాదాపు 25 లక్షల ఎకరాలు వర్షాధారం క్రింద పంట పెట్టే అవకాశం ఉంది.
- దాదాపు 7 లక్షల వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 5 లక్షలకు పైగా ఎలాంటి నీటి వసతి లేకుండా కేవలం వర్షాధార పంటలపైన, కూలీపైన ఆధారపడి జీవిస్తున్నారు.
- వర్షాకాలము జూన్ నుండి నవంబరు వరకు వుంటుంది. పంట కాలములో (జూన్-నవంబరు) సగటు వర్షపాతము 483.8 మి.మీ. వుంటుంది.
- ముఖ్యమైన పంట వేరుశనగ, మిగిలిన పంటలు కంది, ఆముదము, కొంతవరకు జొన్న, సజ్జ, కొర్ర,పెసలు ఇతర చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నల్లరేగడి నేలలలో శనగ, పత్తి, జొన్న ప్రధాన పంటలు.
- సాధారణంగా జూన్, జూలై విత్తన కాలము. అక్టోబరు నుండి జనవరి వరకు పంట ఒడిపే కాలము.
- పంట కాలము 70 రోజుల నుండి 180 రోజుల వరకు ఉంటుంది. కొర్ర 70 నుండి 80 రోజులు, వేరుశనగ 110 నుండి 120 రోజులు, కంది 150 నుండి గరిష్టంగా 180 రోజులుగా వుండవచ్చు.
- వర్షాధార పంటలు పండటానికి విత్తనము వేసినప్పటి నుండి 10 నుండి 15 రోజులకొకసారి సకాలంలో 5 నుండి 10 వర్షాలు, ఒక్కొక్కసారి 20 మి.మీ.లకు తగ్గకుండా పడితే, పంటలు కరువుకు గురికాకుండా సాధారణంగా పండుతాయి.

## 2. సాధారణంగా కరువులు వచ్చే తీరుపై ఒక సాధారణ విశ్లేషణ

- వర్షాధార పంటలు పంట అవసరాలకు అనుగుణంగా సరియైన సమయంలో, సరియైన మోతాదులో (తగినంత) రావడం పైన ఆధారపడి వుంటాయి.
- సాధారణంగా సరియైన అదునులో (జూన్,జూలై నెలలలో) వర్షాభావము వలన, విత్తనం వేయలేక పోవడం వలన, అదును తప్పి, ఆలస్యంగా విత్తనం వేయడం వలన కొన్ని సంవత్సరాలలో కరువులు వస్తాయి.

- పంట కాలములో "వర్షాభావం" 15 రోజుల నుండి 45 రోజుల వరకు కూడా ఉండవచ్చు. వర్షాభావాన్ని (dry spell) రైతులు "బెట్ట" అని "వరుపు" అని అంటుంటారు. ఒక వర్షానికి ఇంకొక వర్షానికి మధ్య 15 రోజులకు మించి వరుసగా వర్షము లేని రోజులుంటే వర్షాభావంగా భావిస్తాము.
- విత్తనం వేసే సమయాన్ని బట్టి, విత్తిన తరువాత వచ్చే వర్షాల తీరు, మోతాదు ఆధారంగా కరువు వివిధ స్థాయిలలో వుంటుంది. విత్తనం వేసిన తరువాత 15 రోజులకు మించి వర్షాభావం ఏర్పడితే పంటలు వాడిపోయి కరువులు వస్తాయి. కరువు తీవ్రత ముఖ్యంగా వర్షాభావ రోజులపైన, పంట కీలక దశలలో వర్షము మోతాదుపైన ఆధారపడి వుంటుంది.
- వర్షపాత సరళిని విశ్లేషించి చూస్తే అత్యధిక కరువులు పంటకాలంలో రెండు సార్లు వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం వలన వస్తున్నాయి. వర్షాభావం 25 రోజులుంటే అరకొర పంటలు పండి, కరువు తీవ్రత తక్కువగా వుంటుంది. 25 రోజులకు మించితే పంటలు ఎండిపోయి కరువు తీవ్రత ఎక్కువగా వుంటుంది.
- అత్యధికంగా వర్షాభావ పరిస్థితులు జూలై నుండి సెప్టెంబరు 15 లోపల ఏర్పడుతుంటాయి.
- కాబట్టి వర్షాభావ పంటలకు వర్షాభావం ఏర్పడినపుడు కనీసం రెండు రక్షక తడులు ఏర్పాటు చేసుకోగలిగితే చాలా వరకు కరువులను అధిగమించవచ్చును.
- సాధారణంగా అనంతపురము జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఒకే సమయంలో ఏర్పడవు ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్క సమయంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతుంటాయి.

## 3.1 ముఖ్యమైన ప్రశ్న ఏమంటే - వర్షాభావ పరిస్థితులేర్పడినపుడు రక్షక తడులను ఇచ్చుటకు మార్గాలు

- రక్షక తడులు ఇచ్చి కరువును అధిగమించడానికి మార్గము "అనుసంధాన నీటి వినియోగము"
- నీరు మనకు నాలుగు రకాలుగా లభిస్తుంది.
- నేలలో తేమ రూపములో - వర్షము పడిన తరువాత 10-15 రోజులు నేలలో తేమ వుండి పంటలకు ఉపయోగపడుతుంది.
- ఉపరితల జలాలు - స్థానిక వర్షాలకు ఫారమ్ పాండ్సుకు, చెక్‌డ్యాములకు, కుంటలకు, చెరువులకు చేరి నిల్వ చేసిన నీరు. వీటిని ఉపరితల జలమంటారు.
- భూగర్భజలం -దిగుడు బావులు, బోరుబావుల ద్వారా లభిస్తుంది.
- నదీ జలాలు -తుంగభద్ర, కృష్ణాలాంటి నదులపై కట్టిన భారీ ప్రాజెక్టుల నుండి తుంగభద్ర ఎగువ కాలువ, హంద్రీ నీవా లాంటి ప్రాజెక్టుల నుండి తరలించిన నీరు.

## 3.2 అనుసంధాన నీటి వినియోగం అనగా

- వర్షాభావ పరిస్థితులు ఏర్పడినపుడు పొలం స్థాయిలో దగ్గరగా ఏ రకమైన నీరు రైతుకు లభ్యమౌతుందో దానిని తరలించి పంటలకు "రక్షక తడి" అందించడం, తద్వారా పంటలను కరువు నుండి రక్షించుకోవడమే అనుసంధాన నీటి వినియోగం.
- అంటే వర్షపు తేమతో ఇతర రకాల నీటిని వర్షాధార పంటలకు అనుకూలంగా అనుసంధానము చేసి అందించడం.

- పొలంలో వర్షం ద్వారా లభ్యమయ్యే తేమ లేనపుడు పొలంలోని ఫారమ్ పాండు నుండి గానీ, దగ్గరున్న చెరువు /కుంట నుండి గానీ, బోరు బావి నుండి గానీ నీటిని తరలించి రక్షక తడి ఇవ్వడమే అనుసంధాన నీటి వినియోగం.
- ఒక రకమైన నీటిని దగ్గరలో లభ్యమయ్యే ఇతర రకాల నీటితో ఒక వలయంగా (Grid) అనుసంధానము చేసి పంటలను కరువు నుండి రక్షించుకొనుటకు గానీ, ఇతర ఏ అవసరాలకైనా ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసే నీటి వలయాన్ని "జలవలయం " (Water Grid) అంటున్నాము.

## 4. అనంతపురము జిల్లాలో జలవలయంను ఏర్పాటు చేయు విధానము : అనంతపురము జిల్లాలో ఈ రకంగా ఏర్పాటు చేసే జలవలయానికి 1998 వసంవత్సరములో నేను "అనంత జలవలయం" అని పేరు పెట్టడం జరిగింది. క్రింది విధంగా ఏర్పాటు చేయాలి.

- ప్రతి రెండు ,మూడు ఎకరాలకు ఒక ఫారమ్ పాండు ఏర్పాటు చేసి నీరు ఇంకకుండా పూత పూయాలి.
- తుంగభద్ర, హంద్రీనీవాలాంటి ప్రాజెక్టు జలాలను జీడిపల్లి రిజర్వాయరు,PABR, MPR ల చెరువులకు, కుంటలకు తరలించడానికి అవసరమైన బాలెన్సింగు రిజర్వాయర్లను మరియు "కాలువల వ్యవస్థ" ను కలిపి నిర్మించాలి.
- సాధారణంగా వర్షానికి చెరువులు, కుంటలలోనికి కొంత నీరు చేరుతుంది. ఆ నీటికి తోడుగా ప్రాజెక్టు జలాలతో వాటిని నిండుగా పూరించవలయును. తద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తరించి వున్న దాదాపు 2500 చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతాయి. దీనినే "అనంత జలవలయం" అంటున్నాము.
- అనంత జలవలయం ద్వారా ముఖ్యంగా నాలుగు ప్రయోజనాలు : 1) జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలం పెరిగి, బోరుబావులలో నీరు లభ్యమౌతుంది. 2) చెరువులలో నీరు ఉండడం వలన ఫారం పాండులలో నీరు లేనపుడు చుట్టు ప్రక్కల వున్న వర్షాధార పంటలకు "రక్షక తడులు" ఇచ్చుటకు సమీపంలో నీరు లభ్యమౌతుంది. తద్వారా కరువులను అధిగమించ వచ్చును. 3) పశుపక్ష్యాదులకు, ఇతర గ్రామీణ జీవనోపాధులకు చెరువులలో నీరు లభ్యమౌతుంది. 4) రిజర్వాయర్ల నుండి కాలువల ద్వారా చెరువులకు నీరు పారుట ద్వారా కాలువలకు ఇరు వైపుల కూడా భూగర్భజలం పెరుగుతుంది. తద్వారా పచ్చదనం, పర్యావరణం (జీవరాశులు) కూడా అభివృద్ధి చెందుతాయి.
- అనంతపురము జిల్లాలో కరువును జిల్లా వ్యాప్తంగా (దాదాపు 25 లక్షల ఎకరాలలో) అధిగమించుటకు ఇది ప్రధాన మార్గము. దీని ద్వారా దాదాపు 5 లక్షలకు పైగా వర్షాధార రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం వుంటుంది. జిల్లాలో వ్యవసాయ ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయుటతో పాటు, సుస్థిర ఆర్థికాభివృద్ధి పునాది వేస్తుంది.

## 5. వర్షాధార పంటలకు రక్షక తడులు ఇచ్చుటకు పద్ధతులు :

- ఫారం పాండులో నీరున్నపుడు పంపును ఉపయోగించి నీరు తోడుతూ వరుసల మధ్య 5 లేక 6 అడుగల దూరం వున్న కంది, ఆముదం లాంటి పంటలకు వరుసలలో బిందుసాగుకు డ్రిప్ పైపులను అమర్చి రక్షక తడులు ఇవ్వవచ్చును.
- వరుసలలో మాత్రమే నీరు పడుట వలన దాదాపు 20,000 లీటర్లు అయితే ఒక ఎకరానికి ఒక్క తడికి బాగా సరిపోతాయి.

- అదే దగ్గర దగ్గర వరుసలు వుండే వేరుశనగ, కొర్ర, జొన్న మొదలగు పంటలకు తుంపర సాగు ఉ పయోగించవలసి వుంటుంది. తుంపర సాగు పరికరాలతో ఒక ఎకరాకు దాదాపు 20 మి.మీ. (దాదాపు ఒక పదును) రక్షక తడి ఇవ్వడానికి దాదాపు 80,000 లీటర్ల నీరు అవసరమౌతుంది.
- నీరు తక్కువగా ఉంటే 40,000 అంటే 10 మి.మీ. రక్షకతడి ఇచ్చినా పంట పది రోజులకు పైగా రక్షింపబడుతుంది.
- ఫారం పాండులో నీరు లేని సమయంలో "రక్షక తడి" అవసరమైనపుడు దగ్గర ఉన్న చెరువు/ కుంటలో నీరు గానీ, లేదా బోరు బావిలో నీరు గానీ రైతుకు ఏది అందుబాటులో వుంటే అందులో నుండి నీరు ఉపయోగించవలసి వుంటుంది. అందుబాటులో వున్న నీరు పొలానికి తరలించడానికి ట్రాక్టరు టాంకరును ఉపయోగించవలసి వుంటుంది.
- చెరువు / బోరుబావి నుండి నీరు ట్యాంకరు ద్వారా పొలానికి తరలించి ట్రాక్టరు టాంకరును పొలంలో ఎత్తు భాగములో నిలిపి భూమ్యాకర్షణ శక్తితోనే డ్రిప్ ఇరిగేషను పద్ధతి ఉపయోగించి రక్షక తడి ఇవ్వవచ్చును.
- ఒక వేళ తుంపర సాగు ఇవ్వవలసి వస్తే టాంకరు నుండి నీటి ఒత్తిడి పెంచడానికి ఒక పంపు అమర్చి తుంపర సాగు ఇవ్వవచ్చును.
- ఈ విధంగా ఫారం పాండు నీటిని, చెరువు/ కుంటలలో నీటిని, బోరుబావుల నీటిని పంటలకు కరువు నుండి రక్షించుటకు ఏ రకమైన నీరు అందుబాటులో వుంటే దానిని ఉపయోగిస్తున్నాము.

## 6. చెరువులలో, కుంటలలో నీరుంటే, కరువు నుండి పంటలను రక్షించుటయే కాదు – పంట దిగుబడులను కూడా గణనీయంగా పెంచవచ్చు !

- అనుసంధాన నీటి వినియోగాన్ని రెండు స్థాయిలలో మనము చూడవచ్చు.
- మొదటి స్థాయి "రక్షక తడులు" ఇచ్చి వర్షాధార పంటలను కరువు నుండి కాపాడుట.
- రెండవస్థాయి, ఏదో ఒక రకమైన నీరు అందుబాటులో వున్నపుడు, అదనపు తడులు ఇచ్చి వర్షాధార పంటల దిగుబడిని గణనీయంగా పెంచుట.
- .ఉదాహరణకు వర్షాధారం క్రింద వేరుశనగ దిగుబడి కంటే, బోరు బావుల క్రింద దిగుబడి కనీసం 50 శాతం అధికంగా వుంటుంది. బోరుబావుల క్రింద దిగుబడి దాదాపు 800 కిలోలకు పైగా వుంటుంది. ఎందుకంటే బోరు నీళ్ళతో రైతులు వారానికి ఒక తడి ఇస్తారు. దాని వలన పంట ఏపుగా పెరిగి నాణ్యమైన దిగుబడి, అధికంగా కూడా వస్తుంది.
- వర్షాధారం క్రింద వర్షాలు సకాలంలో క్రమంగా అవసరమైన మోతాదులో రావు కాబట్టి వేరుశనగ దిగుబడి ఎకరాకు సాధారణంగా 400 కిలోల నుండి 500 కిలోల వరకు మాత్రమే వుంటుంది. వర్షాభావం క్రింద వేరుశనగ పంటకు వర్షాభావ సమయంలో ఒకటి లేదా రెండు రక్షక తడులిచ్చి పంటను కరువు నుండి కాపాడి సాధారణ దిగుబడి సాధించవచ్చును.
- పంట దిగుబడిని పెంచడానికి అవసరమైనపుడు రక్షకతడులకు అదనంగా ఇంకా ఒకటి రెండు "అదనపు తడులు" ఇవ్వగలిగితే దిగుబడిని 600 కిలోల నుండి 700 కిలోల వరకు పెంచవచ్చును. ఉదా॥ పంట పూతకు వచ్చినపుడు, కాయలు వూరే దశలలో అదనపు తడులు ఇవ్వగలిగితే దిగుబడితోపాటు, నాణ్యత కూడా బాగా పెరుగుతుంది.

ఫారం పాండులలో గానీ, చెరువులలో, కుంటలలో గానీ, బోరుబావులలోగానీ కావలసినంత నీరు వుంటే రక్షకతడులకు తోడుగా "అదనపు తడులు" కూడా ఇవ్వడం మంచిది. తద్వారా దిగుబడిని కనీసం 50 శాతం అధికంగా పొందుటకు వీలుపడుతుంది.

**7. అనుసంధాన నీటి వినియోగం ద్వారా ప్రతి నీటి బొట్టుకు అధిక దిగుబడి (More Crop Per Drop) తో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచవచ్చు.**

- ప్రస్తుత సాంప్రదాయ నీటి వినియోగ పద్ధతి ( Flood Irrigation) ప్రకారము నీటి ప్రాజెక్టుల క్రింద ఒక టి.ఎమ్.సి. నీటితో 5,000 ఎకరాలు వరిగానీ, 10,000 ఎకరాలు ఆరుతడి పంటలు గానీ పండించుటకు వీలవుతుంది. తద్వారా ఒక టి.ఎమ్.సి. నీటితో కేవలం 1,000 లేదా 2,000 మంది రైతులు మాత్రమే లబ్ధిపొందుతారు.
- అదే అనుసంధాన నీటి వినియోగ విధానంతో, స్థానిక వర్షాలను, ఉపరితల నీటిని, భూగర్భ జలాలను నదీ జలాలను అనుసంధానము చేయుట ద్వారా ఒక టి.ఎమ్.సి. నీటితో ఒక లక్ష ఎకరాల నుండి మూడు లక్షల ఎకరాలలో కరువును అధిగమించుటయే గాక, పంట దిగుబడులను కనీసం 50 శాతం పెంచవచ్చును.
- తద్వారా ఒక టి.ఎమ్.సి. నీటితో 25,000 నుండి 75,000 కరువు పీడిత వర్షాధార రైతు కుటుంబాలు జిల్లా వ్యాప్తంగా వ్యవసాయంలో లబ్ధి పొందుతారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, బి.సి. మరియు ఇతర సన్న,చిన్నకారు రైతులు విశేషంగా లబ్ధి పొందుతారు.
- కాబట్టి అనుసంధాన నీటి వినియోగం ద్వారా ప్రాంతీయ సమన్యాయంతో పాటు, సామాజిక సమన్యాయం కూడా సాధించవచ్చును. ఇది అత్యంత ప్రధానమైన అంశము.

**8. ముగింపు :**

అనుసంధాన నీటి వినియోగ విధానం ద్వారా కరువులను అధిగమించటతో పాటు, ఇతర గ్రామీణ జీవనోపాధులకు, జిల్లాలో త్రాగు నీటి సరఫరాను కూడా అనుసంధానము చేయవచ్చును. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలం మరియు చెరువులలో నీటి లభ్యత ఉండుట వలన పర్యావరణం కూడా వృద్ధి చెంది, ఎడారీకరణ నివారించడానికి కూడా తోడ్పడుతుంది.

***తేది : 21-11-2015***

# సమగ్ర జలవలయమే 'అనంత'కు శ్రీరామ రక్ష

## 1. పరిచయము :

నీటి కొరతే అనంతపురము జిల్లా అభివృద్ధికి ముఖ్య అవరోధం. నీళ్ళు లేకుండా జిల్లా అభివృద్ధి సాధ్యం కాదు. జిల్లాలో వ్యవసాయం మరియు ఇతర గ్రామీణ జీవనోపాధులు నడవాలన్నా తప్పనిసరిగా నీళ్ళే కావాలి. అంతేకాదు జిల్లాలోని పట్టణాలలోని జీవనోపాదులు నడవాలన్నా, వ్యవసాయం లాభసాటి కావాలి. ఎందుకంటే అనంతపురం జిల్లా ఆర్థిక వ్యవస్థ కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడి వున్నది. 27 లక్షల ఎకరాల సాగుభూమి గల అనంతపురం జిల్లాకు నీళ్ళు కావాలంటే , తుంగభద్ర నదీ ప్రవాహం అంతా అనంతపురం జిల్లాకే మళ్ళించాలి. ఇది సాధ్యం కాదు. మన జిల్లా 90 శాతం పెన్నానదీ పరివాహక ప్రాంతంలో వుండడం, పెన్నానదిలో కంపచెట్లు తప్ప తేమ కూడా లేకుండా పోవడం తీవ్రమైన అనానుకూల పరిస్థితే. పెన్నానది మీద దాని ఉపనదుల మీద కట్టిన ప్రాజెక్టులకు వర్షపు నీళ్ళే రావడం లేదు. ఇటువంటి పరిస్థితులలో మనకు వర్షాధారమే దిక్కు అయితే నిత్య కరువులు, ఎడారీకరణే మన భవిష్యత్తు.

రైతులు వర్షాధారం మీద పంటలు పండించడానికి కనీసంగా 1000 మి.మీ. వర్షమైనా కురవాలి. అయితే మనకు కురిసే సగటు వర్షపాతం సాలీనా 520 మి.మీ. మాత్రమే. అది కూడా సక్రమంగా అదునులో పంటలకు అనుకూలంగా కురవడం లేదు. ఈ సంవత్సరం వర్షపాతమే గనుక లెక్కలోకి తీసుకుంటే కురవాల్సిన వర్షపాతంలో కేవలం సగం వర్షం మాత్రమే కురిసింది. అందుకే గడిచిన 5-6 సంవత్సరాల కొకసారి మూడు సంవత్సరాల కొకసారి వచ్చే కరువు పోయి మళ్ళీ రావడమెందుకులేనని జిల్లాలోనే శాశ్వతంగా తిష్టవేసింది. రైతు కుటుంబాల పరిస్థితి ఎలాగుంటుందో నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 'మోసేవాడికి తెలుస్తుంది కావడి బరువు' అన్నట్లుగా బాధల బరువు రైతుకు మాత్రమే తెలుస్తుంది.

## 2. ఇదంతా ఎందుకు ప్రస్తావిస్తున్నట్లు?

రైతులకు వ్యవసాయం మీద విరక్తి కలిగించడానికో లేదా రైతు బాధల్ని కెలకడానికో చెబుతున్న మాటలు కాదు. ఆచరణ సాధ్యంకాని ఆశలు, కోరికలు పెట్టుకొని గాలిలో మేడలు కట్టుకోవడం కంటే మనం ఎక్కడున్నామో, మన వాస్తవ పరిస్థితులేమిటో అర్థం చేసుకొని అక్కడి నుండి ముందుకు సాగడం మీద రైతుల భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. కరువులు, వరదలు ప్రకృతి విపత్తులు కొత్తకాదు కానీ, అవి వాతావరణ మార్పుల కారణంగా ఇంకా తీవ్రమౌతున్నాయి. ఇలాంటి అనానుకూల పరిస్థితులలో కూడా కొన్ని అనుకూల పరిస్థితులు, అవకాశాలు ఉంటాయి. ఈ అనుకూల పరిస్థితులను, అవకాశాలను మనం సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఆ అనుకూల అంశాలేమిటో ఒక్కొక్కటిగా మనం చర్చించుకుందాం.

ముందుగా ప్రభుత్వం వైపు నుంచి అనుకూలాంశాన్ని పరిశీలించుకుందాం.

## 3. ప్రస్తుత ప్రభుత్వం చేపట్ట తలచిన పథకాలు :

### 3.1 వాటర్ గ్రిడ్ :

జిల్లాలో అధిక గ్రామాలలో తీవ్రమైన మంచినీటి కొరత నెలకొనివుంది. ఇన్నాళ్ళు సాగునీరు కావాలని ఆందోళన పడ్డాం. ప్రస్తుతం సాగునీరు కంటే తాగునీరు సమస్య తీవ్రమై కూర్చుంది. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాలోని అన్ని గ్రామాలకు శాశ్వత పరిష్కారంగా మంచి నీటి సౌకర్యం కలిగిస్తానని ప్రకటించింది. స్థానికంగా అంటే పి.ఎ.బి.ఆర్. నుంచి నీటితోపాటు నీరు లభ్యమయ్యే కృష్ణా,గోదావరి దిగువ ప్రాంతం నుంచి నీరులేని ప్రాంతాలకు నీటిని ఎత్తిపోతల ద్వారా పైపుల ద్వారా లేదా కాలువల ద్వారా తరలించి అందిస్తామంటున్నారు. ఒక రకంగా ఈ ఆలోచన సాగునీటి లభ్యత కోసం మనం చెప్పుకుంటున్న 'అనంత జలవలయం' లాంటిది. తాగునీటి కోసం ఏర్పాటు చేసే 'తాగునీటి జలవలయం' అన్నమాట. నీరుదొరికే ప్రాంతాలను, దొరకని ప్రాంతాలను మొత్తం కలిపి ఒకే నీటి పంపిణీ వ్యవస్థ కిందికి తీసుకురావడం జరుగుతుంది. ఇది పూర్తయినపుడు మనుషులకే కాదు, పశువులకు కూడా తాగునీటి కొరత తీరుతుంది. అనంతపురం జిల్లాలోని ప్రజలకు, పశువులకు అంతటికీ తాగునీరు అందించడానికి దాదాపు 13 టిఎంసిల నీరు అవసరం. మన జిల్లాకు పి.ఎ.బి.ఆర్. ద్వారా నమ్మకంగా వచ్చే నీరు కూడా కొంచెం అటూఇటూ ఇంతే పరిణామంలోఉంటుంది. అంటే వాటర్‌గ్రిడ్ కోసం పి.ఎ.బి.ఆర్. నీటి మీద ఆధారపడితే మొత్తంఎగువ కాలువ ద్వారా వచ్చే నీరంతా తాగడానికే సరిపోతుంది. ఏది ఏమైన వాటర్‌గ్రిడ్ లేదా నీటి వలయం ఏర్పాటు చేస్తే, జిల్లా నలుమూలలు ఒకే తాగునీటి పంపిణీ వ్యవస్థ కిందికి వస్తాయి. ఈ ఆలోచన ఆచరణకు నోచుకుంటే జిల్లా అంతటా మనుషులకు, పశు వులకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

### 3.2 హంద్రీ-నీవా ద్వారా చెరువుల్ని నింపడం :

ప్రభుత్వం ప్రకటించిన ఇంకొక ముఖ్య కార్యక్రమం హంద్రీ-నీవా రెండవ దశ పూర్తి చేసి భవిష్యత్తులో చెరువులన్నింటినీ నీళ్ళతో నింపడం. అట్లా చెరువులకు నీరు నింపే వ్యవస్థకే నేను 2003వ సం॥లో 'అనంత జలవలయం' అని పేరు పెట్టడం జరిగింది. ప్రభుత్వం ఇప్పటికే ఈ సంవత్సరం కొన్ని చెరువులకు హంద్రీనీవా నీళ్ళు విడుదల చేసినారు. భవిష్యత్తులో అనంత జలవలయం ద్వారా భూగర్భ జలం పెరిగి జిల్లా వ్యవసాయానికి నీటి కొరత కొంత వరకు తీరుతుందనిపిస్తోంది. చెరువులలో నీరు నిల్వ వుండడం వలన వర్షాధార పంటలకు కరువులో రక్షక తడులకు నీరు లభ్యమవుతుంది. అంతేకాక పశుపక్షాదులకు, పర్యావరణానికి కూడా నీరు లభిస్తుంది. హంద్రీ-నీవా మొదటి దశ జీడిపల్లి వరకూ ఉంది. రెండవ దశ జీడిపల్లి నుంచి బుక్కపట్నం చెరువు మీదుగా కడప జిల్లా, చిత్తూరు జిల్లాలో కలిసి పూర్తవుతుంది. హంద్రీ-నీవా పూర్తయిన్నటికి అన్ని చెరువులతో పాటు పేరూరు ప్రాజెక్టుకు, బి.టి. ప్రాజెక్టుకు కూడా నీళ్ళిస్తామంటున్నారు. తద్వారా జిల్లాలో కరువుకు ఉ పశమనం కలిగి సాగునీటి కొరత కొంత వరకు తీరుతుంది.

### 3.3 ఎగువ కాలువ ఆధునీకరణ

మనకు కొంత వరకు నమ్మకంగా కేటాయింపుల నీరు వచ్చేది తుంగభద్ర ప్రాజెక్టు నుంచి వచ్చే ఎగువ కాలువ ద్వారా మాత్రమే. 32.5 టి.ఎం.సి.లు రావలసివుండగా ప్రాజెక్టు పూడిక వల్ల 20-22 టి.ఎం.సి.లకు మించి రావడంలేదు. ఈ ఎగువ కాలువ ద్వారానే కర్ణాటక భూములకు కూడా నీళ్ళు వస్తాయి. కర్ణాటకకు మన రాష్ట్రానికి సయోధ్య కుదరక కాలువలో నీరు సరిగా రావడం లేదు. రావలసిన నీటిని రాబట్టుకోవడం కొరకు కాలువ ఆధునీకరణ కొరకు ఈ నెలలో ఇరు రాష్ట్రాల

ముఖ్యమంత్రులు చర్చలు జరిపారు. జరిగిన చర్చలలో తక్షణం మనకు ఉపయోగపడే అంశాలు లేనప్పటికి, భవిష్యత్తు చర్చలకు ఒక మంచి వాతావరణం ఏర్పడిందని చెప్పవచ్చు. నిజానికి తుంగభద్ర నీటితోపాటు, మన జిల్లాలో ప్రవహించే పెన్నా, చిత్రావతి, హగరి అన్ని నదులు కర్ణాటక నుండే ప్రవహిస్తాయి. కర్ణాటక సరిహద్దులో వున్న హిందూపురం, పరిగి, మడకశిరలాంటి మండలాలలో చాలా చెరువులకు నీళ్ళు రావడం లేదు. కర్ణాటక ప్రభుత్వం తన సరిహద్దులో ఎక్కడికక్కడ నీటిని అరికట్టుకోవడంతో మన జిల్లాలోని నదులు, చెరువులు వట్టిపోయినాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లా నీటి సమస్యలన్నీ కర్ణాటకతోనే ముడిపడి వున్నాయి. ప్రభుత్వం కేవలం వాగ్దానాలు చెయ్యడమే కాదు కార్యరంగంలో వెంటనే చర్చలకు ఉపక్రమించడం మంచి పరిణామమే.

### 3.4 వరం కానున్న పోలవరం ప్రాజెక్టు :

గోదావరి నది మీద భారీస్థాయిలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికే మొదలైంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే గోదావరీ నీటిని 80 టి.ఎం.సి.ల వరకూ క్రిష్ణానదీ పరివాహక ప్రాంతానికి మళ్ళించుకునే వెసులుబాటు ఉన్నది. అయితే ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో అనేక అవాంతరాలు ఏర్పడినాయి. అయితే ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరానికి ప్రాధాన్యత ఇస్తామని అంటున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం అయితే కరువు ప్రాంతాలకు సాగు నీరందించడానికి కట్టుబడి వున్నట్లు ప్రకటించింది. వచ్చే ఖరీఫ్‌లో పోలవరం నీటిని క్రిష్ణా డెల్టాకు మళ్ళించి, అక్కడ ఆదా అయిన నీటిని శ్రీశైలం ద్వారా రాయలసీమకు మళ్ళిస్తామని ప్రభుత్వం చెపుతున్నది. దీని ద్వారా నికరజలాలే రాయలసీమకు ముఖ్యంగా అనంతపురము జిల్లాకు లభించే అవకాశం వుంది. తాగునీటి కొరత తీరే అవకాశం వున్నది. ఈ కల ఎప్పటికి సాకారమౌతుందో వేచి చూడాలి.

## 4. ప్రభుత్వం అదనంగా చేపట్టవలసిన ప్రాధాన్య కార్యక్రమాలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడతానని చెబుతున్న తాగునీటి వాటర్‌గ్రిడ్‌కు, హంద్రీనీవా ద్వారా చెరువులకు నింపడానికి చేస్తున్న ప్రయత్నాలను కలిపి సమగ్రంగా ఒకే నీటి వలయం ఏర్పాటు చేయవచ్చు. ఆ విధంగా సమగ్రమైన నీటివలయం (వాటర్‌గ్రిడ్) ఏర్పాటు చేసినప్పుడు తాగునీటి, సాగునీటి సమస్యలు రెండు కూడా తీరుతాయి. ఖర్చు కూడా చాలా ఆదా అవుతుంది. జిల్లాకు సంబంధించి ఏదైనా పథకాన్ని రూపొందించేటప్పుడు ఏ పథకానికాపథకం విడివిడిగా కాకుండా సమగ్రంగా, సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఆలోచించాలి. దీనివల్ల ఎక్కువగా ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా ఖర్చు, శ్రమ, నిర్వహణ సమస్యలు తగ్గుతాయి.

### 4.1 చెరువులు, కుంటలను పునరుద్ధరించే కార్యక్రమం చేపట్టాలిః

జిల్లాలోని 63 మండలాలలో చెరువులు, కుంటలు కలిసి దాదాపు అయిదు వేల వరకూ ఉన్నాయి. ఈ చెరువులు, కుంటలు పాత కాలం రోజులలో తవ్వినవే అయినా ఈనాటి ఆధునిక సాంకేతిక విజ్ఞానికి తగ్గకుండా వున్నాయి. ప్రతి నదీపరివాహక ప్రాంతంలోనూ గొలుసు కట్టులాగా, వరుసగా చెరువులు, కుంటలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ప్రజలు, ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేయడం చేత పూడిక చేరి వీటి సామర్థ్యం తగ్గిపోయింది. కొన్ని కట్టలు, తూములు, మొరవలు రిపేర్లు చేయవలసి వుంది. వీటన్నింటిని హంద్రీ-నీవా నీటితో నింపే ఆలోచన వుంది కాబట్టి వెంటనే పునరుద్ధరించాలి. చెరువులు, కుంటలు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. కరువు నుండి పంటలను రక్షించేందుకు రక్షకతడులకు నీరు లభిస్తుంది. పశువులకు, పక్షులకు, ఇతర జీవరాశులకు, అడివి జంతువులకు

త్రాగునీరు దొరుకుతుంది. పచ్చదనం పెరుగుతుంది. జిల్లా వ్యవసాయ స్వరూపమే మారిపోతుంది. అందుకే అత్యంత ప్రాధాన్యత నిచ్చి వీటిని పూర్వస్థితికి పునరుద్ధరింవలసి వుంది.

### 4.2 అనంత సమగ్ర జలవలయము ద్వారా అనుసంధాన నీటి వినియోగమే (conjunctive water use) జిల్లాకు శరణ్యం :

ప్రస్తుతం ప్రభుత్వం చెబుతున్న తాగునీటి వాటర్ గ్రిడ్ విజయవంతం కావాలన్నా, భూగర్భ జలాలు పెరిగి, తిరిగి జిల్లాలో పళ్ళతోటలు, ఆరుతడి పంటలు అభివృద్ధి చెందాలన్నా, రక్షకతడులు ఇవ్వాలన్నా, తాగునీటి సమస్య తీరాలన్నా, సమగ్ర అనంత జలవలయం ఏర్పాటు చేయాలి. అనంత జలవలయాన్ని గురించి చాలా సార్లుగా చాలా సందర్భాలలో చెబుతున్నాను. తుంగభద్ర ఎగువకాలువ, హంద్రీ-నీవా కాలువ నుండి మన జిల్లాకు వచ్చే నీటిని ప్రత్యక్ష వ్యవసాయానికి వాడకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులను ప్రాజెక్టు రిజర్వాయర్లను నింపాలి. తద్వారా వర్షపు తేమను, ఉపరితల జలాలను, నదీ జలాలను, భూగర్భ జలాలను ఒకదానితో మరొకటి అనుసంధానం చేసి, అనుసంధాన నీటిని వినియోగానికి **(conjunctive water management )** పథకాలు రూపొందించాలి. హంద్రీ-నీవా నీరు శ్రీశైలంలో వరద కాలంలోనే తోడుకునే వీలున్నందున, ఇప్పుడు జిల్లాలో ఖాళీగా పడివున్న బి.టి. ప్రాజెక్టు, పేరూరు, చెన్నరాయగుడి, యోగివేమన ప్రాజెక్టులతో పాటు జిల్లాలోని అనువైన ఎగువ ప్రాంతాలలో అదనంగా కొన్ని రిజర్వాయర్లను నిర్మించి వాటిని కూడా నీటితో నింపి ఉంచాలి. వీటి నుండి అవసరమైన చెరువులకు, కుంటలకు వాలుద్వారానే నీటిని విడుదల చేయవచ్చును. ఇందుకుగానూ చెరువుతోపాటు, మరవ వంకలను కూడా పునరుద్ధరిచాలి. సమగ్ర జలవలయం ద్వారా వ్యవసాయానికి, తాగునీటికి, పరిశ్రమలకు, సంస్థలకు క్రీడలకు, అన్నింటికీ కూడా నీరు సమకూర్చవచ్చును. దీని ద్వారా కలిగే ఉపయోగాలు అనంతం. మంచినీటి సమస్య తీరడమే కాకుండా, భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్ల ద్వారా వ్యవసాయం పెరుగుతుంది. పశువులు, జీవాలకు నీటి వసతి ఏర్పడుతుంది. ముఖ్యంగా కరువు కాలంలో పంటలకు ఒకటిరెండు రక్షకతడులు ఇవ్వడానికి రైతులకు నీరు అందుబాటులో వుంటుంది. జిల్లాలో ఖరీఫ్ వర్షాధార పంటలను కాపాడుకోవడానికి రక్షక తడులు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తే వ్యవసాయం తిరిగి గాడిలో పడుతుంది. ఇన్ని ప్రయోజనాలు నెరవేరుతాయి. కనుకనే దీనిని అనంత సమగ్రజలవలయం అంటున్నాము.

### 4.3 భూగర్భ జల వినియోగంలో క్రమబద్ధీకరణ, సూక్ష్మసాగు, సామాజిక నియంత్రణ తీసుకురావాలి :

భూగర్భ జల వినియోగాన్ని క్రమబద్ధీకరించి, బోర్లు వున్న రైతులు, బోర్లు లేని రైతుల వర్షాధార పంటలకు కరువు సమయంలో రక్షక తడులకు విధిగా నీరందించే విధానాన్ని ప్రవేశపెట్టవలయును. సూక్ష్మసాగు పద్ధతులను పాటించవలయును. భూగర్భ జలాల వినియోగంలో నీటిని పెంచుకోవడం, కొత్త బోర్లు వేయకుండా ,నీటి దుర్వినియోగం చేయకుండా సామాజిక కట్టుబాట్లు, నియంత్రణ తీసుకొని రావలయును. తద్వారా భూగర్భ జల వినియోగంలోను మరియు పంపిణీలో సమన్యాయం, సమతుల్యతను తీసుకురావడానికి వీలవుతుంది.

### 4.4 అధికంగా నీరుతాగే పంటలను నిషేధించి, తక్కువ కాలవ్యవధి గల పంటలను, తక్కువ నీటితో పండే పంటలను మాత్రమే ప్రోత్సహించాలి :

మనది ఎడారిగా మారుతున్న కరువు జిల్లా కాబట్టి ఇక్కడ అధికంగా నీరుతాగే పంటలైన వరి, చెరకు, అరటి లాంటి పంటలను పూర్తిగా నిషేధించాలి. తక్కువ కాల వ్యవధిగల పంటలకు

(కూరగాయలు, పప్పుదినుసులు, ధాన్యపు పంటలు తక్కువ కాల వ్యవధి గల కర్బూజ లాంటి పండ్ల పంటలు) మరియు తక్కువ నీటితోనూ, వర్షాధారంతోనూ పెరిగే వృక్ష పంటలకు (మామిడి, చింత, సపోట, సీతాఫలము, ఉసిరిక, నేరేడు మొదలగునవి ) ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి.

## 4.5 లక్షల ఎకరాల అటవీకరణతో పాటు అదనంగా 10 లక్షల ఎకరాలలో వృక్ష పంటలు పెంచాలిః

వృక్ష సంపదలేని దాదాపు 5 లక్షల ఎకరాల అడవి ప్రాంతాన్ని మరియు బోడి కొండలు గుట్టలు, చౌడు భూములు వంకలు వాగులలో (మొత్తం 10 లక్షల ఎకరాలు) పండ్లకు, మేతకు, ఔషధములకు, దిబ్బలకు ఉపయోగపడే వృక్ష సంపద మరియు గడ్డి పెంచాలి. వృక్ష వైవిధ్యాన్ని, జీవవైవిధ్యాన్ని పెంపొందించాలి. కలపేతర అటవీ ఉత్పత్తుల ద్వారా, పశుపోషణకు, ఇతర జీవనోపాధులకు తోడ్పడాలి. వృక్ష సంపద పెరగడం ద్వారా నేలలో తేమ పెరుగుతుంది. అధికంగా భూమిలోకి వర్షపు నీరు ఇంకి భూగర్భ జలాలు పెంపొందుతాయి. అంతేకాక ఆకు, అలుములు భూమిలో కలిసిపోవడం వలన మన భూములలో సేంద్రీయ పదార్థము వృద్ధి చెంది, నేలలో తేమను నిలుపుకొనే స్వభావము ఏర్పడుతుంది. నీటి ఆవిరి **(Evaporation)** తగ్గుతుంది. భూసారం పెరుగుతుంది. భూ ఉత్పాదక పెరుగుతుంది. తద్వారా ఎడారీకరణ నివారింపబడుతుంది.

## ముగింపు ః

పైకార్యక్రమాలను అమలు చేయడం వలన జిల్లాలో వనరులను అభివృద్ధి చేయడంతోపాటు, జలవినియోగాన్ని సాంఘికంగా విస్తృత పరిచి సమన్యాయం పాటించి బలహీన వర్గాలకు సాగునీరు అందించవచ్చును. అందుకు అవసరమైన విధానపర నిర్ణయాలను చేయవలసి వుంటుంది. ఒక 10 సంవత్సరాల కాల వ్యవధి గల సహభాగ కార్యాచరణ ప్రణాళిక తయాచు చేయవలసి వుంటుంది. కార్యచరణ ప్రణాళిక తయారు చేయడంలోనూ, అమలు చేయడంలోనూ రైతులు, పంచాయితీరాజ్ సంస్థలు, నీటి వినియోగదారుల సంఘాలు, వన సంరక్షణ సమితులు, వాటర్‌షెడ్ కమిటీలు, స్వయం సహాయక గ్రూపులు మొదలు ప్రజా సంస్థలను భాగస్వాములను చేయాలి. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలు- అటవీశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ, చిన్ననీటి వనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవనశాఖ, సూక్ష్మ నీటి సాగు శాఖ, రెవిన్యూ శాఖ మొదలగునవన్నీ సమన్వయంతో ఏకోన్ముఖులై లక్ష్యసాధనే ధ్యేయంగా కార్యదీక్షతో అమలు చేయవలసి ఉంటుంది. అలా చేసినపుడు అనంతపురము జిల్లా ఎడారీకరణను నివారించి జలవనరుల అభివృద్ధి జరిగి వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, పర్యావరణం పరిస్థితులలో మార్పు వస్తుంది. గ్రామీణ ఇతర వృత్తుల వారు జీవించే పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. మన జిల్లా వ్యవసాయ-ఆర్థిక వ్యవస్థ బలపడి నివాసయోగ్యంగా మారే అవకాశమున్నది.

తేదీ : 05-09-2014

# అనంత నీటి గోడు

## 1. పరిచయము :

ఆంధ్రప్రదేశ్ విభజన చేయాలని కొందరు, సమైక్యంగానే కొనసాగాలని కొందరు, సమన్యాయం చేసి విభజించాలని కొందరు ఆందోళనలు చేస్తున్న సందర్భం. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోని వనరుల పంపిణీపై చర్చలు, వాదోపవాదాలు బేరసారాలు జరుగుతున్న సందర్భం. వెనుకబడిన జిల్లాలు వ్యవసాయ రంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి కాకపోవడానికి ఉన్న అవరోధముల గురించి, వాటి అభివృద్ధి కోసం కీలక వనరుల ఆవశ్యకతను గుర్తించి, వనరుల పంపిణీపై తగిన నిర్ణయాలు తీసుకోవలసిన చారిత్రాత్మక సందర్భం. వెనుకబడిన జిల్లాలు రాయలసీమలోనూ, తెలంగాణలోనూ, కోస్తాంధ్రలోనూ ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి రాయలసీమ నాలుగు జిల్లాలు, మహబూబ్‌నగర్, నల్గొండ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, ప్రతి జిల్లాకు కొన్ని ప్రత్యేక పరిస్థితులు, అవసరాలు, అవకాశాలు వున్నాయి. అవసరాల ప్రాతిపదికగా నీరు, విద్యుచ్ఛక్తిలాంటి కీలక వనరులను ప్రత్యేకించి కేటాయించకపోతే, అవి అభివృద్ధి అయ్యే ప్రసక్తే ఉండదు. వెనుకబాటుతనము ఆధారంగా రాబోయే కాలంలో అనేక విభజనోద్యమాలు, సామాజిక ఉద్యమాలు, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకొనే అవకాశం వుంది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ప్రాంతీయ దురభిమానాలకు అతీతంగా సమన్యాయం, ప్రాంతీయ సమానత్వం, సమతుల్య అభివృద్ధి, పారిశ్రామిక వికేంద్రీకరణ లాంటి అంశాలపై విశాల దృక్పథంతో, రాజనీతిజ్ఞతతో బాధ్యయుతంగా నడవాల్సివుంది. ఈ చారిత్రాత్మక సందర్భంలో వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా మన రాష్ట్ర స్థాయిలోనే కాదు. దేశ స్థాయిలోనే అన్ని రంగాలలోనూ అత్యంత వెనుకబడిన జిల్లాగా, వేగంగా ఎడారీకరణ జరుగుతున్న జిల్లాగా కూడా గుర్తించబడింది.

## 2. అనంతపురము జిల్లా పరిస్థితి :

### వ్యవసాయ పరిస్థితి :

అనంతపురం జిల్లాలో గత ఇరవై సంవత్సరాలలో 16 సంవత్సరాలు కరువే ! ఇది వాస్తవం.

జిల్లాలో పడే సగటు వర్షపాతం 552 మి.మీ. జిల్లా విస్తీర్ణం దాదాపు 50 లక్షల ఎకరాలు దేశంలోనే ఒక అతి పెద్ద విస్తీర్ణం గల జిల్లా. జిల్లాలో వ్యవసాయ అంచనా. వేగంగా తరుగుతున్న భూగర్భజలాల కారణంగా బోరు బావుల ద్వారా నీటిసాగు గాలిలో దీపంగా మారింది. తాగే నీరు కూడా స్థానికంగా లభించక తుంగభద్ర ఎగువకాలువ నీటిపై ఆధారపడవలసి వచ్చింది. జిల్లా మొత్తం ప్రస్తుత జనాభా దాదాపు 42 లక్షలు. అందులో దాదాపు 29 లక్షల జనాభా (7లక్షల కుటుంబాలు) గ్రామాలలో వ్యవసాయం, వ్యవసాయ కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏడు లక్షల రైతు కుటుంబాలలో

దాదాపు ఆరు లక్షల కుటుంబాలు సన్న, చిన్న కారు రైతులు, బడుగు వర్గాలు.

నిరంతర కరువులకు తట్టుకోలేక వర్షాధార రైతులు, బోర్లు ఎండిపోయిన రైతులు, రైతు కూలీలు పట్టణాలకు గేటుమ్యాన్లుగా, హమాలీలుగా, ఇంటి పనిమనుషులుగా వలసలు పోతున్నారు. చాలా మంది రైతులు వ్యవసాయాన్ని చేసుకోలేక, వదలిపెట్టనూ లేక తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలో మ్రగ్గుతున్నారు. 1999 నుండి 2012 వరకూ దాదాపు 3000 మంది రైతులు ఋణ భారంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయం చేయడం కంటే కూలీ జీవనమే ముప్పు తక్కువని భావించి, విత్తనం వేయకుండా వ్యవసాయ భూమిని బీడు భూములుగా ఉంచుతున్న జిల్లా అనంతపురం జిల్లా. 2013 సంవత్సరంలో దాదాపు 5 లక్షల ఎకరాలలో రైతులు విత్తనమే వేయలేదు.

## పారిశ్రామికాభివృద్ధి శూన్యం :

అనంతపురం జిల్లా ఎలాంటి పారిశ్రామికాభివృద్ధికి కూడా నోచుకోలేదు. 22 లక్షల పనిచేయగల జనాభాలో కేవలం 25వేల మంది మాత్రమే పారిశ్రామిక కార్మికులు. వీరిలో అత్యధికులు ప్రభుత్వోద్యోగులే ! మిగిలిన వారందరూ వివిధ రకాల రైతులు, కూలీలు, కులవృత్తులు, పట్టణాలలో ప్రైవేటు విద్యా సంస్థలు, ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు మాత్రమే ప్రధాన వ్యవసాయేతర ఉద్యోగ రంగాలు. జిల్లాలో 3 విశ్వవిద్యాలయాలు, 20 పైగా ఇంజినీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కాలేజీలు, ఒక మెడికల్ కాలేజీ ఉన్నాయి. ఉన్నత విద్యావకాశాలు ఉండడం వలన ఉన్నత విద్యనభ్యసించిన మానవ వనరులు అధికంగా నిరుద్యోగులుగా ఉన్నారు.

జిల్లాలో ప్రస్తుతమున్న పరిస్థితి గమనిస్తే అన్ని రంగాల వారు తీవ్ర దుర్భిక్షం, నిరాశ, నిస్పృహలతో భవిష్యత్తు అంధకారంగా, అగమ్య గోచరంగా ఉన్నారు.

## 3. ఇటువంటి పరిస్థితులలో అనంతపురం జిల్లాలో "కనీస అభివృద్ధి" సాధించుకోవడమెలా?

### 3.1 పెరుగుతున్న తాగునీటి అవసరాలు - తరిగిపోయిన స్థానిక భూగర్భ జలవనరులు

నీటి వినియోగంలో ప్రాధాన్యతలు వేగంగా మారిపోతున్నాయి. ఇంత వరకూ వ్యవసాయానికి మాత్రమే నదీ జలాల పై ప్రథమంగా డిమాండు ఉండేది. మారిన పరిస్థితులలో తాగునీటి అవసరాలు ప్రథమ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మన జాతీయ విధానం ప్రకారం ఒక వ్యక్తికి ఒక రోజుకు పట్టణాలలో 165 లీటర్లు, గ్రామాలలో 135 లీటటర్ల నీరు ప్రభుత్వం అందించవలసి వుంది. ఇది అనివార్యం, అవసరం.

ఇంతవరకూ తాగునీటి అవసరాలు చాలా వరకూ స్థానిక (భూగర్భజలాలు) బోరు బావుల ద్వారా తీరేవి. అంతరించిపోతున్న భూగర్భ జలాల కారణంగా గత 5 సం॥ల నుండి తాగునీటి ప్రాజెక్టులు తుంగభద్ర ఎగువకాలువ నీటి ఆధారంగా చేపట్టడం తప్పనిసరి అయింది. ప్రస్తుతమున్న 42 లక్షల జనాభాకు, మరియు 60 లక్షల పశువులకు కలిపి సంవత్సరానికి దాదాపు 13 టి.ఎం.సి.ల త్రాగునీరు అవసరమవుతుందని అంచనా. పెరుగుతున్న జనాభాను దృష్టిలో వుంచుకొని త్రాగునీటి కోసం అనంతపురం జిల్లాకు కనీసం 15 టి.ఎం.సి.ల నదీజలాలు అవసరమవుతాయి.

### 3.2 పెరుగుతున్న కరువులు -రక్షక తడుల ఆవశ్యకత :

వర్షాధార వ్యవసాయానికి ఒరుపు సమయంలో ఒకటి రెండు రక్షక తడులు ఇస్తేనే కొంతవరకైనా కరువుకు తట్టుకునే అవకాశముంది. లేకపోతే వర్షాధార వ్యవసాయం కనుమరుగవుతుంది.

దాదాపు 24 లక్షల ఎకరాల వర్షాధార పంటలు పండించే 6 లక్షల కుటుంబాల బడుగు రైతులు, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బి.సి వర్గాలు వ్యవసాయ జీవనోపాధి కోల్పోతారు. కరువు సమయంలో ఒరుపుకు తట్టుకునే విధంగా 'రక్షక తడులు' ఎట్లా ఇవ్వాలనే సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి ఇప్పుడిప్పుడే వస్తున్నది. 'వ్యవసాయ పరిశోధన కేంద్ర" రేకులకుంటలో చేసిన ప్రయోగాలు, మరియు 2013 సంవత్సరంలో ఎకాలజీ సెంటరు ద్వారా చేసిన రక్షక తడుల ప్రయోగాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రక్షక తడుల వ్యవస్థను స్థిరీకరించి, రైతులకు విస్తృతంగా అందుబాటులోకి తేవాల్సివుంది.

## 3.3 అనంత జలవలయం ద్వారా బోరుబావుల సంరక్షణః

జిల్లాలో 2013 నాటికి దాదాపు 2 లక్షల బోరు బావులున్నాయి. అయితే వీటిలో దాదాపు 80 వేల వరకు 2013 ఎండాకాలంలో ఎండిపోయినట్లుతెలుస్తున్నది. మళ్ళీ వర్షాకాలంలో చెరువులు, కుంటలు నిండిన ప్రాంతాలలో కొన్ని బోర్లలోకి నీరు వచ్చినట్లు తెలుస్తున్నది.

ఇటు వంటి పరిస్థితులలో బోరు బావులలో తగినంత నీరు ఉండాలంటే, "అనంత జలవలయం" అమలు చేయడంతోపాటు, కొత్తగా బోర్లు విచ్చల విడిగా వేయకుండా నియంత్రించవలసి వుంది. అంతేగాక ఒక్కొక్క బోరు నుండి తోడే నీటిపై పరిమితి విధించాల్సి వుంది. అనంత జలవలయం అంటే, తుంగభద్ర ఎగువ కాలువ, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టుల ద్వారా వచ్చే నదీజలాలతో జిల్లాలోని పాత చెరువలనన్నింటినీ నింపడం, తద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం. ఈ విధంగా నదీజలాలతో చెరువులను నింపే వ్యవస్థనే "అనంత జలవలయం'గా పిలుస్తున్నాము. అంటే మన జిల్లాలోని వర్షపాతంలోనూ, భూగర్భజలాలతోనూ, నదీజలాలలను అనుసంధానం చేయడం జరుగుతుంది. దీనినే అనుసంధాన నీటి వినియోగం (conjunctive water use) అంటారు. ఇది చాలా శాస్త్రీయ నీటి వినియోగ పద్ధతి. దీని ద్వారా నీటి వినియోగ సామర్థ్యం బాగా పెరుగుతుంది. కరువు కాటకాలకు తట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ అనంత జలవలయం ద్వారా భూగర్భ జలాలను వృద్ధి చేసి బోరుబావులను స్థిరీకరించడంతో పాటు, వర్షాధార వ్యవసాయానికి కరువులను అధిగమించడానికి రక్షక తడుల కోసం చెరువులలోని నీరు వాడుకోవచ్చును. తద్వారా వర్షాధార పంటలను కూడా చాలా వరకూ కరువుల నుండి రక్షించుకొనవచ్చును. అనంత జలవలయం ఏర్పాటు చేయడానికి అంటే మన జిల్లాలోని చెరువులను, కుంటలను నింపడానికి, దాదాపు 20 టి.ఎం.సి.ల నీరు అవసరమౌతుందని ఇంజినీర్లు అంచనా వేయడం జరిగింది. అంటే 20 టి.ఎం.సి.ల నదీజలాలను అనంత జలవలయానికి కేటాయించవలసి వుంటుంది.

## 3.4 అనంతపురం జిల్లాలో వ్యవసాయ మనుగడ కోసం "కనీస నీటిసాగు"

జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972 రిపోర్టు ప్రకారము ఒక ప్రాంతములో వ్యవసాయము లాభసాటిగా వుండాలంటే, ఒక బ్లాకు స్థాయిలోని వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం నమ్మదగిన సాగు నీటి సౌకర్యము ఉండవలెనని అభిప్రాయపడింది. దీని ప్రకారము అనంతపురం జిల్లాలో వున్న 27 లక్షల ఎకరాల వ్యసాయ భూమిలో కనీసం 8 లక్షల ఎకరాలు నమ్మదగిన సాగు నీటి క్రింద ఉండాలి. ప్రస్తుతం కేవలం మూడు నుండి మూడున్నర లక్షల ఎకరాలు మాత్రమే , అంటే 11 నుండి 13 శాతము వ్యవసాయ భూమి మాత్రమే సాగునీటి కింద ఉన్నది. అది కూడా అపనమ్మకమైన ఆరిపోతున్న భూగర్భజలాలపై ఆధారపడియున్నది. కనీసం 30 శాతం భూమి (8 లక్షల ఎకరాలు) నీటి సాగు తీసుకొనిరావడానికి అదనంగా ఇంకా కనీసం 40 టి.ఎం.సి.ల నీరు కావలసియున్నది.

తుంగభద్ర, కృష్ణానదీ మిగులు జలాల ఆధారంగా ఇటువంటి నీటి సదుపాయం కల్పిస్తే, అయిదేండ్లలో కనీసం రెండు మూడు సంవత్సరాలైనా ఈ విధంగా దాదాపు 4 లక్షల ఎకరాల భూమి సాగునీటికి నోచుకుంటుంది. తద్వారా లక్షలాది సన్న చిన్నకారు బడుగు రైతులకు వ్యవసాయం కొంతకు కొంతైనా లాభసాటిగా వుంటుంది.

అనంతజలవలయానికి అదనంగా ఈ సదుపాయం కల్గించవలసి వుంటుంది. అప్పుడే అనంతపురం జిల్లాలో వ్యవసాయం కనీసం లాభసాటిగా మారి, సన్నచిన్నకారు రైతులు కొంతవరకైనా ఉపశమనం పొందుతారు.

## 4. అనంతపురము పారిశ్రామికీకరణ :అవకాశాలు -అవరోధాలు

అనంతపురము జిల్లాలో పారిశ్రామికీకరణ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడ భూములు చౌకగా లభ్యమౌతాయి. బెంగుళూరు-హైదరాబాదు జాతీయ రహదారి, రైల్వే సదుపాయములు, జిల్లా సరిహద్దుకు కేవలం 75 కి.మీ. దూరంలో బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం, జిల్లాలో మానవ వనరులు తగినన్ని ఉండడం అనుకూల అంశాలు. జిల్లాలో మూడు ప్రాంతాలలో మరియు లేపాక్షి, గుంతకల్లులో రైల్వే ఆధార పరిశ్రమలు, తాడిపత్రిలో సిమెంటు, నల్లబండల ఆధార పరిశ్రమలు, లేపాక్షిలో ఐ.టి. పరిశ్రమలు, జాతీయ అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, తయారీ రంగ పరిశ్రమలకు అనుకూలంగా వున్నాయి.

## నీటి కొరతే అనంత పారిశ్రామికీకరణకు తీవ్ర అవరోధం :

ఇక్కడ అవసరమయ్యే మౌలిక సదుపాయాలలో నీటి కొరతను తీర్చడం చాలా కీలకమైనది. నీటి ఆధార పరిశ్రమలు మనము ప్రోత్సహించము. కానీ సాధారణ పారిశ్రామికవాడలకు, సంస్థలకు, ఉద్యోగుల జీవనానికి అవసరమైన నీటిని సమకూర్చవలసి వుంటుంది. ఆ స్థాయి నీరు కూడా మన జిల్లాలో లభ్యత లేదు. కేవలం నీరు లేని కారణం అనంతపురము జిల్లా పారిశ్రామికీకరణకు తీవ్ర అవరోధంగా వున్నది. భూమి, విద్యుచ్ఛక్తిలాంటి ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ కరువు జిల్లాలో నీటి కొరత తీర్చలేనిది. కావున అనంతపురం జిల్లాలో పారిశ్రామీకరణకు నమ్మదగిన నదీ జలాల నుండి కనీసం 5 టి.ఎం.సి.ల నీరు కేటాయించవలసి వున్నది. అనంతపురం జిల్లా లాంటి వెనుకబడిన జిల్లాలో పారిశ్రామికీకరణ తీసుకొని రావడానికి నీటితోపాటు ఇతర ప్రోత్సహకాలను కూడా అధికంగా పరిశ్రమలను ఆకర్షించే విధంగా ఇవ్వవలసి యున్నది. పరిశ్రమలను ఆకర్షించ కల్గినప్పుడే జిల్లాలో కొంతకు కొంతైనా నిరుద్యోగ సమస్య తీరి అభివృద్ధికి నోచుకుంటుంది.

ప్రస్తుతం పారిశ్రామిక విధానాలు' పారిశ్రామిక కేంద్రీకరణ' కు అనుకూలంగా వున్నాయి. కానీ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు " పారిశ్రామిక వికేంద్రీకరణ " ను బాగా ప్రోత్సహించేవిగా వుండవలయును. అప్పుడే పరిశ్రమల ద్వారా ప్రాంతీయ వెనుకబాటును అధిగమించి సమతుల అభివృద్ధి సాధ్యమౌతుంది. కాబట్టి వెనుకబడిన జిల్లాలో పారిశ్రామికీకరణ ఒక లక్ష్యంగా పెట్టుకోవలయును.

## 5. ముగింపు :

అనంతపురము జిల్లాలోనూ మరియు ఇతర వెనుకబడిన జిల్లాలోనూ జీవనోపాధుల భద్రత కలిగి ప్రజలు "కనీస జీవనం" గడపాలంటే పైన తెల్పిన విధంగా సాగునీటి రంగము మరియు పారిశ్రామిక రంగములలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయవలసి వుంది. అనంతపురము జిల్లాకు దాదాపు 85 టి.ఎం.సి.ల నదీజలాలతో తాగునీరు ,అనంతజలవలయం, కనీస సాగునీరుతో పాటు, వ్యవసాయ మరియు పారిశ్రామిక ప్రోత్సాహకాలు అవసరము. వీటిని సాధించుటకు అనంతపురం జిల్లా ప్రజలు,

పౌరసంస్థలు, రాజకీయ పార్టీలు విభేదాలను ప్రక్కన పెట్టి పార్టీలకతీతంగా ఒకే స్వరముతో పోరాడవలసి వుంది. మన రాష్ట్ర విభజన సందర్భంలో వెనుకబడిన జిల్లాల ప్రాధాన్యతలను ప్రాథమిక అవసరాలను ఏక స్వరంతో ముందుకు తీసుకురాకపోతే, దారిద్ర్యం, నిరుద్యోగము ఈ ప్రాంతాలలో ఇంకా అధికమౌతుంది. ప్రాంతీయత? ఇంకా ఇంకా ఇంకా పెచ్చు మీరిపోయి రాష్ట్రాల విచ్ఛిన్నతకు, దేశవిచ్ఛిన్నతకు కూడా దారి తీయవచ్చు..

తేదీ : 09-12-2013

# అనంతపురం జిల్లాలో కరువు - ఎడారీకరణ నివారించి, రైతుల దుస్థితిని తొలగించడానికి దశసూత్ర కార్యక్రమం

## 1. పరిచయం :

అనంతపురము జిల్లా నిత్య కరువులకు ఎడారీకరణకు నిలయంగా మారిపోయింది. గతంలో ప్రతి రెండు, మూడు కరువు సంవత్సరాలలో ఒక మంచి పంట పండే సంప్రదాయం అనాదిగా ఈ జిల్లా అనుభవంలో ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితులలో పది సంవత్సరాలకు ఒకటి రెండు పంటలు కూడా రావడంలేదు. తీవ్ర నీటి కొరత కారణంగా ప్రాణకోటి, ముఖ్యంగా పచ్చదనం, పశువులు, పక్షులు నశించి వేగంగా ఎడారిగా మారుచున్నది. ఈ జిల్లాలో కురిసేది తక్కువ వర్షపాతము కూడా రుతువులు గతి తప్పి భిన్నంగా వర్షాలు కురవడం, పంట అవసరాలకు ప్రతికూలంగా కురవడం జరుగుచున్నది. వాతావరణ మార్పుల ప్రభావం పంటల పెరుగుదల, దిగుబడుల మీద, మనుష్యుల ఆరోగ్యాల మీద వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

జిల్లా రైతులు సంక్షోభంలో కూరుకుపోయి వున్నారు. వర్షాధార రైతులు వ్యవసాయం మీద ఆశను వదలిపెట్టారు. నిరాశ నిస్పృహలతో ఈ రైతులు భవన నిర్మాణం, ఇతర అసంఘటిత రంగాలలో కూలీలుగా పట్టణాలకు వలసపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే, రాబోయే అయిదు సంవత్సరాలలో 50 శాతం జిల్లా రైతులు, వ్యవసాయాన్ని మానివేసి నగరాలలో దిన కూలీలుగా, మురికి వాడల్లో చెప్పలేని దుర్భర జీవనాన్ని అనుభవించబోతున్నారు. ఇదొక రైతుల అతి పెద్ద వలస ఉప్పెన గానూ, రైతులు కూలీలుగా మార్పు చెందే అతి పెద్ద సామాజిక తిరోగమన పరిణామంగానూ వుండబోతుంది.

### 1.1. ప్రధానంగా అనంతపురం జిల్లా వ్యవసాయ వాతావరణ పరిస్థితులు

1) తక్కువ సగటు వర్షపాతం (521 మి.మీ.) జిల్లా అంతటా ఒకే విధంగా ఉండదు. ఆవిరి ద్వారా నష్టపోయేది 1850 మి.మీ. చలికాలంలో 12.15 సెంటిగ్రేడ్ కనీసంగానూ 25-33$^{0}$ అధికంగాను వుండగా, ఎండాకాలంలో 40-43 సెంటిగ్రేడ్ అధికంగాను, 26-31 కనీసంగానూ వుంటోంది.
2) 11 లక్షల హెక్టార్ల సాగు భూమిలో 85 శాతం ఎర్రగరప నేలలు, 15 శాతం నల్లరేగడి భూములు
3) దాదాపు 10 లక్షల హెక్టార్లు (90%) సాగుభూమి వర్షాధారం కాగా కేవలం 10 శాతం భూమికి నీటి పారుదల సౌకర్యం వుంది. అది కూడా చాలా వరకూ బోర్ల మీదే ఆధారపడింది.
4) 7 లక్షల రైతు కుటుంబాలలో 90 శాతం సన్న,చిన్న కారు రైతులే - ముఖ్యంగా దళిత, బడుగు బలహీన వర్గాలు.
5) చిన్న కమతాలు, కండలేని ఎర్రగరప నేలలు- అధికవాలు, ఎగుడుదిగుడుగా వున్నవి.
6) పచ్చదనంలేని 2 లక్షల హెక్టార్ల అటవీ భూములు వున్నవి.

7) 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూములలో బోడికొండలు, వంక పొరంబోకులు, చెరువు గర్భాలు తదితరాలలో పచ్చదనం, చెట్లు చేమలు లేకుండా వున్నాయి.

8) మొత్తంగా జిల్లా పర్యావరణం క్షీణించి, నీటి కొరత పెరిగి, కరువులు అధికమై, జీవరాశులు జీవించడానికి వీలు లేని ఎడారిగా జిల్లా వేగంగా మారిపోతున్నది.

## 2. దశ సూత్ర కార్యక్రమాలు

పైన వివరించిన పరిస్థితులలో జిల్లాలో కరువులనధిగమించి, రైతు మరియు గ్రామీణుల దుర్భర పరిస్థితులను అధిగమించడానికి నివారించడానికి మరియు ఎడారీకరణ నివారించడానికి, దశసూత్ర కార్యక్రమాల్ని ప్రతిపాదిస్తున్నాము. ఈ దశసూత్ర పథకాన్ని గనుక యుద్ధ ప్రాతిపదికన పద్ధతి ప్రకారం అమలు చేస్తే రాబోయే పది సంవత్సరాలలో చాలా వరకూ వ్యవసాయ సంక్షోభాన్ని తగ్గించి క్షీణిస్తున్న గ్రామీణ జీవనోపాధులను పునరుద్ధరించుకొనవచ్చును.

## 2.1 కరువు నివారణకు 'అనంతజలవలయం' ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి, వర్షాధార పంటలకు రక్షక తడుల ద్వారా కరువులో రక్షణ కల్పించుట.

ఈ జిల్లాలో వర్షాధారం కింద దాదాపు 10 లక్షల హెక్టార్లలో ముఖ్యంగా వేరుశెనగ మరికొన్ని ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో వేరుశెనగ ఊడలు దిగే సందర్భాలలో ఒక్కొసారి 40 నుంచి 45 రోజుల వరకూ వర్షాలు రాకపోవడం (వరువు) చేత వేరుశెనగ పంట కరువుకు బలై పోతున్నది. ఇటువంటి సందర్భాలలో వర్షాధార పంటలకు ఒకటి లేదా రెండు రక్షక తడులు ఇవ్వగలిగితే పంట కరువులను చాలా వరకు నివారించుకోవచ్చునని ఎకాలజీ సెంటరు మరియు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రయోగాల ద్వారా నిర్ధారింపబడినది. అనంతపురం జిల్లా నీటి కరువులు అధిగమించడానికి పూర్వీకులు వర్షపు నీటి నిలువ కోసం వేల కొద్దీ చెరువులు, కుంటలు నిర్మించారు. వాటి కట్టలు, మొరవలు తెగి, మరమత్తులు లేక పూడిక చేరి, వాటి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. నీటి నిలువ కోసం ఈ చిన్న నీటి వనరులన్నింటిని పునరుద్ధరించాలి. వర్షపు నీరు భూగర్భజలాలు, నదీ జలాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి 'అనంతజలవలయం' ఏర్పాటు చేయవలయును. "అనంతజలవలయం " ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోరు బావులకు రక్షణతో పాటు, వర్షాధార పంటలకు రక్షక తడులు ఇవ్వవలయును. "అనంతజలవలయం" ఏర్పాటు చేయడానికి అనుసంధాన నీటి వినియోగం తీసుకొని రావడానికి క్రింది చర్యలు చేపట్టవలసి వుంటుంది.

1) సాంప్రదాయాక నీటి వనరులైన చెరువులను కుంటలను పూర్తి సామర్థ్యం స్థాయికి పునరుద్ధరించడం

2) నీటి పారుదల చెర్వులన్నింటిని ఊట చెరువులుగానూ, నీటి నిలువ చెరువులుగానూ మార్చడం.

3) స్థానిక నీటి లభ్యతకు అదనంగా తుంగభద్ర, హంద్రీనీవా ప్రాజెక్టు జలాలతో నీటి చెరువులను నింపే వ్యవస్థను ఏర్పాటు చేయడం, దీనినే "అనంత జలవలయం" అని అంటున్నాము.

4) వర్షాధార భూములకు రక్షక తడులు అందించడానికి పైపుల ద్వారా లేదా మొబైల్ స్ప్రింక్లర్ యూనిట్ల ద్వారా నీటి పంపిణీ వ్యవస్థను నెలకొల్పడం.

5) ఈ నీటి పంపిణీ వ్యవస్థ ద్వారా వర్షాధార భూములకు కరువు కాలంలో మొబైల్ స్ప్రింకర్ల యూనిట్ల ద్వారా (10 నుండి 15 మి.మీ. ) రక్షక తడులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయడం.

6) దీని ద్వారా జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. దాదాపు 2 లక్షల బోరు బావులకు రక్షణ ఏర్పడుతుంది. తద్వారా దాదాపు 1.5 లక్షల హెక్టార్లకు సాగునీరు నమ్మకంగా లభిస్తుంది.

బోరు బావుల నుండి కూడా వర్షాధార పంటలకు రక్షక తడులు ఇవ్వడం సాధ్యమౌతుంది.

7) వర్షాధార పండ్ల తోటలకు కూడా అవసరమైన రక్షక తడులు ఇచ్చి వాటిని కాపాడుకోవచ్చును.

ఈరక్షక తడుల పద్ధతి ద్వారా పంట కరువులను నివారించి, లక్షలాది నిరుపేద వర్షాధార రైతులకు శాశ్వతంగా ఉపశమనం కల్గించవచ్చును. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న "అనంతజలవలయం" ద్వారా జిల్లాలో ప్రాంతాల మధ్య నీటి పంపిణీలో సమతుల్యత ఏర్పడుతుంది. జిల్లాలో అన్ని ప్రాంతాలకు కొంతవరకు నీటి వసతి సమకూరుతుంది. అంతేకాకుండా బోరుబావులు లేని, అధికంగా ఎస్సీ,ఎస్టీ,బిసి ఇతర చిన్న ,సన్నకారు రైతులు లబ్ధిపొందుట ద్వారా సాంఘిక సమతుల్యత కూడా సాధించవచ్చును.

**స్థూలంగా చెప్పాలంటే బోరు బావుల క్రింద సాగు నీటి వ్యవసాయంతోపాటు, వర్షాధార పంటలను కూడా కరువుల నుండి రక్షించుకోవడానికి అనంత జలవలయం ఏకైక పరిష్కార మార్గం.**

## 2.2. సాగుభూమిలో 33 శాతం వర్షాధార పండ్లతోటలు మరియు ఇతర వృక్షపంటలను పెంపొందించాలి. వృక్ష పంటలు కరువుకు తట్టుకొనగలవు మరియు పర్యావరణం అభివృద్ధి చెంది, ఎడారీకరణ ఆగిపోతుంది.

ఈ జిల్లాలోని నేలలు, వాతావరణం పళ్ళ తోటలకు చాలా అనుకూలమైనది. యుద్ధప్రాతిపదికన వర్షాధార పళ్ళతోటలు, ఇతర వృక్షపంటలను జిల్లా సాగు భూమిలో 33 శాతం అంటే దాదాపు 4 లక్షల హెక్టార్లలో అభివృద్ధి చేయాల్సి వున్నది. దీని ద్వారా జిల్లాలో అటవీ వృక్ష సంపద లేని కొరతను పూరించినట్లుగా కూడా వుంటుంది. వర్షాధారం క్రింద కూడా చింత, మామిడి, సపోటా, ఉసిరిక, సీతాఫలం, నేరేడు, సీమచింత పండ్ల మొక్కలను పెంచవచ్చునని 20 సంవత్సరాల నుంచి ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు విజయవంతంగా నిరూపించింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం కూడా డి.డబ్లూ.యంఎ. ద్వారా రైతులకు ఈ కార్యక్రమాన్ని అమలు పర్చుతున్నది. అంతేకాక మేతకోసం, పచ్చిరొట్ట కోసం, ఔషధముల కోసం, కలప కోసం ఇతర అనువైన వృక్ష పంటలను కూడా విస్తృతంగా చేపట్టుటకు అవకాశాలు ఉన్నాయి. దీని ద్వారా నిరుపేద రైతులకు నమ్మకమైన ఆదాయ వనరులు, జీవనోపాధులు ఏర్పడడమే కాకుండా జిల్లాలో శాశ్వత పచ్చదనం ఏర్పడుతుంది. పర్యావరణం అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఎడారీకరణ నివారణకు తోడ్పడుతుంది. మొక్క పెరుగుదల కోసం, నేల నీరు సంరక్షణ కార్యక్రమాల్ని అభివృద్ధి పర్చాల్సిన అవసరమున్నది. మొక్కలు నాటినప్పటి నుండీ వాటిని సంరక్షిచుకుంటూ ఫలసాయం పొందే స్థాయి వరకు రైతులకు 3 నుండి 5 సంవత్సరములు తగిన విధంగా, నమ్మకంగా ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. వృక్షపంటలు ఫలదీకరణ చెందడానికి దాదాపు 3 నుంచి 5 సంవత్సరాల సమయం పడుతుంది. కాబట్టి, రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలు వారిని ఉత్తేజపరిచేవిగా వుండాలి.

## 2.3 అటవీకరణ మరియు ఉమ్మడి భూముల అభివృద్ధిద్వారా వృక్ష సంపదను, మేత లభ్యతను పెంపొందించుట : పచ్చదనం పర్యావరణ వనరులను పెంపొందించి ఎడారీకరణను నివారించుట.

అనంతపురం జిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్ల అటవీ భూమి వృక్ష సంపద లేకుండా దాదాపు బీడుగా వుంది. అదనంగా మరియొక 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూమి గుట్టలు, చెరువులు కూడా వృక్షసంపద లేకుండా బీడు భూములుగా ఉన్నాయి. ఈ 4 లక్షల హెక్టార్లు ఉమ్మడి వనరులుగా పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి వనరులుగానే కాక జిల్లా ఎడారిగా మారకుండా పచ్చదనం

అభివృద్ధి చేయాలి. జిల్లాలో వ్యవసాయం తరువాత అధికంగా ఆధారపడుతున్న గొర్రెలు, మేకల పెంపకం, మరియు పాడి పరిశ్రమ, జిల్లాలో చిన్న జీవాలు మేత, నీళ్ళు దొరకక నూర్ల కిలోమీటర్లు దూర ప్రాంతాలకు వలసపోతూ, గొర్రెల పెంపకందార్లు అనేక ఇబ్బందులకు గురువుతున్నారు. పశువుల మేత లేమితో రైతులు పశువులను అతి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. గొర్రెల పెంపకం, పాడిపశువుల పెంపకానికి అవసరమైన మేత లభ్యతను విస్తృతంగా పెంచడానికి 2 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతములోనూ, మరియు 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ పరిధిలోని బీదు భూములు, బోడి కొండలలోను గడ్డి మొక్కలను, పళ్ళ చెట్లను, మేత చెట్లను, మేతకు మరియు సేంద్రీయ పదార్థ ఉత్పత్తికి పనికొచ్చే వృక్ష పంటలను వృద్ధి చేయవలయును. అటవీ ప్రాంతంలో వున్న చెరువులను, కుంటలను కూడా పునరుద్ధరించవలయును. అవసరమైన భూసారసంరక్షణ, వర్షపు నీటిరక్షణ కార్యక్రమాల్ని చేపట్టాలి. ఈ భూములన్నింటిలోనూ సీతాఫలం, నేరేడు, సీమచింత, చింత,నారప, బలిజ, కల్లీ లాంటి అడవి పండ్లచెట్లు పశువుల మేతకు పనికి వచ్చే తుమ్మ, వేప, చింత, రావి, మర్రి లాంటి చెట్లు నాటించి పచ్చదనం అభివృద్ధి చేయాలి. పరిమిత హక్కులతో గొర్రెలు, పశువుల్ని మేపుకోవడానికి లేదా గడ్డికొనుటకు రైతులను అనుమతించాలి. ఈ నాలుగు లక్షల హెక్టార్ల భూములలో పచ్చదనం అభివృద్ధి చేస్తే భూగర్భజలాల మట్టం పెరుగుతుంది. పచ్చదనంతో నేల పరిపుష్టి చెంది నివారణ అవుతుంది.

## 2.4 సమగ్ర వ్యవసాయ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యవసాయధార రైతు కుటుంబస్థాయిలో కనీసంగా 100 పళ్ళచెట్లు, 2 లేక 3 పాడి ఆవులు/ 20 గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించుట : పశువుల సాంవత్సరిక పంటల ద్వారా రైతులకు బహుళ ఆదాయ మార్గాలు ఏర్పడుతాయి.

పంట కరువులకు గురయ్యే ప్రతి వర్షాధార వ్యవసాయ కుటుంబానికి బహుళ ఆదాయ మార్గాలు గల ఒక సమగ్ర వ్యవసాయ వ్యవస్థను ప్రోత్సహించాలి. తద్వారా ప్రతి కుటుంబ స్థాయిలోనూ కార్తె పంటలను, వృక్ష పంటలను, పశుపెంపకాన్ని అనుసంధానం చేసి ఒకదానికొకటి తోడుపడే విధంగా ఒకటి విఫలమైనా మిగిలినవి ఆదుకునే విధంగా ఆదాయ భద్రత కల్పించాలి. వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు పాడి పశువులు, గొర్రెలు,మేకలు అభివృద్ధి చెందితే వర్షాధార రైతులకు కరువుకు తట్టుకునే పరిస్థితులు ఏర్పడతాయి. దారిద్ర్య వలసలు ఆగిపోతాయి. పాడి పశువుల అభివృద్ధి కోసం రెండు విధాలుగా కృషిచేయవలసి వుంది. మొదటిది దేశవాళీ రకాలైన పశువులను ప్రోత్సహించాలి. ఈ దేశావాళీ రకాలు ఉమ్మడి వనరులైన కొండ గుట్టల వెంబడి, వంకలు, చెరువుల వెంబడి,తిరిగి ఎండు మేత తిని బతక గలిగే స్థానిక రకాలై వుడాలి. పుంగనూరు, తార్పార్కర్, హల్లికార్, ఒంగోలు, సింధీలాంటి కరువు ప్రాంతాలకనువైన పాడి ఆవులను మెట్ట రైతులకు సరఫరా చేయాలి. ఈ పశువులు స్వయంగా కొండ గుట్టలలో తిరిగి మేస్తూ అదనంగా వ్యవసాయ వ్యర్థాలను మేతగా తిని జీవించగలవు. వ్యవసాయానికి అవసరమైన సేంద్రీయ ఎరువును కూడా ఇవ్వగలవు. ఉమ్మడి భూములలో కూడా పశువులు తిరగడం ద్వారా నీటి ఉత్పాదకత కూడా పెరుగుతుంది. ఇటు వంటి నాటీ పశువులు వర్షాధార, పేద రైతులకు అనుకూలంగా వుంటాయి. రెండవది అధిక పాల దిగుబడినిచ్చే సున్నితమైన, విదేశీ రకాల పశువులు, జెర్సీ,హేఫరు మొదలగునవి. నీటి పెంపకం అధిక ఖర్చుతోకూడుకొని, సున్నితమైన యాజమాన్య పద్ధతులు పాటించవలయును. పచ్చిగడ్డి తప్పని సరిగా ఉండవలయును. నీటి సాగుగల మధ్య తరగతి, పెద్ద రైతులకు ఈ పాడి పశువులు లాభదాయకంగా వుంటాయి.

## 2.5 చిరుధాన్యాలు, పప్పుదినుసులు మిశ్రమ పంటలను ప్రోత్సహించి, ఆహార భద్రత

**పౌష్టికాహార భద్రతను పెంపొందించుట: స్థానిక రకాల ధాన్యాన్ని ఐ.సి.డి.ఎస్. మధ్యాహ్న భోజన పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థల ద్వారా సరఫరా చెయ్యాలి. ఆహార ధాన్యాల సుదూర రవాణాని తగ్గించాలి.**

అనంతపురం జిల్లాలో వేరుశనగ ప్రాధాన్యత పెరగడం చేత ఆహార ధాన్యపు పంటల విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. దీని ఫలితంగా గ్రామీణ ప్రజానీకం కేవలం ప్రజా పంపిణీ బియ్యం మీదనే ఆధారపడడం చేత పౌష్టికాహార లోపంతో, గ్రామీణ ప్రజలలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతున్నది. వేరుశనగ పంట విస్తీర్ణాన్ని తగ్గించి చిరుధాన్యపు పంటలు, పప్పుధాన్యపు పంటలను అంతర పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం వున్నది. అనంతపురం జిల్లాకు అనువైన పంటలు జొన్న, సద్ద, కొర్ర, కంది, అలసంద, నువ్వులు, పెసలు మొదలగునవి. ఈ పంటలు పండించడానికి ప్రభుత్వం నుంచి రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. చిరుధాన్యాలు పండించే రైతుకు పంట భీమాను, రుణ సౌకర్యము కల్పించి మద్దతు ధరను ముందుగానే ప్రకటించి, ప్రభుత్వమే పంటలను సేకరించవలయును. ఆ విధంగా సేకరించిన ధాన్యాన్ని స్థానిక వినియోగం కొరకు ఐ.సి.డి.ఎస్. కార్యక్రమం, మధ్యాహ్నభోజన పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థల ద్వారా (స్థానికంగా) పంపిణీ చేయవచ్చును. దీని ద్వారా నిరుపేదలకు చిన్న పిల్లలకు, విద్యార్థులకు పౌష్ఠికాహార భద్రత ఏర్పడుతుంది. స్థానిక పంటలను వినియోగంలోకి తేవడం ద్వారా సుదూర ప్రాంతాల నుండి తిండి గింజల రవాణా భారం తగ్గుతుంది. పౌష్ఠికాహార భద్రత పెరుగుతుంది.

## 2.6 అధిక వ్యయ హరితవిప్లవ వ్యవసాయం నుండి తక్కువ వ్యయపు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించుట :

హరిత విప్లవ ఆధారమైన అధిక వ్యయ విధ్వంసకారక వ్యవసాయం అనంతపురం కరువు వ్యవసాయం వాతావరణానికి ఏమాత్రం సరిపోదు. ముఖ్యంగా వర్షాధార రైతులు మరియు చిన్న-సన్నకారు రైతులు హరిత విప్లవ వ్యవసాయ పద్ధతుల వలన చాలా నష్టపోతున్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల వ్యవసాయ పెట్టుబడులు పెరగడంతోపాటు పంటలు, నేల, నీరు వాతావరణం కలుషితమౌతున్నది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా వర్షాధార రైతులు, చిన్న రైతులు వ్యవసాయం నుండి గెంటివేయబడుతున్నారు. వారు అధిక పెట్టుబడులను భరించలేకున్నారు. అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యాలు పాడవడమే కాకుండా పర్యావరణం, వాతావరణం కూడా దెబ్బతింటున్నది. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం మూలంగా భూమి ఉత్పాదకత కూడా దెబ్బతింటున్నది. కాబట్టి అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం స్థానంలో తక్కువ పెట్టుబడుల సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. అధిక పెట్టుబడుల రసాయనికి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ హెక్టారుకు రూ. 10,000 /- వరకూ రసాయనిక ఎరువుల రూపంలో, యంత్రాల రూపంలో, ఉచిత కరెంటు రూపంలో రాయితీ సమకూరుస్తున్నది. కాబట్టి అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం మానేసి, తక్కువ పెట్టుబడుల రసాయన రహిత సుస్థిర వ్యవసాయ పద్ధతులు ఆచరించే రైతులందరికీ హెక్టారుకు కనీసంగా రూ. 7,500 /- వంతున ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అప్పుడు రైతులు సుస్థిర వ్యవసాయం వైపు, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతారు. వారికి కావలసిన ఎరువుల్ని వారే తయారు చేసుకుంటారు. జీవ పంట రక్షణ పద్ధతుల్ని అవలంబిస్తారు.

## 2.7 వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్, పంటలకు అదనపు విలువలు, గిట్టుబాటు ధరలు:

జిల్లాలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు శ్రేష్టతకు, నాణ్యతకు ప్రసిద్ధి. చాలా మంది

రైతులు టొమెటా, బొప్పాయి, చీనా, దానిమ్మ, సపోటా, జామ, కళింగర, ద్రాక్ష, మామిడి లాంటి పంటలతో పాటు వేరుశనగ, శనగ జొన్న, కందులు లాంటి పంటలను పండిస్తున్నారు. వీటికి సరైన ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు లేక రైతులు విపరీతంగా నష్టపోతున్నారు. ఈ పంటలకు గిట్టుబాటు ధరలు ముందుగానే ప్రకటించాలి. ప్రతి మండలంలోనూ శీతల గిడ్డంగులు నిర్మించాలి. ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులకు నమ్మకమైన మార్కెటింగ్ సదుపాయం, సేకరణ సదుపాయం కల్పించాలి. వివిధ రకాలైన పండ్ల ఉత్పత్తులైన పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలు, టమాటో కెచప్ లాంటి పరిశ్రమలు స్థాపించడం ద్వార వాటి ధరలను స్థిరీకరించడంతో పాటు గిట్టుబాటు ధరలు కూడా లభిస్తాయి.

## 2.8 పారిశ్రామికీకరణ -జిల్లాకు అత్యవసరము, అనివార్యము

అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం వ్యవసాయంలో వెనుకబడినదేకాదు. పారిశ్రామికంగా కూడా పూర్తిగా వెనుకబడినది. దాదాపు 40 లక్షలకు పైబడిన జనాభా వున్న జిల్లాలో కేవలం 20 వేల మంది మాత్రమే సంఘటిత కార్మికులున్నారు. అనంతపురం జిల్లా విద్యావసతులలోనూ, మానవ వనరులలోనూ ముందున్న జిల్లా. అనంతపురం జిల్లా సరిహద్దు నుండి బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 75 కి.మీ. దూరంలో మాత్రమే వుంది. దేశంలోనే పొడవైన కన్యాకుమారి-శ్రీనగర్ జాతీయ రహదారి ఈ జిల్లా మధ్య భాగం గుండా పోతున్నది. హైదరాబాదు-బెంగుళూరు మధ్య జాతీయ రహదారితో కలిసి వుండడం వల్ల ఈ జిల్లా కీలక స్థానంలో ఉండి పారిశ్రామికంగా బెంగుళూరు-హైదరాబాదు పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుటకు అనుకూలంగా ఉంది. బహుశా దేశంలోనే అనంతపురం జిల్లా రైతులు మాత్రమే కావచ్చు తమ భూములను పరిశ్రమలకు ఇతర జిల్లాలతో పోలిస్తే అతి తక్కువ ధరలకు ఇవ్వడానికి వారంతట వారే సిద్ధపడుతున్నారు. రైతులే పారిశ్రామికీకరణను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. తమ పిల్లలకు వ్యవసాయంలో భవిష్యత్తు లేదని భావించి పరిశ్రమలలోనైనా వారి జీవితాలు బాగుపడగలవని వారి ఆశ.

అయితే నీటి కొరత ఈ జిల్లాలో పారిశ్రామికీకరణకు తీవ్ర అవరోధంగా వుంది. కాబట్టి అత్యంత ప్రాధాన్యత నిచ్చి, వెంటనే పరిశ్రమల కోసం 5 టి.ఎం.సిల నమ్మదగిన నదీ జలాలు ఈ జిల్లాకు కేటాయించాల్సి వుంది. నీటి వసతి గనుక వుంటే పారిశ్రామికీకరణ వేగంగా చెప్పుకోదగ్గ స్థాయిలో పుంజుకోగలదు. జిల్లా వ్యవసాయం రంగంలో నెలకొన్న సమస్యల కారణంగా, జిల్లా అభివృద్ధి కొరకు చిన్న, పెద్ద, మధ్య తరహా లాంటి అన్ని స్థాయి పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం వుంది.

అనంతపురం జిల్లాలో పారిశ్రామికీకరణను ప్రోత్సహించడము అనివార్యము, న్యాయము, అత్యవసరము కూడా.

## 2.9 రైతులతో సహా గ్రామీణ పేదలందరికీ ఆరోగ్యభద్రత మరియు విద్యాసౌకర్యాలు

రైతులు, గ్రామీణ పేదలు ఋణభారంతో మునిగిపోవడానికి వ్యవసాయ సంక్షోభంతోపాటు దిన దినానికి పెరుగుతున్న ఆరోగ్య ఖర్చులూ మరో కారణం కాబట్టి అనంతపురం జిల్లాలోని గ్రామీణులందరికీ ఆరోగ్యభద్రత కల్పిస్తే గ్రామీణ దుర్భిక్షం గణనీయంగా తగ్గుతుంది. ప్రభుత్వ వైద్య సదుపాయాలను మెరుగుపరచి, అందరికీ అందుబాటులోకి తేవలయును. మరియు ఉన్నత వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీని విస్తృతపరచి, అన్ని రోగాలు కలుపుతూ సవరించి అమలు చేయవలయును.

రైతులు, గ్రామీణ పేదలు ఋణ భారంతో మునిగిపోవడానికి ఇంకొక ముఖ్య కారణం అధిక ఖర్చుతో కూడుకొన్న చదువులను 'కొనలేక' పోవడమే. వ్యవసాయం సంక్షోభంలో మునిగి, గ్రామాలలో వ్యవసాయంలో భవిష్యత్తు కానరాక, పిల్లలను పై చదువులు చదివించాలనే తపనతో, విద్యాఖర్చుల కోసం ఋణగ్రస్తులైపోతున్నారు. కాబట్టి, గ్రామీణ కుటుంబాలకందరికీ ఉచితంగా నాణ్యమైన చదువులందే విధంగా ప్రభుత్వ విద్యాలయాల ప్రమాణాలు బాగా పెరగాలి. ప్రైవేటు విద్యా సంస్థలతో పోటీగా ఎదగాలి. ప్రభుత్వ విద్యా సంస్థల సంఖ్య కూడా బాగా పెరగాలి. వసతి గృహాలు లాంటి తగిన సదుపాయాలు కూడా పెరగాలి. ముఖ్యంగా గ్రామ స్థాయి మండల ప్రభుత్వ విద్యాలయాలలో విద్యా నాణ్యతాప్రమాణాల్ని గణనీయంగా పెంచవలసియున్నది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రైవేటు విద్యా సంస్థలలో కూడా నాణ్యతాప్రమాణాలు పెంచే విధంగా మరియు ఫీజుల నియంత్రించే చర్యలు చేపట్టవలసి యున్నది.

## 2.10 అనంతపురం జిల్లా అభివృద్ధికి ఐదు సంవత్సరాల సమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక

వ్యవసాయంలో సంక్షోభ నివారణ అతి ముఖ్యమైన కార్యక్రమమే కానీ, దీర్ఘకాలిక కవల సమస్యలైన కరువు-దారిద్ర్యం కేవలం వ్యవసాయంతో పరిష్కారం కావు. కరువు -దారిద్ర్యం-ఎడారీకరణ సమస్యలను పరిష్కరించడానికి విడివిడిగా, పాక్షికంగా చేసే అభివృద్ధి కార్యక్రమాలు అనంతపురం జిల్లాలో ఎడారీకరణను, పేదరికాన్ని నిర్మూలించలేవు. వివిధ రంగాల అభివృద్ధి కార్యక్రమాలను సమీకరించి సమన్వయం చేసి అమలు పర్చాల్సి వుంటుంది. జిల్లా సర్వతోముఖాభివృద్ధి కోసం ఒక ఐదు సంవత్సరాల కాల వ్యవధి గల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరగాలి. వ్యవసాయంతో పాటు చిన్న, పెద్ద, సూక్ష్మ స్థాయి పరిశ్రమలు స్థాపించుటకు తగిన ప్రోత్సాహకాలు ఉండాలి. యువతకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించే ప్రణాళిక ఉండాలి. మహిళలకు, వ్యవసాయ కూలీలకు అదనపు జీవనోపాధులు, ఆదాయ అవకాశాలు కల్పించాలి. ఈ సమగ్ర ప్రణాళికలోని కార్యక్రమాలన్నింటికి నిధుల కొరత లేకుండా చాలినన్ని నిధులు జిల్లా యంత్రాంగం ఆధీనంలో వుండాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ పార్టీలు, ప్రజావేదికలు కలిసి చిత్త శుద్ధితో, రాజకీయ సంకల్పంతో అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేయడంలో భాగస్వామ్యులై విజయవంతం చేయాల్సి వుంటుంది.

ఈసమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను గురుతర బాధ్యతతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరముంది.

## 3. ముగింపు

పై కార్యక్రమాలన్నింటిని ఒక రాజకీయ ధృఢ సంకల్పంతో, చిత్తశుద్ధితో, ఒక కాల వ్యవధిలో పూర్తి చేయడం ద్వారా అనంతపురం జిల్లాలో కరువు, పేదరికం, ఎడారీకరణ అనే సమస్యలను చాలా వరకు అధిగమించగలం. వెంటనే కార్యాచరణకు దిగకపోతే పరిస్థితి చేజారిపోతుంది. ఇంకేమాత్రం ఆలస్యం కారాదు. బతుకు భారంతో గ్రామీణులందరూ నిరాశా, నిస్పృహలతో అదృశ్యం కాకముందే, రైతులందరూ దిన కూలీల స్థాయికి సామాజిక తిరోగమనం కాకముందే మేల్కొనాలి. గ్రామీణ ప్రజలకు జీవనంపై ఆశను కల్పించి, వ్యవసాయక, పారిశ్రామికాభివృద్ధిలో మరియు ఎడారీకరణను నివారించడంలో నిర్మాణాత్మకంగా భాగస్వామ్యులను చేయవలసి వుంది.

తేదీ : 17-06-2013

# Combating Drought & Desertification and Mitigating Agricultural Crisis and Farmers, Distress in Anantapur District -A 10 point programme

**1. Introduction :**

Earlier the experience of farmers in this district was that they used to get a good crop once in every 2-3 years. But now they get only one or two good crops in 10 years. The rainfall which is always low in this distict is getting more and more dispersed and unpredictable. It is no more following the pattern which it used to. The climate change is negatively affecting the health of crops, animals and human beings. Further the process of desertification is hastened.

The present situation has deepened the farmers distress and rainfed farmers saw no hope of making a livelihood in agriculture. So, they are abandoning agriculture and migrating to cities desperately to work as casual labor in construction or industry. The sudden out migration from rainfed farming is alarming in last 2 or 3 years. If it continues, 50% of farmers may give up farming in next 5 years and might live in city slums under untold suffering. This may ever be a biggest displacement of farmers and largest disgraceful downward occupation mobility from farmers to casual labor.

***This 10 point programme aims to combat drought & desertification and to mitigate agricultural crisis through protective irrigation and climate resilient sustainable agriculture and provide certain amount of income, food and nutritional security, particularly to rainfed farmers. Further it improves the endowment of environmental resources and fights the desertification process by adding tree cover, Bio-diversity, rain water harvesting and enhanced ground water.***

**1.1. Salient features of Anantapur agro-climate**

1) Low and ill-distributed rainfall (521 mm) with 1850 Potential Evapo-transpiration. Winter temperatures 12-15$^0$ minimum 25-33$^0$ maximum. Summer temperatures 40-43$^0$ maximum and 26-31$^0$ minimum..
2) Cultivated Area of 11 lakh ha, 85% shallow red-gravelly soils, 15% Black soils.
3) Almost 10 lakh (90%) ha. is rainfed, only10% is under irrigation that too mostly under tube wells.
4) 7 lakh farming families, 90% of them are small and marginal from SC, ST & BC Communities.

5) Small holdings, mostly slopy, rolling, undulating and shallow.
6) 2 lakh ha. of forest area almost without tree cover.
7) 2 lakh ha. of Revenue hillocks, wastelands, streams, tank beds etc., without tree or grass cover.
8) Overall the frequency of droughts and process of desertification has been accetuated.

**1.2**. Given this situation of Anantapur District of severe agriculture crisis and severe distress of farmers, a 10 point programme is proposed to address the problems of Droughts, Desertification and Poverty. If this 10 point programme is implemented systematically with a sense of urgency in next 10 years we can by and large overcome the frequent droughts and alleviate rural poverty on sustainable basis. And importantly combat desertification.

**2.1 Provide Protective Irrigation to rainfed crops during dry spells through "Anantapur Water Grid" for Drought mitigation.**

In this district, under rainfed conditions, mainly groundnut and some other crops are grown in 10 lakh ha. Generally droughts occur because of long dry spells in the months of July & August (which is a peg penetration and pod formation time for Groundnut crop) resulting in huge crop failures. If we can provide 1 or 2 protective irrigations during these dry spells we can protect rainfed crops and prevent droughts to a great extent. This protective irrigation could be made possible through "Anantapur Water Grid". Anantapur District is endowed with thousands of traditional small and medium irrigation tanks spread across the district. We have to build "Anantapur Water Grid" by interlinking these water bodies with river waters from Tungabhadra & Handri-Neeva Projects and synergizing different water sources viz., rain water, ground water, local surface water and river waters in a "conjunctive use of water". The water from the Water Grid could be used for protective irrigation for rainfed crops. We have to do the following in order to build "Anantapur Water Grid" and conjuctive use of water; and be able to provide protective irrigation to rainfed crops.

1) Restore traditional irrigation tanks to their full capacity.
2) Convert all traditional irrigation tanks into percolation tanks and storage reservoirs.
3) Supplement the local surface water with River waters in order to fill all the traditional (percolation) tanks. This is called "Ananta Water Grid".
4) Build a distribution network system to rainfed lands through piped or tanker system and mobile sprinkler units.
5) Use this distribution system (Anantha Water Grid) for giving protective irrigation (10mm) to rainfed crops during long dry spells by using mobile sprinkler units.
6) It will improve the ground water recharge across the District and stabilize the bore wells. Use the augmented ground water also for protective irrigation when necessary.

With this system of protective irrigation, droughts could be mitigated and relief provided to lakhs of rainfed poor farmers. The proposed Anantapur Water Grid will also create a more spatially equitable distribution of water across all regions of the district. And will achieve a greater social equity by benefitting large number of small and marginal rainfed farmers, belonging to SC, ST, BC and other poor farmers.

**2.2. Promotion of rainfed horticulture and agro forestry in 33% of cultivated area :**

**Tree crops are more drought tolerant and improve environment.**

The soil and climate in this district are favorable for certain crops of rainfed horticulture. There is an urgent need to develop rainfed fruit trees and other tree crops in 33% of cultivable land in the district i.e., 4 lakh ha. It will also enhance tree cover in the district and compensate for lack of adequate forest cover in the district. AF-Ecology centre has successfully established since 20 years that fruit trees like Mango, Sapota, Amla, Custard Apple, Jamun, Ber etc., can be grown in rainfed lands provided initial irrigation for establishment. The Government is now scaling up this successful programme under DWMA. There is further a plenty of scope for establishing rainfed trees for fodder, manure, biomass, medicinal, timber etc. The tree crops not only improve green cover in the district but also add livelihood support to poor farmers. To ensure survival of tree crops, there is need to undertake insitu soil and rain water harvesting measures; and to "hand hold" farmers from planting to yielding for 3-5 years. Tree crops begin yielding only after 3 to 5 years of planting, so the hand holding has to be attractive to motivate all rainfed farmers to go for tree crops.

**2.3. Increase fodder availability through afforestation and common lands development :**

**Vegetation improves environmental endowment and combats desertification :**

In Anantapur District there is 2 lakh ha. forest land without forest cover. In addition to this, there is another 2 lakh ha. Revenue land with hillocks, streams, uncultivable wastelands etc. and also without teror grass cover. It amounts to 20% of the Geographical area of the District. These 4 lakh ha. is a common property resource useful for support of livelihoods of poor farmers and landless as well as combating desertification by improving environment. In Anantapur District the main livelihood after agriculture is sheep / goat rearing and dairy. The shepherds in the district are migrating for months to distant places as there is not enough fodder available for sheep. Also the farmers are selling away cattle for a throw away price as there is no sufficient fodder. Grasses and trees that give fodder, fruit, biomass, timber etc could be grown in this 2 lakh ha. forest land plus 2 lakh ha. Revenue common lands to augment fodder (and biomass) for sheep and cattle. Several traditional water bodies in forest land need to be renovated and appropriate soil conservation and rain water harvesting measures have to be taken up. Seetaphal, Jamun, Tamarind and other native forest fruit trees (with

market value) along with fodder trees like neem, narepi, peepal, banyan etc., have to be grown in these lands. Once they are grown, semi-intensive sheep and cattle grazing or cut and carry fodder could be allowed. Developing tree cover and soil conservation and rain water conservation in 4 lakh ha. of forest lands and common lands would also add greatly to the ground water recharge, biomass enhancement, increase soil organic matter and help combating desertification.

**2.4. Promote Integrated Farming System (IFS) at each rainfed household level :**

**Each rainfed farmer to own atleast 100 fruit trees plus 2 or 3 cows / 10 sheep in order to supplement annual crops :**

There is a need to promote IFS for every rainfed farmer. The IFS should integrate annual crops, tree crops and cattle / sheep / goats. This system would diversify income sources, spread risk and provide income stability in case of droughts as farmers will get income from multiple sources like annual crops, tree crops, cattle and sheep. Even if one source fails, other will come to his / her rescue. About relevance of tree crops was already discussed in the previous point. Regarding cattle, we have to follow a two pronged approach.

a) Promote local / native drought-tolerant breed cattle as they are best suited to this region. They will freely move on and graze on hillocks, streams and can survive well even on dry fodder from annual crops like millets, pulses and groundnut. Different native breeds of cattle suitable to our area are Punganur, Thaparkar, Hallikar, Ongole and Sindhi etc. These will survive on grazing in common lands and crop residues. The farmers can own more number of cattle as they are inexpensive. They may give less milk compared to exotic cattle, but compensate with more number of animals. Also the productivity of common lands will increase when cattle move in these lands. The local breeds are best suited for rainfed farmers and they are important resource by way of cow dung and cow urine for Jeevamrutham for practicing Sustainable Agriculture..
b) Promote dairying with the exotic milch animals like Jersy, Heifer etc., for farmers with irrigation facilities, who have green fodder; and better equipped to manage the sensitive animals.

**2.5. Promote mixed / inter cropping with millets and pulses and ensure food and nutritional security :**

**Provide locally grown food in ICDS, Mid-day Meals and PDS and Reduce Food Miles :**

In Anantapur district the crop area of millets has reduced drastically because of extensive cultivation of groundnut. Due to this the villagers are completely dependent on only rice under PDS for food. Consequently the malnutrition is increasing and immunity of villagers is decreasing. So there is need to diversify the rainfed crops with millets and pulses and reduce Groundnut cultivation. Suitable millet and pulses for Anantapur District are Jowar, Bajra, Fox-tail millet, Redgram, Cow-pea, Lab-Lab, Gingilly, Green Gram etc. In order to

bring back millets and pulses, Government should provide adequate incentives. Government should provide crop insurance, credit facility, support price, and procrement facility for millet and pulses. The millets and pulses produced in the disitrict should be consumed locally as much as possible by supplying in PDS programme and by providing millet and pulse based cooked food in mid-day meal scheme and Integrated Child Dvelopment Scheme (ICDS) in order to create food and nutritional security for children, students and mothers. Such a localized food production and distribution system would reduce food miles, save distribution costs and enhance food and nutritional security.

**2.6. Shift Green Revolution Model (HEIDA), to LEISA**

The Green Revolution model which I called High External Input Destructive Agriculture (HEIDA), is not suitable for Anantapur agro-climate and particularly inimical to rainfed small and marginal farmers. High use of chemicals in agriculture is leading to increased cost of cultivation and polluting the environment. Farmers are caught in the debt trap and losing a lot due to HEIDA. The rainfed farmers and small farmers are being thrown out of agriculture as they cannot afford high crop investments and cannot take risks. This is also destroying the health of people, environment and ecology. The productivity of soils are decreasing because of high use of chemicals. So there is a need to replace HEIDA and campaign intensively the Low External Input Sustainable Agricultue (LEISA) practices. Government under HEIDA is giving direct and indirect subsidy of about Rs. 10,000/- per ha. on chemical fertilizers, mechanization, free electricity etc. So the Government should provide atleast Rs. 7,500/- incentive per ha. to all farmets who shift from HEIDA to LEISA, So that they grow diversified crops, prepare and use their own manures and practice bio-management of pests and diseases.

Further in order to mitigate climate change also we have to shift from HEIDA to LEISA. This LEISA is thus eco-friendly and very beneficial to small and marginal rainfed farmers.

**2.7. Processing and value addition of Agri-produce and Remunerative prices :**

The agri-produce grown in this district is known for its high quality. Anantapur farmers are growing vegetables and high value fruits like Sweet Lime, Pomegranate, Sapota, Guava, Citrus, Water Melon, Grapes, Mango etc., and other crops like Groundnut, Bengal Gram, Jowar and Lentils. There is no proper processing and marketing facility for these crops. Cold storages and ware houses should be build adequately for storage. Atleast first stage processing units have to be established in the district. Assured market or procurement facility and a price stablization mechanism has to be provided for all agri products. The agri processing industries like fruit juice, pulp tomato ketchup can help in stabilizing prices and give remunerative price to farmers. A price stabilization fund should be setup to cushion the price fluctuations and avoid distress sale.

**2.8. Industrialisation - An essential and urgent necessity for the district :**

Anantapur is also the least industrialized and otherwise also most backward district in Andhra Pradesh. Given a population of over 40 lakhs, there are only about 20,000 industrial workers in Anantapur district. Anantapur district is rich with good educational institutions and human resources. Banagalore International airport is just about 75 Kms away from the borders of Anantapur district. A longest and most important National Highway from Kanyakumari to Delhi runs through the length of Anantapur. And the district strategically located between Bangalore and Hyderabad offering good scope for an industrial corridor between Bangalore and Hyderabad. The crop land is least productive given chronically drought-prone and desert like agro-climate. Perhaps this is the only District in the country where farmers themselves are inviting industry and prepared to sell their land at a lower rate compared to any other district. The farmers are keen to see their children employed in industry as they cannot see future in agriculture for their children.

However one constraint for industrialization is the scarcity of water in the district. So, there is an urgent and high priority need to allocate 5 TMC of water exclusively for industry in the district. The water availability will trigger a rapid industrialization in the district given other congenial factors. Given the climatic constraints for agriculture sector, it is fair, logical and essential incentivise and encourage intensive industrialization of micro, small, medium and big.

**2.9. Health Security and Education Support :**

One of the main causes (apart from droughts) for poverty and increasing rural indebtedness is ever increasing health expenditure. So all the villagers have to be provided with health security to come out of poverty. Rajiv Arogyasri has to be extended to all, augmented to include all diseases in it and implement effectively. And the infrastructure and functioning of all Government health institutions should be improved at all levels in order to reach out to the people.

Another major cause for poverty and high rural indebtedness is increasing costs on their children's education. Unable to see any future in agriculture farmers desperately want to provide higher education to all their children which is becoming costly day by day. So all the rural children who want to go for higher education should be supported fully by the government. Also there is a strong need to improve quality of education in all the Government institutions in the rural areas and for higher education.

**2.10. A time bound 5 year action plan for comprehensive development of Anantapuram District :**

Alleviating the crisis in agriculture which is caused by drought and desertification is basic and a necessary condition, but not sufficient. A piece-meal approach to address the chronic problems of drought and poverty in Anantapur District will not solve the gigantic problem of being the most backward district in the state. Multi-sectoral interventions and convergence is necessory.

A time bound comprehensive 5 year acton plan has to be worked out including the above measures as well as other sectoral interventions such as the need for industrialization, (micro, small, medium and large) non-farm skilled employment for under educated youth, additional and alternate income generation programmes for women, landless etc. And further, adequate financial, human and institutional resources to implement such as plan should be made available at the disposal of the District Administration. The elected people's representatives, including Panchayath Raj Insttutions, Political parties, the Government machinery and the civil society organizations have to work in cohesion and concerted manner in implementation and monitoring the comprehensive plan.

**3. Conclusion :**

There is a need for immediate action with a sense of urgency and seriousness. Lest we all may be late for ever! Farmers may disappear in desperation and disgrace to cities to work as casual labor! Farmers becoming casual labor will be disgraceful. In the absence of industrialization, the educated community also has to migrate in search of employment. Then who else will remain in Anantapur District !

A sense of urgency and political commitment is needed to address the problems of chronic drought, desertification, poverty and backwardness in Anantapuram District.

**Improve Water Resources, Prevent Desertification, Protect Agriculture, Farmers and Rural Livelihoods**

**Introduction :**

United Nations General Assembly declared 22nd March as World Water Day. 22nd March was first formally proposed in Agenda 21 of 1992 United Nations Conference on Environment and Development in Rio de Janeiro. Observance of 22nd March as World Water Day began in 1993 and its importance has grown significantly ever since. It has offered an opportunity for concerned stakeholders and civil society organizations to draw the attention of public on issues concerning water and create "Water Consciousness". And as well draw the attention of the policy makers in order to advocate a favourable policy environment for (a) to promote a rights based approach to water, (b) Sustainable water conservation and water use, (c) spritual and social equity in accessing water, (d) Mitigating natural calamities like droughts and floods and their impact in people, particularly the vulnerable populations, (e) Address issues of Food Security, (f) Address issues of clean drinking water and (g) Address issues of water pollution.

Water is the basis for life of all living beings. People are confronted with various water related problems at various levels such as family, community, local, regional, national and global. Even today, one third of the Worlds' Population lack access to protected drinking water. People of some regions are

confronted with devastating floods, while others are confronted with droughts and famines. Increasingly water has become a cause of conflict at various levels starting from within a family, between villages, regions, states and countries. Water related disputes are ongoing at all levels in India creating social tensions in the country. The water is becoming increasing scarce and so increasingly precious. So, it is predicted that the future wars will be fought for water at various levels. The main aim of the "World Water Day" is to draw the attention of the people towards water problems, create water consciousness, build public opinion, advocate favourable policies in order to address the problems related to water.

"Water is the most critical resource for socio-economic development of any region in the country". The water use is categorized essentially for (a) Domestic consumption, (b) Agriculture, Cattle, Livestock etc., (c) Artisans and other livelihood activities like pottery, cottage industries etc., (d) Other Industries and (e) Maintenance of ecological balance. Presence of adequate water resources indicates the richness of endowment of natural resources. Such resource rich regions could be economically and ecologically strong provided they are judiciously managed. Scarcity of water in an area leads to desertification and droughts. The variation in availability of water between regions is the basis for regional imbalances, disparities and regional disputes. Of the total water existing on the Globe, the "fresh water" directly useful for human beings is less than three percent. The balance 97% of the water is in the form of oceans and ice in polar and other regions and is not directly useful to human beings. 70% of the available "fresh water" is being utilized by Agriculture sector. The food security of a region or a country depends on the availability of water resources for agriculture. The remaining 30% of the fresh water is used for the purpose of domestic consumption, artisans and cottage industries, industrial sector and eco system, maintenance.

The scarce availability of water necessitates an equitable, efficient and effective use of water in order to meet the water needs of all people and sectors in a balanced manner. Mainly water availability is categorized as (1) Rain Water, (2) Surface Water (Water bodies and rivers), (3) Moisture available in the upper layers of soil and (4) Ground water. However, rain water is the source for all the above 4 categories of water. The Central Public Health Engineering Department has assessed that a person requires 135 litres of water per day to meet the domestic and drinking water needs.

**2. Status of water resources in Anantapur district**

**2.1. Rainfed farming in severe crisis and on the collapse !**

Anantapur district is moving fast towards desertification. Agriculture is in severe crisis and other rural livelihoods are in peril. The life of all the people in rural areas is in severe distress. The district receives an annual rainfall of 552 mm. The district experiences droughts in three years in every five years! That means rains

do not occur as and when it is required for crops and so the crops fail. The total geographical area of the district is about 50 lakh acres. The total area under cultivation is about 27 lakh acres. Out of this only 3 lakh acres is under irrigation mostly underground water. This means 90% of the cultivated area is under rainfed. Under these prevailing crisis conditions, there is a recent trend of rainfed farmers abandoning agriculture. If this trend is unabated, there is a possibility of disappreance of rainfed cultivation due to continuous drought conditions displacing about 4-5 lakh farm households, particularly small and marginal farmers.

**2.2. Ground water table is sinking day by day and surface water bodies silted and in disrepair**

Not more than 3 lakh acres is under irrigation with 1.7 lakh tube wells in the district. In addition to this, an area of only 60,000 acres is being irrigated under High Level Canal of Thunga Bhadra Dam. Due to less recharge during drought years, the ground water table is fast depleting every year. There are about 5000 numbers of traditional surface water resources like tanks, mini percolation tanks etc., in the district. These conventional water bodies once were the main sources of harvesting rain water and recharging ground water in the district. This water harvesting and recharge mechanisms are now ineffective due to siltation, disrepair and neglect. Besides, the inflows of water into tanks are also largely decreased, due to climate change and shift in the pattern of rainfall. These water bodies are losing their water holding capacity, due to accumulation of silt for years. Some water bodies are losing their capacity due to damage to weirs and bunds. Apart from this, nearly 40% of the rain water is being evaporated due to intense heat and lack of green cover. This could have been avoided, had the vegetative cover spread in the district extensively. Thousands of bore wells are drying during summer every year. The ground water is depleting due to indiscriminate drilling of more and more new bore wells. The farmers are desperate to save the irrigated crops and fruit trees. So the farmers distressed and desperate, are resorting to drilling of ten to twenty bore wells in their lands in search of water, but without success. Due to failure of bore wells the farmers are pushed in to a deep debt trap and some are resorting to suicides as they see no hope for future!.

**2.3. Reserved forest denuded and Revenue hillocks and waste lands barren :**

In order to convert the rain water into ground water and enhance life systems, an area should have adequate forest with greenery. An area of 5 lakh acres (10% of the Geographical area) is under reserved forest in our district. All this area embraces only degraded forest with thorny scrub and bushes hills, hillocks, waste lands and stream banks is also devoid of any vegetation. Forest commission recommends that 33% of a geographical area (in a district) has to be under forest in order to have an ecological balance and sustainable environment.

**3. The following policies and programme are proposed to develop the water**

**resources and their proper and efficient utilization in Anantapur District.**

**3.1. Rain water harvesting and soil and moisture conservation activities to be taken up extensively in the district :**

In the entire district, the total area of 50 lakh acres (that is cultivated lands, barren hills, forest areas, hillocks, stream banks all put together) has to be treated under watershed development programme. Soil and moisture conservation and rain water harvesting activities are to be carried out. This results in increase in vegetation, biodiversity, biotic life in the soils, ground water development and combats desertification.

**3.2. Rennovation of traditional water bodies such as tanks and mini percolation tanks :**

Traditional surface water bodies such as irrigation tanks, small tanks, percolation tanks etc., existing in the district are to be desilted, repaired and restored to their full capacity. This leads to increase in rain water harvesting and a high surface water storage capacity which in turn increases ground water recharge. Thus the bore wells also will have assured water yield.

**3.3. Afforestation (5 lakh acres) of reserved forest and developing (10 lakh acres) social forestry on the hillocks, barren lands and stream courses etc.,**

The forest area of 5 lakhs acres which is degraded is to be developed with suitable afforestation. Besides another 10 lakhs acres of barren hills, hillocks, saline, alkaline soils, stream banks etc., are to developed with social forestry. Afforestation and social forestry should be taken up with diversified local species which can yield tree fodder, wild fruits, biomass and other non-timber forest produce, which will support livelihoods, environment and bio diversity with increase in vegetation, moisture in the upper layers of soil, and soil biotic life will be increased besides increase in ground water table. The leaf litter falling on the ground will be converted into humous (soil carbon) due to decomposition. And this process aids in increase of moisture holding capcity, fertility and productivity of the soils. This whole process combats desertification and enhances carrying capacity for agriculture, animal husbandry and other rural livelihoods.

**3.4. Adoption of conjunctive water utilization by formation of "Ananta Water Grid" :**

The water received from Thunga Bhadra Project by the district through High Level Canal and what would be allocated under Handri-Neeva Project should be used to fill the traditional water bodies in the district without using for direct irrigation. Thereby creating an "Anantapur Water Grid". Thus, the soil moisture due to rain, surface water, river waters, ground water are to be linked to supplement and complement each other in order to create a mechanism of "Conjunctiive Water Utilization" in managing irrigation for crops. As a part of this, a system, protective or life saving irrigation for rainfed crops during dry spells can also be adopted. Thus the drought in Anatapur District can be minimized with this protective irrigation. The conjuctive water use will cover larger area

with irrigation, provide a better crop-security, benefit many more farmers.

**3.5. Regulation of ground water utilisation and adoption of micro irrigation through social regulation :**

A policy and a system of sharing of ground water between the farmers having bore wells and those who do to have bore wells is to be adopted in order to save rainfed crops during prolonged dry spells, by giving protective irrigation. Micro irrigation methods are to be followed to save water and get "more crop per drop" of water. A social regulatory mechanism has to be followed in utilization of ground water so as to adopt a more equitable distribution of ground water with non-bore well owners. Ground water regulation, water-sharing and conjuctive use of water will together enhance water synergy, social equity in water usage and also a more equitable spatial distribution of water across the district.

**3.6. Conservation Farming Paradigm (Sustainable Agriculture) to be adopted in the place of Green Revolution Paradigm :**

The Green Revolution Paradigm of agriculture is also known as HEIDA (High External Input Destructive Agriculture) is destructive to environment and people due to its high use of chemicals. It is high cost intensive and so unsuitable for drought prone rainfed farming. It is anti-small and marginal farmers as they could not afford high investments and compete with big farmers. It is only suitable for big farmers and big holdings with irrigation facilities as it operates on big machines like tractors, harvesters etc., which cannot operate in small holdings. So it is totally unsuitable for rainfed agriculture and small and marginal farmers particularly for Anantapur like drought-prone agroclimate.

So, a Conservation Farming System which is eco-friendly, low external input with low cost should be preferred. This paradigm of agriculture is also called "Sustainable Agriculture". It is pro-rainfed farming system and also pro-small and marginal farmers, as it uses low cost local resource based bio-fertilisers and bio pest management and local seeds which can be re used by farmers time and again. Under the Sustainable Agriculture, more and more rainfed tree farming mango, custard apple, tamarind, subabul, sesbania etc., have to be encouraged as local tree crops are more resilient than annual crops. The tree farming has to be with diversified trees for food, fruit, fodder, fibre, biomass, medicinal etc. The tree crops will bring a positive change in the land use from short duration seasonal crops to perennial tree crops and has a positive impact on environment.

**Water intensive crops should be banned :**

Since the district is heading for desertification, the water intensive and long duration crops like paddy, sugar cane, banana, should not be encouraged. Only short duration crops (vegetables, millets, food crops) and rainfed are to be encouraged.

**4. Conclusion : A long term plan for combating drought desertification :**

By following extensively the policies and programmes mentioned above, the water resources can be augmented and environment improved besides achieving

social equity and spatial equity in distribution and utilization of available water and environmental resources. The policy decisions are to be made in this direction and suitable programmes developed. A long term perspective plan in this direction has to be prepared and implemented on war footing. In this process of preparation of action plans and implementation, rural communities, Panchayat Raj Institutions, Water Users Associations, Forest Protection Committees, Watershed Development Committees, Self Help Groups and other Civil Society Organizations are to be appropriately involved. Similarly, various Government departments like Forest Department, District Water Management Agency, Rural Development Department, Minor Irrigation Department, Horticulture, Agriculture, Micro Irrigation, Revenue Department etc., have to work in co-ordination with commitment to the stated goals. It is to be noted that MGNREGS could be extensively used in actual implementation of a number of programmes suggested above.

If the above policies and programmes are strictly followed, droughts and desertification could be combated. A change towards sustainability in agricultural eco-system can be obtained through improvement of water resources and environmental resources. Agricultural Security (including cattle and livestock) rural Livelihood Security and Food Security can be achieved on sustainable basis.

A call today on the occassion of on the World Earth Day 2012 to the Government, particularly policy makers Non-Government Organizations, farmers organization, SMGs and their federations, Civil Society Organizations and people to work in a concern in this direction.

Date : 17-06-2013

# CONJUNCTIVE WATER MANAGEMENT:

## AN APPROACH & TECHNOLOGIES FOR SUCCESSFUL CROPPING UNDER RAINFED CONDITIONS IN ANANTAPUR DISTRICT

*Dr.Y.V.Malla Reddy & Dr. T.Yellamanda Reddy*

**1. Introduction:**

Rainfed farmers of Anantapur district are in severe distress due to repeated crop failures due to droughts. The problem was analyzed,causes were identified and possible solutions are field tested with farmers. It is all done in consultation with the Scientists of Agricultural Research Station, Anantapur, Worldwide literature, farmers of Anantapur, NGO's and Officials of District Administration. AF Ecology Centre tested the approach and technologies on farm with farmers with about 2000 farmers in 8 mandals in Anantapur district. The results clearly indicate the possibilities of not only drought irrigation but also increased crop production across the District provided an enabling policy framework is developed and the approach & technologies are scaled up with appropriate programmes. The emerging concept is "Conjunctive Water Management" to combat drought, enhance agri-production, revitalize rural livelihoods inorder to achieve well being of farmers, farm labour and other in the rural areas in the District.

**1.1 Rainfall analysis indicates certain pattern of drought occurrence:**

The main reason for the droughts is low and erratic rainfall in the district. However rainfall of 25 years in 8 mandals of the project area was analyzed and found certain patterns in the occurrence of droughts.The analysis and important patterns of rainfall causing droughts are as follows.

1. Year to year variation of rainfall is morethan 30% and it ranged from 280 to 750mm.
2. Timely and adequate rains for sowing did not occur in July in 50% of the years.
3. Amount of sowing rain ranged from 10mm to 40mm.
4. The second sowing rain came from 7 to 35 days, after the first sowing rain. (It indicated either delayed sowing or low sowing)

   Thus timely sowing could not be done by farmers in 50% of the years. It is a major cause for droughts. Many a time only partial sowings were done in time.Timely sowing under sufficient moisture condition is a critical factor

for successful crop under rainfed condition. So, many droughts (almost 50%) occurred because the timely sowings did not take place for want of adequate moisture or sown under inadequate moisture where the germination was affected and initial growth was stunted affecting the yields.

5. Dry spells (rainless period of more than 7 days) occurred every year. The number of dry spells ranged from 2 to 4 during the crop season (June to November).The duration of dry spells ranged from 10 to 45 days.Mostly the drought causing dry spells occurred around August. Many years dry spells occurred more than 15 days. In some years 45 days or more also.
6. A rainfall event is beneficial only when it rained more than 10 mm.

   These dry spells are the second most common cause for droughts. Generally rainfed crops like groundnut, millets or pulses survived a dry spell of 15 days. More than that either the yields are diminished or crops totally failed. Thus the incidence of droughts were caused by the longer than 15 days dry spells during the crop life. Generally the intensity of drought depended on the duration of dry spells.
7. Wet spells (continuous rainfall more than 2 days) occured in September and October months.

   When a wet spell occurred of 3 or 4 days particularly at certain stages of a crop,high vegetative growth takes place but yields would come down (deceptive green). And when the wet spells occur at harvest time, particularly groundnut, the produce also get damaged.
8. High rainfall events (more than 40 mm / day)occured are 2 to 6 during the crop season. (Runoff events occured if the rainfall is more than 40mm).

   Based on the detailed analysis of the rainfall two main drought causing trends were identified.

1. Lack of timely sowing in the month of July.
2. Prolonged dry spells (post-sowing) during the cropping season particularly around August.
3. One opportunity is identified in the analysis of rainfall;runoff inducing high rainfall events help in harvesting rain water in farm ponds for subsequent use.

**2. An approach and Technologies for successful cropping under drought conditions: Conjunctive Water Management:**

In order to combat the droughts and enhance the agricultural production, the proposed solution is conjunctive use of water. It involves making the best use of rainfall, (however low & erratic) and supplement it with surface water or groundwater or river waters whichever is convenient. And incorporate technologies, practices systems and infrastructure required for Conjunctive

Water Management. Technologies and practices which are critical for combating droughts and enhancing crop-production are tested with farmers and explained here under:

**2.1 Technologies for timely sowings in the absence of rains in July.**

**2.1.1 Anantha Planter**

The amount of sowing rains required would be 2 rain events of atleast 20 mm each in July with a gap of about a week. The minimum amount of rainfall required for sowing is 20mm to receive in one or two consecutive days. Sowing can be taken for 2 days if the rainfall is 20mm and it can be taken upto 4 days if the rainfall is more than 30mm. The general problem faced by farmers is that with one rain event their sowing in half done or less. For the rest they need another one or two events in July to complete the sowings in time. The conventional sowing equipment covers only about 5 acres in a day of 8 hours of sowing. Since the sowing time available is only 2 to 4 days efficient equipment is needed for rapid sowing with minimum troubles or problems. Anantha Planter is one such equipment developed by Agricultural Research Station, Anantapur.

Anantha Planter is a 8 tynedcultivator with spring tynes. The seeding mechanism is inclined plate mechanism and being moved by ground wheel. Anantha Planter can be used for sowing groundnut, castor, Bengalgram, redgram, sorghum and horsegram by selecting suitable seed disk. Uniformity of seed spacement is achieved by the seed disk and a short distance from hopper to soil. It can cover 15 acres in a day of 8 hours. It enhances the efficiency of sowing time by 100% or more. The strong blade attached to the implement covers the seeds and destroys the germinating weeds. The implement costs about Rs.66,000.The implement was tried 1,300 acres and the results are encouraging. The farmers are happy with the implement.

**2.1.2. Aqua Planter**

Aqua Planter is meant to sow under low moisture conditions. It can also be used even when sowing rains are not received. It is made of Anantha Planter mounted with 2 drums of 200 liters capacity each on the frame.When the planter is in operation, it drills water and seed simultaneously and covers the furrows with blades attached to it. The amount of water required for sowing of crop depends on the soil moisture. For sowing in a dry soil 20,000 liters is required for close growing crops like groundnut, jowar, bajra etc. For castor or redgram 5000 liters of water is sufficient. The quantity of water can be reduced depending on the availability of soil moisture. An area of 4 acres can be sown in a day of 8 hours. The present cost of the machine is Rs.85,000. Aqua Planter was tried in 60 farmer's fields and the results encouraging.

**2.1.3.Row Water Sowing**

Row water sowing technique can be used for wildly spaced crops like castor or redgram in low moisture conditions or in the absence of sowing rains.Shallow

furrows are opened with a plough and seed is placed in the furrow. Water is applied in the furrow through tractor tanker. Furrows are closed by harrowing. The amount of water required is 5000 to 8000 liter per/acre depending in the soil moisture. Six acres can be covered in a day of 8 hours. The cost of water for one tractor tanker of 5000 liter capacity is Rs.700 to 800. A farm pond with lining might be a source of water on the farm itself.Crop sown with row water technique can survive up to one month.This method was tried in 40 farmer's fields and found encouraging.

**2.2. Technologies for addressing prolonged dry spells**

**2.2.1. Lined farm ponds**

A typical size of farm pond is 10mX10mX2.5m for red soils for 5 acres of cultivated field. Farm pond is lined with soil cement mixture in 6:1 ratio. Six parts red soil and one part cement is mixed with water and all sides of the pond is lined with mixture. The farm pond can harvest up to 2.5 lakh liters and retain upto3 months. The stored water can be used for either sowing in time with Aqua Planter or for providing protective irrigation during the dry spells. The minimum amount of water to be applied as protective irrigation depends on the crop. For red gram or castor 8000 to 10000 liter per/acre may be applied by side of row through drip or furrow irrigation method. About 5000 liters per acre is needed for watering of one acre of mango orchard for one irrigation. For close growing crops like ground nut, green gram, sorghum, pearl millet etc. 40,000 liters per acre is necessary. It is to be applied by sprinkler method. The amount of water in farm pond will be sufficient for 5 acres of groundnut for one irrigation or 20 acres of castor or red gram or 5 acres mango orchard for three months. The cost of the lining of farm ponds works out to Rs.6000 (4000 for cement and 2000 for lining). Digging farm pond works out to Rs.10,000 and mostly it is done under MGNRES. Research data available at Agricultural Research Station reveals that the ponds are filled in 24 years out of 25 years. Farm ponds were filled at least twice in a year for 20 years out of 25 years. The run off causing events in several mandals are more than two in a year.

Twenty farm ponds are lined in the project area during the year 2014-15 when the rainfall was 50% deficit during the crop season. Out of them, 18 filled once, five filled twice and one filled thrice. Most of the farmers used the water for watering mango plants. Each farm pond was able to provide water for three months for 5 acres.

**2.2.2. Protective irrigation for red gram**

Row irrigation technique was used for providing protective irrigation to widely spaced crops like castor or red gram. The method of irrigation is either by drip or by furrow irrigation. The quantity of water to be applied is 5000 to 10000 litres per acre. Protective irrigation is provided when dry spell is more than 15 days.

Castor is sensitive at seedling stage and flowering stage where as red gram is sensitive at flowering stage. Tractor tanker is used for this purpose.

In the project area, protective irrigation was given to 100 acres in 2013 and 1000 acres in 2014. It was given to inter cropped red gram after harvest of the groundnut in the month of November. The yield increase in red gram is 75 to 100%.

**2.2.3. Protective irrigation to groundnut**

Groundnut is sensitive to moisture stress particularly at pod development stage. Protective irrigation was given with mobile sprinklers when the dry spell is more than 15 days. The amount of water applied was 40,000 liter per acre. Sprinkler irrigation was given with tractor with a unit called PTO for pumping water or for running sprinklers. A PTO unit costs is Rs. 8000/-. Eight raisers of sprinklers were used each time for one tank of water. Total 8 tanks of water was needed for one irrigation. The increase in yield was 25 to 40%. These trials were done in 10 acres. In addition 100 acres of different crops like tomato, sunflower, rice, citrus and vegetables were saved with mobile micro irrigation unit.

Markets are also emerging, where in water is being sold at Rs.300/- to Rs.800/- per 5000 litres.

However purchasing water, transporting by a tanker and providing irrigation is expensive and benefit to the farmer might be diminished.

**3. Conjunctive Water Management: A sustainable approach to not only drought mitigation but also higher crop yields.**

**3.1 Not only drought mitigation even yields can be increased atleast by 50%:**

The above experiments essentially indicate a feasible approach to drought-proofing in the chronically drought-prone District of Anantapur and other similar agro-climatic conditions. Significantly they even indicate that the yields of rainfed crops could be enhanced by more than 50%. For eg., the average yield of groundnut under rainfed condition in Anantapur is about 400 kgs. per acre, whereas the same under irrigated condition is 800 to 1000 kgs. Obviously the difference is attributed to timely watering and better crop management practices.

Therefore a Conjunctive Water Management approach is proposed. When rain moisture is supplemented during the dry spells sufficiently with surface water or ground water, not only the droughts could be combated but also yields could be enhanced by atleast 50% if not more. The analysis of rainfall and the pattern in the incidence of droughts proved that one to three dry spells are causing droughts. If these dry spells are dealt with supplementary irrigation, using available surface water or ground water or river waters then there is no drought. Further under assured supplementary irrigation conditions, the farmers would also improve the crop management practices the same as under irrigated conditions and that would ensure higher yields by 50% or more.

Neither the dry spells nor the rains occurred uniformly in the District. There are always some parts of the District better off than others. So the water requirement would be varying depending on how much area is affected by dry spells at any given time. General tendency is about 50% of the cultivated area may be in need of a couple of supplementary irrigations in a crop season.

Another significant thing is that the entire cultivated land in Anantapur of 27.5 lakh acres both rainfed and irrigated can be cropped and protected with supplementary irrigation for Kharif season. Additionally the entire irrigated land under bore wells can be commanded for second crop in the Rabi season.

### 3.2 Enabling conditions for an effective conjunctive water management:

#### 3.2.1 Farm ponds for every 3 to 5 acres:

Farm ponds with lining for proper on-farm rain harvesting and storing without seepage should be constructed for every 5 acres or less across the District. Thus the water for atleast one supplementary irrigation is made available right on the farm, which might serve for timely sowing or supplementary wettings during the dry spells.

#### 3.2.2 Fill-up the Water bodies (Anantha Jalavalayam) with water from HNSS Project:

There are about 3000 small and medium water bodies like big check dams, kuntas and cheruvus in the District. They receive some water by rain and they need be filled with water from HNSS project for maximizing the benefit of Conjunctive Water Management. It is called Anantha Jalavalayam (Anantapur Water Grid). It serves 4 very important purposes. Viz. (1) Recharges the groundwater, (2) Makes water available across the District for supplementary irrigation for rainfed crops during dry spells. (3) It provides water for cattle, birds, wild life etc. (4) it provides water for fisheries and other livelihoods like washer men.

#### 3.2.3 Quantity of Water required for supplementary irrigation to rainfed crops:

With the surface water spread across the District, supplementary irrigations could be easily provided by farmers themselves using mobile sprinkler / drip systems for entire rainfed land of about 25 lakh acres in the District. Some calculations have been done by us to arrive at quantity of water required for supplementary irrigation. One TM Cft., of water can command **2.33** lakh acres for supplementary irrigation with a 30 mm wetting. Thus to provide one supplementary irrigation to 25 lakh acres **10.73** TM Cft., of water is needed. A 30 mm. wetting is too luxurious. Generally a 20 mm. wetting is sufficient for closely spaced crops like groundnut, jowar, bajra, foxtail millet etc. For widely spaced crops like red gram or castor for providing row irrigation, they need only about 10000 litres. So with one TM Cft. of water, supplementary irrigation can be given up 10 lakh acres for castor or redgram.

Our rough calculations show that 20 to 25 TM cft of water is needed to fill up all the small & medium water bodies, excluding transmission seepage during distribution of water to the water bodies. Even the transmission seepage would recharge the borewells along side the distribution channel. And an estimated 5 TM cft water on average is anyway received by the water bodies by the normal rain. So, about 20 TMC of water may be needed for filling the water bodies in the District.

**3.2.4 Policy imperatives for Conjunctive Water Management:**

1. Construction of Farm Ponds with lining must be made compulsory for every 5 acres or less.
2. HNSS project water to be allocated for filling the 3,000 + small and medium water bodies across the District.
3. Anantha JalaValayam (Anantapur Water Grid) – a water distribution canal network for filling the 3,000 + water bodies has to be constructed together with appropriate intermediate balancing reservoirs at strategic higher locations.
4. Water in all the water bodies should be classified as "Common Property Resource" with rights for use by all farmers for supplementary irrigation of any crop, rainfed or otherwise including tree crops and orchards. And right for use of water by washer men and other rural artisanal livelihoods like pottery etc. be provided.
5. Equipment like Anantha planter, Aqua planter, and Mobile Micro Irrigation system for drip and sprinkler irrigation may be owned and managed by SHGs, VOs, MMS etc., through custom hiring to the farmers.
6. Ground water utilization has to be regulated and made equitably available as much on possible. Water sharing by the bore-well farmers with the neighboring rainfed farmers be made compulsory for supplementary irrigation of rainfed crops during the dry spells.

**4. Conclusion:**

The conventional approach to combat droughts is to provide flood irrigation through major irrigation projects. That way one TM cft of water commands 5000 acres of paddy or 10000 acres of Irrigated Dry crops. So the conventional approach is not feasible to combat drought and augment rural livelihoods across Anantapur District. An approach of Conjunctive Water Management, where in the rain moisture is supplemented with surface water, project water and ground water, particularly to bridge the dry spells during the crop season is proposed. This approach will not only combat droughts but also enhance the yields under rainfed conditions by atleast about 50%. It will have a ground-breaking positive impact on rainfed agriculture, irrigated agriculture and other rural livelihoods. The rural livelihoods and the rural economy could be improved substantially leaving behind the agriculture crises, rural distress, droughts and distress migration.

Dt: 16.06.2015

# CONJUNCTIVE WATER MANAGEMENT

## AN APPROACH DROUGHT PROOFING RAINFED AGRICULTURE

### 1. Simple facts of Rainfed crops in Ananatapur District:

- Rainfed Crop season is between June & November (Kharif)
- Major rainfed crops are: groundnut, red gram, castor and some millets & pulses.
- Rainfed crops are sown in June – July and harvested before November – except for
- Red gram & Castor which can go upto January
- The crop duration ranges from 70 days (millets & pulses) to 120 days, groundnut 110-120 days and red gram upto 180 days.
- Generally they need a rainfall of about 20 mm each time for every 10 to 15 days for the duration of the crop.

### 2. Simple analysis of why how droughts occur:

- Thus crops need 5 to 10 rain events after sowing at the interval of about 10 to 15days each. No. of rain events required would depend on the duration of the Crop.
- Typically the droughts occur because of longer dry-spells beyond 15 days- Sometimes even upto 45 days during the crop season.
- Analysis of dry spells causing droughts in Anantapur district show that most droughts occurred because of two such dry spells – ranging from 15 to 45 days.
- More incidence of dry-spells causing droughts occurred in the month of a) July at the time of sowing and b) between 15$^{th}$ August to 15$^{th}$ September.
- So, if two "protective irrigations" are facilitated during the dry-spells, majority of droughts could be averted.
- However dry-spells do not occur uniformly across the Ananatapur District or Districts of Rayalaseema.

### 3. So the central question is : How can we provide protective irrigation during the dry spells?

**The answer is " Conjunctive Water Management".**

### 3.1 Available water is categorized into 4 types as follows:

- Soil moisture from rainfall : (generally lasts 10 to 15 days after a rain even of about 20 mm or more)

- Surface water: Rain Water harvested locally into surface water bodies like Farm ponds, Check dams, Kuntas, Cheruvus (Tanks).
- Ground water: Bore wells, Open wells.
- River water: Water from major irrigation project like TBHLC, HNSS etc.

### 3.2 What is Conjunctive Water Management?

- It is convergence of available sources of waters at farm level when there is a long dry spell ie., more than 10 or 15 days.
- It is supplementing soil moisture form rainfall with other available sources of water.
- The other available sources waters is a) Surface Waer from water bodies like Farm Ponds or Tanks b) ground water through bore wells ) River Water from major irrigation projects like TBHLC, HNSS.
- It is a water-grid created, combining all 4 types of water and making it available for the rainfed crops whenever there is need.

### 4. How to create a Water Grid- I called it " Anantapur Water Grid".

- Construct Water Supply Channels from major reservoirs like PABR, Jeedipalli, MPR etc. in order to fill up all the Cheruvus, Kuntas etc., across the district.
- Every year Cheruvus and Kuntas get filled partially by the normal rains.
- Top- fill the Cheruvus and Kuntas with river waters from the reservoirs. Thereby the surface water is augmented with river water and made available across the district.
- Thus the surface water bodies will recharge the ground water and bore wells across the District. Thus the Ground water is augmented with river water for recharging the borewells.
- The augmented surfaced water and borewell water is made available for " Protective Irrigation" for rainfed crops during dry-spells.

### 5. How to provide protective irrigation to rainfed crops.

- Use portable diesel oil engine for lifting the water from Farm Ponds (when available ) for providing protective irrigation using mobile drip or sprinkler systems.
- Use tractor with tanker for mobile drip or sprinkler by transporting water from surface water bodies like Chervu and Kuntas.
- Use mobile sprinkler for closely spaced crops like groundnut and millets like Jowar, Bajra, fox-tail millet etc.
- First use the water from Farm Pond when available.

### 6. Crop-production can be enhanced by 50% or more with additional supplementary irrigations.

- There are two concepts of Conjunctive Water use.
- One is "protective Irrigation" during the long dry-spells, just to protect the rainfed crops from droughts and obtain normal yields under rainfed conditions.

- Another concept is additionally providing " Supplementary Irrigation to enhance crop production to an optimum level, above the normal yields under rainfed conditions.
- **Take groundnut example to illustrate the point.**

➢ The normal yields of groundnut under rainfed condtions in the absence of dry-spells is around 400 Kgs/acre.

➢ With protective Irrigation during dry-spells the average yields are 400 Kgs an acre could be maintained.

➢ With additional supplementary irrigations as needed by the crop, like under irrigation, the yields can go up 800 Kges an acre.

- Supplementary irrigation goes beyond protective irrigation as an additional opportunity in the years when adequate surface / ground water is available for enhancing the crop yields beyond the rainfed yields.

**7. Requirement of Water for protective irrigation.**

**A. Using sprinklers for closely space & crops like groundnut, Jowar, Bajra, Foxtail millet etc.**

- To provide 20 mm of sprinkler irrigation (i.e., one plough deep or padunu) for one acre 2858 cubic feet or _______litres of water is required.
- Thus One Trillion Million Cubic Feet (TMC) can irrigate 3,50,000 acres for one time at 20 mm of sprinkler irrigation.
- If two times protective irrigations are given 3,50,000 /2 = 1,75,000 acres can be covered with one TMC for protective irrigation.

**B. Using drip irrigation for widely spaced crops like Redgram or Caster:**

- A portable diesel pump set or tractor with pro pump can be used to pump the water from the Farm Pond.
- A tractor with tanker can be used to transport the water from the source to the farm.
- The water tanker should be placed on a higher elevation with in the farm in order to provide gravity pressure for drip lines.
- Spread the mobile drip irrigation system along the row.
- The rows are normally 5 to 6 feet between the rows.
- The rows will be watered by gravity as long as they pressure in sufficient. Then shift the tanker to cover the rest of the row.
- The drip irrigation to caster or redgram takes only half of the water of sprinkler irrigation.
- Thus one TMC of water can irrigate one time upto 7 lakh acres.
- If two protective irrigation are given, one TMC can irrigation upto 3.5 lakh acres.

# అంతర్జాతీయ భూమాత దినోత్సవం ఏప్రిల్ 22,2013

## 1. పరిచయము :

ప్రతి సంత్సరం ఏప్రిల్ 22 వతేదీన అంతర్జాతీయ భూమాత దినోత్సవాన్ని జరుపుకోవాలని 1970వ సం॥లో ఐక్యరాజ్య సమితి ఏకగ్రీవంగా నిర్ణయించింది. అందు మూలంగా 1970వ సం॥ నుండి ఏప్రిల్ 22 వతేదీన అంతర్జాతీయ భూమాత దినోత్సవాన్ని ప్రపంచములోని అన్ని దేశాలు (193 దేశాలు) జరుపుకుంటున్నాయి. కాబట్టి, ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ కూడా భూమాత దినోత్సవాన్ని అనంతపురములో జరుపుకోవాలని నిర్ణయించింది.

## 2. అంతర్జాతీయ భూమాత దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాలి?

భూమాతను రక్షించుకోవడానికి ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ నడుం బిగించాల్సిన అవసరముంది. ఆలస్యమైతే భూమాతకు తీరని ముప్పు వాటిల్లి, మనిషికి, మరియు యావత్ ప్రాణకోటి ఉనికి లేకుండా పోయే ప్రమాదం ఉంది. అడవులు, వృక్ష సంపద నశించిపోతున్నాయి. జీవ వైవిధ్యం నశిస్తున్నది. భూతాపం పెరిగిపోతున్నది. భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. ఆహారోత్పత్తి తగ్గిపోతున్నది. భూగోళమంతా, మానవుడు కాదు కదా, ఏ ప్రాణి జీవించలేని ఎడారిగా మారిపోతున్నది. ఈ పెను ప్రమాదం నుండి భూమాతను రక్షించుటకు వ్యక్తులను, సంస్థలను కార్యోన్ముఖులను చేయవలసి ఉంది. భూమాత దినోత్సవ ఉద్దేశ్యాలు ముఖ్యంగా రెండు.

మొదటిది : ప్రతి వ్యక్తిలోను, ప్రతి సంస్థలోనూ భూమాత ఎదుర్కొంటున్న ప్రమాదంపై అవగాహనను పెంచి, చైతన్య పరచడం మరియు భూమాతను రక్షించుకోవటానికి కల మార్గాలపట్ల అవగాహన పెంపొందించడం.

రెండవది : అవగాహన కల్పించి, చైతన్య పరచడంతో పాటు, ప్రతివ్యక్తి తన విలువలను, నమ్మకాలను,,అలవాట్లను, ఆలోచనలను, ఆచారాలను, సంస్క ృతీ సాంప్రదాయలను భూమాతను నష్టపరిచేవి గాకుండా, సంరక్షించే విధంగా సమాజంలో మార్పు తీసుకొని రావడం, ఇవి అంతర్జాతీయ భూమాత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు.

**3. మానవజాతికి, భూమాతకు మధ్యగల సహజ సంబంధము, సఖ్యత :** **మానవజాతికి భూమాతకు ఉన్న "సహజ సంబంధాన్ని మనము అర్థము చేసుకోవాలి. సృష్టిలో మానవుడు అత్యున్నత ప్రాణి. మంచి చెడులను విచక్షణ చేయగల తెలివి, వివేకము ఒక్క మానవునికే వుంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానము, నాగరికత, సంఘ జీవనము మానవజాతికే సాధ్యము. మానవుడు ఇప్పటికే లక్షల సంవత్సరాలు జీవించాడు. ఇంకా అనేక వేల సంవత్సరాలు అంతము లేకుండా జీవించవలసి వుంది. మనిషి లేకపోతే భూమి సుసంపన్నంగా వుంటుంది. కానీ భూమి లేకుండా మనిషి జీవించడం ఊహించుకోలేము. సృష్టిలో అనేక జీవరాశులు అంతరించిపోతున్నాయి. కానీ, మనిషి ఏనాటికీ అంతరించి పోవడానికి వీలులేదు.. భూమాత ఉన్నంతకాలము మానవజాతి ఉండి తీరాలి. కాబట్టి మనిషికి భూమాతకుగల**

**"సహజ సంబంధము" పరస్పర ఆధారము. సఖ్యత, పరస్పర పోషణ, విడదీయలేనిదని. అంటే భూమి మనిషిని పోషిస్తుంది. తన మనుగడ కోసం మనిషి భూమిని పోషించాలి. అంటే భూమి-మనిషి పరస్పర పోషణ, సఖ్యత సంరక్షణలో సహజీవనం చేయడం అనివార్యం. భూమికి-మనిషికి మధ్య పోటీ అనివార్యమవుతుంది. మనిషికీ-మనిషికీ మధ్య పోటీ పెరగడం వలననే మనిషికి-భూమికీ మధ్య వైరుధ్యము ఏర్పడుతున్నది. ఇంకొక్క విషయం కూడా మనిషి గుర్తుంచుకోవాలి.**

ఇదే మంటే ఒక్క భూగ్రహం మీదనే జీవరాశులు ఉన్నాయి. నవగ్రహాలలో మిగిలిన ఏ గ్రహంపైనా జీవరాశులున్నట్లు ఆనవాళ్ళు లేవు.. కాబట్టి మనిషి వేరే ఏ గ్రహం పైకి పోయి నివసించే అవకాశము లేదు.

## 4. భూమాతకు ఇంత ప్రమాదం ఎందుకు వచ్చింది?

సమస్త ప్రాణికోటిని, జనాభాను భూమాతే భరించాలి, పోషించాలి. అయితే ఆ భూమాత అన్ని దేశాలలోనూ, అన్ని ప్రాంతాలలోనూ అనేకానేక అరిష్టాలతో, అవాంతరాలతో కొట్టుమిట్టాడుతూ, తల్లడిల్లిపోతున్నది. నాగరికత అభివృద్ధి చెంది, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతూ పోయినప్పటికీ భూమాత సంరక్షణ గురించి పట్టించుకోకుండా, భూమాత తనలో దాచుకొన్న సహజ వనరులన్నింటినీ, అంటే నేల, నీరు, వృక్షసంపద, గనులు విచక్షణ లేకుండా దోపిడీ చేయడమూ, వృథా చేయడమూ అతిగా దుర్వినియోగం చేయడము జరుగుతున్నది.

గాంధీ మహాత్ముడు చెప్పినట్లు భూమాత మనందరి అవసరాలను తీర్చగలదు. కానీ మన దురాశలను తీర్చలేదు. వ్యక్తులలోనూ సమాజాల్లోనూ నానాటికీ పెరుగుతున్న స్వార్థం, దురాశ, వినిమయ సంస్కృతి, వస్తు దాహం, పోటీతత్వం భూమాత భక్షనకు కారణాలుగా మనం గుర్తించాలి.

ఇప్పటికే ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉన్నది. తొందరలో ప్రపంచ జనాభా 900 కోట్లు చేరుకుంటున్నది. రాబోయే 50 సంవత్సరాలలో ప్రపంచ వ్యాప్తంగా తిండి గింజల అవసరం రెట్టింపు అవుతుందని అంచనా వేసినారు. జనాభా పెరిగే స్థాయిలో తిండి గింజల ఉత్పత్తి పెరగడం లేదు. నీటి అవసరం కూడా రెట్టింపు అవుతుందని అంచనా వేసినారు. విద్యుచ్ఛక్తి వినియోగం కూడా రెండింతలు పెరుగుతుందని అంచనా వేసినారు. భవిష్యత్తులో మానవమనుగడకు అవసరమైన తిండి,నీరు, విద్యుచ్ఛక్తి అవసరాలు తీర్చే పరిస్థితి భూమాతకు లేదని భూగోళశాస్త్రజ్ఞులు, పర్యావరణ వేత్తలు, ఐక్యరాజ్యసమితి తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తూ వున్నారు. ఒక ప్రక్క దురాశ, వస్తు దాహం, వినిమయ సంస్కృతి పెరిగి, పారిశ్రామికీరణ వేగవంతమై, సహజవనరుల దోపిడీ పెరిగి, పర్యావరణం తీవ్రంగా పాడైపోతున్నది. తద్వారా భూమి ఉత్పాదకత దినదినానికి తగ్గిపోతున్నది. కానీ, ఇంత 'అభివృద్ధి' సాధించినా, ప్రపంచ జనాభాలో సగం మంది మాత్రమే భూమాత ఫలాలను అన్నీ వారి అవసరాలకు మించి అనుభవిస్తూ, మిగిలిన సగం మంది కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారు.

ఈ పరిస్థితులలో సహజ వనరుల అధిక దోపిడీ వలన భూమాత నిర్వీర్యమైపోయి, మానవ జాతి అనేక సంక్షోభాలను ఎదుర్కోబోతున్నదని, మానవ జాతి మనుగడకే ముప్పు పొంచి ఉన్నదనీ భూగోళ శాస్త్రజ్ఞులు, పర్యావరణ వేత్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. గడచిన శతాబ్దంలో పర్యావరణ వినాశనం, భూతాపం పెరగడం, కర్బన ఉద్గారాలు పెరగడం, వాతావరణం వేడెక్కడం, జీవవైవిధ్యం నశించడం, ఎడారీకరణ పెరగడం భూఉత్పాదకత కోల్పోవడం మొదలగు తీవ్ర సమస్యలు ఉత్పన్నమైనాయి. ఈ సమస్యలు మానవాళి అభివృద్ధికి తీవ్ర విఘాతం కల్గిస్తూ, ప్రపంచస్థాయిలో పెను సవాళ్ళుగా ముందుకొస్తున్నాయి.

## 6. సమన్వయ మూలకాలు అత్యాశ, వినిమయ సంస్కృతి, పోటీతత్వంతో కూడిన జీవన విధానం

ఒకప్పుడు పూర్వీకులు భూమాతను పవిత్రంగా, దైవంగా భావించి భూమాత ఇచ్చిన సహజ వనరులైన నేల, నీరు,వృక్ష సంపద, పశుపక్ష్యాదులను, భూగర్భ వనరులను ఏమాత్రము వృధా చేయకుండా తమ జీవనానికి అవసరమైనంత వరకూ ఉపయోగించుకొని, తిరిగి ఆ వనరులను పోషించి, సంరక్షణ చేసేవారు. అందుకే ఆ రోజు భూమాత సమృద్ధిగా, నిత్యనూతనంగా, జీవవైవిధ్యంతో, పచ్చదనంతో నిగనిగాలాడేది. అదే ఈ రోజు విచ్చలవిడిగా భూమిని దుర్వినియోగం చేయుట వలన ఉష్ణతాపం పెరిగి, పచ్చదనం నశించి, భూమి నిర్వీర్యమై జీవరాశులు జీవించలేని ఎడారిగా మారిపోతున్నది. విచక్షణారహితమైన వస్తు "వినిమయ ఉత్పత్తి"తో ముడిపడిన మన జీవన విధానము మరియు అందుకు అనుగుణంగా జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధి, తద్వారా సంభవించిన ఆర్థికాభివృద్ధి సహజ వనరులను విచ్చలవిడిగా వాడేసి, భూమాత వినాశనానికి కారణభూతమౌతున్నాయి. దీని కారణంగా మానవజాతికి భూమాతకు (సహజవనరులకు) మధ్య సఖ్యత సహజీవనం కుదరడం లేదు. సహజవనరుల సంరక్షణను మరచి, వాటిని దురాశతో పోటీ తత్వంతో వినియోగించుకుంటున్నాడు మనిషి. తాను క్రింద పడిపోతాననే కనీస వివేకం లేకుండా తాను కూర్చున్న కొమ్మను వేగంగా తానే నరికేసుకొంటున్నాడు. సహజవనరులైన నేల, నీరు, అడవులు, భూగర్భ సంపద (ఖనిజ సంపద)ను పోటీపడి కొంత శాతం జనాభా మాత్రమే అత్యాశతో వినియోగంతోపాటు అధికంగా వృధా కూడా చేస్తున్నారు.

## 7. మన జిల్లాలో భూమాత పరిస్థితి :

ఇక మన జిల్లా భూమాత పరిస్థితికి వస్తే, భౌగోళిక కారణాల వల్ల, తక్కువ వర్షపాతం వలన ఇప్పటికే నిత్యకరువులను మన తాతల కాలం నుండి వారసత్వంగా పొందిన మనకు అదనంగా పైన చెప్పిన భూతాపం, కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పులు గోరుచుట్టుపై రోకలిపోటుచందంగా మారి, వ్యవసాయ సంక్షోభం పెరిగి రైతులు తీవ్ర దుర్భిక్షాన్ని అనుభవిస్తున్నారు. ఒకప్పుడు వున్న అడవులు ఇప్పుడు లేవు. జీవరాసులకు సేదదీర్చే చెట్లు పంట పొలాలలో అసలే లేవు. జీవవైవిధ్యం లేదు. జీవావరణం ఉనికి లేదు. మన జిల్లా భూభాగం మీద దాహంతో తల్లడిల్లుతున్న ఎడారీకరణ తప్ప పచ్చదనం మచ్చుకైనా కన్పించలేదు. కరువుల్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మన పూర్వీకులు నిర్మించిన వేలాది చెరువులు, కుంటల్ని నిర్లక్ష్యం చేసి, వాటి ఆనవాళ్ళు లేకుండా చేస్తున్నాము. కొందరి అత్యాశతో తరిగిపోతున్న భూగర్భజలాలు, ఎండిపోయిన బోడి కొండలు, నదీగర్భంలో ఇసుక తవ్వకాలు– అన్నీ కలిసి శాశ్వతంగా తీవ్రమైన నీటి కరువులను సృష్టిస్తున్నాయి. నీటి జాడ లేకుండా చేస్తున్నాయి. గడ్డి నీరు లేక గ్రామాలలో పశువులు, పక్షులు అంతరించిపోతున్నాయి. జీవనానికి అవసరమైన వనరులు లేక అడవి పందులు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు, నెమళ్ళు – ఇవన్నీ గ్రామాలను ముట్టడిస్తున్నాయి. మనం మేలుకొనకపోతే, భూమాతను, నీటి వనరులను, జీవవైవిధ్యాన్ని యుద్ధప్రాతిపదికన రక్షించుకొనకపోతే రాబోయే రోజుల్లో మనుషుల మనుగడకే గాదు ఏప్రాణి జీవించేందుకు అవకాశంలేని ఎడారి ప్రాంతంగా మన జిల్లాను మార్చబోతున్నాము. దీని మీద మనం వెంటనే తీవ్రంగా స్పందించాలి.

ఎడారి నివారీకరణ దిశగా ఉధృతంగా చర్చలు చేపట్టాలి. ఎడారీకరణ నివారణకు రాజకీయ సంకల్పంతో పాటు సామాజిక సంకల్పం కావాలి. నిర్దిష్టమైన ఒక కాలవ్యవధి గల ప్రణాళిక కావాలి. ప్రణాళిక అమలు చేయడంలో గ్రామాలలో రైతుల భాగస్వామ్యముతో పాటు, పంచాయతీరాజ్ సంస్థలు ఇతర గ్రామస్థాయి సంస్థల భాగస్వామ్యము కావాలి. వివిధస్థాయిలలో పౌరనిఘావ్యవస్థలు ఏర్పడాలి.

## 8. మన తక్షణ కర్యవ్యము :

మొదటి సారిగా భూమిపైన మానవుని శాశ్వత నివాసము ప్రశ్నార్థకమౌతున్నది. ప్రస్తుతం మానవాళి ఉనికికి సంబంధించి రెండు ముఖ్యమైన ప్రశ్నలు ప్రపంచస్థాయిలో పర్యావరణవేత్తలను, కార్యకర్తలను, ప్రభుత్వాలను వేధిస్తున్నాయి. అవి (1) మానవాళి మనుగడ సాగిస్తూనే భూమాతను సజీవంగా, స్థిరంగా వుండునట్లు ఎట్లా రక్షించుకోవాలి.? (2) తొందరలో 900 కోట్లు దాటుతున్న జనాభాను స్థిరంగా పోషించాలంటే, వారి అవసరాలు తీరాలంటే భూమాతను ఎట్ల అభివృద్ధి చేయాలి? ఈ తీవ్ర సమస్యలపై ప్రజలలో అవగాహనను, చైతన్యాన్ని పెంచి భూమాత ఎల్లప్పుడు సజీవంగా, స్థిరంగా ఉండే విధంగా వ్యక్తులను, సమాజాలను ప్రోత్సహించదానికి, కార్యోన్ముఖులను చేయదానికి ఈ భూమాత దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము. ప్రస్తుత మానవుని జీవన విధానంలో పెట్రేగుతున్న వస్తు దాహాన్ని, వినియమ సంస్కృతిని, అత్యాశను తగ్గించి, తద్వారా భూమాత అందించిన వనరులను (అడవి, నేల ,నీరు మొ॥) విచ్చలవిడిగా దోపిడీ చేసే విధానాన్ని అరికట్టాలి. భూమి సజీవంగా సుస్థిరంగా వుంచే విధంగా మానవుని విలువలలో జీవన విధానంలో, సంస్కృతి, సాంప్రదాయలలో మార్పురావాలి. అంటే మనిషి జీవన విధానంలో వస్తుదాహం ఆడంబరాలు, అత్యాశ పోయి నిరాడంబరతతో కూడిన మానవ విలువలు రావాలి. దైనందిన జీవనంలో వనరుల వినియోగంలో వృధాను తగ్గించి, “భూవనరుల సంరక్షణ” ఒక “సామాజిక నీతి” మార్గంగా మార్చుకోవాలి. ప్రజల మధ్య పోటీ వ్యవస్థపోయి, మానవత్వం, పరస్పర సహకార వ్యవస్థ, జీవకారుణ్యము రావాలి. మనిషికి, మనిషికి మధ్య సఖ్యత, సహజీవనం, ఇతరులతో పంచుకోవాలనే మానవ విలువలు రావాలి. వనరుల పంపిణీలోనూ, వినియోగంలోనూ సమన్యాయం తీసుకొనిరావాలి. ప్రకృతి ధర్మాలను గౌరవించాలి. మనిషిలో ప్రకృతిని జయిద్దాం, నియంత్రిద్దామనే అహంకారము పోయి నిరాడంబరంగా ప్రకృతితో మానవుడు సఖ్యతతో సహజీవనం చేయాలి. అప్పుడే భూమాత సమృద్ధిగానూ, సజీవంగానూ, ఆలోచనలలోనూ, అలవాట్లలోనూ, ఆచార వ్యవహారాలలోనూ తగిన మార్పు రావాలని ఆశిస్తున్నాను.

మనమందరం ఈ సామాజిక మార్పుకోసం కృషిచేయాలని పిలుపునిస్తూ....... ఏప్రిల్ 22 వతేదీన ఉదయం 10 గంటలకు లలితకళాపరిషత్‌లో జరిగే అంతర్జాతీయ భూమాత దినోత్సవంలో పాల్గొనవలసినదిగా మీకిదే ఆహ్వానం.

తేదీ : 22-04-2013

# అనంత ఎడారిలో చెరువులు, కుంటలే ఒయాసిస్సులు

అనంతపురం జిల్లా ఒక ఎడారే! ఆ ఎడారిలో జీవనానికి చెరువులు, కుంటలే ఒయాసిస్సులు. మన జిల్లాలో వున్నన్ని సముద్రాలు, సాగరాలు, కుంటలు, ఏరులు, మరి ఏ జిల్లాలోనూ లేవంటే లేవు ! మన అనంతపురం జిల్లాలో వున్న అనేక గ్రామాల పేర్లు 'సముద్రం' 'చెరువు' 'సాగరం', 'కుంట', 'ఏరు', వంకలతోనే ముగుస్తాయి. అందుకే మన జిల్లాలో జనజీవనం "నల్లచెరువు", "రామసాగరం", "చోళసముద్రం", "కాలవపల్లి", "ఇప్పేరు", "వంకరకుంట", "బ్రహ్మసముద్రం", "బుక్కరాయ సముద్రం" లతో గట్టిగా ముడిపడి సాగుచున్నది. అవే మన గ్రామాలు – అవే మన నాగార్జున సాగర్‌లు, శ్రీశైలాలు, బంగాళా ఖాతాలు. అనంతపురం జిల్లాలో దాదాపు 3300 జనావాస గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను ఆదుకొంటూ, దాదాపు 7000 చిన్న నీటి వనరులు ఉన్నాయి. అంటే ప్రతి గ్రామానికి సరాసరి రెండు చిన్న నీటి వనరులు ఉన్నాయి. అవే చెరువులు, కుంటలు, తలిపిరులు, కట్టుకాలవలు మొదలగునవి. ఇందులో కొన్ని పెద్ద చెరువులు కూడా వున్నాయి. అవి అనంతపురం చెరువు, ధర్మవరం చెరువు, బుక్కపట్నం చెరువు, హిందూపురం చెరువు, కంబదూరు చెరువు మొదలగునవి. దాదాపు ఈ చిన్న పెద్ద సాంప్రదాయ నీటి వనరులు అన్నీ విజయనగర రాజులైన శ్రీ కృష్ణదేవరాయల వంశస్థులు కట్టించినవే. ఇవన్నీ 13, 14, 15 శతాబ్దాలలో నిర్మించబడినవి.

ఆనాడు పాలకులు, ప్రజలు చెరువుల్ని, బావులను, ఒక్కరేణిలను తవ్వించడం పుణ్యకార్యంగా భావించేవారు. చెరువుల్ని తవ్వించిన వారికి, వాటిని మరమ్మత్తులు గావించిన వారికి స్వర్గం ప్రాప్తిస్తుందన్న విశ్వాసం ఆనాటి ప్రజలలో బలంగా ఉండేది.

చెరువులు, కుంటలు కట్టించడాన్ని "సప్తసంతానంగా" పరిగణించినట్లు క్రీ.శ. 1538 కి చెందిన ఒక శిలాశాసనం ద్వారా తెలుస్తున్నది. మరొక క్రీ.శ. 1540 కాలపు శిలాశాసనంలో "దేవుళ్ళు, మనుషులు, పశువులు, గాంధర్వులు, భూతాలు అందరూ కూడా చెరువు ఆధారంగా జీవిస్తారని చెబుతూ ఏ చెరువులోని నీటితో తీర్చుకుంటే, ఆ చెరువును తవ్వించిన వ్యక్తి అశ్వమేధయాగం చేసిన దానితో సమానమట. (పేజి. 82, విజయనగర – ద థర్డ్ డైనాస్టీ నుండి)

మరణించిన తమ తల్లిదండ్రులకు స్వర్గప్రాప్తి లభించడానికి వారి వారసులు, చెరువో, తటాకమో నిర్మించాలన్న అభిప్రాయం చాలా బలీయంగా ప్రజల్లో నాటుకుపోయినట్లు కనపడుతుంది. కనీసం ఒక ఏటి కాలువయినా నిర్మిస్తే, భగవంతుని అనుగ్రహం లభిస్తుందని వారి విశ్వాసం.– (ఎస్.ఎం.బాషా, కదలిక)

జిల్లాలో మనుషులకే కాదు అనేక ప్రాణికోటికి ఈ చిన్న నీటివనరులే జీవనాధారము. వర్షాధార "పంట కరువులకు" నిలయమైన మన జిల్లాలో కొంతకు కొంతైనా "నీటి కరువు"ను తగ్గించుటలో, సాంప్రదాయ నీటి వనరులైన కుంటలు చెరువులే కీలకం. పశుపక్ష్యాదుల "నీటి కరువు" ను మరియు "మేత కరువు" ను కూడా అధిగమించడానికి చెరువులో నీరు, చెరువు గర్భములో గడ్డే

కీలకం. తిండి కొరతను అధిగమించడానికి ప్రత్యక్షంగా చెరువు క్రింద పండే సాగు పంటలే కాదు, ముఖ్యంగా భూగర్భజలాల అభివృద్ధికి మన జిల్లాలో చెరువులే కీలకం. తద్వారా బావులకు, బోరుబావులకు చెరువులే ఏకైక నీటి ఆధారము. అనంతపురం జిల్లాలో అన్ని రకాల సాగునీటికి చిన్న నీటి వనరులే ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను కీలకం. చేపల పెంపకానికైనా, బట్టలు ఉతకడానికైనా, పశువులకైనా, పక్షులకైనా, ఇటుకల తయారుకైనా చెరువులే కీలకం. ఈ విధంగా రైతులకు, రైతు కూలీలకు, చేతివృత్తుల వారికి, మొత్తం గ్రామానికే చిన్న నీటి వనరులు కీలకం.

అనంతపురం జిల్లాలో ఇప్పుడు దాదాపు ఒక లక్ష యాభై వేల బోరుబావులున్నాయి. ఈ బోరు బావులన్నిటికీ భూ గర్భ జలాలు సమకూర్చేది కేవలం మన చెరువులు కుంటలు మాత్రమే. 15 సం॥ల క్రింద ఒక సంవత్సరం చెరువులు, కుంటలు నిండితే, దాదాపు మూడు సంవత్సరాలు భూగర్భ జలాల కొరత లేకుండా బావులు, బోరుబావులు పని చేసేవి. కానీ, ఇప్పుడు బోరు బావులను విచ్చలవిడిగా త్రవ్వడంవలన భూగర్భజలాలు అంతరించిపోయి బోరుబావులు ఎండిపోతున్నాయి. తద్వారా రైతులు ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది.

శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు కట్టించిన చిన్న నీటి వనరులు అనంతపురం ఎడారిలో ఒయాసిస్సులైనాయి. కాని, ప్రజలు మరియు మన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి చాలా కాలంగా చిన్న నీటి వనరులు గురి అయినాయి. చెరువులు, కుంటలలో పూడిక చేరి వాటి సామర్థ్యం సగానికి పడిపోయింది. దాదాపు 20 శాతం చెరువులకు కట్టలు తెగడమో, మొరవలు కొట్టుకపోవడమో, కట్టలపై చెట్లు పెరగడం, పశువులు, మనుషులు తిరగడం వలన కట్ట పొర్లిపోయి, బలహీనమైపోవడమో జరిగింది. కొన్ని చెరువులు, కుంటలు ఆనవాళ్ళు కూడా కనిపించకుండా పోయినాయి. చెరువులను వర్షపు నీటితో నింపే ఫీడరు కాలువలు పూడిపోయినాయి. పెన్నా, చిత్రావతి నదుల నుండి గ్రామపొలాలకు నీరందించే కట్టుకాలువలు పూడిపోయినాయి.

మన దేశంలో చిన్న నీటి వనరులు గత దశాబ్దాలుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయినాయి. నదీ జలాల పై ఆధారపడిన నాగార్జున సాగర్, తుంగభద్ర ప్రాజెక్టులాంటి పెద్ద నీటి వనరులపై ప్రభుత్వాలకు ఎనలేని ప్రేమ పెరగడము, కేవలం భారీ నీటి పారుదల ప్రాజెక్టులే నీటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారమని ప్రజలు, ప్రభుత్వాలు నమ్మడమే అందుకు కారణం. భారీ నీటి ప్రాజెక్టులు అవసరమని నేను నమ్ముతాను. కానీ, మన జిల్లాలో వున్న వ్యవసాయ భూమి మొత్తం 27 లక్షల ఎకరాలకు కేవలం భారీ నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా నీటిని పారించుకోగలమా? అది అసాధ్యం. మహా అంటే ఏడు, ఎనిమిది లక్షల ఎకరాలకు నదీజలాలతో నీరు పారించుకోగలమేమో!

కాబట్టి వాస్తవ దృక్పథంతో ఆలోచిస్తే మన జిల్లాకు చిన్న నీటి వనరుల అవసరము ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటుంది. కాబట్టి వాటిని పరిరక్షించడమే రాయలు వారికి ఈ పంచశతాబ్ది పట్టాభిషేక ఉత్సవాల సందర్భంగా మనము సమర్పించే ఘనమైన నివాళి. ప్రస్తుతం మన జిల్లాలో చెరువులు 5 లేక 6 సంవత్సరాలకొకసారి మాత్రమే పూర్తిగానిండి పంటలకు ఉపయోగపడుతున్నాయి. చెరువులను నిర్లక్ష్యం చేయడానికి ఒక కారణం, ప్రతి సంవత్సరమూ అవి నిండక పంటలు రాకపోవడమే. కాబట్టి, ప్రతి సంవత్సరము చెరువు క్రింద నమ్మకంగా పంట పండాలంటే, చిన్న నీటి వనరులను భారీ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నదీజలాల అనుసంధానము చేయాలి. దీనినే అనుసంధాన నీటి వినియోగం (Conjunctive Water Use) అంటారు. అంటే, భారీ నీటి ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని, ప్రత్యక్ష వ్యవసాయానికి మాత్రమే కాకుండా, మన చెరువులన్నీ ప్రతి సంవత్సరం నదీజలాలతో నింపి, తద్వారా చెరువుల క్రింద

వున్న సాగుభూమికి నమ్మకంగా నీరందించడము. ఆ విధంగా అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాంతాలలోని చెరువులన్నింటినీ బయట నుంచీ వచ్చే నదీ జలాలతో కాలవల ద్వారా పూర్తిగా అనుసంధానం చేసి జిల్లాను ఒక జలవలయం (Water Grid ) గా తయారు చేయాలి. అదృష్టవశాత్తూ మన ప్రభుత్వం కూడా హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపే కార్యక్రమాన్ని చేపట్టబోతోంది.

తద్వారా మన జిల్లాలో నీటి లభ్యతను జిల్లా అంతటా సమతౌల్యంగా పంపిణీ చేసినట్లవుతుంది. అంతేగాదు, మన జిల్లాలో పడే వర్షాలకు అరకొరగా నిండే చెరువులను బయటి జలాలతో నింపి, జిల్లా నలువైపులా కరువు తీవ్రతను తగ్గించడం జరుగుతుంది. జిల్లాలో ప్రాంతీయ అసమానతలను బాగా తగ్గించినట్లవుతుంది. రైతులకు, రైతు కూలీలకు, చేతివృత్తుల వారికీ, మొత్తం గ్రామ జీవనానికే కొంత క్రొత్త జీవం పోసినట్లవుతుంది.

ఈ రోజు ఈ చిన్న నీటి వనరులను క్రొత్తగా నిర్మించాలంటే మనకు సాధ్యమౌతుందా? ఎన్ని వేల కోట్ల రూపాయలు కావాలి? ఎంతమంది నిపుణులు కావాలి? ఎంతమంది పనివాళ్ళు కావాలి? ఎంత సమయం పడుతుంది? వీటికి లెక్క లేదు. కనీసం ఉన్న వాటినైనా సంరక్షణ చేయడానికి, పునరుద్ధరించడానికి మనం నడుంబిగించాలి. అందుకు సంబంధిత ప్రజలు వీటిని సంరక్షణకు బాధ్యత వహించాలి. ప్రభుత్వం తగిన సహకారం, ప్రోత్సాహం ఇవ్వాలి. గ్రామంలోని రైతులు కలిసి శ్రమదానంతో చేసుకోగల్గిన పనులను కూడా ప్రభుత్వం చేయాలని కోరడం సరైన పద్ధతి కాదు. ప్రజలు బాధ్యత తీసుకొని వారు చేయగల్గిన సంరక్షణ చేస్తూ, వారి శక్తికి మించిన సంరక్షణ పనులను చేపట్టటానికి ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఈ చిన్న నీటి వనరులు కొన్ని ప్రైవేటు చెరువులుగా రైతుల అధీనంలోనూ, మరికొన్ని చిన్న చెరువులు, పెద్ద చెరువులు మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలోనూ ఉన్నాయి. ఐతే, ఆయా శాఖల వద్ద కూడా తగిన సమాచారం సంపూర్ణంగా అందుబాటులో లేదు. నూర్ల సంవత్సరాల క్రితం బ్రిటిష్ ప్రభుత్వం ఒక్కొక్క చెరువుకు సంబంధించిన విపులమైన సమాచారాన్ని "చెరువు మెమోయిర్స్"(Memoirs of Tanks) గా ప్రతి చెరువుకు తయారు చేసింది. ఈ మెమోయిర్స్‌లో చెరువు స్వరూపము, దాని చరిత్ర, సముద్రానికి ఎంత ఎత్తులో వుంది, ఎన్ని ఎకరాలు అధికారికంగా సాగులో వుంది, ఎవరు కట్టించినారు, సంరక్షణ ఎట్లా జరుగుతుంది మొదలగు అంశాలతో దాని చరిత్ర ప్రతి చెరువుకు విపులంగా తయారు చేసినారు. ఐతే ఆ మెమోయిర్స్ ఇప్పుడు కొన్ని మాత్రమే అందుబాటులో వున్నాయి. ఆ మెమోయిర్స్‌ను కూడా మనం భద్రపరుచుకోలేక పోయినాము. అటువంటి మెమోయిర్స్‌ను ఇంకొక్కసారి ప్రస్తుత పరిస్థితి ఏమిటో పూర్తి వివరాలతో సవరించి తయారు చేయవలసిన అవసరం ఎంతో వుంది. ఆ పని ప్రభుత్వమే చేయవలసి వుంది.

## శ్రీ కృష్ణదేవరాయల పంచ శతాబ్ది పట్టాభిషేక మహోత్సవ సందర్భంగా చెరువుల పండగ

శ్రీకృష్ణదేవరాయల పంచశతాబ్ది పట్టాభిషేక మహోత్సవ సందర్భంగా మనము చెరువుల పండుగ చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడమైనది. మన గ్రామములోని ప్రతి చెరువుకు, కుంటకు, తలిపిరికి, కాలవకు ఒక చరిత్ర వుంది. ఆ చరిత్రను మనము మన పిల్లలకు, భావితరాలకు తెలుపవలసింది. వాటి ప్రాధాన్యతను, వాటి పై ఆధారపడిన మన వ్యవసాయం, ఇతర జీవనోపాధులను స్మరించుకోవలసిన అవసరం ఉంది. అంతేకాదు, ఈ చిన్న నీటి వనరులను మనము పరిరక్షించుకోవలసిన అవసరాన్ని మనము గుర్తు చేసుకోవలసి వుంది. వాటిని సంరక్షించడంలో మన బాధ్యతను గుర్తించవలసి వున్నది. సంరక్షించడానికి మనం సంసిద్ధులం కావలసి వున్నది. ఈ బాధ్యతను మనము స్వీకరించడమే మనము ఈ సందర్భంగా రాయలు వారికి అర్పించే ఘనమైన నివాళి.

తేదీ : **28-10-2010**

## అనంతపురం జిల్లాలో కరువును అధిగమించడానికి 'కీలక తడు'లే శరణ్యం

అనంతపురం జిల్లా అంటే మెట్ట వ్యవసాయం మీద ఆధారపడిన జిల్లా. అతి తక్కువ వర్షాపాతం జిల్లా. తరచూ కరువులకు గురయ్యే జిల్లా. పంటలు బాగా వస్తాయనుకున్న సందర్భాలలో కూడా ఒక్కొక్కసారి పంట పూత దశలో వున్నపుడు వరపుతోనూ, (బెట్ట) చివరి రెండు, మూడు వారాలలో పంటకు కావలసిన వర్షము సమయానికి పడక పంటను దెబ్బతీసి రైతుల ఆశలను తలకిందులు చేయగల పరిస్థితులు ఉన్న జిల్లా. 'వాన రాకడా, ప్రాణం పోకడా తెలియదన్న' సామెతతో పాటు, పొలంలో పండేటట్లున్న పంట ఇంటికి చేరుతుందో లేదో తెలియని అసందిగ్ధ పరిస్థితులు కూడా మన రైతులకు అలవాటే. ప్రకృతి సహకరించకున్నా ఏటా దాదాపు 25 లక్షల ఎకరాలు పట్టుదలగా సాగుచేస్తున్న 7 లక్షల రైతు కుటుంబాలలో ఈ ఒడిదుడుకులన్నీ ఒక అంతర్భాగం. అసాధ్యాల్ని సుసాధ్యాయం చేయగల అద్భుతమైన సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందిన దశలో కూడా అనంత రైతులను ఇప్పటికీ ప్రకృతి దయాధర్మాల మీదనే వదిలి వేయడం ప్రభుత్వాల అసమర్థతతకు వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం.

### జిల్లాలో వేరుశెనగ పంట ప్రాధాన్యత

అనంతపురం జిల్లాలో వేరుశెనగ పంటే ప్రధాన పంటగా ఎందుకు మారిపోయింది? వేరుశెనగకు కావాల్సిన పెట్టుబడులు రైతులకు తలకుమించిన భారంగా మారినా, వేరే పంటలకు పోకుండా ఒక్క వేరుశెనగనే రైతులు ఎందుకు కోరుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకాలంటే, జిల్లా రైతులలో పరకాయ ప్రవేశం చెయ్యాలి. జిల్లా బయట నిలబడి అభిప్రాయాల్ని ప్రకటించడం వాస్తవాలకు దూరంలో ఉంటుంది. ఇటీవల కాలంలో వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గించాలని, ఇతర పంటల వైపు, ముఖ్యంగా ఆహారపంటల వైపు రైతులను మళ్ళించాలని వ్యవసాయ అభివృద్ధి మీద పని చేస్తున్న సంస్థలు, వ్యక్తులు కృషి చేస్తున్నారు. అయినా ఇప్పటికీ అనంతపురం జిల్లా వ్యవసాయమంటే వేరుశెనగ పంటే. ఎప్పుడూ వర్షాభావం చేత పంటలు పోగొట్టుకోవడానికి అలవాటు పడ్డ మన రైతాంగానికి, గత సంవత్సరం అతి వృష్టి చేత కూడా వేరుశెనగ పంటను పోగొట్టుకున్న అనుభవం కూడా వచ్చింది. మన జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, తక్కువ వర్షాపాతం, నేలల స్వభావం మాట అటుంచి, అవసరమైన సందర్భాలలో వర్షాలు కురవకపోవడం, 15 రోజుల నుండి 45 రోజుల వరకూ కూడా వరపు ఏర్పడుచుండడంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. మన జిల్లాలో కురుస్తున్న సగటు వర్షాపాతం 522 మి.మి. కంటే కొంచెం ఎక్కువగా వర్షాపాతం నమోదయిన సంవత్సరాలలో కూడా పంటలు నష్టపోయిన సందర్భాలున్నాయి. సగటుకు కొంచెం తక్కువగా నమోదయిన సంవత్సరాలలో మంచి పంటలు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. దీనిని బట్టి తేలుతున్నదేమంటే కురుస్తున్న వర్షం పంటల కీలక దశల్లో కురిసినపుడు పంటలు పండుతున్నాయి. కీలక దశల్లో వర్షాలు ఎగబెడితే వర్షాపాతం మామూలుగా వచ్చినా, ఎక్కువగా నమోదయినా పంటలు నష్టపోవాల్సి వస్తోంది. వేరుశెనగేతర పంటలు పొట్ట దశలో బెట్టకు గురయితే, తరువాత వర్షాలు వచ్చినా, తిరిగి కోలుకోవడం చాలా కష్టం. వేరుశెనగ

పంట అలా కాదు. ఒకానొక దశలో 30 రోజులు బెట్టకు గురయి వర్షాలు వస్తే, తిరిగి కోలుకుంటుంది. అంతో ఇంతో పంట ఇస్తుంది. బెట్టకు తట్టుకునే సామర్థ్యం, ఇతర పంటల కంటే అధికంగా వుండి, తిరిగి కోలుకోగల సహజగుణం, పంట పండితే వచ్చే అధిక ఆదాయాల కారణంగానే వేరుశెనగ పంట ప్రాధాన్యత కొనసాగుతోంది. గత సంవత్సరం వర్షాలు ఎక్కువైనా మిగతా పంటలు పండినా, వేరుశెనగ పంట నష్ట పోవడంతో మొత్తం వ్యవసాయ ఆదాయమంతా నష్టపోయినట్లయింది. జిల్లాలో వేరుశెనగ పంట పండితే అయిదు వేల కోట్ల విలువైన పంట ఉత్పాదన ఉంటుంది. పంట నష్టమయితే, పన్నెండు వందల నుంచీ రెండువేల కోట్ల పెట్టుబడులు రైతులనెత్తిన పడుతాయి. సాధ్యమయినంత వరకూ వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గించి ఇతరత్రా పంటల విస్తీరణం పెంచడానికి మనం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, వర్షాభావ పరిస్థితులను, కరవులను అధిగమించే ప్రయత్నాలు కూడా చేయాలి.

## ఒరుపులో కీలక తడులు ఇవ్వగలగాలి

జిల్లాలో చాలామటుకు భూములు ఎత్తు పల్లాలతో నిండి ఉన్నాయి. వర్షాభావం ఏర్పడినపుడు ఒకే రైతు పొలంలోనే పై భాగంలో పంట ముందుగా వాడుకు గురవుతుంది. దిగువన ఇంకా తేమ ఉంటుంది కాబట్టి వెనుకగా వాడుపడుతుంది. అలాగే ఒక గ్రామంలోని ఎగువన ఉన్న పొలాలు తొందరగా బెట్టకు గురయి పైర్లు వాడుపడితే, దిగువన ఉండే పొలాలు నిదానంగా వాడుకు వస్తాయి. ఈ వ్యత్యాసాలు పంట దిగుబడుల మీద ప్రభావం చూపిస్తున్నాయి. ఒక రైతుకు పండిన పంట సరళిలోనే పక్క రైతు పంట పండదు. వర్షాధారం కింద వేసిన వేరుశెనగ పంట బెట్టకు గురయినపుడు నీటి వసతిగల రైతులు కొందరు పైపులు, స్ప్రింక్లర్ల ద్వారా ఒకటి, రెండు తడులు ఇచ్చి పంటలు ఒడుపు కోవడంలో సఫలీకృతులైన రైతులను గమనించడం జరిగింది. నిజానికి ఈ వ్యాసం ద్వారా నేను ప్రతిపాదిస్తున్న ప్రత్యామ్నాయ మార్గాలకు స్ఫూర్తి వారే. నీటి వసతిగల రైతులకు మాత్రమే కాకుండా అవసరమైన రైతులందరికీ ఈ సదుపాయం సమకూర్చాలి. వేరుశెనగ పంట పూత వచ్చిన తరువాత ఊడలు దిగేటప్పుడు 15 రోజుల కొకమారు పదును వర్షాలు అవసరం. 3 – 4 వర్షాలు సకాలంలో కురిస్తే పంట బయట పడుతుంది. వర్షాపాతం వల్ల వచ్చే వర్షాలకు తోడు బెట్ట పరిస్థితులు ఏర్పడినపుడు కీలకమైన దశలో ఒకటి లేదా అవసరాన్ని బట్టి రెండు తడులు 20 మి.మీ వరకైనా ఇవ్వగలిగితే పంట నష్టాన్ని పూర్తిగా నివారించ వచ్చును. ఇటువంటి కీలక తడులవల్ల జిల్లా మొత్తంగా రెండు నుంచీ, మూడు వేల కోట్ల వరకూ పంట నష్టాన్ని నివారించగలమంటే అతిశయోక్తి కాదు. ఈ కీలక తడి లేదంటే మొత్తం వేల, లక్షల ఎకారాలలో పంట ఎండిపోతుంది. ఇటువంటి కీలక తడుల ద్వారా ప్రాంతీయ సమన్యాయంతో పాటు, సామాజిక న్యాయం కూడా జరుగుతుంది. ఎట్లాగంటే వర్షాధారం మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు అధికంగా బీద రైతులు, దళితులు గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలవారు. వీరందరికీ సమన్యాయం జరుగుతుంది.

## ఇందుకు ఏం చెయ్యాలి?

ఇపుడు బావుల ద్వారా నీటి వసతి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న రైతులందరి వద్దా దాదాపుగా స్ప్రింక్లర్లు ఉన్నాయి. ప్రభుత్వం కూడా 50 శాతం నుండి 90 శాతం వరకూ సబ్సిడీతో స్ప్రింక్లర్ల సెట్లను రైతులకు అందజేస్తోంది. ట్రాక్టరు లేదా లారీల మీద నీటి ట్యాంకులు పెట్టుకుని(సింటెక్స్ డ్రమ్ములు విస్తారంగా దొరుకుతున్నాయి) స్ప్రింక్లర్ల సెట్టు అమర్చుకొని వాడుపట్టే దశలో 15 మి.మి. నుండి 20 మి.మి. తడి ఇచ్చే ప్రయత్నం చేయాలి. దగ్గరలోని చెరువులు, బావులు, కాలువల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాలలో నీరు దొరకడం గూడా సమస్యగా ఉంటుంది.

అయితే, నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులతో ఏదో ఒక విధంగా మాటాడి వారి ద్వారా నీటిని పొందే ప్రయత్నాలు చేయాలి. ఇది మనకు అలవాటులేనిది కాబట్టి సమస్యాత్మకంగా అనిపించవచ్చు. కానీ పంటనష్టాన్ని నివారించు కోగలమనుకున్నపుడు, ఈ శ్రమ లెక్కలోకి రాదు. ఇది తక్షణం రైతుల స్థాయిలో చేసుకోగల సౌకర్యం.

నీటి వసతి లేని రైతులకు ప్రభుత్వ స్ప్రింక్లర్లు పొందే అవకాశం లేదు. దీని కోసం ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. బావులు, బోర్లు లేని రైతులకు కూడా స్ప్రింకర్లు 90 శాతం రాయితీతో రైతులకు సరఫరా చేయాలి. చాలా మంది రైతులు ట్రాక్టర్ల బాడుగలు పెట్టుకునే ఆర్థిక పరిస్థితులు లేవు కాబట్టి ప్రభుత్వమే పూనుకుని ట్యాంకర్ల ద్వారా సామూహికంగా రైతులకు ఉచితంగా నీరు అందించే ఏర్పాట్లు చేయాలి. లేదా నామ మాత్రపు ఫీజుతో రైతులకు ట్రాక్టర్లు, స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంచాలి. రైతుల పంటలు కరువు బారిన పడకుండా రక్షించాల్సిన బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలి. జిల్లాలో వేరుశెనగకు 2000 సంవత్సరంలో మొవ్వకుళ్ళు రోగం వచ్చినపుడు యుద్ధ ప్రాతిపదికన రైతులకు 4 కోట్ల రూపాయల విలువైన రసాయనిక పురుగు మందులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. దాని వలన పంటలేమీ కాపాడుకోలేక పోయినాం కానీ, విలువైన రైతుల ప్రాణాలు మాత్రం కోల్పోయాం. ఒరుపుకు తట్టుకునే విధంగా కీలక తడులు కల్పించడానికి ప్రతి సంవత్సరం 20 నుంచి 30 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించాలి. దీని ద్వారా వేల కోట్ల రూపాయల విలువైన పంటలను కాపాడుకోవచ్చును. ప్రభుత్వం దీని కోసం పూనుకోవాలి.

ఏ పథకమైనా, ఏ కార్యక్రమమైనా ప్రభుత్వం నుంచి రావాలంటే అంత సులభం కాదు. కనుక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా రైతులు తమ స్థాయిలోనే పూనుకోవాలి. చాలా మంది రైతులు అయిదు ఎకరాలలోపు వారే కాబట్టి, వారు ఒక టైరు బండిమీదనే సింటెక్స్ డబ్బాలుగానీ, డ్రమ్ములుగానీ బండి మీద పెట్టుకొని ఈ ప్రయోగం చేయవచ్చును.

## స్థానిక నీటి వనరులను అభివృద్ధి పర్చాలి.

మనకు నీటి లభ్యతే కీలక సమస్య. కొన్ని కొన్ని గ్రామాలలో డ్రమ్ము నీరు కావాలన్నా మైళ్ళ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. అరకొర నీటి వసతుల కారణంగా బోర్ల నుంచి కూడా నీరు ఇవ్వరు. ఈ దుస్థితికంతటికీ కారణం మనం స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే. ఈ జిల్లాలో కురుస్తున్న అత్యల్ప వర్షాపాతం, వరుస కరువులను తట్టుకొని ప్రజలు జీవించడానికి గతంలో పాలకులు అవకాశమున్న చోటల్లా చెరువులు, కుంటలు, తలిపెరలు, ఊటకాలువలు నిర్మించారు. పూర్తి ఎండాకాలంలో కూడా వీటిలో నీరు దొరికే సౌలభ్యం ఉండేది. ఇటువంటివి జిల్లాలో అయిదు వేలకు పైబడి ఉన్నట్లు ఒక అంచనా. ఇపుడు ఆ పరిస్థితులు లేవు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు, చాలా చోట్ల ప్రజలే వాటిని నష్టపరుస్తున్నారు. పూడిపోయిన లేదా పాడైపోయిన ఇలాంటి చిన్న నీటి వనరులన్నింటినీ ప్రభుత్వం పునరుద్ధరించాలి. ప్రజలు ఉపయోగంలోకి తేవాలి. పెద్ద ఆయకట్లు తప్ప, మిగతా చిన్న చిన్న చెరువులు కుంటలను ఊట చెరువులుగా మార్చాలి. నీటి నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలి. బయటి ప్రాంతం నీటితో కాలువల ద్వారా చెరువులు నింపగలగాలి.

## ఉపరితల నదీ జలాలను జిల్లాలో నిలువ చేయాలి.

మన ప్రభుత్వాలు అమలుపరుస్తున్న నీటి వినియోగ విధానమే చాలా లోప భూయిష్టంగా ఉంది. అందు వల్లే కోస్తా జిల్లాల్లో సంవత్సరానికి మూడు పంటలు పండితే, మనకు పది సంవత్సరాలలో మూడు పంటలు పండుతాయి. ఇరాన్ నుండి పెట్రోలు, డీజలు వేల మైళ్ళ ఎత్తు పల్లాలను అధిగమించి

మన రాష్ట్రానికి తీసుకువచ్చి కావలసినంత కోస్తా తీర ప్రాంతానికి అందించినట్లే, రాయలసీమ ప్రాంతానికి కూడా అందిస్తున్నారు. అందుకు ఏ భూగోళ పరిస్థితులు అడ్డం రావడంలేదు. మరి నీటి పంపిణీకి ఈ భూగోళ పరిస్థితులు, ఎత్తుపల్లాలు ఎందుకు అడ్డం పడుతున్నాయో నాయకులకే తెలియాలి. జిల్లాలోనికి హంద్రీ నీవా ద్వారా అదనపు నీరు వస్తాయంటున్నారు. ఇవి అన్నీ వరద నీటి మీద ఆధారపడినట్టివి కనుక, నీటి లభ్యతలో నమ్మకం లేదు కనుక సాధ్యమయినంత వరకూ చెరువులలోనూ, జిల్లాలో వున్న ఇతర రిజర్వాయర్లలో నిలువ ఉంచాలి. నీటిని నిల్వ చేయడానికి అవసరమైన ఇంకా కొన్ని ప్రాంతాలలో కొత్త రిజర్వాయర్లను నిర్మించాలి. దీని ద్వారా ఏ ప్రాంతానికి అయినా తాగునీటికైనా, ఉన్నటువంటి పంటలు కాపాడుకోవడానికి అయినా ఈ నీటిని ఉపయోగించవచ్చును. ఈ రకంగా నీటి వనరుల లభ్యత అందుబాటులో ఉంటే, జిల్లాలో పచ్చదనపు వాతావరణాన్ని అభివృద్ధి చేయవచ్చును. పంటలను కాపాడుకోవచ్చును.

కోటి గొంతుకల ఆక్రందనలతో.....................

Date : April 2009

## ఉపాధి హామీ పథకం గ్రామాల సమగ్రాభివృద్ధికి ఉపయోగపడాలి

మనలాంటి వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం ఒక వరం లాంటిది. పంటలు పండక, వ్యవసాయపనులు లేక వలస బాట పట్టే గ్రామీణ ప్రాంతాల ప్రజలు గ్రామాలు వదలకుండా ఉపాధి దొరికే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తున్నది. ఈ పథకమే లేకపోతే వరుస కరువులతో అల్లాడుతున్న జనానికి పరిస్థితి చాలా భయంకరంగా వుండేది. అయితే, అనేక రకాల వ్యక్తులు వున్నటువంటి మన సామాజిక వ్యవస్థలో నూటికి నూరు పాళ్ళు ఖచ్చితంగా అమలు జరుగుతాయని ఆశించలేం. ఈ పథకం అమలులో సమస్యల గురించి, మానవ తప్పిదాల్ని గురించి వార్తా పత్రికలు అనేక కథనాలు ప్రచురిస్తున్నాయి. పొరపాట్లు జరక్కుండా చూడడానికి ప్రభుత్వం పై అధికారులు ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటూ వున్నారు. ఇంట్లోకి చేరిన ఎలుకల్ని తరిమి మన ఇంటిని జాగ్రత్తగా వుంచడానికి మనం ప్రయత్నిస్తూ వున్నట్లే, ఉపాధి హామీ పథకాన్ని కూడా కాపాడుకోవాలి. రక్షించుకోవాలి. ఈ పథకం దుర్వినియోగం కాకుండా చూడాలి. ఈ పథకం అమలు కేవలం ప్రభుత్వాల లేదా ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాల మీద అమలు జరుగుతున్నది కాదని, ఉపాధి కోరడం ఒక హక్కుగా ప్రభుత్వం చట్టం చేసిందని మనమందరం మొదటగా గ్రహించాల్సివుంది. అందుకే ఇది మన చట్టమని మనం దీనిని కాపాడుకుంటూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు జీవనంతో పాటు పేద రైతులకు భూమి అభివృద్ధి, గ్రామాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని కూడా మనం అర్థం చేసుకుందాం. అయితే ఈ పనులలో ఎక్కడా యంత్రాలతో పనులు చేయించరాదని ప్రభుత్వం హెచ్చరిస్తూనే వుంది. అక్కడక్కడా గ్రామాలలో లింక్ రోడ్ల పనులలో యంత్రాలతో పనులు చేయిస్తున్నట్లుగా పత్రికలు రాస్తున్నాయి. ఏదైనా వస్తువులు, అవసరమైన సామాగ్రి కోసం నిధులు ఖర్చు చేయవచ్చును. కానీ మానవ శ్రమను కాదని యంత్రాలతో పనులు చేయించడం చట్ట విరుద్ధం. ఎక్కడైనా ఇలాంటివి జరిగితే, వాటికి బిల్లులు చెల్లించవద్దని కూడా జిల్లా కలెక్టరు గారు ప్రకటిస్తూనే వున్నారు.

### ఎన్.పి.యం గ్రామాలలో దళిత, ఆదివాసీ భూముల అభివృద్ధి పథకం

ఈ మధ్యనే రాప్తాడు మండలం పెసర్లకుంట గ్రామంలో జిల్లాకు చెందిన మంత్రిగారు ఎన్.పి.యం, ఇ.జి.యస్. పథకం కింద యస్.సి.ల భూములలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని 30 మండలాలలోని 750 ఎన్.పి.యం గ్రామాలలో ఈ పథకాన్ని అమలు పరుస్తున్నారు. ఉపాధి హామీ పథకం ప్రకటించి అమలు జరుగుతున్న ఈ మూడు సంవత్సరాల కాలంలో దేశంలోని ఎంతో మంది మేధావులతో పాటు, మేమందరం ప్రభుత్వానికి అనేక సూచనాలు ఇవ్వడం జరిగింది. దానికి తోడు చిత్తశుద్ధిగల ప్రభుత్వాధికారులు ఈ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాలలో సమగ్రాభివృద్ధి జరగాలనే దృక్పథంతో మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. దాని ఫలితమే ఇది. ఈ పథకం ప్రస్తుతానికి పూర్తిగా యస్.సి.,

యస్.టి భూముల అభివృద్ధికే ఉద్దేశించబడినా, భవిష్యత్తులో మెట్ట రైతులందరికీ వర్తింపజేస్తారని ఆశిద్దాం.

మొదటగా ఈ పథకమేమిటో ఒకసారి పరిశీలిద్దాం. ఎన్.పి.యం గ్రామాలుగా గుర్తించిన 750 గ్రామాలలోని యస్.సి, యస్.టి భూములు అభివృద్ధి చేయడానికి ఎకరాకు 40 వేల వరకూ ప్రభుత్వం అనుమతితో వర్షపునీరు బయటికి పోకుండా ఒక మీటరు వెడల్పు అర్ధ మీటరు లోతుతో ట్రెంచ్ తవ్వి కట్టలు వేస్తారు. రైతు అవసరమని భావిస్తే, అవసరాన్నిబట్టి పొలం మధ్యలో కూడా కట్టలు వేసుకోవచ్చు. పొలంగట్ల మీద పచ్చిరొట్టనిచ్చే మొక్కలు నాటుతారు. గట్లమీద మధ్యలో రైతు కుటుంబ అవసరాల కోసం నాటుకోవడానికి కాయగూరల విత్తనాల కిట్లు అందజేస్తారు. పొలంలో పడిన వర్షపు నీరు బయటికి పోకుండా పొలంలోనే నిలువ వుంచుకోవడానికి ఫారం పాండ్స్ (నీటి నిలువ గుంతలను) తవ్వుకోవచ్చు. ప్రతి రైతుకూ అయిదు ఎకరాలకు మించకుండా ఈ పథకం కిందికి తెస్తారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ ఆమోదంతో ఈ పనులన్నీ చేపట్టాల్సి వుంటుంది. మండలానికి చెందిన సాంకేతిక సహాయకులు, కో-ఆర్డినేటర్లు ఈ పనులను పర్యవేక్షించి ఉపాధి కూలీ చెల్లింపులు చేస్తారు. ఒక్కో ఫారం పాండ్ 10 అడుగుల వెడల్పు 2 మీటర్ల లోతుతో వాలుగా వుండేటట్లు తవ్వుతారు. రైతులు తమ పొలంలోకి చెరువు మట్టి తోలుకోవడానికి, కంప చెట్లు కొట్టి వేసుకోవడానికి, పొలాల్లో అనవసరమైన రాళ్ళు, గుండ్లు తొలగించుకోవడానికి, అవసరమైన చోట్ల వర్షపు నీటికి కట్టలు కోతకు గురి కాకుండా రాతి కట్టలు కట్టటానికి అనుమతిస్తారు. అయిదు రకాలకు తక్కువగాకాకుండా ఎకరాకు అయిదు వందలకు మించకుండా రైతులకు విత్తనాలు అందజేస్తారు. వర్షాలు ప్రారంభం కావడానికి ముందుగా, భూమిని దున్నకుండా ప్రతి నాలుగు మీటర్ల అంతరంతో ఒక తల్లి సాలును అడ్డంగా దున్నుతారు. దీని వలన పడిన వర్షపు నీరు బయటికి పారకుండా ఈ సాళ్ళు నీటి ప్రవాహాన్ని అరికడుతాయి. రైతు ఇష్టపడితే సాధారణ పంటలు వేసుకోవచ్చు. లేదా పళ్ళ మొక్కలు నాటుకోవచ్చు. ఈ మొక్కలు బతికించుకునేందుకు నీటిని తెచ్చిపోసుకోవాలి. దీని కోసం రైతుకు కూలీ చెల్లిస్తారు. మొదటగా రైతు తన పొలంలో ఎన్.పి.యమ్., ఇ.జి.యస్. పథకం అమలుకు అంగీకారం తెలుపాల్సి వుంటుంది. అధికారులు ప్రతి ఎకరాకు 40 వేలు వంతున మంజూరు చేస్తారు. ఈ మంజూరు నిధులతో మొత్తం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారు. రసాయన రహిత సుస్థిర వ్యవసాయం అభివృద్ధి చేస్తారు. ఇది యస్.సి., యస్.టి రైతులకు ఒక వరం లాంటిది. వారు చేసిన పనులకు జీవనోపాధి పొందుతూనే, వారి పొలాల్లో వర్షాధార పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. వర్షాధారిత కరువు జిల్లాలో ప్రతి బీద రైతుకు ఇలాంటి సహాయం కావాలి.

## స్థిరాస్థుల పెంపకం -

ఉపాధి హామీ పనులతో పేద రైతుల స్థిరాస్థుల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పనులలో ప్రభుత్వం మార్పులు ప్రవేశ పెట్టింది. దేశ వ్యాప్తంగా ఎంతో మంది మేధావులు, సంఘసేవకులు ప్రభుత్వం మీద చేసిన ఒత్తిడుల ఫలితంగా మార్పులు చోటు చేస్తున్నాయి. అందుకనే ఈసారి యస్.సి, యస్.టి ల భూములలో వ్యవసాయ భూముల బాగు చేయడం, శక్తిలేక నిరుపయోగంగా పెట్టుకున్న భూములను ఉత్పాదనా వలయంలోకి తీసుకు రావడానికి పథకాలు రూపొందించారు. గ్రామాలలోని ప్రజలకు ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార అభివృద్ధికి ఇవి తోడ్పడుతున్నాయి. అయితే యస్.సి., యస్.టి భూములతో పాటు, మెట్టవ్యవసాయ రైతులందరి భూముల అభివృద్ధి కార్యక్రమాలకు ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించాలని మనం డిమాండ్ చేద్దాం. ఈ ఉపాధి హామీ పథకంలో దేశ వ్యాప్తంగా పని చేస్తున్న వారిలో 70 నుంచి 90 శాతం వరకూ వర్షాధార వ్యవసాయ ప్రాంతాలకు సంబంధించిన

వారే. వ్యవసాయ కూలీలతో పాటు, చిన్న, సన్న కారు రైతులతో పాటు ఒక మోస్తరు భూములు కలిగిన వారు కూడా ఉపాధి పనులు చేస్తున్నారు. కాబట్టి ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్షణం ఉపాధి దొరకడంతో పాటు అయిదు సంవత్సరాల వ్యవధిలో చెట్ల పెంపకం, వాన నీటిని సక్రమంగా నిలువ చేసుకుంటూ వ్యవసాయ భూముల ఉత్పాదక శక్తిని అభివృద్ధి చేసుకునే విధంగా ఈ పథకానికి రూపకల్పనలు చేయాలి. దిగజారిపోతున్న అడుగంటిపోతున్న భూగర్భ జలాలను పెంచుకునే విధంగా కార్యక్రమాలు రూపొందించాలి. మెట్ట వ్యవసాయ భూములలో సగటు ఉత్పాదకత పెరిగే విధంగా ఒక సమగ్ర విధానాన్ని అమలు పరిచే కార్యక్రమాలను రూపొందించాలి. రైతులు పెట్టుబడులు లేని వ్యవసాయం చేసుకునే విధంగా, ప్రతి రైతు ప్రకృతి వనరులతోనే ఎరువులు సమకూర్చుకునే విధంగా ఈ పథకం విస్తరింపజేయాలి.

## నీటివనరుల అభివృద్ధి కోసం కార్యక్రమాలు

మన జిల్లాలో ఇప్పటికి తేలిన లెక్కల ప్రకారం దాదాపు అయిదు వేల చెరువులు, కుంటలు, తలిపిరులు, ఊటకాలువలు వున్నాయి. ప్రజల, ప్రభుత్వాల నిరాదరణవల్ల చాలా భాగం కనుమరుగయినాయి. చెరువులకు నీటిని నిలుపుకునే శక్తి లేదు. కట్టలు పాడవడమో, లేదా తూములు దెబ్బ తినడమో కారణంగా చాలా చెరువులు ఉపయోగం లేకుండా పోయినాయి. ఏ పాటి వర్షం వచ్చినా, ఈ చెరువులోకి వచ్చిన నీరంతా బయటికి వెళ్ళిపోతున్నది. తీవ్రమైన కరువులకు గురవుతున్న ప్రాంతంగా గుర్తించి మన పూర్వీకులు కనీసంగా ప్రతి గ్రామానికి ఒక చెరువో, ఒక కుంటనో ఏర్పాటు చేశారు. వర్షపు కాలంలోనూ, పంట మధ్యలో వర్షాలు ఎడమై పంటలు ఎండిపోకుండా చెరువుల, కుంటలలోని నీరు పంటలకు తంపుగా ఉపయోగపడతాయి. ఆ రకంగా ఈ నీటి వనరులు జిల్లాకు ఎంతగానో ఉపయోగపడినాయి. వేరుశెనగ పంటకు ఒక కీలక తడి ఇవ్వగలిగితే 10 నుంచీ 25 వరకూ పంట నష్టాన్ని నివారించవచ్చునని మనకు అనుభవాలు తెలియజేస్తున్నాయి. రైతులు అవసరమైన సందర్భాలలో కీలక తడులు ఇవ్వాలనుకున్నప్పుడు చెరువులలోనూ, కుంటలలోనూ నీటిని నిలవవుంచగలిగితే, రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. కాలువల పునరుద్ధరణ, తూముల పునరుద్ధరణ లాంటి పనులన్నిటికీ చాలా వరకూ కూలీల శ్రమ అవసరమవుతుంది. ఈ దిశగా పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలి.

## కొండగుట్టలు, బంజరు భూముల్లో పళ్ళ చెట్ల పెంపకం

మన జిల్లాలో నిరుపయోగమైన భూములు, కొండలు, గుట్టలు వున్నాయి. ఇవన్నీ దాదాపు వ్యవసాయానికి నిరుపయోగకరమైనవి. ఈ కొండ గుట్టల్లో చెట్లు పెరగడానికి అవకాశం వుంది. ప్రభుత్వం ఆయా గ్రామాల పరిధిలో వున్న ఇటువంటి భూములను గుర్తించి ఆయా గ్రామాలలోని నిరుపేదలు, వ్యవసాయ కూలీలకు ఈ భూముల మీద లీజు హక్కులు ఇవ్వాలి. వీటిల్లో వారు సీతా ఫలం, చింత, వేప, నేరేడు, పశువుల మేతకు పనికి వచ్చే సుబాబుల్, పొంగామియా, గ్లైరిసీడియాలాంటి మొక్కలు నాటుకుని వారు ఫలసాయం అనుభవించే హక్కులు ఇవ్వాలి. వారికి అనుమతించిన భూభాగంలో మొక్కలు నాటుకోవడానికి, వాటికి నీరు పోసి బతికించుకోవడానికి ఉపాధిహామీ పథకం ద్వారా అవకాశాలు కల్పించాలి. దీంతో వారికి ఉపాధి దొరకడంతో పాటు, బోడి నేలల్లో పచ్చదనం అభివృద్ధి అవుతుంది. రైతులకు వ్యవసాయానికి కావలసిన పచ్చి రొట్టె ఎరువుల కోసం, ఆకులు, పశువుల మేత కొరత తీరుతుంది. ఎండల కాలంలో మన జిల్లాలోని గొర్రెల పెంపకందారులు వాటి మేత కోసం, 3–4 నెలల వరకూ దూరప్రాంతాలకు వలస వెళ్తూ తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. దొంగల

బాధ వారికి తీవ్రమైన సమస్య. విస్తారంగా వున్న కొండగుట్టలలో పశువుల మేత కోసం పచ్చదనాన్ని అభివృద్ధి చేయగలిగితే, గ్రామాలలో అన్ని వర్గాల వారు కలిసి బతకడానికి, గ్రామాలలో ఒక సమగ్రాభివృద్ధికి పునాదులు వేసినట్లుగా భావించవచ్చు. మన జిల్లాలో రిజర్వు ఫారెస్టు కొండలు కూడా వున్నాయి. వీటిలో చెట్లకు హాని చేయకుండా ఫలసాయం పొందే హక్కులు గ్రామాలలోని ప్రజలకు కల్పిస్తే, ప్రజలకు ఉపాధి దొరకడమే కాదు, అడవులు కూడా రక్షింపబడుతాయి. ప్రజల ప్రమేయం లేకుండా ప్రభుత్వ ఆధీనంలోని రక్షిత అడవులు ఏమేరకు రక్షింపబడుతున్నాయో మనకు అనుభవాలే చెబుతున్నాయి. ఈ అడవుల రక్షణ బాధ్యతతో పాటు, ఫల సాయం మాత్రమే పొందే హక్కును గ్రామాలకు అప్పగిస్తే, ప్రభుత్వం అడవుల రక్షణ కోసం వినియోగిస్తున్న ఖర్చు, దుబారా చాలా వరకూ తగ్గిపోతుంది. ప్రభుత్వం ఈ విధంగా దృష్టి సారించి ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేసుకునే విధంగా మార్గదర్శకాలు రూపొందించాల్సి వుంది.

## గ్రామాలలో మురుగు నీటి, పారిశుధ్య వ్యవస్థల ఏర్పాట్లు

చాలా గ్రామాలలో మురుగు నీటి పారుదల కాలువల వ్యవస్థ లేకపోవడం మూలంగా, బచ్చళ్ళు, పశువుల గంజుతో వీధులు రొచ్చు, రొచ్చుగా వుంటూ, దోమల పెరుగుదలకు, రోగాల వ్యాప్తికి మూల కేంద్రాలుగా వుంటున్నాయి. అదే రకంగా లెట్రిన్లు లేక ఆరు బయటే పనికానిచ్చేస్తున్నారు. జాతీయ ఉపాధి పథకం ద్వారానే, పంచాయితీల ఆధీనంలో ప్రతి గ్రామంలోనూ మురుగు నీరు ఊరు వెలుపలికి పోయే విధంగా పరికరాలు మార్కెట్లో అందుబాటులో వున్నాయి. ప్రభుత్వం పారిశుధ్య కార్యక్రమాలకు ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగిస్తూనే, గ్రామాలలో అంతర్గత రోడ్ల పనులు చేయించాలి. ఇవన్నీ కూడా గ్రామాల సమగ్రాభివృద్ధికి తోడ్పడుతాయి. ఏ ఒక్క పనితోనో, కార్యక్రమంతోనో గ్రామాలు అభివృద్ధి చెందజాలవు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధితో పాటు, ఒక సమగ్రాభివృద్ధికి ఆలంబనగా మార్పు చెందాల్సి వుండాలని ఆశిస్తూ వున్నాను.

**నవంబర్ 2010**

# వర్షాధార భూములలో మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము

# (ఎమ్.ఎఫ్.టి.సి)

## మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము ఉద్దేశ్యము :

నమ్మకంలేని వర్షపాతము, కఠిన వాతావరణ పరిస్థితులు, తరచుగా వచ్చే కరువులు, వేరుశనగ ఒకే పంట విధానం తదితరాలు వర్షాధార వ్యవసాయానికి ప్రతికూలాంశాలు. దుష్ఫలితాలనిచ్చే రసాయనిక వ్యవసాయం రైతాంగాన్ని అప్పుల విషవలయంలోకి నెడుతున్నాయి. వ్యవసాయాన్ని సుస్థిర పరచుకోవడానికి రైతులు స్వయం పరిపూర్ణత సాధించడానికి సమగ్ర వ్యవసాయ విధాన ఆచరణ తప్పనిసరి. అందులో భాగంగా ఎ.ఎఫ్ ఎకాలజీ సెంటరు మన పరిస్థితులకు అనుకూలంగా వుండే కొన్ని వైవిధ్య వర్షాధార పంటల నమూనాలను అభివృద్ధి చేసింది. రైతు తన పద్ధతిలో కార్తె పంటలను పండిస్తూ, పలు రకాల పండ్ల మొక్కలను, పశువుల మేతకు పనికి వచ్చు మొక్కలు, భూమి సత్తువకు పనికి వచ్చు మొక్కలను నాటుకొని, 4-5 సంIIలు కాపాడుకొనిన యెడల, రాబోవు 4-5 సంIIలలో కరువులో కూడా స్థిరమైన నికర ఆదాయము పొందే అవకాశముంది. దీనిని మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము అని అంటున్నాము. దీని వలన రైతుకు ఆహార భద్రతతోబాటు ఆదాయ భద్రత చేకూరుతుంది. రైతు జీవన విధానములో గుణాత్మకమైన మార్పు వస్తుంది.

## మిశ్రమ పండ్ల మొక్కల పెంపకమునకు రైతుల ఎంపికకు అర్హతలు :

ఈ కార్యక్రమమునకు రైతుల ఎంపికలో జాగ్రత్త వహించవలెను. వర్షాధారముగా పండ్లచెట్లను నాటుకొని, వాటిని కాపాడుకొనేందుకు ఉత్సాహము మరియు అవకాశములు గల రైతులను మాత్రమే ప్రోత్సహించవలెను. అందులో ఎస్.సి., ఎస్.టి., చిన్న సన్నకారు మెట్ట రైతులకు, రైతు మహిళలకు ప్రాధాన్యతనివ్వవలెను. మరియు రైతుల ఎంపిక గ్రామములోని సస్యమిత్ర సంఘాలు / సమాఖ్యల ద్వారా జరుపవలెను.

## మిశ్రమ పంటలకు అనువైన పొలాల ఎంపిక :

గ్రామమునకు దగ్గరగా రోడ్డు ప్రక్కన గల మెట్ట పొలాలను ఎంపిక చేసుకొనవలెను. ఎంపిక కాబడిన పొలమునందు వర్షాధారముగా పండ్ల మొక్కలు నాటి, బ్రతికించుకొనుటకు దగ్గర గల నీటి వసతిని గమనించవలెను. పొలము యొక్క వచ్చిన వారి పొలాలను పరిశీలించి, సాధ్యాసాధ్యములను గుర్తించి, కార్యక్రమాన్ని అమలు చేయవలెను.

## పండ్ల చెట్లు నాటుటకు అనువైన నేలలు :

### మామిడి:

ఉదజని సూచిక 7.5 - 8 ఉన్న నేలలు అనుకూలము. మన అనంతపురం జిల్లాలో

వేరుశనగ పంట  పండు పొలాలన్నీ అనుకూలము.  చౌడు, ఉప్పు, సున్నం, నీరు నిల్వ వుండే బరువైన నల్లరేగడి నేలల్లో నాటకూడదు.  మిగిలిన అన్ని సారవంతమైన నేలలు అనుకూలము.

**సపోటా:**

ఉదజని సూచిక 8.5 – 9 ఉన్న నేలలు కూడా అనుకూలము.  ఇసుక భూముల, అధిక చౌడు వున్న నేలలు, ఉప్పు నేలలు కూడా నాటడానికి పనికి వస్తాయి.  కొండ ప్రాంతాలు, లోతు తక్కువ నేలల్లో కూడా నాట వచ్చును.

**సీతా ఫలం:**

మురుగు నీరు పోయే సదుపాయం కలిగిన, ఉదజని సూచిక 5.5 – 7.5 గల నేలలు అనుకూలము. సీతాఫలంచెట్లు చౌడు క్షార నేలల్లో కొంత వరకు తట్టుకొని పెరగడానికి అవకాశమున్నది. నీరు నిల్వని చల్కా నేలలు, గరువు నేలలు, గరప నేలల్లో బాగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. రాళ్ళతో కూడిన గరుకు నేలల్లో కూడా సాగు చేయవచ్చును.

**ఉసిరి:**

ఉదజని సూచిక 9.5 వరకు వున్న భూములలో ఉసిరి పండించవచ్చును.  నీరు నిల్వ వుండని అన్ని రకాల నేలల్లోను ఉసిరిని పెంచవచ్చు.  ఆమ్ల, క్షార లక్షణాలున్న భూముల్లో కూడా ఈ పంటను పెంచవచ్చును. సర్వ సాధారణముగా మన జిల్లాలో చవుడు భూములు  అయినను వాటిలో ఉ సిరి బాగా పండించవచ్చును.

## రైతులకు దీర్ఘకాలంలో జరుగు ప్రయోజనము

రైతు కార్తె పంటలతో బాటు, పలు రకాలయిన పండ్ల చెట్లు ఎరువునిచ్చు చెట్లు, పశుగ్రాసపు చెట్లు నాటుకొనుటవలన దీర్ఘకాల ప్రయోజనములు చేకూరును.

1 ఎరువు నిచ్చు చెట్లవలన వాటి ఆకులు అలములతో మల్చింగ్ చేయుట వలన భూమి యందు సేంద్రియ కర్బనము మోతాదు పెరిగి హ్యూమస్ పెంచుటకు ఉపయోగపడుతుంది.

2 స్వదేశి వాన పాములు, సూక్ష్మ జీవుల సంఖ్య అధికమగును.  తద్వారా భూమి గుళ్ళబారి, సారవంతమగును. నాలుగు సంవత్సరాలకు మామిడి పండ్ల చెట్లు బాగా అభివృద్ధి చెంది రైతుకు దాదాపు పది వేల వరకు అధిక ఆదాయము లభించును.  దీర్ఘకాలములో పండ్ల చెట్ల ద్వారా ఎకరాకు సంవత్సరానికి యాభైవేల వరకు నికర ఆదాయము లభించగలదు.

3 అధికముగా తేమను నిల్పుకొను శక్తి కలిగి వుండును.  తద్వారా అధిక దిగుబడులు రైతు సాధించగలడు.

4 పశుగ్రాసపు చెట్లు సాగు చేయుట వలన, చిన్న జీవాలను కాని, పాడి ఆవును కాని పెంచుకొనుట ద్వారా సంవత్సరానికి దాదాపు పదిహేను వేల వరకు అధిక ఆదాయము లభించగలదు

5 చాలా వరకు సీతాఫలము, సపోట 2 – 3 సంవత్సరముల నుండి కాపుకు వచ్చును.

ఈ విధముగా బహుళ పంటలు పండిస్తూ పలు రకాల పండ్ల చెట్ల ద్వారాను, పాడి పరిశ్రమ లేదా చిన్న జీవాల పెంపకము వలనను, రైతుకు దీర్ఘకాలములో ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, ఆదాయ భద్రతతో బాటు మెరుగైన జీవన విధానమును పెంపొందించుకొనవచ్చును.

అనంతపురంలాంటి కరువు జిల్లా రైతులు సమగ్ర వ్యవసాయ విధానము పాటిస్తూ, ఏక వార్షిక పంటలను, బహువార్షిక పంటలయిన పండ్ల తోటల పెంపకము చేపట్టుటవలన రాబోవు 4-5 సంవత్సరాలలో స్థిరమైన నికర ఆదాయము పొందే అవకాశముంది. దానివలన ఆహార భద్రతతో పాటు ఆదాయ భద్రత చేకూరుతుంది. రైతు జీవన విధానములో గుణాత్మకమైన మార్పు వస్తుంది.

## మొక్కలు నాటు విధానం :

ఒక ఎకరాలో మామిడి-36, సపోటా -36, సీతాఫలము-64, మొక్కలు నాటవచ్చును. అయినా మొక్కలను నేల స్వభావమును బట్టి, నేలకు సరిపోయే విధంగా చెట్ల రకాలను ఎన్నిక చేసుకొని నాటవలయును. పొలమునందు వాలుకు అడ్డముగా 8 మీటర్ల దూరముతో గుంతలు 'తల్లి గర్భం పద్ధతిలో' త్రవ్వుకొనవలెను. మరియు వాలుకు అడ్డముగా వున్న వరుసలలో 4 మీటర్ల దూరములో మధ్యలో గుంతలు త్రవ్వుకొనవలెను. అనగా వాలుకు అడ్డముగా 4 మీటర్లలోను నిలువుగా 8 మీటర్లలోను గుంతలు వుండును. మొక్కలు నాటునపుడు 8 మీటర్ల దూరములో మామిడి, సపోటా వుండునట్లు చూడవలెను. వాటి మధ్యలో 4 మీటర్లకు సీతాఫలము వచ్చునట్లు నాటవలెను. పొలము బార్డరునందు కూడా 4 మీటర్ల దూరములో సీతాఫలము నాటవలెను. మరియు కానుగ, సీమకానుగ, సీమ తంగేడు, సుబాబుల్, అవిసె మొక్కలు, ఉసిరి, నేరేడు, వేప మొదలగు మొక్కలను కూడా పొలం సరిహద్దు నందు నాటుకొనవలయును. సరిహద్దులో మీటరుకు 4 బయోమాస్ మొక్కలు వచ్చునట్లు నాటవలెను.

## మొక్కల సంరక్షణకు సంస్థ చేయూత :

ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటరు ఎన్నిక చేయబడిన రైతులకు పండ్ల మొక్కలు ఉచితముగా సరఫరా చేయును. మరియు మొక్కలు బ్రతికించుకొనుటకు మామిడి, సపోటా మొక్కలకు మొక్కకు రూ.2.50/- ప్రకారము 24 తడులకు సీతాఫలము మొక్కలకు 2.50/- మొక్కకు ప్రకారము 16 తడులకు బయోమాస్ మరియు మేత నిచ్చు చెట్లకు 0.40/- మొక్కకు ప్రకారము 8 తడులకు ఆర్థిక సహాయము చేయబడును. బయోమాస్ విత్తనములు నాటుటకు రూ.240/-, ఒకసారి మల్చింగ్ చేయుటకు రూ.200/-లు సంస్థ ఇవ్వగలదు.

బయోమాస్ మొక్కలు మల్చింగ్ చేసుకొనుటకు మరియు శాస్త్రీయ పద్ధతిలో దిబ్బలు వేసుకొనుటకు ఉపయోగపడతాయి. కాబట్టి పండ్ల మొక్కలతో పాటు, బయోమాస్ మొక్కలకు సమానంగా ప్రాధాన్యతనిచ్చి రక్షించవలయును. బయోమాస్ మొక్కలను నిర్లక్ష్యం చేసిన రైతులకు నీటి తడులకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఇవ్వబడవు.

అదే విధంగా పశువుల మేతకు పనికి వచ్చే మొక్కలకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చి బ్రతుకించుకొనవలయును. ఈ మొక్కలను నిర్లక్ష్యం చేసినా, తడులకు ఇచ్చే ప్రోత్సాహకాలు పండ్ల మొక్కలకు కూడా ఇవ్వబడవు.

## రైతు చేయవలసిన పనులు :

రైతు తనవంతుగా గుంతలు త్రవ్వుకొనవలెను. మొక్కలు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు, అనంతపురం నుండి తీసుకొని వెళ్ళవలెను. గుంతలలో ఎరువు / వర్మీ కంపోస్టు మట్టితో కలిపి నింపవలెను. మొక్కలను తల్లి గర్భం పద్ధతిలో నాటవలెను. అమృతజలము మొక్కలకు అందించవలెను. ఆరోగ్రీన్ విత్తనములు పాదులలో చల్లి పలుచగా మట్టిని పైన చల్లవలెను. స్టేకింగ్ చేయవలెను. బార్డర్ చుట్టూ బయోమాస్ విత్తనములు నాటవలెను. సీతాఫలము మరియు ఇతర పండ్ల మొక్కలు బార్డరునందు నాటవలెను. పొలము చుట్టూ ముళ్లకంచె ఏర్పాటు చేయవలయును.

వాలుకు అడ్డముగా బహుళ పంటలు అనగా వేరుశనగతోబాటు అంతర్ పంటగా కంది / ఆముదము / అలసంద సరిహద్దు పంటగా జొన్న / సజ్జ, మిశ్రమ పంటలుగా నువ్వులు, పెసర, చౌళ, గోంగూర మొదలగు పంటలు విత్తుకొనవచ్చును.

## నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో పళ్ళ మొక్కలు నాటే విధానం

మన జిల్లాలో చాలా మంది రైతులు వర్షాధారం కింద పళ్ళ తోటలు పెట్టుటకు ముందుకు వస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో నాటిన మొక్కలు బాగా నిలదొక్కుకుని పెరగడానికి "నేల తల్లి గర్భం పద్ధతి " ని అనుసరించడం వల్ల సత్ఫలితాలు వస్తాయని వ్యవసాయ నిపుణులు చెపుతున్నారు. పళ్ళ మొక్కలను నాటుకోదలుచుకున్న వారు ఈ క్రింద పద్ధతులను పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

## నేల తల్లి గర్భం పద్ధతి

పటంలో చూపిన విధంగా 60 సెంటిమీటర్ల వెడల్పు, 30 సెంటిమీటర్ల లోతులో అర్ధ చంద్రాకారంలో గుంతలు తయారు చేసుకోవాలి. ఈ గుంతల్ని సగభాగం వానపాముల ఎరువు, మట్టి కలిపి గుంతలను నింపి వేయాలి. నాటదలచుకున్న పళ్ళ మొక్కలను మూడు రోజుల ముందు నుంచి నీళ్ళు చిలకరించకుండా పొడిగా ఉంచాలి. నాటే ముందుగా మొక్క చుట్టూ ఉన్న ప్లాస్టిక్ కవరును పూర్తిగా తొలగించి వేయాలి. పటంలో చూపిన విధంగానే వేళ్ళకు మట్టి ఉన్న మొక్కను ఒక నీటి పాత్రలో వేసి, కొద్దిసేపు మొక్క నీటిలో తడిసిన తర్వాత, బయటకు తీయాలి. మొక్కకు ఇంకా మట్టి అంటుకునే ఉంటుంది. మొక్కకు అంటుకుని ఉన్న కొంత మట్టి తొలగించిన తర్వాత, ఎండిపోయిన వేర్లను కత్తిరించాలి. జీవామృతంలో మొక్కను ముంచి తీయాలి. ఆ తరువాత మొక్క మొదళ్ళకు బూడిద చల్లి, గుంతలో కొంత మట్టి తీసి మొక్కను నాటాలి. ఆ తరువాత తీసిన మన్నుతో మొక్కను మొదలును కప్పి వేయాలి. ఆ తరువాత గుంతలో నీళ్ళు పోయాలి.

### ఉపయోగాలు

ఈ పద్ధతిలో నాటబడిన మొక్కల వేళ్ళు బాగా అభివృద్ధి చెందుతాయి. నేలలో తేమ నిలువ సామర్థ్యం పెరుగుతుంది. వేళ్ళు భూమిలోకి బాగా అభివృద్ధి చెందుతాయి. చెట్లు బాగా పెరుగుతాయి. ఆరోగ్యంగా ఉంటాయి.

## ఆరోగ్రీన్ – కొత్త పద్ధతిలో పచ్చి రొట్ట ఎరువుల తయారీ

మెట్ట వ్యవసాయంలో పచ్చిరొట్ట ఎరువులను తయారు చేసుకోవడం, వాటిని ఉపయోగించుకోవడం కొంచెం కష్టమైన పని. డా॥ రూపెలాగారు మెట్టభూముల్లో పచ్చిరొట్టె ఎరువులను తయారు చేసుకోవడం వాటిని ఉపయోగించుకునే పద్ధతిని రూపొందించారు.

వివిధ పంటలకు వివిధ రకాల పురుగులు ఆశిస్తున్నాయి. వాటిని అదుపులో ఉంచడానికి ప్రకృతిపరంగా అనేక మిత్రపురుగులు ఉంటున్నాయి. నేలలో వానపాముల వంటి అనేక సూక్ష్మజీవులు ఉన్నాయి. వాటిలో మన కంటికి కనపడని సూక్ష్మ జీవులే అధికంగా వున్నాయి. ఇవన్నీ మొక్కల పెరుగుదలకు వివిధ రకాలుగా తోడు చేస్తాయి. నేలలో ఉండే అనేక రకాల జీవజాలాన్ని అభివృద్ధి పర్చడం ద్వారా పైరు మొక్కలకు, వాటివేళ్ళకు శక్తిని కల్పించడం జరుగుతుంది. ప్రకృతిలో అనేక రకాల మొక్కలలో, అనేక రకాల పోషకాలు ఉంటాయని మనకందరికి తెలిసిన విషయమే. ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె విత్తుల రకాలలో పూర్తిగా సమతుల్యమైన మూలకాలు మొక్కలకు లభిస్తాయి.

ఈ ప్రక్రియలో భాగంగా, ఒక ఎకరాకు కావలసిన విత్తనాలు మొత్తం పది కేజీలు సిద్ధం చేసుకోవాలి. ఇందులో 6 కేజీలు పప్పుజాతి విత్తనాలైన అలసంద, ఉలవ, పెసర, కంది లాంటివి సేకరించుకోవాలి. రెండు కేజీలు ధాన్యపు పంటలైన జొన్న, సద్ద, రాగి, కొర్ర, వరి లాంటి విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక కేజీ ఆముదం, పొద్దు తిరుగుడు, వేరుశెనగ, నువ్వులు తదితర నూనె విత్తనాల్ని సేకరించుకోవాలి.

ఈ మొత్తం పది కేజీల విత్తనాలు సాధ్యమయినంత వరకూ స్థానిక రకాల్నే ఎంపిక చేసుకోవాలి. రైతులు పండించేపంటలనుండే ఈ విత్తనాలను సేకరించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒక వేళ ఏ రైతు వద్దనైనా ఈ పంట విత్తనాలు లేకపోతే, మరో రైతునుండి బదులుగా గానీ, ఖరీదుకుగానీ తెచ్చుకోవచ్చును. ఈ పది కేజీల విత్తనాల ఖరీదు రూ. 150/- మించకుండా ఉంటుంది. సాధ్యమయినంతవరకూ ఈ పది కేజీల విత్తనాల్లో ఎక్కువ రకాలు ఉండేటట్లుగా చూసుకోవాలి.

ఈ విత్తనాలన్నీ కలిపి వేయాలి. బూడిద, మట్టి తాజా ఆవుపేడ ఒక్కొక్కటి 250 గ్రాముల వంతున తీసుకుని ఆవు మూత్రముతో జారుడు పద్ధతిలో అవసరమయినంత మేరకు కలుపుకుని, విత్తనాలకు పట్టించాలి. విత్తడానికి ఒక రోజు ముందుగా పట్టించి నీడలో ఆరబెట్టాలి. ఇలాగా శుద్ధి చేసిన విత్తనాలు ఒకవారం వరకూ వాడవచ్చును.

పంటపొలంలో భూమిదుక్కి చేసిన తరువాత విత్తనాల్ని వెదజల్లుకోవాలి. వేసిన ఈ విత్తనాలు మొలకెత్తిన తరువాత ఒక నెలకు గుంటక తిరగేసి తిప్పుకోవాలి. దీని ద్వారా పైరు భూమికి అంటుకునిపోతుంది. ఇదంతా మనం సాధారణంగా వేసుకునే వేరు శెనగపంట విత్తుకునే తరుణం జూన్ చివరివారం లేదా జూలై రెండవ వారానికి ఒక నెల ముందుగా పడే తొలకరి వర్షాలలో ఈ పద్ధతిని పాటించాలి. మామూలుగానే ప్రధాన పంట విత్తుకునేటప్పుడు గొర్రుతో విత్తనం వేయవచ్చును.

**ఉపయోగాలు**

ప్రత్యేకంగా ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు. భూమి మీద తేమ హరించుకుపోకుండా అచ్ఛాదనగా (కప్పడంగా) ఉపయోగపడుతుంది. ఈ పైర్లు భూమిలోకి కలిసి పోయి, భూమిలో సూక్ష్మజీవరాశిని పెంచుతాయి. విభిన్న రకాల విత్తనాలు వాడడంవల్ల సూక్ష్మజీవుల పెరుగుదలకు కావలసిన, కర్బనం అభివృద్ధి చెందుతుంది. ప్రతి సంవత్సరం ఇదే తరహాలో చేసుకుంటూపోతే, భూమికి కావలసిన సమతుల్య పోషకాలు దొరుకుతాయి. నత్రజని అభివృద్ధి చెందుతుంది. బయట నుండి ఎరువులు కొనివేయాల్సిన అవసరం ఉండదు. ప్రధాన పంటలకు చీడపీడల ఉధృతి తగ్గుతుంది. ప్రకృతిపరంగా వీటి నియంత్రణ జరుగుతుంది.

తేదీ : 16-09-2010

# సమగ్ర వ్యవసాయ విధానము ( ఐ.ఎఫ్.ఎస్ )

## ఉద్దేశ్యము :

నమ్మకంలేని వర్షపాతము, కఠిన వాతావరణ పరిస్థితులు, తరచుగా వచ్చే కరువులు, వేరుశనగ ఒకే పంట విధానం తదితరాలు వర్షాధార వ్యవసాయానికి ప్రతికూలాంశాలు. దుష్ఫలితాలనిచ్చే రసాయనిక వ్యవసాయం రైతాంగాన్ని అప్పుల విషవలయంలోకి నెడుతున్నాయి. వ్యవసాయాన్ని సుస్థిర పరచుకోవడానికి రైతులు స్వయం పరిపూర్ణత సాధించడానికి సమగ్ర వ్యవసాయ విధాన ఆచరణ తప్పనిసరి. అందులో భాగంగా ఎ.ఎఫ్ ఎకాలజీ సెంటరు మన పరిస్థితులకు అనుకూలంగా వుండే కొన్ని వైవిధ్య వర్షాధార పంటల నమూనాలను అభివృద్ధి చేసింది. రైతు తన పద్ధతిలో కార్తె పంటలను పండిస్తూ, పలు రకాల పండ్ల మొక్కలను, పశువుల మేతకు పనికి వచ్చు మొక్కలు, భూమి సత్తువకు పనికి వచ్చు మొక్కలను నాటుకొని, 4-5 సం॥లు కాపాడుకొనిన యెడల, రాబోవు 4-5 సం॥లలో కరువులో కూడా స్థిరమైన నికర ఆదాయము పొందే అవకాశముంది. దీనిని మిశ్రమ పండ్ల మొక్కల పెంపకము అని అంటున్నాము. దీని వలన రైతుకు ఆహార భద్రతతోబాటు ఆదాయ భద్రత చేకూరుతుంది. రైతు జీవన విధానములో గుణాత్మకమైన మార్పు వస్తుంది.

## రైతుల ఎంపికకు అర్హతలు :

రైతుల ఎంపికలో జాగ్రత్త వహించవలెను. వర్షాధారముగా పండ్ల చెట్లను నాటుకొని వాటిని కాపాడుకునేందుకు ఉత్సాహము గల రైతులను ప్రోత్సహించవలెను. దగ్గరలో గల నీటి వసతిని గమనించవలెను ఎస్.సి., ఎస్.టి చిన్న, సన్నకారు మెట్ట రైతులకు, రైతు మహిళలకు ప్రాధాన్యతనివ్వవలెను. మరియు రైతుల ఎంపిక గ్రామ సస్యమిత్ర సంఘాలు / సమాఖ్యల ద్వారా జరపవలెను.

## పొలాల ఎంపిక :

గ్రామమునకు దగ్గరగా రోడ్డు ప్రక్కన గల మెట్ట పొలాలను ఎంపిక చేసుకొనవలెను. ఎంపిక కాబడిన పొలమునందు వర్షాధారముగా పండ్ల మొక్కలు నాటి, బ్రతికించుకొనుటకు దగ్గర గల నీటి వసతిని గమనించవలెను. పొలము యొక్క విస్తీర్ణము హెక్టారు వరకు వుండవచ్చును కాని ఎంత విస్తీర్ణములో మొక్కలు నాటి బ్రతికించుకొనుటకు అవకాశముగలదో అంత విస్తీర్ణములోనే పండ్లమొక్కలు నాటుకొనవలెను. (అందాజుగా 1 ఎకరా)

## నాటవలసిన మొక్కలు :

మామిడి-40, సపోటా-40, ఉసిరి-40, సీతాఫలము -40 మొక్కలు వచ్చేట్లు ఏర్పాటు చేసుకోవలెను. మామిడి, సపోటా మొక్కలు మధ్య దూరము 8 మీటర్లు వుండవలెను. వాటి మధ్యలో ఉసిరి, సీతాఫలము 4 మీటర్లకు వచ్చేటట్లు అమర్చుకోవలెను. వాలుకు అడ్డముగా వున్న వరసలలోనే ఉసిరి, సీతాఫలము మొక్కలు నాటవలెను. నిలువుగావున్న వరసలలో ఉసిరి, సీతాఫలము నాటరాదు.

8 మీటర్ల ఖాళీనందు రైతు తన పద్ధతిలో కార్తె పంటలను విత్తుకొనవలెను. పొలము చుట్టూ 9" దూరములో కానుగ, సీమ కానుగ, సీమతంగేడు, సుబాబుల్, అవిశె విత్తనములను నాటవలెను.

### పండ్ల చెట్లు నాటుటకు అనువైన నేలలు :

### మామిడి:

మన అనంతపురం జిల్లాలో వేరుశనగ పంట పండు పొలాలన్నీ అనుకూలము. ఉదజని సూచిక 7.5 – 8 ఉన్న నేలలు చౌడు, ఉప్పు, సున్నం, నీరు నిల్వ వుండే బరువైన నల్లరేగడి నేలల్లో నాటకూడదు. మిగిలిన అన్ని సారవంతమైన నేలలు అనుకూలము.

### సపోటా:

ఉదజని సూచిక 8.5 – 9 ఉన్న నేలలు కూడా అనుకూలము. ఇసుక భూముల, అధిక చౌడు వున్న నేలలు, ఉప్పు నేలలు కూడా నాటడానికి పనికి వస్తాయి. కొండ ప్రాంతాలు, లోతు తక్కువ నేలల్లో కూడా నాట వచ్చును.

### సీతా ఫలం:

మురుగు నీరు పోయే సదుపాయం కలిగిన, ఉదజని సూచిక 5.5 – 7.5 గల నేలలు అనుకూలము. సీతాఫలం చెట్లు చౌడు క్షార నేలల్లో కొంత వరకు తట్టుకొని పెరగడానికి అవకాశమున్నది. నీరు నిల్వని చల్కా నేలలు, గరువు నేలలు, గరప నేలల్లో బాగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. రాళ్ళతో కూడిన గరుకు నేలల్లో కూడా సాగు చేయవచ్చును.

### ఉసిరి:

సర్వ సాధారణముగా మన జిల్లాలో చవుడు భూములు ఎక్కువ. అయినను వాటిలో ఉసిరి బాగా పండించవచ్చును. ఉదజని సూచిక 9.5 వరకు వున్న భూములలో ఉసిరి పండించవచ్చును. ఆమ్ల, క్షార లక్షణాలున్న భూముల్లో కూడా ఈ పంటను పెంచవచ్చును.

### రైతులకు దీర్ఘకాలంలో జరుగు ప్రయోజనము

రైతు కార్తె పంటలతో బాటు, పలు రకాలయిన పండ్ల చెట్లు ఎరువునిచ్చు చెట్లు, పశుగ్రాసపు చెట్లు నాటుకొనుటవలన దీర్ఘకాల ప్రయోజనములు చేకూరును.

1 ఎరువు నిచ్చు చెట్లవలన వాటి ఆకులు అలములతో మల్చింగ్ చేయుట వలన భూమి యందు సేంద్రియ కర్బనము మోతాదు పెరిగి హ్యూమస్ పెంచుటకు ఉ పయోగపడుతుంది.

2 స్వదేశి వాన పాములు, సూక్ష్మ జీవుల సంఖ్య అధికమగును. తద్వారా భూమి గుళ్ళబారి, సారవంతమగును

3 భూమి అధిక తేమను నిల్పుకొను శక్తి కలిగి వుండును. భూమి కోత అరికట్టబడును. భూసారము పెరుగుటవలన అధిక దిగుబడి సాధించవచ్చును.

4 పశుగ్రాసము మరియు పశుగ్రాసపు చెట్లు నాటుకొనుట వలన చిన్న జీవాలను కాని, పాడి ఆవును కాని సంరక్షించుకొనవచ్చును. వాటి ద్వారా సంవత్సరానికి పది, పదిహేను వేల వరకు అధిక ఆదాయము పొందు అవకాశమున్నది

5 రైతు కొద్దిపాటి విస్తీర్ణములో కూరగాయలను సాగు చేసుకొనిన యెడల, తన ఇంటి వాడకమునకు మరియు ఎక్కువగావున్న అమ్మకము చేపట్టవచ్చును తద్వారా పౌష్టికాహార భద్రత, కూరగాయల కొనుగోలుకయ్యే అదనపు ఖర్చు తగ్గిపోవును.

6 చాలావరకు సీతా ఫలము, సపోటా 2–3 సం॥ల నుండి కాపుకు వచ్చును. నాలుగైదు సంవత్సరాలకు మామిడి చెట్లు బాగా అభివృద్ధి చెంది ఫలసాయము నిచ్చును. వీటి ద్వారా దాదాపు పదివేల రూపాయల అధిక ఆదాయము పొందవచ్చును. దీర్ఘకాలములో అన్ని పండ్ల చెట్లద్వారా సంవత్సరానికి యాభయివేల వరకు ఆదాయము వచ్చే అవకాశమున్నది.

కావున రైతు సోదరులు సమగ్ర వ్యవసాయ విధాన పద్ధతులు పాటించవలెను. బహుళ పంటలు, కూరగాయలు, పాడి పశువులు లేదా చిన్న జీవాలు, పండ్ల చెట్ల ద్వారా దీర్ఘకాలములో వారికి ఆహార భద్రత, ఆదాయ భద్రతతో బాటు మెరుగైన జీవన విధానమును పాటించవచ్చును.

తేదీ : 30–12–2010

# వాతావరణం మార్పులకు తట్టుకొని

# అనంతపురం జిల్లా వ్యవసాయాన్ని కాపాడుకునే విధానాలు

ప్రపంచ వాతావరణం ముఖ్యంగా వస్తున్న మార్పు భూతాపం పెరగడం .అంటే భూమిమీద వేడి (ఉష్ణోగ్రత) పెరగడం. భూతాపం ఎందుకు పెరుగుతున్నదంటే పరిశ్రమలు బాగా ఎక్కువై, పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యంలో కార్బన్‌డయాక్సైడ్ భూగోళాన్ని ఆవరించడం వలన (ఉష్ణోగ్రత) భూమి పై వేడి పెరుగుచున్నది. పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యాన్ని 'కర్బన ఉద్గారాలు' అంటున్నారు. ఈ కర్బన ఉద్గారాలే భూగోళం వేడెక్కడానికి అంటే భూతాపానికి కారణం. పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన ధనిక దేశాలు (అనగా అమెరికా, ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, జపాన్ లాంటి దేశాలు) వాటి పరిశ్రమల ద్వారా కర్బన ఉద్గారాలను ఎక్కువగా విడుదల చేస్తున్నాయి. ఇప్పుడే కాదు, ఇప్పటికి దాదాపు రెండువందల సంవత్సరాల నుండి ఆ దేశాలలో పరిశ్రమలు ఎక్కువగా స్థాపించినారు కాబట్టి, అప్పటి నుండి ఆ దేశాలు ఈ కర్బన ఉద్గారాలను భూమి మీదకు విడుదల చేస్తున్నాయి. నూర్ల సంవత్సరాల నుండి వారు ఆ విధంగా కర్బన ఉద్గారాలను గాలిలోకి విడుదల చేస్తున్న కారణంగానే భూతాపం పెరగడానికి ఆ దేశాలు ముఖ్య కారణమన్న మాట. కాబట్టి ఈ సమస్యకు ముఖ్య కారకులు అభివృద్ధి చెందిన ధనిక దేశాలు .

భూతాపం ప్రపంచంలోని అన్ని దేశాలలో పెరుగుతున్నది. అయితే భూతాపం పెరగడం వలన వచ్చే చెడు ఫలితాలు ఒక్కో ప్రాంతం పై ఒక్కొ రకంగా వుంటున్నాయి. ఈ చెడు ఫలితాలు మన జిల్లా వ్యవసాయం పై ఏ విధంగా వుంటున్నాయి, వాటిని మనము ఏ విధంగా ఎదుర్కోవచ్చు అనే అంశాలను ఈ నెల ప్రస్తావిస్తాము.

వాతావరణ మార్పులతో పేద దేశాలలోని మెట్ట వ్యవసాయం బాగా దెబ్బ తింటున్నదని నిపుణులు మనల్ని హెచ్చరిస్తున్నారు. గతంలో మాములుగా రుతువుల ప్రకారం వర్షాలు వచ్చే ప్రాంతాలలోని వ్యవసాయమే ఈ రోజు ఇబ్బందులకు గురువుతున్నదంటే, అనుకున్న ప్రకారం ఎపుడూ వర్షాలు కురవని మన ప్రాంతంలో వ్యవసాయం ఏ విధంగా ఉంటుందో , ఏ విధంగా ఒడిదుడుకులకు లోనవుతుందో మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు.ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయం బరువుగా మారినపుడు , అదనంగా వాతావరణం మార్పులు వ్యవసాయం మీద తీవ్ర ప్రభావాన్ని చూపితే , రైతు పరిస్థితి గోరుచుట్టు మీద రోకటి పోటులా ఎవ్వరికీ తెలియదన్న సామెత అక్షరాలా మనకు వర్తిస్తుంది. దేశం మొత్తం మీద కరువులనేవి ఏ 20 మన వసతి ఉంది. మొత్తం వ్యవసాయదారులలో 90శాతం మంది చిన్నకారు , సన్నకారు రైతులే . వీరికి ఋణం భారం తప్ప వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులు ఉండవు. అందుకే పంటలు వేయడానికి ముందు ప్రతి రైతు నానా కష్టాలు పడవలసివస్తుంది . వాతావరణ నష్టాలకు కారణం మనం మాత్రమే కాదు. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజల

ఎక్కువగా నష్టాల్ని కలుగజేస్తే పేద దేశాలు మరియు మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలు ఎక్కువగా నష్టాల్ని మనం ఏ రకంగా ఎదుర్కోవాలనేదే ఈనాడు మనముందన్న సమస్య.

## భౌగోళిక వాతావరణ మార్పులవలన మన జిల్లా వాతావరణంలో కనిపిస్తున్న ప్రధాన మార్పులు

మన జిల్లాలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలు జూన్ మాసంలో మొదలై సెప్టెంబరు మాసం వరకూ వర్షాలు కురిసేవి . ఈశాన్య ఋతుపవనాలు అక్టోబరు , నవంబర్ నెలలలో వర్షాన్ని కలుగజేసేవి.మొత్తంగా కనీసం 5 నెలలకు మించి వర్షాకాలం వుండేది. కానీ , ఇప్పుడు వర్షాకాలం అయిదు నెలల నుండి నాలుగు నెలలకు కుంచించుకుపోయింది. ఒక రోజులో 2.5 మి.మీ మించి వర్షం పడితే దానిని ఒక వర్షపు దినం అంటాం. (2.5మి.మీ. వర్షం అంటే అవి బట్ట తడి చినుకులు 30 మి.మీ అంటే ఒక పదును). మన జిల్లాలో సాధారణంగా 35 వర్షపు రోజులు ఉండేవి.ఇపుడు అవి 25 రోజులకు పడి పోయినట్లుగా భావిస్తున్నారు. వర్షపు రోజులు తగ్గినందువలన మన వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతూంది . ఒక్కోసారి వర్షాలు ప్రారంభమై మధ్యలో 40 రోజుల నుంచి 45 రోజుల వరకూ (వర్షపు) వర్షాలు కురవడం లేదు. సాధారణంగా సెప్టంబర్ ఆఖరుకే నైరుతీ రుతుపవనాలు ముగియవలసివున్నా , గత సంవత్సరం అక్టోబరు మొదటి వారంలో కూడా నైరుతి రుతుపవనాల ద్వారా వర్షాలు వచ్చినాయి. అంటే రుతువులు వాటి సాధారణ గతి తప్పినాయన్న మాట. కురిసే వర్షం సాంద్రత (ఉధృతి) పెరగడం జరుగుతోంది. అంటే ఒక్కోసారి కురిసే వర్షం కొద్ది సమయంలోనే వేగంగా కుండపోతలా కురవడం జరుగుతోంది. దీని వలన నేల కోతకు గురై భూసారం అధికంగా కొట్టుకొని పోతోంది. వాతావరణ ఉష్ణోగ్రతలలో మార్పులు వసస్తున్నాయి. గత జనవరిలో ఒకే రోజు కనిష్ట ఊష్టోగ్రత 13 సెంటిగ్రేడ్ ఉంటే , గరిష్ట ఊష్టోగ్రత 38 గా ఉంది. ఈ భారీ వ్యత్యాసం వాతావరణం పై ప్రభావాన్ని చూపుతుంది. ఉన్నట్టుండి చలిగాలులు రావడం, ఉన్నట్టుండి వేడి కావడం, అకాల గాలులు వీచడంలాంటివన్నమాట. ఈ విధంగా త్వర త్వరగా ఉష్ణోగ్రతలలో మార్పులు వస్తుండడం వల్ల లొంగని కొత్త కొత్త జ్వరాలు , రోగాలు ఎక్కువవుతున్నాయి.

## పంటల మీద వాతావరణం మార్పుల ప్రభావం:

పంటల మీద అనేక కొత్త తెగుళ్ళు , చీడపీడలు దాడి చేస్తున్నాయి, కర్భూజ పంట వేసిన రైతులనడిగితే దీనివల్ల వారుపడుతున్న బాధలు చెబుతారు . పైన మోడాలు ఆడితే, కింద పంటకు పురుగు పడుతుంది.సాధారణంగా ఎండాకాలంలో వేడి, చలికాలంలో చల్లదనం ఎక్కువగా ఉండడం మాములే . పగటి ఉష్ణోగ్రత రాత్రి ఉష్ణోగ్రత తేడా 10 డిగ్రీల సెంటిగ్రేడులకు మించి ఉండేది కాదు ఇపుడు ఈ తేడా పెరిగింది. పగలు 38 సెంటిగ్రేడులతో ఎండలు కాస్తే , రాత్రికి 13 సెంటిగ్రేడులతో . అధిక గాలులు, వర్షపు వేగంవల్ల , భూముల పై పొర కొట్టుకుపోవడం నేలకోతకు గురికావడం అధికమవుతుంది. దాని మూలంగా చెరువులు, కాలువల్లో పూడిక పెరుగుతుంది. భూమిపైపొరలో సహజంగా వుండే పోషక పదార్థాలు , వ్యవస్థతగ్గిపోతూ ఉన్నాయి. సహజ సిద్ధంగా వున్న నీటి ఊటలు, భూమిపై పొరల్లో నిలువ ఉండే తేమ శాతం తగ్గిపోతూ ఉన్నాయి. ఇవన్నీ కలిసి చివరికి భూమిలో దొరికే భూగర్భజలాలు అడుగంటిపోతాయి. ఈ రకంగా ఊష్ణోగ్రతల భారీ వ్యత్యాసం వల్ల రాయిముక్కలుగా పగులుతుంది. ఈ విధంగా రాళ్ళు పగిలి చిన్న రేణువులుగా మారి చివరకి ఎడారీకరణ జరుగుతుంది. వర్షాల మధ్య దూరం పెరిగి కరువులు అధికంగా వస్తున్నాయి. వర్షాకాలం కుదించుకు పోవడం వలన పంట కాలానికి ముందే వర్షాలు ఆగిపోతున్నాయి. పంటకాలం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది,

పెరుగుతున్న వేడి వల్ల కొన్ని పశు పక్ష్యాదులు నశించిపోతాయి. ప్రకృతిలో కొన్ని మొక్కలు పెరగకుండా పోతాయి. ప్రకృతిలో కొన్ని లక్షల రకాల మొక్కల జాతులు , ప్రాణికోటి ఉన్నాయని మనకు తెలుసుకదా.వాతావరణ మార్పుల వలన జీవ వైవిధ్యత తగ్గుతుంది. వాతావరణాన్ని ప్రకృతిని జీవ వైవిధ్యత సమతూకంలో ఉంచుతుంది. ఈ సమతూకం నశిస్తే, మనిషి మనుగడకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం , వైద్య రంగాలలో వస్తున్న విప్లవాత్మక పరిశోధనలతో సగటు మనిషి ఆయు ప్రమాణం పెరుగుతుంది. మరో పక్క జనాభా కూడా పెరుగుతుంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు తిండికి ప్రకృతే ఆధారం . నేరుగా ఆహార ఉత్పత్తి కావచ్చు, మనిషి మనుగడకు ఇవి ఆధారం . ఈ వనరులు నశించుకుంటూ పోతే , మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

వాతావరణంలో వస్తున్న మార్పుల మూలంగా , పంటకాలం తగ్గిపోతున్నది దీనివలన తక్కువ కాలంలో చేతికి వచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపాల్సి వస్తున్నది. దీని మూలంగా గిట్టుబాలు లేని పంటలు కూడా రైతు పండిచాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. కురిసే వర్షంలో కూడా చాలామార్పులు కనిపిస్తున్నాయి. పైచేనులో వర్షము పడితే క్రింది చేనులో పడడం లేదు . దీని మూలంగా ఒకే గ్రామంలో పంటల దిగుబడులలో తేడాలుంటాయి.పంటలకు రకరకాల తెగుళ్ళురావడం ఎక్కువయింది. తెగుళ్ళు వచ్చే కొద్దీ రైతులకు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. విచక్షణరహితంగా ఖనిజాల కోసం కొండలు తవ్వడం మూలంగా కనీస పచ్చదనం కూడా లేకుండా పోగొట్టుకుంటున్నాం. కొన్నేళ్ళకు జిల్లాలో పచ్చదనం కనిపించకుండా పోయినా , ఆశ్చర్యపడాల్సిన పని లేదు . జిల్లాలో ప్రతి గ్రామంలో గ్రామనెత్తం, పశువులు గొర్రెలు మేయడానికి పచ్చిక బయళ్ళు ఉండేవి. రానూ రానూ ఇవన్ని అంతరించి పోతున్నాయి. తీవ్రమైన గడ్డి కరువు ఏర్పడుతుంది.వాతావరణ మార్పుల మూలంగా సాధారణంగా పండే పంటల్లో 50 శాతం దాకా దిగుబడులలో తగ్గిపోవచ్చని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐ.సిజే.ఆర్) మనల్ని హెచ్చరిస్తోంది.

వర్షాధారం మీద ఆధారపడ్తున్న మెట్ట రైతులు పండించే పంటల మీద రాబడి తగ్గిపోతూ ఉంది. దీని ఫలితంగా చిన్న, సన్న కారు రైతు కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి.ముఖ్యంగా సన్న, చిన్న కారు రైతులు , వ్యవసాయ కూలీల జీవనాదాయం గణనీయంగా తగ్గిపోతుంది. ఎప్పుడైతే రైతు కుటుంబాల ఆదాయంలో కోత పడుతున్నదో, దానికి ముందుగా గురయ్యేవారు వృద్ధులు, పిల్లలు , మహిళలు , వీరికి సరైన పోషకాహారం దొరకదు . సాధారణ జబ్బులకు సైతం వైద్య సదుపాయం పొందలేని స్థితిలో ఉంటారు. తాగు నీటి కొరత ప్రతి సంవత్సరం పెరిగిపోతూ ఉంటుంది. మొత్తం మీద జిల్లా ఆర్థిక పరిస్థితిలోనే మార్పు వస్తుంది. ఆదాయవనరులలో నశింపు వుంటుంది.

## వాతావరణ మార్పుల తీవ్రతను తగ్గించుకోవడం ఎలా?

వాతావరణ మార్పులను అధిగమించడానికి శాస్త్రజ్ఞులు రెండు మార్గాలను సూచిస్తారు. అవి

1. వాతావరణ మార్పుల ఉధృతిని తగ్గించి, మార్పును చాలా ఆలస్యంగా వచ్చేటట్లు చేయడం.
2. వస్తున్న మార్పులను తట్టుకునే విధంగా మన వ్యవసాయ పద్ధతులను మార్చుకోవడం మనమే కాదు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల తీవ్రత తగ్గింపు కోసం గట్టి ప్రయత్నాలు చేయాలి. అందులో భాగంగానే మనం కూడా వాతావరణ తీవ్రతను తగ్గింపు కోసం మన పరిధిలో కొన్ని చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వాతావరణ మార్పుల వేగాన్ని తగ్గించడానికి ఒక ప్రణాళిక ప్రకారం భూమిని పర్యావరణాన్ని కాపాడుకునే ప్రయత్నాలు గట్టిగా చేయాలి. మన జిల్లాలో గాలి ద్వారా, వర్షపు నీటి ద్వారా, భూమి

విలువైన పొర కొట్టుకుపోయే పరిస్థితి ఎక్కువగా ఉన్నదని , ఎండలకు భూములు పై నీడ (వృక్షజాలం) లేనందు వలన మాడిపోతున్నదని మనకు తెలుసు. అందుకుగానూ ప్రతి గ్రామ స్థాయిలో వాటర్ షెడ్డు కార్యకలాపాలను క్రమ బద్ధంగా అమలు చేయాలి.దీని ద్వారా భూమిపై పచ్చదనం పెరిగి ఉండే మట్టి కొట్టుకొని పోకుండా భూమిలో ఉండే తేమ, వానపాముల్లాంటి అనేక సూక్ష్మజీవులూ సంరక్షింపబడుతాయి. అంతేకాకుండా వాతావరణంలోని కర్బనాలను వృక్షాలు పీల్చుకొని , వాతావరణంలో వస్తున్న చెడు మార్పు వేగాన్ని బాగా తగ్గిస్తాయి. ఎపుడైతే ,భూమికి పోషకాలు, తేమ రూపంగా బలం చేకూరుతుందో, అటువంటి భూములలో వేసిన పంటలు వాతావరణ మార్పులకు తట్టుకోనే శక్తి ఉంటుంది. కొంతమేరకు రక్షింపబడతాయి. పొలం గట్ల మీద చెట్లు విరివిగా పెంచాలని ప్రతి సందర్భంలోనూ చెబుతూ వస్తున్నాను. పోయిన వర్షాకాలంలో రైతులు , పొలాల గట్ల మీద మొక్కలు నాటటంతో పాటు విత్తనాలు నాటటం కూడా జరిగింది. చెట్లవల్ల కేవలం పచ్చి ఆకు దొరకడమే కాదు, చెట్లు గాలుల వేగం కూడా తగ్గిస్తాయి. ఎండల బారినుండి పొలాలను రక్షిస్తాయి. దీని ద్వారా భూమికోతతో పాటు, ఎండలకు భూమి ఎండే ప్రక్రియను తగ్గిస్తాయి. ఇక చెట్ల ఆకులు సేంద్రీయ ఎరువుగా కూడా ఉపయోగపడతాయని తెలుసు. వాటర్‌షెడ్‌పనుల వల్ల వర్షపు నీరు బయటికి పొర్లకుండా పొలంలోనే ఉండిపోతాయి. కొంత మంది రైతులు వాలుకు అడ్డంగా వేసిన కుంట కట్టల వల్ల సేద్యానికి ఇబ్బంది కలుగుతుందని ఇప్పటికీ భావించే వారున్నారు.వాలుకట్టల వల్ల సంవత్సరంలో రెండు మూడు సార్లు చేసే వ్యవసాయం పనులలో జరిగే సౌలభ్యం కోసం చూసుకుంటే జరిగే నష్టం పెద్దది. కట్టలు వృథాగా ఉండవు. కట్టల మీద చెట్లునాటుకుంటే .కట్టలు వేసినంత పొలంలో పండే పంటలకన్న 4-5 ఇంతలు ఎక్కువగా చెట్ల రూపంలో రైతుకు ఆదాయం వస్తుంది. వంట చెరకు కోసం చెట్లు కొట్టివేయకుండా గ్రామల్లో ఉండే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పరచాలి.

మన పూర్వీకులు ప్రతి గ్రామానికి ఉపయోగపడేటట్లు చెరువులను, కుంటలను వర్షపు నీరు నిలవరితకు, భూగర్భ జలాలు పెరగడం కొరకు, చెరువులు కుంటలు ఉపయోగపడతాయి. వీటిని ప్రజలు తమ ఉమ్మడి ఆస్థిగా భావించాలి. వాటిని కాపాడుకోవాలి. చిన్న చిన్న కొండలు, గుట్టలు, బంజరు భూములలో పచ్చదనం అభివృద్ధి కొరకు కృషి చేయాలి. ఇవన్నీ వాతావరణ మార్పుల తీవ్రత తగ్గించుకునే కార్యక్రమాలు.

## వచ్చే వాతావరణ మార్పులకు తట్టుకోవడం ఎలా?

ప్రపంచమంతటా వాతావరణంలో మార్పులు చేసుకొంటున్నాయి. అయితే మార్పుల ప్రభావం మాత్రము ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వుంటుంది. మన జిల్లా పైన ఎటువంటి ప్రభావం వుంటుందో అపుడే వివరించాను. ఇపుడు అటువంటి మార్పులకు ఏ విధంగా తట్టుకోవాలో, మన వ్యవసాయంలో ఎటువంటి మార్పులు తీసుకొని రావాలో ఆలోచిద్దాం. స్థానికంగా మన పరిస్థితులకు అనుగుణంగా , నష్ట నివారణ కార్యక్రమాలు చేపట్టాలి. పొలాల్లో రసాయనిక ఎరువులను వాడడం మాని వేయాలి. రసాయనిక ఎరువు వాడకం ద్వారా భూముల స్వస్థత దెబ్బతింటూ, భూముల్లో పోషకాల అసమతుల్యత పెరుగుతుంది. పంటలకు పోషక పదార్థాలలోటుతో కొత్తరోగాలు వస్తాయి. వచ్చిన రోగాలు ఒక పట్టాన పోవు. ప్రకృతి చెడిపోవడానికి, వాతావరణంలో వేడి పెరిగి పోవడానికి వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడకం ఒక ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తూ ఉన్నారు. కాబట్టి రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా మానివేయాలి. రసాయనిక ఎరువులు వేస్తే తప్ప, పంటలు పండవు అన్న

భావన నుంచి ముందుగా మనం బయట పడాల్సి ఉంటుంది. ఈ కింద వివరించిన రక్షణాత్మక చర్యలు చేపట్టాల్సి వుంటుంది.

**1.సమగ్ర వ్యవసాయ విధానాన్ని అమలు పర్చాలి :** ఇందులో భాగంగా ఆహార, వాణిజ్య మిశ్రమ పంటలతో పాటు పాడి పరిశ్రమ, గొర్రెలు,మేకల పెంపకం ప్రతి రైతు చేపట్టాలి. సమగ్ర వ్యవసాయ విధానమంటే , ఏమిటో, పాడి, పశువుల పెంపకం, జీవాల పెంపకం వల్ల కుటుంబానికి దొరికే అదనపు ఆదాయం ఏ విధంగా కుటుంబాలను ఆదుకుంటాయో కూడా గతంలో వివరించడం జరిగింది. వ్యవసాయంలో లీసా తరహా సేంద్రీయ పద్ధతులను అనుసరించాలి. సాధ్యమైనంత ఎక్కువగా వర్షాధార పండ్ల చెట్లను మరియు మేతకు , దిబ్బ ఎరువులకు ఉపయోగపడే చెట్లను విరివిగా పెంచాలి.ఒక పంట పోయినా , మిగతా పంటలు రైతు చేతికి వచ్చేటట్లు సాధ్యమయినంతవరకూ బహుళ పంటలు రైతు వేయగలగాలి. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో కార్తె పంటలైన వేరుశనగ, ధాన్యపు పంటలలో కూడా తొందరగా కోతకొచ్చే విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. పంటలపై చీడలు , పీడలకు రసాయనిక మందులు వాడకుండా ప్రకృతి సహజ పద్ధతిలో నివారణా చర్యలు చేపట్టాలి.

**2.వర్షపు నీరు సద్వినియోగం :** సాధ్యమయినంత వరకూ వర్షపు నీరు దొర్లకుండా పడిన వర్షపు నీరు పొలాల్లోనే ఇంకే విధంగా , నిలకడగా భూమిలో వర్షపు నీటిని నిలవరించే ప్రక్రియలను చేపట్టాలి.భూగర్భ జలాలను వ్యవసాయానికి వాడేటప్పుడు ఆరుతడి పంటలనే ఎంపిక చేసుకోవాలి. నీటి వినియోగం తగ్గింపు కొరకు , తక్కువ నీటితో ఎక్కువ భాగం పైర్లకు ఉపయోగపడే పద్ధతిలో సూక్ష్మ, బిందు నీటి సాగు పద్ధతులను ఉపయోగించాలి. రైతులకు నమ్మకమైన ఆదాయంతో పాటు , పచ్చదనాన్ని పెంచడం కొరకు వర్షాధార పళ్ళ చెట్ల పెంపకాన్ని చేపట్టాలి. మొదటి మూడు సంవత్సరాలు బండ్ల ద్వారానో , కడవల ద్వారానో మొక్కలకు నీరందించి బతికించుకో గలిగితే, అవే తిరిగి రైతును బతికిస్తాయి.

**3. అడవుల పునరుద్ధరణ సంరక్షణ –** మన జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల అటవీ భూమి ఉంది. అయితే చెట్లు లేవు. అలాగే అదనంగా దాదాపు 5 లక్షల ఎకరాల గుట్టలు, వంకల రూపంలో రెవిన్యూ డిపార్టుమెంటు ఆధీనంలో వుంది. ఇక్కడా చెట్లు లేవు . ఈ పది లక్షల ఎకరాలలోనూ విరివిగా చెట్లు పెంచే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టి వాటిని సంరక్షించవలసి వుంది. అనాటి ,వేప, చింత, మర్రి, రాగి , సీతాఫలము , కానుగ, తుమ్మ, ఆవిశ లాంటి ప్రజా ఉపయోగ చెట్లను , జీవ వైవిధ్యం పెరిగేలా చెట్లు విరివిగా పెంచాలి.

**4.వ్యవసాయోత్పత్తుల విలువ పెంపు –** రైతులు, రైతు కూలీల ఆదాయాన్ని మరింత మెరుగుపర్చుకునే విధంగా , వేరుశనగ , కందులు లాంటి వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చే విధంగా కార్యక్రమాలు చేపట్టాలి. చింతపండులో విత్తనాలు, పొట్టుతీసి శుద్ధి చేసి అమ్మకానికి సిద్ధంగా తయారు చేయడం , వేరుశనగకు పొట్టుతీసి విత్తనాలుగా , తినేందుకు వీలుగా వేయించి ఉప్పు, కారం కలిపి , లేదా బెల్లం కలిపి పాకెట్లు తయారు చేసి అమ్మడంలాంటివి . కందులతో బేడలు చేసి చిన్న ప్యాకెట్లు తయారు చేసి అమ్మడంలాంటివి చేపట్టాలి. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అధిక ఆదాయంతోపాటు నిరుద్యోగులకు ఉపాధి కూడా లభిస్తుంది.

ఇప్పటికి జిల్లాలో వున్న చేనేత, పట్టులాంటి పరిశ్రమలను తగిన ప్రోత్సాహకాలిచ్చి, సంరక్షిస్తూ ఇతర శ్రమాధార పరిశ్రమలను బాగా ప్రోత్సాహించవలయును.దానిమ్మ, చీనా, పపాయ, జామ, మామిడి, సపోటాలాంటి పండ్ల ఉత్పత్తి ఆధారంగా విలువ పెంచే పరిశ్రమలను స్థాపించుట వలన రైతులకు

అధికంగా ధర గిట్టుబాటు కావడంతోపాటు , నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా లభిస్తాయి.

**5. నిరుద్యోగ యువతకు వృత్తి శిక్షణ–** గ్రామాలలో దాదాపు ఆడ, మగ పిల్లలందరూ 10 వ తరగతి వరకైనా చదువుకుని ఉన్నారు. వీరిలో పై ఉద్యోగాలకు పోయే అర్హత లేక గ్రామాలల్లోనే ఉంటున్నారు. ఇటువంటి పిల్లలందరికి వృత్తి శిక్షణ , నైపుణ్యం అందచేస్తే, వారి కాళ్ళ మీద వారు నిలబడగలుగుతారు. తల్లిదండ్రులకు భారం కూడా తగ్గుతుంది. మన సంస్థ తరుపున ఇటువంటి యువత వృత్తి విద్యా నైపుణ్యం అందించడానికి శిక్షణా కార్యక్రమాలు నడపబడుతున్నాయి. ఆ అవకాశాన్ని యువత ఉపయోగించుకుని బాగుపడేందుకు ప్రోత్సాహించాలి. మహిళలకు చీరలు నేయడంలోనూ, టైలరింగ్ ద్వారా రెడీమేడ్ దుస్తులు కుట్టడంలోనూ శిక్షణ ఇవ్వాలి. కుటుంబ ఆదాయంలో వారి పాత్ర ఉండే విధంగా ఉపాధి శిక్షణ ఇవ్వాలి.

## ప్రభుత్వ విధానాలలో తగిన విధంగా మార్పులు చేయాలి

కేవలం మనకు మాత్రమే వాతావరణ మార్పులతో అవగాహన ఉంటే సరిపోదు. ప్రభుత్వ విధానాలలో వాతావరణ మార్పులకు సంబంధించి కార్యక్రమాలు, వాటిని తగిన విధానాలు రూపొందించే విధంగా ప్రజా ప్రతి నిధుల ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. వాతావరణ మార్పులలో కలిగే దుష్ఫలితాల గురించి పాఠ్య పుస్తకాలు రూపొందించాలి. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని నిలుపుదల చేయడం కొరకు సేంద్రీయ ,సమగ్ర వ్యవసాయ విధానము కొరకు ప్రభుత్వం కార్యక్రమాలు రూపొందించి ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. అటవీ ప్రాంతం కొండలు, గుట్టలు పచ్చదనంతో నిండే విధానాలు కార్యక్రమాలు చేపట్టాలి. వర్షాధార సేంద్రీయ వ్యవసాయ రైతులకు ఎకరాలకు కనీసం రూ.3000/– చొప్పున సేంద్రీయ ఎరువులు తయారు చేసుకోవడానికి, రసాయనాలు లేకుండా చీడ పీడలను నివారించడానికి సహాయం అందచేయాలి.

జనవరి 2010

# అంతర్జాతీయ కరువు మరియు ఎడారి నివారణ దినం

**అంతర్జాతీయ కరువు - ఎడారి నివారణ దినం సందర్భముగా దుర్భిక్ష ప్రాంతాల కనీస నీటి అవసరాల గుర్తింపు మరియు తక్షణ సాధన కోసం చర్చల ఆవశ్యకతపై బాధితప్రాంతాల మనోభావాలు ప్రతిబింబించేలా చేసే సంక్షిప్త ముసాయిదా చర్చా పత్రం.**

## మొదటి భాగము

### పరిచయము:

**నీరు:** నీరు ప్రకృతి ప్రసాదములలో ముఖ్యమైనది, విలువైనది. సమస్త జీవకోటికి ఆధారమైనది. వ్యవసాయ రంగానికి మూలాధారమైనది. దాదాపు 70శాతం జనాభా గ్రామీణులు. వీరికి వ్యవసాయం ప్రధానమైన వృత్తి. నీరుంటేనే గ్రామాలలో ఆనందం. వారి జీవనోపాధికి సోపానం నీటి లభ్యత . జీవకోటి మనుగడకు అవసరమైన మూల పదార్థాలలో ఒకటైన త్రాగు మరియు సాగు నీటి కోసం, దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం, పారిశ్రామికీకరణ కోసం, సామాజిక సంక్షేమం కోసం, ఆరోగ్యం కోసం మరియు మానసికోల్లాసానికి ఈ నీరే మరింత అరుదైన వనరుగా మారుతున్నది. నీరు ప్రకృతిలో సమృద్ధిగా లభ్యమవుతుందనే భ్రమకలుగుతుంది. కాని నిశితంగా పరిశీలిస్తే లభ్యమయ్యే నీటిలో కేవలం 0.5 శాతం మాత్రమే మానవ వినియోగానికి వీలవుతుంది. మిగతా 99.5శాతం, సముద్రాలు, ఉత్తర-దక్షిణ ధృవాలు, మంచు కొండలలో వున్నవి. వర్షాలు కురవటంలో ఒకే సంవత్సరంలో హెచ్చు తగ్గులుంటాయి. వర్షాలు కురిసే ప్రాంతాలలో హెచ్చు తగ్గులుంటాయి. నీరు మనకు ఎక్కడ అవసరమైతే అక్కడ దొరకదు. అన్ని కాలాలలో లభ్యం కాదు. అవసరమైన అన్ని ప్రాంతాలకు అవసరాలకనుగుణంగా నీటి లభ్యతలో లోటు ఏర్పడినప్పుడు, ఆ లోటును సవరించి తీరవలయును. నీటిని అందరి అవసరాలు తీర్చుటకు ప్రాంతాల మధ్య అసమానతలు, విభేదాలు రాకుండా సమన్యాయం సాధించుటకు, సమగ్ర నీటి నిర్వహణ విధానాలు మరియు ప్రణాళికలు అవసరము.

మన దేశానికి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు, స్వతంత్ర భారతదేశంలో సుమారు 7 దశాబ్దాలు సుదీర్ఘకాలం గడిచినా, త్రాగు నీటికి కూడా అలమటిస్తున్న ప్రాంతాలు ఉన్నాయి.తరతరాలుగా కనీస స్థాయిలో సాగు నీటి సౌకర్యం పొందని కారణంగా, వివిధ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య జిల్లాల మధ్య, మండలాల మధ్య, గ్రామాల మధ్య, చివరకు కుటుంబాల మధ్య కూడా జలవివాదాలు రోజు రోజుకు పెరుగుతుండడం మనం చూస్తున్నాం. దినదినానికి పెరుగుతున్న నీటి అవసరాలు ఈ వివాదాలను మరింత ఉధృతం చేస్తున్నాయి. ఈ నాగరికత ప్రపంచంలో, దేశాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు, మానవాభ్యుదయానికి ఈ వివాదాలు ఒక గొడ్డలి పెట్టు, మనమందరం విశాల దృక్పథంతో, శాస్త్రీయ, సమగ్ర విధానంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించకపోతే భావితరాలకు మనం సంక్రమింప చేసే దురవస్థ అన్ని స్థాయిలలోనూ జల వివాదాలు కాస్త జల యుద్ధాలుగా పరిణమించే అపాయం ఉంది.

## 2.పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి వినియోగంలో ఏర్పడిన అసమానతలు

23 జిల్లాల సమగ్ర ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ చిన్న, పెద్ద 40 నదులు ప్రవహిస్తున్నాయి. అందులో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి ముఖ్యమైనవి, 75 శాతం ఆధారిత నదీజల పరిమాణం 2769 శతకోటి ఘనపుటడుగులు (శ.కో.ఘ/ టి.యం.సి)పై ఉపరితలం నీటి (నదీజలాలు) లభ్యతతో బాటు సుమారు 1140 శ.కో.ఘ అడుగుల భూగర్భజలాలు కూడా లభ్యమవుతున్నవి. గోదావరి నదిలో లభ్యమయ్యే 1480 టి.యం.సి.లలో ఇప్పటికే సమగ్ర రాష్ట్రం వినియోగిస్తున్నది కేవలం 720 టి.యం.సి లు మాత్రమే క్రిష్ణా నది నుండి అంచనా వేసిన 811 టి.యం.సి లు పూర్తిగా వినియోగిస్తున్నాము అయితే గోదావరి నదీలోయ నుండి సుమారు 300 టి.యం.సి లు క్రిష్ణానది లోయ నుండి సుమారు 1000 టి.యం.సి లు మొత్తం 4000 టి.యం.సి.లు వృథాగా దాదాపు ప్రతి సంవత్సరం కూడా బంగాళఖాతంలో చేరిపోతున్నవి. ఒక టి.యం.సి నీటిలో, సుమారు 5000 ఎకరములలో వరిపైరు, లేక 10 వేల నుండి 12 వేల ఎకరములలో ఆరుతడి పైర్లు పండించవచ్చు.

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు ఒక వైపు త్రాగు నీటి కొరకు పరితపిస్తూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా నిరంతరం కరువు కాటకాలకు గురవుతూ వుంటే మరి కొన్ని ప్రాంతాలు సంవత్సరానికి మూడు పంటలు పండించుకొనుచున్నారు. వృథాగా సముద్రంపాలవుతున్న జల సంపదను వినియోగించుకోక పోవడానికి కారణాలు, జలాలు కేటాయింపులో, వినియోగంలో అవలంబించిన అసంబద్ధ, అసమగ్ర జలవిధానాలు, ప్రభుత్వాల హ్రస్వదృష్టి, నిర్లక్ష్యవైఖరిలు. నీటి పంపిణీ విషయంలో వారి అవసరాలు తీర్చుకొనుటకు సమన్యాయం సాధన కోసం తీవ్రంగా ఉద్యమించకపోవడం కూడా బాధిత ప్రాంతీయుల తప్పిదమే!

మన పూర్వ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో 23 జిల్లాలో మొత్తము వ్యవసాయ భూమి సుమారు 270 లక్షల ఎకరములు. లభ్యమయ్యే సాగు నీరు స్థూలంగా దాదాపు 3860 (భూగర్భజలాలతో కలసి) శతకోటి ఘనపుటడుగులు, ఒక శాస్త్రీయ పద్ధతి పాటించి, సమన్యాయంలక్ష్యంగా జల విధానాలను సవరించి నీటి పంపిణీ చేస్తే మన పూర్వ రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చు. నీటి దుర్వినియోగం, వృథాను నివారించి, ప్రాధాన్యతా క్రమంలో, అనుసంధాన నీటి వినియోగం ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ జల పంపిణీ చేస్తే , రాష్ట్రంలో ఎక్కడా దుర్భిక్ష ప్రాంతాలు ఉండవు. ప్రాంతీయ అసమానతలు ఉండవు. ఆధునిక ప్రపంచంలో ఏ మూల, కరువు కాటకాలు ఉన్నా, మన జాతి చరిత్రను, భారత నాగరికతను ఒకసారి పరిశీలిస్తే, నీరు నదులు ప్రజలను ప్రాంతాలను కలిపి ఏకం చేసినాయి. నీరు, నదుల ఆధారంగా మానవాభ్యుదయం, నాగరికత అభివృద్ధి చెందింది. అభివృద్ధికి నోచుకున్నా అవి మానవ సంస్కృతికే మచ్చు. మన జాతి గత చరిత్రను భారత నాగరికతను ఒకసారి పరిశీలిస్తే, నీరు నదులు ప్రజలను ప్రాంతాలను కలిపి ఏకం చేసినాయి. నీరు, నదుల ఆధారంగా మానవాభ్యుదయం, నాగరికత అభివృద్ధి చెందింది.కానీ ఈనాడు ఆ నీరు, నదులే కుటుంబాలను, ప్రాంతాలను, రాష్ట్రాలను కూడా విడదీస్తున్నది.

కనీసం 1000 మిల్లిలీటర్లు సరాసరి వర్షం అదనుకు పడితే వర్షాధార వ్యవసాయం ఫలప్రదమవుతుంది. 800 మి.మీ. కంటే తక్కువ వర్షం పడే ప్రాంతాలలో వర్షాధార వ్యవసాయం కరువులకు గురై జూదంగా మారుతుంది.1972 సం॥ ఇరిగేషన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం 1000 మి.మీ కంటే తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలలో (ఒక బ్లాకు స్థాయిలో) వ్యవసాయం భూమిలో కనీసం 30 శాతం భూమికి నమ్మకమైన సాగు నీటి సౌకర్యం కల్పిస్తే తప్ప దుర్భిక్ష ప్రాంతాలకు

మనుగడ లేదని స్పష్టంగా పేర్కొన్నది. విస్తృతంగా పరిశీలించిన పిమ్మట పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తరుచూ కరువుకు గురయ్యే దుర్భిక్ష ప్రాంతాలుగా 60 తాలుకాలను గుర్తించింది. అవి, 1. అనంతపురం జిల్లాలో 10 తాలూకాలు, 2. కర్నూలు జిల్లాలో 13 తాలూకాలు, 3. కడప జిల్లాలో 8 తాలూకాలు, 4. చిత్తూరు జిల్లాలో 7 తాలూకాలు, 5. మహబూబ్ నగర్ జిల్లాలో10 తాలూకాలు, 6. నల్గొండ జిల్లాలో 7తాలూకాలు, 7.రంగారెడ్డి జిల్లాలో 4తాలూకాలు తీవ్ర కరువుకు గురయ్యే తాలూకాలుగా తేల్చింది. అతి పెద్ద జిల్లాలైన మహబూబ్ నగర్, అనంతపురం, నల్గొండ మరియు కర్నూలు జిల్లాలలో కరువు ప్రభావం ఎక్కువ. ఈ ప్రాంతాలలో వర్షపాతం, చాలా తక్కువగా యుండగా, అనంతపురం జిల్లాలో అత్యల్పంగా సగటు వర్షపాతం కల జిల్లాగా చరిత్ర కెక్కింది. ఈ అత్యల్ప వర్షపాతం కూడా చాలా అస్థిరమైనది, అపనమ్మకమైనది.

2004 సం॥ వరకు ప్రభుత్వ గణాంక వివరాలను బట్టి , ఆంధ్రప్రాంతంలోని 9 జిల్లాల్లో 66.17 లక్షల ఎకరములకు అనగా వ్యవసాయ భూమిలో 69.50 శాతం సాగు నీటి సౌకర్యం పొందుతుండగా తెలంగాణా 9 జిల్లాలలో 27 శాతంతో, 46.57 లక్షల ఎకరములకు మరియు రాయలసీమ ప్రాంతంలోని 4 జిల్లాల్లో 18.11 శాతంతో 17.93 లక్షల ఎకరములకు మాత్రమే సాగు నీటి సౌకర్యం కల్పించుటకు మౌలిక వసతులు ఏర్పడినవి. కానీ, దురదృష్టవశాత్తూ రాయలసీమకు సంబంధించిన , నిర్దేశించిన సాగు నీటి ఆయకట్టులో కేవలం 50 శాతం మాత్రమే నీటి సాగులోనికి వచ్చుచున్నది. అనంతపురం జిల్లాలో 2004 సం॥ వరకు నీటి సాగు వసతి వున్నది కేవలం 3.5 లక్షల ఎకరములకు మాత్రమే. అనగా సాగు వసతి కేవలం 10.5 శాతం సాగు భూమికి మాత్రమే . ఇది కూడా శ్రీకృష్ణదేవరాయలు కాలం నుండి కట్టించిన చెరువులు, రైతులు త్రవ్వుకున్న బావులు, బోరు బావులు కూడా కలుపుకొని. ఈ ఆయకట్లలో వాస్తవంగా సాగు క్రింద పంటలు పండించుకున్నది సంవత్సరంలో కేవలం 2 లక్షల ఎకరములకు మించుట లేదు. ఎందుకంటే చెరువులు 5 సం॥ ఒక్కసారి కూడా నిండడము లేదు. భూగర్భజలాలు పూరించడం లేదు. అందుకే బోరు బావులు గాలిలో దీపాలైనాయి.

## 3. నీరు జాతీయ సంపదగా గుర్తించి , కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలి. జల పంపిణీలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యంగా విధానాలలో సమగ్ర మార్పు రావాలి.

సాగు నీటి రంగంలో నీటి కేటాయింపుల్లో ఈ అసమానతలు ఏర్పడుటకు ముఖ్యకారణం, అంతర్రాష్ట్ర నదీ జలాల పంపకంలో అనుసరిస్తున్న సూత్రాలలో ముఖ్యమైనది, FIRST IN TIME FIRST IN RIGHT అనగా ముందుగా కట్టిన ప్రాజెక్టులహక్కులకు భంగం కల్గకుండా తర్వాత కట్టే ప్రాజెక్టులను చూడటం. ఈ సూత్రం ప్రాంతీయ సమన్యాయానికి విరుద్ధంగా వున్నది. వెనుకబడిన రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ భారీ ప్రాజెక్టులు ముందుగా కట్టుకోలేక పోవడం, ఉన్న ప్రాజెక్టులు రాష్ట్రసరిహద్దుల మార్పిడి కారణంగా వేరే ప్రాంతాలలో (తుంగభద్ర ప్రాజెక్టును కర్నాటకలో) చేర్చబడుట వగైరా కారణాల ద్వారా కనీస నీటి కేటాయింపులు పొందజాలకున్నవి. సాగు నీటి సౌకర్యం తక్కువగా ఉన్న ప్రాంతాలు పారిశ్రామిక, ఆర్థిక, విద్య వైద్య, సాంస్కృతిక రంగాలలో కూడా వెనుకబడి యుండటం గమనించ దగ్గ ముఖ్య అంశం. నీటి పంపణీ విషయంలో ప్రాంతీయ సమన్యాయం లక్ష్యాలుగా అనాదిగా అమలవుతున్న కాలం చెల్లిన అసంబద్ధ, అశాస్త్రీయమైన జల విధానాలను సవరించుకోవలసిన తక్షణ అవసరం చాలా వుంది. ఇచ్చిపుచ్చుకొనే సుహృద్భావ ధోరణితో, అంతరాష్ట్ర, అంతర్జిల్లాల జలవివాదాలు పరిష్కరించుకోకపోతే, దేశంలో తీవ్ర అలజడి, ఆందోళన, సాంఘిక వైషమ్యాలు, విచ్ఛిన్నకరపోకడలు బలంగా పుంజుకొంటాయి. పరిపాలన సమస్యగా మారి, రాష్ట్రాభివృద్ధితో బాటు దేశాభివృద్ధికి కూడా ఆటంకం కాగలవు. సవరించిన జలవిధానాల ద్వారా వెనుకబడ్డ ప్రాంతాలకు కనీస నీటి కేటాయింపులు

చేసి సమన్వాయం చేసి తీరాలి. నీటి పంపిణిలో ప్రాంతీయ సమన్వాయం లక్ష్యంగా జలవిధానాలు రూపొంది, అమలుకు నోచుకోవాలంటే, నీటి వినియోగంలో అనుసంధాన నీటి వినియోగం (Conjunctive use of water) కరువు ప్రాంతాలలో వర్షాధార పంటలకు రక్షక తడులు (Protective irrigation) లాంటి సంస్కరణలు, హేతుబద్ధమైన పంట విధానాలు రావాలంటే , నీటిని జాతీయ సంపదగా గుర్తించి రాష్ట్రాలకతీతంగా కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకోవాలి.

దేశవ్యాప్తంగా నదీ జలాల పంపిణీపై కేంద్రం ప్రభుత్వం ఒక సమగ్ర జలవిధానం రూపొందించుకొని, అతి త్వరగా అమలు చేసి కరువు ప్రాంతాలను ఆదుకొనుటకు మరియు అన్ని సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని ప్రయత్నాలు తక్షణమే చేయవలసియున్నది.నీటితో పాటు విద్యుతుత్పాదన, పంపిణీ కూడా కేంద్ర పరిధిలోకి తీసుకుంటే , వివాదాలు తగ్గి దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

భారతదేశ ప్రభుత్వం సెప్టెంబరు 1987 సం॥లో జాతీయ జల విధానం రూపొందించిననూ, అమలుకు నోచుకోకపోవటం దురదృష్టం. జాతీయ జల మండలి1982 సం॥లో ఒక స్వయం ప్రతిపత్తిగా ఏర్పడి, 1998 సం॥ నాటికే విశేషమైన కృషి చేసి లక్ష్య సాధన కోసం దేశంలో 12 ముఖ్య నదులను అనుసంధానం చేయుటకు, నీటి లభ్యత, అవసరాలు, అంచనాలు, తయారు చేసింది. అందుకవసరమైన భారీ జలాశయములు, మరియు కాలువల నిర్మాణపు సాధ్యాసాధ్య నివేదికలు కూడా తయారు చేసింది. కాని మరియు విద్యుచ్ఛక్తి అంశాలు రాష్ట్రాల పరిధిలో నుండుట చేతనూ,స్థిరమైన కేంద్ర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్లనూ, అవి అమలుకు నోచుకోలేదు . ఇప్పుడు మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో నీటి సమ పంపిణీ లక్ష్యాలను సాధించవలసినదిగా రాయలసీమ మరియు అనంతపురం జిల్లాలో ప్రజలతో పాటు, దేశంలోని వెనుకబడిన కరువు పీడిత ప్రాంతాల ప్రజలందరు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. ఇటువంటి తరుణం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

## రెండవ భాగము

## అనంతపురం జిల్లా పరిస్థితి

అనంతపురం జిల్లా అతివిశాలమై సుమారు 19130 చ. కి. మీ ల వైశాల్యం కల్గి, 63 మండలాలు, 27 లక్షల వ్యవసాయ భూమి కల్గివుంది. ఇందులో కేవలం 3.5 లక్షల ఎకరాలు మాత్రం, ముఖ్యంగా గాలిలో దీపం లాంటి నమ్మకం లేని భూగర్భజలాలపై ఆధారపడి సాగు నీటి వసతి వుంది. జిల్లాలో 42 లక్షల జనాభా గల్గి దాదాపు 30 లక్షల జనాభా గ్రామాలలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు .ఈ జిల్లాలో ప్రస్తుతం వివిధ నీటి వనరుల క్రింద సాగవుతున్న సుమారు 3.5 లక్షల ఎకరములు మినహాయించి, మిగతా దాదాపు 24 లక్షల ఎకరములు కేవలం, వర్షధారంపై ఆధారపడింది. దేశంలోనే రెండవ అత్యల్ప అస్థిరమైన 550 మి.మీ సగటు వర్షపాతం కల్గిన కరువు జిల్లాగా గుర్తింపబడింది. ఇరిగేషన్ కమీషన్ 1972 ప్రకారం, 1000 మి.మీ సగటు వర్షపాతం గల అనంతపురం జిల్లాలో కరువుల తీవ్రత ఎట్లా వుంటుందో ఊహించుకోవచ్చు. గడిచిన 10 సంవత్సరాలలో దాదాపు 8 సంవత్సరాలు కరువులకు గురయినట్లు ప్రకటించబడింది. 1972 ప్లానింగు మరియు ఫామిన్ కమీషనుల సూచనల మేరకు నదీ జలాల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత కల్పించవలసిన జిల్లాగా గుర్తింపబడినది. ఈ జిల్లా యొక్క త్రాగు, మరియు సాగు నీటి కనీస అవసరములు తీర్చుటకు కనీసం100 శతకోటి ఘనపుటడుగులు పొంద వలసియున్నదని నిపుణుల అంచనా. ఇప్పటికి లభ్యమవుతున్న నీటిని

మినహాయించగా కనీసం 70 టి.యం.సి.ల నీరు అనంతపురం జిల్లాకు అదనంగా నదీ జలాలను బదిలీ చేయవలసిన ఆవశ్యకత వున్నది. ఈ అదనపు నీటిని పొందుటకు, యుద్ధ ప్రాతిపదికపై అమలవుతున్న అన్ని ప్రాజెక్టులు పూర్తిచేయడంతో పాటు అదనపు నదీ జలాలను కేటాయించవలసి వుంది. అదనపు జలాలు సాధించాలంటే జాతీయ స్థాయిలో నదుల అనుసంధానం సాధించవలసియున్నది. అనంతపురం లాంటి తీవ్ర కరువు ప్రాంతాలలో కరువును అధిగమించాలంటే, పంటకాలంలో ఒకటి లేక రెండు రక్షక తడులు (Protective irrigation) ఇవ్వవలసి వుంటుంది. అనుసంధాన నీటి వినియోగం (Conjunctive use of water) కూడా తప్పని సరిగా పాటించవలసి వుంటుంది. తక్కువ నీరు అవసరమయ్యే పంటలను మాత్రమే ప్రోత్సహించవలసి వుంటుంది. జాతీయ జల విధానాన్ని సవరించి అత్యధిక సాగు నీటి సౌకర్యం పొందుతున్న ప్రాంతాలలో నీటి వినియోగంలో సంస్కరణలు చేసి కేటాయింపులు సర్దుబాటు చేయుట ద్వారా కరువు, దరిద్రపీడిత అనంతపురం జిల్లాలో కనీస నీటి అవసరాలు తీరే విధంగా చర్యలు వెంటనే చేపట్టవలసి వుంది. ఇదియే మన ప్రభుత్వాల ముందున్న తక్షణ అత్యంత ప్రాధన్యత కల్గిన అంశం. దీనిని సవాలుగా స్వీకరించి, అన్ని పార్టీల నాయకులు, పౌర సంస్థలు ఏకోన్ముఖంగా ప్రయత్నించితే తప్ప, రానున్న కాలంలో అనంతపురం జిల్లా మనుగడ ప్రశ్నార్థకం కాక తప్పదు. భావితరాల ఆశలు అడియాశలు కాక తప్పవు. తరతరాలుగా కొనసాగిన ఈ దుర్భర పరిస్థితులను సవరించకపోతే, భావితరం సహించదు, క్షమించదు.

## ముగింపు

నదీ జలాలను జాతీయ సంపదగా పరిగణించి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో సద్వినియోగ పరుచుకోవాలి. భవిష్యత్తు తరాల జల అవసరాలు తీర్చడానికి , ప్రాంతీయ సమన్యాయం సాధించడానికి నదుల అనుసంధానమే ముందున్న ఏకైక పరిష్కార మార్గం. కరువు సమస్యలకు వ్యవసాయాభివృద్ధికి, ఆహార భద్రతకు, పారిశ్రామికాభివృద్ధి, మరియు దేశ సర్వతోముఖాభివృద్ధికి శాశ్వత పునాది నదుల అనుసంధానం. ఏ నదీ జలాలైనా ఆ నదీ పరీవాహక ప్రాంతంలో సమన్యాయం ప్రాతిపదికగా అవసరమైన మేర వినియోగించుకున్న తరువాత, మిగులు నీటిని నీటి లభ్యత తక్కువైన ప్రాంతాలకు మళ్ళించాలి. సాధ్యమైనంత వరకూ పర్యావరణానికి భంగం కలుగని రీతిలో జలాశయాల నిర్మాణం జరగాలి. జనాభా అవసరాలకు జనాభా పెరిగే కొద్ది ఎదురయ్యే నీటి సమస్యలను అధిగమించడానికి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాల నుండి అల్ప వర్షపాతం కల్గిన ప్రాంతాలకు సమన్యాయం ప్రాతిపదికగా అవసరాలను బట్టి , అత్యంత ప్రాధాన్యత కల్పించే విధంగా జాతీయ జల విధానాలు ఉండాలి. ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి నీటి వాలు పారుదల పద్ధతిలో గాని రవాణా చేయటం తప్పని సరి అవుతుంది. సాగు నీటి నిర్వహణలో రైతులకు అర్థవంతమైన భాగస్వామ్యాన్ని కల్పించాలి.

గోదావరి జలాలను సాధ్యమైనంత వరకు కృష్ణా నది ప్రాంతం దిగువనున్న అన్ని ప్రాజెక్టుల అవసరాలకు తీర్చుటకు ఉపయోగించవలయును. అందుకనుగుణంగా చేపట్టిన, పోలవరం ప్రాజెక్టు, పులిచింతల, నాగార్జున సాగర్ టైలుపాండు, దుమ్ముగూడెం ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి. అలా ఆదా చేసిన నీటిని కృష్ణా నదిపై ఎగువనున్న ప్రాంతాలకు సమన్యాయం ప్రాతిపదికగా కనీస నీటి, త్రాగు నీటి వసతి కల్పించుటకు హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి, తెలుగు గంగ, వెలుగొండ, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలి.

వర్షాభావంతో పంటలకు స్థిరమైన నీటి వసతి కరువైన పరిస్థితులలో అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా "అనుసంధానం నీటి వినియోగం" ద్వారా వృథాకాకుండా ఉపయోగించుకోవాల్సి

ఉంది. వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కూడా పర్యావరణానికి భంగము కలుగకుండా నిల్వ చేసి, సాగు నీరు, త్రాగునీరు, పారిశ్రామిక, పర్యాటక మొదలగు ఇతర అవసరాలకు వాడుకోవాల్సి వుంది. నదులలో జీవ జలాలను పూర్తిగా వినియోగించుకునేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాల్సి వుంది. అయితే పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యంగా మరియు ఇది ఒక దైవకార్యంగా భావించాలి.

తేదీ : 17-06-2014

# జలవనరులను కాపాడుకుందాం! ఎడారీకరణను నివారిద్దాం!

# జిల్లాలో వ్యవసాయాన్ని రక్షించుకుందాం!!

**పరిచయము:**

ప్రపంచమంతా నీటి వనరులను కాపాడుకోవడానికి ప్రపంచ దేశాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. భూమండలంలోని జీవరాసులకు ప్రాణాధారమైన మంచి నీటి వనరులు తగ్గిపోతున్న పరిస్థితిని చూసి శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. నీటి వనరులను సంరక్షించుకోవడం అత్యంత ప్రాధాన్యతా విషయంగా గుర్తించి ప్రతి సంవత్సరం మార్చి 22 తేదీని ప్రపంచ జలదినోత్సవంగా పరిగణించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. 1993 నుండి ప్రపంచ దేశాలన్నీ ప్రతి సంవత్సరం మార్చి 22 తేదిని అంతర్జాతీయ జలదినోత్సవాన్ని జరుపు కుంటున్నాయి. ప్రపంచ జనాభాలో మూడవ వంతు వారికి తాగడానికి రక్షిత మంచి నీరు దొరకడం లేదు. 50 శాతం జబ్బులు నీటి ద్వారానే సంక్రమిస్తున్నాయంటే దీని తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. భూమండలంలో కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తుతూ ఉంటే మరికొన్ని ప్రాంతాలలో తీవ్రమైన నీటి కరువు తాండవిస్తూ వుంటుంది. ఈ తీవ్రమైన సమస్యను అత్యంత ప్రాధాన్య విషయంగా గుర్తించే ఐక్యరాజ్యసమితి ప్రపంచ ప్రజలలో అవగాహనను పెంపొందిస్తూ, ప్రజాభిప్రాయంతో నీటి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా అందించాలనే ప్రయత్నమే అంతర్జాతీయ జలదినోత్సవం.

ఒక ప్రాంతం లేదా ఒక దేశం యొక్క అభివృద్ధికి అవసరమయ్యే ప్రధానమైన వనరు "నీరు". నీటి వినియోగం 1. గృహవసరాలకు 2. వ్యవసాయానికి, 3. కులవృత్తులు, ఇతర కుటుంబ జీవనోపాధులకు (ఉదా॥ కుమ్మరి చాకలి, గృహ పరిశ్రమలు) పరిశ్రమలకు మరియు 5. పర్యావరణ సమతౌల్యం కోసం వుంటుంది. ఆ ప్రాంత లేదా దేశ ప్రజల ఆర్థిక సామాజిక స్థితిగతులు అక్కడ లభ్యమయ్యే నీటి వనరులపై ఆధారపడి ఉంటుంది. నీటి వనరులు పుష్కలంగా ఉన్న చోట మిగతా సహజవనరులు పుష్కలంగా ఉంటాయి. ఆ ప్రాంతం సుభిక్షంగా వుంటుంది. నీరు లేని ప్రాంతంలో ఎడారీకరణ జరిగి దుర్భిక్షం తాండవిస్తూ వుంటుంది నీటి లభ్యతలో వ్యత్యాసమే ప్రాంతీయ అసమానతలకు పునాది. భూమి మీద లభించే నీటిలో మానవాళికి ఉపయోగపడే నీరు కేవలం 3 శాతం కన్నా తక్కువ. మిగతా నీరు సముద్రాలలోను మంచు రూపములోను ఉండి, ప్రత్యక్ష వినియోగానికి పనికి రాదు. మానవాళికి మిగతా అవసరాలైన, గృహవసరాలు, త్రాగు నీరు, కుల వృత్తులు , పరిశ్రమలు, పర్యావరణం మొదలగు వాటికి వినియోగించబడుతోంది. ఉన్న ఈ కొద్ది శాతం నీటిని ఎంతో జాగ్రత్తగ, పొదుపుగా, సమర్థవంతమైన యాజమాన్యముతో అన్ని రంగాల అవసరాలకు అన్ని వర్గాల అవసరాలకు వినియోగించుకోవలసిన అవసరముంది. మనకు నీరు నాలుగు రూపాలలో లభిస్తుంది. అవి 1. వర్షపు నీరు, 2. ఉపరితల నీరు, (చెరువులు, కుంటలు, నదులు) 3. భూమి పై పొరలలో తేమ మరియు. 4. భూగర్భ జలము. కాని, పై నీటి వనరులన్నింటికి మూలధారం వర్షపాతం. ప్రతి మనిషికి గృహవసరాలకు

మరియు తాగునీటి కోసం దినానికి దాదాపు 135 లీటర్ల అవసరం ఉంటుందని కేంద్ర పబ్లిక్ హెల్తు ఇంజనీరింగ్ సంస్థ లెక్క వేసింది.

## 2.మన అనంతపురం జిల్లాలో జల వనరుల పరిస్థితి:

అనంతపురం జిల్లా ప్రాంతంలో మానవ నివాసాలు ఎప్పటి నుండి ప్రారంభమయినాయో చెప్పలేము కానీ, నీటి కొరత ఈ ప్రాంతాన్ని ఎప్పుడూ వెన్నంటే వుందని మాత్రం చెప్పగలం. భౌగోళిక అనానుకూలతలు వల్ల వర్షచ్ఛాయ ప్రదేశంగా గుర్తింపబడిన ఈ జిల్లాలో సగటు వర్షాపాతం 552 మి.మీ. జిల్లా విస్తీర్ణం దాదాపు 50 లక్షల ఎకరాలు. జిల్లాలో వ్యవసాయ భూమి 27 లక్షల ఎకరాలు వుంటే అందులో సాగు నీటి సౌకర్యం కేవలం 3లక్షల ఎకరాలకు మాత్రమే ఉంది. అంటే దాదాపు 24 లక్షల ఎకరాలు (90శాతము పైగా) వ్యవసాయం వర్షాధారముపై ఆధారపడి ఉంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే , మన జిల్లాలో వర్షాధార వ్యవసాయం కనుమరుగయ్యే దుర్భర శాశ్వితకరువు పరిస్థితులు శాశ్వతంగా తిష్టవేస్తాయేమోననిపిస్తుంది. జిల్లాలో సమారు 1.7 లక్షల బోరు బావులు. 3 లక్షల ఎకరాలకు తుంగభద్ర ఎగువకాలువ ద్వారా సాగవుతున్నది. వర్షాధార సాధారణ స్థాయికన్నా కరువు సంవత్సరాలలో తక్కువగా కురువటం వల్ల భూగర్బ జల మట్టం పెరగకపోగా ప్రతి సంవత్సరం క్షీణిస్తోంది. మన జిల్లాలో దాదాపు 5000 వరకు ఉపరితల నీటి వనరులైన చిన్న నీటి కుంటలు, చెరువులు ఉన్నాయి. అయితే చెరువులు, కుంటలు పూడికకు గురై, నీటి సామర్థ్యం బాగా తగ్గి నీరు ఇంకింపజేసుకొనే సామర్థ్యము తగ్గిపోయింది. మరికొన్ని కట్టలు, మరువులు బలహీనమై నీటిని భూగర్భజలంగా మార్చే వ్యవస్థ బలహీనమైపోతుంది. ఇదే కాకుండా, వర్షాలు పడే తీరు మారుతున్నందు వలన వంకలు వాగులు పారకుండా పోయి చెరువులు నిండడం కూడా చాలా అరుదైపోయింది. ప్రతి సంవత్సరము వేసవి కాలంలో వేల సంఖ్యలో బోరుబావులు ఎండిపోతున్నాయి. విచ్చలవిడిగా కొత్త బోర్లు వేయడం వలన భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. ఆశ చావక చాలా మంది రైతులు వ్యవసాయ పొలాల్లో పంటలు, పండ్ల మొక్కల రక్షించుకోవడానికి ఒక్కో రైతు పదుల సంఖ్యలో బోర్లు వేసి నీళ్లు పడక, అప్పులపాలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మన జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాలు అటవీ ప్రాంతం ఉన్నా అందులో వృక్ష సంపద లేదు. అదే విధంగా దాదాపు 10 లక్షల ఎకరాలు బోడికొండలు, గుట్టలు, వంకలు, వాగులు ఉన్నా, అందులో కూడా వృక్ష సంపద లేదు. అడవులు వృక్ష సంపద తగినంత ఉన్నప్పుడే వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలుగా మారుతాయి. అంతేగాకుండా మనకు పడే వర్షపు నీటిలో దాదాపు 40 శాతం నీరు ఆవిరైపోతున్నది. వృక్ష సంపద విస్తారంగా ఉంటే నీటి ఆవిరి తగ్గుతుంది . సాగునీటి కొరత తీరకుండానే తాగు నీటి కొరత జిల్లాలో తీవ్రంగా వేధిస్తోంది.

ఈ నేపథ్యంలో నీటి కొరత సమస్యలు పరిష్కారం కాకుండానే, రాష్ట్రవిభజన జరిగిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలోనే పరిష్కారాలు కాని నీటి సమస్యలు మరింత జటిలంగా మారిపోయినాయి. మూడింట రెండొంతులు గ్రామాలకు వర్షాకాలంలోకూడా ట్యాంకర్లు ద్వారా ప్రభుత్వం తాగు నీటిని అందించే దుస్థితి నెలకొనివుంది

## 3. అనంతపురం జిల్లాలో నీటి వనరులను అభివృద్ధిచేయడానికి , వాటిని సక్రమంగా, సమర్థవంతముగా వినియోగించుటకు క్రింది చర్యలు చేపట్టవలసివున్నది.

### 3.1 .జిల్లా వ్యాప్తంగా భూసార సంరక్షణ మరియు వర్షపు నీటిని నిలవరించే కార్యక్రమాలు చేపట్టాలి:

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూములు, అడవులు, కొండలు, గుట్టలు  వాగులు వంకలు అన్నీ కలుపుకొని దాదాపు 50 లక్షల  ఎకరాలకు వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టాలి. తద్వారా అధిక వర్షపాతము భూమిలోకి ఇంకి భూగర్భజలాలు పెరగడంతో పాటు, వృక్ష సంపద, జీవ వైవిధ్యం కూడా పెంపొందుతుంది. ఎడారీకరణను నివారిస్తుంది.

## 3.2 సాంప్రదాయ నీటి వనరులైన చెరువులను, కుంటలను పునరుద్ధరించాలి:

మన ఉపరితల నీటి వనరులైన చిన్న పెద్ద చెరువులు, కుంటలు అన్నింటిలోనూ పూడిక తీసి, మరమ్మత్తుల చేసి పూర్తి స్థాయిలో పునరుద్ధరించి వూట చెరువులుగా మార్చాలి. తద్వారా ఉపరితల నీరు పెరిగి , భూగర్భ జలాలు పెరిగి బోరు బావులకు భద్రత ఏర్పడుతుంది.

## 3.3 5లక్షల ఎకరాల అటవీకరణతో పాటు అదనంగా 10 లక్షల ఎకరాలలో వృక్ష సంపద పెంచాలి:

వృక్ష సంపద లేని దాదాపు 5 లక్షల ఎకరాల అడవి ప్రాంతాన్ని మరియు బోడికొండలు, గుట్టలు చౌడు భూములు వంకలు వాగులలో (దాదాపు 10 లక్షల ఎకరాలు) వృక్ష సంపద పెంచాలి. పండ్లు మేతలాంటి ప్రజావసరాలకు, పర్యావరణానికి ఉపయోగపడే స్థానిక వృక్ష రకాలను పెంచుతూ, జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలి. కలపేతర అటవీ ఉత్పత్తుల ద్వారా జిల్లా ప్రజల జీవనోపాధులకు తోడ్పడాలి. వృక్ష సంపద పెరగడం ద్వారా నేలలో తేమ పెరుగుతుంది, అధికంగా భూమిలోకి వర్షపు నీరు ఇంకి భూగర్భ జలాలు పెంపొందుతాయి. అంతేకాక  ఆకు, అలుములు భూమిలో కలసిపోవడం వలన మన భూములలో సేంద్రీయ పదార్థము వృద్ధి చేసి, నేలలో తేమను నిలుపుతుంది. నీటి ఆవిరి తగ్గుతుంది. భూసారం పెరుగుతుంది. భూఉత్పాదకత పెరుగుతుంది. తద్వారా ఎడారీకరణ నివారింపబడుతుంది.

## 3.4 అనంత జల వలయం నిర్మించి అనుసంధాన నీటి వినియోగం పాటించాలి:

తుంగభద్ర ఎగువ కాలువ హంద్రీ నీవా ప్రాజెక్టు నుండి మన జిల్లాకు వచ్చే నీటిని ప్రత్యక్ష వ్యవసాయానికి వాడకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపి “అనంత జల వలయం”ను ఏర్పాటు చేయాలి. తద్వారా వర్షపు తేమను, ఉపరితల జలాలను, నదీజలాలను, భూగర్భజలాలను ఒకదానితో ఒకటి అనుసంధానము చేసి “అనుసంధిత నీటి వినియోగము”ను పాటించవలయును. అందులో భాగంగా వర్షాధార పంటలకు వరపు సమయంలో రక్షకతడుల నిచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయవలయును. తద్వారా కరువులను కొంత వరకు నివారించవచ్చును.

## 3.5 భూగర్భ జల వినియోగ క్రమబద్దీకరణ, సూక్ష్మ సాగు, సామాజిక నియంత్రణ తీసుకోవాలి:

భూగర్భ జల వినియోగాన్ని క్రమబద్దీకరించి, బోర్లు వున్న రైతులు, బోర్లు లేని రైతుల వర్షాధార పంటలకు కరువు సమయంలో రక్షక తడులకు ఉచితంగా నీరందించే విధానాన్ని ప్రవేశపెట్టవలయును. సూక్ష్మ సాగు పద్ధతులను పాటించవలయును. భూగర్భజలాల  వినియోగంలో సామాజిక కట్టుబాట్లు, నియంత్రణ తీసుకొని రావలయును. తద్వారా భూగర్భ జల పంపణీలో సమతుల్యతను తీపుకోనిరావడానికి వీలవుతుంది.

## 3.6 అధికంగా నీరు తాగే పంటలను నిషేధించి , తక్కువ వ్యవధిగల పంటలను, తక్కువ నీటితో పండే పంటలను మాత్రమే ప్రోత్సహించాలి:

మనది ఎడారిగా మారుతున్న కరువు జిల్లా కాబట్టి, ఇక్కడ అధికంగా నీరు తాగే పంటలైన వరి, చెరుకు, అరటి లాంటి పంటలను పూర్తిగా నిషేధించాలి. తక్కువ కాలవ్యవధిగల పంటలను (కూరగాయలు, పప్పు దినుసులు, ధాన్యపు పంటలు) మరియు తక్కువ నీరు తాగే వృక్ష పంటలకు (మామిడి, చింత సపోట, సీతాఫలము , ఉసిరక, నేరేడు మొదలయిన) ప్రభుత్వం ప్రోత్సాహకాలందించాలి.

**ముగింపు:**

పై పద్ధతులను పాటించడం వలన జిల్లాలో జల వనరులను అభివృద్ధి చేయడంతో పాటు, జల వినియోగాన్ని సాంఘికంగా విస్తృతపరిచి, సమతుల్యంగా చేయవచ్చును. అందుకు అవసరమైన విధానపర నిర్ణయాలను చేయవలసి వుంటుంది. ఒక 10 సం॥ల కాల వ్యవధి గల కార్యాచరణ ప్రణాళిక తయారు చేయవలసి వుంటుంది. కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడంలోనూ, అమలు చేయడంలోనూ పంచాయితీరాజ్ సంస్థలు, నీటి వినియోగదారుల సంఘాలు, వనసంరక్షణ సమితులు, వాటర్‌షెడ్ కమిటీలు, స్వయం సహాయక గ్రూపులు మొదలగు ప్రజా సంస్థలను భాగస్వాములను చేయాలి. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలు – అటవీ శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ, చిన్న నీటి వనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సూక్ష్మ నీటి సాగు శాఖ, రెవిన్యూ శాఖ మొదలగునవన్నీ సమన్వయంతో ఏకోన్ముఖులై కార్యదీక్షతో అమలు చేయవలసి వుంటుంది. అలా చేసినపుడు అనంతపురం పరిస్థితులలో మార్పు వస్తుంది. పంటలకు భద్రత ఏర్పడుతుంది. ఆహార భద్రత ఏర్పడుతుంది. తద్వారా రైతులు, రైతు కూలీలు, గ్రామీణ ఇతర వృత్తులు వారు జీవించే పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. జిల్లా నివాసయోగ్యంగా మారే అవకాశమున్నది.

ఈ దిశలో ప్రభుత్వము , ప్రభుత్వేతర సంస్థలు, సస్యమిత్ర గ్రూపులు వారి సమాఖ్యలు పౌర సంస్థలు కృషి చేయాలని ప్రపంచ జల దినోత్సవం (22 మార్చి ,2004) సందర్భంగా విజ్ఞప్తిచేస్తున్నాము.

తేదీ : 18-03-2014

# ఉపాధి హామీ పథకం గ్రామీణ ఉపాధి ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు

అనేక ప్రభుత్వ పథకాలను మనం చూచినాము. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. మరికొన్ని ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, సాంఘిక బాధ్యతగా ప్రజల సంక్షేమానికి పథకాలు రూపొందిస్తాయి. అవి ఎంత ఘనంగా ఉన్నా ఆచరణలోకొచ్చేటప్పటికి ప్రజలకు అందకుండా, మధ్యదళారుల సొమ్ముగానే మారడం గమనించనూ గమనించాము. చట్ట సభలను, రాజకీయ నాయకులను ప్రభావితం చేయలేని స్థితిలో ఉండడంతో వ్యవసాయ కూలీల హక్కులు కాపాడే విషయాన్ని పట్టించుకున్న సందర్భాలు రూపంలో ఎంతో గొప్పగా కనపడినాయి తప్ప, ప్రజలకు ఉపయోగపడింది లేదు. ఇటువంటి పరిస్థితులలో జాతీయ ఉపాధి హామీ పథకం 2005 పార్లమెంటులో చట్టం కావడం విప్లవాత్మకమైన చట్టంగా మనం భావించవచ్చు. కాయకష్టం చేయగల గ్రామీణ ప్రజలకు నేరుగా ఫలితాలు ఇచ్చే చట్టం ఇది. ముఖ్యంగా నీటి పారుదల సౌకర్యం లేకుండా దాదాపు వర్షాధారం మీదనే ఆధారడి వ్యవసాయం చేసే మన జిల్లాలో సంవత్సరంలో 3,4 నెలలో మాత్రమే పని ఉంటుంది. మిగతా నెలలన్నీ ఏ పనులు లేకుండా ఉంటారు. వ్యవసాయం మీద ఆధారపడిన రైతు కుటుంబాలకే పంటలు లేకుండా జీవనం కష్టమవుతున్నటువంటి పరిస్థితులలో, సీజను కాలంలో కూడా రెండు మూడు వానలు మించి పడవు. వ్యవసాయ పనులు దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ పథకం భూమి లేని వారికే కాకుండా చిన్న సన్నకారు రైతులకు కూడా ఉపాధి ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుంది. ఇటువంటి పరిస్థితులలో ఈచట్టం ఒక వరప్రసాదంలాంటిది. ఈ చట్టం ద్వారా మొట్టమొదటిసారిగా శ్రమ చేయాలనుకునే వారికే కాకుండా చిన్న సన్నకారురైతులకు పనిమీద హక్కు ఏర్పడుతుంది. సంవత్సరంలో పని కోసం నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కోసం నమోదు చేసుకున్న ప్రతి కూలీకి చట్టంద్వారా సంక్రమించిన పని కల్పించకపోతే, నిరుద్యోగ భృతి చెల్లించవలసి ఉంటుంది. గ్రామ సభల ద్వారా పనులు ఎంపిక చేసుకున్న దగ్గర్నుంచీ కూలీలకు సొమ్ము చెల్లించే వరకూ అంతా పద్దతి ప్రకారం సాగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినారు. ఈ పనులన్నీ కూడా గ్రామ వనరులు అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించవచ్చు. కానీ వాస్తవంగా ఆచరణలో అనేక ఒడిదుడికులను ఎదుర్కొంటున్నది. అయినా స్థూలంగా గ్రామీణ పేదలకు ఒక గొప్ప ఆలంబన దిశగా ఈ కార్యక్రమం ఎదుగుతున్నది.

ఈ పథకం ఒకేసారి ఆకాశంలోంచి ఊడిపడలేదు. గతంలో అమలుపర్చిన పథకాల ఫలితాలు, అవి ప్రజలకు చేరకుండా మధ్య దళారీలు, రాజకీయ నాయకులు కైంకర్యం చేసినట్లుగా వచ్చిన అనుభవాలున్నాయి. కొంతమంది సాంఘికసేవ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగంలో ఉండే కొంత మంది నిజాయితీ అధికారులు, లబ్ది చేకురాలని గాఢంగా విశ్వసించే రాజకీయ నాయకుల కృషి ఫలితంగా ఈ చట్టం రూపుదిదుకున్నది. ఈ పథకం అమలులో గ్రామ

పంచాయితీలకు ప్రధాన బాధ్యత అప్పగించబడింది. వీటితో పాటు ప్రజలందరికీ కూడా దీనిని కాపాడుకోవలసిన బాధ్యత ఉంది.

దీనిలో ఉన్నటువంటి మిగతా పథకాలలో లేనిది ప్రధాన అంశం ఏమంటే, మునుపటి సంక్షేమ పథకాలలో ప్రజలు ప్రేక్షక పాత్రధారులు, అధికారులు, రాజకీయ నాయకులు అమలుపర్చే స్థానంలో ఉండడం మూలంగా, సహజంగానే ఈ వర్గాలు తమ స్వార్ధపూరిత ప్రయోజనాల కోసం ప్రజలకు మొండి చెయ్యి చూపించగలిగే సాహసం చేశారు. అయితే ఉపాధి హామీ పథకంలో, చట్టాన్ని సంరక్షించి కావలసిన సహకారాలు అందించేవారు అధికారులైతే, దీనిని నడిపించి ఉపయోగపెట్టుకునే హక్కు, బాధ్యత ప్రజలది. ఈ హక్కు చట్టబద్దం కాబడింది. దీనిని ఎవరూ మార్చలేరు. ఒక్క పార్లమెంటుద్వారానే అది సాధ్యం అవుతుంది. పనులలో అయ్యే ఖర్చును 75 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తే 25 శాతం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. మొదట స్థూలంగా చట్టం యొక్క ప్రయోజనాలేవిటో తెలుసుకుందాం.

## ఈ చట్టం ద్వారా కూలీలకు సంక్రమించే హక్కులు :

1. 18 సం పైబడి వయస్సు కలిగి గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ, శారీరక కష్టం చేయడానికి సిద్ధపడే వారందరికీ ఉపాధి హక్కు ఉంటుంది.
2. శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగావున్న ప్రతి కుటుంబము గ్రామ పంచాయితీకి దరఖాస్తు చేసుకొని ఒక జాబ్‌కార్డ్ పొందే హక్కువుంది. జాబ్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతి కుటుంబానికి 15 రోజులలోపు పని చూపెట్టాలి. జాబ్‌కార్డ్ కాలం కనీసం 5 సంవత్సరాలు వుంటుంది.
3. అలా జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజులు ఉపాధి పొందే హక్కు వుంటుంది.
4. జాబ్‌కార్డు ఉండి, పనిచేయడానికి సిద్ధంగా వున్న సమయంలో పని కల్పించమని ఫీల్డు అసిస్టెంటు లేదా ప్రాజెక్టు ఆఫీసరుకు దరఖాస్తు చేసుకోవలసి వుంటుంది. ఆ విధంగా దరఖాస్తు చేసుకొన్న 15 రోజుల లోపు ప్రభుత్వం పని చూపించవలసి వుంటుంది.
5. చేయవలసిన పని గ్రామానికి 5 కి.మీ.లోపల ఉండవలయును. ఒకవేళ పని 5కి.మీ. కంటే ఎక్కువ దూరంలో చూపిస్తే 10 శాతం అదనపు కూలీ ఇవ్వవలసి ఉంటుంది.
6. పని దినాలలో కనీసం మూడవ వంతు మహిళలకు కేటాయించాలి. వికలాంగులకు కూడా సానుకూలంగా వుండే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం అదేశాలను జారీచేసింది. ఉదా. వికలాంగులకు సంవత్సరానికి 150 రోజుల పని కల్పించాలి. అంతేగాకుండా వారికి 30 శాతం అధిక వేతనం యివ్వాలి.
7. **నష్టపరిహారం పొందే హక్కు :** ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొన్న 15 రోజులలోపు పని చూపించకపోతే 16వ రోజు నుండి 30 రోజులవరకూ వుంది. 30 రోజుల తరువాత కూడా పని చూపించకపోతే రోజుకు రూ. 40 నష్టపరిహారం పొందడానికి పని కోసం దరఖాస్తు నకలు మీద ఫీల్డు అసిస్టెంటు లేదా ప్రాజెక్టు ఆఫీసరు సంతకం చేసి తేది వేయాలి.
8. **వేతనాలకు సంబంధించిన హక్కులు :** పని చేసిన ప్రతి కూలికి కనీస కూలీ పొందే హక్కువుంది. ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పని పరిమాణమునుబట్టి కూలి చెల్లిస్తున్నారు.అయితే 7 గంటలు పనిచేస్తే కనీసం రూ. 80 కూలీ పడేటట్లు యూనిట్ రేట్సు వివరాలు కూలీలకు వివరంగా తెలియజేయాలి.

స్త్రీలకు పురుషులతో సమానంగా కూలీ పొందే హక్కు వుంది. ఈ నష్టపరిహారం పొందే హక్కు కూలీలకు వుంది. 15 రోజులలోపు వేతనం పొందే హక్కు కూలీలకు వుంది.

9. పని ప్రదేశంలో సౌకర్యాలు పరికరాలకు సంబధించిన హక్కు. పని ప్రదేశములో త్రాగటానికి పరిశుభ్రమైన నీటి హక్కు వుంది. పని ప్రదేశములో భోజనం చేయడానికి పిల్లలు విశ్రమించడానికి తగిననీడను ఏర్పాటు చేయవలసి వుంటుంది. పని ప్రదేశంలో అకస్మాతుగా ప్రమాదాలు జరిగితే ప్రథమ చిక్సిత కోసం చిక్సిత అందుబాటులో ఉండవలసి వుంటుంది.

10. పని చేస్తున్నప్పుడు కూలీలు ప్రమాదానికి గురి అయితే వైద్యం ఖర్చు మొత్తం ప్రభుత్వం భరించాలి. ఆసుపత్రి ఖర్చుతో పాటు,ప్రమాదవశాత్తు పనిచేయలేని కాలానికి రోజుకు 40 రూపాయల అదనంగా చెల్లించాలి.

ప్రమాదంలో ఒకవేల కార్మికులకు నష్టపరిహారంగా 50,000 చెల్లించాలి. ఒకవేళ బ్రతికి వికలాంగులైతే 25,000 నుండి 50,000 పరిహారం చెల్లించాల్సి వుంటుంది. తల్లితో పాటు వచ్చిన బిడ్డ ప్రమాదంలో గాయపడితే వైద్యం ఖర్చు ప్రభుత్వం భరించవలసి వుంటుంది.

## జిల్లాను ఏ విధంగా సస్యశ్యామలం చేయవచ్చు

ఉపాధి కార్యక్రమాన్ని ఒక దీర్ఘకాలిక పథకం కింద కార్యక్రమాన్ని ఉపయోగిస్తే జిల్లా ఎడారీకరణ మార్గాన్ని మార్చి సస్యశ్యామలం దిశగా మళ్ళించవచ్చు.

1. చెరువులను, కుంటలను పూర్తిగా పునరద్ధరించడం, పూడిక తీయడం, మరమ్మతులు చేయడం, లోతు చేయడం, చెరువుకట్టలను పెద్దవిగా చేసి బలోపేతం చేయడం, వీటి ద్వారా చెరువుల క్రింద అభివృద్ధి చెందడంతో పాటు సమృద్ధిగా భూగర్భ జలాలు లభించి, బోరు బావులున్న రైతులందరూ లబ్ధిపొందుతారు.

2. జిల్లాలో వున్నటువంటి వ్యవసాయ భూమి 27 లక్షల ఎకరాలలో మూడో వంతులో వర్షాధార పండ్ల చెట్లను పెట్టి పోషించుట. (మామిడి, చింత, సీతాఫలం. మొదలగునవి) అంటే దాదాపు 8 లక్షల ఎకరాల వర్షాధార పళ్ళతోటలుగా అభివృద్ధితోపాటు 7 లక్షల మంది మెట్ట రైతులందరూ లబ్ధిపొందుతారు. వారిలో కరువు తట్టుకునే శక్తి కూడా పెరుగుతుంది.

3. జిల్లాలో 5 లక్షల ఎకరాలకు మించి రిజర్వు అడవి ప్రాంతము మరియు అదనంగా ఇంకా 10 లక్షల ఎకారాలలో రెవెన్యూ బీడు భూములు ఉన్నాయి. ఈ 10 లక్షల ఎకరాలలో భూసార సంరక్షణ కోసం నీటి కందకాలను తవ్వి అభివృద్ధి చేసి, ప్రజలకు ఉపయోగపడే వర్షాధారముతో జీవించగల చెట్లను, గడ్డినాటి సంరక్షించాలి.

4. గ్రామాలలో పారిశుధ్య పరిస్థితి చాలా అధ్యాన్నంగా ఉంది. దీనితో వర్షాకాలంలో రోగాలు ప్రబలి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. గ్రామాలలో అంతర్గత రోడ్లు మురుగు నీటి కాలువలు నిర్మించి మురుగు నీరు బయటికి పొయ్యే విధంగా ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో అన్ని కుటుంబాలకు లెట్రిన్లు కట్టించి చేపట్టాలి. ఈ విధంగా గ్రామ పారిశుధ్య ఎరువులను తయారు చేసుకోవచ్చును.

పై నాలుగు కార్యక్రమాలను ఒక దీర్ఘకాల ప్రణాళిక అమలు పర్చడంలో భాగంగా కూలీలకందరికీ నిరంతరాయంగా 100 రోజుల పని కల్పించవచ్చు. 10 సంవత్సరాలపాటు కూలీలకు ఉపాధితోపాటు ఎడారీకరణను ఎదుర్కొనవచ్చు.

ఇటువంటి ప్రణాళిక సుసాధ్యం చేయాలంటే, ప్రభుత్వము గ్రామ పంచాయితీలు,రైతులు, ఒక్కటై ఒకే ధృక్పథంతో అభివృద్ధి ఆశయంతో పనిచేయాల్సి ఉంటుంది.

మన జిల్లాలో ప్రస్తుతం పని చేస్తున్న వారిలో కొంతమంది భూమిలేని వారితో పాటు అధికంగా సన్న చిన్నకారు రైతులు, మధ్య తరగతి మెట్ట రైతులు వున్నారు. కాబట్టి ఈ దీర్ఘకాల ప్రణాళికల ద్వారా అధిక శాతం సన్న చిన్నకారు రైతులు మెట్ట రైతులు వారి వ్యవసాయాభివృద్ధి చేసుకోగలుగుతారు.

అక్టోబర్ : 2009

# WORLD WATER DAY

***Improve water Resources, Prevent Desertification,Protect Agriculture, Farmers and Rural Livelihoods***

**Introduction:**

United Nations General Assembly declared 22 nd March as world water Day.

22nd March was first formbly proposed in Agenda 21 of 1992 Untited Nations Conference on Environment and Development in Rio de janeiro.Observance of 22nd March as World Water Day began in 1993 and its importance has grown significantly ever since. it has offered an opportunity for concerned stakeholders and civil society organificantly ever since.it draw the attention of pubilc on issues concerning water and create "Water Consciousness".And as well draw the attention of the policy makers in order to advocate a favourable policy enviroment for a) to promote a rights based approach to water b) sustainable water conservation and water use c) spatial and social equity in accessing water d) mitigating natural calamities like droughts and floods and their impact in people,particularly the vulnerable populations e)address issues of food Security f)Address issues of clean drinking water g)Address issues of water pollution.

Water is the basis for life of all the living beings. People are confronted with various water related problems at various levels such as family, communtiy, local, regional, national and global.Even today,one third of the world's population lack access to protected drinking water. People of some regions are confronted with devastating floods,while others are confronted with droughts and famines. Increasingly water has become a cause of conflict at various levels starting from within a family,between villages,regions, states and country. The water is becoming increasing scarce and so increasingly precious. so,it is predicted that the future wars will be fought for water at various levels. The main aim of the "world water day " is to draw the attention of the people towards water problems,create water consciousness,build pubilc opinion, advourable in order to address the problems related to water.

“Water is the most critical resource for socio-economic endowment of natural resources. Such resource rich regions could be economically and ecologically strong provided they are judiciously managed. Scarctity of water in an area leads to desertification and droughts. The variation in availabillty of water between regions is the basis for regional imbalances,disparities and regional disputes.of the total water existing on the Globe,the “fresh water “ directly useful for human beings is less than three percent. tha balance 97% of the water is in the form of oceans and ice in polar and other regions and is not directly useful to human beings.70% of the fresh water available “fresh water” is being utilized by agriculture sector.the food security of a region or a country depennds on the availability of water resources for agriculture. The remaining 30% of the fresh water is used for the purpose of domestic consumption,artisans & cottage industries,industrial sector and eco system, maintenance.

The scarce availability of water necessitates an equtable,efficient and effective use of water in order to meet the water needs of all people and sectors in a balanced manner. Mainly water availability is categorized as 1. Rain water,2.Surface water (water bodies and rivers) 3. Moisture available in the upper layers of soil and 4.Ground water.However,rain water is the source, all the above 4 categories of water.The Central Pubilc Health Engineering Department has assessed that a person requires 135 litres of water per day to meet the domestic and drinking water needs.

**2.status of water resources in Anantapur District.**

**2.1 Rainfed farming is in severe crisis and on the collapse !**

Anantapur district is moving fast towards desertfication. Agriculture is in severe crisis and other rural livelihoods are in peril.The life of all the people in rural areas is in severe distress.The district receives an annual rainfall of 552 mm.The district experiences droughts in three years in every five years! That means rains do not occur as and when it is required for crops and so the crops fail.The total geographical area of the district is about 50 lakh acres.The total area under cultivation is about 27 lakh acres.Out of this only 3 lakh acres is under irrigation, mostly underground water. This means 90% of the cultivated area is under rainfed.Under these prevailing crisis conditions,there is a recent trend of rainfed farmers abandoning agriculture. If this trend is unabated,there is a possibility of disappreance of rainfed cultivation due to continuous drought conditions displacing about 4-5 lakh farm households, particularly small and marginal farmers.

**2.2 Groundwater table is sinking day by day & surface water bodies silted and in disrepair :**

Not more than 3 lakh acres irrigation with 1.7 lakh tube wells in the district.in addition to this,an area of only 60,000 acres is being irrigated under High Level Canal of Thunga Bhadara Dam. Due to less recharege during drought years,the ground water table is fast depleting every year.There are about 5000 nos.of traditional surface water resources like tanks,mini percolation tanks etc.,in the district.These conventional water bodies once were the main sources of harvesting rain water and rechargring ground water in the District . This water harvesting and recharge mechanisms are now ineffective due to siltation,disrepair and neglect. Besides the inflows of water into tanks are also largely decreased, due to climate change and shift in the pattern of rainfall. These water bodies are losing their water holding capacity,due to accumulation of silt for years. Some water bodies are losing their capactity due to cilmate change and shift weirs and bunds. Apart from this nearly 40% of the rain water is being evaporated due to intense heat and lack of green cover. This could have been avoided,had the vegetative cover spread in the district extensively. Thousands of bore wells are drying during summer every year. The ground water is depleting due to indiscriminate drilling of more and more new bore wells. The farmers are desparate to save the irrigated crops and fruit trees. So the farmers distressed and desperate, are resotring to failing of ten to twenty bore wells in their lands in search of water, about without success. Due to failure of bore wells the farmers are pushed in to a deep debt trap and some are resorting to suicides as they see no hope for future!.

**2.3 Reserved forest denuded and Revenue hillocks & water lands barren**

In order to convert the rain water into ground water and enhance life system, an area should have adequate forest with greenery.An area of 5 lakh acres (10% of the Geographical area) is under reserved forest in our distict. All this area embraces (20% of the Geographical area) comprising of barren hills,hillocks,water lands and stream banks is also devoid of any vegetation. Forest commission recommends that 33% of a geographical area (in a distict)has to be under forest in order to have an ecological balance and sustainable environment.

**3.The following policies and programme are proposed to develop the water resources and their proper and efficient utilization in Anantapur Districtt.**

**3.1 rain water harvesting and soil & moisture conservation activities to be taken up extensively in the district:**

In the entire district,the total area of 50 lakh acres (that is cultivated lands,barren hills,forest areas,hillock,stream banks all put together)has to be treated under watershed development programme. Soil and moisture conservation and rain

water harvesting activities are to be carried out.This results in increase in vegetation, biodiversity, biotic life in the soils, ground water development and combats desertiification.

**3.2 Rennovation of traditional water bodies such as tanks and mini percolation tanks**

Traditional surface water bodies such as irrigation tanks,small tanks,percolation tanks etc.,existing in the district are to be desilted, repaired and restored to their full capacity. This leads to increase in rain water harvesting and a high surface water storage capacity which in turn increases ground water recharge.Thus the bore wells also will have assured water yield.

**3.3 Afforestation (5 lakh acres)of reserved forest and developing (10 lakh acres)social forestry on the hillocks,barren lands and stream courses etc.**

The forest area of 5 lakh acres which is degraded is to be developed with suitable afforestation. Besides another 10 lakhs aceres of barren hills, hillocks, saline, stream banks etc.,are to be developed with social forestry. Afforestation and social forestry should be taken up with diversifiled local species which can yield tree fodder, wild fruits, biomass and other non-timber forest produce which will support livelihoods, environment and bio diversity will increased besides increase in vegetation, moisture in the upper layers of soil,and soil biotic life will be increased besides increase in ground water table.The leaf litter falling on the ground will be converted into humous (soil carbon) due to decomposition.And this process aide in increase of moistture holding capacity,fertility and productivity of the soils.This whole processes combats desertification and enhances carrying capactity for agriculture,animal husbandry and other rural livelihoods.

**3.4 Adoption of conjunctive water utilization by formation of “Ananta Water Grid”.**

The water received from Thunga Bhadra project by the district through High Level Canal and water would be allocated under Handri-Neeva project should be used to fill the traditional water bodies in the district without using for direct irrigation, thereby creating an “Anantapur Water Gird.” Thus,the soil moisture due to rain,surface water,river water, ground water are to be liked to supplement and complement each other in order to create a mechanism of “conjunctive water utilization” in managing irrigation for crops.As a part of this a system,protective or life saving irrigation can be minimized with this protective irrigation.The conjuctive water use will cover larger area with irrigation,provide a better crop-security, benefit many more farmers.

**3.5 Regulation of ground water utilization and adoption of micro irrigation through**

**social regulation.**

A policy and a system of sharing of ground water between the farmers having bore wells and those who do not have bore wells is to be adopted in order to save rainfed crops during prolonged dry spells,by giving protective irrigation. Micro irrigation methods are to be followed to save water and get "more crop per drop" of water. A social regulatory mechanism has to be followed in utilization of ground water so as to adopt a more equitable distribution of ground water with non-bore well oweners Ground water regulation, water-sharing and conjuctive use of water will together enhance water synergy, social equity in water usage and also a more equitable social distribution of water across the district.

**3.6 Conservation farming paradigm (Sustainable Agiculture)to be adopted in the place of green Revolution paradigm:**

The Green Revolution paradigm of agiculture is also known as HEIDA (High External Input Destructive Agriculture)is destructive to environment and people due to its high use of chemicals.it is high cost intensive and so unsuitable for drought prone rainfed farming. It is anti-small and marginal farmers as they could not afford high investments and compete with big farmers. It is only suitable for big farmers and big holdings with irrigation facilities as it operates on big machines like tractors,harvesters etc,which cannot operate in small holdings.So it is totally unsuitable for rainfed agriculture and small and marginal farmers particuarly for Anantapur like drought-prone agro-climate.So,a Conservation farming system which is eco-friendly,low external input with low cost should be preferred. This paradiigm of agriculture is also called "Sustainable Agriculture"it is pro-rainfed farming system and also pro-small and marginal farmers,as it uses low cost local resource based bio-fertilisers and bio pest management and local seeds which can be re used by farmers time and again.Under the Sustainable Agriculture,more and more rainfed tree farming mango,custard apple,tamarind,subabul,sesbania etc.,have to be encouraged as local tree crops are more resilient than annual crops.The tree farming has to be with diversified trees for food,fruit,fodder,fibre,biomass,medicinal etc.The tree crops will bring a positive change in the land use from short duration seasonal crops to perennial terr crops and has a positive impact on environment.

**Water intensive crops should be banned :**

since the district is heading for desertification,the water intensive and long duration crops like paddy,sugar cane,banana,should not be encouraged.Only short duration crops (vegetables,millets,food crops)and rainfed are to be encouraged.

**4. Conclusion: A 10 year perspective plan for combating drought & desertification.**

By following extensively the policies and programmes mentioned above,the water resources can be augmented and environment improved besides achieving social equity and spatital equity in distribution and utilization of available water and environmental resources. The policy decisions are to be made in this direction and suitable programmes developed.A 10 year perspective plan in this direction has to be prepared and implemented on war footing. In this process of preparation of action plans and implementation, rural communities, PanchayatRaj institution, Water Users Association, Forest Protection Committees, Watershed Development Committees, Self Help Groups and other Civil Society Organizations are to be appropriatey involved. Similarly, various Government departments, like Forest Department, District Water Management Agency, Rural Development, Department, Minor Irrigation Department, Horticulture, Micro irrigation, Revenue Department etc., have to work in coordinetively with commitment to the stated goals. It is to be noted that MGNREGS could be extensively used in actual implementation of a number of progarmmes suggested above.

If the above policies and programmes are strictly followed, droughts and desertification could be combated.A change towards sustainability in agricultural eco-system can be obtained through improvement of water resources and environmental resources. Agricultural Security (including cattle and livestock)rural livelihood security and food Security can be achieved on sustainble basis. A call today on the occassion of World Water Day 2012 to the Government, particularly policy makers Non-Government Organizations, Farmers organizations, SMGs and their federations,Civil Society Organizations and people to work in a concern in this direction.

Date : 22-03-2012

# "అనంత ప్రస్థానం"

# 2

# ఇదీ ప్రయాణం


| | | | |
|---|---|---|---|
| 1. | ఏ వెల్గులకీ ప్రస్థానం - *సింగమనేని నారాయణ* | : | I |
| 2. | అనంత కరువు పరిష్కారాలు సాధ్యమే - ఇమామ్ | : | III |
| 3. | ముందుమాట - *వై.వి.మల్లారెడ్డి* | : | IX |
| 4. | అనంతపురం జిల్లాలో దుర్భిక్షం - దారిద్ర్యం - ఒక కార్యాచరణ సాదృశ్యం | : | 17 |
| 5. | ప్రజలు ప్రధాన పాత్రధారులుగా వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు- అనుభవాలు - ఆలోచనలు | : | 32 |
| 6. | అనంతలో నీటి సంక్షోభం - తక్షణ స్పందన అవసరం | : | 48 |
| 7. | అనంత కరువు బహుముఖ చిత్రం - పరిష్కారాలపై ఓ సమాలోచన | : | 54 |
| 8. | నీటి వినియోగంలో సమతుల్యమే సమగ్ర గ్రామీణాభివృద్ధికి పునాది | : | 76 |
| 9. | నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ పథకాన్ని రూపొందించి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి అనంత సంక్షోభాన్ని పరిష్కరించాలి | : | 84 |
| 10. | అనంతపురం జిల్లాలో వ్యవసాయ సంక్షోభం నుండి ప్రస్తుతం రైతులనాదుకోవడమెలా? | : | 88 |
| 11. | ప్రత్యేక రాష్ట్రాలు కాదు - ప్రజల అభివృద్ధి కావాలి | : | 91 |
| 12. | నదుల అనుసంధానమే కాదు - నీటితో ప్రజల్ని అనుసంధానించాలి | : | 99 |
| 13. | అనంతపురం జిల్లా నిరంతర కరవు, నిత్య దారిద్ర్యం | : | 109 |
| 14. | అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి బహుముఖ వ్యూహం - చర్చా పత్రము | : | 118 |
| 15 | అనంతపురం జిల్లాలో మెట్ట రైతులకు జీవనోపాధి | : | 141 |
| 16. | పశుసంపదను పెంచుకునే ప్రయత్నం చేయాలి. | : | 146 |
| 17. | జిల్లాలోని భూగర్భ జలాలు ఒక మునిగిపోతున్న పడవలాంటివి నియంత్రణ లేకపోతే తప్పని సామూహిక మునక | : | 149 |
| 18. | రైతు సోదర సోదరీమణులారా! ఆత్మహత్యలు పిరికితనం, సమస్యలను ఒకరికొకరు తోడుగా, ధైర్యంగా ఎదుర్కొందాం. | : | 153 |
| 19. | వలసల్ని ఆపుదాం! పనికి ఆహార పథకాన్ని సద్వినియోగం చేసుకుందాం | : | 157 |
| 20. | అనంత ఎడారిలో ఒయాసిస్సులు | : | 161 |
| 21. | అనంత కరువు అంతం కావాలంటే | : | 165 |

# ఏ వెల్గులకీ ప్రస్థానం?

అనంతపురం జిల్లా గురించి, బయటి ప్రపంచానికి ఇప్పటికీ తెలిసింది చాలా తక్కువ. ఈ జిల్లా రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్ద జిల్లా అని, ఒక కోటి మంది నివసించగల విశాల భూభాగం ఉన్నప్పటికీ ఇక్కడ 36 లక్షల మంది ప్రజలు మాత్రమే ఎందుకున్నారనీ, భారతదేశంలో అతి తక్కువ వర్షపాతం గల రెండవ జిల్లా అనీ, ఇక్కడ 26 లక్షల ఎకరాల వ్యవసాయ సాగుభూమి ఉన్నప్పటికీ ఇన్నేళ్ల తర్వాత కూడా సాగునీరు 10 శాతం భూమికి కూడా అందలేదనీ, ఏ వ్యవసాయ ఆర్థిక విధానాల వల్ల ఇక్కడి ప్రజలు ఒకే ఒక వేరుశనగ పంట పండిస్తూ దగ్ధమౌతున్నారనీ, గత ఏడేళ్లలో ఈ జిల్లా రైతులు ఐదువేల కోట్ల వేరుశనగ పంట ఎందుకు నష్టపోయినారనీ, ప్రతి ఏటా ఈ జిల్లా నుండి 3 లక్షల మందికి పైగా ప్రజలు ఎందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారనీ, గత ఏడెనిమిది సంవత్సరాలలో ఏ దుష్ప్రభావాల వల్ల ఇక్కడ 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారనీ, ప్రతి ఏటా వేలాది పశువులు ఏకారణంగా కటికశాలకు తరలివెళ్తున్నాయనీ, ఒక చోట వంద మంది చేరి పనిచేసే చిన్న చిన్న పరిశ్రమలు కూడా ఇక్కడ ఎందుకు లేవనీ – ఇలాంటి ఎన్నెన్నో దారుణ వాస్తవాలు ఇతర ప్రాంతాల వాళ్లకు ఇప్పటికీ నిజంగా తెలియదు.

ఈ జిల్లా పేరు వినగానే కరువు జిల్లా అనో, ఫాక్షన్ జిల్లా అనో రెండు మాటలు పారేస్తారే గాని, వాటి మూలాల గురించి తెలుసుకున్న వారు చాలా తక్కువ. ఆలోచించే వారు మరీ తక్కువ. ఈ జిల్లా కరువు జిల్లాగా ఎందుకు చరిత్రలో స్థిరపడి పోయింది? ఇక్కడి ఏ అసహజ వనరులు ఈ జిల్లాను అలా స్థిరీకరించినాయి? కేవలం వర్షపాత హైన్యమేనా? కేవలం ప్రకృతిగత నిరాదరణేనా? పాలక పక్ష సుదీర్ఘ నిర్లక్ష్య వైఖరి పాత్ర ఇందులో ఎంత? ఈ స్థితి నుండి ఈ జిల్లాను బయట పడవేయటానికి మార్గాలే లేవా? కరువులనూ దారిద్ర్యాన్నీ అరికట్టే కార్యాచరణ దిశలే లేవా? ప్రత్యామ్నాయ భూవినియోగ పద్ధతులే లేవా? ప్రత్యామ్నాయ జీవనాధారాన్ని కల్పించే వ్యవసాయ ప్రణాళికలేవీ లేవా? సాగునీరును అందించే జల వినియోగ నిర్మాణాలు సాధ్యం కావా? వ్యవసాయాధారిత పరిశ్రమల కల్పనకు, వ్యవసాయేతర పరిశ్రమల స్థాపనకు ఆచరణ సాధ్యమైన మార్గాంతరాలే లేవా? ప్రజల సాంఘిక శక్తిని పెంపొందించి నిర్మాణాత్మక కార్యాచరణతో ఈ జిల్లాను మరో అనంతపురం జిల్లా సాధ్యమే అని నిరూపించటానికి చిత్తశుద్ధితో చేయగల కృషి సాధ్యం కాదా? నిర్దిష్ట కాల పరిమితితో కార్యాచరణ పథకాలు రూపొందించి ప్రజల భాగస్వామ్యంతో సుదీర్ఘ అనంత సంక్షోభాన్ని పరిష్కరించే రూపాంతరాలే లేవా? పర్యావరణాన్ని జీవన వనరులుగా మార్చుకొనేందుకు అవసరమైన సాంకేతిక జ్ఞానాన్ని ఉపయోగ పెట్టుకొనే శాస్త్రీయ దృక్పథమే లేదా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలూ, సందేహాలూ ఈ జిల్లాను గురించి ఆలోచించే వారందరినీ వేధిస్తున్నాయి, కలవరపెడుతున్నాయి.

ఇలాంటి వేదన నుండీ, బాధ నుండీ, ఆర్తి నుండీ, బాధ్యత నుండీ పైన లేవనెత్తిన ఎన్నెన్నో ప్రశ్నలకు సమాధానాలనూ, ఆచరణలనూ, వాస్తవికాంశాలనూ అన్వేషిస్తూ ఒక అనంత పథికుడు రాసిన వ్యాసాల సమాహారం ఈ “అనంత ప్రస్థానం”.

ఆ అనంత పథికుడి పేరు వై.వి. మల్లారెడ్డి, అనంతపురం ఆర్.డి.టి. సంస్థలో ఎకాలజీ డైరెక్టర్‌గా కృషి చేస్తూ ఈ జిల్లా వనరుల గురించి, పర్యావరణం గురించి, పంటల గురించి, జలాశయాల గురించి, వ్యవసాయం గురించి సుదీర్ఘకాలంగా పరిశోధనలు చేస్తున్నవారు, అనంత సంక్షోభానికి పరిష్కారాల గురించి ఆచరణ సాధ్యమైన సూచనలను పలు సందర్భాలలో వెలిబుచ్చిన వారు. ఈ పుస్తకంలోని పలు వ్యాసాలు వారి పరిశ్రమనూ, ఆవేదననూ, ఆరాటాన్నీ, ఆత్మీయతనూ వ్యక్తం చేస్తాయి. ఈ పుస్తకంలో వారి పరిశీలనాంశాల్ని, వారు సూచించిన పరిష్కారాంశాల్నీ ఆచరణలో పెట్టగలిగితే మరో అనంతపురం సాధ్యమే అని మీరు కూడా అతనితో గొంతుకలుపుతారు.

అనంతపురం
తేది: 27-3-2007 **సింగమనేని నారాయణ**

# అనంత కరువు పరిష్కారాలు సాధ్యమే!

స్వాతంత్ర్యసమరయోధులు, సాధనపత్రిక సంపాదకులు, శ్రీబాగ్ ఒప్పందం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కీ.శే. పప్పూరి రామాచార్యుల వారు అనంతపురం జిల్లా గురించి 60సం॥రాల మునుపే “అనంత” Poor గా తరచు అభివర్ణించే వారు.

“రాయలసీమలో కరువు పిలిస్తే పలుకుతుంది. అనంతపురం జిల్లాలో పిలువకనే పలుకుతుంది” అన్నారు పెన్నేటి పాట రచయిత విద్వాన్ విశ్వం. “రాయలసీమలో వర్షాలు రావాలంటే కోస్తా ఆంధ్రలో తుఫానులు వరదలు రావాలి” అన్నారు రాయలసీమ మేధావులు రాయలసీమ కన్నీటి గాథ రచయిత డా॥ యం.వి. రమణారెడ్డి. “ఒకప్పుడు కోస్తా ఆంధ్రలో తుఫానులు వరదలు వస్తే అనంతపురం జిల్లాలో వర్షాలు వచ్చేవి, ఇటీవల కాలంలో అక్కడ తుఫానులు వరదలు వచ్చిన నేపథ్యంలో కూడా అనంతపురం జిల్లాలో వర్షాలు రావడం లేదు'' అని ప్రముఖ సాహిత్యవిమర్శకులు కథకులు అయిన శ్రీ సింగమనేనినారాయణ తన ఆవేదన వెలిబుచ్చారు. “అనంతపురంజిల్లా చరిత్ర అంతా కరువుల చరిత్రే” అంటూ శ్రీ భూమన్ గారు జిల్లా చరిత్రను సమీక్షిస్తూ వివరించారు. అనంతపురంజిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విలేఖరులుగా ఇక్కడ పని చేసిన మిత్రులు గత 25సం॥రాలుగా పరిస్థితులను సమీక్షిస్తూ ఈ జిల్లాను కరువు జిల్లాగా పత్రికల్లో వివిధ సందర్భాలలో వ్యక్తపరుస్తూ రావడం వల్ల ఈ జిల్లాకు కరువు జిల్లాగా కూడా పిలువడం పరిపాటిగా మారిపోయింది.

గత వంద సం॥రాలలో తీవ్రదుర్భిక్ష పరిస్థితుల్ని ఈ జిల్లా దాదాపు 50సం॥రాలు ఎదుర్కొంది. కరువుల నేపథ్యంలో పశుగ్రాసం, త్రాగునీటి సమస్య, వలసలు, రైతాంగానికి తీవ్రమైన అప్పుల సమస్యను తెచ్చి పెట్టాయి. గ్రామీణ ప్రాంతాలలో కరువు ప్రభావం రైతుల ప్రత్యేకించి మహిళల పైన ఎక్కువ ప్రతికూల ప్రభావం చూపింది. 30-40సం॥రాల మహిళలు ఈజిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ముదుసలి స్వరూపంతో మనకు దర్శనమిస్తారు. ఏ మహిళ మెడలో బంగారం కనిపించదు. వారి బంగారం, వారి భర్తల భూములు బ్యాంకుల్లో ప్రత్యేకించి తనఖా బ్యాంకుల్లో తాకట్టు పెట్టబడ్డాయి. జిల్లాలో కరువులు-కరువు పరిష్కార పోరాటాలు, ఆందోళనలు నిరంతరం చోటు చేసుకున్నాయి.

ఈ జిల్లాలో కరువు పరిష్కారాల కొరకు కీ॥శే॥ పప్పూరి రామాచార్యులు, కల్లూరి సుబ్బారావు, నీలంసంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, విద్వాన్ విశ్వం లాంటి వారు ఆందోళనలు చేశారు. అలాగే ద్వితీయ తరంలో కీ॥శే॥ చల్లా సుబ్బారాయుడు, వి.కె. ఆదినారాయణరెడ్డి,

సదాశివన్, శర్మ, అనంతవెంకటరెడ్డి, శ్రీపుల్లయ్య లాంటి నాయకులు కూడా ఈజిల్లా కరువు పరిష్కారాల కొరకు కృషి చేశారు, మరీ ప్రత్యేకంగా కీ.శే. శివరామక్రిష్ణయ్య లాంటి సాంకేతిక నిపుణుల సేవలగురించి ఈ సందర్భంగా ప్రస్తావించాల్సి ఉంది.

ఇటీవల కాలంలో యువతరం జిల్లాలో కరువు పరిష్కారాల ఆందోళనల వారసత్వాన్ని అందుకొంది. అందులో శ్రీయుతులు సింగమనేని నారాయణ, యస్.యం.బాషా, వై.వి. మల్లారెడ్డి, శ్రీ సూర్యసాగర్ లాంటి మేధావులు, సామాజిక విశ్లేషకులు మరియు దేవపుత్ర, బండినారాయణస్వామి, వై. శ్రీరాములు లాంటి కథకులు, కవులు కూడా వున్నారు. జిల్లాలో రచయితలు, కళాకారులు, మేధావులు, కవులందరూ కరువు పరిష్కారాల గురించి తరచూ తమ బాధ్యతలను నెరవేరుస్తున్నారు.

అనంతపురం జిల్లాలో ఒక సంక్లిష్ట సామాజిక, రాజకీయ వాతావరణం నెలకొని వున్నది. ఈ జిల్లా అభివృద్ధికి కృషి చేసే రాజకీయ నాయకులు, రాజకీయ వ్యవస్థలు వున్నాయి. ఆలాగే జిల్లాలో అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు ప్రత్యేకించి అభివృద్ధి కార్యక్రమాలను కొల్లగొట్టి రాజకీయ వ్యవస్థలను, ప్రజాస్వామిక ప్రక్రియను అపహాస్యం చేసిన నాయకులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ వ్యవస్థలు ఉన్నాయి.

జిల్లా అభివృద్ధికి కృషిచేసిన అధికారులు వున్నారు. ప్రత్యేకించి 1800-1807 మధ్య ఈ జిల్లా మొదటి కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో గారు జిల్లాకు అందించిన సేవలు నేటికీ అధికారులకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. ఆయన జిల్లాలో పచ్చదనం కోసం సామాజిక అడవులను ప్రత్యేకించి చింతతోపులను పెంచిన తీరు చారిత్రాత్మకమైనది. మన్రో గారు జిల్లాలో కురిసిన నీటిని మరింతగా నిల్వచేసుకోవడానికి చెరువులలో పూడిక తీయించడం జరిగింది. జిల్లా రైతాంగానికి "రైత్వారీ విధానం" ఒకటి ప్రవేశపెట్టి భూములను పంచారు. జిల్లాలో విరివిగా జీవి, తుమ్మ, నేరేడు, వేప, కానుగ, చింత మరియు మర్రిచెట్లపెంపకాన్ని ప్రోత్సహించారు. ఈ చర్యలు నేటికీ ఆదర్శప్రాయం, అత్యంత అవసరమైన చర్యలుకూడా.

శ్రీ సత్యసాయిబాబా గారు ఈ జిల్లాలో విద్య, వైద్యం, త్రాగునీటికి అందించిన సేవలు చాలా విలువైనవి. ఆర్.డి.టి స్వచ్ఛందసంస్థ ద్వారా ప్రజలకు శ్రీఫాదర్ ఫెర్రర్ మరియు శ్రీమతి అన్నే ఫెర్రర్‌లు అందించుచున్న సేవలు కూడా విలువైనవి.

ఆర్.డి.టి చేపట్టిన సామాజిక అడవులు, భూసార పరిరక్షణ చర్యలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు, పర్‌కోలేషన్ ట్యాంకుల నిర్మాణాలు, గృహనిర్మాణాలు మొదలగు అనేక కరువు నివారణ మరియు ఉపాధిహామి పథకాలు జిల్లాలో పనిచేసే అధికారులకు, ప్రభుత్వానికి కూడా ఆదర్శంగా నిలిచి పథకాలు రూపొందించే స్థాయి జిల్లాలో నెలకొంది. ఈ దిశలో ప్రభుత్వానికి ఆర్.డి.టికి మధ్య సమన్వయ కర్తగా మల్లారెడ్డి గారు నిర్వహించిన పాత్ర విలువైనది.

మల్లారెడ్డి అనంతపురం జిల్లాను ఒక యూనిట్‌గా భావించి జిల్లాలో నీటి వలయాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశం పై ఒక విస్తృత చర్చ జరగాలని నీటి వలయం నిర్మించి నీటి వినియోగంలో సమతుల్యతను సాధించాలనేది ఆయన సూచన. అనంతపురం జిల్లాలో 6000 సాంప్రదాయక నీటి వనరులున్నాయి. చెరువులు, కుంటలు, తలిపిరులు ఇందులోవున్నాయి. దీనికి తోడుగా జిల్లా మధ్యతరహా నీటిప్రాజెక్టులు పెన్నార్ కుముద్వతి, అప్పర్‌పెన్నా, పి.ఎ.బి.ఆర్, మిడ్‌పెన్నార్,చాగల్లు, మద్దిలేరు, సి.జి.యస్ ప్రాజెక్టులు వున్నాయి. ఇందుకు తోడుగా తుంగభద్ర జలాలను కృష్ణాజలాలను ప్రభుత్వం తరలించాలనే ప్రతిపాదనలు చురుకుగా అమలుజరుగుచున్నాయి. ఈ విధానాల ద్వారా జిల్లాకు నీటిని తరలించవచ్చు. దాదాపు 80టి.యం.సిల జలాలను అనంతపురం జిల్లాకు అదనంగా తరలించవచ్చని రాష్ట్ర ఇంజనీర్ల సంఘం ప్రతిపాదించింది. ఆరువేల సాంప్రదాయక నీటివనరులు మరియు మీడియం ప్రాజెక్టుల క్రింద 2,75,000ఎకరాలు నీటివసతి కొరకు ఎదురుచూస్తున్నాయి. ఈ వనరులకు వర్షపు నీరే ఆధారం. అభివృద్ధిచెందిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎత్తిపోతల పథకాలు నేడు అమలు జరుగుతున్నాయి.ఈ అనుకూల అవకాశాన్ని వినియోగించి జిల్లా చెరువులకు, కుంటలకు, మధ్యతరహా నీటిపథకాలకు నీటిని తరలించవచ్చు. లభ్యమైన నీటిని వినియోగించుకొని ఒక నీటివలయాన్ని ఏర్పాటుచేయవచ్చు. ఈ అంశం గురించి విస్తృత చర్చజరగాలి. లభించిన నీటిని ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి డ్రిప్, స్ప్రింక్లర్‌ల సహకారంతో పండ్లతోటలను చేపట్టాలి. జిల్లాలో అనువైన పరిస్థితులను వినియోగించుకొని పాలవుత్పత్తులను పెంచాలి.

మల్లారెడ్డి గారు అనంతపురం జిల్లాలోని మారుమూల ప్రాంతంలోని రైతు కుటుంబం నుండి

వచ్చారు. ఆయన ఆర్.డి.టిలో ఒక సామాన్య ఉద్యోగిగా చేరి నిరంతర శ్రమతో ఎదిగి వచ్చిన వ్యక్తి. అనంతపురం జిల్లాలో సామాజిక పరిణామాలను ఇక్కడి భౌగోళిక శీతోష్ణ స్థితిగతులపై ప్రత్యేకంగా అధ్యయనం చేసారు. ఆర్.డి.టి స్వచ్ఛంద సంస్థలో గ్రామీణాభివృద్ధి సమస్యలపై పని చేస్తూ తనకు వచ్చిన అవకాశాల ద్వారా జాతీయ అంతర్జాతీయ పరిణామాలను తెలుసుకోగలిగారు. ఆయన దాదాపు 30 దేశాల్లోని ఆర్థిక సామాజిక రాజకీయ పరిణామాల్ని విస్తృతంగా పర్యటించి తెలుసుకోగలిగారు. ఆయన జాతీయ అంతర్జాతీయ చర్చాగోష్టులు, సమావేశాలలో పాల్గొని విశేషమైన అనుభవాల్ని కల్గివున్న వారు. తన నిరంతర అధ్యయనం ద్వారా అనంతపురం జిల్లా పరిస్థితులపై తనదైన శైలి తరహాలో జాతీయంగా వివిధ సందర్భాలలో కరువు పరిష్కారాలకు తనదైన చేయూతను అందించారు.

అనంతపురం జిల్లా చరిత్రలో ఇటీవల కాలంలో శ్రీ సత్యసాయిబాబా మరియు శ్రీ ఫాదర్ ఫెర్రర్ మరియు శ్రీమతి అన్నెఫెర్రర్ గార్ల సేవలు చరిత్రాత్మకమైనవిగా నిలిచి పోయాయి. నేడు జిల్లా ప్రజలలో ఆర్.డి.టి ఒక సమున్నతమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఆర్.డి.టిలో శ్రీ మల్లారెడ్డి గారి సేవలు కూడా ఆసంస్థ చరిత్రలో నిలిచిపోతాయి.

మల్లారెడ్డి గారు వక్త, మంచి వ్యక్తిగానే కాకుండా ఒక మంచి సామాజిక విశ్లేషకుడిగా జిల్లా ప్రజలకు సుపరిచితుడు. ఆయన రచయితకాదు, వ్యాసాలు రాయడం అంతకన్నా తెలియదు. జిల్లాలో గత 10సం॥రాలుగా నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై జిల్లాలోని పౌరసమాజం, రాజకీయ వ్యవస్థలు, రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, పౌరహక్కులు, ప్రజాతంత్ర వేదికలు తీవ్రంగా స్పందిస్తున్న నేపథ్యంలో ఆయన తన వంతు బాధ్యతగా పైశ్రేణులతో జతకలిపారు. వివిధ సందర్భాలలో అభిప్రాయాలు వ్యక్తపర్చాల్సిన నేపథ్యంలో మల్లారెడ్డిచే కదలిక వ్యాసాలు రాయించగల్గింది. సామాజిక ఘర్షణలో నుండి పుట్టుకొచ్చినవే మల్లారెడ్డి వ్యాసాలు. మల్లారెడ్డి రచనా వ్యాసంగం బాధ్యతగా స్వీకరించాం తరచుగా రచనలు చేస్తూవచ్చారు.

అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లా. భౌగోళికంగా నైసర్గికంగా ప్రతికూల వాతావరణం వల్ల నీటి లభ్యత కొరవడింది. ఈ నేపథ్యంలో నీటి ప్రాముఖ్యాన్ని వివరించాల్సిన ఒక దౌర్భాగ్యపు పరిస్థితిని అనంతవాసులకు పాలకులు మిగిల్చారు. ఈ సవాల్‌ను చాలా తీవ్రంగా జిల్లాలోని పౌరసమాజం స్వీకరించింది. భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థలో తమ అధికారసోపానాలకు కరువును, పేదరికాన్ని ఒక పెట్టుబడిగా ఉపయోగించుకొనే కుటిల రాజకీయ నాయకులకు ఈ జిల్లాలో కొదవలేదు.

స్వార్థ రాజకీయాలు కరువు పరిష్కారాలను మరింత జటిలంచేశాయి. అభివృద్ధి పథకాలలో అవినీతిలో ఈ జిల్లా గొప్ప పేరు ప్రఖ్యాతులనే సంపాదించింది. ఫ్యాక్షన్ రాజకీయాలు, హత్యారాజకీయాలు అభివృద్ధి పథకాలను కొల్లగొట్టే స్థాయికి చేరి జిల్లా పరువును తీశాయి. జిల్లాలో పాలకులు వ్యవసాయరంగాన్ని సేద్యపు నీటిరంగాన్ని, కరువు నివారణా చర్యల్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. జాతీయ అంతర్జాతీయ పరిణామాలు జిల్లా రైతాంగం పై "మూలిగే నక్కపై తాటికాయ" పడ్డట్టు అయ్యింది. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల దేశంలోకి కుప్పతెప్పలుగా పామొలిన్ ఆయిల్ దిగుమతితో జిల్లాలోని వేరుశెనగ పండించే రైతాంగ గిట్టుబాటు ధర ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని 26లక్షల సాగుభూమిలో 22లక్షలు వేరుశెనగ పండించే రైతాంగం వరుసకరువులు మరియు పామొలిన్ దిగుమతిలో అల్లకల్లోలం అయింది. WTO ఆంక్షల సడలింపుతో విపరీతంగా వస్త్రాలు దిగుమతి కావడంతో జిల్లా ప్రధాన చేతివృత్తుల పరిశ్రమ కకావికలం అయింది. చైనీస్ సిల్క్ దిగుమతి ప్రభావంతో జిల్లాలోని మరోవాణిజ్య పంట మల్బరి రైతాంగానికి సంక్షోభాన్ని మరింతగా పెంచింది. వ్యవసాయంపై పెట్టుబడులు, ప్రభుత్వ బ్యాంకులు మరియు ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుండి తీసుకొని బోర్లు వేయించిన రైతాంగం పరిస్థితి విషమించింది. పాలకుల విధానాల వల్ల వైద్యం, విద్య, రవాణా సౌకర్యాలు ప్రైవేటీకరణతో రైతులపై

విపరీత ఋణభారం పడింది. రైతులు మార్కెట్‌లో దివాల తీసారు. వరుస కరువుల నేపథ్యంలో పరిస్థితి విషమించింది. ఈ ప్రతికూల వాతావరణంలో జిల్లా ప్రజల్లో భవిష్యత్తు పట్ల ఒక ఆశను కల్పించాల్సిన అవసరం వున్న నేపథ్యంలో జిల్లాలో అనేక ఆందోళనలు, పోరాటాలు జరిగాయి. ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆందోళనలకు ఊపిరిపోసి బాసటగా నిల్చిన వ్యక్తుల్లో మల్లారెడ్డి ఒకరు. జిల్లాలో ఒక వైపు ఫాక్షన్ రాజకీయాలు, కాంట్రాక్టర్‌ల, ఉద్యోగస్థుల అవినీతి అక్రమాలు, మరోవైపు కరువులు, రైతుల ఆత్మహత్యలతో జిల్లా కకావికలమై పోయిన పరిస్థితుల్లో ప్రజాతంత్ర శక్తులు ఈ జిల్లాలో ప్రజల గొంతుకను వినిపించాయి. ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టాయి. ప్రజాతంత్ర శక్తులు, వామపక్ష పార్టీలు ఒక శక్తిగా ఎలా ఉద్యమించాయో అలాగే ఈజిల్లాలో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా రచయితలు, కళాకారులు, మేధావులు, కవులు, స్వచ్ఛంద సంస్థలు జిల్లా సమస్యల పరిష్కారాల కొరకు ఉద్యమించారు. ఒకశక్తిగా ఎదిగారు. పౌరసమాజం పౌరవేదికల్లో శ్రీ సింగమనేని నారాయణ, యస్.యం బాషా, మల్లారెడ్డి గారు గణనీయమైన పాత్రను పోషించారు.

గత 10సం॥రాలుగా భారతదేశంలో సేద్యపు నీటిరంగంలో బహుళార్థక ప్రాజెక్టుల నిర్మాణాలపై ఒక రచ్చ జరుగుతోంది. భారీ నీటిపారుదల ప్రాజెక్టులే కరువు ప్రాంత సమస్యలకు పరిష్కారం అని కొందరు భావిస్తున్నారు. మరి కొందరు పర్యావరణవేత్తలు సామాజిక కార్యకర్తలు చిన్ననీటి వనరుల పునరుద్ధరణ, నీటిపరీవాహక ప్రాంతాల అభివృద్ధి పథకాలు (వాటర్‌షెడ్ పథకాలు) కరువుకు నిజమైన ప్రత్యామ్నాయ పరిష్కారాలని చెబుతున్నారు. ఈ రెండు వాదనలలోను వున్న ప్రజా అనుకూల అంశాలను అంగీకరించి రెండు వాదనల సమన్వయ విధానమే సరైన పరిష్కారమని మల్లారెడ్డి గారు ప్రతిపాదిస్తారు. నిర్వాసితులు, పర్యావరణ సమస్యలకు అధిక ప్రాధాన్యతనివ్వడం ద్వారా సేద్యపునీటి ప్రాజెక్టుల నిర్మాణాలద్వార ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చనే విలువైన ప్రతిపాదన మీరు ఆయన వ్యాసాల్లో గమనించగలరు.

నేడు జిల్లా కరువు పరిష్కారాల కొరకు సాధించాల్సిన హంద్రీ–నీవా. PABR కు 10TMC ల జలాలు అదనంగా తుంగభద్ర నుండి లభించాల్సిన జలాలు జిల్లాకు వచ్చే పరిస్థితులున్నాయి. జిల్లాలోని సాంప్రదాయక నీటి వనరులైన చెరువులు, కుంటలు మరియు ఇతర మీడియం ప్రాజెక్టులతో కలిపినప్పటికీ ఈ జిల్లా రాష్ట్రంలో 29%శాతం మాత్రమే సేద్యపుసౌకర్యం కల్గిన జిల్లాగా నమోదు కాబడుతున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో చేబట్టాల్సిన వివిధ పథకాల ప్రాముఖ్యత గురించి మల్లారెడ్డి గారి సూచనలు ఎంతో విలువైనవి. సహజవనరుల మరియు మానవవనరుల వినియోగం ఈ జిల్లాలో ఎలా జరగాలో ఆయన వ్యాసాల్లో మనం చూడగలం. జిల్లాలో సేద్యపు నీటి వనరులను పెంపొందించుకోవడంతో పాటు చేబట్టాల్సిన వివిధ పథకాలు ఆయన రచనల్లో మీరు చూస్తారు. అనంతపురం జిల్లా వ్యవసాయరంగంపై ఒత్తిడి తగ్గించి వ్యవసాయేతర మార్గాల ద్వారా జిల్లాలో ప్రజల జీవన సరళి మార్చుకోవాల్సిందిగా ఆయన మనకు సూచిస్తారు. ఐ.టి. రంగానికి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి జిల్లాలో అనువైన వాతావరణం ఉందనేది ఆయన వాదన. జిల్లానీటి వనరుల వలయాన్ని (grid) నిర్మించి నీటిసమతుల్యతని సాధించాలని మల్లారెడ్డి చేసిన సూచన విలువైనది. జిల్లాలోని భౌగోళిక పరిస్థితులపై అధ్యయనంచేసి నేటికి జిల్లాలో అందుబాటులో వున్న మీడియం మరియు మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలోవున్న చెరువులు, కుంటలకు కృష్ణ–తుంగభద్ర నదుల నుండి నీటిని మళ్లించి వినియోగించవచ్చు అని మల్లారెడ్డి చేసిన విలువైన అంశాలను మీరు అతని వ్యాసాల్లో చూడవచ్చు.

అనంతపురం జిల్లాకు ఇటీవల కాలంలో కుప్పతెప్పలుగా నిధుల వరద ప్రాప్తించింది. అనేక ఉపాధిహామీపథకాలు వచ్చాయి. పనిచేసే నిజాయితీ అధికారులకు అండగా మంచి వాతావరణం, అభివృద్ధి కార్యక్రమాలలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో ఆశాజనకమైన వాతావరణం

కల్పించవచ్చు. ఆవైపుగా జిల్లాలోని ప్రజలు, ప్రజాతంత్రవాదులు, వివిధ రాజకీయ పార్టీలు కృషిచేయాలి.

కదలిక తన 23సం॥రాల చరిత్రలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. అలాగే రాయలసీమకు ప్రత్యేకంగా అనంతపురం జిల్లాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలలో తనదైన పాత్రను నిర్వహించింది. మల్లారెడ్డి గారి అనంత ప్రస్థానాన్ని పుస్తకరూపంలో ప్రచురిస్తున్న సందర్భంగా సంతోష పడుతున్నది. ఈ పుస్తకంలోని విలువైన వ్యాసాలు సమాచారం జిల్లా అభివృద్ధిని కోరుకునే వారికి ఏమాత్రం ఉపయోగపడినా మేము పుస్తకం ప్రచురించడంలో పడిన శ్రమనంతా మర్చిపోగలం.

26-3-07 **-ఇమామ్**

# బాధ్యతాయుత ప్రజానీకమే ప్రభుత్వాలను బాధ్యతాయుతం చేయగలదు

'యథారాజా తథా ప్రజా' అనేది రాజుల కాలం నాటి నానుడి. ఆ రోజులలో రాజులను నిర్ణయించేందుకుగానీ, నియంత్రించేందుకుగానీ, ప్రభావితం చేసేందుకుగానీ ప్రజలకు అవకాశాలు లేవు. రాజు మంచివాడైతే ఆ ప్రజల అదృష్టం. చెడ్డవాడైతే ప్రజల దురదృష్టం.

'యథాప్రజా తథా ప్రభుత్వం' అనేది ప్రజాస్వామ్య సారాంశం. ప్రజలందరి అవసరాలు, అభీష్టాలు నెరవేర్చుట ద్వారా సమాజ శ్రేయస్సుకు నిరంతరం పాటుపడటం ప్రజా ప్రభుత్వాల కర్తవ్యం. అంటే ప్రజాస్వామ్య ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారులుగా విధులు నిర్వహించవలసి వుంటుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే, ప్రజాస్వామ్య ప్రభుత్వాలను బాధ్యతాయుతంగా నడిపించాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజల మీదనే వుంటుంది. కాబట్టి, బాధ్యతాయుత ప్రజా సమాజమే ప్రజాస్వామ్య ప్రభుత్వాలను బాధ్యతాయుతం చేయగలదు. ప్రభుత్వాల పనితీరులో జవాబుదారీతనం తీసుకొని రాగలదు.

ఎన్నికలొచ్చినప్పుడు ఓట్లు వేసి, ఏదో ఒక పార్టీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించి, ప్రజలుగా తమ బాధ్యత నెరవేర్చినట్లుగా భావించి, ఇక తమ బాగోగులు ప్రభుత్వం చూసుకుంటుందని, తమ ఆశలు నెరవేరుస్తుందని ఎదురు చూడడం ప్రజలకు పరిపాటి అయిపోయింది. కానీ, ఎన్ని తరాలు మారినా, ప్రభుత్వాలు మారినా, వాటి పూర్తి బాధ్యత అవి నెరవేర్చడం లేదు. ప్రజలు కూడా ప్రేక్షక పాత్ర వహించడం మినహా ప్రభుత్వాలను బాధ్యతాయుతం చేయడానికి పూనుకోవడం లేదు. మరి ప్రజా సమాజం అలా పూనుకోకుండానే, రాజకీయ పార్టీలలోనూ, ప్రభుత్వాలలోనూ, హృదయ పరివర్తన చెంది ప్రజా సమస్యలపై బాధ్యతగా స్పందిస్తారని భావించడం ప్రజల బాధ్యతా రాహిత్యమే అవుతుంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వంతో తమ అభివృద్ధి కార్యక్రమాలు చేయించుకోవడం ప్రజల బాధ్యత. సమాజంలో వివిధ ప్రజాస్వామ్య, అభ్యుదయ, సామాజిక స్పృహ కల్గిన పౌర సంఘాలు, వ్యక్తులు, మేధావులు, నిపుణులు, సాధారణ ప్రజలను బాధ్యతాయుతం చేస్తూ, తద్వారా సాధారణ ప్రజలు ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ పాలకులను, ప్రభుత్వాలను జవాబుదారుగా చేసే పరిస్థితి ప్రజలే తీసుకురావాలి. ఎందుకంటే మనది ప్రజాస్వామ్యం కనుక. పాలకులకు, ప్రభుత్వాలకు, బాధ్యతారహితంగా ప్రవర్తించే అవకాశమే ప్రజలు కల్గించకూడదు. ఇది ప్రజల బాధ్యత, ప్రజల హక్కు. ఆ విధంగా ప్రజలు బాధ్యత వహించకపోవడమే ప్రభుత్వ, పాలక వర్గాల బాధ్యతారాహిత్యానికి పునాది. అంటే బాధ్యతాయుత ప్రజానీకమే బాధ్యతాయుత పాలకులకూ, ప్రభుత్వాలకూ పునాది.

"అనంత ప్రస్థానం" లాంటి పుస్తకాలు వ్రాయవలసి రావడం, తరతరాలు గడిచినా అనంత జిల్లాలోని కరువు, దారిద్ర్యం, నిరక్షరాస్యత, అనారోగ్యం, అంటరానితనం, కులవివక్ష, హింస, అవినీతి లాంటి సమస్యలపై ఇంకా చర్చించవలసి రావడం దురదృష్టం కాదా? చెప్పిన సమస్యలనే పరిపరివిధాలుగా, తరతరాలుగా చెప్పుకుంటూ పోవలసి రావడం, కనుచూపుమేరలో శాశ్వత పరిష్కార మార్గాలు కనపడకపోవడం, పాలకులలోనూ, ప్రభుత్వాలలోనూ తగినంత బాధ్యత కనపడకపోవడానికి గల కారణాలకు ఏ విధంగా సమాధానం చెప్పుకోగలం? ప్రజలు మేల్కొనాలి. ప్రేక్షకపాత్ర విడనాడాలి. బాధ్యత వహించాలి. చైతన్యవంతులు కావాలి. పౌరులుగా తమ విధులు నిర్వర్తించాలి. పాలకులలోనూ, ప్రభుత్వాలలోనూ జవాబుదారీతనం తీసుకురావాలి. అందులో పౌర సంస్థలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు, సామాజిక కార్యకర్తలు చురుకైన పాత్ర వహించి ప్రజలను మేల్కొలిపి, చైతన్యం చేయాలి. ప్రభుత్వాలను ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు నిలదీసే బాధ్యత, శక్తి సామర్థ్యాలు ప్రజలకు రావాలి.

అనంతపురం జిల్లాలో ఒకప్పుడు అభివృద్ధి పనులు, కరువు నివారణా చర్యలు చేపట్టడానికి నిధుల లేమి కారణమనిపించేది. కానీ, నిధులుంటే అభివృద్ధి సాధ్యం అనే భావం సరైనది కాదనేది తేలిపోయింది. అనంతపురం జిల్లాలో రైతులు, కూలీలు, బలహీన వర్గాల సాంఘిక, ఆర్థిక, సర్వతోముఖాభివృద్ధి కోసం ఒక సమగ్ర, దీర్ఘకాల ప్రణాళిక అవసరం. అటువంటి ప్రణాళిక రూపకల్పనలోనూ, అమలు చేయడంలోనూ నిపుణులు, మేధావులు, ప్రభుత్వ, పాలక, ప్రతిపక్షాలు, వివిధ సామాజిక వర్గాలు, పౌర సంస్థలు ముఖ్యంగా సంబంధిత ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి కావాలి. అటువంటి ప్రణాళిక అమలు కోసం, నిధులతోపాటు, ఆ నిధులను సరైన దిశలో వెచ్చించే సమర్థ అధికార యంత్రాంగం కావాలి. ఆ అధికార యంత్రాంగానికి మద్దతుగా ప్రజలు, పౌర సంస్థలు, రాజకీయ నాయకత్వం తోడవ్వాలి. అధికారులు లేక ఇతర బలమైన వర్గాల ఇష్టాయిష్టాలకు, అలసత్వాలకు జిల్లా అభివృద్ధి మరియు ప్రజాప్రయోజనాలు బలికాకూడదు. జిల్లా అభివృద్ధి దశా, దిశా నిర్దేశనంలో పౌర సమాజం, మరియు సంబంధిత ప్రజల భాగస్వామ్యంతో అన్ని రంగాలలోనూ అభివృద్ధి పనులు, శాశ్వత కరవు నివారణా చర్యలు అమలు కావాలి.

### రైతు సంక్షేమమా? లేక వ్యవసాయాభివృద్ధా?

అమెరికా, ఇంగ్లాండు, జర్మనీ లాంటి దేశాలలో రైతులను ఇతర రంగాలకు విజయవంతంగా మళ్ళించి, వ్యవసాయాన్ని యాంత్రికం చేసి రక్షించుకొన్నారు. ఇప్పుడు ఆ దేశాలలో నూటికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి బ్రతకగలుగుతున్నారు. ఒక్కొక్క రైతుకు 5 వేల నుండి 10 వేల ఎకరాలు భూమి వుండి, ఖరీదైన యంత్రాంగంతో, అత్యధిక ప్రభుత్వ సబ్సిడీలతో వ్యవసాయం జరుగుచున్నది. మనదేశంలో ప్రస్తుతం నూటికి 75 మంది దాకా ప్రజలు వ్యవసాయంపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. అమెరికా, ఇంగ్లాండు దేశాల వ్యవసాయ పద్ధతులను గుడ్డిగా పాటించితే ఒకవేళ వ్యవసాయం అభివృద్ధి కావచ్చునేమోగానీ, మన రైతులు, రైతు కూలీలు, ఇతర గ్రామీణ వృత్తుల వారు మాత్రం తప్పక మరణించవలసి వుంటుంది. ఎందుకంటే వారికేమాత్రం ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు లేవు. కాబట్టి ఆ దేశాల వ్యవసాయ పద్ధతులను అనుకరించడం మనకు ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది. వ్యవసాయంతోపాటు రైతులను, కూలీలను, గ్రామీణులను

ఎలా బ్రతికించుకోవాలి అనే దిశలో మనం ఆలోచించాలి. మనదేశంలోవున్న చిన్న కమతాలు, తక్కువ భూమిగల చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయంపై ఆధారపడి బ్రతకగల్గిన పరిస్థితులను, వ్యవసాయ విధానాలను, రక్షణలను కల్పించవలెను. సహకార వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించవలెను. వ్యవసాయం మరియు ఇతర రంగాలలో అభివృద్ధి ప్రక్రియలోనూ, అభివృద్ధి ఫలాలలోనూ గ్రామీణులకు ఏ విధంగా పాలుపంచాలో ఆలోచించాలి. అభివృద్ధికి గీటురాయి ప్రజల శ్రేయస్సు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు. కాబట్టి, వ్యవసాయ రంగం అభివృద్ధికిగానీ, పారిశ్రామిక, వ్యాపార రంగాల అభివృద్ధికిగానీ లక్ష్యం ప్రజల శ్రేయస్సే. ప్రజలను నిర్వాసితులను చేసేది అభివృద్ధేకాదు. ఒకవేళ అభివృద్ధి పేరుతో ఎవరైనా ప్రజలు నిర్వాసితులు కావలసి వస్తుందంటే ఆ అభివృద్ధి ఫలాలను మొదట నిర్వాసితులకు అందేలా, వారి జీవన ప్రమాణాలు శాశ్వతంగా బాగుపడేలా పునరావాస చర్యలుండాలి. అవి సత్వరమే అమలు జరగాలి.

అనంతపురం జిల్లాలో అభివృద్ధి అంటే ప్రధానంగా తీర్చాల్సింది నీటి సమస్య.జిల్లాలోని సహజవనరులకు తోడు జిల్లాలోని భూగర్భ జలవనరులను, వర్షాధారమైన నీటిని, **(Conjunctive Use of Water)** తుంగభద్ర, హంద్రీనీవాల ద్వారా జిల్లాకు తీసుకొచ్చే నీటితో అనుసంధానించి జిల్లా వ్యాప్తంగా ఒక "నీటి వలయాన్ని" ఏర్పరచాలి. తద్వారా నీటి పంపిణీలో ప్రాంతీయ సమతౌల్యం సాధించాలి. నీటి వినియోగంలో సాంఘిక సమతౌల్యం తీసుకొనిరావాలి. ఈ అంశం సాధ్యాసాధ్యాలపై విస్తృత చర్చ జరగాలి. నీటి వలయంలో లభ్యమైన నీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించాలి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పాడిపరిశ్రమ, మాంసోత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానంతో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ల ద్వారా పండ్ల తోటలను అభివృద్ధి పరచి, వ్యవసాయ పరిశ్రమలను స్థాపించి, రైతులకు తగిన గిట్టుబాటు ధర, తగిన సౌకర్యాలు, వ్యవసాయానికి, పారిశ్రామీకరణకు, ఉద్యోగ అవకాశాల కల్పనకు అనువైన వాతావరణం జిల్లాలో ఏర్పాటు చేయాలి. అదనంగా వర్షాధార వ్యవసాయ రైతులకు పంటల భీమా, గిట్టుబాటు ధరల ద్వారా పూర్తి రక్షణ కల్పించాలి.ఇవన్నీ ఎప్పుడో దశాబ్దాల క్రితమే జరుగవలసి వుంది. కానీ జరుగలేదు. ప్రజలు మేల్కొని బాధ్యతాయుతంగా మారకపోతే ముందు కూడా ఆశించిన అభివృద్ధి జరుగక పోవచ్చు. 'ఇదే మేలు కొలుపు'. 'ఇదే సామాజిక స్పృహ కల్గినవారందరికి పిలుపు'.

**ముగింపు**

బాధ్యతాయుత ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలోనూ, తద్వారా పాలకులను, ప్రభుత్వాలనూ, బాధ్యతాయుతం చేయడంలోనూ పౌరునిగా నాపాత్ర పోషించే ప్రయత్నమే ఈ 'అనంత ప్రస్థానం'. ఈ ప్రయత్నం సముద్రంలో ఒక నీటి చుక్క మాత్రమే. గడచిన శతాబ్దంలో ఎంతోమంది 'అనంత' సమస్యలపై వారి గొంతు వినిపించారు. పోరాటాలు సాగించారు. ఇప్పుడు కూడా ఎంతోమంది పోరాడుతున్నారు, వారి గొంతులు వినిపిస్తున్నారు. ఈ విషయంలో నాకు సజీవ స్ఫూర్తి అన్న శ్రీ సింగమనేని నారాయణగారు. తర్వాత మిత్రులు శ్రీ ఇమామ్ గారు మరియు శ్రీ బాషా గారు. నాలో వ్రాతబద్ధకాన్ని తొలగించడంలో శ్రీ ఇమామ్ గారు, శ్రీ బాషా గారు కొంతవరకూ సఫలం చెందినారు. వారికి నా ధన్యవాదములు. పౌర సంస్థలు, వ్యక్తులు ఇంతవరకూ ప్రభుత్వాలతో పోరాటాలు చేయడం, ప్రభుత్వానికి గొంతు వినిపించడం జరుగుతూ వస్తున్నది. అయినా అవి ఆశించిన ఫలితాలు సాధించలేక పోయినాయి. మరి ఇప్పుడు పౌర సంస్థలు, వ్యక్తులు, పంథాను కొంతమార్చి అదనంగా, పార్టీలకతీతంగా, బాధిత ప్రజలలోకి పోవలసి

వుంది. ప్రజలను మేలుకొలిపి, వారి గొంతును పెంచి, వారిని బాధ్యతాయుత పాత్ర పోషించే వైపు నడపవలసి వుంది. ఈ ప్రస్థానంలో ప్రసార మాధ్యమాలు, అభ్యుదయ పౌర సంస్థలు, మేధావులు, నిపుణులు, సామాజిక స్పృహ కల్గిన వ్యక్తులు, ప్రముఖ పాత్ర పోషించవలసి వుంది. అలాగే పార్టీలలోనూ, ప్రభుత్వాలలోనూ వున్న స్పృహ, చిత్తశుద్ధి కల్గినవారు కూడా ప్రభుత్వాల పనితీరులో బాధ్యతను, జవాబుదారీతనాన్ని తీసుకొని రావడానికి ప్రముఖ పాత్ర పోషించవలసి వుంది.

**పాలకులను, ప్రభుత్వాలను ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు బాధ్యతగా నిలదీసి, ప్రజాపంథాలో నడిపించగల ప్రజాతంత్ర సమాజమే మన లక్ష్యం.**

ఏప్రిల్ 2007,
అనంతపురం.

**డా॥ వై.వి.మల్లారెడ్డి**
డైరెక్టరు, ఆర్.డి.టి. ఎకాలజీ
సెంటర్, అనంతపురం.

## వై.వి.మల్లారెడ్డి-కొన్ని వివరాలు

| | | |
|---|---|---|
| తల్లిదండ్రులు | - | వై.హరినారాయణరెడ్డి మరియు వై. వెంకటమ్మ |
| పుట్టిన తేది | - | 15 ఆగష్టు, 1953వ సంవత్సరం |
| పుట్టిన గ్రామం | - | నీరుకుంట్లపల్లె గ్రామం, గాండ్లపెంట మండలం |
| భార్య | - | శ్రీమతి డొరీన్ |
| సంతానం | - | వై.విక్టర్ భరత్‌రెడ్డి |
| చదువు | - | ఎం.బి.ఏ. (ఇంగ్లాండు),<br>పిహెచ్.డి., SKU, అనంతపురం. |
| ఉద్యోగం | - | డైరెక్టర్, ఆర్.డి.టి. ఎకాలజీ సెంటరు, అనంతపురం |
| ఉద్యోగ అనుభవం | - | ఆర్.డి.టి. సంస్థలో 32 సంవత్సరములు |
| ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ | - | అమెరికా ప్రభుత్వ ఆహ్వానంపై ఫుల్‌బ్రైట్ సంస్థ ఆధ్వర్యంలో ఇండో-అమెరికన్ ఎన్విరాన్‌మెంటల్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (2006వ సం॥) |

### ఇతర సంస్థలలో సభ్యత్వం

| | | |
|---|---|---|
| 1. మెంబరు | - | రైతు సంక్షేమ కమీషన్ (Commission on Farmers Welfare), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (2004వ సం॥) |
| 2. మెంబరు | - | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి సంరక్షణ మిషన్ (A.P.Water Conservation Mission) 2001 నుండి 2004 వరకు |
| 3. మెంబరు | - | ఆంధ్రప్రదేశ్ భూమి, నీరు, చెట్ల అథారిటీ (Andhra Pradesh Land, Water, Trees Authority) |
| 4. మెంబరు | - | అనంత గ్రామీణ బ్యాంకు, డైరెక్టర్ల బోర్డు (కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన డైరెక్టర్) |
| 5. మెంబరు | - | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటర్‌షెడ్ అడ్వైజరీ కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ, హైదరాబాదు. |

## ఈ పుస్తకం మీచేతిలో ఇలా రావడానికి...

## సహకరించిన...

కదలికలోని మల్లారెడ్డి గారి "ఏరిన రచనలను" ప్రచురించడంలో
నిర్ణయాత్మక పాత్రను ఎంతో ఓపికగా నిర్వహించిన
అన్న సింగమనేని నారాయణ గారికి,
శ్రీ ఎ. యస్. రెడ్డి (ముంబాయి) గారికి,
శ్రీ తరిమెల అమరనాథరెడ్డి గారికి,
ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, యం. యస్. వలీ, యన్. నరేంద్ర ,
ఆర్. కె. గ్రాఫిక్స్ రాము,
డిజైనర్ రమణజీవి,
ఫోటోగ్రాఫర్ కృపాకర్,
శ్రీ ఆనంద్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, ఆనంద్ ప్రసాద్,
చరిత ఇంప్రెషన్స్ (హైదరాబాద్) వారికి కృతజ్ఞతలు.
ఈ పుస్తక ప్రచురణ తన సొంత బాధ్యతగా
భావించి సహకరించిన
హరిమోహన్‌రెడ్డి MBA, BL.,కి,
ప్రత్యేక ధన్యవాదాలు.

-పబ్లిషర్

# అనంతపురం జిల్లాలో దుర్భిక్షం - దారిద్ర్యం ఒక కార్యాచరణ సాదృశ్యం

## 1. అనంతపురం జిల్లా పర్యావరణం :

### 1.1. సహజ, వ్యవసాయ, వాతావరణ పరిస్థితులు

రాజస్థాన్‌లోని జైసల్మేర్ తర్వాత రెండవ తీవ్ర దుర్భిక్షానికి గురవుతున్న ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా. కొన్ని శతాబ్దాలుగా ఈ జిల్లా కరువు కాటకాలకు పేరొందగా, గతకొన్ని దశాబ్దాలుగా జిల్లాలోని సహజ వనరులు (భూమి, నీరు, అడవులు తదితరములు) గణనీయంగా తరిగిపోయాయి. గతంలో అమలుపర్చిన కరువు నివారణ చర్యలన్నీ అదృశ్యం కావడమో, లేదా విచ్ఛిన్నం కావడమో జరిగాయి. కానీ మునుపటి కంటే నిరుపేద వర్గాల మీద కరువు ప్రభావం ఎక్కువ అయింది.

ప్రధానంగా అనంతపురం జిల్లా ఆర్థిక పరిస్థితి వర్షాధార వ్యవసాయంమీద ఆధారపడివుంది. కొన్ని మండలాల్లో సాగు భూమిలోని 7 శాతం భూమి మాత్రమే బావులు, చెరువులు, కాలువల ద్వారా సాగు చేయబడుతోంది. జిల్లా సగటు వర్షపాతం 522 మి.మీ. మాత్రమే, వర్షపాతం అత్యల్పమేకాదు, సకాలంలో, సరియైన మోతాదులో పడదు. నైరుతి, ఈశాన్య – రెండు పవనాల్లోనూ వర్షపాత కాలం జూన్ – అక్టోబర్ మాసాల మధ్య ఉంటుంది. సాధారణంగా ఆగస్ట్ మాసంలో వర్షపు వరపు బాగా ఉండి, కరువుకు కారణమవుతూంటుంది. దాదాపు 90 శాతానికి పైగా వర్షాధార భూములలో ఒకేపంట (పంట మార్పిడి లేకుండా) విధానంగా వేరుశనగ జూలై – నవంబరు మాసాల్లో సాగుచేస్తున్నారు. మిగిలిన దినాల్లో భూములు బీళ్ళుగా ఉంటూ వాతావరణ ఉష్ణోగ్రతకు, గాలులకు గురిచేయబడుతూ పశువుల స్వేచ్ఛగా మేయడానికి ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో అధికభాగం భూములు ఇసుక తవ్వ, ఎర్రగరక నేలలు, వీటి ఉత్పాదనా సామర్థ్యం చాలా తక్కువ.

జిల్లాలో భూగర్భ జలాల్ని బావుల ద్వారాను, గొట్టపు బావుల ద్వారానూ అధికంగా వినియోగిస్తున్నారు. దీనివలన భూగర్భ జలమట్టం బాగా తగ్గిపోయి, తాగునీటికి కూడా సంకట పరిస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయానికి, తాగునీటికి వేసే గొట్టపు బావులు భూమిలో 150 నుండి 300 అడుగుల దాకా వేయవలసి వస్తోంది. భూగర్భ జలమట్టాన్ని పెంచడంలో దోహదపడే చెరువులు, కుంటలు పూడిపోవడమో, లేదా తెగిపోయి నిరుపయోగంగా మారడమో జరిగి, వాటిలో నీటి నిలువ సామర్థ్యం కూడా బాగా పడిపోయింది.

### 1.2. దుర్భిక్షం – దారిద్ర్యానికి దారితీసే సాంఘిక, ఆర్థిక వ్యవసాయ పరిస్థితులు :-

సహజ వనరుల పరిస్థితి ఇలా ఉండగా, సాంఘిక, ఆర్థిక, వ్యవసాయ పరిస్థితులు కరువును, దారిద్ర్యాన్ని, పర్యావరణ క్షీణతను ముమ్మరం చేశాయి. ఈ క్రింద వివరించిన సాంఘిక, ఆర్థిక, వ్యవసాయ కారణాలు, కరువు దారిద్ర్య జంట సమస్యలకూ, జిల్లాలో పర్యావరణ క్షీణతకు కారణ భూతమయ్యాయి.

**1.2.1. అసమాన భూ పంపిణీ కారణంగా అధిక దారిద్ర్యం :-**

దాదాపుగా 20 శాతం మంది మధ్య తరగతి రైతులు సాగుకు లభ్యమయ్యే భూమిలో 63 శాతాన్ని అనుభవిస్తున్నారు. అదే సందర్భంలో 15 నుంచి 20 శాతం వరకూ గ్రామీణ ప్రజలు ఏ మాత్రం భూవసతి లేకుండా ఉన్నారు. మిగిలిన 50-60 శాతం జనాభా మిగిలిన 40 శాతం భూమిని అనుభవిస్తున్నారు. వీరు చిన్న, సన్నకారు రైతులు, ఈ విధమైన అసమాన భూ పంపిణీ పరిస్థితి ఉమ్మడి మేత భూముల్ని, గుట్టల్ని, అటవీ భూముల్ని ఆక్రమించుకోవడానికి దారి తీసింది. దారిద్ర్యంలో మగ్గుతున్న భూమిలేని సన్నకారు, చిన్నకారు రైతులే క్షీణించిపోయిన సహజ వనరులు, కరువు కాటకాదుల మూలంగా ప్రధానంగా బాధ పడుతున్నారు.

**1.2.2. అధిక జనాభా మూలంగా పెరుగుతున్న దారిద్ర్యం :-**

జనాభా పెరుగుదల దారిద్ర్యం పెరుగుదలకు దారితీసింది. అధిక జనాభా దారిద్ర్యాన్ని రెండింతలుగా పెంచింది. దారిద్ర్యం పెరుగుదల మూలంగా పర్యావరణం క్షీణించిపోయింది. క్షీణించిన పర్యావరణం కరువులను, దారిద్ర్యాన్ని ఉధృతం చేసింది. ఇటువంటి సమస్యల సంక్లిష్టత దారిద్ర్యం, దుర్భిక్షం జంట సమస్యల్ని అనంతపురం జిల్లాలో పెంచి శాశ్వతం చేసింది.

పేదలకు వారి మనుగడే ప్రధానమయితే భూస్వాములకు లాభార్జనే ప్రధానమయి, అసమతుల్య భూమి వినియోగ పద్ధతులకు, సహజ వనరుల, పర్యావరణ అస్థిరతకు దారి తీసింది.

**1.2.3. జీవనాధార వ్యవసాయం నుంచి వాణిజ్య పంటలకు జరిగిన మార్పు కారణంగా పెరిగిన కరువులు - అధికంగా పెరుగుతున్న నష్టం :-**

గతకొన్ని శతాబ్దాలుగా ఉన్న జీవనాధారమైన మిశ్రమ ఆహార పంటలు పండించుచున్న వ్యవసాయాన్ని, గడచిన 30 సంవత్సరాలలో ఒకేపంట విధానంగా వాణిజ్య పంట అయిన వేరుశనగ మార్చివేసింది. జీవనాధార వ్యవసాయం వల్ల స్థానిక ప్రజలు, తిండికోసం ఉపయోగించే వివిధ ఆహార ధాన్యాలను, మిశ్రమ వ్యవసాయంగా పండించేవారు. జీవనాధార వ్యవసాయంలో సజ్జ, జొన్న, కంది, అలసంద, నువ్వులు లాంటి పంటల్ని ఆరోగ్యకరమైన పద్ధతుల్లో మిశ్రమ పంటలుగా పండించేవారు. అయితే ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలను తీర్చడానికి ఏక పంట వ్యవసాయంగా వేరుశనగ పంటను పండిస్తున్నారు. దొరికే ప్రతి అంగుళం స్థలంలోనూ వేరుశనగను పండించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మార్పు కారణంగానే ఉత్పత్తి విధానంలోనూ, ఆహారపు అలవాట్లలోనూ, ప్రజల మనో భావాలలోనూ విపరీతమైన మార్పువచ్చింది. ఈ మార్పు కారణంగానే పంటలలో అధిక పెట్టుబడులకు, పశుసంతతి, పచ్చిక బయళ్ళు, అడవులు తగ్గిపోయే పరిస్థితికి దారితీసింది. ఫలితంగా పశువుల్ని వృత్తిగా పెంచుకునే వారు, చిన్న, సన్నకారు రైతులు పశుపోషణ వదిలి వ్యవసాయ కూలీలుగా మారడమో లేదా వలస పోవడమో తప్పని సరి అయింది.

**1.2.4. స్త్రీ, పురుష, వివక్ష - కరువు, దారిద్ర్యాలకు అధికంగా బలయ్యే మహిళలు, పిల్లలు :-**

పైన పేర్కొన్న సాంఘిక, ఆర్థిక, వ్యవసాయ పరిస్థితుల ఫలితంగా, స్త్రీ పురుషుల మధ్య వివక్షతలు మరింతగా పెరగడం, కుటుంబ సంబంధాలు, సామాజికంగా సంబంధ నిర్మాణాలు విచ్ఛిన్నం కావడం జరుగుతున్నాయి. దారిద్ర్యంలో మగ్గుతున్న మహిళల మీద అధికంగా పని ఒత్తిడి, పని భారం పెరుగుతూనే ఉంది. సాంప్రదాయకంగా వంటచెరుకు సమకూర్చడం, నీరు తెచ్చుకోవడం, ఆహారం తయారీ, పిల్లల పెంపకం లాంటి బాధ్యతల్ని స్త్రీలకే కట్టబెట్టారు. పర్యావరణ పరిస్థితుల క్షీణతవల్ల ఉత్పన్నమయిన వంటచెరుకు కరువు, నీటి కరువు, తిండి కరువుల కారణంగా మహిళల మీద అధికంగా

ఒత్తిడి, పనిభారం పెరుగుతూ ఉంది. ఒకవైపు పిల్లల్ని కని, పెంపక బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే, పురుషుతో సమానంగా, వ్యవసాయ క్షేత్రాలలో దినకూలీలుగా కూడా పనిచేయవలసి వస్తోంది. ఈ రకమైన అధిక ఒత్తిడి, అధిక శ్రమల మూలంగా కుటుంబ బాంధవ్యాలు క్షీణించడం, మహిళలకు మరిన్ని ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం, సరి అయిన ఆలనా, పాలనా లేక పిల్లల ఆరోగ్యాలు దెబ్బతినడం జరుగుతోంది.

## 2. సహజ వనరుల పరిస్థితి – ఉత్పాదన క్షీణత :-

పర్యావరణానికి ప్రధానాంగాలయిన నేలలు, భూగర్భ జలాలు, భూమ్మీద పచ్చదనాన్ని పశుసంతతి, ప్రజలు వాటి వినియోగ దారులుగానూ, సంరక్షించ వలసిన వారుగానూ – వీటి మధ్య అనుబంధ బాంధ్యవం – పర్యావరణం దెబ్బతినే విధానాన్ని పరిశీలిద్దాం.

ఈ ప్రాంతంలో సాగుకొరకు భూమ్మీద పెరుగుతున్న ఒత్తిడి మూలంగా పచ్చదనం, అటవీ ప్రాంతం, పచ్చిక నేలలు తరిగిపోయినాయి. ఎప్పుడయితే పచ్చదనం, అటవీ ప్రాంతం, పచ్చిక నేలలు తరిగిపోయినాయో, వాటి ఫలితంగా తీవ్రమయిన నేలకోత జరిగి భూసారం దిగజారిపోయింది. దిగజారిపోయిన పచ్చదనం, పచ్చిక దొరకకపోవడంతో పశుసంతతి తగ్గిపోవడానికి కారణ భూతమయింది. పశు సంతతి, పచ్చదనం తరిగిపోవడంతో నేలలో సేంద్రీయ పదార్థం లభ్యత దిగజారిపోయింది.

గత 100 సంవత్సరాలుగా, ఈ ప్రాంతంలో కురిసే సగటు వర్షపాతం దాదాపు ఒకవిధంగా ఉన్నా, గత కొన్ని దశాబ్దాలుగా ఒకక్రమ పద్ధతి లేకుండా కురుస్తోంది. సమతుల్యమైన, స్థిరమైన వాతావరణం కొరకు మొత్తం భూభాగంలో కనీసం 30 శాతం అడవులుండాలని పర్యావరణ నిపుణులు సలహాలిస్తున్నారు. ఈ ప్రాంతంలో అటవీ ప్రాంతం దాదాపు ఏమీ లేదని చెప్పాలి. అటవీ ప్రాంతం, భూమ్మీద పచ్చదనం లేకపోవడంతో గట్టిపడిన భూములు (నేలకోత జరిగి గరుసు తేలిన భూములు) మీద కురిసిన వర్షాన్ని నేల సంగ్రహించలేకపోతోంది. దిగజారిన భూముల మీద వర్షం కురిసినపుడు, మామూలు కంటే వేగంగా వర్షపునీరు పరిగెత్తుతుంది. మరింత భూమి కోత సంభవిస్తుంది. భూమ్మీద పచ్చదనం లేకపోవడం మూలానా గట్టిపడిన భూములకు తేమను నిలువ ఉంచుకునే శక్తి తగ్గిపోతుంది. మనం భూమి ఉపయోగపద్ధతుల్ని గనుక పరిశీలిస్తే, పంట భూములు విస్తీర్ణత పెరిగి, అటవీ ప్రాంతం తరిగిపోయింది. పచ్చిక బయళ్ళు, పశుసంతతి కూడా తగ్గిపోయింది. నీరు ఇంకే పరిస్థితి, తేమను నిలువ ఉంచే అవకాశాలు కూడా సన్నగిల్లాయి. ఉండాల్సిన పచ్చదనాన్ని, వర్షపునీరు ఇంకడాన్ని, పశుసంపదను, భూ సంరక్షణను నిర్లక్ష్యంచేసి, విచక్షణా రహితంగా భూమిని ఉపయోగించిన పద్ధతుల వల్ల ఉత్పన్నమయిన పరిస్థితి ఇది. ఈ ప్రాంతంలో పర్యావరణ పరిస్థితి మూలంగా కరువులను, దారిద్ర్యాన్ని అధికం చేస్తున్నది. శాస్త్రజ్ఞులు ఎడారీకరణ మొదలయిందని మనల్ని హెచ్చరించారు కూడా.

## 3. కరువులు, దారిద్ర్యాన్ని అరికట్టే కార్యాచరణ దిశగా..

### 3.1. అనంతపురం జిల్లా ఒక అభివృద్ధి యూనిట్‌గా :-

అభివృద్ధి కార్యాచరణ మొత్తం జిల్లానే, ఒకయూనిట్‌గా పరిగణించాల్సి ఉంది. జిల్లా అభివృద్ధి ప్రణాళికల్లో ఇక్కడవున్న సహజవనరులు, మానవ వనరులను పరిగణలోనికి తీసుకోవాల్సి వుంది. ఉన్నటువంటి సహజ వనరుల్లోనే, వినియోగానికి లభ్యమయ్యే వనరులను మదింపుచేయాల్సి వుంది. ఈ సహజ వనరుల్లో, నిజంగా ఉన్నటువంటి అటవీ ప్రాంతం, క్షీణించి పోయిన అటవీ ప్రాంతం, ఏ పచ్చదనం లేని బోడికొండలు, పచ్చిక బయళ్ళు, వాగులు, నీటి వనరులు, వర్షాధార భూములు, నీటి పారుదల వసతిగల భూములు మొదలగునవి పరిగణలోకి తీసుకొని, అదే విధంగా జిల్లాలో ఉన్న

మానవ వనరులు, వారి ఉద్యోగస్థాయి, విద్యాస్థాయి, వృత్తి సంబంధిత స్థాయిలను మదింపు వేయడమే కాకుండా వాటి వర్గీకరణ చేయాల్సివుంది.

అభివృద్ధి ప్రణాళికకు జిల్లా మొత్తాన్ని ఒక యూనిట్‌గా పరిగణించినా వర్షపాతం నేలల రకాలు, నీటి పారుదల వసతులు, పచ్చదనపు స్థాయి అధారంగా జిల్లాను వివిధ, వ్యవసాయ వాతావరణ ప్రాంతాలుగా (Agro - Climatic Zones) విభజించాల్సి వుంటుంది. దీనివలన జిల్లాలో భిన్న వ్యవసాయ వాతావరణ పరిస్థితులను గుర్తించగలం. దీని వలన ప్రతి వ్యవసాయ వాతావరణ ప్రాంతాన్ని, అవసరమైన ప్రణాళికలతో అభివృద్ధి పరచడానికి వీలు కలుగుతుంది.

**3.2. ప్రత్యామ్నాయ భూ వినియోగ పద్ధతులు – జీవనాధార వ్యవసాయ ప్రణాళిక :-**

జిల్లా కొరకు సమతుల్య, ప్రత్యామ్నాయ పద్ధతులు, వినియోగ పద్ధతుల ప్రణాళికను అభివృద్ధి చేయడం చాలా అవసరం. అది అవసరమైనంతగా భిన్నత్వం కలిగినదిగానూ, దీర్ఘకాలికంగా మనగలిగిందిగానూ ఉండాలి. అనంతపురంలాంటి కరువు జిల్లాలో ఆచరించాల్సిన భూ వినియోగ పద్ధతులు అడ్డంగా సరిహద్దు గట్లు, మొక్కల ద్వారా వాలు నిరోధకాలు పొలంలో దొరికే రాళ్ళతో వాగుల కడ్డంగా కట్టడాలు నిర్మించడం చేపట్టవచ్చు. అనంతపురం జిల్లాలో రైతులు వారి అనుభవ జ్ఞానంతో ఆలోచనాత్మకపు నమూనాల్ని రూపొందించడమే కాకుండా, మట్టి, తేమ నిలువకు చేపట్టిన చర్యల్లో, వారు కొంత ఖర్చును కూడా భరించినట్లు, వారి అభీష్టం మేరకు రూపొందించిన నిర్మాణాలను జాగ్రత్త పరచుకున్నట్లుగా కూడా మన జిల్లాలో కావలసినన్ని ఉదాహరణలు మనముందున్నాయి. కానీ ఈ మొత్తం ఖర్చును రైతులే భరించే స్థితిలో ప్రస్తుతం లేరు.

అటవీ ప్రాంతాలు, క్షీణించి పోయిన అటవీ ప్రాంతాలు, బోడికొండ గుట్టలు, మేత భూముల్లో కూడా మట్టి, తేమ నిలువకొరకు భూసార సంరక్షణ చర్యలు చేపట్టడం అత్యంత అవశ్యకం. నేలకోతను అరికట్టడానికి పచ్చదనం పెంచడం ఒక మార్గమైనా, క్షీణించిన ప్రాంతాలలో మళ్ళింపు కాలువలు అడ్డంగా గోతులు తవ్వడంలాంటి చర్యలు కూడా చాలా కీలకమైనవి. వ్యవసాయ భూములలోనూ. వ్యవసాయ యోగ్యంకాని భూములలోనూ,బోడికొండలలోనూ భూసార సంరక్షణకు ఎట్టిపద్ధతులు అవలంబించాలన్నది రైతులకు బాగా తెలుసు.

**4.2. పడిన వర్షపు నీటిని విస్తారంగా ఒడుపుకోవడం : –**

అనంతపురం జిల్లాలో వర్షపాతం తక్కువయినా ఉధృతంగా తక్కువ వ్యవధిలో ఉధృత వర్షం కురిసే అవకాశం ఎక్కువ. ఈ విధంగా ఉధృతంగా వర్షం కురవడం వల్ల వేగంగా నీరు పారుతుంది. అందువలన భూసారం కొట్టుకుపోయిన నేలలమీద, క్షీణించిపోయిన అడవులు, కొండలమీద కురిసిన వర్షం నేలలోకి ఇంకే అవకాశం చాలా తక్కువ. పడిన వర్షపు నీరు నిలువ ఉండే విధానాన్ని రూపొందించినపుడు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అనంతపురం లాంటి అతి ఉష్ణమండలాలలో సమానంగా వర్షపు నీటి సేకరణ, నేలలోకి ఇంకే విధానం చాలా అవసరం. అంటే దగ్గర దగ్గరగా, వీలైనంత ఎక్కువ సంఖ్యలో, చిన్న చిన్న చెక్ డ్యాములు, రాతి చప్పిడులు, మట్టి ఆనకట్టలు విస్తారంగా కట్టుకొనాలి.

ప్రతి సంవత్సరం కురిసే 520 మి.మీ తక్కువ వర్షపాతాన్ని అనంతపురం జిల్లా ఉష్ణ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని, వర్షంకురిసే చోటనే వర్షపు నీటిని నిలువ ఉంచడం అత్యంత ఆవశ్యకం. ప్రాధాన్యతా క్రమంలో జిల్లా వ్యాప్తంగా మైక్రో వాటర్ షెడ్ల ఆధారంగా ఈ క్రింది చర్యలు చేపట్టడం చాలా అవసరం.

**4.2.1. మట్టి, తేమను నిలువ ఉంచడానికి, పైన వివరించినట్లుగా ముందుగా, వ్యవసాయ, వ్యవసాయేతర భూములలో భూసంరక్షణ చర్యలు చేపట్టడం, వర్షపు నీటి సేకరణకు చాలా అవసరం. ఇందులో వెజిటేటివ్, యాంత్రిక, కాంటూరు వ్యవసాయంలాంటి చర్యలు ఇమిడి ఉన్నాయి.**

**4.2.2. చెక్ డ్యాములు, ఊట చెరువులు, మట్టి, తేమ రక్షణ చర్యలు : -**

వాలులకడ్డంగా చిన్న చిన్న కట్టడాల నిర్మాణం చేపడితే ఎక్కువయి పొర్లిన నీరు మాత్రమే కాలువల ద్వారా ప్రవహిస్తుంది. ఈ కాలువలన్నింటి మీద వరుసగా చెక్ డ్యాముల నిర్మాణం, చిన్న ఊట చెరువుల నిర్మాణాలు చేపట్టాలి. ఈ రకమైన నిర్మాణాత్మక చర్యల వలన వాగుల వెంబడి ఉన్న ప్రాంతాలలో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. విస్తారంగా తేమ భూగర్భ నీటి పంపిణీ కూడా ఉంటుంది, దీనివలన తగ్గు ప్రాంతాలలో ఉన్న భూములే కాక ఎత్తుప్రాంతాలలో వున్న భూములలో కూడా తేమ, భూసారం నిల్వ వుంటుంది. వాటి ఉత్పాదక శక్తి పెరుగుతుంది.

**4.2.3. చిన్న చిన్న నదులు, వంకల మీద మధ్యతరహా చెరువులు :-**

జిల్లాలో బుక్కపట్నం, కంబదూరు, ధర్మవరం, శింగనమల, పరిగి మొదలగు ప్రాంతాలలో ఇప్పటికే మధ్య తరహా చెరువులున్నాయి. చాలా సంఖ్యలో చిన్న చెరువులు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. వీటిల్లో చాలా భాగం చెరువుల్లో పూడు పెరిగిపోయింది. దీనితో వాటి నీటి నిలువ సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని తెగిపోయి నిరుపయోగంగా కూడా వున్నాయి. వీటిలో పూడికలు తీయించాలి, మరమ్మత్తులు చేయించాలి.

తరువాత ఈ జిల్లాలో పాపాఘ్ని, మద్దిలేరు లాంటి చిన్న చిన్న నదులున్నాయి. వీటి మీద సాధ్యమైనంత మేరకు మధ్యతరహా నీటి ప్రాజెక్టులు కట్టాలి. ఈ ప్రాజెక్టుల ద్వారా లభ్యమయ్యే ఉపరితల జలాల్ని, నీటి పారుదల వ్యవసాయం కోసం మరియు బాగా తగ్గిన భూ గర్భజల మట్టం పెంచడానికి ఉపయోగించాలి. ఈ మధ్య చిన్న చిన్న నీటిపారుదల చెరువులను ఊట చెరువులుగా మార్చే పద్ధతి ఎక్కువయింది. ఈ ప్రాంతపు రైతుల అనుభవాల ప్రకారం, ఒకసారి చెరువు నిండుగా నీరువస్తే, దిగువ భాగాన ఉన్న బావుల్లో దాదాపు 2-3 సంవత్సరాలు నీటి కొరత లేకుండా ఉంటుంది. అదే నీటిని నేరుగా పంటలకు పారించినపుడు ఒకపంట మాత్రమే రావచ్చు, రాకపోవచ్చు. కొన్ని సంవత్సరాలలో చెరువులు సగం మాత్రమే నిండినపుడు రైతులు సాహసించి పంటలు వేసి, తరువాత వర్షాల మీద ఆధారపడేవారు. అయితే వర్షాలు గనుక తరువాత రాకపోతే నీరు నష్టమయ్యేది. పంటలూ నష్టమయ్యేవి. కాబట్టి చిన్న నీటి చెరువుల్ని ఊట చెరువులుగా మార్చుడం వల్ల భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి ఉపయోగపడ్తాయి.

**4.2.4. భూగర్భ జలాల నిలుపుదల, నీటి పారుదల సౌకర్యం పెంచడం, నదులలో భూగర్భ జలాల్ని నిలువ చేయడం.**

చాలా మంది భూగర్భ నీటి శాస్త్రజ్ఞులు చెప్పేప్రకారం, పరివాహక ప్రాంతంలోని భూగర్భ జలం, నదులలోని ఇసుకపొరల ద్వారా ప్రవహించి, సముద్ర మట్టము చేరుతున్నది. ఈ విధంగా నదీ ప్రాంతములోని భూగర్భ జలం వృధా అవుతున్నది. ఈ ప్రక్రియ ముఖ్యంగా ఎండాకాలంలో, నదుల ఉపరితల ప్రవాహాలు లేనప్పుడు జరుగుతుంది. ఈ విధంగా నీరు వృధా కాకుండా నదుల మీద సబ్-సర్ఫేస్ ఆనకట్టలను ఇసుక ఉన్నంత లోతు వరకూ వరుసగా అనువైన ప్రదేశాలలో కట్టాలి. ఈ సబ్-సర్ఫేస్ ఆనకట్టలు కట్టుటకు సిమెంట్, రాళ్ళు అవసరం లేకుండానే, నల్లమట్టి పొరలతో మాత్రమే కట్టి, నీటిని నదీ ఇసుక ప్రాంతమంతా నిల్పుకొని, ఫిల్టరు పాయింట్ల ద్వారా వ్యవసాయమునకు ఉపయోగించుకొన వచ్చును. ఈ పద్ధతిలో పెన్నా, చిత్రావతి నదుల వెంబడి ఉన్న గ్రామాలకు సాగునీరు ఎక్కువ చేయవచ్చును.

**4.2.5. సహజ ఉత్పాదన వనరుల్ని పెంచడం కొరకు అటవీకరణ, పచ్చదనాన్ని అభివృద్ధి చేయడం:**

ప్రకృతి సామర్థ్యాన్ని ఒక ఫలప్రదమైన స్థాయికి పెంచడం కొరకు, జిల్లా మొత్తం భౌగోళిక విస్తీర్ణంలోని 30 శాతం భూమిలో చెట్లు పెంచడం చాలా అవసరం. రిజర్వుడు ఫారెస్టు, అన్ రిజర్వుడు ఫారెస్టు కొండగుట్టలన్నింటిలోనూ ఉపయోగకర చెట్లను పెంచడం కష్టతరమైందేమీకాదు. గ్రామీణ ప్రజలను ఇందులో ప్రధాన పాత్ర వహించేటట్లు చేసి, వారికి ఆచెట్ల మీద అవసరమైన ఫలసాయం పొందే హక్కు కల్పించటంతో ఈ ప్రయోజనాన్ని సాధించవచ్చు. ఇప్పటికే జిల్లాలో మనముందు ఇటువంటి ఉదాహరణలున్నా, ప్రజలు తమంతకు తాముగానే కొండలలో, అటవీ ప్రాంతాలలో పచ్చదనం పెంపొందిస్తూ వాటిని సంరక్షించుకుంటున్నారు. ప్రారంభంలో ఈ కార్యక్రమం అమలుకు నిధుల అవసరం రావచ్చు. కానీ భవిష్యత్తు మనుగడకు ఇది అత్యంతావశ్యకం. అటవీకరణ విధానంలో ప్రజల భవిష్యత్తు అవసరాలైన కలప, వంట చెరుకు, నార, పళ్ళు, ఆకులు, పశువుల మేత, తదితర అవసరాలు తీరేటట్లు ఉండాలి. అదే సందర్భంలో వీటి వినిమయం వల్ల అటవీ క్షీణత కూడా ఏర్పడకూడదు. తమ అవసరాల కనుగుణంగా ప్రజలు అటవీ ఉత్పత్తులను ఉపయోగిస్తూ, వాటిని సంరక్షిస్తూ తిరిగి పునరుత్పాదనకు సహకరిస్తూ ఉండాలి. అడవుల మీద ప్రజలకు నియంత్రణాధికారం, వినియోగాధికారంతో పాటు వీటి పరిరక్షణకు ఒక స్పష్టమైన బాధ్యత ఉండాలి.

**4.2.6. నేలలో బయోమాస్ సమతుల్యాన్ని స్థిరీకరించడం కొరకు సాగునేలల్లో కూడా పచ్చదనాన్ని కాపాడడం:**

భౌగోళిక విస్తీర్ణంలో ముప్పైశాతం భూమిలో చెట్లు పెంచడంతోపాటు, పర్యావరణ సమతుల్యం, వ్యవసాయ ఉత్పత్తుల స్థిరీకరణ కొరకు సాగు భూముల్లో వైవిధ్యమయిన పచ్చదనాన్ని అభివృద్ధి చేయడం కూడా అంతే అవసరం. ఈరకమైన కార్యక్రమ అమలుకు, తిరిగి రైతులకు ఫలసాయపు హక్కులిచ్చి ప్రోత్సహించాలి. పొలంగట్లమీద, వాగులు వంకల గట్ల వెంబడి, చెక్ డ్యాముల చుట్టూ, ఊట చెరువులు, నీటి పారుదల బావుల చుట్టూ, గ్రామనెత్తం భూములు చెరువు గర్భాల్లోనూ, బంజరు భూముల్లోనూ, పొలంగట్ల వెంబడి మొక్కల ద్వారా కంచె ఏర్పాటు చేసుకోవడంతో సహా, పచ్చదనాన్ని పెంచడంలో భాగంగా చెట్లు, గడ్డిపెంచాలి. ఇది పర్యావరణకు ఉపయోగకరమే కాకుండా ఆర్థికంగా రైతుకు సహాయకారిగా కూడా ఉంటుంది.

**4.2.7. పైన కనబరచిన కార్యక్రమాలన్నీ భవిష్యత్తులో ఈ జిల్లా ప్రజల మనుగడకు, దీర్ఘకాల వ్యవసాయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడానికి, స్థిరీకరించడానికి ఉపయోగపడతాయి. వీటిని తక్షణ ప్రయోజనకారి దృష్టితో కాకుండా భవిష్యత్తు సహాయకారి దృష్టితో కూడా చూడాల్సి ఉంది.**

## 5. జిల్లాలో వ్యవసాయోత్పత్తుల పెరుగుదల చర్యలు :

శాశ్వత వ్యవసాయోత్పత్తులను సాధించడానికి తగువైన భూమిఉపయోగం ఉత్పత్తి పద్ధతులను అవలంబించాల్సి వుంటుంది. దీనికి అనుగుణంగా అనంతపురం జిల్లా వ్యవసాయ వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఈ క్రింది భూమి ఉపయోగం, వ్యవసాయ ఉత్పత్తి విధానాలను అవలంబించాల్సి వుంటుంది.

### 5.1. పండ్ల తోటల వ్యవసాయం : -

అనంతపురం జిల్లా వ్యవసాయ, వాతావరణ, పరిస్థితులననుసరించి, భూమి వినియోగ పద్ధతుల్లో మార్పు తేవడానికి అనుసరించాల్సిన అత్యంత ప్రాధానమైన ఒకే ఒక అంశం పండ్ల తోటల అభివృద్ధి. జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి 30శాతం సాగు భూమిలో మామిడి, చింత చెట్లు పెంచడం కంటే మరో మార్గంలేదు. ఈ విధానం కరువుల బారిన పడుతున్న వేరు శనగ పంట

నుండి వ్యవసాయ ఉత్పత్తులను స్థిరీకరించడానికి, రైతులు కరువుల బారి నుండి తట్టుకొనే శక్తిని కలుగజేస్తుంది.

వర్షాధారంగా మామిడి చెట్లను పెంచుతున్నట్లు మన జిల్లాలోనే కావలసిన ఉదాహరణలున్నాయి. అదే విధంగా మన పక్క జిల్లాలైన చిత్తూరు, కోలారు జిల్లాల్లో కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తున్నారు. మహారాష్ట్రలో ఎక్కువకాలం తేమను నిలిపి ఉండే ప్రక్రియలతో, వర్షాధారంగా మామిడి చెట్ల పెంపకాన్ని చేపట్టిన అనుభవాలున్నాయి. చింత, రేగు (బెర్) అనంతపురం వ్యవసాయ వాతావరణ పరిస్థితులకు, పర్యావరణంగా కూడా అనుకూలమైనవి. ప్రాథమికంగా ఈచెట్ల పెరుగుదలకు, చాలా తక్కువ మోతాదులో నీటిపారుదల సౌకర్యాన్ని ఉపయోగించి కొంచెం పెద్దవైన తరువాత వర్షాధారం మీద ఆధారపడి ఉత్పత్తులను సాధించవచ్చు.

### 5.2. అటవీ వ్యవసాయం ద్వారా బోడి కొండలను, క్షీణించిన అడవులను పచ్చగా, ఉత్పత్తి కారకాలుగా అభివృద్ధి పర్చడం.

జిల్లాలో చాలా కొండలు ఒకమేరకు మట్టితో బోసిగా ఉన్నాయి. ఏ పచ్చదనం లేకుండా ఉన్న రిజర్వు ఫారెస్టులు కూడా విస్తృతంగానే ఉన్నాయి. ఇప్పటికే చాలా భాగం పేదలు ఆక్రమించుకుని వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇటువంటి భూములన్నింటినీ పేద ప్రజలతో ఏర్పాటు చేసిన సహకార సొసైటీలకు కేటాయించి, అందులో కేవలం ఫలసాయపు చెట్లు పెంచడానికి మాత్రమే అధికారమివ్వాలి. ప్రాథమికంగా వారికి ఎక్కువ మొత్తంలోనే పెట్టుబడులు అవసరం రావచ్చు. ఈ పెట్టుబడులకు కావలసిన ధనాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా కానీ, క్షామప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా గానీ, సహకార సొసైటీల ద్వారా కానీ అందజేయాలి. అవసరమైన మోతాదులో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తే, దీర్ఘకాలికంగా రెండు ప్రయోజనాలను పొందినట్లు అవుతుంది. ఒకటి ఈ ప్రాంతంలో పచ్చదనం అభివృద్ధి అవుతుంది. రెండవది దారిద్ర్య నిర్మూలనకు ఉపకరిస్తుంది. దీర్ఘకాలికంగా ఉత్పాదన నివ్వడమే కాకుండా, ఆర్థికంగా కూడా లాభసాటి అని నిస్సందేహంగా భావించవచ్చు. కాలగమనంలో చింత, వేప, నేరేడు, సీతాఫలం, సీమజాలి, ప్రాంతీయంగా పశువుల మేతకు పనికివచ్చే చెట్లను, క్షీణించి పోయిన నేలలో కూడా సులభంగా పెంచవచ్చునని, దీర్ఘకాలికంగా, ఆర్థికంగా కూడా లాభసాటి అని రుజువయ్యింది.

నూతన సహకార చట్టం ప్రకారం ప్రైవేటు సహకార సంస్థలు స్థాపించడానికి, వాటిని నిర్వహించడానికి అవసరమైన మానవ వనరులు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయి. చాలామంది చదువుకున్న దళిత, గిరిజన యువకులు, వ్యవసాయ కూలీలు చొరవతో ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేసుకొని నడపడానికి సిద్ధంగా ఉన్నారు. దీనికి తగిన సహాయం, రాజకీయ నిర్ణయం ఉండాలి.

### 5.3. పనికిరాని భూములు, పాడిపరిశ్రమ అభివృద్ధి – పశువుల మేత అధిక ోత్పత్తి పశుగణాభివృద్ధి :-

కొంతమంది చెప్పినట్లుగా పనికిరాని భూములన్నవి లేనేలేవు. ఉన్నవల్లా వృధా చేసిన భూములు మాత్రమే. జిల్లాలో చాలా చోట్ల అక్కడక్కడా ఇటువంటి భూములు విస్తారంగా ఉన్నాయి. ఒక ఉదాహరణ ఇవ్వాలంటే, బళ్ళారి రోడ్డు అనంతపురం శివార్ల నుండి కూడేరు వరకూ సాగుకు నోచుకొని కొన్నివేల ఎకరాల చౌడు భూములున్నాయి. జిల్లాలో ఇటువంటి భూఖండాలు ముఖ్యంగా వాడుకలేని చెరువుల కింద అధిక సంఖ్యలలో ఉన్నాయి. ఎక్కువభాగం ఇవి ప్రైవేటు భూములే. ఇటువంటి భూములున్న రైతులతో సహకార సొసైటీల నేర్పాటుచేసి, పశుగణాభివృద్ధిలో భాగంగా డైరీ,

గొర్రెల, మేకల పెంపక క్షేత్రాలు అభివృద్ధి చేయవచ్చు. ఇటువంటి భూముల్లో, పశువుల మేతనిచ్చే చెట్ల రకాలను, గడ్డిని పెంచవచ్చు. సాధారణంగా జిల్లాలో ఇటువంటి భూగర్భ జలాలు అధికంగా లభ్యమయ్యే అవకాశం వుంది. ఈ నీటిని పెరుగుతున్న పశువుల మేత చెట్లకు వినియోగించవచ్చు. ఇటువంటి నేలల్లో పనికిరాని భూములను ఉత్పాదనా భూములుగా మార్చే పద్ధతులు కూడా ఉన్నాయి. ఈ రకంగా పనికిరాని భూముల వినియోగ పద్ధతులు పెరగడం వలన పశుగణాభివృద్ధి పెరుగుతుంది. ఉపాధి అవకాశాలను పెంచినట్లు అవుతుంది. పాడి పరిశ్రమ, మాంస పరిశ్రమ పెరుగుతుంది.

### 5.4. ముమ్మరంగా డైరీ, పశుగణాభివృద్ధి దిశగా ఉద్యమం :-

ప్రస్తుత పాడిపశువుల పరిస్థితి గమనిస్తే, పాలఉత్పత్తిలో చాలా తక్కువ దిగుబడి ఇవ్వడమే కాకుండా, పశువులు స్వేచ్ఛగా బయలు భూములలో మేయడంవల్ల పర్యావరణానికి కూడా తీవ్ర విఘాతం కలుగుతోంది. గొర్రెలు, మేకల పెంపకంలో కూడా ఇదే పద్ధతి ఉంది. పచ్చిక బయళ్ళు అదృశ్యం కావడంతో, కొండలు ఖాళీకావడంతో ఈ పరిస్థితి ఇక ఎంతోకాలం కొనసాగలేదు. పచ్చిక మేతకు నియంత్రణ షరతులతో బంజరు భూములు, ఖాళీ కొండలను సమర్థవంతంగా వినియోగిస్తూ పాడిపరిశ్రమాభివృద్ధికి, గొర్రెలు, మేకలు, అభివృద్ధి పరచడంవైపు దృష్టి సారించడం ఎంతో అవసరం. రైతులతో ప్రైవేటు సహకార సంస్థలు ఏర్పాటు చేసి సహకార పద్ధతులతో వీటిని అభివృద్ధి చేయడం చాలా మంచిది. బంజరు భూములను, పచ్చిక బయళ్ళను, గడ్డి పెంపకానికి కేటాయిస్తూ, వారికి వాటిమీద అధికారాలను కల్పిస్తూ, అవసరమైన సహకారం అందిస్తూ, స్వేచ్ఛగా పశువులు మేపే అలవాట్లను మాన్పించాలి.

### 5.5. సాంవత్సరిక పంటలు : వర్షాధార వ్యవసాయాన్ని అభివృద్ధి పరచే అంతర పంటల సాగు, పంట మార్పిడుల విధానం :-

ఇప్పుడు జిల్లాలో వర్షాధారం కింద వేరుశనగను ఒకే పంటగా పండించడం జరుగుతోంది. ఇప్పుడున్నటువంటి పరిస్థితులను బట్టి ఆలోచిస్తే వేరుశనగ తక్కువకాలం వ్యవధి కలిగి వర్షాధారానికి తట్టుకొనేదిగా ఉంటుంది కాబట్టి దీనికి ధీటైన ప్రత్యామ్నాయ పంటలేదు. చాలా సంవత్సరాలుగా వేరుశనగ పంట విస్తీర్ణం పెరుగుతున్నా, జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు మాత్రం పెరగడంలేదు. ఒకేపంట విధానం పర్యావరణ సమతుల్యానికి విఘాతంగా ఉంటుంది. ఇందుకొరకే జిల్లాలో భూమి వినియోగ పద్ధతుల్లో మార్పుల్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏర్పడింది. గత కొన్ని సంవత్సరాలుగా వేరుశనగ పంటమీద ఖర్చుకూడా పెరిగిపోయింది. పంట అనేక తెగుళ్ళకు, శిలీంద్రపు వ్యాధులకు గురి అవుతూవుంది. క్షామ పరిస్థితులు, పంటలమీద పెరుగుతున్న ఖర్చులు, తెగుళ్ళ మూలంగా భవిష్యత్తులో వేరుశనగ పంట పరిస్థితి ఆందోళనకరంగా ఉండబోతోంది. అందుకే వేరుశనగకు ప్రత్యామ్నాయ పంటల అభివృద్ధికి దీర్ఘకాలిక పరిశోధనలు, ప్రయత్నాలు చాలా అవసరం. వేరుశనగ పంట విస్తీర్ణాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం కూడా చాలా అవసరం. వేరుశనగ పంట ఎంత విస్తీర్ణం వున్నా, వర్షాధారంలో పంటదిగుబడి సాధించడానికి, దీర్ఘకాలికంగా లాభసాటి పంటగా ఉండడానికి అంతర పంట విధానాన్ని, పంట మార్పిడి విధానాన్ని పాటించడం చాలా అవసరం.

అటువంటి సాగులో కాయగూరలు, పప్పు, ధాన్యాలను పండించుకోవడానికి అవకాశం ఉంది. మిరప, టమోటా లాంటి కాయగూరలు, కందులు, అలసంద లాంటి పప్పుధాన్యాల పంటలు అంతర పంటలుగాను, పంటల మార్పిడి విధానంలో కూడా బాగా పండే అవకాశం వుంది.

అంతేకాకుండా ఎర్రగొంగళి పురుగులాంటి చీడల నివారణకు ప్రజా సమూహంగా మానవ నియంత్రణతో నివారణ చర్యలు చేపట్టాలి. రసాయనిక మందుల ద్వారా చీడల్ని నివారించడం అసాధ్యమైపోవడమే కాకుండా పర్యావరణంగా నష్టదాయకం కూడా.

**6. భూగర్భజలాల సహేతుక వినియోగం : ఎక్కువ మందికి వినియోగావకాశాలు :-**

ప్రస్తుత భూగర్భ జలాల వినియోగము, భూమిలో ఇంకుతున్న నీటిశాతంకంటే అధికముగా ఉంది. అంతే కాకుండా వినియోగ క్రమం నానాటికీ పెరుగుతూవుంటే, భూమిలోకి ఇంకే ప్రక్రియ మాత్రం నానాటికీ తరుగుతూ ఉంది. చాలా మంది పేద రైతులకు అవకాశం లేకుండా కొద్ది మంది మాత్రమే భూగర్భ జలాల మీద పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ రెండు కారణాలను మనం జాగ్రత్తగా పరిశీలించాలి. భూగర్భ జలాలమీద రైతులకు సామూహిక నియంత్రాణాధికారం, వినియోగం, నీరు భూమిలోకి ఇంకే విధానం సమాన అవకాశాలు ఉండేటట్లుగా భూగర్భ జలాల్ని "సామాజికీకరణ" చేయాలి. మార్గదర్శక సూత్రాలు, సహేతుక వినియోగం, సమాన పంపిణీలకనుగుణంగా ఉండితీరాలి.

దీనికోసం అవసరమయ్యే పద్ధతిలో చట్టాన్ని కూడా సవరించాలి. దీని అమలు బాధ్యత మాత్రం వాడుకదార్లయిన రైతులకు మాత్రమే వుండాలి. ఈ చర్యలు చేపట్టకపోతే పర్యావరణంగా దుష్పరిణామాలు అధికం కావడమే కాకుండా దారిద్ర్య నిర్మూలన కూడా సాధ్యంకాదు.

**7. దారిద్ర్య నిర్మూలనకు వ్యవసాయం పెరుగుదలతోపాటు బీదలకు ఫలితాలలో భాగం కూడా తప్పనిసరి:**

ప్రకృతి నిర్వహణ సామర్థ్యం పెరుగుదలతోనూ, వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలతో మాత్రమే సమస్య పరిష్కారం కాదు. ఇవి ప్రజల దారిద్ర్యాన్ని కూడా పరిష్కరించేదిగా ఉండాలి. అందుకే జిల్లాలో నెలకొని వున్న దారిద్ర్యాన్ని, వెనుకబాటు తనాన్ని, దూరం చేయడానికి వ్యవసాయ ఉత్పత్తులమీద నియంత్రణ, లాభాలు, వినియోగం, సదుపాయాల కల్పనలో బీదవారికి అవకాశాలు వుండాలి.

జనాభా పరిస్థితిని అనుసరించి అవసరమైన ఉత్పత్తి పెరుగుదల లేకుండా అమలు చేసే సమాన వినియోగం దారిద్ర్యం పెరగుదలకే తోడ్పడుతుంది. ఏది ఏమైనా దారిద్ర్యంలో మగ్గుతున్న ప్రజలకు వ్యవసాయోత్పత్తుల పెరుగుదలలో వారి న్యాయపరమైన వాటా లభించాలి. అంతేకాదు, దారిద్ర్య నిర్మూలనా సమస్యను గుర్తించకుండా పర్యావరణాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి చేసే చర్యలవల్ల పర్యావరణ స్థిరీకరణ ఎప్పుడూ ప్రమాదంలోనే ఉంటుందని మనం గుర్తించాల్సి వుంటుంది. ఈ సమానత్వాన్ని సాధించడం కొరకు ఈ క్రింది చర్యలు చేపట్టడం చాలా అవసరం.

ఎ) పునర్వటవీకరణ ప్రాంతాలలో పేద బలహీన వర్గాలకు, ఫలసాయం పొందే సదుపాయాలు కల్పించడం వల్ల, వారు సహజ వనరుల పెరుగుదలకు, భవిష్యత్తులో వాటి వినియోగాన్ని పరిమితం చేయడంలోనూ తోడ్పడినట్టవుతుంది. అవసరమైన సదుపాయాలు, కావలసిన పెట్టుబడులను సమకూర్చి, వీరిని ప్రైవేటు సహకార సంస్థల ద్వారా ఆర్గనైజ్ చెయ్యాలి.

బి) బంజరు భూములను, కొండగుట్టలను, సామాజిక ఉమ్మడి భూములను పేద ప్రజలు ఏర్పాటు చేసుకున్న సహకార సొసైటీలకు పట్టాలనివ్వాలి. వారికి అవసరమైన నిధులు సమకూరుస్తూ, ఫలసాయపు హక్కులలో అవసరమైన వ్యవసాయ, అటవీ, పశుగణాభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేయాలి.

సి) హేతుబద్ధ వినియోగం కొరకు భూగర్భ జలవనరులు, సన్నకారు, చిన్నకారు రైతులకు ముఖ్యంగా చెట్ల ఆధారిత పండ్ల తోటల అభివృద్ధికి అందుబాటులో ఉండాలి.

డి) పేదలకు మత్స్య పరిశ్రమ కొరకు సహాయ సహకారాలందిస్తూ, జిల్లాలోని నీటివనరుల ప్రాంతాలలో వారికి చేపలు పట్టే హక్కు కల్పించాలి.

ఇ) ప్రస్తుతం జిల్లాలో నిరుపయోగంగా ఉన్న బంజరు భూములు, కొండగుట్టల్ని ప్రత్యేకించి పశుగణాభివృద్ధి కొరకు పేద ప్రజల్ని సహకార సొసైటీల ద్వారా ఆర్గనైజ్ చెయ్యాలి.

**8. జిల్లాలో మానవ వనరుల అభివృద్ధి ప్రణాళిక :**
**వ్యవసాయేతర ఉత్పత్తులలో పేదలకు ఉపాధి అవకాశాలు :**

ఇప్పుడు జిల్లా జనాభా 33 లక్షలు. అంటే ఆరు లక్షల కుటుంబాలున్నట్లు లెక్క. దాదాపు 90 శాతం కుటుంబాలు గ్రామాల్లో వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారు.

ఇంతటి అధిక జనాభాకు వ్యవసాయమొక్కటే పూర్తికాలపు ఉపాధిని కల్పించలేదు. కోరుకున్న స్థాయికి వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినా ఒకరకంగా 50 శాతం జనాభాకు మాత్రమే సరిపోతుంది. కాబట్టి పేదలకు వివిధ వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించటం ద్వారా వ్యవసాయంమీద ఒత్తిడి గణనీయంగా తగ్గిపోతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మానవ వనరుల మళ్ళింపు ప్రణాళికను అభివృద్ధి చేయాలి.

తరువాత జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడం కూడా అత్యంత అవశ్యకమైనది. అధిక జనాభా, దారిద్ర్యం ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉంటాయి. కనుక ఈ సమస్యల్ని ఒకేసారి తడమడం చాలా అవసరం.

వ్యవసాయేతర ఉద్యోగావకాశాల్ని కూడా, గ్రామీణ ప్రాంతాలలో అధికంగా ఉన్నటువంటి నిరుద్యోగ సమస్యను మానవ వనరుల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశీలించాల్సి వుంది. వాస్తవమేమంటే, గ్రామీణ నిరుద్యోగ జనాభా, ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు, మహిళలు, ఎక్కువ భాగం చదువు సంధ్యలు లేకుండానూ, ఏదో కొద్ది మేరకు చదువు వచ్చిన వారుగానూ ఉన్నారు. కాబట్టి వ్యవసాయేతర ఉపాధికి ఉండవలసిన నైపుణ్యస్థాయి పూర్తికాలపు ఉపాధి అయినా, పనులు లేని కాలంలో దొరికే తాత్కాలిక ఉపాధి అవకాశాలైనా, వారికి అనుగుణంగా ఉండాలి. జిల్లాలోని చదువుకున్న నిరుద్యోగులకు గల అవకాశాల్ని పరిశీలించాల్సి వుంది.

**9. ప్రస్తుతం సమస్యల పరిష్కారానికి లభిస్తున్న స్పందన ముందుచూపు, లక్ష్య సాధన దృష్టిలేకపోవడం, అమలులో చిత్తశుద్ధి లేకపోవడం, పొలిటికల్ విల్ లేకపోవడం :-**

ప్రస్తుతం అభివృద్ధి కొరకు ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థల నుండి లభిస్తున్న స్పందన ముందు చూపు, లక్ష్యసాధన లేకుండా ఉంది, పైపైపూతల నివారణా కార్యక్రమాలుగా ఉన్నది. వివిధ రకాల కార్యక్రమాలు, పథకాల అమలులో చాలా వనరులను వృధా పరుస్తున్నారు. వనరుల వృధాతోపాటు జిల్లాలో క్షామ పరిస్థితులు అలముకుంటున్న నేపథ్యంలో ఎంతో విలువైన కాలాన్ని కూడా వృధాపరుస్తున్నారు. సమావేశాల్లో, వర్క్‌షాపుల్లో "ప్రజలు భాగస్వామ్య" మనే నినాదాన్ని వాగాడంబరంగా వల్లించినా, వాస్తవంలో అమలు పర్చడంలేదు. కాగితాల్లో కంట్రాక్టర్లను లేకుండా చేసినట్లు రాసుకున్నా, వాస్తవంలో మాత్రం ప్రభుత్వ శాసనాధికార్ల ద్వారానే "పథకాల అమలు" గావిస్తున్నారు. అభివృద్ధి పథకాల అమలులో రాజకీయ నాయకుల జోక్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. కొంతమంది నిజాయితీ కలిగిన అధికారులు, రాజకీయ నాయకులు ఉన్నా, ఇప్పుడు రాజ్యమేలుతున్న రాజకీయ, అధికార సంస్కృతుల్లో వారి ప్రయత్నాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. అంతేకాకుండా ఈ పథకాలు, కార్యక్రమాలు అమలువల్ల, వాటి ప్రభావం, ఖర్చులు తదితర విషయాలు మీద అవసరమైన సమీక్షలు

జరుగడంలేదు. కాబట్టి వాటిని మెరుగుపర్చే సమస్యే ఉత్పన్నం కాదు. అనంతపురం జిల్లాలోని దారిద్ర్యం, పర్యావరణ సమస్యల్ని క్రమబద్ధమైన విశాల దృక్పథంతో చూడడంలేదు. కాబట్టి ఈ సమస్యకు సంబంధించి విశాల దృక్పథంతో పరిష్కారం లభించడమే సాధ్యంకాదు. ప్రస్తుతం మనం రాజకీయ నిర్ణయం, పట్టుదల, దూరదృష్టి, పనిచేయాలనే తపన కోల్పోయి ఉన్నాము. ఇదే పద్ధతిలో మనం మరొక 50 సంవత్సరాలు కొనసాగితే, కేవలం, దుర్భర దారిద్ర్యాన్ని బాగుపర్చడం సాధ్యంకాని విధంగా ప్రకృతి నాశనాన్ని మాత్రమే చూడగలం.

**10. విశాల దృక్పథ పరిష్కారంలో భాగంగా ప్రజలు కార్యోన్ముఖులు కావాలి.**

అనంతపురం జిల్లాకు కావలసింది కార్యాచరణ స్పందన, ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు జిల్లాలోని జంట సమస్యలైన దుర్భిక్షం, కరువుల పరిష్కార కార్యాచరణ వైపుకు మార్గాన్ని సూచిస్తున్నాయి. కార్యాచరణకు గల అవకాశాలు, ప్రాముఖ్యతల్ని చర్చించవచ్చు. అవసరమైన మేరకు పెంచుకోవచ్చు. పర్యావరణ క్షీణతకు సంబంధించి ఈనాడు మనం ఏ పరిస్థితుల్లో ఉన్నామంటే, మనం వెంటనే ఏదో ఒకటి చేయాలి లేదా శాశ్వతంగా పర్యావరణాన్ని మర్చిపోవాలి.

ఇది అనంతపురం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన విషయం. భవిష్యత్తులో మనం మనుగడ సాగించాలంటే, పగ్గాల్ని తమ చేతుల్లోకి తీసుకొనే వారే ప్రధాన భూమిక నిర్వహించాల్సి ఉంది. అనంతపురం జిల్లా భవితవ్యం గురించి నిర్మాణాత్మక దృష్టితో దీనికి సంబంధించిన వారంతా తమ భూమికల్ని నిర్వహించాల్సివుంది. ఈ మహా యజ్ఞంలో ప్రజలు నాయకత్వం వహించాలి, నాయకులు వారిననుసరించాలి.

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ప్రజలు సమస్యల్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వారిని స్వయం శక్తివంతుల్ని చేయడంవైపు దృష్టి సారించాలి. ఈ రకంగా ప్రజల్ని స్వయం శక్తివంతుల్ని చేసే ప్రయత్నం అన్ని సమస్యలను, విషయాలను ప్రజల ముందుకు తెస్తుంది. ప్రజల్లో సమస్యల మీద వారంతకు వారు చర్చించుకోవడానికి, నిపుణులతో చర్చించడానికి ఆర్థిక సంస్థలతోనూ, ప్రభుత్వ సంస్థలు, రాజకీయ నాయకులు, పంచాయితీ సంస్థలు తదితరులతో చర్చించడానికి దారితీస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రజల సాంఘిక శక్తిని పెంపొందించి నిర్మాణాత్మక కార్యాచరణ వైపు మళ్ళించాల్సివుంది.

*– కదిలిక ఏప్రిల్ –99 సంచిక నుండి*

# ప్రజలు ప్రధాన పాత్రధారులుగా

# వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు - అనుభవాలు - ఆలోచనలు

**భా**రతదేశం సువిశాలమైనది. భిన్న సంస్కృతులు, భిన్నమతాలు, కులాలు కలిగియున్నది. సువిశాలమైన దేశంలో భౌగోళిక, శీతోష్ణ స్థితులు ఒకే రకంగా లేవు. ఫలితంగా సహజ వనరులైన భూమి, నీరు, అడవులు మరియు మానవ వనరులు వైవిధ్య పూరితంగా మనకు లభ్యమవుతున్నవి. వాతావరణం, వ్యవసాయ పరిస్థితులు వుండడం, అత్యంత తక్కువ వర్షపాతం రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో, అత్యంత ఎక్కువ వర్షపాతం చిరపుంజిలో కలిగి వుండడం సువిశాలమైన అడవులు, మైదాన ప్రాంతాలు కలిగి ఓ ప్రత్యేకతను సంతరించుకున్నది.

ప్రధానంగా మనది వ్యవసాయక దేశం. దాదాపు 80% ప్రజలు గ్రామాలలో నివసిస్తూ వున్నారు. సేద్యపు నీటి సౌకర్యాలు తక్కువ కలిగి, సహజ వనరుల ఉత్పాదకత తక్కువ కలిగిన కరువు ప్రాంతాలు దేశంలో గణణీయంగా వున్నాయి. ఆ ప్రాంతాలలో ప్రభుత్వం వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను చేబట్టుతున్నది. అటువంటి క్రమంలో భాగంగా వచ్చిన పథకమే నీటి పరీవాహక ప్రాంతాల అభివృద్ధి పథకం. ప్రస్తుతం ఈ పథకం కరువుకు గురవుతున్న ప్రాంతాలలో అత్యంత ప్రాధాన్యత కలిగివున్నది. ఈ పథకం ఆచరణాత్మకంగా ప్రజోపయోగంగా అభివృద్ధిలో భాగంగా వుండాలనే ఆశయంతో నేడు జాతీయంగా పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. మేధావుల అంతర్మథనం, సామాజిక కార్యకర్తల ఆవేదన, అన్వేషణలు, ప్రజాస్పృహ కలిగిన అధికారుల తాపత్రయం, ఈ పథకం యొక్క ప్రాముఖ్యతను పెంచుతున్నవి.

**1. నీటి పరీవాహక ప్రాంతాల అభివృద్ధి పథకం (వాటర్‌షెడ్ పథకం) అంటే ఏమిటి?**

ఒక ప్రాంతంలో పడిన వర్షపునీరు ఎత్తైన ప్రదేశం నుండి పల్లపు (దిగువ) ప్రాంతానికి ప్రవహిస్తూ ఒకే ముఖద్వారం వెంట బయటకు పోవును. ఎత్తు ప్రాంతం నుండి పల్లపు ప్రాంతాల వరకూగల ఎగుడు – దిగుడు, మెఱక– పల్లపు మైదానపు ప్రాంతము నుండి వర్షపునీరు ప్రవహించి ఒక ప్రవాహానికి చేరే ప్రాంతమునంతటినీ కలిపి నీటి పరీవాహక ప్రాంతం అంటారు. ఉదాహరణకు ఒక చెరువు తీసుకున్నప్పుడు ఆ చెరువుకు నీటిని అందించే ప్రాంతం అంతా కలిపి ఆ చెరువు పరీవాహక ప్రాంతం అంటారు. ఇలాంటి చిన్న చిన్న పరీవాహక ప్రాంతాలు కలిపి ఒక పెద్ద పరీవాహక ప్రాంతంగా గుర్తింప బడుతుంది. అలాగే ఇటువంటి పెద్ద పెద్ద పరీవాహక ప్రాంతాలు కలిపి ఒక బేసిన్‌గా పిలవడం జరుగుతోంది. దీనికి ఒక నదియొక్క బేసిన్ అని అంటారు. ఉదాహరణకు కృష్ణా బేసిన్, తుంగభద్ర బేసిన్, పెన్నా బేసిన్ తదితరములు. నీటి పరీవాహక ప్రాంతాలను అభివృద్ధి పరచడానికి ఆచరణాత్మకంగా ఉండడానికై చిన్ననీటి పరీవాహక ప్రాంతాలు పెద్ద పరీవాహక ప్రాంతాలుగా ప్రాంతం యొక్క విస్తీర్ణము బట్టికూడా మనం పరిగణలోనికి తీసుకొని వాడుకుందాం.

కరువుకు గురికాబడుతున్న ప్రాంతాలలో నీటి పరివాహక ప్రాంతాల అభివృద్ధి పథకం ఒక క్రమంగా అభివృద్ధి చెందిందే కానీ ఏ కొద్దిమంది తలకాయల నుండి ఆకస్మికంగా ఊడిపడ్డ మేధాసంపత్తికాదు. కరువులకు గురైన ప్రాంతాల ప్రజలయొక్క వందలాది సంవత్సరాల అనుభవం, మేధావులు, సామాజిక కార్యకర్తల అంతర్మథనం ప్రజల భాగస్వామ్యంతో క్షీణించిన వనరులను పునరుద్ధరించడానికి ప్రకృతితో జరిపిన పోరాటంతో ఉద్భవించినది ఈ వాటర్‌షెడ్ దృక్పథం.

**2. వాటర్‌షెడ్ కార్యక్రమం యొక్క అభివృద్ధి క్రమం 1995కు మునుపు వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం.**

దాదాపు గత 50 సంవత్సరాలుగా నీటి పరీవాహక ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు అసమగ్రంగా వుండేవి. ఉదాహరణకు భూసార పరిరక్షణ పథకం భూసార పరిరక్షణ శాఖ, ఊట చెరువుల నిర్మాణం చిన్ననీటి వనరులశాఖ, అలాగే అడవుల పెంపకం ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ద్వారా జరిగేవి. ఏ పథకం ఆ సంబంధిత శాఖల ఆధ్వర్యంలో విడివిడిగా విసిరి వేసినట్లుగా అమలు జరిగేవి. ఊటచెరువుల నిర్మాణం, భూసార పరిరక్షణ, పథకం, సామాజిక అడవుల పెంపకం మొదలగు కార్యక్రమాలలో సమన్వయం లోపించి వుండేది.

1971 ఇరిగేషన్ కమీషన్ 750 మి.మీ. వర్షపాతం కన్నా తక్కువ సాంవత్సరిక వర్షపాతం కలిగిన ప్రాంతాలకు నిరంతరం కరువులకు గురికాబడే ప్రాంతాలుగా గుర్తించింది. ఈ ప్రాంతాలలో కరువు ప్రాంత అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసింది. 544 మి.మీ. వర్షపాతం కలిగి నిరంతరం కరువులకు ప్రసిద్ధిగాంచిన అనంతపురం జిల్లాకు డి.పి.ఎ.పి రావడం జరిగింది. భూసార పరిరక్షణ, ఊటచెరువుల నిర్మాణం, చెక్‌డ్యాంల నిర్మాణం, సామాజిక అడవుల పెంపకంలాంటి పథకాలు మరింత సమన్వయంతో అర్థవంతంగా అమలు పరచాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాలను డి.పి.ఎ.పి. గొడుగు క్రిందకు తేవడం జరిగింది.

డి.పి.ఎ.పి. పథకం ఆధ్వర్యాన 1980వ సంవత్సరం ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలు మొదలయ్యింది. విడివిడిగా అమలు పరచబడుతున్న కరువు నివారణా పథకాలు ఒకే నీటిపరీవాహక ప్రాంతంలో సమగ్రంగా (భూసార పరిరక్షణ – సామాజిక అడవులు పెంపకం, ఊటచెరువులు – చెక్‌డ్యాంల నిర్మాణాలు మొదలగునవి) అమలు జరగాలనేది, ఈ డి.పి.ఎ.పి. పథకంతో ముడిపడివున్న ప్రధానాంశం.

సహజ వనరులైన నేలను, నీటినీ, అడవులను సంరక్షించి వ్యవసాయోత్పత్తుల ఉత్పాదకతను పెంచి, స్థిరీకరించడంతో పాటుగా దారిద్ర్య నిర్మూలన దిశగా వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలైన పాడిపరిశ్రమ, కోళ్ళపెంపకం మరియు వ్యవసాయేతర ఉత్పత్తుల ఆదాయ కార్యక్రమాలు. ఉదాహరణకు తివాచీలు నేయడం, దుప్పట్లు నేయడం, ఇటుకల తయారీ లాంటి పథకాలు కూడా డి.పి.ఎ.పి. గొడుకు క్రింద అమలు పరచబడినవి. ఆ సమయంలోనే జిల్లాలో ఊట చెరువుల నిర్మాణాలు, పచ్చిక బయళ్ళ పెంపకం, భూసార పరిరక్షణ, అడవుల పెంపకం, గొర్రెల పెంపకం దార్ల సహకార సంస్థలు, కోళ్ళ పెంపకం, ఇటుకల తయారీల లాంటి పథకాలు అమలు పరిచే ప్రయత్నాలు జరిగాయి. ఈ పథకాల అమలులో భాగంగానే సోమగట్ట, గుట్టూరు లాంటి వాటర్‌షెడ్ పథకాలు రూపుదిద్దుకున్నాయి.

**ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం ఒకటి వున్నది.అది పథకాలు రూపొందించడం – పథకాలు అమలు పరచడం అనేవి ఎలా జరిగాయి?**

పథకాలు సంబంధిత శాఖ అధికారులు రూపొందించడం, కాంట్రాక్టర్‌ల ద్వారా అమలు పరచడం జరిగింది. ప్రజల ఉనికిని, ప్రజల భాగస్వామ్యాన్ని, పథకాల అమలులో పరిగణలోనికి

తీసుకోలేదు. ఫలితంగా ప్రజల భాగస్వామ్యం లోపించింది. పథకాలు ప్రజలచేత సంరక్షింపబడలేదు. ప్రజల భాగస్వామ్యంతో ప్రజల అవసరాలకు తగిన విధంగా పథకాల రూపకల్పన జరిగితే అవి ఫలితాలనిస్తాయి.

గతంలో అమలు పరచిన వాటర్‌షెడ్ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం లోపించడంతో పాటుగా ప్రభుత్వ వ్యవస్థలో దాగివున్న అవినీతి, అసమర్థత, చిత్తశుద్ధి లోపించడం నిర్లిప్తత మరియు అధికార దర్పంతో కూడిన వైఖరులవల్ల సత్ఫలితాలు అందించే దిశలో వైఫల్యం చెందాయి. పరీవాహక ప్రాంతాల నూతన మార్గదర్శక సూత్రాలు 1995లో చోటు చేసుకొనక మునుపే అక్కడక్కడ ప్రజల భాగస్వామ్యాన్ని ప్రజలే ప్రధాన సూత్రదారులుగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు అమలు పరచడం జరిగింది. దేశంలో ప్రజలు భాగస్వామ్యానికి తార్కాణంలాగా, ఒకవేగుచుక్కలాగా రాలేగావ్ సిద్ధిలో అన్నా హజారే వాటర్‌షెడ్ పథకాన్ని అమలు పరుచుచుండేవారు. అంత సమగ్రంగా కాకపోయినా ప్రజల భాగస్వామ్యాన్ని చెప్పుకోదగ్గ స్థాయిలో అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఆర్.డి.టి. మరియు కొన్ని స్వచ్ఛంద సంస్థలు వాటర్‌షెడ్ కార్యక్రమాలను అమలు జరుపుతుండేవి.

వాటర్‌షెడ్ అంటే ఏమిటి ? ఒక ప్రాంతంలో పడిన వర్షపునీరు ఎత్తైన ప్రాంతం నుండి దిగువ ప్రాంతానికి ప్రవహిస్తుంది. ఒకే ముఖద్వారం ద్వారా బయటకు పోవును. అట్లు ప్రవహించే ప్రాంతమంతటినీ పరీవాహక ప్రాంతం అంటారు. దీనినే వాటర్‌షెడ్ అంటారు.

నీటి పరీవాహక ప్రాంతంలో భూమి ఉత్పాదకతను పెంచడానికి చేపట్టవలసిన ముఖ్య అభివృద్ధి కార్యక్రమాలు

1. భూసార పరిరక్షణ చర్యలు, అందులో భాగంగా కాంటూరు మట్టికట్టలు.
2. వంకలో నీటి ప్రవాహాన్ని అదుపులో వుంచడానికి రాతిచప్పిళ్ళు
3. వర్షపునీటిని నిలుపుటకు చిన్నచిన్న నీటి కుంటలు.
4. ఊట చెరువులు మరియు చెక్ డ్యాములు.
5. సామాజిక అడవులు, పచ్చిక బయళ్ళు పెంపకం, పండ్ల తోటల పెంపకం-నీడనిచ్చే చెట్ల పెంపకం.
6. నేలకోతను అరికట్టడం ద్వారా భూమిలోని తేమను భూమిపైన పచ్చదనానికి అవసరమైన ఏ విధమైన పనులైన

పై పరిస్థితుల నేపథ్యంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలు తీరుతెన్నులను అట్టడుగు స్థాయిలో పరిశీలించి మార్గదర్శక సూత్రాలను రూపొందించడం కొరకు 1994లో శ్రీ హనుమంతరావ్ కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. కమిటీ దేశంలో విస్తృతంగా పర్యటించి వివిధ ప్రాంతాలలో వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలు తీరు తెన్నులను పరిశీలించి ప్రస్తుత వాటర్‌షెడ్ మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. హనుమంతరావ్ కమిటీ తన నివేదికలో ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం జరిగింది. కమిటీ రూపొందించిన మార్గదర్శక సూత్రాలలోని ముఖ్యాంశాలు:-

1. వాటర్‌షెడ్ కార్యక్రమాలలో ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ల పాత్రధారణల ద్వారా అమలు జరిగే కార్యక్రమాల స్థానే ప్రజల భాగస్వామ్యాన్ని గుర్తించడం.
2. వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని మునుపటిలా Macro Watershed స్థాయిలో (పెద్ద పెద్ద వాటర్‌షెడ్‌ల) కాకుండా గ్రామస్థాయిలో అమలు జరగడం. ఫలితంగా వికేంద్రీకరణ జరిగి గ్రామస్థాయిలో సాధారణ ప్రజలు భాగస్వామ్యానికి అవకాశం కల్పించడం.

3. గ్రామస్థాయిలో సహజ వనరుల అభివృద్ధికి, మరియు భవిష్యత్తులో – సంరక్షణ కొరకు (భూమి, అడవులు – నీరు, పశుసంపద మరియు మానవ వనరులు) గ్రామస్థాయిలో గ్రామస్థుల భాగస్వామ్యంతో పథకాలు రూపొందించడం – (ఈ కార్యక్రమాలు రూపొందించే విధానం గతంలో, జిల్లా స్థాయిలోని అధికారుల ఆలోచనల్లోంచి ప్రత్యేకంగా కాంట్రాక్టర్‌ల స్వార్థ ప్రయోజనాల్ని దృష్టిలో వుంచుకొని పథకాల రూపకల్పన జరిగేది).

4. గతంలో నిధులు ప్రభుత్వశాఖ ఆధ్వర్యంలో, పరిధిలో వుండేవి. నిధుల విడుదల, నియంత్రణ ఖర్చులు, వినియోగం తదితరాలన్నియు ప్రభుత్వ శాఖల ఆధీనంలోనే జరిగేవి. నూతన మార్గదర్శక సూత్రాల ప్రకారం నేరుగా వాటర్‌షెడ్ కమిటీలకు వాటర్‌షెడ్ అసోసియేషన్‌కు విడుదల చేయబడుతాయి. ఇదొక గొప్ప పరిణామం.

5. గ్రామస్థాయిలో కార్యక్రమాల రూపకల్పన, పథకాల అమలు, అజమాయిషీ, నియంత్రణ నిర్వహణకు కమిటీలు, వాటర్‌షెడ్ సహాయక గ్రూపులతో కూడిన ఒక గ్రామస్థాయి ప్రజా వ్యవస్థ ఏర్పాటు కావడం జరగాలి. తత్ఫలితంగా వాటర్‌షెడ్ అభివృద్ధి క్రమంలో సాధారణ ప్రజలు ప్రధాన పాత్రధారులు కావడం జరుగుతుంది. నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థకు గ్రామస్థాయిలో పునాదులు కూడా ఇక్కడే ప్రారంభం కాగలవు. పరిపాలనా వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం, ప్రజాపాలన అనేది ఇక్కడ అంకురార్పణ కాగలదు.

6. నిధులను వెచ్చించడంలో పూర్తి పారదర్శకత వుండాలని నిర్దేశించడం జరిగింది. గతంలో స్పష్టత వుండేదికాదు.

7. గ్రామస్థాయిలో సమగ్రంగా పథకాలు రూపొందించడానికి మార్గం సుగమం అయింది. గతంలోలా కార్యక్రమాలు విడివిడిగా అక్కడక్కడా విసిరేసినట్లు కాకుండా, కార్యక్రమాలన్నీ గ్రామ భౌతిక వనరుల అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని రూపొందించుకొనే మహత్తర అవకాశం ప్రస్తుత నూతన మార్గదర్శక సూత్రాల్లో చోటు చేసుకున్నది.

8. కాంట్రాక్టర్‌ల వ్యవస్థ తొలగించబడడం, అవినీతి అధికారుల ప్రమేయం తగ్గించడం ద్వారా వున్న నిధులతో గ్రామంలో ఎక్కువ కార్యక్రమాలను చేబట్టే వీలు కలుగుతోంది. మరియు ఈ విధానం ద్వారా కూలీలకు నేరుగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు దినసరి వేతనం చేరాలని నూతన మార్గదర్శక సూత్రాలు ఆదేశిస్తున్నాయి.

9. భూమిలేని నిరుపేదలకు వ్యవసాయేతర ఆదాయ కార్యక్రమాలు అమలు పరచడం కొరకు అవకాశం కల్పించాలని మార్గదర్శక సూత్రాలు చెబుతున్నాయి.

**3. ప్రభుత్వ యంత్రాంగపు పాత్రలో రావలసిన మార్పు :-**

పై మార్గదర్శక సూత్రాల ద్వారా కార్యక్రమాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు స్పష్టంగా చోటు చేసుకోవాలి. నూతన మార్గదర్శక సూత్రాల ప్రకారం వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థాయిలో ప్రజలు ప్రధాన పాత్రధారులుగా వుండి అమలు జరపవలసి వుంటుంది.

ప్రభుత్వ పథకాల రూపకల్పన, నిధుల నియంత్రణ, నిధుల అజమాయిషీ నిర్ణయాధికారం ప్రభుత్వం తన పరిధి నుండి గ్రామ స్థాయిలోని ప్రజల పరిధిలోనికి తీసుకు రావడానికి ఉద్దేశించబడినవి. పర్యవసానంగా ప్రభుత్వం తన పాత్రను ప్రజలకు బదిలీ చేసినట్లు అవుతుంది. ఈ విధానం అమలు చేయుటలో ప్రభుత్వ యంత్రాంగ పాత్రలో పూర్తి మార్పు రావలసివుంది. ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రజలను చైతన్య పరచడం, సంఘటిత పరచడం, సాంకేతిక పరిజ్ఞానం అందించడం, బలోపేతం

చేయడం, సమన్వయం చేయడం వరకూ పరిమితం కావాలని మార్గదర్శక సూత్రాలు సూచిస్తున్నాయి. విధాన నిర్ణయాలలో ఇదొక గొప్పమార్పు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో విప్లవాత్మకమైన పరిణామం చోటు చేసుకోవడానికి అవకాశము కల్పిస్తుంది. ఒకరకంగా ప్రభుత్వం అత్యంత కీలకమైన బాధ్యతను ప్రజలకు బదిలీ చేయడం జరిగేందుకు కొత్త మార్గదర్శక సూత్రాలు అవకాశం కల్పిస్తాయి.

ఈ కొత్త మార్గదర్శక సూత్రాలు 1-4-95 నుండి అమలులోనికి రావలయునని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది.

**4. వాటర్‌షెడ్ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం - గత నాలుగేండ్లలో కొన్ని అనుభవాలు :-**

కొత్త మార్గదర్శక సూత్రాల ప్రాతిపదికపై వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలులో గడచిన నాలుగు సంవత్సరాలలో ఆశించినంత మార్పు రాలేదు. ప్రజల భాగస్వామ్యం ఆచరణలో తీసుకురావడానికి చిత్తశుద్ధితో కృషి జరగలేదు. గడచిన నాలుగు సంవత్సరాలలో గడించిన అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని ఆచరణలో ఎదురైన ఆటంకాలను గుర్తించి, ఆ ఆటంకాలను తొలగించి ముందుకు పోవలసివుంటుంది. వాటర్‌షెడ్ అభివృద్ధి ఉద్దేశ్యములను, పరిమితులను, ప్రజల పాత్రను, ప్రభుత్వ పాత్రను వాస్తవిక దృక్పథంతో ఆలోచనచేసి, ఆచరణ యోగ్యమైన మార్గములో ముందుకు పోవలసివుంటుంది.

**4.1. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ దారిద్ర్యాన్ని సమూలంగా నివారించలేవు.**

వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి అత్యంత అవసరమైందేకానీ, భారతదేశ గ్రామీణ పేదరికాన్ని ఏకంగా తీర్చలేదు. వాటర్‌షెడ్ అభివృద్ధి కరువు ప్రాంతంలో ప్రకృతి వనరుల్ని స్వస్థతపరుస్తూ, వాటి ఉత్పత్తి శక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. ఇది నేరుగా గ్రామస్థాయిలోని భూవసతి ఆధారంలేని నిరుద్యోగం, దారిద్ర్య సమస్యల్ని ఉద్దేశించి కూడా కాదు. మొత్తం గ్రామ జనాభా ముఖ్యంగా అటవీ - వ్యవసాయ రంగాలమీద ఆధారపడ్డ ప్రజలందర్నీ కూడా ఇందులో ఇమడ్చలేమన్న వాస్తవాన్ని కూడా మనం గమనించాల్సి వుంటుంది. 95 శాతం గ్రామీణ జనాభా వ్యవసాయం, పశుపోషణ, అటవీ సంపదపై ఆధారపడి ఉంది. వ్యవసాయరంగం గ్రామంలోని ప్రజలందరికీ పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించే పరిస్థితిలో లేదు. ఫలితంగా ఏ వనరులులేని గ్రామీణ ప్రజలలో దుర్భర దారిద్ర్యం, దిగజారి పోయిన ప్రకృతి వనరులు మనకు దర్శనమిస్తున్నాయి.

సహజవనరులు క్షీణించడానికి దారిద్ర్యం కూడా ఒక కారణం. అలాగే క్షీణించిన సహజ వనరులు దారిద్ర్యాన్ని ఎక్కువ చేస్తున్నాయి. వాటర్‌షెడ్ పథకాన్ని ఎంతబాగా అమలు పర్చినప్పటికీ గ్రామీణ ప్రాంతంలో ఉన్న దారిద్ర్యాన్ని సమూలంగా నిర్మూలించలేము. వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాలు స్థిరమైన ఉపాధి అవకాశాల్ని శాశ్వతంగా జనాభా అంతటికీ కల్పించలేవన్నది మనం గమనించాలి. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు మధ్యతరహా మరియు పెద్దతరహా రైతులకు మాత్రమే బాగా ఉపయోగపడతాయి.

కాబట్టి మానవ వనరుల అభివృద్ధి అవకాశాలవైపు దృష్టి సారించడం చాలా అవసరం. ఇందులో భాగంగా వ్యవసాయరంగం మీదనే ఆధారపడిన ప్రజల్ని వ్యవసాయేతర రంగాలకు మళ్ళించగలిగే ఒక అభివృద్ధి కార్యాచరణ చాలా అవసరం. ఇటువంటి పథకాలవైపు దృష్టి సారించకపోతే, భారతదేశ గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యం మరింత వేళ్ళూనుకుని పోయే ప్రమాదముంది. అయితే, దేశంలో విస్తృతంగా వర్షాధార వ్యవసాయం మీద ఆధారపడిన ప్రాంతాలలో వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు పర్చకుండా గ్రామప్రాంతాలలో అభివృద్ధి ఫలితాల్ని ఆశించలేము.

**4.2. వాటర్‌షెడ్ అభివృద్ధి అమలులో ప్రజలు ప్రధాన పాత్రధారులు కావడానికి అవరోధాలు :-**

ఇప్పటివరకూ దాదాపుగా వ్యవసాయం, వాటర్‌షెడ్ సంబంధిత పథకాలన్నీ ప్రభుత్వ శాఖలే రూపొందిస్తున్నాయి. కంట్రాక్టర్లు వీటిని పూర్తిచేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం ప్రధాన సూత్రధారి పాత్ర నిర్వహిస్తూ, ప్రజలు కేవలం నామ మాత్రంగా ఉంటూ పథకాల్ని అందుకుంటున్నారు లేదా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త మార్గదర్శక సూత్రాల ప్రకారం, వాటర్‌షెడ్ పథకాల అమలులో ప్రజలు ప్రధాన పాత్ర వహించాలి. అక్కడక్కడా కొన్ని బలహీనతలు కనపడినప్పటికీ, ఇది చాలా అభివృద్ధికర అంశం. అయితే అభివృద్ధి పథకాల అమలు విధానంలో వచ్చిన ఈ ప్రధానమైన మార్పుకు కొన్ని అవరోధాలెదురవుతున్నాయి. ఈ అవరోధాలేమిటో గమనించి వాటిని తొలగించడంతోపాటు, ప్రజలు ఈ అభివృద్ధి పథకాల అమలులో ప్రధాన పాత్ర వహించగలిగే ఒక సామాజిక అనుకూల వాతావరణం కలిగించాల్సి ఉంటుంది. నూతన మార్గదర్శక సూత్రాలతో గత నాలుగు సంవత్సరాలుగా అమలు పర్చిన వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల అమలులో ఈ క్రిందివి ప్రధాన అవరోధాలుగా గమనించడం జరిగింది.

**4.3. భాగస్వామ్యం వహించడానికి అనుకూలంగాలేని గ్రామీణ ప్రజల ధోరణి :-**

గత అయిదు దశాబ్దాలుగా ప్రజలకు రెడీమేడ్ అభివృద్ధిని వారి విస్తర్లలో వడ్డించబోతున్నట్లు ప్రభుత్వాలు వాగ్దానాలిస్తున్నాయి. ఆచరణలో ఇది సాధ్యంకాకపోగా ప్రభుత్వ ధోరణివల్ల, ప్రజలలో ఉన్న చొరవను, బాధ్యతను కూడా నశింపచేసి, ప్రభుత్వమే అన్నీ చేయాలన్న ధోరణి ప్రజలలో నాటుకుంది. సంప్రదాయకంగా గ్రామంలో ప్రజలు ఉమ్మడిగా కొన్ని బాధ్యతలు నిర్వహించుకునేవారు. అవి ఇప్పుడు కనుమరుగయ్యాయి. అభివృద్ధి అమలు బాధ్యత కేవలం ప్రభుత్వాలదే అన్న విశ్వాసం ప్రజలలో పాతుకు పోయింది. దీనివల్ల అభివృద్ధి అనేది ప్రభుత్వం మాత్రమే చేయాల్సిన పనిగాదనీ, తాము కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న విషయాన్ని ప్రజలు మర్చిపోయారు.

**4.4. రాజకీయ ముఠా కక్షలతో విడిపోయి ఉన్న గ్రామ నాయకత్వం:-**

గ్రామ ప్రాంతాలలో నాయకులుగా చెలామణి అవుతున్న వారు ముఠా రాజకీయాలతో విడిపోయి ఉన్నారు. దీనివలన ఈ నాయకులు, ప్రజల మధ్య సంబంధాలు వర్గాలుగానో, దోపిడీ స్వభావంగానో, నాయకుల స్వలాభం లేదా పార్టీ ప్రయోజనాల ప్రాతిపదికగానో ఏర్పడి ఉంటాయి, ఫలితంగా గ్రామాలలో అనైక్యత, అసూయ, ద్వేషాలు, వేర్పాటువాదం చోటు చేసుకున్నాయి. వర్గాలకు, రాజకీయాలకు లోబడని నూతన నాయకత్వాన్ని ఈ క్రమంలో ఐచ్ఛికంగా అభివృద్ధి క్రమంలో పాల్గొనడానికి సాంఘిక వాతావరణం మొదట గ్రామాల్లో తీసుకురావలసివుంటుంది. మొదట సానుకూల సాంఘిక వాతావరణం తీసుకురావడానికి కృషి చేయనందున వాటర్‌షెడ్ గ్రామాలలో కొత్త కంట్రాక్టర్లు అవతారమెత్తి వారి స్వప్రయోజనాలకు దోపిడీ విధానాలు అనుసరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, స్వార్థపరుల అదనపు వనరులుగా మారిపోతున్నాయి.

**4.5. ప్రజల భాగస్వామ్యానికి సహకరించని ప్రభుత్వ అధికారుల పని సంస్కృతి (Work Culture)**

ప్రభుత్వ అధికారుల విధానాలు, ఆలోచనలన్నీ కూడా ప్రజలకు తాము చెప్పాలనుకోవడం తప్ప, ప్రజలు చెప్పింది తాము కూడా వినాలనుకునే ఆలోచన లేదు. వీరికి ప్రజల భాగస్వామ్యం, ఆలోచనల పట్ల నమ్మకం, సరిఅయిన అవగాహన లేవు. అందుకు కావలసిన సమయం, ఓపిక ప్రభుత్వాధికారులకు లేదు. ప్రజలలో వీరి సంబంధాల స్థాయి, అధికారదర్పంతో అసమాన సంబంధాలు

ప్రాతిపదికగా ఉంటున్నాయి. మానసికంగా ఈ భావనలు అధికారులను ఆవహించడం వల్ల, భౌతికంగా వీరిని ప్రజలకు దూరంగా ఉంచుతున్నాయి. సాధారణంగా ప్రభుత్వాధికారులు, జిల్లా లేదా తాలూకా కేంద్రాలలో కాపురం ఉంటున్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉండలేక పోవడానికి ఇదొక కారణం. సమయం కూడా ఇందుకు ఉపకరించదు. సాధారణంగా అధికారులందరూ ప్రజలకు కావలసిందేమిటో తమకే బాగా తెలుసనుకుంటారు. వారు చెప్పిందే ప్రజలు వినాలని, ఆచరించాలని కోరుకుంటారు. ప్రభుత్వ సంస్కృతి రీత్యా ఏర్పడిన ఈ ప్రవర్తనలమూలంగా ప్రజలలో ఆసక్తి, చొరవ, బాధ్యతాయుత భాగస్వామ్యత ఏర్పడకుండా నిరోధిస్తుంది. వివిధ స్థాయిల్లో ఉన్న ఇలాంటి అధికారుల వైఖరి మూలంగా వాటర్‌షెడ్ అభివృద్ధి క్రమంలో ప్రజలు భాగస్వామ్యం వహించడానికి ఒక అవరోధంగా ఉంటున్నది.

అధికారుల భావజాలం, వైఖరిలో మార్పు తేవడానికి తగిన ప్రయత్నంచేయాలి. ప్రధానంగా ప్రజలపట్ల వీరికి విశ్వాసం, గౌరవం పెంపొందింపచేయాలి. భౌతికంగా, మానసికంగా వ్యత్యాసాలను తొలగించడానికి కృషిచేయాలి. ఇది ఒకరకంగా పరస్పర సహకారం, సాంఘిక సమానత్వం గురించి తిరిగి శిక్షణ పొందడం, నేర్చుకోవడం లాంటివి. అవసరమైన శిక్షణతో వాటర్‌షెడ్ అభివృద్ధితో ప్రజలతో పాటు పాల్గొనడం మరియు పితృస్వామిక భావజాలం నుండి ప్రభుత్వయంత్రాంగం విముక్తి కావలసివుంది.

### 4.6. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి :

కొంతమంది అధికారులలో అవినీతి ఉండడం రహస్యమేమీకాదు. అధికారులలో ఉన్న ఈ జాఢ్యం ప్రజలు అభివృద్ధి క్రమంలో పాల్గొనడాన్ని నిరోధిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగంలో వున్న అవినీతి కంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు సహాయకారిగా ఉంది. దీనికి అనుసరించాల్సిన పరిష్కారమార్గ మొక్కటే. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలులో దాపరికం లేని ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.

### 4.7. తక్కువ సిబ్బంది – ఎక్కువైన పనిభారం :-

డి.ఆర్.డి.ఎ., డి.పి.ఎ.పి., డి.డి.పి., లాంటి సంస్థలకు సిబ్బంది సంఖ్య చాలా తక్కువ బాధ్యతలు చాలా ఎక్కువ ఉన్నటువంటి సిబ్బంది కూడా ఇతరత్రా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో, వాటర్‌షెడ్ పథకాల అమలుకు తగిన సమయం కేటాయించలేక పోతున్నారు. కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సెక్టార్‌లో అయితే, సిబ్బంది దొరకడమే దుర్లభం. ఇవి చాలదన్నట్లుగా ఉన్నటువంటి సిబ్బందికే మరిన్ని వాటర్‌షెడ్‌ల నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తున్నారు. దీనికితోడు అధికారులంతా వాటర్‌షెడ్ గ్రామాలకు దాదాపు 40 నుంచి 60 కి.మీ. దూరంలో జిల్లాకేంద్రంలోనో, తాలూకా కేంద్రాల్లోనో నివాసముంటున్నారు. సాధారణంగా గ్రామాలలో ప్రజలు ఉదయంపూట, సాయంత్రం పూట మాత్రమే అందుబాటులో ఉంటారు. ఒకవేళ అధికారులకు వాహన సదుపాయం కల్పించినప్పటికీ, గ్రామాలలో ప్రజలున్న సమయానికి వీరు చేరుకోగలగడం సాధ్యంకాని పనిగా మిగిలింది.

వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల అమలులో సిబ్బంది సమస్య తీవ్రమైనదేకాక, ఆందోళనకరమైనది కూడా కాబట్టి వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల అమలును సమర్థవంతంగా అమలు పర్చడానికి కావలసినంత సిబ్బందిని నియమించాలి. వీరు పూర్తికాలం తమ కర్తవ్య నిర్వహణలో నిమగ్నులై ప్రజలలో భాగంగా ఉండగలగాలి.

### 4.8. కేంద్రీకృత యాజమాన్యం : -

ప్రస్తుతం ప్రభుత్వ పనివిధానాన్ని గమనిస్తే, అధికారాలన్నీ ఒక పై అధికారి వద్ద కేంద్రీకృతమై ఉంటాయి. అధికారాలు కేంద్రీకృతం చేసుకోవడంతోపాటు, అన్ని విషయాలు తనకే తెలుసని ఆ

అధికారి భావిస్తుంటాడు. అధికారి ఆజ్ఞ జారీ చెయ్యాలి. కిందిస్థాయి సిబ్బంది ఈ ఆజ్ఞల్ని శిరసావహించాలని భావిస్తుంటారు. ఈ సిద్ధాంతం దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ కొనసాగుతూంది. దీని ఫలితంగా పైస్థాయిలో అధికారాలు కేంద్రీకృతమైతే, సిబ్బందికి, సిబ్బందికీ మధ్య అంతరాలు సృష్టించబడి ఉంటాయి. దీని ప్రకారం ప్రతి స్థాయిలోనూ పై అధికారి నిర్ణయాలు గైకొంటే సిబ్బంది వాటిని అమలుపర్చే విధంగా ఉంటారు. అయితే భాగస్వామ్య విధానం (participatory approach) ప్రకారం అధికార వికేంద్రీకరణ జరగాలి. వాటర్‌షెడ్ అభివృద్ధిలో పాల్గొనే వారందరి విజ్ఞానం, అనుభవాల ఆధారంగా నిర్ణయాలు గైకొనబడాలి, అమలుపర్చబడాలి. వాటర్‌షెడ్ అమలులో ఉండాల్సిన ఈ భాగస్వామ్య విధానం డి.ఆర్.డి.ఎ./డి.పి.ఎ.పి. సంస్థల యాజమాన్యపు పైస్థాయి అధికారుల్లోనూ మరియు కింది స్థాయిలోనూ అమలుపర్చాలి. డి.ఆర్.డి.ఎ/డి.పి.ఎ.పి.లో ఈ భాగస్వామ్య యాజమాన్య విధానాన్ని ప్రవేశపెట్టేందుకు, అనువైన వాతావరణం, అవకాశం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా పై అధికారులు ఒక ముఖ్య భూమిక నిర్వర్తించాల్సి వుంటుంది.

### 4.9. "మంటలార్పే" యాజమాన్య పద్ధతి మరియు వృధా ప్రయాస :-

అధికారులను గమనించినపుడు మనకు సర్వసాధారణంగా ఒక విషయం అర్థమవుతుంది. జిల్లాస్థాయిలో, అధికారులంతా ఆర్థిక లక్ష్యాన్ని (Financial Target) పూర్తి చేయాలనో, పర్యటనకొచ్చే అధికారులకు ఆహ్వానం పలకడానికనో, పుంఖానుపుంఖాలుగా వచ్చే ప్రభుత్వ ఉత్తర్వులకు జవాబులు ఇవ్వడానికనో ఎప్పుడూ హైరానా పడుతుంటారు. ప్రతిదినం వారు ఏదో అనుకోకుండా సంభవించిన అగ్ని ప్రమాదాన్ని ఆర్పడానికి పడే శ్రమ పడ్తున్నట్టుగా ఉంటారు. నిస్సందేహంగా వీరంతా బాగా శ్రమిస్తూనే ఉంటారు. అయితే చాలా సందర్భాలలో ఈ శ్రమకు ఎలాంటి ఫలితం ఉండదు. ఒక నిర్దిష్ట కార్యాచరణ పథకం ఉండదు. ఏది వెనుక చెయ్యాలనిగానీ, ఒక వరుస క్రమంలో పద్ధతి ప్రకారం చేద్దామనిగాని ఉండదు. సమయాన్ని, మానవ వనరుల్ని గురించి అంచనా వేసుకునే అలవాటు అసలుండదు. ఒకవేళ వారు ప్రణాళికా బద్ధకంగా కార్యక్రమాన్ని రూపొందించుకోవాలనుకున్నా, ప్రతిరోజూ పై అధికారులనుండి వచ్చే వత్తిళ్ళు మూలంగా వారి సమయం, శక్తి సామర్థ్యాలు గాడి తప్పుతున్నాయి. కాబట్టి అధికారులు సాధారణంగా ఎప్పుడూ "అకస్మాత్తుగా మంటలార్పే యజమాన్య" విధానాన్ని (Crisis Fire Fighting Management Approach) అనుసరిస్తూ ఉంటారు. దీనివలన మానవ వనరులు, సమయం ఏరకమైన ఫలితాల్లేకుండా ఖర్చుచేయబడుతాయి. ముఖ్యమైన సందర్భాలలో పొరపాట్లు దొర్లటం వల్లకూడా అధికారులలో స్థబ్ధతకు దారితీస్తుంది. అధికారులను తరచుగా బదిలీ చేస్తుండడం కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నది.

ప్రస్తుత పర్యవేక్షణా విధానమంతా భౌతిక, ఆర్థిక లక్ష్యాల సాధనమీదే ఆధారపడివుంది. అయితే ప్రజల పర్యవేక్షణ ఉన్నప్పుడు ఈ భౌతిక – ఆర్థిక లక్ష్యాలు ఏకైక కొలమానాలుగా ఉపయోగపడవు. గ్రామంలో ఉన్న సాంఘికపరిస్థితులు, అభివృద్ధి క్రమాన్ని పర్యవేక్షించే సామాజిక సంస్థల స్థాయి ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందకుండా ఉన్నాయి. సరిఅయిన, సులభమయిన సాంఘిక పర్యవేక్షణ చేసే పద్ధతులు అభివృద్ధి పరచవలసిన అవసరం వుంది. భౌతిక – ఆర్థిక లక్ష్యాన్ని కొలమానంగా చూచినంత ప్రత్యేకతతోనే సాంఘిక పర్యవేక్షణ మరియు భాగస్వామ్య విధానాల్ని అభివృద్ధి చేయవలసివుంది.

### 4.10. రైతులు కూడా కొంత ఖర్చును భరించాలి :-

పైన వివరించినట్లుగా వాటర్‌షెడ్ అభివృద్ధి పథకంలో చేపట్టే కార్యక్రమాలు ప్రకృతి వనరుల్ని

స్వస్థత పర్చడానికి ఉద్దేశించినట్టివి. వీటి ఫలితాలు దీర్ఘకాలిక మైనట్టివి. ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా రైతులకు ఉపయోగపడేవి. ఇందులో కార్యక్రమాలు భూసారం – తేమ పరిరక్షణ (కాంటూరు బండింగు లేదా వాలుగట్లు) వర్షపు నీరు నిలువ చేయడం (చెక్ డ్యాములు) అటవీకరణ, తదితర కార్యక్రమాలున్నాయి. ఈ కార్యక్రమాలు కూడా గత యాభై సంవత్సరాలుగా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా అమలు పరుస్తున్నవే. ఇప్పటి వరకూ ఖర్చులో కొంత భరించమని రైతులను అడగడంగానీ, నామమాత్రంగానైనా కొంత ఖర్చును వసూలు చేద్దామన్న ఆలోచనగానీ ప్రభుత్వానికి కలుగలేదు. ఇప్పటి వరకూ గ్రామాల్లో ప్రభుత్వం ప్రజల ప్రమేయమే లేకుండా పథకాల్ని అమలు పరుస్తోంది. ఆర్.డి.టి. పని చేస్తున్న వాటర్‌షెడ్ గ్రామాల్లో 10 శాతం ఖర్చును భరించవలసిందిగా రైతులను అడిగినపుడు వారు ఆశ్చర్యపోయారు. ఇతర గ్రామాల్లో ప్రభుత్వం ఏమాత్రం వసూలు చేయడంలేదు కదా తామెందుకు ఖర్చును భరించాలని ప్రశ్నించారు.

రైతులు తమస్వంత భూములలో పండ్ల తోటలు, బోర్‌వెల్స్, పంటపెట్టుబడి, బావులకు విద్యుచ్ఛక్తి తదితర ప్రత్యక్షంగా, త్వరితంగా ఫలితాలనిచ్చే కార్యక్రమాలు అమలు పర్చినపుడు పూర్తిగా నూరుశాతం ఖర్చును భరిస్తున్నారు. దీనికి కారణం, వీటిలో ప్రత్యక్ష పెట్టుబడులతోపాటు రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగ పడుతుండడం. ఇటువంటి పథకాలలో సన్న, చిన్నకారురైతులకు సబ్సిడీలు, ప్రోత్సాహకాల రూపేణా కొంత ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

ఈ విధంగా కొన్ని దశాబ్దాల పాటు కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో డి.ఆర్.డి.ఎ/ .డి.పి.ఎ.పి. ఏజెన్సీలకు భూసార పరిరక్షణ, వర్షపునీరు నిలువ, అటవీకరణ పథకాల అమలులో రైతులనుంచి ఒకేసారిగా ఒప్పించగలడం దాదాపు అసాధ్యమే. ఎందుకంటే ఇటువంటి కార్యక్రమాలు రైతులకు ప్రత్యక్షంగా త్వరగా ఫలితాలనివ్వవు. అయితే తరచుగా సంభవించే పంట నష్టాలు, కరువు పరిస్థితులవల్ల కూడా సన్న–చిన్నకారు రైతులు ఈ 10శాతం ఖర్చును భరించగలగడం ప్రశ్నార్థకమే.

ఎంతో కొంత ఖర్చును ప్రజలు భరించాల్సిన అవసరం మాత్రం ఎంతైనావుంది. ఖర్చును భరించటానికై రైతులను ఒప్పించే ప్రయత్నంలో ఎదురయ్యే అడ్డంకుల్ని నిదానంగా అధిగమించాల్సి వుంటుంది. ప్రస్తుతమయితే 10 శాతం ఖర్చు రైతులతో వసూలు చేయడం కష్టసాధ్యమైన పనే. అయితే కొంతలో కొంతయినా వసూలు చేయడం ప్రారంభిస్తే, నిదానంగా కావలసిన స్థాయికి దానిని పెంచుకోవచ్చు. ప్రజల ద్వారా వసూలు చేసే ఈ డబ్బును వాటర్‌షెడ్ "భవిష్యనిధి"లో జమచేస్తారు. అంటే రైతులు తమ గ్రామంలో ఉమ్మడి నిధికి విరాళాలిస్తున్నారన్నమాట. దీనిద్వారా భవిష్యత్తులో గ్రామంలో ఉమ్మడి వనరుల్ని నిర్వహించడానికి వీలవుతుంది. ఈ దిశలో మొదటి మెట్టుగా ప్రజలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయాలి. ప్రజలు మనస్ఫూర్తిగా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే, ఖర్చును భరించే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

### 4.11. వాటర్‌షెడ్ గ్రామాల ఎంపికలో జాగ్రత్తలు :-

వాటర్‌షెడ్ గ్రామాలను ఎంపిక చేసేటప్పుడు ప్రకృతి – భౌతిక పరిస్థితులతోపాటు, గ్రామాలలో ఐకమత్యం, సహకారం, సమిష్టి నాయకత్వం వంటి సాంఘిక పరిస్థితుల్ని కూడా పరిగణలోనికి తీసుకోవాల్సి వుంటుంది. ఏ విషయాల్ని పరిగణలోనికి తీసుకుంటామో ఆ విషయాలన్నీ కూడా గ్రామంలో వాటర్‌షెడ్ పథకం ప్రజల ప్రధాన పాత్రధారణలో అమలుకు దోహదకారిగా ఉండాలి. వర్షపాతం, పచ్చదనం, భూగర్భజలమట్టం లాంటివి ప్రకృతి భౌతిక విషయాలకిందికి వస్తాయి. ఈ ప్రాధాన్యతాంశాలు అనువైనవిగా ఉండాలి. దాపరికం లేకుండా ఉండాలి.

## 4.12. ప్రజలు ప్రధాన పాత్రధారులుగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు విజయవంతమయ్యే లక్షణాలు గల గ్రామాలు ఎన్నుకోవాలి :-

వాటర్‌షెడ్ అభివృద్ధి దశలో గ్రామంలో సమగ్ర వాటర్‌షెడ్ అభివృద్ధి పథకం విజయవంతం కావడానికి కావలసిన సాంఘిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాటర్‌షెడ్ పథకాల్ని విజయవంతంగా అమలు పర్చిన గ్రామాల అనుభవాన్ని గమనించినపుడు గ్రామంలో ప్రజల వద్ద ఐక్యత, ఉమ్మడి నాయకత్వం విజయానికి ప్రధాన కారణాలుగా మనం గుర్తించగలం.

మొదటి దశలో వాటర్‌షెడ్ పథకాల అమలు విజయవంతం కాగల గ్రామాల్ని ఎంపికచేసి, పథకాల్ని అమలుపరిస్తే, వీటి ఫలితాల్ని ఒక నమూనాగా ఇతర పరిసర గ్రామాలను చూపి, చుట్టు ప్రక్కలగల ప్రజల ద్వారా వాటర్‌షెడ్ పథకాల అమలు కోరేటట్లు చేయవచ్చు. వర్గ కక్షలతో రక్తం కళ్ళ జూసుకొనే గ్రామాలలో ఈ విధమైన పద్ధతుల ద్వారా "బ్లడ్‌షెడ్ నుండి వాటర్‌షెడ్"గా మారడానికి కృషి చేయవచ్చును. వాటర్‌షెడ్ పథకాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మలచవచ్చును. కక్షలతో సతమతవుతున్న గ్రామాలకు ఇదే సరిఅయిన జవాబు. మహాత్మాగాంధీ కలలుకన్నట్లుగా వాటర్‌షెడ్ పథకాలవల్ల గ్రామ స్వరాజ్యం, స్వయం సంవృద్ధిని సాధించవచ్చు.

## 4.13. గ్రామాల ఎంపికలో అనుసరించాల్సిన పద్ధతులు :-

గ్రామాల్లో ప్రజల మధ్య గ్రూపులు, ముఠా తగాదాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రజలు ఐక్యం కావడానికి దోహదపడే లక్షణాలు ఇంకా వారిలో మిగిలి వున్నాయి.

వాటర్‌షెడ్ పథకాలకు గ్రామాల్ని ఎంపిక చేయడంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రకృతి – భౌతిక పరిస్థితులతోపాటు పథకాల్ని విజయవంతం చేసే ఐకమత్యం, సహకారం వంటి సాంఘికాంశాలను కూడా పరిగణలోనికి తీసుకుంటున్నాయి. ఉదాహరణకు అనంతపురం జిల్లాలోని ఆర్.డి.టి. సంస్థవారు వాటర్‌షెడ్ అభివృద్ధికి గ్రామాల ఎంపిక క్రింద అంశాల ఆధారంగా చేయుచున్నారు.

1. గ్రామంలో వాటర్‌షెడ్ అభివృద్ధికి అనుకూలమైన భౌగోళిక, పర్యావరణ పరిస్థితులు వుండాలి. దాదాపు 1000 ఎకరముల మెట్టభూమి వుండాలి. వంకలు, బోడికొండలు వుండాలి.
2. మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా, సర్వసభ్యసభ, సలహా సంఘము, కార్యనిర్వాహక వర్గము, వినియోగదారుల గ్రూపులు, స్వయం సహాయక గ్రూపులు, లేబర్ గ్రూపులు, ఏకాభిప్రాయసాధనతో, పోటీలు లేకుండా ఏర్పాటు చేసుకోగలిగి వుండాలి. ప్రతి కుటుంబము నుండి ఒక పురుషుడు, ఒక స్త్రీ రూ. 11 సభ్యత్వ రుసుము చెల్లించి సర్వసభ్య సంఘములో చేరాలి. గ్రామంలోని కుటుంబాలలో కనీసం 90% కుటుంబాలు నమోదు కావాలి.
3. నియమనిబంధనల ప్రకారం ప్రజల చందా ముందుగానే చెల్లించుటకు ఒప్పుకొని, చెల్లించవలయును.
4. గ్రామ ప్రజలలో ఐకమత్యం, సహకార భావం, వివిధ వర్గాలు, కులాల మధ్య మంచి సంబంధాలు, కలుపుగోలుతనము వుండాలి.
5. అందరికీ ఆమోదయోగ్యమైన సమిష్ఠి నాయకత్వం, ప్రజలను మంచి మార్గంలో నడుపగల నాయకులు, వారిలో కలుపుగోలుతనం వుండాలి.
6. పార్టీ రాజకీయాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయగలిగి వుండాలి.
7. గ్రామ ప్రజలతోపాటు యస్.సి. మరియు యస్.టి. ప్రజలు కూడా ఇష్టంగా పాల్గొనేటట్లుండాలి. వీరిరువురి మధ్య సఖ్యత, సంబంధాలు బాగుండాలి.

8. గ్రామాలలో ఎన్నిక కాబడిన సర్పంచ్, ఇతర పంచాయితీ మరియు ప్రజా ప్రతినిధుల సహకారము మరియు అంగీకారము వుండాలి.
9. ఆర్.డి.టి. వాటర్‌షెడ్ అభివృద్ధి మార్గదర్శక సూత్రాలను అర్థము చేసుకొని పాటించుటకు అందరూ సమ్మతించాలి.
10. కావలసినంత శ్రామికబలం గ్రామంలో వుండాలి. (కనీసం 50 మంది కూలీలు గ్రామంలో వాటర్‌షెడ్ పనులు చేయుటకు సిద్ధంగా వుండాలి).
11. గ్రామాభివృద్ధికి అవసరమైన సాంఘిక కట్టుబాట్లు చేసుకొని, వాటిని అమలు చేయగల పట్టుదల, సామర్థ్యం వుండాలి.
12. గ్రామంలో చేసిన పనులను ముందు సంరక్షించుకొను అభిలాష, పట్టుదల, సామర్థ్యం వుండాలి.
13. ఏర్పాటు చేసిన గ్రామసంస్థలను రాబోవు కాలములో శాశ్వతంగా నడుపుకొన గలిగిన ఉద్దేశ్యము, శక్తి సామర్థ్యాలు వుండాలి.
14. పై నిబంధనలకు లోబడి గ్రామస్థులందరి ఆమోదంతో ఆర్.డి.టి.కి దరఖాస్తు ఇవ్వవలయును.

**4.14. వాటర్‌షెడ్ గ్రామాల ఎంపికను తిరిగి రద్దు చేయదానికి, చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండాలి**

గ్రామంలో ప్రజలు ఎప్పుడైనా భాగస్వామ్య విధానంలో పాల్గొనడానికి నిరాకరిస్తున్నప్పుడు, వాటర్‌షెడ్ పథకం ఆ గ్రామానికి రద్దుచేయగల అవకాశం ఉండడంకూడా ఎంతో అవసరం. అయితే రద్దుగావించడానికి అనుసరించే విధానమంతా దాపరికం లేకుండా ఉండాలి. సహకరించని గ్రామాలకు వాటర్‌షెడ్ పథకాలు రద్దుపర్చడం వల్ల సహకరించే గ్రామాలకు కూడా ఒక అనుభవంగా ఉపయోగపడుతుంది. గ్రామప్రజలు కావచ్చు, లేదా ప్రభుత్యోద్యోగి కావచ్చు. ఎవరైనా ఆర్థిక అక్రమాలకు పాల్పడితే వారినుండి ఆ సొమ్మును రాబట్టటమే కాకుండా వారిపట్ల చట్టపర చర్యలు కూడా తీసుకోవాలి.

**5. వాటర్‌షెడ్ పథకం భాగస్వామ్య విధానం అమలు దిశగా..**

కొత్తమార్గదర్శక సూత్రాలకింద వాటర్‌షెడ్ పథకాలు అమలు జరపడం మొదలుపెట్టి దాదాపు నాలుగు సంవత్సరాలు దాటింది. ప్రస్తుతమున్న వాటర్‌షెడ్స్, అంతకు మునుపు అమలు పర్చినవి, వీటి అమలులో వచ్చిన అనుభవాలు, గుర్తించిన లోపాలు స్వీకరించి కొత్త వాటర్ షెడ్‌ల అమలులో పాఠాలుగా ఉపయోగించుకోవలసి వుంటుంది. పై అవరోధాలన్నింటినీ అధిగమించి, నిజంగా ప్రజలు ప్రధాన పాత్రధారులు చేయడానికి అవసరమైన యాజమాన్య పద్ధతులను అభివృద్ధి చేయవలసివుంటుంది.

వాటర్‌షెడ్‌లు సజావుగా అమలుపర్చే వీలుగా, ఎదురయ్యే సమస్యల్ని, అడ్డంకుల్ని అధిగమించడానికి కావలసిన సాంకేతిక, మానవ వనరుల యాజమాన్య పద్ధతుల్ని అభివృద్ధి పర్చాలి. ముఖ్యంగా ఈ దశలో అభివృద్ధి చేసిన వాటర్‌షెడ్లు ముందు కాలానికి మార్గదర్శకంగా వుండాలి. కాబట్టి కనీసం ఒక మండలంలో ఒక ఆదర్శ వాటర్‌షెడ్‌ను పూర్తి ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పర్చినా, పరిసర గ్రామాలపైన ఎంతో ప్రభావం ఉంటుంది. ప్రజలకు కేవలం మాటల్లోకాక భౌతికంగా చూపినపుడు మాత్రమేవారు స్పందించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆదర్శ వాటర్‌షెడ్‌ను చూడడానికి శ్రీ అన్నాహజారే ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన (మహారాష్ట్ర) రాలెగావ్ సిద్ధికి వెడుతున్నారు. చాలా సంవత్సరాలు ఆయన వ్యక్తిగత శ్రద్ధ, కష్టఫలితమే ఆ గ్రామాభివృద్ధికి కారణం. అనేక రకాలుగా రాలెగావ్ సిద్ధి ఒక నమూనాగా ఉంటూ దేశాన్ని ప్రభావితపరుస్తోంది. ఇటువంటి వాటికి తోడు సాధారణ (అన్నా సాహెబ్ అంతటి గొప్ప వ్యక్తులు లేకపోయినా) ప్రజలు

ప్రధాన పాత్రధారులుగా గ్రామస్థులు రూపొందించుకున్న అభివృద్ధి నమూనాల్ని సాధ్యమైనన్ని ఎక్కువగా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి నమూనా వాటర్‌షెడ్‌లు చాలామంది, సాధారణ గ్రామీణ ప్రజల్ని ప్రభావిత పరుస్తాయి. వారిని ఉత్సాహపరుస్తాయి.

వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో ప్రధానంగా మూడు ప్రధాన రంగాలు చిత్తశుద్ధితో, సమన్వయంగా పనిచేయవలసివుంది. అవి : (1) ప్రజలు (2) ప్రభుత్వం (3) స్వచ్ఛంద సంస్థలు. ఒక్కోరంగం ఒక్కోరకంగా శక్తివంతమైనది. ప్రజలు స్థానిక విజ్ఞానాన్ని కలిగి వుంటారు. ప్రభుత్వం వద్ద సాంకేతిక విజ్ఞానం ఉంటుంది. ఆర్థిక వనరులు ఉంటాయి. స్వచ్ఛంద సంస్థలు ప్రజల భాగస్వామ్య విధానం అమలులో కావలసిన పరిజ్ఞానం, ఎత్తుగడలు అనుభవం కలిగి ఉంటాయి. విజయవంతంగా వాటర్‌షెడ్ అభివృద్ధి జరగాలంటే ఈ మూడు రంగాల కలయిక చాలా అవసరం.

గత నాలుగు సంవత్సరాలలో వాటర్‌షెడ్ అభివృద్ధి రంగంలో ఆశించినంత ఫలితాలు సాధించలేకపోయినా, ఎందుకు ఫలితాలు సాధించలేకపోయాం, ఏఏ అవరోధాలున్నవి, వాటిని ఏ విధంగా అధిగమించగలమో సమగ్రంగా చర్చించి, పరిశోధించి, పాఠాలు నేర్చుకోవాలి. నేర్చుకొన్న పాఠాలను ఆచరణలో పాటిస్తూ ఈ దశనుండి విజయవంతంగా వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుపుటకు అన్ని రంగాల వారు కృషి చేయవలసివుంది. ఇప్పటి నుండి అయినా వాటర్‌షెడ్ అభివృద్ధిలో ప్రజలను ప్రధాన పాత్రధారులను చేయడానికి సమాయత్తం కావలసివుంది.

*– కదలిక జూన్ – 99 సంచిక నుండి*

# అనంతలో నీటి సంక్షోభం - తక్షణ స్పందన అవసరం

అనంతపురం జిల్లాలో కరువు విలయ తాండవం చేస్తోంది. దేశంలోనే అతితక్కువ వర్షపాతం గల జిల్లాల్లో అనంతపురం రెండవది. దక్షిణ భారతదేశంలో ఎడారీకరణ వేగంగా జరుగుచున్న ఏకైక జిల్లా అనంతపురమే. ఈ జిల్లాలోని గ్రామాలలో ప్రజలు ఇంకా జీవిస్తున్నారంటే అదేదో మొండిశక్తి వారిని జీవించేటట్లు చేస్తుందే తప్ప – ఇక్కడ వాతావరణ, వ్యవసాయ పరిస్థితులు కాదు. త్రాగడానికి నీళ్ళు లేకపోయినా జీవించగలిగేలా ప్రజలు రాటు దేలిపోయారు.

అనంతపురం జిల్లాలో కరువు సమస్య, దారిద్ర్యసమస్య, వ్యవసాయ సంక్షోభం, నీటికొరత కొత్త సమస్యలు కాకపోయినా, వాటి తీవ్రత ఊహించనంతగా ఎక్కువైపోయింది. గత 5 సంవత్సరముల నుండి ఇటువంటి దారుణ పరిస్థితి రాబోతోందని చాలా హెచ్చరికలు చేస్తున్నంతగానే ఆ పరిస్థితి రానే వచ్చేసింది. ఇప్పటికే మనం ఎక్కవలసిన రైలు దాదాపు వెళ్ళిపోయింది. ఇప్పుడు మనం ఈ పరిస్థితి నుండి కొంతైనా బయటపడాలంటే, రైలు వేగాన్నిమించి పరుగెత్తి, ముందు స్టేషన్లో ఎక్కే ప్రయత్నం చేయాలి. అదెలా సాధ్యమో ఆలోచించి ఆచరించాలి. ఇప్పుడూ ఆలస్యం చేస్తే ముందుకు పరిష్కారమే వుండదు. జిల్లాలో జీవనమేసాగదు.

జిల్లాలో కరువు, ఎడారీకరణ, దారిద్ర్యం, వ్యవసాయ సంక్షోభం ఈ సమస్యలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడివున్న బ్రహ్మముడిలాంటి చిక్కు సమస్యలు. కానీ పరిష్కార దిశలో నీరు ఒక ముఖ్యభూమికను పోషించే కీలక అంశం. కాబట్టి జిల్లా నీటిసమస్య – సాధ్యాసాధ్యాలపై అత్యంత త్వరితగతిన స్పందించాల్సిన అవసరంవుంది.

జిల్లాలో నీటి వినియోగం పై ఒక సమగ్ర అవగాహనతో ఆచరణ ప్రణాళికను పాటించవలసివుంది. జీవనానికి, వ్యవసాయానికి నీటి లభ్యతను క్రింద తెల్పిన నాలుగు రకాలుగా విభజించి చూడాలి. ఆ నాలుగు రకాలు ఏవంటే (1) పడే వర్షాన్ని ప్రత్యక్షంగా పంటలకు ఉపయోగించుకొనే నీరు. అంటే వేరుశనగ, కందిలాంటి వర్షాధార పంటలకు వినియోగమయ్యే ప్రత్యక్ష వర్షపునీరు. (2) ఉపరితల నీరు – అంటే మనం కుంటలలోను, చెరువులలోనూ, కొంతకాలం నిల్వచేసుకొని వినియోగించు కొనే నీరు (3) భూగర్భజలం అంటే వర్షంద్వారా, కుంటలు చెరువులు నిండడం ద్వారా నీరు భూమిలోకి ఇంకి తర్వాత బావుల, బోర్ల ద్వారా వినియోగించుకొనే నీరు. (4) నదీ జలాలు అంటే జిల్లా బయటనుండి నదీ జలాలమళ్ళింపు ద్వారా రప్పించి వినియోగించుకొనే నీరు. ఈ నాలుగు రకాల నీటి లభ్యత మధ్య సమన్వయం చేసి, సాధ్యమైనంత సమతుల్యంతో ఒకదానికొకటి అదనంగానూ, అనుబంధంగా అనుసంధానంచేసి, వినియోగిస్తే తప్ప అనంతపురం జిల్లా కనీస నీటి అవసరాలు తీరవు.

పై నాలుగు రకాలుగా లభ్యమయ్యే నీటిని ఏమాత్రం వృధాకాని విధానాలను పాటించి, జిల్లా అంతటికీ సమతౌల్యంగా పంపిణీ జరిగే విధానాలు పాటిస్తూ, నాలుగు రకాల నీటి వినియోగాన్నీ

సమన్వయం చేయవలసివుంది. దీనినే conjunctive use of water అంటారు. అంటే ఏ ఒక్క రకము లభ్యతపైనా అధికంగా ఆధారపడకుండా, అన్ని రకాల నీటి లభ్యతలపై సమతౌల్యంగా, అనుబంధంగా ఆధారపడే విధంగా సమన్వయంతో అనుసంధానం చేయడం.

వ్యవసాయ కమీషన్ రెకమెండేషను ప్రకారం ఒక ప్రాంతంలోని వ్యవసాయ భూమిలో కనీసం 30శాతం వ్యవసాయం viable గా వుంటుంది. అంటే కనీసం 30శాతం వ్యవసాయభూమి ప్రతి గ్రామంలోను నమ్మదగిన నీటిపారుదల సౌకర్యం కలిగి ఉండాలి. కానీ మన జిల్లా అత్యల్ప వర్షపాతానికి, అనంతమైన కరువులకు, ఎడారీకరణకు నిలయం. అంటే వర్షాధార వ్యవసాయం ఇతర ఏ జిల్లాతో పోల్చుకొన్నా, మన జిల్లాలోని వ్యవసాయం మాయజూదంలాంటిది. కాబట్టి వ్యవసాయ కమిషన్ రెకమెండేషన్ కంటే ఇంకొంత ఎక్కువభాగం నమ్మదగిన నీటిపారుదల క్రిందకు తెచ్చుకొన్నప్పుడే ఈ జిల్లాలో వ్యవసాయానికి మనుగడ వుంటుంది.

కాబట్టి పై నాలుగు రకాల నీటి లభ్యత సక్రమంగా వినియోగించుకొని ప్రతి గ్రామంలోను కనీసం 40 శాతం వ్యవసాయ భూమికి నీటి వసతి కల్పించే విధంగా మిగిలిన 60 శాతం వర్షాధార వ్యవసాయ దిశగా ఆచరణ ప్రణాళిక చేపట్టాలి. అనంతపురం జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ 40 శాతం వ్యవసాయభూమికి నీటి వసతి అనుకోవడం, కనీసస్థాయి అవసరాన్ని సూచించడానికే గానీ, దాంతో మన జిల్లా సస్యశ్యామలమవుతుందని మాత్రం కాదు.

ఈ 40 శాతం వ్యవసాయభూమికి నీటి వసతి కల్పించడానికి గ్రామాన్ని ఒక ప్లానింగ్ యూనిట్‌గా తీసుకొని ప్లానింగ్ చేసినప్పుడు నీటి లభ్యత సమతుల్యంగా పంపిణీజరిగి, ఫలితం జిల్లా అంతటా వ్యాపిస్తుంది. అట్లాగాకుండా అనంతపురం జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని ప్లానింగ్ చేసినప్పుడు, కొన్ని ప్రాంతాలు నీటిపారుదల లేకుండా జిల్లాలో అసమానతలు ఏర్పడతాయి. ఇప్పటికే ఈ అసమానతలు జిల్లాలో ఏర్పడినాయి. ఈ అసమాన నీటిపంపిణీ విధానం అనంతపురం జిల్లావ్యాప్తమైన కరువు, ఎడారీకరణ, దారిద్ర్య, వ్యవసాయసమస్యలను తీర్చలేదు.

ప్రస్తుతం అనంతపురం జిల్లాలోని అధికభాగం గ్రామాలలో నీటిపారుదల 8శాతంకంటే తక్కువగా వుంది. ఒక్క నీటి సౌకర్యంగల గ్రామాలలో మాత్రమే అంతకంటే ఎక్కువవుంటుంది. చెరువుల వల్ల నీటిపారుదల దాదాపు లేనట్టే. ఇటువంటి పరిస్థితులలో ప్రతి గ్రామంలోను దాదాపు 40 శాతం నీటి వసతి కల్పించే విధంగా ఆచరణాత్మక ప్రణాళిక చేసి అమలుచేయాలి. ఈ దశలో ఆలోచన చేసినప్పుడు, నాలుగు రకాల నీటి లభ్యత ప్రతిరకానికీ తగిన ప్రాధాన్యతయివ్వవలసి వుంటుంది. ఏ రకమైన నీటి లభ్యతను అశ్రద్ధచేసినా నీటి సమస్య తీరే అవకాశం లేదు. ఈ దశలో నీటి పరిష్కారాన్వేషణలో కొన్ని త్వరితగతిన చేపట్టవలసిన కార్యాలను ఇక్కడ పేర్కొనడం జరిగింది.

**1. ప్రత్యక్షంగా పంటలకు ఉపయోగపడే వర్షనీటి వినియోగం :-**

మెట్టభూములలో వర్షపు నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకొనుటకు, భూసారాన్ని మరియు తేమను పంటభూములలో సక్రమంగా నిల్వయుంచుకొని, నీటి ఎద్దడికి కొంతమేరకైన తట్టుకొనే విధంగా భూసార సంరక్షణ, చెట్ల పెంపకంలాంటి కార్యక్రమాలను విస్తృతంగా జిల్లా అంతటా చేపట్టాలి. వ్యవసాయ విధానంలో కూడా కాంటూరు, వ్యవసాయ నీటి కోతలు అరికట్టే గల్లీ కంట్రోలు పనులు, భూసార మరియు తేమ సంరక్షణ కార్యక్రమాలూ చేపట్టాలి. అనువైన చోట్లంతటా చెక్‌డ్యాములు నిర్మించాలి. పంట మార్పిడి, మిశ్రమపంటలు, సాంవత్సరిక పంటలతో పాటు, దీర్ఘకాల వర్షాధార వృక్షపంటలైన చింత, మామిడి లాంటి పంటలను పెడుతూ, వర్షాధార వ్యవసాయం చేయవలసి వుంటుంది. ప్రస్తుతం

మన జిల్లాలో అమలవుతున్న వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు సక్రమ పద్ధతిలో, నిజమైన ప్రజాభాగస్వామ్యంతో అమలుజరిపితే పంటలకుపయోగపడే వర్షపునీటిని సాధ్యమైనంత సద్వినియోగం చేసుకోవచ్చు. దీనివల్ల వర్షాధార వ్యవసాయానికి కొంతవరకూ ఊరట కలుగుతుంది. కానీ కరువు, నీటి సంక్షోభానికి ఇది చాలినంత పరిష్కారం మాత్రం కాదు.

**నదీజలాలు, ఉపరితల నీటి వసతుల అభివృద్ధి – వినియోగము :-**

అంటే మనజిల్లాలో ఇప్పటికే ఉన్న చెరువులను, కుంటలను పూర్తిగా పునరుద్ధరించి, వాటికితోడుగా వీలైనన్నిచోట్ల కొత్త వాటిని నిర్మించి ఉపరితల నీటి పరిమాణాన్ని బాగా పెంచవలసి వుంటుంది. ఈ విషయంలో మనం గతకొన్ని దశాబ్దాలుగా చేసిన నిర్లక్ష్యం ఇప్పటికే క్షమించరానిది. భౌగోళికంగా, సాంకేతికంగా వీలైనంత వరకూ, ప్రతి గ్రామానికి ఉపరితల నీటి నిల్వకు వసతులు ఉండే విధంగా చెరువులకు, కుంటలకు కట్టవలసివుంటుంది. ఇక్కడ ఇంకొక కీలకమైన విషయం నదీజలాలు, మన జిల్లా బయట నుండి నీరు తుంగభద్ర లేదా కృష్ణనదుల నుండి మనం తెచ్చుకోగలగాలి. దాదాపు 40 శాతం వ్యవసాయ భూమిని నమ్మదగిన సాగునీటి క్రిందకు తీసుకొనిరావడానికి భూగర్భ జలాలతోనూ మరియు మన జిల్లా వర్షపాతంతో సమకూర్చుకోగల ఉపరితలనీటితో పాటు నదీజలాలు కీలకం. ఆ విధంగా మనం తెచ్చుకోగలిగిన నీటిని మొదటి ప్రాధాన్యతగా జిల్లాలో వర్షాలకు అరకొరగా నిండే చెరువులను నింపేదానికి, మంచినీటి సౌకర్యాలకు ఉపయోగించవలసిఉంది. చెరువులనన్నింటినీ నింపిన తరువాత మిగిలిన నీటినే ప్రత్యక్ష పారుదలకు కాలువ ద్వారా వినియోగించుకోవాలి. అవసరమైనప్పుడు అనువైనంతలో ఉపరితల నీటిని, వర్షధారపంటలకు కూడా వొరుపులో కొంత ఉపయోగించవచ్చును. దీనినే Life Saving Irrigation అని అంటారు.

కాబట్టి మన జిల్లా నీటి అవసరాలు తీర్చడానికి కొంత భాగము నదీజలాలు తప్పనిసరి, అయితే వాటి వినియోగం గ్రామ చెరువుల ద్వారానే జరగాలి. అప్పుడు ఇక్కడపడే వర్షపు ఉపరితల నీటి నిల్వలతో నదీజలాలు అనుసంధానమై సమన్వయ వినియోగం (Conjunctiv-euse) జరుగ గలదు. ఇటువంటి అనుసంధానమైన సమన్వయం నీటి కొరతను కొంతవరకూ తీర్చడానికి మరియు పంపిణీలో సమతౌల్యానికి, అత్యంత అవశ్యకము, అనివార్యము కూడా, చెరువుల నుంచి ఉపరితల నీరు ప్రత్యక్ష వ్యవసాయానికి తగిన విధంగా ఉపయోగపడుతూ భూగర్భజలాల పెంపునకు బాగా తోడ్పడుతుంది.

**భూగర్భ జలాల అభివృద్ధి వినియోగం :-**

భూగర్భజలాలను అభివృద్ధి చేయడానికి అనంతపురం జిల్లాలో ఎడారి దిశగా క్షీణిస్తున్న పర్యావరణ పరిస్థితులను బాగా అభివృద్ధి చేయాలి. పర్యావరణాన్ని అభివృద్ధి చేయడంలో, ఇంతకు ముందే చెప్పిన పంట భూముల అభివృద్ధి వ్యవసాయ పద్ధతులతో పాటు, అడవులను, అభివృద్ధిచేయడం, బోడికొండలను, గుట్టలను బాగా పచ్చదనం చేయడం చాలా అవసరం. ఫారెస్టు కమీషన్ రెకమెండేషను ప్రకారం, ఒక ప్రాంతంలోని మొత్తం విస్తీర్ణంలో దాదాపు 30 శాతం జీవవైవిధ్యంగల పచ్చదనం వున్నప్పుడే, పర్యావరణ పరిస్థితులు సమతౌల్యంగా వుండి వ్యవసాయ మనుగడ జరుగుతుంది. ప్రస్తుతం మన జిల్లాలో పేపరుపై దాదాపు 11 శాతం రిజర్వుఫారెస్టు ఉన్నా నిజానికి 2 శాతం కూడా అడవులనదగ్గ వృక్షసంపద లేదు. మొదట ప్రాధాన్యంగా రిజర్వు ఫారెస్టునంతా వృక్షసంపదను జాయింట్ ఫారెస్టు మేనేజిమెంటు లాంటి ప్రజా భాగస్వామ్య విధానంలో పెంచి శాశ్వత ప్రాతిపదికమీద సంరక్షించుకోవలసి వుంటుంది. అంతే ప్రాధాన్యతతో మన జిల్లాలో వున్న బోడికొండలు, గుట్టలు, చౌడుభూములుగా ఉన్న

మైదానభూములు ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనాన్ని తీసుకొని రావడముతో పాటు, వాటిని ఉత్పాదకవనాలుగా మార్చి (Farm Forestry or Forest Farming) భూమిలేని పేదలకు సన్న, చిన్నకారు ఫలసాయపు పట్టాలు ఇవ్వాలి. ఇప్పటికే భూసారం బాగా కొట్టుకొనిపోయిన కొండల మీద కూడా ట్రెంచింగ్ చేయడం ద్వారానూ, భూమిని సడలించడానికి అనువైనచోట్ల బ్లాస్టింగ్ చేయడం ద్వారాను, ఈ క్షీణించిన బోడి కొండలలో కూడా తిరిగి తేమ సామర్థ్యాన్ని పెంచి, పచ్చదనాన్ని, ఉత్పాదకతను సాధించవచ్చునని చాలా చోట్ల నిరూపించబడింది. వృథాభూములు (Waste Land) ఎక్కడాలేవు, వృథాగా పడివున్న (Wasted Land) భూములే వున్నాయని అనుభవం చెప్పుతోంది. మన ప్రాంతంలో ఎటువంటి భూములలోనైనా, మొదటి రెండుమూడు సంవత్సరాలు ఎండాకాలపు నీటితడుపు సంరక్షిస్తే, తర్వాత వర్షాధారంతో బ్రతికి, ఆదాయాన్నివ్వగల వృక్షజాలం వుంది. సీతాఫలం, కలబంద, తుమ్మ, చింత, కానుగ, బోదగడ్డి లాంటి మొక్కలను అనువైన విధంగా నాటి బ్రతికించుకోగల్గితే బీదవర్గాలకు కొంత ఫలసాయంతో పాటు గ్రామ ప్రజల అవసరాలుకూడా తీరుస్తూ, పర్యావరణానికి ఎంతో ఉపకరిస్తాయి. పండ్ల తోటల పెంపకం ద్వారా కూడా పచ్చదనం పెరిగి పర్యావరణ క్షీణింపునరికట్టాలి. ఆవిధంగా పర్యావరణాన్ని అభివృద్ధిచేసినప్పుడు మనకు పడే కొద్దిపాటి వర్షాన్ని భూమిలోనికి చొప్పించుకొని భూగర్భజలాలు వృద్ధి అయ్యే అవకాశం ఉంది. తద్వారా భూసారసంరక్షణ కూడా జరిగి నేలలో తేమ పెరుగుతుంది. పర్యావరణ అభివృద్ధితో పాటు ఇంతకు ముందు చెప్పిన చెరువుల పునరుద్ధీకరణ చేసినప్పుడు, తగుమాత్రంగా భూగర్భజలాలను వృద్ధి చేసుకోవచ్చును. తద్వారా సాగుచేసుకొనుటకు అవకాశము ఉంది. మన జిల్లాలో పారుతున్న పెన్న, చిత్రావతి, హగరి, మద్దిలేరు మొదలగు నదులలోవున్న ఇసుకపొరలద్వారా, పరివాహక ప్రాంతంలోని పై మట్టిలో ఉన్న భూగర్భజలం తరిగిపోతుందని చాలా మంది శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. ఈ విధంగా నది ఇసుకపొరల గుండా నీరు దిగువ ప్రాంతాలకు తరలిపోవడం ఫిబ్రవరి నుంచి మొదలై ఎండాకాలంలో ఎక్కువగా జరుగుతున్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇటువంటి నీటిని నదులలో ఉన్న ఇసుక పొరలలో భూగర్భవారధులు (Sub-Surface dams) తక్కువ ఖర్చుతో బంకమట్టితో కట్టటం వలన నివారించుకోవచ్చునని శాస్త్రజ్ఞులు ఎప్పుడో సెలవిచ్చారు. ఇటువంటి బంకమట్టి అవరోధాలను నదుల పొడవునా కట్టి ఒక తీరానవున్న గ్రామాలకు ఫిల్టర్ పాయింట్స్ ద్వారా ఈ నీటిని ఎండాకాలంలో కూడా వినియోగించుకొనవచ్చు. ఈ నీటి వినియోగం నదీతీర గ్రామాలలో వ్యవసాయానికి ఎంతో ఊరట కలిగిస్తుంది. ఈ రకమైన భూగర్భజలం దాదాపు పూర్తిగా మనం ఉపయోగించుకోవడం లేదు.

పంటలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే నీరు, ఉపరితలం పై చెరువులలో ఒడుపుకొన్న నీరు, భూగర్భజలాలు, బయటనుంచి వచ్చే నదీజలాలు ఒక దానికొకటి అదనంగానూ, అనుబంధంగానూ శాస్త్రీయపద్ధతిలో అనుసంధానం చేసే వినియోగమును అనుసంధాన నీటి వినియోగం (Conjunctive use of available water) అంటారు.

అనంతపురం జిల్లాకు నదీజలాలు మళ్ళింపు ఒక్కటే ఏకైక పరిష్కారమని కొంతమంది గట్టిగా వాదిస్తున్నారు. మన జిల్లాలో దాదాపు తొమ్మిది లక్షల హెక్టార్ల భూమితో సాగుచేయడం అనేది ఎంత వరకూ సాధ్యమో వాస్తవ దృక్పథంతో, ఈ నీటి వివాద కాలంలో ఆలోచన చేయవలసివుంది. మరికొందరైతే అనంతపురం జిల్లాకు వాటర్‌షెడ్ కార్యక్రమాలు జిల్లా జీవన సంక్షోభానికి ఏకైక పరిష్కారమా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు రకాల వాదనలూ విడివిడిగా అసంపూర్ణ, అసమగ్ర, అసాధ్యపరిష్కారాలనిపిస్తుంది. ఈ రెండింటిని తగు విధంగా సమన్వయం చేసి, ఇతర అనువైన

పాడిపరిశ్రమ, పశుసంపద, వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమలు మొదలగు మార్గాలనుకూడా జోడించితే మనజిల్లాకు మనిషి బ్రతికే కనీస పర్యావరణ వ్యవసాయ పరిస్థితులేర్పడతాయి. ఇవన్నీ చేసినా కేవలం వ్యవసాయం పైననే మన జిల్లా గ్రామీణ ప్రజలంతా నిరంతరం సస్యశ్యామలంగా, సుఖసంతోషాలతో ఉండడం జరగదు. కానీ కరువు సంక్షోభం మాత్రం కొంతవరకూ తీరుతుంది.

పై దిశలో కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని త్వరితగతిన పాటించవలసివుంది. నదీజలాలను ఇతర జలాలతో అనుసంధాన వినియోగమును దృష్టిలో పెట్టుకొని కనీసస్థాయిలోనైనా రప్పించడానికి అవసరమైన పోరాటము చేయవలసి వుంటుంది.

మరి కరువు అనే ఈ పిల్లికి గంట ఎవరుకడతారు? మనము, మన జిల్లా యంత్రాంగము, పాలకులు అందరం ఎలకలలాగానే వున్నాం. ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వయంత్రాంగం దానంతటదే పిల్లికి గంటకడుతుందని ఆశిస్తే అది జరగదు. ఇది మన స్వాతంత్ర్యం తరువాత చరిత్ర చెప్పిన సత్యం. మరి మన పాలకులేమైనా పార్టీరాజకీయాలకు అతీతంగా అటువంటి పనిచేస్తారా అంటే అందుకవసరమైన రాజకీయ సంకల్పం (Political will) ఉన్నట్లు ఈ అయిదు దశాబ్దాలుగా కనబడలేదు. ఇక ప్రజల విషయానికొస్తే, వాగ్దాన వర్షపు జల్లుల సుభిక్షంలో మునిగిపోయి, కరువుబారి నుంచి పాలకులు, ప్రభుత్వం తమను రక్షించి సస్యశ్యామలంలో వుంచుతారని నమ్మి నిశ్చేష్టులుగా ఇన్నేళ్ళుగడిపారు. కరువు తీవ్రతబాగా పెరిగి, నీటి సంక్షోభం ఉధృతమై, ఎడారి ఛాయలు బాగా వెన్నుతట్టి, శుష్కవాగ్దానాల మత్తుకొంత తగ్గి తాము విషవలయంలో చిక్కుకున్నట్టు ఇప్పుడే గుర్తిస్తున్నట్లుంది. అయినా ఈ సమస్య పరిష్కారం ప్రభుత్వం, పాలకులు, ప్రజలు ఏ ఒక్కరిలోనో లేదు. అందరిలోను ధృడసంకల్పం కలిగి అందరూ కదిలి చిత్తశుద్ధితో, ఒక నిర్ధిష్ట అశయంతో రాజీలేని కృషి చేసినప్పుడే మన జిల్లానీటి సంక్షోభం కొంతైనా తీరుతుంది. ఇదంతా అత్యంత త్వరిత గతిన చేయవలసి వుంటుంది. లేదంటే మనం ఎక్కవలసిన రైలును శాశ్వతంగా పోగొట్టుకుంటాం. చూస్తుండగానే ఎడారి ఇసుక దిన్నెల సుడిగాలిలో కొట్టుకొనిపోతాం.

– కదలిక ఏప్రిల్ –99 సంచిక నుండి

# అనంతకరువు బహుముఖ చిత్రం - పరిష్కారాలపై ఓ సమాలోచన

## 1. పరిచయం

అనంతపురం జిల్లాను పట్టి పీడిస్తున్న జటిల సమస్య కరువు. వర్షాధార వ్యవసాయంపై – ఈ జిల్లాలో ప్రతి పది సంవత్సరాలలో కనీసం 6 సంవత్సరాలు కరువుకు గురవుతుంటాయి. సాధారణంగానే దాదాపు 45 శాతం ప్రజలు దారిద్ర్యానికి గురైయున్న ఈ జిల్లాలో కరువు ప్రభావం వల్ల దారిద్ర్యం ఉధృతమై, బీదవర్గాలను, సాధారణ రైతులను ఛేదించుకోలేని విషవలయంలోకి నెట్టివేసింది. గ్రామీణ రైతాంగం, రైతుకూలీలు ఛిన్నాభిన్నమై, నిరాశా నిస్పృహలతో జీవచ్ఛవాలుగా మారిపోతున్నారు. ఈ పరిస్థితుల నుండి బయట పడడానికి ఒక నిర్ధిష్టమైన కార్యాచరణ ప్రణాళిక కూడా ప్రభుత్వము దగ్గర లేదు. నామమాత్రంగా చెప్పుకోదగ్గ కార్యక్రమాలెన్నో వున్నా అవి పొంతనలేకుండా, చిందరవందరగా, గమ్యరహితంగా ఉన్నాయి. ఆ కార్యక్రమాల అమలులో కూడా అనేక లోపాలుంటూ తాత్కాలిక కనీస ఉపశమనం కూడా మన జిల్లాలో కరువైంది. అంతేగాక పర్యావరణ పరిస్థితులు క్షీణించి, వేగంగా ఎడారీకరణ జరుగుచున్నట్లు తెలుస్తున్నది.

మన జిల్లాలో కరువు స్వభావ స్వరూపాన్ని, పర్యావరణ, వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, శాశ్వత ఉపశమనానికి నిర్ధిష్ట మార్గాలను, ప్రాధాన్యతలను గుర్తించి, నిర్దిష్ట కాలవ్యవధి గల కార్యాచరణ ప్రణాళికతో కట్టుదిట్టమైన ప్రజల పాత్రధారణగల అమలు విధానాన్ని పాటిస్తేనే కరువుకు చరమగీతం పాడవచ్చు. గ్రామస్థాయిలో, ఉద్యమ స్ఫూర్తితో, క్రమశిక్షణతో తక్షణమే ప్రజలు కార్యరంగంలోకి దిగవలసివుంది. తదనుకూలంగా ప్రభుత్వమూ, రాజకీయ నాయకులూ, ఇతర సంస్థలూ స్పందించవలసి వుంది. అన్ని వర్గాలు, రంగాలు కలిసికట్టుగా అలుపెరుగని పోరాటం చేయడమే తక్షణ కర్తవ్యం.

## 2. అనంతపురం జిల్లా కరువు స్వభావ స్వరూపాలు :-

అనంతపురం జిల్లా ఎడారిగా మారుతున్నట్లు గుర్తించబడింది. జిల్లాలో పడే సరాసరి వర్షపాతం 522 మి.మీ. కానీ జిల్లాలోనే అతితక్కువ సగటు వర్షపాతం 250 మి.మీ. మాత్రమే ఆత్మకూరు – కూడేరు మండలాలలో పడుతున్నది. కదిరి, పుట్టపర్తి, హిందూపురం, మడకశిర ప్రాంతంలో దాదాపు 600 మి.మీ.ల సగటు వర్షపాతం పడుచున్నది. అంటే జిల్లాలోనే వర్షపాతంలో వివిధ ప్రాంతాల సగటు వర్షపాతంలో వ్యత్యాసాలు ఎక్కువగా (దాదాపు 250మి.మీ. నుండి 650 మి.మీ) వున్నాయి.

సాధారణంగా 750 మి.మీ. సగటు సాంవత్సరిక వర్షపాతానికి తక్కువగల ప్రాంతాలను ప్రభుత్వము కరువు ప్రాంతాలుగా గుర్తిస్తుంది. 375 మి.మీ. సగటు వర్షపాతానికి తక్కువగల ప్రదేశాలను (Arid Zone) సగం ఎండబారిన ప్రాంతంగానూ పేర్కొంటారు. మన జిల్లా తీవ్ర కరువు ప్రాంతంగా గుర్తించబడింది. అంతేగాదు, ఎడారీకరణ ప్రక్రియలో వున్నట్లు గుర్తించబడింది.

### 2.1. కరువు – దుర్భిక్షం (Famine)

ఈ మధ్యకాలంలో కరువు అనే పదాన్ని సాధారణంగా వాడుచున్నాం. ఇంతకు ముందు కరువు మరియు దుర్భిక్షం (Famine) అంటే అతివృష్టి వలననో లేక అనావృష్టి వలననో పంట నష్టపోవడం. నలభై సంవత్సరాల క్రిందట జిల్లా అంతటా కేవలం తిండి గింజలైన సజ్జ, జొన్న, కొర్ర, సాములతో పాటు వివిధ రకాలైన పప్పుధాన్యములను వర్షాధారముపై పండించేవారు. బావుల క్రింద, చెరువుల క్రింద ఉన్న కొద్దిపాటి సాగు భూమిలో వరి, రాగి, జొన్న, కూరగాయలు, పండించేవారు. వాణిజ్య వ్యవసాయం చాలా తక్కువ. దీనినే Subsistance వ్యవసాయంగా పరిగణించేవారు. వర్షాధారం పైన గాని, సాగునీటి ద్వారా గానీ వ్యవసాయమంటే తిండి గింజలు పండించడమే ఆ కాలంలో వుండేది. ఈ తిండి గింజల వ్యవసాయంలో ఒక సంవత్సరం కరువు వచ్చినా తట్టుకొనేంత తిండి గింజలు గ్రామంలో రైతులవద్ద నిల్వ వుండేవి. కూలీ కూడా ధాన్యరూపంలోనే వుండేవి. కాబట్టి కరువు వచ్చినా దాని ప్రభావం తక్కువగా వుండి రైతులూ, కూలీలు కూడా కొంతవరకు తట్టుకొనగలిగేవారు. అయితే వరుసగా రెండవ సంవత్సరం కూడా కరువు వచ్చినప్పుడు మాత్రం తిండి గింజలు లేక గంజి త్రాగి బ్రతికేవారు. దీనినే దుర్భిక్షం లేక తిండి కరువు మరియు గంజి కరువుగా కూడా పిలిచేవారు. ఒక్కొక్కసారి వరుసగా మూడవసారి కూడా కరువువచ్చి భారీగా ఆకలి చావులుండేవి. 1876-77వ సంవత్సరంలో ఇటువంటి దుర్భిక్షంలో మనజిల్లాలో దాదాపు 40 శాతము జనాభా చనిపోయినట్లు కొన్ని రికార్డులు చెపుతున్నాయి.

## 2.2. అనంతపురం జిల్లాలో నైరుతి మరియు ఈశాన్య ఋతుపవనాల ప్రభావం :-

మన జిల్లాలో వర్షాకాల వ్యవధి (Duration) చాలా తక్కువ. సాధారణంగా జూన్ మొదటివారంలో నైరుతి ఋతుపవనాల ద్వారా వర్షాకాలం మొదలవుతుంది. ఈ నైరుతి ఋతుపవనాల ప్రభావం సెప్టెంబరు వరకూ వుంటుంది. కానీ సాధారణంగా నైరుతి ఋతుపవనాల ప్రభావంవల్ల ప్రారంభంలో కొంత ఆశాజనకంగా వర్షాలు కురిసినా ఆగస్టు-సెప్టెంబరునెలలకు ఋతుపవనాలు బలహీనమై వర్షాలు అపనమ్మకంగా వుంటున్నాయి. నైరుతి ఋతువపన కాలంలో గాలులు నైరుతి దిశనుండి ఈశాన్యం వైపునకు వస్తాయి. అరేబియా సముద్రతీరమున ఉన్నపడమటి కనుమలు ఎత్తుగా ఉండుటవలన, మరియు పడమటి కనుమలలో వృక్షసంపద యింకా వున్నందువల్ల, నైరుతి ఋతువపనాలవల్ల ఆ ప్రాంతంలో ఎక్కువగా వర్షాలు పడుతున్నాయి. వాటితో తుంగభద్ర, కృష్ణనదులు పారి, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులకు నీరందుతుంది. కానీ ఋతుపవనాలు అనంతపురం చేరేటప్పటికి బలహీనమై పోతాయి. అరేబియా సముద్రతీరానికి అనంతపురానికి మధ్య దూరం దాదాపు 350 కి.మీ. వుంటుంది. పడమటి కనుమల ఎత్తుకూడా సముద్రమట్టమునకు బాగా ఎత్తుగా వుండి, అనంతపురం జిల్లా వచ్చేటప్పటికి సముద్రమట్టము నుండి ఎత్తు తగ్గిపోవడం వలన కూడా ఋతువపనాలు బలహీనపడవచ్చు. అక్టోబరునుండి ఈశాన్య ఋతుపవనాల ద్వారా వర్షాకాలం మొదలై నవంబరు వరకూ వుంటుంది. ఈ ఋతుపవనాల ప్రభావంగా బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడి తూర్పుకోస్తా ప్రాంతంలో వరదలు ఏర్పడినపుడు వాటి ప్రభావం వలన అనంతపురం జిల్లాలో జల్లులుగానీ ఒకమోస్తరు వర్షాలుగానీ పడతాయి. ఈశాన్య ఋతుపవనాల వలన బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడినపుడు తూర్పుతీర ప్రాంతాలలో ఎక్కువ వర్షాలు పడుతాయి. అక్కడ వరదలు కూడా వస్తాయి. కానీ బంగాళఖాతంలో తీరాన్నంటిన వాయుగుండాల ప్రభావం, వాయువ్యదిశగా ప్రయాణించి రానురాను బలహీనమై అనంతపుం చేరేటప్పటికి బలహీనమై ఏ కొద్దిపాటి వర్షమో ఇక్కడ పడుతుంది. బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండాలు, ఉత్తర తమిళనాడు తీరప్రాంతాన్ని తాకి, వాయువ్య దిశగా పయనించినపుడే వాటి ప్రభావం వల్ల అనంతపురం జిల్లాలో కొంత వర్షం పడుతుంది. అదే ఆంధ్ర

తీరప్రాంతంలో వాయుగుండాలు తాకినపుడు ఉత్తరాంధ్రలోనూ, తెలంగాణాలోనూ వర్షాలు పడతాయి. వాటి ప్రభావం అనంతపురంపై అంతగా వుండదు.

## 2.3. అనంతపురం జిల్లా వర్షచ్ఛాయా ప్రాంతము (Rain-Shadow area)

బంగాళాఖాత సముద్రతీరానికి (నెల్లూరుకు), అనంతపురానికి కూడా దాదాపు 330 కి.మీ. దూరం వుంటుంది. అటు అరేబియా సముద్రతీరానికి, ఇటు బంగాళాఖాత సముద్రతీరానికి దాదాపు సమదూరంలో అనంతపురం జిల్లా వుండటంవల్ల, ఈ రెండు సముద్ర తీరాలనుండి వచ్చే ఋతుపవనాల ప్రభావం ఇక్కడికొచ్చేటప్పటికి బలహీనమై పోతున్నది. అందుకనే ఈ ప్రాంతాన్ని వర్షచ్ఛాయా ప్రాంతం (Rain-shadow area) అంటారు. అనంతపురం జిల్లాలో వర్షాకాలం జూన్‌నెల నుండి అక్టోబరు నెల వరకూ – అంటే 5 నెలల కాలంలో 20 నుండి 30 వర్షపు రోజులు (Rain-Days) ఉండవచ్చు. జిల్లాలో ఋతుపవనాల వివరాలను వ్యాసం చివరన అనుబంధం 1 లో చూడవచ్చు.

## 2.4. అనంతపురం జిల్లాలో భౌతిక శీతోష్ణ పరిస్థితులు :-

మనజిల్లా యొక్క కరువు పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, జిల్లాలోని భౌతిక–శీతోష్ణ పరిస్థితులను కూడా పరిగణించవలసి వుంది. అనంతపురం జిల్లా $13^0$–30 మరియు $15^0$ –15 అక్షాంశాల మధ్యన మరియు $76^0$ –50 మరియు $78^0$ –30 దీర్ఘాంశాల మధ్యలో వున్నది. జిల్లాలో నైఋతి దిక్కున మడకశిర–హిందూపురంలు సముద్రమట్టానికి 670మి. ఎత్తువుంటూ ఈశాన్యం వైపుకు ఎత్తు తగ్గుతూ, తాడిపత్రికి చేరేసరికి సముద్ర మట్టానికి 274 మీ. ఎత్తులో వున్నది. అంటే నైరుతి మూల నుండి ఈశాన్యం మూలకు వాలుగా వున్నది.

వేసవి కాలం మార్చినుండి మే నెల వరకూ $40^0$ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత మరియు 28 నుండి 33 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత ఉంటుంది. జూన్‌నెల నుండి సెప్టెంబరు వరకూ 35 నుండి $40^0$ వరకూ గరిష్టంగానూ $24^0$ నుండి $28^0$ వరకు కనిష్టంగానూ వుంటుంది. నవంబరు, డిసెంబరు మరియు జనవరి నెలలో మాత్రము $25^0$ నుండి $28^0$ గరిష్ట మరియు $14^0$ నుండి $20^0$ డిగ్రీల వరకూ కనిష్ట ఉష్ణోగ్రత వుంటుంది.

జిల్లా దాదాపు 20 శాతము నల్లరేగడి భూములు రాయదుర్గం, కనేకల్లు, బెళుగుప్ప, గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి, తాడిపత్రి, పుట్లూరు మరియు ఎల్లనూరు మండలాలలో వుండి మిగిలిన మండలాలలో కండతక్కువగల ఎర్రనేలలు ఉన్నాయి.

మన జిల్లాలో సంవత్సరంలో దాదాపు 9 నెలల పాటు $35^0$ మించి పగటి ఉష్ణోగ్రత వుండడం భూమిలోని తేమ తొందరగా ఆవిరైపోవడానికి, మరియు చెరువులలో నీరు వేగంగా ఆవిరైపోవడానికి కారణమవుతుంది. దీనికి తోడు, కండలేని ఎర్రనేలలు స్వభావరీత్యా తేమను ఎక్కువకాలం వుంచుకోలేవు. ఈ రెండింటికి తోడుగా అడవులు, వృక్షసంపదలేకపోవడం, గడ్డి మైదానాలు లేక పోవడం వలన భూమికి ఎండతాకిడి ఎక్కువై తేమను తొందరగా హరించివేస్తున్నది. భూగర్భంలోకి నీరు ఇంకకుండా పడిన వర్షం వేగంగా ప్రవహించుచున్నది. పడే వర్షంలో దాదాపు 10 శాతం మాత్రమే భూగర్భజలంగా మారుచున్నది.

నల్లరేగడి నేలలో తేమను అధిక కాలం నిల్వయుంచుకొనే స్వభావం వున్నందువలన ఆ గ్రామాలలో సాధారణంగా కరువు తీవ్రత తక్కువ అయితే నల్లరేగడి నేలలో భూమిలోకి ఇంకే నీటి శాతం చాలా తక్కువగా వుంటుంది. కాబట్టి, నల్లరేగడి నేలలున్న గ్రామాలలో భూగర్భజలాలు దాదాపు లేనట్టే, త్రాగునీరు కూడా ఎర్రనేల ప్రాంతాలనుండి తరలించుకోవడం జరుగుచున్నది.

జిల్లాలో అడవులు కొన్ని చోట్ల పలుచగానూ, కొన్నిచోట్ల పొదలతోనూ మరికొన్నిచోట్ల బోడికొండలుగానూ వుంటూ దాదాపు 10 శాతం విస్తీర్ణంలో ఉన్నాయి. జిల్లాలో మొత్తం అడవుల భూవిస్తీర్ణం దాదాపు అయిదు లక్షల ఎకరాలు. అయితే అందులో అడవి అనదగ్గ వృక్షసంపద ఒక లక్ష ఎకరాలకు లోపు మాత్రమే వుంటుందని అంచనా.

అనంతపురం జిల్లాలో పడే వర్షపాతం తక్కువ అనేది ఒక సమస్య అయితే, పైన చెప్పిన భౌతిక–శీతోష్ణ పరిస్థితులు నీటి సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

**3. అనంతపురం జిల్లాకు సంభవించే కరువు రకాలు-వాటి పరిణామాలు :-**

**3.1. పంటకరువు :**

సాధారణంగా అనావృష్టి మరియు అకాల వర్షాలవల్ల వివిధ రకాల కరువులు ఏర్పడుతుంటాయి. ఒక్కొక్క కరువు పరిణామాలు కొంత వేర్వేరుగా వుంటాయి. సాధారణంగా మన జిల్లాలో వచ్చే కరువులను మూడు రకాలుగా పేర్కొనవచ్చు.

పంటకరువు అంటే వర్షాధార పంట పండకపోవడం. మన జిల్లాలో వున్నమొత్తం వ్యవసాయభూమి దాదాపు 24,00,000 ఎకరాలు, అందులో దాదాపు 3,00,000 ఎకరాలు వివిధ రకాలైన సాగునీటి వసతుల క్రింద సాగులో వుండగా 21,00,000 ఎకరాలు వర్షాధారంపైన ఉన్నవి. కాబట్టి జిల్లా వ్యవసాయ మనుగడ సకాల వర్షాధారం పైన ఆధారపడి యున్నది. కనుక కరువు కారణంగా వర్షాధారంపైన పండే పంట నష్టపోయినపుడు దాని ప్రభావం విస్తృతంగా అన్ని వర్గాలమీద వుంటుంది. పంట కరువు వచ్చినపుడు వ్యవసాయార్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమై, కూలీలు, సన్నకారు రైతులు ఎక్కువగా బాధితులవుతారు.

పంటకరువు రావడానికి ముఖ్యకారణం సకాలంలో వర్షాలు పడకపోవడం. జూలై నెలలో విత్తనం వేసిన తరువాత ఆగష్టు, సెప్టెంబరు మాసాలలో నైరుతి ఋతుపవనాలు బలహీనమై వరుపు (Dryspell) వల్ల పంటలు వాడిపోయి చాలా సంవత్సరాలలో ఈ పంట కరువువస్తుంది. మరికొన్ని సంవత్సరాలలో, జూలై నెలలో విత్తన సమయంలో వర్షాలు పడక విత్తనం వేయడం అదునులో జరగక పంట దెబ్బతిని కరువు ఏర్పడుతుంది. ఇంకొన్ని సంవత్సరాలలో కాయలు కాచే సమయంలో – అంటే అక్టోబరులో వర్షాలు తక్కువై పంటలు తక్కువ కావడమూ మరియు నాసిరకం కాయలు పండడమూ జరుగుతుంది. మరికొన్ని సంవత్సరాలలో అకాల అధిక వర్షాల వల్ల పంటలు పుష్టిగా పచ్చగా కనపడినప్పటికీ (Deceptive Green) కాయలువూరక కరువు వస్తుంది. సాధారణంగా 75 శాతం పంట పండినా ఆ సంవత్సరం కరువు లేనట్లే లెక్క. అయితే చాలా సంవత్సరాలలో అర్ధపంట, అరణాలపంట పండుతూ వుంటుంది. సరాసరి వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం జిల్లాలో పడిన సంవత్సరాలలో కూడా పంటకరువు రావచ్చు. తక్కువ వర్షపాతం పడిన సందర్భాలలో కూడాపంటకరువు రావచ్చు. తేమ ఒత్తిడి లేకుండా సకాలంలో విత్తనం జరిగి ప్రతి 15 లేదా 20రోజులకు ఒకసారి చిన్న వర్షాలు (ఒకపదును) క్రమంగావస్తే కూడా వేరుశనగ పంట వస్తుంది. ఏ ఒక్క వర్షం తప్పిపోయినా పంట నష్టమై కరువు పరిస్థితులు ఏర్పడుతాయి. కాబట్టి పంటకరువు రావడానికి, సంవత్సరంలో పడే మొత్తం వర్షపాతానికి ప్రత్యక్ష సంబంధం లేదు. కొన్ని సంవత్సరాలలో 300 మి.మీ. వర్షపాతంతోనే మంచి వేరుశనగ పంట పండిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సంవత్సరాలలో 700 మి.మీ. వర్షపాతం పడికూడా పంటకరువులొచ్చిన సందర్భాలు అనేకమున్నాయి.

అనంతపురం జిల్లాలో వర్షాలు పడే తీరు విచిత్రంగా వుంటుంది. ఒక గ్రామంలోనే ఒకరోజు దక్షిణాన వర్షం కురిస్తే ఉత్తరాన కురిసి వుండదు. అంటే చాలా వరకు స్థానికంగా (Localised) వర్షం కురుస్తూ వుంటుంది. కాబట్టి జిల్లా అంతటా సకాలంలో వర్షాలు పడే నమ్మకం లేదు. దీనికి తోడు జిల్లాలో పడే సగటు వర్షపాతంలో కూడా ప్రాంతీయ వ్యత్యాసాలు అధికంగా వున్నాయి. అందువలన అన్ని సంవత్సరాలలోనూ, జిల్లా అంతటా పంటలు ఒకే రకంగా వుండవు. కొన్ని ప్రాంతాలలో కొంత పంటవస్తే కొన్ని ప్రాంతాలలో కరువు వస్తుంది.

పంట కరువు వచ్చిన సంవత్సరాలలో, తిండికి, గుడ్డకి లోటు ఏర్పడుతుంది. కూలిపని దొరకదు. రైతులు అప్పులు చేయడం, చరాస్తులమ్ముకొనడం జరుగుతుంది. పాత అప్పులు తీర్చలేరు. కొత్త అప్పులు దొరకవు. కూలీలు వలస పోవలసి వస్తుంది. గడ్డిలేక పశువులను అమ్ముకోవలసి వస్తుంది. గొర్రెలను కూడా గడ్డిగల ప్రాంతాలకు వలస తీసుకొని పోతారు. సాధారణంగా పనిచేయగల మగవారు వలస పోయి, స్త్రీలు, పిల్లలు, ముసలివారు ఇక్కడే వుంటారు. వీరు తిండి లేక ఇబ్బందిపడతారు. పౌష్టికాహారలోపం వల్ల అనేక జబ్బులకు గురవుతుంటారు. జబ్బులను బాగు చేయించుకునే శక్తి అసలుండదు. సాధారణరోగాలు దీర్ఘకాలరోగాలుగా, తీవ్రజబ్బులుగా మారుతాయి. ఋణభారం ఇంకా పెరిగిపోతుంది. రైతులు బంగారు నగలు, భూములు తాకట్టుపెట్టి, అప్పులుచేసి, తీర్చలేక పోగొట్టుకోవలసివస్తుంది. కాబట్టి జిల్లాలో గ్రామీణ నిరంతర ఋణభారానికి, దారిద్ర్యానికి, అనారోగ్య పరిస్థితులకు, నిరక్షరాస్యతకు ఆర్థిక –సాంఘిక దోపిడీ వ్యవస్థ కొనసాగడానికి తరచూ వచ్చే పంటకరువు కారణమవుతున్నాయి.

### 3.2. నీటి కరువు :-

నీటి కరువు అంటే ముఖ్యంగా వంకలు పారి చెరువులు నిండే వర్షాలు పడక, చెరువులు ఎండిపోయి, తద్వారా భూగర్భజలాలు కూడా తగ్గి, త్రాగునీటికి, సాగునీటికి కొరత ఏర్పడడం. పంట కరువు లేకుండా బాగా వర్షాధారపంటలు పండిన సంవత్సరాలలో కూడా నీటి కరువు రావచ్చును. సరాసరి వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, లేదా ఎక్కువ వర్షపాతంతో పెద్దగా సంబంధం లేకుండా నీటి కరువు రావచ్చు. కొన్ని సంవత్సరాలలో ఒకే పెద్ద ఉధృతమైన వర్షం వస్తే (దాదాపు 100 మి.మీ) చెరువులన్నీ నిండి పోతాయి. ఒక్కసారి చెరువులు నిండితే ఆ సంవత్సరం దాదాపు నీటికరువు వుండదు. అటువంటి పెద్ద వర్షాలు పడకుండా తక్కువ ఉధృతితో ఎక్కువ సార్లు వర్షంపడి, సాధారణ వర్షంపాతం కంటే ఎక్కువైననూ చెరువులు నిండక పోవచ్చు. తద్వారా నీటి కరువు వస్తుంది.

నీటి కరువు మూలంగా ఆ సంవత్సరంలో చెరువుల క్రింద పంటలుండవు. భూగర్భజలాలు తగ్గి బావుల క్రింద ఎక్కువగా తిండి పంటలైన వరి, రాగి, జొన్న లాంటి పంటలే పండించేవారు. ఇప్పుడు కొంతమాత్రం తిండి గింజలు, అధిక భాగం వాణిజ్యపంటలు పండిస్తున్నారు. మార్కెట్ వ్యవసాయం, వినిమయ సంస్కృతి, వస్తుదాహం బాగాపెరిగినందు వల్ల తగినంత తిండిపంట లేనందువల్ల వాణిజ్యపంటలు ఖర్చు ఎక్కువైనందువల్ల, నీటి కరువు వచ్చినపుడు రైతు ఆర్థికంగా చితికి పోతున్నాడు. అంతేకాకుండా బావులు, బోరులలో నీటి మట్టం తగ్గినపుడు, నీటికోసం కుటుంబాల మధ్య వివాదాలు, కలహాలు ఎక్కువైపోతున్నాయి. బావులు చాలా వరకు మూతపడినాయి. బోర్లు కూడా మూసివేయడమో, నీటి లభ్యత తగ్గడమో జరుగుతుంది. పంటలు కాపాడుకోవడానికి కొత్తబోర్లు వేసుకోవలసి వస్తుంది. ఋణభారం మరింత పెరుగుతుంది. తద్వారా బోరుబావుల ద్వారా వ్యవసాయం అధిక ఖర్చుతో కూడుకొని, గిట్టుబాటు ధరలు కూడా లేక లాభసాటిగా ఉండడం లేదు.

అంతేకాకుండా నీటి కరువు వచ్చినపుడు బావులపైన, తక్కువ లోతుగల బోరుబావులపైనా ఆధారపడిన చిన్న, మధ్యతరగతి రైతులు నీటి ఒత్తిడికి, పెట్టుబడులకు తట్టుకోలేక నీటిసాగు వ్యవసాయం మానుకోవలసి వస్తుంది. నీటి కరువును తట్టుకోగల వారు కొద్దిమంది పెద్దరైతులు మాత్రమే. నీటి కరువు ఏర్పడినపుడు ఎండాకాలంలో కూలీలకు పని దొరకదు. త్రాగునీరు సమస్య అవుతుంది. పశువులకు నీరు, మేతదొరకదు. తిండికోసం, ఆరోగ్య అవసరాలకోసం అప్పులు చేయడం, పశువులను అమ్ముకోవడం సాధారణం.

నీటి కరువు అధికం కావడానికి, క్షీణించిన పర్యావరణ పరిస్థితులు, గోరుచుట్టు పై రోకలిపోటు లాంటి ప్రభావం చూపిస్తున్నాయి. చెరువులలో పూడిక ఏర్పడి చెరువులలోని నీరు భూమిలోనికి ఇంకకుండా నిరోధిస్తున్నది. తద్వారా, చెరువులలోకి చేరిన కొంత నీరు మాత్రమే భూమిలోనికి ఇంకి అధికభాగం ఆవిరై పోతున్నాయి. మనజిల్లాలో పడే వర్షపాతంలో 57 శాతం నీరు ఆవిరిగా మారిపోతుంది. 10 శాతము మాత్రమే నేలలోనికి తేమగాను మరియు భూగర్భజలంగానూ ఉపయోగింపబడుచున్నట్లు శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. ఇందుకు తోడుగా – తగినంత వృక్షసంపద లేని కారణంగానూ, భూసారం కొట్టుకొనిపోయిన కారణంగానూ, కుండపోతగా స్వల్ప వ్యవధి వర్షాలు పడటం వలననూ పడిన వర్షం భూమిలో తేమగానూ, భూగర్భజలాలను నింపడాన్ని తక్కువ చేయడం జరుగుచున్నది.

మనజిల్లాలో నీటి కరువు తరచుగా ఏర్పడం వలన తేమ ఎద్దడి ఏర్పడి, బహువార్షిక (వృక్షములు) మొక్కలు, చెట్లు క్షీణించి పోతున్నాయి. భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. అడవులు, వృక్షసంపద నశించిపోయినవి. బహువార్షిక మొక్కలు, వృక్షసంపద లేనందువల్ల భూసారం దుమ్ము, గాలిద్వారా లేచిపోయి, భూసారం తగ్గిపోతున్నది. భూమిపై పొరలు గట్టిపడి వచ్చేకొద్దిపాటి వర్షం నీరుకూడా భూమిలోనికి ఇంకకుండా వేగంగా పారిపోతూ భూసారాన్ని కూడా తీసుకొనిపోతున్నది. ఎండాకాలంలో పశువుల మేతకొరత ఏర్పడి పశుసంపద క్షీణిస్తున్నది. పశువుల మేతకు పనికి వచ్చే గడ్డి, చెట్లు క్షీణించి పోయి, నిరుపయోగ మొక్కలు మాత్రమే మిగిలిపోతున్నాయి. ఎడారీకరణ వేగంపెరుగుతున్నది.

ఇటువంటి పరిస్థితులలో, ఎప్పుడో ఒక్కొక్క సంవత్సరం మంచి వర్షాలు పడి వంకలు పారి, చెరువులు నిండినప్పటికీ శాశ్వత నీటి కరువు పరిస్థితులేర్పడబోతున్నాయి. భూసారం కొట్టుకుపోయి భూమి ఉత్పాదకత తగ్గిపోవడం, వృక్షసంపద క్షీణించడం, పశువులకు మేత లేకుండా పోవడం, నీటి కరువు ఏర్పడడం, ఇవన్నీ వేగంగా ఎడారీకరణకు దోహదం చేస్తున్నాయి.

### 3.3. వర్షపు కరువు (Meteorological drought)

750 మి.మీ. సగటు వర్షపాతం కంటే తక్కువ వుండే ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తారు. సరాసరి వర్షపాతం కన్నా 25 శాతం తక్కువ వర్షపాతం నమోదయిన సంవత్సరాన్ని వర్షపు 'కరువు' సంవత్సరం గానూ, 25 నుండి 50 శాతం వర్షపాతం తక్కువైనపుడు 'తీవ్రకరువు' సంవత్సరంగానూ గుర్తిస్తారు. మన జిల్లాలో పడుతున్న సగటు వర్షపాతమే 522 మి.మీ.అనంతపురం జిల్లా, దేశంలోనే అతి తక్కువ వర్షపాతంగల జిల్లాలో రెండవదిగా వున్నది. కాబట్టి ఇతర కరువు జిల్లాలతో పోల్చుకొన్నప్పుడు మన జిల్లాలో సాధారణ వర్షపాతం కురిసినా కరువుక్రిందే లెక్క. అందులోనూ 25 శాతం తగ్గిన సంవత్సరంలో తేమ ఎద్దడి మరీ అధికంగా ఏర్పడుతుంది. గత 122 సంవత్సరాల వర్షపాతం విశ్లేషిస్తే 61 సంవత్సరాలలో సాధారణ వర్షపాతం కన్నా తక్కువ నమోదయినట్లు తెలుస్తున్నది. వర్షపు కరువు మూలంగా పంట కరువులు మరియు నీటి కరువులు సాధారణంగా సంభవిస్తాయి.

అయితే వర్షంపడే వ్యవధిని బట్టి మరియు ఉధృతినిబట్టి కొన్ని సంవత్సరాలలో వర్షపు కరువొచ్చిననూ పంటకరువు, నీటి కరువు రాని సంవత్సరాలు కూడా వున్నాయి. (అనంతపురం జిల్లాలో వర్షపాతం వివరాలను పూర్తిగా విశ్లేషించి వివరించడం ఇక్కడ సాధ్యం కాదు. వ్యాసానికి అనుబంధంగా 120 సం॥ రాల వర్షపాత వివరాలను పొందుపరచడమైనది. పాఠకులు గమనించగలరు – రచయిత).

**3.4 పై మూడు కరువులూ అనంతపురం జిల్లాకు దగ్గర చుట్టాలు :-**

పైనచెప్పిన మూడు రకాల కరువులు ఒకదానితో ఒకటి ముడిపడి వున్నట్లు బాగా అర్థం అవుతుంది. జిల్లాలోనే వివిధ ప్రాంతాల మధ్య వర్షపాత వ్యత్యాసం కూడా అధికంగా వుండడం వలన, జిల్లాలో ప్రతి సంవత్సరం, పైన చెప్పిన మూడు రకాల కరువులలో ఏదో ఒకరకం కరువైనా వస్తూనే వుంటుంది. కొన్ని సంవత్సరాలలో మూడు కరువులు ఒకేసారి కూడా వస్తూంటాయి. పొరపాటున ఒక ప్రాంతంలో కరువు రాకపోతే, ఇంకొక ప్రాంతంలోనైనా వస్తుంది. వాటిని విడదీసి చూడడం కూడా కష్టమే. వాటి పర్యవసానాలు కూడా కొంత వేర్వేరుగా ఉన్నా దీర్ఘకాలంగా ఏదో కరువుకు ప్రతి సంవత్సరం గురవుతున్న అనంతపురం జిల్లాలో దారిద్ర్యం పెరగడానికి, పర్యావరణం క్షీణించి, ఎడారీకరణకు బాగా తోడ్పడుతున్నాయి.

**3.5. ప్రకృతి శాపానికి తోడుగా మానవ తప్పిదాలు :-**

అడవుల క్షీణింపు, భూసారం కొట్టుకొని పోయి నేల గట్టిపడి పోవడం, కొండ గుట్టలను, పచ్చిక బయళ్ళను కూడా వ్యవసాయ భూములుగా మార్చడం, చెరువులు పూడిపోవడం, మొదలగు కారణాల వల్ల మనకు పడే తక్కువ పాటి వర్షాన్ని కూడా మన జిల్లాలో ఉపయోగించుకోలేక పోతున్నాము. అనంతపురం జిల్లాలో తక్కువ వర్షపాతం ప్రకృతి పరిణామం అయితే, పడే వర్షాన్ని కూడా సక్రమంగా సద్వినియోగం చేసుకోలేక పోవడం, అనువైన వ్యవసాయ విధానాలు పాటించకపోవడం, పర్యావరణాన్ని క్షీణింపజేయడం మానవతప్పిదం.

**4. కరువునుండి శాశ్వత ఉపశమనం :-**

అనంతపురం జిల్లాను పట్టి పీడిస్తున్న కరువు నుండి శాశ్వత ప్రాతిపదికపైన ఉపశమన మార్గాలు ఆలోచించేటప్పుడు జిల్లా కరువు స్వభావస్వరూపాలు, వివిధ రకాల కరువులను మనం దృష్టిలో వుంచుకొని, వాటికి అనుగుణంగా ఒక కాలవ్యవధిగల నిర్ధిష్ట కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి అమలు చేయవలసి వుంటుంది.

**4.1. అనంతపురం జిల్లాకు నీటి సమస్య – వివాదాలు :-**

కరువుకు శాశ్విత పరిష్కారమంటే నదీజలాలు జిల్లాకు తరలించి, జిల్లా అంతటా వ్యవసాయభూమికి నీటి పారుదల సౌకర్యం కల్గించడమేనని అనంతపురం జిల్లా ప్రజలలో ఒక నమ్మకం. రాష్ట్రస్థాయిలో ఆలోచిస్తే ఇది సాధ్యమేనని కొందరు, సాధ్యంకాదని మరికొందరు భావిస్తున్నారు. కృష్ణా, గోదావరి జలాలను పెన్నానదితో అనుసంధానం చేయవచ్చునని, దానిద్వారా అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చునని కొందరు నిపుణుల అభిప్రాయం. గోదావరీ, కృష్ణా జలాలు తెలంగాణాకే చెందుతాయని తెలంగాణవాదులు వాదిస్తున్నారు. ఇక కర్ణాటక, మహారాష్ట్రలతో మనకు నీటి వివాదాలు ఉండనే ఉన్నాయి. వీటికి తోడు భారీ ప్రాజెక్టులవల్ల దేశం సస్యశ్యామలం అవుతుందని కొందరు, భారీ ప్రాజెక్టుల వల్ల భారీగా పర్యావరణ నష్టాలు, పునరావాస కష్టాలు, బాధలు, బాధితులే ఎక్కువని మరికొందరు వాదిస్తున్నారు. అనంతపురం జిల్లాలో పడే తక్కువ వర్షపాతంతోనే జిల్లాను వాటర్‌షెడ్‌లాంటి కార్యక్రమాల ద్వారా ఎడారీకరణ నుండి, కరువు బారినుండి కాపాడవచ్చునన్న అభిప్రాయం కొందరు వెలిబుచ్చుతున్నారు. ఇది మరీ వివాదాస్పదం. అన్ని వాదనలలోనూ కొంత వాస్తవముంది. పెన్న అహోబిలం, పెడబల్లి

లాంటి చిన్న ప్రాజెక్టులు పూర్తిచేయడానికి దాదాపు 30 సంవత్సరాలు పడుతోంది. ఇక కృష్ణా, గోదావరి నదులను పెన్నానదితో అనుసంధానం చేయడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఊహించవచ్చును.

### 4.2. అనుసంధాన నీటి వినియోగము (Conjuctive use of Water)

పైన చెప్పిన వాదనలూ, ప్రతి వాదనలూ ఉన్నప్పటికీ, అనంతపురం జిల్లాలోని వ్యవసాయ వాతావరణ పరిస్థితులను బట్టి అతి తక్కువ వర్షం వలన కలిగే నీటిలోటును కొంతకు కొంతైనా పూడ్చడానికి కొంతవరకూ నదీజలాలు తప్పనిసరి.

ఒక ప్రదేశంలో వ్యవసాయం సవ్యంగా జరగడానికి, ఆ ప్రాంతంలోని మొత్తం వ్యవసాయభూమిలో కనీసం 30 శాతం భూమైనా నీటి పారుదల సౌకర్యం కలిగి వుండవలయునని ఇరిగేషన్ కమీషన్ నివేదిక (1972) చెపుతున్నది. అనంతపురం జిల్లాలో కనీసం 30 శాతం వ్యవసాయ భూమి నమ్మదగిన సాగునీటి క్రిందకు తీసుకురావడం కరువు ఉపశమనానికి ఒక కనీస ప్రాతిపదికగా తీసుకోవచ్చును. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో వ్యవసాయభూమి దాదాపు 25 లక్షల ఎకరాలు. అందులో నీటి సాగులో ఉన్నది 3లక్షల ఎకరాలుగా (12 శాతం) చెప్పబడుతున్నా, వాస్తవంగా సాగులో వున్నది దాదాపు 3 లక్షల ఎకరాలు, తుంగభద్ర ఎగువ కాలువతో పాటు, భూగర్భజలాల ద్వారా (బావులు, బోర్లు), పేరూరు, బి.టి. ప్రాజెక్టు, సి.జి. ప్రాజెక్టులాంటి మధ్యతరహా ప్రాజెక్టులు, ధర్మవరం, బుక్కపట్నం, పరిగి, కంబదూరు, శింగనమల లాంటి చెరువుల ద్వారాను మరియు వేల సంఖ్యలో వున్న చిన్న చెరువుల ద్వారానూ సాగులో ఉన్నట్లు చెప్పుతున్నారు. వీటిలో తుంగభద్ర ఎగువకాలువ ద్వారా అరవైవేల ఎకరాలకు ఒక్కటే నమ్మదగిన నీటివనరు. కొంతవరకూ రెండవ నమ్మకమైన వనరు బావులు మరియు బోరుబావులు. మిగిలినవన్నియూ అపనమ్మకమైన నీటి వనరులు. మధ్యతరహా ప్రాజెక్టులైన పేరూరు, భైరవానితిప్ప, చెన్నరాయగుడిలాంటి ప్రాజెక్టులు ఉండికూడా లేనట్లే. ఇక చిన్న చెరువుల క్రింద ఏ నాలుగు లేక అయిదు సంవత్సరాలకొకసారి మాత్రమే సాగు అవుతాయి.

అనుసంధాన నీటి వినియోగమనగా మన జిల్లాలో ఇప్పటికే లభిస్తున్న భూగర్భజలాలతోనూ అరకొరగా నిండే ఉపరితల జలాలతోనూ (చిన్న ప్రాజెక్టులు, చెరువులు) బయటనుండి వచ్చే నదీ జలాలను అనుసంధానం చేసి వినియోగించుకోవడం.

స్థూలంగా ఆలోచనచేస్తే ఇంత తక్కువ సాగునీటి వ్యవసాయం కల్గివుండడం, ఉన్నసాగు నీటి వసతులు కూడా నమ్మదగినవిగా లేక పోవడం అనంతపురం జిల్లాను అనాదిగా పట్టి పీడిస్తున్న సమస్య. ఇరిగేషన్ కమీషన్ 1972 నివేదిక ప్రకారం ఒక కనీస ప్రాతిపదికగా భావించి కనీసం 30 శాతం వ్యవసాయ భూమిని నమ్మదగిన సాగునీటి వసతి క్రిందికి తీసుకొని వచ్చినపుడే అనంతపురంజిల్లాలో వ్యవసాయం కొంతకు కొంతైనా స్థిరపడుతుంది. అంటే జిల్లాలోని 25 లక్షల వ్యవసాయ విస్తీర్ణంలో దాదాపు 7 లక్షల 50 వేల ఎకరాలు సాగునీటి క్రింద ఉండడం అవసరం. కానీ ప్రస్తుతం 3 లక్షల ఎకరాలు (12 శాతం) మాత్రమే సాగునీరు కల్గియున్నది. అంటే ఇంకా అదనంగా 4.5 లక్షల ఎకరాలు సాగునీటి క్రిందికి తీసుకొని రావలసివుంది. ఈ లోటును పూడ్చడానికైనా కొంతమేర నదీ జలాలను అనంతపురం జిల్లాకు తరలించడం తప్పనిసరి, ఆ విధంగా తరలించిన నదీ జలాలను ప్రస్తుతం లభ్యమవుతున్న ఉపరితల నీటి (చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టులు) వినియోగంతోనూ, భూగర్భజల వినియోగంతోనూ అనుసంధానం చేసి, సాగునీటి వసతులు పలుచగానైనా జిల్లా అంతటా వ్యాపింపచేయాలి. ఆవిధంగా జిల్లా అంతటా సమతుల్యంగా, దాదాపు 7.5 లక్షల ఎకరాలు (30 శాతం) సాగునీటి క్రిందకు వచ్చే విధంగా నీటి వినియోగాన్ని అనుసంధానం చేయడం ద్వారానే జిల్లాలో

కరువు బారినపడిన వ్యవసాయానికి కొంత ఊరట కలుగుతుంది. ఈ దిశలో మొదటిగా జిల్లాలో వున్న చెరువులను పునరుద్ధరించాలి. మన జిల్లాలో పడే వర్షపాతాన్ని సాధ్యమైనంత వరకూ ఉపయోగించుకొని, భూగర్భజలాలను బాగా పెంచడానికి కృషి చేయాలి. లోటును పూడ్చడానికి నదీ జలాలకోసం ప్రయత్నించాలి.

## 4.3. అనంతపురం జిల్లాకు నీటి వలయం (Water Grid) :

తుంగభద్ర, కృష్ణ, గోదావరి నీటిని పెన్నా జలాలతో అనుసంధానం చేసి, నదీజలాలను జిల్లాకు తరలించి, జిల్లాలో వ్యాపించి వున్న చెరువులను మధ్యతరహా ప్రాజెక్టులను నింపడానికి తగిన 'నీటివలయాన్ని' (Water Grid) నిర్మించవలసి వుంటుంది. ఇక్కడ పడే వర్షాలకు చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టులు, అరకొరగా నిండినా, తరలించిన నదీజలాలతో వాటినన్నింటినీ మొదటి ప్రాధాన్యతగా పూరించవలసివుంటుంది. నదీ జలాలను అధికంగా నిల్వచేయడానికి అనువైన చోట్ల బ్యాలన్సింగ్ చెరువులను నిర్మించవలసి వుంటుంది. ఈ 'నీటి వలయం'లో భాగంగా దూర ప్రాంతాలకు నీరు తరలించడానికి కాలువల ద్వారానే కాకుండా, పైపులైన్లద్వారా కూడా తరలించవలసి వుంటుంది. పైపులైన్లద్వారా తరలించడం ద్వారా ప్రవాహక నష్టాలను తగ్గించవచ్చును. ఆ విధంగా దాదాపు 7.5 లక్షల ఎకరాలు జిల్లా వ్యాప్తంగా నీటిసాగు క్రిందికి వచ్చేవిధంగా నీటివలయాన్ని తయారు చేయవలయును. అప్పుడే నీటి వినియోగంలో కొంత సమతౌల్యం ఏర్పడి, నీటిసాగు ఫలితాలే సాధ్యమైనంత సమంగా వుంటూ, కరువు తీవ్రతను జిల్లావ్యాప్తంగా తగ్గిస్తుంది.

ఇటువంటి అనుసంధాన విధానంతో నీటి అవసరాలు కనీస మేరకైనా తీర్చకుండా జిల్లాలో శాశ్వత కరువు ఉపశమనం సాధ్యంకాదు.

## 4.4. సహజవనరుల అభివృద్ధితో పర్యావరణ సమతౌల్యం :
### అడవులు – వృక్షసంపద వృద్ధి :-

అటవీశాఖ కమీషన్ వారి నివేదిక ప్రకారం ఒక ప్రాంతంలోని మొత్తం విస్తీర్ణంలో దాదాపు 30 శాతం భాగం అటవీ సంపద ఉన్నపుడే ఆప్రాంతంలోని పర్యావరణంలో సమతౌల్యం ఏర్పడుతుంది. మన జిల్లాలో 30 శాతం విస్తీర్ణం అడవుల అభివృద్ధి లేదా తత్సమానంగా అవసరమైన వృక్షసంపదను శాశ్వత ప్రాతిపదికపై పోషించవలసి వుంటుంది.

**అనంతపురం జిల్లా భూమివినియోగం (1996-97)**
**(జిల్లా గణాంకవివరాలు) (ఎకరాలలో)**

| | | |
|---|---|---|
| 1) అటవీ ప్రాంతం | 4,80,850 | 10.1 శాతం |
| 2) బంజరు మరియు సాగుకు యోగ్యం కాని భూమి | 4,33,878 | 9.1 శాతం |
| 3) వ్యవసాయేతర భూమి వినియోగం | 4,01,731 | 8.5 శాతం |
| 4) బయళ్ళు, మైదానాలు | 51,675 | 1.2 శాతం |
| 5) చెట్ల పొదల క్రింద | 28,165 | 0.7 శాతం |
| 6) పంటపెట్టని భూములు | 7,32,515 | 15.4 శాతం |
| 7) నికర వ్యవసాయభూమి | 26,26,005 | 55.4 శాతం |
| 8) మొత్తం సాగు విస్తీర్ణం | 26,25,005 | 55.5 శాతం |
| 9) జిల్లా మొత్తం విస్తీర్ణం | 47,26,582 | |

అనంతపురం జిల్లా మొత్తం విస్తీర్ణం దాదాపు 50 లక్షల ఎకరాలు. 30 శాతం విస్తీర్ణంలో అడవులు అంటే దాదాపు 15 లక్షలెకరాలలో అటవీ సంపద ఉన్నపుడు పర్యావరణ సమతౌల్యం వుంటుంది.

పైన పట్టికలోని భూమి వినియోగాన్ని పరిశీలించినపుడు ప్రస్తుతమున్న అడవి ప్రాంత భూమి 10శాతం భూమిపైన వృక్షసంపదను అభివృద్ధి చేయడానికి అవకాశముంది. వాటిని అభివృద్ధి చేయుటలో బీద ప్రజలకు ఫలసాయపు హక్కులతో భాగస్వామ్యం కల్పిస్తూ వాటి అభివృద్ధి కోసం అయ్యేపెట్టుబడి ఖర్చులను ప్రభుత్వం భరించే విధంగా ఆలోచిస్తే అది సాధ్యమవుతుంది. దీర్ఘకాలంలో వాటిని బీద వర్గాలకు ఆదాయవనరులుగా అభివృద్ధి చేయవచ్చును. మన జిల్లాలో వర్షాధారంపైన పెరిగే వివిధ రకాల చెట్లను ఎంపిక చేసి, అవసరమైన భూసార మరియు తేమ సంరక్షణ కార్యక్రమాలు చేపట్టి బీద ప్రజలను బోడి కొండలను, ప్రజలు చొరవతో సహజ సంరక్షణ ద్వారా శాశ్వతంగా పునరుజ్జీవింపబడిన మచ్చుతునకలు ఇప్పటికే జిల్లాలో వున్నాయి. ఈ విధంగా ప్రజల ఆధ్వర్యంలో వృక్షసంపదను, సహజ సంరక్షణ ద్వారా అంతటా విస్తృతంగా చేపట్టవలసి వుంది.

ఈ విధంగా అడవులను, బోడికొండలను, చౌడు భూములను, పచ్చదనం చేయటంతో పాటు పొలం గట్లపైన, కాంటూరుగట్లపైన కూడా వృక్ష సంపదను పెంచడం, (మరియు వ్యవసాయంలో పండ్లతోటలను పెంచడం ద్వారానూ) మనజిల్లాలో పర్యావరణ సమతౌల్యానికి 30 శాతం విస్తీర్ణానికి తత్సమానమైన పచ్చదనాన్ని తీసుకొని రావడానికి అవకాశం కలదు. శాశ్వత పర్యావరణ సమతౌల్యం ద్వారానే భూసార సంరక్షణ, భూగర్భజలాల అభివృద్ధి శాశ్వతంగా వుంటూ, కరువుల తీవ్రత తగ్గి వ్యవసాయం సజావుగా సాగగలదు.

### 4.5 సాంవత్సరిక పంటలను తగ్గించి బహువార్షికమైన పండ్లతోటలు ఎక్కువ చేయడం :-

ప్రస్తుతం మొత్తం 25,00,000 ఎకరాల వ్యవసాయ భూమిలో కేవలం 40,000 (1.6 శాతం) ఎకరాలకు లోబడే పండ్లతోటలు వుంటూ, మిగిలిన వ్యవసాయ భూమినంతా వార్షిక పంటలకే వినియోగిస్తున్నారు. వర్షాధారం క్రింద మరియు నీటి పారుదల క్రిందకూడా వార్షిక పంటలే (వేరుశెనగ, జొన్న, సన్‌ఫ్లవర్, వరిలాంటివి పండిస్తున్నారు). వ్యవసాయ భూమి వినియోగంలో ఇది అసమతౌల్యం. దీనిని కొంత మార్పుచేసి మొత్తం వ్యవసాయ భూమిలో వర్షాధారం మరియు సాగు నీటి క్రింద కలిపి దాదాపు 30 శాతాన్ని బహువార్షిక పంటలైన పండ్లతోటల క్రిందకు తీసుకొనిరావడం వలన సమతౌల్యాన్ని సాధించవచ్చు. తక్కువ నీటితో మరియు వర్షాధారంపైన పండగల మామిడి, చింతలాంటి పండ్లతోటలను అధికంగా ప్రోత్సహించి, దానిమ్మ, చీని, సపోట, జామలాంటి పండ్లతోటలకు కూడా డ్రిప్ ఇరిగేషన్ ప్రోత్సహించడం ద్వారా ఈ మార్పు తీసుకొని రావలసి వుంటుంది.

వ్యవసాయ భూమి వినియోగంలో 30 శాతం భూమి బహువార్షిక పండ్లతోటలు మరియు మిగిలిన 70 శాతం భూమి సాంవత్సరిక పంటలు వేయటం వలన అటు పర్యావరణ సమతౌల్యానికి తోడ్పడుతూ, ఇటు రైతులకి పంటకరువుల నుండి కొంత రక్షణ పండ్లతోటల ద్వారా ఏర్పడుతుంది.

### 4.6. సాంవత్సరిక పంటలలో భిన్నత్వం, మిశ్రమ పంటలు ప్రోత్సహించడం :-

సాంవత్సరిక పంటలలోనూ మరియు బహువార్షిక పంటలలో కూడా ఏకపంట (Mono-cropping) ప్రాధాన్యతను తగ్గించి, పంటలలో భిన్నత్వం తీసుకురావడం అవసరం. పంటలలో భిన్నత్వం అన్నపుడు, వర్షాధార వ్యవసాయ భూమిలో పంట మార్పిడి జరిగి భూసారం సద్వినియోగమై పంటలకు రోగాలు, చీడపురుగుల బాధ తగ్గుతుంది. ప్రస్తుతం మన జిల్లాలో దాదాపు 18 లక్షలెకరాలు

(90శాతం) వేరుశెనగ పంట పండిస్తున్నారు. అట్లా కాకుండా ఈ 18 లక్షల ఎకరాలలో కనీసం సగభాగం ఇతర అనువైన పంటలైన ఆముదం, కంది, జొన్న, సజ్జ, కొర్రలాంటి పంటలను పండించడం పర్యావరణ సమతౌల్యం రీత్యా భూసార సద్వినియోగరీత్యా మంచిది. అంతే కాకుండా భిన్న పంటలు పెట్టడం వలన కొన్ని పంటలు కరువుకు గురైనా, కొన్ని పంటలైనా పండి, కరువు తీవ్రత తగ్గే అవకాశముంది.

**4.7. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమ మరియు పశుసంపద :-**

కరువుల బారి నుండి శాశ్వత ఉపశమనం కోసం ఆలోచించినపుడు, వర్షాభావానికి తట్టుకోగల విధంగా రైతు వ్యవసాయాన్ని మరియు వ్యవసాయానుబంధ వృత్తులను చేపట్టవలెను. మన జిల్లాలో పాడిపరిశ్రమకు అవకాశాలున్నాయి. ప్రతి రైతు, మరియు రైతు కూలీలు కూడా కనీసం రెండు పాడి పశువులను పెంచుకొనుట ద్వారా, అదనంగా కొంత ఆదాయం లభించి, కరువుకు తట్టుకోగల పరిస్థితులు రైతులకు, గ్రామస్థులకు ఏర్పడుతాయి. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 10 లక్షలకు పైగా నాటి ఆవులు, గేదెలు వున్నా పాల ఉత్పత్తి లేదు. ఈ నాటి ఆవుల వలన ఉత్పాదకత లేకపోవడం, పచ్చిక బయళ్ళు లేక గడ్డికొరత ఏర్పడి, పర్యావరణానికి భారమై ఎక్కువ నష్టాన్నే కలుగజేస్తున్నాయి. ప్రస్తుతమున్న 10 లక్షల ఆవులు, గేదెలలో కనీసం సగం కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా మేలు జాతి పశువులుగా అభివృద్ధి చేయగలిగితే, వాటిద్వారా పాల ఉత్పత్తి పెరిగి జిల్లాలో వ్యవసాయ - ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుంది. రైతులకు కూడా కరువులకు తట్టుకొనే శక్తి పెరుగుతుంది. నాటి పశువులను మేలుజాతి పశువులుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, శీతలీకరణ కేంద్రాలు, పశు ఆరోగ్య సదుపాయాలు జిల్లాలో కలుగజేస్తే తక్కువ పెట్టుబడితోనే విస్తృతంగా రైతులకు మేలుజాతి పశువులు లభించేటట్లు చేయవచ్చును. గ్రామాల్లో విచ్చలవిడిగా పశువులను మేపడం మానేసి, తగినంత గడ్డిపెంచుకొని పశువులను పోషించే మేపక నియంత్రణ(Controlled Grazing) విధానాన్ని పాటించడం కూడా జరుగవలయును.

పాడిపరిశ్రమకు తోడుగా సన్నజీవాలైన గొర్రెలు, మేకలు కూడా సక్రమంగా పోషించడం ఇటు రైతులకు, అటు జిల్లాకు ఆర్థికపరంగా మేలు చేస్తుంది. ప్రస్తుతం గడ్డి ఒక తీవ్రమైన సమస్య. జిల్లాలో అడవులను, బోడికొండలను, పచ్చదనం చేయడం ద్వారానూ, గ్రామాల్లో విచ్చలవిడిగా మేపకుండా, మేపకాన్ని నియంత్రించుకొని, గడ్డిని పెంచిపోషించే విధానాన్ని పాటించడం ద్వారా పర్యావరణానికి నష్టం లేకుండా, రైతులకు లాభం వచ్చే రీతిలో గొర్రెలు, మేకల పెంపకాన్ని చేపట్టవచ్చును.

**5. ప్రజలే నడుం బిగించాలి :**

అనంతపురం జిల్లాకు వివిధ రకాల కరువులనుండి కొంత శాశ్వతంగా ఉపశమనాన్ని కలుగజేయడానికి (1) 30 శాతం వ్యవసాయ భూమికి నీటి సదుపాయాలు కలుగజేయడం, (2) జిల్లా విస్తీర్ణానికి సరిపడా పర్యావరణాన్ని సమతుల్య పరచడం, (3) వ్యవసాయ భూమి వినియోగంలో సాంవత్సరిక పంటలనుండి, 30 శాతం భూమిని పండ్లతోటల క్రిందకు తీసుకొని రావడం, (4) సాంత్సరిక పంటల లోనూ, పండ్లతోటలలోనూ భిన్నత్వం తీసుకొని రావడం, (5) పాడి-పరిశ్రమ, పశుసంపదను తగిన విధానంలో గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ వనరులుగా అభివృద్ధి చేయడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి.

జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని పైన చెప్పిన విషయాలపై సమగ్రంగా, ఆచరణీయమైన, నిర్ణీతకాల వ్యవధిగల ప్రణాళికను తయారుచేసి అమలు చేయవలయును. ఆవిధంగా ప్లానింగ్

చేయడంలోనూ, అమలు చేయడంలోనూ ప్రజల బాధ్యత, భాగస్వామ్యం బాగా పోషించాలి. ఇవి ప్రభుత్వ పథకాలుగా మాత్రమే కాకుండా, ప్రజల పథకాలుగా ప్రజల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ చేపట్టాలి. ప్రతి గ్రామంలోనూ మరియు జిల్లా అంతటా ప్రజలలో చైతన్యం రావాలి. పార్టీలకు, వర్గాలకు అతీతంగా, దృఢ సంకల్పంతో, కార్యదీక్షతో ఏకోన్ముఖులై ముందుకు సాగాలి. ఇతర విభేధాలను విస్మరించి, సహచర్య, సహకార పద్ధతిలో ప్రతిగ్రామం నుండి ప్రజలు ఉప్పెనలా లేచి కార్యోన్ముఖులు కావాలి.

### 5.1. ప్రజలు చొరవచూపితే ప్రభుత్వాలు, రాజకీయ వర్గాలు స్పందించక తప్పదు :-

ప్రస్తుతం ఒక ఉద్యమ స్ఫూర్తితో నిర్మాణాత్మకంగా జిల్లా అభివృద్ధికి శ్రీకారం చుట్టే సాంఘిక, రాజకీయ వాతావరణం జిల్లాలో లేదు. ఇది మన దురదృష్టం. జిల్లా అభివృద్ధికి ముఖ్యంగా మూడు రంగాల నుండి నిర్మాణాత్మక స్పందన అవసరం అవి (1) ప్రభుత్వ యంత్రాంగం, (2) రాజకీయ వర్గాలు, (3) సాధారణ ప్రజలు. సాధారణ ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగంపైన, రాజకీయ వర్గాలపైన నమ్మకం పోయింది. అయితే, బాధ్యతంతా, ప్రభుత్వ మరియు రాజకీయ వర్గాలదే, వారే జిల్లా అభివృద్ధిని సాధించాలని భావించడం, బాధ్యతంతా వారిపైనే వేయడం, ప్రజలుమాత్రం నిష్క్రియులుగా, ప్రేక్షకులుగా వుండడం సాధారణ ప్రజలు చేస్తున్న తప్పిదం. మనది ప్రజాస్వామ్యం. ప్రజల నుండి నిర్మాణాత్మకంగా ఒత్తిడి వచ్చినపుడే ప్రభుత్వాలుగానీ, రాజకీయ వర్గాలుగానీ, తప్పనిసరి పరిస్థితులలో ప్రజల బాటలో నడుస్తారు. ప్రజాస్వామ్యంలో "యదా ప్రజా తధా ప్రభుత్వం' కాబట్టి ప్రజలే చొరవ తీసుకోవాలి. జిల్లాలో ప్రజలు శాశ్వితం. జిల్లాలో భవిష్యత్తు వారిది మరియు వారి ముందు తరాలది. జిల్లాలో రాజకీయ వర్గాలు శాశ్వతం. వ్యక్తులు పదవులు మాత్రమే మారుతూ వుంటాయి. కానీ కొన్ని రాజకీయ, ప్రభుత్వ వర్గాలకు ప్రతి కరువూ, దారిద్ర్యమూ ఒక వరమే. కరువు పంపిణీలలోనూ, కాంట్రాక్టులలోనూ అధికంగా ధనార్జన చేయడానికి అవకాశాలు ఎక్కువ. కొంతమంది స్వార్థపరులు కరువుకోసం, తద్వారా కరువు నిధులకోసం ఎదురు చూస్తుంటారు. అటువంటి వారికి ప్రతి కరువూ ఒక మంచి పంటే!

జిల్లాస్థాయిలో అధికారులు జిల్లాకు వస్తుంటారు – పోతుంటారు. అధికారులలో ప్రజలకోసం పనిచేసేవారు ఉంటారు. రాజకీయ వర్గాలకే సేవచేసే వారు వుంటారు. స్వయం సేవ చేసుకొనే వారూ ఉంటారు. మన జిల్లాలో నివసించే ప్రజలూ, మన వెనకున్న రాజకీయ వర్గాలూ జిల్లా అభివృద్ధి పైన శ్రద్ధ చూపనపుడు బయటినుండి వచ్చిన జిల్లా అధికారులు చొరవ ఎందుకు తీసుకుంటారు ? జిల్లా అధికారులతో మన జిల్లా అభివృద్ధి కోసం సక్రమంగా పనిచేయించు కోవలసిన బాధ్యత నాయకులపైనా, ప్రజలపైనా వుంటుంది. ఒక వేళ ఎవరైనా అధికారులు జిల్లా అభివృద్ధి కోసం చొరవ చూపిస్తే వారిని వెంటనే బదిలీ చేస్తారనేది మనం చూస్తున్న వాస్తవం! శాశ్వత కరువు నివారణ పథకాలైన వాటర్‌షెడ్ కార్యక్రమాలుగానీ, తక్షణ ఉపశమన కార్యక్రమాలైన పంటనష్టపరిహార కార్యక్రమాలు గానీ ఇంత అధ్వానంగా అమలు చేయడానికి ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయవర్గాలు – అందరూ బాధ్యులే.

### 5.2. గ్రామాభివృద్ధి ఒక నిరంతర ప్రజాప్రక్రియ :-

గడచిన కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు గ్రామాలను, ప్రజలను అభివృద్ధి చేస్తామని వాగ్దానాలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు వచ్చి గ్రామాలను, కుటుంబాలను అభివృద్ధి చేసి మనకు యిచ్చిపోతాయని సాధారణ ప్రజలు నమ్మి, దానికోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. అందుమూలంగా ప్రజలలో చొరవ నశించి, స్తబ్దత చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రజల అభివృద్ధి లేదా "గ్రామాభివృద్ధి" అంటే

అర్థమే మారిపోయింది. ఇదేదో ఎవరోచేసి పెట్టేది అనే భావన చోటు చేసుకొంది. ఇది సరియైన భావనకాదు అని గ్రహించవలసిన అవసరం చాలా వుంది. ఒక కుటుంబాభివృద్ధి లేదా గ్రామాభివృద్ధి అంటే, ఇది, ఎవరో వచ్చి మనకు చేసిపెట్టే పదార్థంగాదు. ఇది మనమై మనం చేసుకోవలసిన ఒక నిరంతర ప్రక్రియ. మొదట మన కుటుంబంగానీ, మన గ్రామంగానీ, మనమే అభివృద్ధి చేసుకోవలయుననే భావన రావాలి. ఆ తరువాత ఆ వనరులను ఏవిధంగా అభివృద్ధి చేసుకోవచ్చునో, ఏ విధంగా అభివృద్ధి చేసుకుంటే మనం అభివృద్ధి కాగలమో ఆలోచన చేయాలి. దానిని బట్టి అభివృద్ధికోసం ఒక పథకాన్ని అమలు చేసుకోవడానికి మనకు బయటనుండి ఎటువంటి సహకారము కావాలో చూడాలి. బయటనుండి కావలసిన సహకారాన్ని ప్రభుత్వం నుంచి గానీ తెచ్చుకొనుటకు కృషి చేయాలి. ఆ విధంగా బయట సహకారాన్ని సంపాదించి, తమ ఆలోచన ప్రకారం కార్యక్రమాలు చేపట్టి అమలు చేయాలి. ఈ విధంగా ప్రతి వ్యక్తీ, ప్రతికుటుంబం, ప్రతి గ్రామం ఆలోచనచేస్తూ, కృషిచేస్తూ, బయటి సహకారం పొందుతూ ముందుకు పోతూ వుండాలి. ఏదో ఒకసారి ఒక పథకం వేసుకొని ఆచరించినంత మాత్రాన అభివృద్ధి అయిపోదు. ఇది నిరంతరం, తరతరాలు జరిగే ప్రక్రియ.

సమాజంలో సాంఘిక, ఆర్థిక, ఆచార, వ్యవహార విషయాలు నిరంతరమూ మార్పుచెందుతుంటాయి. ఆ మార్పుల కనుగుణంగా మన అభివృద్ధి ప్రక్రియను మార్చుకుంటూ పోతూవుండాలి. కాలమాన పరిస్థితులతో పాటు ఆలోచనలు, పద్ధతులు ప్రవర్తనలు మారకపోతే, కాలచక్రం క్రింద పడి నలిగిపోతాం. కాబట్టి ప్రజలే అభివృద్ధి మార్గంలో చొరవతీసుకోవాలి. ప్రభుత్వాలు వచ్చి ఏదో చేస్తాయని ఊరికే ఉండిపోకూడదు.

ఇంకొక విషయం – గ్రామంలో గ్రూపులు, వర్గాలు, కక్షలు, అసూయ, ఓర్వలేనితనం, ఆధిపత్యపోరాటం, అరాచకం చోటుచేసుకుంటున్నాయి. ఈ దుర్లక్షణాలు యిలాగే పెరిగితే గ్రామ పరిస్థితులు, జీవితాలు పూర్తిగా అదుపు తప్పిపోతాయి. ఈ దుర్లక్షణాలకంతటికి విరుగుడు నిర్మాణాత్మక అభివృద్ధి కార్యక్రమాలలో ప్రతి వ్యక్తి పాల్గొని, ప్రతి వ్యక్తి వికాసం చెంది తనకుటుంబం, గ్రామం, దేశాభివృద్ధిలో భాగస్థుడు కావాలి. మానవ వనరుల అభివృద్దే ఇతర అభివృద్ధి, ఇతర ప్రక్రియలకు పునాది.

## 5.3. గ్రామ అభివృద్ధి ప్రక్రియకు సామాన్య ప్రజలే శ్రీకారం చుట్టాలి :-

ఇప్పుడున్న సాంఘిక వాతావరణంలోనూ , ఆలోచనా విధానాలలోనూ మార్పురావాలి. అందుకు ప్రజలే శ్రీకారం చుట్టాలి. గ్రామస్థాయిలో రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం పాటుపడే విధంగా సాధారణ ప్రజలు చొరవ చూపాలి. జిల్లాలో కరువు, దారిద్ర్యం ప్రజల సమస్యలు, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలు, నిష్క్రియులుగా, ప్రేక్షక పాత్ర పోషించే మనస్తత్వమూ మరియు కేవలం ప్రభుత్వాలనూ, రాజకీయ వర్గాలనూ నిందించే మనస్తత్వమూ మారి, తక్షణమే అభివృద్ధి ప్రక్రియలో ముఖ్యపాత్రధారులుగా కీలకమైన పాత్ర పోషించాల్సిన బాధ్యతను ప్రజలు తీసుకోవాలి. ప్రభుత్వం నుండి గానీ, రాజకీయ వర్గాల నుండి గానీ ఎటువంటి సహకారమూ లేకపోయినా గ్రామస్థులందరూ ఐక్యమత్యంతో, రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా, గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా తీసుకోవలసిన నిర్ణయాలు ఎన్నో వున్నాయి. గ్రామాస్థాయిలోనూ, కుటుంబస్థాయిలోనూ వారివారు చేసుకోగల పనులను, కార్యక్రమాలను, నిర్ణయాలను వారు తీసుకొని అమలు పర్చకుండా, ప్రభుత్వంవారు వచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తారనుకోవడం పొరపాటు, రాజకీయ వర్గాలలోనూ మంచివారూ, చిత్తశుద్ధికల్గిన వారు వున్నారు. గ్రామస్థులంతా ఐకమత్యంతో ఏ పనికైనా చొరవచూపిస్తే వారు ప్రజలకు అండగా నిలబడతారు. అదే విధంగా ప్రభుత్వాధికారులలోనూ నిజాయితీ, కార్యదక్షత కల్గిన వారు వున్నారు. వారు కూడా ప్రజల పక్షాన నిలుస్తారు.

చిత్తశుద్ధిగల సాధారణ ప్రజలూ, చిత్తశుద్ధిగల రాజకీయ వర్గాలూ, నిజాయితీ గల అధికారులూ కలిసి చొరవ తీసుకుంటే, జిల్లాలో ప్రస్తుతమున్న సాంఘిక వాతావరణం అభివృద్ధికి అనుకూలంగా మారుతుంది. జిల్లా శాశ్వత అభివృద్ధి కోసం చేసే పనిలో పగ్గాలు ప్రజల చేతులలో వుంటాయి. రాజకీయ వర్గాలు వారికి

తప్పని పరిస్థితులలో బాసటగా నిలుస్తారు. ఇటు ప్రజలు, రాజకీయ వర్గాలు ఒక నిర్మాణాత్మకమైన అభివృద్ధి ప్రక్రియకు చేయికలిపితే, యంత్రాంగం దానంతటదే సరైన మార్గంలో నడుస్తుంది.

**దారిద్ర్యమూ మరియు కరువు బాధలతో శాశ్వత జీవచ్ఛవాలుగా బ్రతుకుదామా లేక శాశ్వత దారిద్ర్య, కరువు నివారణకు నడుం బిగిద్దామా ? ప్రజలే నిర్ణయించాలి !**

**రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో నమోదు కాబడుచున్న వర్షపాతం యొక్క వివరాలు**

అనుబంధం -3

| సంఖ్య | జిల్లా | వర్షపాతం |
|---|---|---|
| 1) | అనంతపురం | 545 మీ.మీ. |
| 2) | చిత్తూరు | |
| | పశ్చిమతాలూకాలు | 750 మి.మీ. |
| | తూర్పుతాలూకాలు | 950 మి.మీ. |
| 3) | కడప | 696 మి.మీ. |
| 4) | కర్నూల్ | 620 మి.మీ. |
| 5) | మహబూబ్‌నగర్ | 705 మి.మీ. |
| 6) | నల్గొండ | 700 మి.మీ. |
| 7) | గుంటూరు | |
| | పశ్చిమతాలూకాలు | 750 మి.మీ. |
| | తూర్పుతాలూకాలు | 950 మి.మీ. |
| 8) | రంగారెడ్డి | 600 మి.మీ. |
| 9) | హైద్రాబాద్ | 800 మి.మీ. |
| 10) | నెల్లూరు | 1000 మి.మీ. |
| 11) | కృష్ణా | 960 మి.మీ. |
| 12) | ఖమ్మం | 960 మి.మీ. |
| 13) | మెదక్ | 890 మి.మీ. |
| 14) | నిజామాబాద్ | 1025 మి.మీ. |
| 15) | అదిలాబాద్ | 1050 మి.మీ. |
| 16) | కరీంనగర్ | |
| 17) | వరంగల్ | 990 మి.మీ. |
| 18) | పశ్చిమగోదావరి | 1080 మి.మీ. |
| 19) | తూర్పుగోదావరి | 1140 మి.మీ. |
| 20) | విశాఖపట్నం | 950-1150మి.మీ. |

## అనుబంధం – 1

### STATEMENT SHOWING THE AVERAGE ANNUAL RAINFALL FROM THE YEAR 1876 - 77 TO 1999-2000 ( in MMs.) IN ANANTAPUR DISTRICT

| Year | Normal Rainfall | Actual Rainfall | Year | Normal Rainfall | Actual Rainfall | Year | Normal Rainfall | Actual Rainfall |
|---|---|---|---|---|---|---|---|---|
| 1876 -1877 | 544.0 | 236.6 | 1918 -1919 | 544.0 | 486.3 | 1960 -1961 | 544.0 | 503.6 |
| 1877 -1878 | 544.0 | 667.3 | 1919 -1920 | 544.0 | 669.6 | 1961 -1962 | 544.0 | 411.5 |
| 1878 -1879 | 544.0 | 1127.8 | 1920 -1921 | 544.0 | 338.2 | 1962 -1963 | 544.0 | 642.9 |
| 1879 -1880 | 544.0 | 446.0 | 1921 -1922 | 544.0 | 636.5 | 1963 -1964 | 544.0 | 446.9 |
| 1880 -1881 | 544.0 | 269.4 | 1922 -1923 | 544.0 | 455.1 | 1964 -1965 | 544.0 | 575.6 |
| 1881 -1882 | 544.0 | 446.1 | 1923 -1924 | 544.0 | 304.3 | 1965 -1966 | 544.0 | 407.8 |
| 1882 -1883 | 544.0 | 539.7 | 1924 -1925 | 544.0 | 590.6 | 1966 -1967 | 544.0 | 641.7 |
| 1883 -1884 | 544.0 | 602.0 | 1925 -1926 | 544.0 | 567.3 | 1967 -1968 | 544.0 | 541.4 |
| 1884 -1885 | 544.0 | 306.6 | 1926 -1927 | 544.0 | 419.7 | 1968 -1969 | 544.0 | 491.9 |
| 1885 -1886 | 544.0 | 489.5 | 1927 -1928 | 544.0 | 637.1 | 1969 -1970 | 544.0 | 520.3 |
| 1886 -1887 | 544.0 | 669.5 | 1928 -1929 | 544.0 | 589.1 | 1970 -1971 | 544.0 | 441.3 |
| 1887 -1888 | 544.0 | 695.2 | 1929 -1930 | 544.0 | 528.9 | 1971 -1972 | 544.0 | 558.6 |
| 1888 -1889 | 544.0 | 463.6 | 1930 -1931 | 544.0 | 591.3 | 1972 -1973 | 544.0 | 421.7 |
| 1889 -1890 | 544.0 | 859.8 | 1931 -1932 | 544.0 | 415.5 | 1973 -1974 | 544.0 | 700.4 |
| 1890 -1891 | 544.0 | 484.4 | 1932 -1933 | 544.0 | 628.1 | 1974 -1975 | 544.0 | 573.2 |
| 1891 -1892 | 544.0 | 291.0 | 1933 -1934 | 544.0 | 587.4 | 1975 -1976 | 544.0 | 723.6 |
| 1892 -1893 | 544.0 | 785.7 | 1934 -1935 | 544.0 | 320.5 | 1976 -1977 | 544.0 | 435.6 |
| 1893 -1894 | 544.0 | 601.1 | 1935 -1936 | 544.0 | 642.3 | 1977 -1978 | 544.0 | 593.3 |
| 1894 -1895 | 544.0 | 575.8 | 1936 -1937 | 544.0 | 587.1 | 1978 -1979 | 544.0 | 504.2 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1895 -1896 | 544.0 | 638.1 | 1937 -1938 | 544.0 | 495.9 | 1979 -1980 | 544.0 | 522.3 |
| 1896 -1897 | 544.0 | 322.3 | 1938 -1939 | 544.0 | 732.3 | 1980 -1981 | 544.0 | 348.3 |
| 1897 -1898 | 544.0 | 666.1 | 1939 -1940 | 544.0 | 633.9 | 1981 -1982 | 544.0 | 605.6 |
| 1898 -1899 | 544.0 | 491.2 | 1940 -1941 | 544.0 | 545.3 | 1982 -1983 | 544.0 | 450.7 |
| 1899 -1900 | 544.0 | 427.4 | 1941 -1942 | 544.0 | 529.7 | 1983 -1984 | 544.0 | 492.5 |
| 1900 -1901 | 544.0 | 614.0 | 1942 -1943 | 544.0 | 456.6 | 1984 -1985 | 544.0 | 329.3 |
| 1901 -1902 | 544.0 | 419.9 | 1943 -1944 | 544.0 | 460.9 | 1985 -1986 | 544.0 | 294.6 |
| 1902 -1903 | 544.0 | 570.0 | 1944 -1945 | 544.0 | 617.2 | 1986 -1987 | 520.4 | 355.6 |
| 1903 -1904 | 544.0 | 887.0 | 1945 -1946 | 544.0 | 369.3 | 1987 -1988 | 520.4 | 572.3 |
| 1904 -1905 | 544.0 | 416.0 | 1946 -1947 | 544.0 | 540.6 | 1988 -1989 | 520.4 | 713.0 |
| 1905 -1906 | 544.0 | 431.8 | 1947 -1948 | 544.0 | 575.3 | 1989 -1990 | 520.4 | 665.3 |
| 1906 -1907 | 544.0 | 700.5 | 1948 -1949 | 544.0 | 467.6 | 1990 -1991 | 520.4 | 426.9 |
| 1907 -1908 | 544.0 | 446.3 | 1949 -1950 | 544.0 | 599.5 | 1991 -1992 | 520.4 | 536.2 |
| 1908 -1909 | 544.0 | 471.7 | 1950 -1951 | 544.0 | 560.9 | 1992 -1993 | 520.4 | 429.2 |
| 1909 -1910 | 544.0 | 566.5 | 1951 -1952 | 544.0 | 409.9 | 1993 -1994 | 520.4 | 595.1 |
| 1910 -1911 | 544.0 | 805.9 | 1952 -1953 | 544.0 | 352.5 | 1994 -1995 | 520.4 | 375.7 |
| 1911 -1912 | 544.0 | 388.7 | 1953 -1954 | 544.0 | 617.3 | 1995 -1996 | 520.4 | 555.1 |
| 1912 -1913 | 544.0 | 761.7 | 1954 -1955 | 544.0 | 510.4 | 1996 -1997 | 520.4 | 744.7 |
| 1913 -1914 | 544.0 | 462.9 | 1955 -1956 | 544.0 | 599.3 | 1997 -1998 | 520.4 | 416.4 |
| 1914 -1915 | 544.0 | 501.1 | 1956 -1957 | 544.0 | 737.5 | 1998 -1999 | 520.4 | 701.1 |
| 1915 -1916 | 544.0 | 685.9 | 1957 -1958 | 544.0 | 533.7 | 1999 -2000 | 520.4 | 514.9 |
| 1916 -1917 | 544.0 | 903.9 | 1958 -1959 | 544.0 | 554.3 | | | |
| 1917 -1918 | 544.0 | 808.3 | 1959 -1960 | 544.0 | 510.5 | | | |

| Rainfall Range | Years | | | | | | Total Years in the range |
|---|---|---|---|---|---|---|---|
| 200-250 | 1876-77* | | | | | | 1 |
| 251-300 | 1891-92* | 1985-86 | | | | | 2 |
| 301-350 | 1884-85 | 1896-97* | 1920-21* | 1923-24* | 1934-35* | 1984-85 | 6 |
| 351-400 | 1911-12 | 1945-46 | 1952-53 | 1980-81 | 1986-87 | 1994-95* | 6 |
| 401-450 | 1879-80 | 1899-1900*1 | 1901-02* | 1904-05 | 1905-06 | 1907-08 | |
| | 1926-27 | 1931-32 | 1951-52* | 1961-62* | 1963-94 | 1965-66* | 19 |
| | 1970-71* | 1972-73 | 1976-77* | 1981-82 | 1990-91 | 1992-93 | |
| | 1997-98 | | | | | | |
| 451-500 | 1885-86 | 1888-89 | 1890-91 | 1898-99 | 1908-09 | 1913-14 | |
| | 1918-19 | 1922-23 | 1937-38* | 1942-43 | 1943-44 | 1948-49* | 13 |
| | 1968-69* | | | | | | |
| 501-550 | 1882-83 | 1914-15 | 1940-41 | 1941-42* | 1946-47 | 1954-55 | |
| | 1957-58* | 1959-60* | 1960-61* | 1967-68* | 1969-70 | 1978-79 | |
| | 1982-83 | 1983-84 | 1991-92 | 1995-96 | 1999-2000 | | 17 |
| 551-600 | 1880-81 | 1894-95 | 1902-03 | 1909-10 | 1924-25 | 1925-26 | |
| | 1928-29 | 1930-31 | 1933-34 | 1936-37 | 1947-48 | 1949-50 | |
| | 1950-51 | 1955-56 | 1958-59* | 1964-65 | 1971-72 | 1974-75* | |
| | 1977-78 | 1987-88 | 1993-94 | | | | 21 |
| 601-650 | 1883-84 | 1893-94 | 1895-96 | 1900-91 | 1921-22 | 1927-28 | |
| | 1929-30 | 1932-33 | 1935-36 | 1939-40 | 1944-45 | 1953-54 | |
| | 1962-63* | 1966-67 | 1979-80 | | | | 15 |
| 651-700 | 1877-78 | 1886-87 | 1887-88 | 1897-98 | 1915-16 | 1919-20 | |
| | 1973-74 | 1981-82 | 1989-90 | | | | 9 |
| 701-750 | 1906-07 | 1938-39 | 1956-57 | 1975-76 | 1988-89 | 1996-97 | |
| | 1998-99 | | | | | | 7 |
| 751-800 | 1892-93 | 1912-13 | | | | | 2 |
| 801-850 | 1910-11 | 1917-18 | | | | | 2 |
| 851-900 | 1889-90 | 1903-04 | | | | | 2 |
| 901-950 | 1916-17 | | | | | | 1 |
| 951-1000 | Nil | | | | | | 0 |
| 1000 above | | 1878-89 | | | | | 1 |
| | | TOTAL YEARS | | | | | 124 |

★ కరువు సంత్సరాలు - 1876-77 నుండి 1974-75 వరుకు మాత్రమే ప్రభుత్వ లెక్కల ప్రకారం కరువు సంవత్సరం లభ్యమయినది.

పై పట్టికలోని వర్షపాత వివరాల ప్రకారం గడచిన 124 సంవత్సరాలలో 64 సంవత్సరాలు 550 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం నమోదయినది. మిగిలిన సంవత్సరాలు 550 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతము నమోదయింది. కానీ ప్రభుత్వంవారు కరువు సంవత్సరంగా ప్రకటించిన వివరాలు పూర్తిగా లభ్యంకాలేదు. లభించిన సమాచారం ప్రకారం 400 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం కురిసిన సంవత్సరాలలో కూడా పంట కరువు రాని సంవత్సరాలు గమనించవచ్చు. అలాగే 550 మి.మీ. మించి వర్షపాతం కురిసిన సంవత్సరాలలో కూడా పంట కరువుకు గురి అయినట్లు కూడా గమనించవచ్చు. అయినా సాధారణంగా 450 మి.మీ. తక్కువ వర్షపాతం కురిసిన సంవత్సరాలలో పంట కరువులు అధికంగా వచ్చినట్లు

గమనించవచ్చు. 600 మి.మీ. లోపల వర్షం నమోదయిన సంవత్సరాలలో నీటి కరువు వచ్చినట్లుగా భావించవచ్చు. ప్రభుత్వ పాలసీ ప్రకారం 750 మి.మీ. కంటే తక్కువ సగటు వర్షపాతంగల ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తారు. ఆ లెక్కప్రకారం చూస్తే గడచిన 124 సంవత్సరాలలో కేవలం 8 సంవత్సరాలలో మాత్రమే మన జిల్లాలో 750 మి.మీ. కంటే అధికంగా వర్షపాతం నమోదయింది.

ఇంకొక విషయంకూడా మనం గమనించవలసి వుంది. కడప జిల్లా సరాసరి వర్షపాతం 697 మి.మీ. సాధారణంగా సగటు వర్షపాతానికి 25 శాతం తక్కువ వర్షపాతం పడినపుడు కరువు సంవత్సరంగా ప్రభుత్వం పరిగణిస్తుంది. ఆ లెక్క ప్రకారం కడప జిల్లాలో 523 మి.మీ. వర్షపాతం పడిన సంవత్సరం కరువు సంవత్సరం క్రిందలెక్క. దీనిని మనం అనంతపురం జిల్లాకు అన్వయించినపుడు అనంతపురం జిల్లా ప్రస్తుత సగటు వర్షపాతమే 520.4 మి.మీ. అంటే అనంతపురం జిల్లాలో 520.4 మి.మీ. నమోదయిన సంవత్సరాలలో కరువు సంవత్సరంగా గుర్తించబడదు. కానీ కడప జిల్లాలో 523 మి.మీ. వర్షపాతం పడినా కరువు సంవత్సరంగా గుర్తించబడుతుంది.

*– కదలిక సెప్టెంబర్ – 2000 సంచికనుండి*

## నీటి వినియోగంలో సమతుల్యమే - సమగ్ర గ్రామీణాభివృద్ధికి పునాది.

నాగరికత ప్రపంచంలో ప్రతిమనిషికి జీవించేహక్కు (Right to life) వుంది. త్రాగడానికి, జీవనానికి నీటిపై హక్కులేకుండా జీవించే హక్కుకు అర్థముండదు. కాబట్టి ప్రతి మనిషికి జీవించే హక్కుతోపాటు, నీటి హక్కు (Right to Water) దానంతటి అదే సహజంగా సంక్రమిస్తుంది. ఈ నీటి హక్కును హరించడానికి ఏ ప్రభుత్వానికీ హక్కు వుండకూడదు. ఈ హక్కు బీద, ధనిక, కుల, మత, ప్రాంత, లింగ మొదలగు తారతమ్యాలు లేకుండా ప్రతి మనిషికి జన్మతః సంక్రమించే సహజ హక్కు. ఏకొద్ది మంది ధనికులో లేక ఏ కొన్ని ప్రాంతాల వారో నీటిపై ప్రత్యేక హక్కులు కలిగి వుండడం, ఇతరులకు హక్కులేకుండా వుండడం, నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలలో అసంబద్ధమౌతుంది. అంతేగాకుండా ఇతరుల సహజ మానవ హక్కును హరించినట్లవుతుంది. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో నీటిని కూడా ప్రైవేటీకరించి, కొనగల్గిన వారికి మాత్రమే నీటి హక్కువుంటూ, నీటిని కొనే స్థోమత లేనివారికి నీరే లేకుండా పోయే పరిస్థితి రాబోతున్నది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించవలసి వుంది. నీటి లభ్యతలోని ప్రాంతీయ తారతమ్యాలను అధిగమించి, నీటిని అన్ని ప్రాంతాలకు సాధ్యమైనంత సమపంపిణీ చేసి, వినియోగ సమన్వయం సాధించి, అన్ని ప్రాంతాల సకల జన సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం చుట్టవలసి వుంది.

### 1. ప్రాంతీయ అసమానతలకు, బీద, ధనిక తేడాలకు మూల వస్తువు నీరు :-

మన దేశంలో అధిక జనాభా పెరుగుదల, దారిద్ర్యం, కరువులాంటి సమస్యలకు అశాస్త్రీయమైన, అసమంజసమైన జలవనరుల వినియోగ విధానాలకు చాలాదగ్గర సంబంధం ఉంది. అలాగే, పర్యావరణం క్షీణించడానికి, ఎడారీకరణకు, జలవనరుల వినియోగ విధానాలకు కూడ దగ్గర సంబంధం ఉన్నది. రాయలసీమ, తెలంగాణా, సర్కారు ప్రాంతీయ అసమానతలకు మరియు ఒకే గ్రామంలో బీద – ధనిక తారతమ్యాలకు సంబంధించి నీటి వినియోగ విధానాలు పునాదులుగా వున్నాయి. కావున అసమానతల తొలగింపు, దారిద్ర్య నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, సమాజంలో శాంతి, సామరస్యాలకు జలవనరుల సక్రమ వినియోగమే ఏకైక పరిష్కారం.

### 2. వివిధ స్థాయిలలో వివాదాలకు నీరు కారణమౌతున్నది.

ప్రస్తుతం జల వనరుల వినియోగంపై వివిధ ప్రాంతాలలో అభిప్రాయభేదాలు, స్పర్ధలు, పరస్పర అనుమానాలు, ఘర్షణలు కొనసాగుతూ వున్నాయి. నదీజలాల ఆవశ్యకత, లభ్యత, పంపిణీలపై వివిధ రాష్ట్రాల మధ్య మనదేశంలో విభేదాలున్నాయి. కావేరీ జలాల వివాదం, కృష్ణా జలాల వివాదం, గోదావరీ జలాల వివాదం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వివాదాలు విభేదాలు కొనసాగడం మనం చూస్తున్నాం. అలాగే మన రాష్ట్రంలోనే రాయలసీమ, తెలంగాణా, కోస్తా ప్రాంతాల మధ్య, మరియు ఒకే ప్రాంతంలోనే కొన్ని జిల్లాలమధ్య, జిల్లాలోనే కొన్ని మండలాల మధ్య, ఒక గ్రామానికి మరో గ్రామానికి మధ్య, ఒక కుటుంబానికి మరొక కుటుంబానికి, చివరకు ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల మధ్య కూడా నీటి వినియోగంపై తగాదాలు – ఘర్షణలు మనం నిత్యం గమనిస్తూనే ఉన్నాం. త్రాగునీరు–సాగునీటి అవసరం మానవుడిపై ఎంత ప్రభావం చూపుతుందో చెప్పలేము! ఒక రకంగా, భవిష్యత్తులో నీరు ఘర్షణలకు, యుద్ధాలకు కూడా ఏకైక మూలం అవుతుందని చెప్పడం అతిశయోక్తి కాదనిపిస్తుంది.

## 3. అసమగ్ర, అసమతౌల్య నీటి వినియోగ విధానాలు :-

ప్రస్తుతం మనం పాటిస్తున్న జలవనరుల వినియోగ విధానాలు అసంబద్ధమైనవిగా ఉండి పైన చెప్పిన సమస్యలకు దోహదం చేస్తున్నవి. ముఖ్యంగా, దారిద్ర్య కేంద్రీకరణకు, పర్యావరణ క్షీణతకు, సమాజంలో అశాంతి, అలజడులకు బాగా దోహదం చేస్తున్నాయి. చివరకు త్రాగునీటి సమస్యను కూడా తీర్చలేని దుస్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితి రావడానికి జలవనరుల గురించి సమగ్ర అవగాహన లోపం ఒక కారణమైతే, రాజకీయ బాధ్యతా రాహిత్యం మరో ముఖ్యకారణం. ప్రస్తుతం పాటిస్తున్న అసంబద్ధ విధానంలో జలవనరులంటే, నదీ జలాలు మాత్రమే ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అందుకు ప్రాంతీయ రాజకీయాలు, రాజకీయనాయకుల మనుగడలకు సంబంధించిన పోరాటాలు ప్రాముఖ్యత వహిస్తున్నాయి. నదీజలాలే దారిద్ర్యం, త్రాగునీరు, సాగునీరు సమస్యలకు ఏకైక పరిష్కారంగా విధానవాదకులు ప్రచారం సాగిస్తున్నారు ఈ విధానం ప్రాతిపదికగా ఆలోచించేవారికి గోదావరి జిల్లాలే ఆదర్శంగా కనిపిస్తాయి. అయితే, సువిశాల భారతదేశంలో ప్రతి జిల్లాకు గోదావరి జిల్లాలలాగా నీరందించటం సాధ్యమా ? ఒకవేళ సాధ్యమనుకున్నా అందుకు అయ్యే ఆర్థిక, పర్యావరణ, మానవ వ్యయాలు ఏమిటి? ఆ విధానం ఫలితంగా దిగువ ప్రాంతాన్ని అభివృద్ధిచేయుటకు ఎగువ ప్రాంతాలను ఎడారిగా చేయవచ్చు. దిగువ ప్రాంత ప్రజల అభివృద్ధికోసమై, ఎగువప్రాంతాలలో దాదాపు అంతే ప్రాంతాన్ని, ఆ ప్రాంత జనజీవనాన్ని, పర్యావరణాన్ని నాశనం చేయవచ్చు.

పై విధానంలో వర్షాధార వ్యవసాయానికి, భూగర్భజలవనరులకు అసలు ప్రాధాన్యతేలేదు. అయితే వాస్తవంగా మన దేశంలో 70 శాతంపైగా ప్రాంతం మరియు ప్రజలు ఇప్పటికీ వ్యవసాయం, వర్షాధారంపైనా, భూగర్భజలవనరులపైన ఆధారపడివున్నారు.

ఇటీవలి కాలంలో కొంతమంది, ప్రస్తుత ప్రభుత్వాలు అమలు పరుస్తున్న గ్రామస్థాయి వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ పథకాలు, నీటివనరుల సమస్యలకు, వ్యవసాయ సంక్షోభాలకు, కరువులకు, ఎడారీకరణకు కూడా పరిష్కారమని వాదిస్తున్నారు. ఇది మరీ ఘోరమైన అవగాహనారాహిత్యానికి నిదర్శనం. లేదంటే కరువులకు, ఎడారీకరణకు, కేవలం వర్షాధార వ్యవసాయానికి నిలయాలైన ప్రాంతాలవారిని సరికొత్తగా మభ్యపెట్టి, మోసగించేందుకు ఎన్నుకొన్న రాజకీయ ఎత్తుగడ కావచ్చు. ఈ రెండు వాదనలు వేర్వేరుగా కాకుండా సమన్వయంతో చూడడం సమంజసంగా వుంటుంది.

## 4. సంపూర్ణ సమతుల్య నీటి వినియోగానికి కొన్ని ప్రాతిపదికలు :-

ఒక సమతుల్యమైన, సమగ్రమైన నీటి వనరుల వినియోగ విధానానికి కొన్ని ముఖ్యమైన ప్రాతిపదికలు అవసరము. మన సువిశాల భారతదేశం అంతటా దారిద్ర్యాన్ని ఎదుర్కొని, గ్రామీణాభివృద్ధి జరగడానికి, వ్యవసాయ మరియు పర్యావరణ సంరక్షణ తీసుకొని రావడానికి, మన దేశకాల, భౌతిక, సాంఘిక, పర్యావరణ పరిస్థితులకనుగుణంగా నీటి వినియోగ విధానాన్ని ఏర్పాటు చేసుకొని అమలు పరచవలసి వుంటుంది. అటువంటి నీటి విధానానికి కొన్ని ముఖ్యమైన ప్రాతిపదికలు అవసరం. ఆ దిశలో కొన్ని ముఖ్య ప్రాతిపదికలను గమనిద్దాం.

### 4.1. ప్రాంతీయ అసమానతలు తగ్గించే సమతుల్య నీటి పంపిణీ మరియు వినియోగ విధానము :-

ఒకదేశంలో వివిధ ప్రాంతాలలో పడే వర్షపాతములో తేడాలు మనం గమనించాలి. ఒక ప్రాంతంలో అధిక వర్షం కురుస్తుంది, మరో ప్రాంతంలో తక్కువ వర్షం కురుస్తుంది. దీనిపై మానవుడికి అదుపులేదు. దీని మూలంగా సహజవనరులలో ప్రాంతీయ అసమానతలు – కరువు ప్రాంతాలు, ఎడారి ప్రాంతాలు, సుభిక్షప్రాంతాలు ఏర్పడ్డాయి. పర్యావరణ పరిస్థితులలో అసమానతలకు, క్షీణింపునకు కూడా ఇది ఒక కారణం.

నీటి వినియోగానికి ఒక ప్రాతిపదిక అనుకొన్నపుడు నీటిలోటు ప్రాంతాలు – నీటి లభ్యత అధికంగా ఉండే ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని, నీటి అధిక ప్రాంతాల నుండి, నీటి లోటు గల ప్రాంతాలకు నీటిని చేరవేసి, నీటి వినియోగములో భౌతికంగా, సాంకేతికంగా వీలైనంత వరకు వివిధ ప్రాంతాల మధ్య వ్యవసాయ, మరియు పర్యావరణ సమతుల్యాన్ని తీసుకొని వచ్చే ప్రాతిపదికపై జల పంపిణీ మరియు వినియోగ విధానాన్ని రూపొందించవలయును.

## 4.2. వివిధ జలాల అనుసంధానం మరియు వినియోగ సమన్వయం (Conjunctive use of water) :

నీరు మనిషి అవసరాలకోసం – ముఖ్యంగా త్రాగునీరు, సాగునీరు అవసరాలను దృష్టిలో పెట్టుకొన్నప్పుడు మనకు నీటి లభ్యత నాలుగు రకాలుగా లభిస్తుంది. (1) వర్షపు నీరు (అంటే పంటలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే నీరు) (2) ఉపరితల నీరు (సర్ఫేస్ వాటర్) అంటే కుంటలు, చెరువులలో నిల్వచేసుకోగలిగిన నీరు, (3) భూగర్భజలాలు, (4) నదీజలాలు – ఈ నాలుగు రకాలుగా లభ్యమయ్యే నీటిని అన్ని ప్రాంతాలలోనూ ఒక రకముతో ఇంకొక రకము నీటిని అనుసంధానము చేసుకొనే పద్ధతి, నీటి వినియోగ విధానాలకు ఒక ప్రాతిపదిక కావాలి. ఒక గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొన్నపుడు, ఆ గ్రామ ఆధీనములో వున్న మొత్తం వ్యవసాయ భూమిపై సాధ్యమైనంత వరకూ నాలుగు రకాల నీటి వనరులను సమన్వయంగానూ, సమతుల్యంగానూ వినియోగించే విధానము పాటించాలి. ఏ ఒక్క రకమునకో అధిక ప్రాధాన్యత నిచ్చి, మిగిలిన మూడు రకాల నీటి లభ్యతను నిర్లక్ష్యం చేయడము అసమంజసంగా, అశాస్త్రీయంగా వుంటుంది. ప్రస్తుతం అమలులో ఉన్న నీటి వినియోగ విధానములో నదీజలాల వినియోగానికి మాత్రం భారీ ప్రాజెక్టుల ద్వారా ప్రాధాన్యతనిచ్చి, మిగిలిన మూడు రకాలు విస్మరించడం జరుగుచున్నది.

ఈ నాలుగు రకాల నీటి లభ్యతతో వివిధ ప్రాంతాల మధ్య చాలా వ్యత్యాసాలు ఉండడం సహజం. ఆ వ్యత్యాసాలే అనేక దారిద్ర్యం, పర్యావరణ సమస్యలకు మూలం. వ్యత్యాసాలను తగ్గించి, అన్ని ప్రాంతాలకు సాధ్యమైనంత సమతౌల్యంగా నీటిని పంపిణీ చేయడమూ, మరియు అవసరాన్ని బట్టి ఒక రకమైన నీటికి ఇంకొక రకమైన నీటిని తోడుచేసి, సమయానికి పంటలకందించడం ద్వారా నీటి లభ్యతనూ, నీటి అవసరాలను సమన్వయం చేయవలయును. ఈ విధంగా సమన్వయం చేసి, విస్తృతంగా నీటి అవసరాలు తీరే విధంగా నీటిని సమపంపిణీ చేయుటలో, నదీజలాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

ఈ విధంగా వివిధ రకాల నీటి లభ్యతను అనుసంధానం చేసి వినియోగములో సమతుల్యము చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలి. అంటే, కొంతభాగానికి సరిపోయే ఉపరితల నీటి సదుపాయాలు, చెరువులు, కాల్వలు ఉంటూ, నీటిలోటుఉండే ప్రాంతాలకు నీటి లభ్యత అధికంగా వుండే ప్రాంతాలనుండి తరలించాలి. **కనీసం 30శాతం వ్యవసాయభూమి ప్రతి గ్రామంలోనూ నమ్మదగిన నీటి సాగు క్రిందకు తెస్తూ, తరచూ కరువులకు గురి అయ్యే నీటిలోటు ప్రాంతాలలో వర్షాభావ పరిస్థితులలో, వరుపు సమయాలలో పంటలను కాపాడేందుకు ఉపరితల నీటిని, భూగర్భజలాలను, నదీజలాలను (Life saving irrigation) పంట రక్షణకు ఉపయోగించుకొనే విధంగా అనుసంధాన సమన్వయ సదుపాయం కలుగజేయాలి.**

ప్రస్తుతమున్న జలవిధానం ప్రకారం అయితే కొన్ని ప్రాంతాలకు నదీ జలాలను తరలించి పూర్తిగా నదీజలాలపై మాత్రమే వ్యవసాయం చేస్తూ, మిగిలిన ప్రాంతాలను పూర్తిగా వర్షాధారముపై వ్యవసాయానికి వదిలివేయడం వలన ఈ ప్రాంతాలు కరువులకు, ఎడారీకరణకు, దారిద్ర్యానికి, ప్రాంతీయ అసమానతలకు గురవుతున్నాయి. ప్రస్తుతం నాగార్జున సాగర్, కృష్ణా బ్యారేజీ క్రింది భాగాలలో ఫ్లడ్ఇరిగేషన్‌కు ఉపయోగిస్తున్న నీటిలో కొంతభాగాన్ని రాయలసీమ జిల్లాలోని చెరువులను నింపుటకు ఉపయోగించినట్లయితే దాదాపు ప్రతిగ్రామంలోనూ వ్యవసాయానికి జీవం పోసి, కరువుబారినుండి కొంత శాశ్వత ఉపశమనం కలుగజేయవచ్చును. ఆ విధముగా చెరువులను నింపుట వలన మొత్తంగా రాయలసీమ ప్రాంతాలలో భూగర్భజలాలు కూడా వృద్ధి చెంది బోర్లు, బావుల క్రింద వ్యవసాయము కూడా దాదాపు స్థిరీకరింపబడుతుంది.

అందుకుతోడుగా వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు ఉధృతంగా చేపట్టడం ద్వారా భూసార సంరక్షణ, పచ్చదనం, చెక్‌డ్యాములద్వారా చిన్న నీటి వనరులను ఒడుపుకొని కొంతవరకు పర్యావరణ పరిస్థితులను మెరుగు పరచుకోవచ్చును. జాయింట్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ లాంటి కార్యక్రమాలు ఉధృతంగా చేపట్టడం ద్వారా అడవులను అభివృద్ధి చేసి, వర్షపునీటి వినియోగాన్ని పెంచవచ్చును.

వ్యవసాయ కమీషన్ సిఫార్సుల మేరకు ప్రతి గ్రామంలోనూ కనీసం 33% వ్యవసాయ భూమికి సాగునీటి సదుపాయం ఉన్నపుడే ఆ గ్రామంలో వ్యవసాయం ఆచరణయోగ్యంగా (Viable) వుండగలదు. కాబట్టి అన్ని ప్రాంతాలలోనూ, అన్ని గ్రామాలలోనూ కనీసం 33% వ్యవసాయానికి సాగునీరందించే విధానం కావాలి. మిగిలిన 2/3వ వంతు భూమిలో వ్యవసాయం వర్షాధారముపైన ఆధారపడినా తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడినపుడు పంటను బ్రతికించే కీలకమైన సాగునీరు (Critical Life saving Irrigation) అందించే సదుపాయం ఉండవలయును.

లభ్యమయ్యే నాలుగు రకాల నీటిలోనూ, నదీజలాలు మాత్రమే ఒక ప్రాంతము నుండి ఇంకొక ప్రాంతమునకు తరలించుటకు అవకాశము గలదు. కాబట్టి నీటి పంపిణీలో ప్రాంతీయ సమతుల్యత సాధించడానికి నదీజలాల తరలింపు కీలకం. ఏ ప్రాంతాలలో అయితే వర్షపాతం తక్కువగా వుండి, ఉపరితల జలాలు అపనమ్మకంగా వుంటూ, భూగర్భజలాలు కూడా తక్కువగా వుంటాయో, ఆ ప్రాంతాలకు నదీజలాల తరలింపులో అత్యధిక ప్రాధాన్యత యివ్వాలి. ఒక గ్రామస్థాయిలో సాధారణంగా ఉపరితల నీరు మరియు భూగర్భజలాలు, తగ్గుప్రాంతాలలో (Valley) కొంతమేర అధికంగా వుంటూ, ఎత్తు ప్రాంతాలలో (Ridge) తక్కువగా వుంటాయి. వీలైనంత వరకూ నదీజలాలను అటువంటి ఎత్తు ప్రాంతాలకు సేద్యపునీరు అందించుటకు ప్రాధాన్యత యివ్వాలి. నదులను మళ్ళింపు కాల్వల ద్వారా అనుసంధానం చేయుట ద్వారా నీటిని సమపంపిణీ చేయుటకు అవకాశం కలుగుతుంది.

## 4.3. వాతావరణ, పర్యావరణ పరిస్థితులకనువైన పంటల విధానం :-

నాలుగు రకాల నీటి లభ్యతను మరియు పర్యావరణ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని పంట విధానం రూపొందించవలయును. నదీజలాల ప్రాంతీయ అసమాన పంపిణీ వ్యవస్థలద్వారా వక్రీకరణ జరిగిన వ్యవసాయాభివృద్ధి పర్యవసానంగా నేడు వ్యవసాయ గోదాములలో పుష్కలంగా ఆహారధాన్యాలున్నా, దాదాపు 40 శాతం ప్రజలు తిండి లేక దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారు. ఆహార భద్రతను దృష్టిలో వుంచుకొని అన్ని ప్రాంతాలలోను అనువైన తిండి పంటలను, వాణిజ్యపంటలను సరియైన పాళ్లలో సమన్వయం చేయవలెను. దానితో పాటు, వర్షాధార పంటలను, ఆరుతడి పంటలను, వరిలాంటి అధికనీరు అవసరమయ్యే పంటలను ఒక పద్ధతిలో సమన్వయం చేయవలయును. ఒక ఎకరా వరి పంటకు పట్టే నీటితో దాదాపు మూడు ఎకరాల ఆరుతడి పంటలు పెట్టవచ్చును. కాబట్టి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట వచ్చే పంటలను పెట్టవలెను. పంట విధానంలో భిన్నత్వం, పంట మార్పిడి ఉండవలెను.

## 4.4. పర్యావరణ సమతౌల్య పరిరక్షణ :-

దీర్ఘకాల వ్యవసాయమనుగడకు పర్యావరణ సమతుల్యం, మరియు శాశ్వత పర్యావరణ పరిరక్షణ అత్యంతావశ్యకం. వర్షాధార వ్యవసాయం మరియు భూగర్భ జలాలు పర్యావరణ సమతుల్య పరిస్థితులపై ఆధారపడి వుంటాయి. ఫారెస్టు కమీషన్ సిఫార్సుల మేరకు ఏ ప్రాంతం తీసుకొన్నా మొత్తం విస్తీర్ణములో కనీసం 1/3వ భాగంలో (33%) అడవులు, భిన్నత్వంగల వృక్ష సంపద ఉండాలి. ఆవిధంగా ఉన్నపుడు వర్షపునీటి వినియోగం, భూగర్భజలాలు, హెచ్చుస్థాయిలో వృద్ధి అవుతాయి. అటువంటి ప్రాంతాలలో నదీజలాల అవసరం కొంతవరకూ తగ్గుతుంది. వ్యవసాయభూములలో కూడా భూసార సంరక్షణ, వర్షపునీటిని ఒడుపుకోవడం, తగినంత శాశ్వత పచ్చదనాన్ని పెంచడం జరిగినపుడు పర్యావరణం క్షీణించకుండా వుంటూ, దీర్ఘకాల వ్యవసాయానుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి.

అనుసంధాన సమన్వయ నీటి వినియోగం కొరకు, సమతుల్యం కొరకు ఇప్పటికే ఉన్న చెరువులను స్థిరీకరించి ఆధునీకరించవలసి వుంటుంది. భూగర్భజలాలను వృద్ధి చేయుటకు ఇతర పర్యావరణ కార్యక్రమాలతోపాటు నీరు భూమిలోకి ఇంకే విధంగా చెరువుల ఇంకుడు కందకాలు తీయడం, చెరువు గర్భంలో (blasting) బ్లాస్టింగ్ చేయడం, బోడి కొండలలో 'ట్రెంచింగ్' చేసి పచ్చదనాన్ని పెంచడం, వ్యవసాయ భూములలో భూసార సంరక్షణ కార్యక్రమాలను సంపూర్ణంగా అమలు చేయడం. వర్షపునీటిని పంటలకనుగుణముగా ఒడుపుకోవడం ఇవన్నీ కూడా నీటి వినియోగ విధానంలో భాగాలే.

## 5. జాతీయ జలవిధానం మరియు జాతీయ "నీటి వలయం" (National Water Grid) :

పై విషయాలను ప్రాతిపదికగా తీసుకొన్నపుడు అన్ని విధాలుగా లభ్యమయ్యే నీటిని సమతుల్యంగా మరియు విస్తృతంగా పంపిణీ చేయుటకు అవకాశం గలదు. నీటి సమస్య ఏ ఒక్క గ్రామానికో, ఏదో ఒక ప్రాంతానికో పరిమితంగా ఆలోచన చేయడం ఆసంబద్ధం – మొత్తం దేశాన్ని దృష్టిలో వుంచుకొని, అన్ని ప్రాంతాల అవసరాలు సమానంగా, సమతుల్యంతో తీర్చగలిగే దృష్టితో చూడాలి. జిల్లాల, ప్రాంతాల, రాష్ట్రాల సరిహద్దులు మనం ఏర్పాటు చేసుకొన్నవి. వర్షానికి, నీటి లభ్యతకు ఈ సరిహద్దులకు పొంతన వుండదు. కానీ నీటి అవసరాలు మాత్రం దేశవ్యాప్తంగా తీర్చవలసి వుంటుంది. **సాధ్యమైనంత సమానస్థాయిలో అన్ని ప్రాంతాల నీటి అవసరాలు తీర్చే ప్రాతిపదికపై నీటి వినియోగ విధానం రూపుదిద్దుకోవాలి. ఎగువ ప్రాంతాల** (Upper reaches) **నీటి అవసరాలు ఒక అనుసంధాన సమన్వయ వినియోగం** (Conjunctive use) ప్రాతిపదికన తీర్చుతూ, అదనపు నీటిని నదుల అనుసంధానం ద్వారా ప్రాజెక్టుల ద్వారా, మళ్ళింపు కాల్వల ద్వారా నీటి కొరతగల ప్రాంతాలకు తరలించడం తప్పనిసరిగా జరగాలి. భౌగోళిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, పర్యావరణ, మానవ వ్యవసాయానికి తగ్గించే విధంగా నదులపై ఎక్కువ సంఖ్యలో ఒక క్రమపద్ధతిలో చిన్న చిన్న డ్యాములను, మరియు మళ్లింపు కాల్వలను, పైపులైనులను నిర్మించి, సాధ్యమైనంత వరకూ ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రాంతీయ, రాష్ట్రసరిహద్దులతో నిమిత్తం లేకుండా నీటి లభ్యతను సమతుల్యంగా పంపిణీ చేసే "నీటి వలయం" (Water Grid) **ను స్థాపించవలసి వుంది. ఈ విధానం విజయవంతం కావడానికి ప్రభుత్వాలకు దృఢమైన రాజకీయ సంకల్పం వుండాలి. దానికి తోడు ప్రజల భాగస్వామ్యం కావాలి. అందుకు మనం చొరవ చూపాలి. దృఢమైన రాజకీయ సంకల్పం మరియు ప్రజల భాగస్వామ్యమే ఈ పథకాల విజయాలను నిర్ణయించగలదు.**

## 6. ముగింపు

కేవలం మనిషికే కాదు, జీవించే ప్రతిప్రాణికి నీటిపై సహజంగానే హక్కువుంటుంది. ఈ హక్కును ప్రభుత్వాలు, ప్రజలు తప్పని సరిగా గుర్తించాలి. తదనుగుణంగా నీటిని ప్రాణకోటికి అందించే ప్రయత్నం చేయాలి.

పై విషయాల ప్రాతిపదికగా జల వనరుల వినియోగ విధానం మనం పరిశీలించినపుడు నీటిపైన ఏ కొన్ని ప్రాంతాలకో ప్రత్యేక హక్కు ఉండడం, కొన్ని ప్రాంతాలకు అసలు హక్కే లేకుండా వుండడం అన్యాయం, అసమంజసం. అందుకే జాతీయ నీటి విధానం కావాలి. దేశప్రజలందరకీ నీటిపై కనీస హక్కు వుండాలి. జాతీయస్థాయిలో, సమతుల్య పంపిణీ, సమన్వయ వినియోగం దృష్టిలో వుంచుకొని ప్రాంతాల, రాష్ట్రాల, జిల్లాల సరిహద్దులను ప్రక్కన పెట్టాలి. కేంద్రప్రభుత్వ ఆధీనంలో కనీస సదుపాయాలు కలుగజేయాలి. అన్ని ప్రాంతాలకు, అన్ని గ్రామాలకు న్యాయం జరగాలి. నీటి రాజకీయాలకు, వివాదాలకు, ఘర్షణలకు ముగింపు పలకాలి. ప్రాంతీయ అసమానతలు తగ్గి, దారిద్ర్య నిర్మూలన జరిగి, అవకాశాలున్నంతలో అన్ని ప్రాంతాలు, ప్రజలు అభివృద్ధికి నోచుకొని శాంతియుత సహజీవనం చేయాలి. అలాగే దేశ ప్రజలు మరియు దేశంలోని సహజవనరులైన అడవులు, భూములు, ప్రాణకోటి శాశ్వత ప్రాతిపదికపై సహజీవనం చేయాలి. *– కదలిక నవంబర్ – 2000 సంచికనుండి*

## నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ పథకాన్ని రూపొందించి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి అనంత సంక్షోభాన్ని పరిష్కరించాలి.

గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వ్యవసాయం మీద ఒత్తిడి గణనీయంగా తగ్గించడానికి జిల్లాలో మానవ వనరుల వినియోగానికి ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించి కాలపరిమితితో అమలు చేయడం, సహకార వ్యవసాయాన్ని పెంపొందించడం, మెట్టపొలాలకు పనికివచ్చే తక్కువ కాలపరిమితి కల్గిన వంగడాలను తయారు చేయడానికి పరిశోధనలు చేయడం అనంతపురం లాంటి జిల్లాకు అత్యంత అవసరమని ఈ చర్యలతో పాటుగా అనంతపురం జిల్లాలోని చెరువులు, కుంటలకు ఇతర ప్రాంతాల నుండి నీటిని తరలించి కనీసం 30శాతం భూమికి సాగునీటి వసతులు కల్పించాలనీ జిల్లాలో 30శాతం అడవుల పెంపకం జరగాలనీ పండ్ల తోటల పెంపకం, పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకం లాంటివి విస్తృత స్థాయిలో చేబట్టాలనీ పర్యావరణవేత్త ఆర్.డి.టి. ఎకాలజీ డైరెక్టర్ శ్రీ వై.వి.మల్లారెడ్డి గారు అన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల నేపథ్యంలో అనంతపురం జిల్లా సంక్షోభంపై కదలిక జరిపిన ఇంటర్వ్యూ ప్రచురిస్తున్నాం.

*- ఎడిటర్*

**ప్రశ్న :- దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభ నేపథ్యంలో అనంతపురం జిల్లా రైతుల పరిస్థితిపై మీ అభిప్రాయమేమిటి ?**

అనంతపురం జిల్లా రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులకు ఇతర ప్రాంతాలలోని రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులకు పోలికేలేదు. వరుసగా కరువుల వాతకు గురికాబడి అప్పుల్లో మునిగి రైతు మరియు గ్రామీణ వ్యవస్థ నేడు తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఈ ప్రాంత శీతోష్ణస్థితి, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ ఏక పంట విధానం చోటు చేసుకొంది. ప్రపంచవాణిజ్య సంస్థతో భారతదేశం చేసుకొన్న ఒప్పందాల మూలంగా పామోలిన్ దిగుమతితో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా రైతాంగం నేడు గిట్టుబాటు ధరలేక - అసలే వేరుశనగ కొనే నాథుడు కన్పించక తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది.

వ్యవసాయం, నీటిపారుదల రంగాలు బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో రైతులు ప్రపంచ వాణిజ్య రంగంలో కాలానుగుణంగా మారుచున్న మార్పులకు అలవాటు పడుతారు. దేశ విదేశాలలోని వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తెలుసుకొని అందుకు అనుగుణంగా పంటలను పండించడానికి కావలసిన వ్యవసాయ పరిస్థితులు మరియు ఆర్థిక సత్తా వారికి ఉంటుంది. వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో సాగునీటి సదుపాయం గల భూములు బాగున్నాయి. వారికి పరపతి సౌకర్యం ఉంది. కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల వల్ల చౌకగా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నా వారు కొంత వరకూ తట్టుకోగలరు. అయితే అనంతపురం లాంటి వర్షాధార వ్యవసాయంగల కరువు జిల్లాలో కొన్ని పంటలు మాత్రమే పండుతాయి. కరువు సంవత్సరాలలో అవి కూడా ఉండవు. ఇక్కడి రైతాంగానికి ప్రత్యామ్నాయం లేదు. రైతులకు పరపతి సౌకర్యం చాలా తక్కువగా ఉంది. తక్కువ వర్షాభావ పరిస్థితులు ఇక్కడి వ్యవసాయ స్వరూపాన్నే మార్చివేశాయి.

**ప్రశ్న :- ఈ నేపథ్యంలో పరిష్కారమార్గాలు ఏవి ?**

పరిమాణాత్మక ఆంక్షలు 90శాతం వ్యవసాయరంగానికి చెందినవి. వెనుకబడిన ప్రాంతాలలో భాగమైన మన జిల్లాలో భౌగోళిక పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తుల వ్యయాన్ని తగ్గించి ఉత్పత్తులను పెంచుకోవడం సాధ్యం కావడం లేదు. నీటి పారుదల సామర్థ్యం ఈ ప్రాంతంలో తప్పని సరిగా పెంచుకోవాలి. కనీసం 30 శాతం భూమికి సాగునీటి వసతి కల్పించాలి. జిల్లాలో 30 శాతం అడవుల పెంపకం జరగాలి. జిల్లాలోని చెరువులు, కుంటలు ఆధునీకరించబడాలి. నిర్వీర్యమైన, తెగిపోయిన చెరువులను మరమ్మత్తు చేయాలి. విరివిగా నీటి పరీవాహక ప్రాంతాల అభివృద్ధి పథకాలు చేపట్టాలి. ఇవన్నీ ప్రజల భాగస్వామ్యంతో జరగాలి. జిల్లాలో వేరుశెనగ సంక్షోభ పరిష్కారానికి మార్గాలు, ప్రత్యామ్నాయాలపై విపులమైన అధ్యయనాలు జరగాలి. గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా పాడిపరిశ్రమ, పండ్ల తోటల పెంపకం, కోళ్ళ పరిశ్రమలను వ్యవసాయానికి అనుసంధానించాలి.

ఇటీవల కాలంలో మధ్యతరగతి ప్రజల్లో రైతులలో వినిమయ సంస్కృతి పెరిగిపోతున్నది. సమాజంలో ప్రతిష్టకోసం అవసరం వున్నా లేకపోయినా వివిధ విలాస వస్తువులను కొనుగోళ్ళు చేసే వాతావరణానికి నెట్టివేయబడ్డారు. పల్లెల్లో కూడా వినిమయ సంస్కృతి ప్రభావంగా ఎలక్ట్రానిక్ పరికరాలు, మినరల్ వాటర్ బాటిళ్ళు, కోకోకోలా, పెప్సిలు ప్రత్యక్ష మయ్యాయి. బీదవాళ్ళు కూడా కూల్ డ్రింక్స్ మోజును అనుకరించబోతున్నారు. ప్రపంచీకరణవల్ల “ఏక సంస్కృతి (మోనోకల్చర్)” ప్రపంచమంతటా పెంపొందింది. బహుళజాతి కంపెనీల ఉత్పత్తులు గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకొని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్నాయి. ప్రపంచీకరణలో భాగంగా మనదేశ వ్యవసాయ రంగం బాగా దెబ్బతిన్నది. ప్రపంచ వాణిజ్య సంస్థతో చేసుకొన్న ఒప్పందాలను తిరగతోడాలి. మన వ్యవసాయ, సాంఘిక పరిస్థితులకనుగుణంగా చర్చలు పునఃప్రారంభించాలి. మన దేశంలో ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం ఇంకా ఆసియా, ఆఫ్రికా దేశాలలో కూడా ఇలాగే వుంది. ఈ దేశాలన్నీ ఏకమై ప్రపంచ వాణిజ్య సంస్థను నిలదీయాలి. ఈ విషయంలో మనదేశం నాయకత్వం వహించి వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలను ఆలోచించాలి. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై 300 శాతం సుంకాలు వేయడానికి అవకాశం వున్నా పైస్థాయిలోని అవినీతివల్ల, రాజకీయ ఒత్తిళ్ళ వల్ల దిగుమతుల సుంకాలు పెంచడం లేదు. వీటికి పరిష్కారంగా భూసంస్కరణలు చిత్తశుద్ధితో అమలు పరచాలి. పరిపాలన వికేంద్రీకరించబడాలి. గ్రామ పంచాయితీలు పటిష్టంకావాలి. నీటిపారుదల సౌకర్యాలు మరింతగా పెంచాలి. వ్యవసాయంపై ఆధారపడి బ్రతికేవారి సంఖ్యను గణనీయంగా తగ్గించి వ్యవసాయేతర రంగాలకు గ్రామీణ ప్రజలను మళ్ళించాలి. మానవ వనరుల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి. సహజవనరులైన నీరు, అడవులు, భూమి వినియోగంపై అధ్యయనం పెంచాలి.

జనాభా పెరుగుదల అభివృద్ధికి అడ్డంకిగా నిలిచింది. ‘జీరో’ జనాభా అభివృద్ధి రేటు సాధించాలి. ప్రజల్లో, మన రైతుసోదరులలో పని సంస్కృతి పెరగాలి. అధిక జనాభా దారిద్ర్యాన్ని రెండింతలుగా పెంచింది. దారిద్ర్యం పెరుగుదల మూలంగా పర్యావరణం క్షీణించింది. ఇంత అధిక జనాభాకు వ్యవసాయమొక్కటే పూర్తికాలపు ఉపాధిని కల్పించలేదు. వ్యవసాయ రంగంపై జనాభా ఒత్తిడిని బాగా తగ్గించాలి. దీనిని దృష్టిలోపెట్టుకొని వివిధ వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వ్యవసాయం మీద ఒత్తిడి గణనీయంగా తగ్గిపోతుంది. జిల్లాలో మానవ వనరుల వినియోగ ప్రణాళికను (Human Develpment Plan) అభివృద్ధి చేయాలి. వ్యవసాయేతర ఉద్యోగవకాశాల్ని కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికంగా ఉన్నటువంటి నిరక్షరాస్యత, నిరుద్యోగ సమస్యలను మానవ వనరుల సామర్థ్యాన్ని దృష్టిలో వుంచుకొని పరిశీలించాల్సి వుంది. గ్రామీణ నిరుద్యోగులు ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలు, మహిళలు ఎక్కువ భాగం చదువు సంధ్యలు లేకుండా ఉన్నవారు అధికం. వ్యవసాయేతర నైపుణ్యస్థాయి, పూర్తికాలపు ఉపాధి మరియు పనులు లేనికాలంలో దొరికే తాత్కాలిక ఉపాధి అవకాశాలైనా వారికి అనుగుణంగా వుండాలి.

**ప్రశ్న :- కార్పొరేట్ వ్యవసాయంపై ...**

కార్పోరేట్ వ్యవసాయం ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి ప్రత్యామ్నాయంగా ప్రచారం జరుగుచున్నది, ప్రత్యామ్నాయ పరిష్కారమార్గంగా మన పాలకులు చెబుతున్నారు. కుప్పం తరహా వ్యవసాయం మన వ్యవసాయానికి కరువు ప్రాంతాల అవసరాలకు ప్రత్యామ్నాయంగా పాలకులు చెబుతున్నారు. కార్పోరేట్ వ్యవసాయం ఇక్కడ నెలకొన్న పరిస్థితులకు అనుకూలించదు. దీని మూలంగా వ్యవసాయంపై బ్రతికే చిన్న సన్నకారు రైతులు మరియు వ్యవసాయకూలీల పరిస్థితి దెబ్బతింటుంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. కార్పొరేటు వ్యవసాయంతో వ్యవసాయోత్పత్తులు పెరగవచ్చునేమోగాని రైతులు నిరాశ్రయులవుతారు. మనదేశంలో వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య ఎక్కువ. భూసంస్కరణలు అమలుచేసి ఉపాధి అవకాశాలు పెంచాలి.

**సహకార వ్యవసాయం పెంచాలి : -**

కార్పొరేట్ వ్యవసాయం బదులు రైతులు సహకార వ్యవసాయాన్నిపెంపొందించుకోవాలి. రైతులందరూ కలిసి సహకార వ్యవసాయం చేస్తే మంచి ఫలితాలుంటాయి.

జవాబుదారీ తనం, పారదర్శకతగల ప్రభుత్వ యంత్రాంగం జిల్లాలో పనిచేయాలి. సమస్యల్ని ప్రజల భాగస్వామ్యంతో అధ్యయనం జరపాలి. సమస్యలు జఠిలమైనవి. అవి పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పౌరసంఘాలు కృషి చేయాలి.

*- కదలిక ఏప్రిల్ - 2001 సంచికనుండి*

# అనంతపురం జిల్లాలో వ్యవసాయ సంక్షోభం నుండి ప్రస్తుతం రైతులనాదుకోవడమెలా?

మన జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి వివిధ స్థాయిలలో, వివిధ కోణాలనుండి చర్చ జరుగుతున్నది. వివిధ వర్గాలు రైతులు, శాస్త్రజ్ఞులు, అధికారులు, రాజకీయనాయకులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా ఈ చర్చలో పాల్గొంటున్నారు. ఇది హర్షించ దగ్గ పరిణామం. ఇంతవరకూ అనంతపురం జిల్లాను ప్రకృతి శాపిస్తూ, కరువు కాటకాలకు నిలయంగా మార్చింది. ప్రకృతి శాపానికి తోడుగా మన జిల్లాలో ఉన్నటువంటి చిన్న నీటి వనరులను, అటవీ సంపదనూ - ప్రజలూ, ప్రభుత్వమూ కలిసి వేగంగా క్షీణింపజేసి ఎడారీకరణకు మార్గం సుగమం చేశారు. దేశంలోనే మన జిల్లాకున్న తక్కువ వర్షపాతాన్ని, ఎడారీకరణను, ఆకలి చావులను ఎత్తిచూపుతూ మన రాష్ట్ర నీటి వాటాను అధికం చేసుకొన్నారు. కానీ ఆ నదీజలాలను అనంతపురానికి తరలించడంలో రాజకీయ వర్గాలు ఘోరంగా విఫలం అయినాయి. అనంతపురం జిల్లాకున్న కరువు-ఎడారీకరణ-దారిద్ర్యం అనే అవిటితనాన్ని తొలగిస్తే “అడుక్కుతినడానికి” పనికి రాదని మన పాలకులు భావించి ఉండవచ్చు.

ఇన్ని విధాలుగా ఇప్పటికే శపించబడిన జిల్లాకు అదనంగానూ, అనూహ్యంగానూ ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం కూడా శపిస్తున్నది. పామాయిల్ తక్కువ ధరకు దిగుమతి కావడంతో వేరుశనగ ధర అడుగంటింది. వెరసి అనంత రైతాంగానికి వర్తమానమూ, భవిష్యత్తూ అంధకారంగా మారాయి.

ఇటువంటి పరిస్థితుల్లో అనంత రైతాంగానికి వ్యవసాయ సంక్షోభం నుండి వర్తమాన ఉపశమనం కోసం కనీసం క్రింది రెండు చర్యలను చేపట్టవలసి వుంటుంది.

## 1) పంటల బీమా పథకం :-

అనంతపురం జిల్లా వ్యవసాయ పరిస్థితుల కనుగుణంగా కరువు బారినుండి రైతులను ఆదుకోవడానికి అనువైన పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి. ఈ బీమా వర్షాధార వ్యవసాయం చేసే రైతులందరికీ వర్తింపచేయాలి. ఎకరానికి ఎంత ప్రీమియం సరిపోతుందో సాధారణ పంట దిగుబడి మరియు నష్టావకాశాలు (రిస్క్ ఫాక్టర్స్) ఆధారంగా నిర్ధారించాలి. ఆ ప్రీమియంలో కొంత భాగాన్ని రైతుల నుండి వసూలు చేసి మరికొంత భాగాన్ని ప్రభుత్వమే చెల్లించవలసి వుంటుంది. దీని ఆధారంగా కరువు వల్ల పంట నష్టమైతే, నష్టాన్ని అంచనా వేసి, ఆ ప్రకారం నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారాన్ని చెల్లించవలసి వుంటుంది. జీవిత బీమా, ప్రమాదభీమా, ఆరోగ్య బీమా మొదలగు బీమాలున్నట్లు, కరువుకు బీమాను ప్రవేశపెట్టడం అవసరం.

అనంతరైతును కరువు బారినుండి ఆదుకోవడానికి ప్రస్తుతానికి ఇంతకంటే వేరే మార్గం గోచరించడం లేదు. లేకపోతే - ఎడారి నివారణ జరిగి పుష్కలంగా పర్యావరణం వృద్ధిచెంది శాశ్వతంగా కరువును ఎదుర్కొనే పర్యావరణ, వ్యవసాయ పరిస్థితులు ఏర్పడతాయని నమ్మే పరిస్థితులు ఎవరికైనా కన్పిస్తున్నాయా? లేక నదీజలాలు జిల్లాలో ప్రవహించి లక్షలాది ఎకరాలలో హరిత విప్లవాన్ని సాధించి కరువు పూసే లేకుండా చేస్తాయని విశ్వసిస్తామా? ఈ రెండు మార్గాలు సుదూర తీరాలే అందుకే “ పంటల బీమా ” ఆచరణ సాధ్యమౌతుంది.

**2) రైతుకు గిట్టుబాటు ప్రాతిపదికగా వేరుశనగ, కంది, ఆముదంలాంటి వర్షాధార పంటలకు మద్దతుధర ప్రకటించి అమలు చేయడం :-**

ఒక్కొక్క పంటపై రైతులు పెడుతున్న పెట్టుబడి ఆధారంగా రైతుకు గిట్టుబాటు అయ్యేవిధంగా మద్దతు ధర ప్రకటించి, అమలు చేయడం అవసరం. వేరుశనగ పండించడానికి గత సంవత్సరం ధరల ప్రకారం క్వింటాలుకు దాదాపు రూ. 1500/- ఖర్చుఅవుతున్నది. మరి క్వింటాలుకు రూ. 1220/- మద్దతు ధర ప్రకటించడంలో అర్థంలేదు. పంటల కొచ్చే రోగాలు అధికమవుతున్నాయి. తద్వారా పంట ఖర్చులు ప్రతి సంవత్సరం పెరుగుతూనే వున్నాయి. పంట దిగుబడి రాను రాను తరుగుతూ ఉంది. వీటినన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే వేరుశనగ మద్దతుధర కనీసం క్వింటాలుకు రూ. 2000/- ఉంటేగాని రైతుకు గిట్టుబాటుకాదు.

కరువు వల్ల పంట నష్టమైతే, నష్టాన్ని అంచనా వేసి, ఆ ప్రకారం ప్రతి నష్టపోయిన రైతుకూ నష్టపరిహారాన్ని చెల్లించవలసి వుంటుంది. జీవితభీమా, ప్రమాద భీమా, ఆరోగ్య భీమా మొదలుగు భీమాలున్నట్లు, కరువుకు భీమాను ప్రవేశపెట్టడం అవసరం.

కాబట్టి వేరుశనగ మద్దతు ధరను 2001 సంవత్సరానికి రూ. 2000/- గా ఇప్పుడే నిర్ణయించాలి. అలాగే జిల్లాలో పండించే ఇతర వర్షాధార పంటలైన ఆముదం, కంది మొదలగు వాటికి కూడా తగిన గిట్టుబాటు ధర ఇప్పుడే ప్రకటించి, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. తద్వారా వర్షాధార వ్యవసాయంలో పంటల భిన్నత్వానికి శ్రీకారం చుట్టాలి.

పైరెండు చర్యలు కొంత మందికి అనాచరణీయంగానూ, అవహేళనగానూ, సరదాగానూ కూడా అగుపించవచ్చు. అనంతపురం జిల్లాలో రైతాంగ జీవనమే అవమానాలకూ, అవహేళనలకూ, ఆత్మహత్యలకూ నిలయమైంది. భూముల వేలం, బంగారు నగల వేలం, నిరంతర ఆత్మహత్యలు, కూలి జనాల ఆకలి చావులూ ఎవరికి సరదా? అనంతపురం జిల్లాలో వర్షాధార వ్యవసాయం 30 లక్షల జనాభాకు ప్రత్యక్ష జీవనాధారం. జిల్లా ప్రజల జీవన్మరణ సమస్య. ప్రభుత్వాల ప్రథమ ధ్యేయం ప్రజల సంక్షేమం. మనది సంక్షేమ రాజ్యం. అందుకే ప్రజల సంక్షేమానికవసరమయ్యే చర్యలు చేపట్టి తీరాలి. అంతర్జాతీయ వ్యాపారాన్ని, వ్యాపార లాభాలను రక్షించడానికి మాత్రమే మన దేశ ప్రజాస్వామ్య సంక్షేమ ప్రభుత్వాలు పుట్టుకొని రాలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ యొక్క సరళీకృత విధానాలను సమర్థిస్తున్న కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు వారి దేశంలో రైతులను రక్షించడానికి కొన్ని పంటల ఖర్చుపై 70 శాతం వరకూ సబ్సిడీ ఇస్తున్నాయి. అలాగే జపాన్, వరి రైతులను దిగుమతుల ప్రభావం నుండి ఆదుకోవడానికి బియ్యం దిగుమతులపై వెయ్యి శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తున్నాయి. ఆ దేశాలలో ఇటువంటి ఎంతో ఖర్చుతో కూడుకున్న కఠిన చర్యలు రైతులనాదుకోవడానికి అవసరమూ, ఆచరణీయమూ, గౌరవ ప్రదమూ, అయినపుడు, అనంత రైతాంగాన్ని స్వల్ప కాలంలో ఆదుకోడానికి తగిన విధంగా పంటల బీమాను ప్రవేశపెట్టడం మరియు జిల్లాలో పండించే పంటలకు గిట్టుబాటు ధర నివ్వడం కూడా తప్పకుండా అవసరమూ, ఆచరణీయమూ, గౌరవప్రదం మాత్రమే కాకుండా, ఇది సంక్షేమ ప్రభుత్వ బాధ్యత కూడా.

వేరుశనగ మద్దతు ధరను 2001 సంవత్సరానికి రూ. 2000/- గా ఇప్పుడే నిర్ణయించాలి. అలాగే జిల్లాలో పండించే ఇతర వర్షాధార పంటలైన ఆముదం, కందిమొదలగు వాటికి తగిన గిట్టుబాటు ధర ఇప్పుడే ప్రకటించి, ప్రోత్సహకాలు ఇవ్వాలి. తద్వారా వర్షాధార వ్యవసాయంలో పంటల భిన్నత్వానికి శ్రీకారం చుట్టాలి.

*- కదలిక జనవరి -2002 సంచిక నుండి*

# ప్రత్యేక రాష్ట్రాలు కాదు - ప్రజల అభివృద్ధి కావాలి

## 1) పరిచయం:

తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలు ఒకే రాష్ట్రంగా ఏర్పడాలని, ఇతర భాషల సాంస్కృతిక పెత్తనం పోయి తెలుగుభాష ఒక రాష్ట్రభాషగా అవతరించాలని, ఆంధ్రరాష్ట్రం ఏర్పడకముందు ఉద్యమాలు సాగాయి. ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమంలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములుగారు తన ప్రాణాన్నే సమర్పించారు. ఈ క్రమంలో అనేక ఉద్యమాలు, ఆందోళనలు మరియు త్యాగాల ఫలితంగా 1956 సం॥లో విశాల ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్రరాష్ట్రాన్ని స్వంతంగా మన తెలుగువారే పాలనా పగ్గాలు చేపట్టి 50 సంవత్సరాలు కావస్తున్నది. అభివృద్ధి సంగతేమోగాని తెలుగు మాట్లాడే ప్రజల్లోనే, మన తెలుగు రాష్ట్రంలోనే తిరిగి విడిపోవాలనే ప్రాంతీయ ఉద్యమాలు తరచూ వస్తున్నాయి. ఈ ఉద్యమాలను నడిపే వాళ్ళు, సమర్థించేవాళ్లు, ఆ రోజున సమైక్య ఆంధ్రరాష్ట్రం సాధించడానికి నాయకులు ఏ కారణాలు చూపారో ఇంచుమించు అదే కారణాలు ప్రస్తుత "ప్రత్యేక" ఉద్యమ నాయకులు మనకు చూపుతున్నారు. కాకపోతే ఆ రోజున మద్రాసీలను, నిజాంను "మన" వెనుకబాటుకు కారణంగా చూపారు. ఈ రోజు మన తెలుగువాళ్ళనే కారణంగా చూపిస్తున్నారు. కాబట్టి ప్రాంతాలమధ్య అసమానతలు మరియు అసంతృప్తి పోగొట్టడానికి చిన్నచిన్న రాష్ట్రాలుగా విడిపోవడమో, లేదా సమైక్యంగా ఉండడమో "అభివృద్ధి" కి పరిష్కారమార్గం కాదన్నది అర్థమవుతున్నది. ప్రస్తుతం మనకు వినపడుతున్న ప్రత్యేక తెలంగాణా లేక ప్రత్యేక రాయలసీమలు రాష్ట్రాలుగా ఏర్పడాలనే వారి వాదనల్ని పరిశీలిద్దాం.

## 2) ఈనాటి తెలంగాణా "తెలంగాణా" కాదు: రాయలసీమ "రాయలసీమ" కాదు:

స్థూలంగా పరిశీలిస్తే ప్రాంతీయ ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రాలు కోరేవారి వాదనలకు హేతుబద్ధమైన పునాదిలేదు. ఉదాహరణకు ఇపుడున్న తెలంగాణా ఒకప్పటి తెలంగాణాలో ఒక ముక్క మాత్రమే.

తెలంగాణా అంటే నైజాం పాలన కాలం నాటి తెలంగాణాను కనుక పునాదిగా తీసుకుంటే, ఆ తెలంగాణా ఈనాడు మూడు ముక్కలుగా విడిపోయి వుంది. కొంతభాగం కర్నాటకలో వుంది. కొంత భాగం మహారాష్ట్రలో ఉంది. ఈ భాగాన్నంతా వదిలిపెట్టి, ప్రస్తుతం మనరాష్ట్రంలో ఉన్న తెలంగాణా "ముక్క" నే ఒక తెలంగాణా రాష్ట్రంగా కావాలనడం ఎంతవరకు సమంజసం? ఒకప్పటి విస్తృత తెలంగాణా ప్రాతిపదికన అన్ని ''ముక్కలను'' కలిపి ఒకే ''విశాల తెలంగాణా'' రాష్ట్రం కావాలనడం సమంజసమౌతుందేమో! అలాగే రాయలసీమ. రాయలసీమ అంటే విజయనగర "రాయలు" వారు ఏలిన సీమ అంటారు. ఆనాటి రాయలవారి పాలన ప్రస్తుతం రాయలసీమగా పిలవబడుతున్న నాలుగు జిల్లాలకే పరిమితమై ఉండలేదు. విజయనగర రాజుల పాలన క్రింద ప్రస్తుతం కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు కూడా ఉండినవే. రాయల వంశం ప్రధానంగా ఏలిన ప్రాంతం కర్ణాటకలో వదలిపెట్టి చాలాకాలం పరోక్షంగా పాలించిన ఈ నాలుగు జిల్లాలనే రాయలేలిన "రాయలసీమ"గా పరిగణించడం, ఆ ప్రాతిపదికన ప్రత్యేక "రాయల" రాష్ట్రం కావాలనడం ఎంతవరకు సమంజసం? ఈ నేపథ్యంలో ప్రత్యేక "ఓరుగల్లు" రాష్ట్రాన్ని లేక ప్రత్యేక "పుంగనూరు" రాష్ట్రాన్ని కోరడం కూడా సమర్థించాల్సిందేకదా!

గత చరిత్రలో తెలంగాణాలూ, రాయలసీమలు చాలామంది రాజుల పరిపాలన క్రింద చేతులు మారినాయి. మరి నిజాంలకు, రాయలవారికే ఉన్న ప్రత్యేకత ఏమి? కాబట్టి ఈ రాజరిక ప్రాంతాలకు ఎలాంటి పవిత్రత లేదు. ప్రాతిపదిక లేదు. నేతిబీరకాయలలో నెయ్యి ఉంటుందా?

ప్రాంతాలకు ఏకరాజరిక, ప్రాదేశిక పవిత్రత, చరిత్ర నేపథ్యం లేనపుడు, (లేని) ప్రాంతాల పేరుతో ప్రజల మనోభావాలు రెచ్చగొట్టి ప్రత్యేక రాష్ట్రాలు కావాలనడం రాజకీయ నిరుద్యోగులు స్వయం ఉపాధి కొరకు చేసే నినాదాలు తప్ప వాటికి ఏమాత్రం హేతుబద్ధత లేదు.

**3) ప్రాంతీయ వివక్షకంటే కొన్ని జిల్లాల వివక్ష మరియు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వివక్ష వాస్తవం:**

మనది వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. వివిధ జిల్లాల మధ్య వర్షపాతంలో తేడాలు అధికంగా ఉంటున్నాయి. దాదాపు సగం జిల్లాల్లో వర్షాధార వ్యవసాయం కరువులకు గురి అవుతుంది. ఇటువంటి పరిస్థితులలో వ్యవసాయాభివృద్ధి కావాలంటే, సాగునీటి సదుపాయాలు కల్పించడం జరిగింది. నదీజలాల పంపిణీ విషయంలో ఒక నిర్దిష్ట విధానం లేదు. దోచుకున్న వాడిది దోచుకున్నంత అనేదే ఒక ప్రాతిపదిక. ఇది చాలా గర్హించవలసిన అంశం. సామాజిక న్యాయప్రాతిపదికగా ఆలోచించినపుడు తక్కువ వర్షపాతం కలిగి, కరువు, ఎడారీకరణ ఎక్కడ తీవ్రమో (ఉదా: అనంతపురం, మహబూబ్‌నగర్) అక్కడ నమ్మదగిన సాగునీటి అభివృద్ధికి ప్రప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. వ్యవసాయకంగా అభివృద్ధి చెందకుండా ఇతర రంగాలలో అభివృద్ధి చెందిన జిల్లాలుగానీ, ప్రాంతాలు గానీ దాదాపు దేశంలోనే లేవు. వ్యవసాయం అభివృద్ధి చెందినప్పుడే ఆ ప్రాంతాలలో గ్రామీణ నిరుద్యోగం తగ్గి ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. అప్పుడే వ్యవసాయ పరిశ్రమలు మరియు వ్యవసాయేతర పరిశ్రమలు వివిధ స్థాయిలలో అభివృద్ధిచెంది తద్వారా చదువుకున్నవారికి ఉద్యోగాలు లభించి నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. అదేవిధంగా విద్య, వైద్య రంగాలలో కూడా ఆ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయి. ఈ విధంగా ప్రాంతాల అభివృద్ధికి నమ్మదగిన సాగునీటి అభివృద్ధి, తద్వారా వ్యవసాయాభివృద్ధి ఒక గట్టి పునాది. ఇది అందరు మేధావులు, శాస్త్రజ్ఞులు ఏకీభవించే వాస్తవం. మన రాష్ట్రంలో నీటిపారుదల సౌకర్యాల కల్పన విషయంలో తక్కువ వర్షపాతం కల్గి ఎడారిగా మారుతున్న జిల్లాలకే ఎక్కువ అన్యాయం జరిగిందనేది వాస్తవం. ఇరిగేషన్ కమీషన్ (1972) వారి సిఫార్సుల ప్రకారం ఒక బ్లాకు స్థాయి ప్రాంతంలో వ్యవసాయం స్థిరంగా వుండాలంటే – కనీసం 33 శాతం వ్యవసాయ భూమికి నమ్మదగిన సాగువసతి కల్గియుండవలెను. ఆ ప్రాతిపదికన చూసినప్పుడు, మన రాష్ట్రంలో 6 జిల్లాలు ఇంకనూ 33 శాతానికి తక్కువగా నీటి వసతి కల్గియున్నాయి. ఆ ఆరు జిల్లాలు రాయలసీమ, తెలంగాణాల్లోనే ఉండటం గమనార్హం.

ఉదా:- అనంతపురం జిల్లాలో సాగునీటి వసతి వ్యవసాయ భూమిలో కేవలం 14 శాతం – అది కూడా అపనమ్మకమైన చెరువులు, భూగర్భజలాలపై ఆధారపడియున్నది. అంతేగాకుండా, అక్కడ వర్షపాతం కూడా అత్యల్పంగా వుంటూ, అదునుకు రాకుండా ప్రతి ఐదు సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాలు కరువుకు గురవుతూవుంది. దేశంలోనే అత్యధిక రైతులు, రైతు కూలీల ఆత్మహత్యల జిల్లాగా అనంతపురం ప్రసిద్ధిగాంచింది. సాగునీటి విషయంలో అనంతపురం జిల్లాకు ఇంతవరకూ ప్రాధాన్యత యివ్వకపోవడం వివిధ ప్రభుత్వాల వివక్షకు పరాకాష్ఠ.

ఈ మధ్యకాలంలో హైదరాబాదు నగరాభివృద్ధిపై చూపిన ప్రేమ, ప్రాధాన్యత, యితర ప్రాంతాల పైనగానీ, రంగాలపైగానీ చూపలేదు. సరియైన ప్రాధాన్యతా క్రమంలేకుండా, ప్రభుత్వ ఇష్టాయిష్టాల ఆధారంగా ప్రాధాన్యతలు నిర్ణయిస్తే జిల్లాల మధ్య అసమానతలు పెరుగుతాయి. అనుత్పాదక రంగాలకు ప్రాధాన్యతలు పెరిగి, ఉత్పాదక, సాంఘిక, సంక్షేమరంగాలకు పెట్టుబడులు శూన్యమై, ఆర్థిక అసమానతలను, బహుముఖ దారిద్ర్యాన్ని ప్రభుత్వమే పెంచి పోషించినట్లవుతుంది.

## 4) భాష మరియు సాంస్కృతిక పరమైన ఆధిపత్యం:

ప్రత్యేక రాష్ట్రవాదులు మాండలిక భాష, మరియు సాంస్కృతిక పరమైన అణచివేత గురించి కూడా మాట్లాడుతున్నారు. భాష మరియు సాంస్కృతికపరంగా తీసుకొంటే కోస్తా తెలుగు భాష మరియు సంస్కృతి ఆధిపత్యం వహిస్తోందని మనమందరం అంగీకరిస్తాం. కానీ, ఉత్తరాంధ్ర, రాయలసీమ మరియు తెలంగాణా మాండలీకాలలో కూడా ఈ మధ్య రచనలు బాగా వస్తున్నాయి. వీటిని ఇంకనూ ప్రోత్సహించ వచ్చును. వాటన్నింటినీ ప్రాంతాలకతీతంగా చదువుతున్నారు. తెలుగువారు తెలుగు రచనల పఠనానికే పరిమితం కావడం లేదు. వీళ్లెనన్ని భాషల సాహిత్యం చదువుతున్నారు. భాషా, సాంస్కృతిక ఆధిపత్యాన్ని అధిగమించడానికి సమైక్య రాష్ట్రం ఏవిధంగానూ ప్రతిబంధకం కానవసరం లేదు. ఇప్పటికే భాషా, సాంస్కృతికపరంగా కోస్తాంధ్ర ఆధిపత్యాన్ని సమర్థవంతగా ఎదుర్కోవడం మొదలైంది. తెలంగాణా రాష్ట్రం వస్తే తెలంగాణా మాండలీకాన్ని మాత్రమే చదవాలనే శాసనం చేయబోరు. సమాజంలో "మార్పు" నిరంతరం వస్తూనే ఉంటుంది. దీనికి భాష, సంస్కృతులు మినహాయింపేమీ కాదు. వంద ఏళ్ళ క్రిందటి తెలుగును మనం ఇప్పుడు మాట్లాడటం లేదు. చాలా మార్పులు వచ్చాయి. ఆర్థిక, సామాజిక, సాంకేతిక అభివృద్ధి కనుగుణంగా జీవన విధాన వ్యవహారాల్లో నిరంతరమూ "మార్పు" వస్తూనే వుంటుంది. మనముంటున్న ప్రస్తుత సంస్కృతిలో కూడా కొన్ని అశాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం అనివార్యం. ఉదా: తెలంగాణా సంస్కృతిలో బాణామతి మూఢనమ్మకం ఉంది. రాయలసీమలో దేవదాసీ వ్యవస్థ ఉంది. ఇవి ప్రజల ప్రాంతీయ సంస్కృతిలో భాగమని, వాటిని పరిరక్షించం. వాటిని పోగొట్టుకోవడానికే ప్రయత్నిస్తాం.

సాంస్కృతిక ఆధిపత్యాన్ని గురించి చెప్పాలంటే ఒకరకంగా పాశ్చాత్య సంస్కృతి మనదేశ సంస్కృతినే సమూలంగా తుడిచిపెడుతున్నది. ఇది చాలా అవాంఛిత పరిణామం. మన సంస్కృతిలో వున్న వాంఛనీయాలను సంరక్షిస్తూ, పాశ్చాత్య సంస్కృతిలోని వస్తుదాహం, వినిమయ సంస్కృతి, వ్యక్తి కేంద్రీకృతలాంటి అవాంఛనీయ పోకడలను ప్రతిఘటించడం మన దేశానికి అవసరం.

## 5) చిన్న రాష్ట్రాలు ఆర్థికంగానూ, రాజకీయంగానూ అవాంఛితం:

చిన్న రాష్ట్రాలైతే, సత్వరంగా అభివృద్ధి చెందుతాయని "ప్రత్యేకుల" వాదన. ఈ వాదన ఆర్థికంగానూ, రాజకీయంగానూ ఆచరణీయంకాదు. అభిలషణీయం అంతకంటే కాదు. ఎందుకంటే, ప్రస్తుతమున్న సమైక్యాంధ్ర రాష్ట్రం ఆర్థికంగా అప్పులలో కూరుకుపోయి దివాళా పరిస్థితిలోవుంది. అప్పులపాలై సంక్షేమ పథకాలకు కోతపెడుతూ ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించుకొంటూ, ప్రభుత్వ ఆస్థులను అమ్ముకొంటూ, పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేస్తూ నెట్టుకొస్తోంది. పాలనాపరమైన ఖర్చులు విపరీతంగా పెరిగి తాజా మరియు మాజీ శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులకు వారి జీతభత్యాలకు మరియు రక్షణ కల్పించడానికే చాలా వ్యయం అవుతోంది. స్థూలంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయం, రాష్ట్ర పరిపాలనకు ఖర్చులకు మాత్రమే సరిపోతుంది. అటువంటి పరిస్థితిలో ప్రత్యేక రాష్ట్రాలేర్పడితే, తాజా మరియు మాజీ శాసనసభ్యుల, మంత్రుల, ముఖ్యమంత్రుల మరియు వారి సిబ్బంది సంఖ్య మరీ ఎక్కువగా పెరిగిపోతుంది. వీరందరికీ జీతభత్యాలు మరియు రక్షణ ఏర్పాట్లుచెయ్యాలి. క్రొత్త రాజధానులు నిర్మించుకోవాలి. పరిపాలనా భవనాలు ఏర్పాటుచేసుకోవాలి. ఇతర వసతులు, మౌలికసదుపాయాలు పెంచుకోవాలి. వీటన్నింటికీ నిధులు ఎక్కడినుంచి వస్తాయి? ఇటువంటి దివాళా పరిస్థితులలో చిన్న రాష్ట్రం ఏవిధంగా అభివృద్ధి అవుతుంది? అంతేగాదు. చిన్న రాష్ట్రాలు రాజకీయ అనిశ్చితికి దారితీస్తున్నాయి. హర్యానా, గోవా, ఈశాన్య రాష్ట్రాలలాంటి చిన్న రాష్ట్రాలలో తరచూ ప్రభుత్వాలు మారటం, పార్టీ ఫిరాయింపులు, వెన్నుపోట్లు అధికంగా ఉన్న విషయం అందరికీ తెలుసు. రాజకీయ అనిశ్చితి అభివృద్ధి నిరోధకమే అవుతుంది.

**6) కొన్ని జిల్లాల రాజకీయ ఆధిపత్యం రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నది. దీనిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలి.**

మన రాష్ట్రస్థాయిలో సరాసరి సాగునీటి వసతి చూసినప్పుడు వ్యవసాయభూముల్లో 40 శాతం భూమి సాగునీటి వసతి కల్గివుంది. 40 శాతం కన్నా తక్కువున్నటువంటి జిల్లాలు 9 ఉన్నాయి. ఆ 9 జిల్లాల్లోనూ 4 జిల్లాలు తెలంగాణా, 3 జిల్లాలు రాయలసీమల్లో వున్నాయి. ఈ విధంగా సాగునీటి విషయంలో తీవ్ర వివక్షత మూలంగా జిల్లాల వెనుకబాటుదనం, ప్రాంతీయ ఉద్యమాలకు ఊతమిస్తున్నమాట వాస్తవం. ఈ వివక్షకు కారకులెవరని ప్రశ్నించుకున్నప్పుడు సాగునీటి పంపకంపై నిర్దిష్ఠ ప్రాధాన్య విధానాలు లేకపోవడంతోపాటు, మన రాష్ట్రంలో వున్న కొన్ని "ధనిక" జిల్లాలవారి రాజకీయ ఆధిపత్యం చాలావరకు కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చు. రాజకీయ ఆధిపత్యం చెలాయించే జిల్లాలలోనే అధిక సాగునీటి వసతి సమకూర్చుకోగలిగినారు. పరిశ్రమలు, ఉపాధి, విద్య, వైద్యరంగాలలో కూడా ఈ జిల్లాలే అభివృద్ధికి నోచుకున్నాయి. ఉదా: ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు లాంటి జిల్లాలు. ముఖ్యమంత్రులెవరైనా, ఏ పార్టీ అధికారంలో వున్నా, ఈ జిల్లాల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నిరంతర ఆధిపత్యం దాదాపు అందరూ ఏకీభవించేదే. మరి ఇటువంటి పరిస్థితులలో ఈ బహుముఖ ఆధిపత్యాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొనడమా? లేక విడిపోవడమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. విడిపోవడమే పరిష్కారమనుకున్నప్పుడు, ఏ ప్రాతిపదికాలేని ప్రాంతాలవారీగా విడిపోయినా ఈ ఆధిపత్య సమస్య తీరదు. ఎందుకంటే ఆయా ప్రాంతాలలో తిరిగి అభివృద్ధి చెందిన జిల్లాలు, రాజకీయ ఆధిపత్యాన్ని చేపట్టి అభివృద్ధి చెందని జిల్లాలపై యధాతథంగా పెత్తనం చెలాయిస్తాయి. ఉదా: తెలంగాణాలో కరీంనగర్, నిజామాబాదులాంటి జిల్లాలు మిగతా తెలంగాణా జిల్లాలపై రాజకీయ, ఆర్థిక పెత్తనం చెలాయించడం జరుగుతుంది. అప్పుడు జిల్లాలను కూడా విడగొట్టడమే పరిష్కారమా? కాబట్టి, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ఆధిపత్యాన్ని ప్రజాస్వామ్య పద్ధతులలో ఎదుర్కొనకుండా ఏ ప్రాతిపదికలేని ప్రాంతాలవారీగా విడిపోవడమనేది పరిష్కారం కాజాలదు.

**7) సమగ్ర సమతౌల్య రాష్ట్రాభివృద్ధి కావాలా? లేక ప్రత్యేక రాష్ట్రాలు కావాలా?**

వెనుకబడిన జిల్లాల ప్రజలు వారి అభివృద్ధిని కోరుకుంటారు. అది వారి హక్కు. అంతేకానీ ప్రత్యేకరాష్ట్ర వాదన వారికేమంత ముఖ్యముకాదు. కానీ, కొందరు రాజకీయ నాయకులు స్వార్థప్రయోజనాల కోసం ప్రత్యేక రాష్ట్రాలను కోరుకొంటారు. ప్రజల అభివృద్ధి వారికేమంత ముఖ్యం కాదు. రోగం వెనుకబాటు అయితే "ప్రత్యేక రాష్ట్రమ" నే మందు పనిచేయదు. వెనుకబాటుతనాన్ని నిర్మూలన చేసేందుకు మందు కావాలి.

రాష్ట్రం అభివృద్ధి కావాలంటే నిర్దిష్ట ప్రణాళికలుండాలి. ఆ అభివృద్ధి అనేది జిల్లాల మధ్య మరియు బీద, ధనికుల మధ్య ఆర్థిక అసమానతలను తగ్గించి దారిద్ర్యాన్ని పారద్రోలాలి. మనకున్నటువంటి సహజవనరులను మరియు మానవ వనరులను "సమ సమాజ" ఆధారిత ఆర్థికాభివృద్ధి దిశగా నిర్మాణాత్మకంగా వినియోగించాలి. బీదవారి జీవన ప్రమాణాలను పెంచని అభివృద్ధిని మనమందరమూ నిరసించాలి. కాబట్టి అభివృద్ధికి కొన్ని నిర్దిష్ట ప్రామాణికాలు, ప్రాతిపదికలు ఉండాలి. ఉదా: ఉపాధి, గ్రామీణ ఉపాధి, నమ్మదగిన సాగునీరు, ఉపాధి ఆధారిత విద్య-వైద్యసదుపాయాల అందుబాటు మొదలగునవి. ఈ ప్రామాణికాల ఆధారంగా జిల్లాల వారీగా అభివృద్ధి ప్రాధాన్యతలను హేతుబద్ధంగా నిర్ణయించాలి.

దారిద్ర్యం, నిరుద్యోగం, అవినీతి అన్నవి ప్రాంతాలకతీతంగా వ్యాపించివున్నాయి. కానీ, కొన్ని జిల్లాలు, కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే అభివృద్ధి ఫలాల్ని అందజేసి మిగిలిన జిల్లాలను, వర్గాలను నిర్లక్ష్యంచేసే విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలి. హైదరాబాదు నగరంలో ప్రధాన ప్రాంతాలను గమనిస్తే మనకు రాష్ట్రం చాలా సుభిక్షంగా వున్నట్లు కనపడుతుంది. అది ఒక పార్శ్వం మాత్రమే. అదే హైదరాబాద్ నగరంలో ఉపాధిలేక అలమటించేవారు, ఆకలితో అల్లాడేవారు. నిరుద్యోగులు, మురికివాడలలో హీనస్థితిలో

నివసిస్తున్నవారు 30 శాతం వరకూ ఉన్నారు. దీన్ని మనం అభివృద్ధి అనగలమా? స్వాతంత్ర్యం వచ్చి 56 సం॥లు గడిచినా ప్రజల దారిద్ర్యాన్ని పోగొట్టుకోలేని పరిస్థితులలో ప్రత్యేక రాష్ట్రాలు వస్తే సులభంగా దారిద్ర్యం పోతుందని భావించడానికి "ప్రత్యేకవాదుల" వద్ద ఏమైనా మంత్రదండాలు ఉన్నాయా?

రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయి. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలమధ్య, జిల్లాల మధ్య, గ్రామాల మధ్య, సోదరులమధ్య సాగునీటి కోసం ఆందోళనల్ని, పోట్లాటలను మనం చూస్తూనే వున్నాం. సాగునీటి పంపిణీలో అసమానతలు అన్ని స్థాయిలలోనూ ఉన్నమాట వాస్తవం. జిల్లాల మధ్య అసమానతలు తగ్గి అభివృద్ధి కావాలంటే నీటి వనరుల పంపిణీలో వివిధ స్థాయిలలో (ప్రాంతాలు, జిల్లాలు, గ్రామాలు, కుటుంబాలు) సమతూకం అవసరం. ప్రాంతీయవాదులు కోరుతున్నట్లుగా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయినా, సమైక్యంగా ఉన్నా 100 శాతం వ్యవసాయ భూములన్నింటికీ నమ్మదగిన సాగునీరు పారించలేరు. నీరు పారని వర్షాధార భూములపై ఆధారపడి తరచు కరువులకు గురి అవుతున్న రైతుల పరిస్థితి ఏమిటి? ఈ సమస్యలను ఎట్లా పరిష్కరిస్తారో ఎవరూ చెప్పడం లేదు. అప్పుడు మళ్లీ జిల్లాల మధ్య, ప్రజలమధ్య అసంతృప్తి పెరుగుతుంది.

వ్యవసాయాన్ని ప్రధానాంశంగా తీసుకొని వ్యవసాయకంగా వెనుకబడిన జిల్లాలను గుర్తించాలి. నమ్మదగిన నీటిపారుదల సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించాలి. ఆ ప్రాంతాల సమతుల్యత మధ్య సాధించే రకంగా సాగునీటిని అందించే పద్ధతిలో ప్రణాళికలు అమలు చేయాలి. వర్షాధార భూమిలో పంటలు పండించడానికి రైతులకు తగిన రాయితీలతో రక్షణ కల్పించాలి. వర్షాధార పంటల భీమాపథకాన్ని కరువుకాలంలో రైతులకు ఉపయోగపడేవిధంగా అమలు చేయాలి. పంటల విధానంలో కూడా మార్పులు చేయాలి. ఎక్కువగా నీరున్న గోదావరి జిల్లాలోని రైతులు వరి పండించాలని కోరుకుంటారు. నీరు లేని అనంతపురం జిల్లాలోని రైతులు కూడా వరి పండించాలని కోరుకుంటారు. దీనికి కారణం వరికి గిట్టుబాటు ధర ఉండటమే. వర్షాధార పైర్లకు, ఆరుతడి పంటలకు (వేరుశనగ, జొన్న, సజ్జ, రాగి మొ॥) గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు కల్పిస్తే అందరూ వరినే పండించాలని కోరుకోరు.

చదువుకున్న నిరుద్యోగులు ప్రతి సంవత్సరం వేలు, లక్షల సంఖ్యలో అధికమవుతున్నారు. వీరందరికీ ఉపాధి లేదా స్వయం ఉపాధి అవకాశాల కల్పన ప్రాధాన్యత సంతరించుకోవాలి. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు మొదలగు రంగాలలో వెనుకబడిన జిల్లాలను, జిల్లాలలోని ప్రాంతాలను గుర్తించాలి. వాటిని ఒక ప్రాధాన్యతాక్రమంలో ఉంచుతూ, ఆయా రంగాలలో సమతౌల్యమైన అభివృద్ధికోసం విధాన ప్రాతిపదికలు సహేతుకంగా నిర్ణయించాలి. పరిశ్రమలన్నీ కొన్ని పట్టణాలలో కేంద్రీకరించకుండా వికేంద్రీకరించి, మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహక పరిస్థితులు కల్పించాలి.

ముఖ్యంగా మన రాష్ట్రాన్ని పీడిస్తున్న ఒక ముఖ్య సమస్య అవినీతి. అవినీతికారణంగా ప్రజలకు చేరవలసిన పథకాలను దారి మళ్లించి కొంతమంది రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ప్రజలేమో దుర్భర దారిద్ర్యంలో మగ్గుతూనే వున్నారు. అవినీతిని అదుపులో పెట్టకుండా ప్రత్యేకరాష్ట్రమైనా, సమైక్య రాష్ట్రమైనా అభివృద్ధిని సాధించడం అసాధ్యమౌతుంది.

ఈనాడు ప్రపంచ బ్యాంకు నుంచి వేల కోట్ల రూపాయలు అప్పులు తెస్తున్నారు. అప్పులు తెచ్చే విషయంలోనూ, షరతుల విషయంలోనూ ప్రజల భాగస్వామ్యం, ఏకాభిప్రాయం, పూర్తి పారదర్శకత ఉండాలి. అప్పులు, వాటి వినియోగ ప్రాధాన్యతా ప్రాతిపదికలపై నిర్మాణాత్మక చర్చ జరగాలి. అప్పులు తేవడం తప్పు కాదు గానీ, వాటిని ఏరంగంలో ఖర్చు పెడుతున్నారన్నదే సమస్య. చేసిన అప్పులను సమతౌల్య అభివృద్ధి సాధించే దిశగా సాగునీరు, పరిశ్రమలు మొదలగు ఉత్పాదక రంగాలలో ఖర్చుచేస్తే 'ప్రజల' అభివృద్ధికి ఉపయోగపడ్తాయి. సాధారణ ప్రజలు నిలదీస్తేనే ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వాలు 'ప్రజల' దారికొస్తాయి. యధాప్రజా – తధా ప్రభుత్వం అనే నినాదం ప్రజాస్వామ్యంలో దాగివున్న వాస్తవం. ఈ

దిశగా మేధావి వర్గం మరియు పౌరసమాజం సమన్వయంతో కృషి చేయాలి. వెనుకబాటుతనమనే సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవడానికి మనం ఆలోచించి పట్టుదలతో కృషిచేయాలి. కొంతమంది రాజకీయ నిరుద్యోగులు స్వయం పోషణ కోసం చేసే ప్రాంతీయ ఉద్యమాలను అన్ని వర్గాలూ కలసికట్టుగా త్రిప్పికొట్టాలి.

**8) ముగింపు:**

రాష్ట్రం సమగ్రంగా మరియు సమతౌల్యంగా అభివృద్ధి కావాలంటే నిర్దిష్ట ప్రామాణికాలు, ప్రాధాన్యతల ఆధారంగా స్వల్పకాల మరియు దీర్ఘకాల ప్రణాళికలు నిర్దుష్టంగా ఉండాలి. అటువంటి ప్రణాళికలలో వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు, ఉపాధి కల్పన సాంకేతిక విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత నివ్వాలి. ఆ ప్రణాళికలు ఆర్థికాభివృద్ధితోపాటు, జిల్లాల మధ్య ఆర్థిక అసమానతలను మరియు దారిద్ర్యాన్ని తగ్గించే దిశగా ఉండాలి. వాటి అమలు కోసం ఒక ప్రాధాన్యతాక్రమం మరియు వనరుల సముపార్జన కూడా వుండాలి. ఏ రాజకీయ పార్టీ అధికారంలో వున్నా ఎవరు ఏ ప్రాంతం నుండి ముఖ్యమంత్రిగా ఉన్నా ప్రామాణికాలను మరియు ప్రాధాన్యతలను విస్మరించకూడదు. అలా విస్మరిస్తే ప్రజలు మరియు పౌరసంస్థలు వెంటనే ప్రతిఘటించాలి. స్వల్ప మరియు దీర్ఘకాల నిర్దుష్ట ప్రణాళికల రూపకల్పనలోనూ, ప్రాధాన్యతలను నిర్ణయించడంలోనూ ప్రజలు, మేధావులు, ప్రభుత్వాలు, రాజకీయ వర్గాలు నిర్మాణాత్మకంగా పాలుపంచుకోవాలి. అలాగే వాటిని అమలు చేయడంలో కూడా పౌరసమాజం పాత్ర మరియు పౌరనిఘా నిర్మాణాత్మకంగా మరియు నిరంతరంగా ఉండాలి. అంతేగానీ, కొంతమంది రాజకీయ నాయకులు స్వయంపోషణ కోసం చేసే ప్రాంతీయ ఉద్యమాలవల్ల ప్రజల సమగ్ర అభివృద్ధి జరుగదు. ఈ ప్రాంతీయ ఉద్యమాలు స్వార్థపూరితమై, అనైక్యతకు, విచ్ఛిన్నానికి మాత్రమే తోడ్పడతాయి. అటువంటి ప్రాంతీయ ఉద్యమాలను ప్రజలు, మేధావులు, పౌరసంస్థలు ఏక కంఠంతో సమర్థంగా త్రిప్పికొట్టాలి.

*– కదలిక మే – 2006 సంచికనుండి*

## నదుల అనుసంధానమే కాదు; నీటితో ప్రజల్ని అనుసంధానించాలి!

**అంతర్జాతీయంగా జలవనరులపై వస్తున్న ధోరణులేమిటి? భారతదేశంపైన, ప్రత్యేకించి ప్రభుత్వాలపైన దాని ప్రభావం ఏవిధంగా ఉంటుంది? ప్రజలు ఈ విధానాలపై అనుసరించాల్సిన చర్యలేమిటి?**

ప్రస్తుతం అంతర్జాతీయ నీరు, నీటి విధానాలు, దాని వినియోగంపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. మొదటి అంతర్జాతీయ నీటి సదస్సు 1997లో డబ్లిన్‌లో జరిగింది. 2000వ సంవత్సరంలో నెదర్లాండ్‌లోని హేగ్‌లో రెండవ సదస్సు జరిగింది. 2003వ సం.లో జపాన్‌లోని టోక్యోలో మూడవ ప్రపంచ నీటి సదస్సు జరిగింది. రెండవ మరియు మూడవ సదస్సులలో నేను పాల్గొనడం జరిగింది. 2006 మార్చిలో మెక్సికో దేశంలో నాల్గవ ప్రపంచ నీటి సదస్సు జరుగుచున్నది. ఈ మధ్యకాలంలో వివిధస్థాయిలలో ప్రపంచ దేశాలలో ఈ అంశంపై బాగా చర్చలు జరిగాయి. అయితే ఈ చర్చలలో నీటికి సంబంధించి ప్రపంచదేశాల దృక్పథాన్ని ముఖ్యంగా అభివృద్ధిచెందిన దేశాల దృక్పథాన్ని గమనిస్తున్నాను. వారి దృష్టిలో నీరు అనేది ఒక వ్యాపార వినిమయ వస్తువు, టెలివిజన్, కారు మరియు ఇతర వినిమయ వ్యాపార వస్తువులలాగానే నీటిని కూడా కేవలం ఒక వినిమయ వస్తువుగా చూడడం జరుగుతోంది. ఈ దృక్పథాన్ని ఆధారంగా చేసుకొనే వారు మొత్తం చర్చల సారాంశాన్ని మరియు నీటి విధానాలను ప్రభావితం చేస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశాలు చేస్తున్న వాదన ఏమంటే, అభివృద్ధి చెందుతున్న మరియు వెనుకబడిన దేశాలు వలస పాలన నుండి స్వాతంత్ర్యం సంపాదించుకుని 50-60 సంవత్సరాలు కావస్తున్నా, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలకు చెందిన చాలాదేశాల్లో ఆ ప్రభుత్వాలు తాగేనీటి సమస్యను తీర్చలేకున్నాయి. అవి ఇకముందు కూడా తీర్చగలిగే స్థితిలో లేవు. కాబట్టి, నీటిని ప్రైవేటీకరిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. త్రాగునీటి మరియు సాగునీటి సమస్యను తీర్చడానికి భారీగా పెట్టుబడులు కావాలి. ఆ దేశాలు ఈ పెట్టుబడులు సమకూర్చుకునే పరిస్థితులో లేవు. ప్రైవేటురంగంలో అయితే వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుంది. లాభాలకోసమని ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టినట్లే, వాటర్ ఇండస్ట్రీలో కూడా వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెడ్తాయి. ఆవిధంగా ప్రైవేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడం వల్ల నీటి మౌలిక వనరులు అభివృద్ధి చెందుతాయి. నీటిరంగంలో మౌలికవనరులు ఏర్పడ్డం వల్ల అందరికీ నీళ్ళు అందుతాయి అనే వాదనను అభివృద్ధి చెందిన దేశాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

మనం మాత్రం ఈ వాదనను పూర్తిగా తిరస్కరించాల్సి వుంటుంది. వారు చెబుతున్నట్లే, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల్లో పేదదేశాలలో దారిద్ర్యం ఎక్కువగా వుంది. ప్రజలలో అంత దారిద్ర్యమున్నచోట నీటిని కొనుక్కొని వ్యవసాయం చేయడం మరియు నీటిని కొనుక్కొని తాగడం సాధ్యమవుతుందా? ప్రపంచంలోని ప్రజలందరికీ నీటిని కొనుక్కొని తాగే స్తోమత ఉందా? ఈ ప్రశ్నకు అభివృద్ధి చెందిన దేశాల ప్రతినిధులు సమాధానం చెప్పడం లేదు. ఈ ప్రశ్నను నేను హాలెండ్‌లో జరిగిన సమావేశంలో హాలెండ్ నీటి వనరుల మంత్రికి వేశాను. హాలెండ్‌లో జరిగిన ప్రపంచ నీటి సదస్సు-2 కి

హాలెండ్ మంత్రిణి, కో-ఛైర్ పర్సన్. దానికి ఆమె ప్రజలు నీటిని కొనుగోలు చేసే పరిస్థితులలో లేనప్పుడు ఆయా దేశాల ప్రభుత్వాలు నీటిమీద సబ్సిడీలు ఇచ్చుకోవచ్చును అని సమాధానం చెప్పారు. బీదవారు త్రాగే నీటికి (కార్పొరేట్ ధరలకు) సబ్సిడీలు ఇచ్చే ఆర్థిక పరిస్థితులే ప్రభుత్వాలకు ఉంటే, నీటిపంపిణీలో మౌలిక వనరులు వారే అభివృద్ధి చేసుకుని ఉండేవారు కదా! మౌలిక వనరులు అభివృద్ధి చేసుకోలేని ఆర్థిక పరిస్థితులున్నపుడు నీటిని కంపెనీల నుండి కొని బీదవారికి ఇచ్చే పరిస్థితి ఆయా దేశాలకు ఏవిధంగా ఉంటుంది? బీదదేశాల ఆర్థిక బలహీనతను ఆధారంగా చేసుకొని, ఆయా దేశాలలో నీటి వ్యాపారం మొదలుపెట్టి అధికంగానూ, శాశ్వతంగానూ లాభార్జన చేయవచ్చుననేది అభివృద్ధిచెందిన దేశాలలోని బహుళజాతి సంస్థల వ్యూహం.

ఏది ఏమైనా నీటిని ప్రైవేటీకరించాలన్న వాదన చాలా బలీయంగా ముందుకు వస్తున్న వాస్తవాన్ని మనం గుర్తించక తప్పదు. దాని ప్రభావం మూలంగానే, మనదేశంలో కూడా కేంద్రప్రభుత్వం విడుదల చేసిన జాతీయ నీటి విధానం - 2000 లో నీటిని ప్రైవేటీకరించే కార్యక్రమాలు కూడా మొదలయినాయి. దీనిని పౌరసమాజం తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. నీటి ప్రైవేటీకరణ గనుక జరిగితే దేశంలో చాలమంది పేద, మధ్య తరగతి వారికి తాగడానికి కూడా నీరు దొరకదు.

నా ఆలోచన ప్రకారం, మనం పీల్చేగాలి మాదిరిగానే నీరు ప్రతి మానవునికి సహజంగా ప్రకృతినుండి సంక్రమించిన ప్రాథమిక జన్మహక్కు. నీరు ప్రకృతి ప్రసాదించిన వరం. జాతీయసంపద. “నాగరిక ప్రపంచంలో మనిషికి జీవించే హక్కుతోపాటు గాలి మరియు నీటిపై హక్కు కూడా జన్మతః సంక్రమిస్తుంది”. నీటిపై హక్కు “కొనుక్కోగల్గిన” వారికి మాత్రమే వుంటే, “కొనుక్కోలేని” వారికి జీవించే హక్కులేనట్లే గదా? కాబట్టి, నీరు ప్రతి మనిషికి ప్రాథమిక హక్కు - బీద, ధనిక తేడా ఇక్కడ అసందర్భం, అసమంజసం, అన్యాయం మరియు అమానుషం.

**నీటిని ప్రైవేటీకరించే ప్రక్రియ మనదేశంలో ప్రారంభమయిందన్నారు కదా! మరి మనదేశంలో మనం వాటిని ఏ విధంగా స్వీకరించాలి?**

నీటిని ప్రైవేటీకరించే విధానాలను వ్యతిరేకించడం మన ప్రజల అజెండా కావాలి. మనదేశంలోని పరిస్థితులు గమనించినపుడు, నీటి మౌలిక వనరులను మరియు పంపిణీని అభివృద్ధిపర్చడానికి మన దగ్గర తగిన నిధులు లేవన్నది వాస్తవం కావచ్చు. అయితే, స్వంత ఆర్థిక వనరులు లేకపోయినప్పటికీ, ప్రభుత్వాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను నిధులు ఏదోవిధంగా సమకూరుస్తున్నాయి. లక్షల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నారు. అదే పద్ధతిలో నీటి వనరుల అభివృద్ధి మరియు పంపిణీ ఒక అత్యంత కీలకమైన అభివృద్ధి కార్యక్రమంగా భావించి, నీటి వనరుల్ని అభివృద్ధి చేసి ఉండాల్సింది. ఉదాహరణకు, మన ప్రభుత్వాలు రోడ్లపైన, బ్రిడ్జిలమీద, నగరాల అభివృద్ధిమీద, ఫ్లైఓవర్లమీద పెడుతున్నటువంటి పెట్టుబడులు, నీటి వనరులపైన పెట్టియుంటే, దేశం ఈ పాటికి నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునే పరిస్థితిలో ఉండేది. ఇతర రంగాలకోసం లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వం అప్పుచేయడం జరిగింది. 2003 నాటికి మన దేశం యొక్క అప్పు రూ. 12 లక్షల 50 వేల కోట్ల రూపాయలు. ఇన్ని అప్పులు చేసి వివిధ రంగాలకు నిధులు సమకూర్చిన మనం నీటిరంగాన్ని ఎందుకు అలక్ష్యం చేశాం? ప్రతిచిన్న పనికి అప్పులకోసం విదేశాలకు పరిగెత్తే మన ప్రభుత్వాలు, నీటిరంగానికి నిధులు సమకూర్చకపోవడం గర్హనీయ విషయం.

అప్పులు చేసి అనుత్పాదక రంగాలలో ఖర్చుపెట్టడాన్ని మనం వ్యతిరేకించాలి. అప్పులు చేసి నీటి వనరుల్ని అభివృద్ధి చేయడం తప్పు కాదు. కానీ, నిధులు లేవన్న పేరుతో నీటిరంగాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి. ప్రైవేటీకరణ అంటే, ఎవరు పెట్టుబడులు పెడతారో వారికి మన నీటివనరుల్ని శాశ్వతంగా ధారాదత్తం చేసినట్లు. మనదేశాన్ని విదేశీయులు పరిపాలిస్తుంటే వారితో మనం స్వాతంత్ర్య సమరం నడిపి మన స్వాతంత్ర్యాన్ని తిరిగి సంపాదించుకోగలిగాం. కానీ, ఇప్పుడు మన

నీటి వనరులను బహుళజాతి సంస్థలకు ఒక్కసారి ధారాదత్తం చేస్తే ఆ నీటిపై హక్కును మనం శాశ్వతంగా కోల్పోతాము. ఎన్ని సమరాలు చేసినా ఆ హక్కును మనం తిరిగి సంపాదించుకోలేము. అందుకే నీటిని ప్రైవేటీకరించడం చాలా తీవ్ర పర్యవసానం గల అంశం. అందుకే నీటి ప్రైవేటీకరణను ప్రజలందరూ సంఘటితంగా ప్రతిఘటించాలి.

**ఇటీవల దేశంలోని కరువు సమస్యలకు నదుల అనుసంధానం పరిష్కారం అంటూ ఒక వాదన వినిపిస్తోంది. నదుల అనుసంధానాన్ని మీరు ఏ రకంగా సమర్థిస్తారు? నదుల అనుసంధానం సాధ్యాసాధ్యాలు – వాటి మీద మీ అభిప్రాయం తెలపండి?**

స్థూలంగా నదుల అనుసంధానాన్ని నేను సమర్థిస్తున్నాను. ఎందుకు మనం ఈ అభిప్రాయాన్ని సమర్థించాలంటే, ప్రకృతిరీత్యా మనకు కొన్ని ప్రదేశాల్లో ఎక్కువ వర్షపాతం పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం పడుతుంది. ఇది ఒక సహజ పరిణామంగా జరుగుతోంది. ఈ విధంగా ప్రాంతీయ అసమాన నీటి లభ్యత ఉన్నటువంటి పరిస్థితులలో అన్ని ప్రాంతాలలోనూ ప్రజల జీవనం, వ్యవసాయం మరియు అభివృద్ధి నీటిలభ్యత మీదనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా మనది అధిక జనబాహుళ్యంగల వ్యవసాయ ప్రాధాన్యతా దేశం. కాబట్టి ఏ ప్రాంత అభివృద్ధి అయినా వ్యవసాయ అభివృద్ధి మీదనే ఆధారపడియుంది. సాగునీటి సదుపాయాలు లేకుండా మన వ్యవసాయం మరియు కరువు పీడిత ప్రాంతాలు అభివృద్ధి కాలేవు. కాబట్టి అనంతపురం, మహబూబ్‌నగర్ లాంటి తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో వ్యవసాయానికి, తాగడానికి నీళ్ళులేని పరిస్థితుల్లో వారి ఖర్మానికి వారిని వదలివేయడం ఆటవిక విధానమనిపించుకుంటుంది. ఎప్పుడో సాంకేతిక విజ్ఞానశాస్త్రాలు అభివృద్ధిచెందని కాలంలో ఇలా భావించడం సబబేమోగానీ, ఇన్ని రంగాల్లో శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధిచెందిన పరిస్థితుల్లో కూడా బీదప్రాంతాల ప్రజల్ని వారి ఖర్మానికి వారిని వదలివేయడం నాగరికత అనిపించుకోదు. కాబట్టి, మన దేశంలో అన్ని ప్రాంతాలు కూడా ఒక పద్ధతిలో అభివృద్ధి చెందాలంటే, నీటి పంపిణీలో జిల్లాల మధ్య సమతుల్యాన్ని సాధించాలి. ఎక్కడైతే అధికంగా వర్షపాతం, నీటి లభ్యత ఉంటుందో, అక్కడి ప్రజల త్రాగునీరు, వ్యవసాయం, పరిశ్రమల అవసరాలు తీరుస్తూ, మిగిలిన నీటిని, తక్కువ వర్షపాతం, నీటి లభ్యతయుండే ప్రాంతాలకు తరలించడం సమన్యాయం, అత్యవసరం మరియు అత్యంత ప్రాధాన్యం. ఎవరైనా దీనిని వ్యతిరేకిస్తున్నారంటే వారు సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తున్నట్లే!

ఎక్కడో ప్రపంచంలో కొన్నిచోట్ల మాత్రమే ప్రకృతిరీత్యా లభ్యమయ్యే పెట్రోలు, డీజిల్ విదేశాలనుండి దిగుమతి చేసుకొంటూ అవి అన్ని మారుమూల ప్రాంతాలకు లభ్యమయ్యేటట్లు పంపిణీ చేస్తున్నాం, ఎందుకు? అవి అన్నిచోట్లా అవసరం కాబట్టి. నీరు అనే ప్రాథమిక, ప్రాణాధార అంశాన్ని, ఎడారి ప్రాంతాలకు, కరువు పీడిత ప్రాంతాలకు "తగినంత" లేకుండా చేయడం, ఆ ప్రాంతాలను అభివృద్ధికి నోచుకోకుండా చేయడం ఘోర తప్పిదం, అమానుషం కాదా? జిల్లాల మధ్య సమతుల్యం, అభివృద్ధి సాధించే దిశగా నదుల అనుసంధానమవసరమన్నది నా ప్రగాఢ విశ్వాసం. మనం అనంతపురం జిల్లాలోనే తుంగభద్ర నదిని పెన్నా నదితో అనుసంధానంచేయడం జరిగింది. దీనివల్ల లాభమే కానీ ఎవ్వరికీ నష్టమేమీ జరుగలేదు. కాబట్టి నదుల అనుసంధానం ఆలోచన పూర్తిగా సమర్థనీయమే. అంతమాత్రం చేత పర్యావరణ నష్టాలను, పునరావాస సమస్యల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడాన్ని అంగీకరించినట్లు కాదు. తప్పనిసరిగా వాటికి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. మనం ఒకపక్క ప్రకృతి ప్రసాదించిన పర్యావరణాన్ని మానవ అవసరాలకు ఉపయోగించుకుంటూ మరోప్రక్క అంతే స్థాయిలో దానిని శాశ్వత ప్రాతిపదికపై అభివృద్ధిచేయాలి. నాగరిక సమాజంలో ఒకరి బాగుకోసమని మరొకరిని నష్టానికి గురిచేయడం అమానుషం. ఇది గ్రామస్థాయి కావచ్చు, ప్రాంతస్థాయి కావచ్చు. కాబట్టి ఏ ప్రాంతంలోనైనా ప్రాజెక్టు కట్టడాల ద్వారా నిర్వాసితులైన ప్రజలకు, రైతులకు ఐదు ఎకరాల మెట్టభూమికి కనీసం రెండెకరాలు నీరుపారే భూమిని ఆ ప్రాజెక్టుక్రింద కేటాయించాలి.

ఏ ప్రాజెక్టు మూలంగా రైతు నిర్వాసితుడవుతున్నాడో అదే ప్రాజెక్టుకు అతను ప్రథమ లబ్ధిదారుడు కావాలి. అతనికి ఇప్పటికంటే మెరుగైన జీవనాధారం కల్పించబడాలి. నిర్వాసితులకు ఇచ్చే పునరావాసం ఎలాగుండాలంటే, వారే ఆ ప్రాజెక్టు కట్టమని డిమాండు చేసేవిధంగా వుండాలి. ఆవిధంగా చేయడానికి మనకు సమస్యలేమీ లేవు. ఒక రాజకీయ ధృడ సంకల్పం కావాలి, అంతే. కాలువలు త్రవ్వడానికి, ప్రాజెక్టు కట్టడానికి ఏవిధంగా ఐతే భూమిని భూసేకరణ చట్టంద్వారా స్వాధీనపర్చుకుంటుందో అదేవిధంగా నీరు పారే వసతి ఏర్పడిన చోట భూమిని సేకరించి నిర్వాసితులైన రైతులకు ఇవ్వాలి. నిర్వాసితులకు పరిహారాన్ని కేవలం భూపరిహారం ద్వారానే సమస్య పరిష్కారమైనట్లుగా భావించరాదు. మొదట నష్టపోతున్నది నిర్వాసితులు కాబట్టి ప్రాజెక్టు ఫలాలు మొదటిగా వారికే దక్కడం న్యాయంగావుంటుంది.

**నీటిపారుదలలో సమతుల్యం పాటించాలని చెబుతున్నారు. మనదేశంలో నీటి పంపిణీ జరిగిన విధానం పరిశీలిస్తే కొన్ని ప్రాంతాలకు ఇబ్బడిముబ్బడిగా నీటిని అందిస్తూ మరికొన్ని ప్రాంతాలకు నీరే లేకుండా చేసే పద్ధతిని మన ప్రభుత్వాలు అనుసరించాయి. ఈ నేపథ్యంలో మీ స్పందన ఏమిటి?**

1972లోని భారత ఇరిగేషన్ కమీషన్ దేశంలోని ప్రాంతీయ వ్యవసాయ వాతావరణ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మీదట ఒక ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. అది ఒక బ్లాకు స్థాయిని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ బ్లాకులో కనీసం 30% నీటిపారుదల సౌకర్యం ఉన్నప్పుడు ఆ బ్లాకులో కరువుకు తట్టుకునే కనీస వ్యవసాయ పరిస్థితులేర్పడుతాయి. వ్యవసాయం కొంతవరకూ స్థిరపడుతుంది. తద్వారా వ్యవసాయం మీద ఆధారపడే రైతు, రైతు కూలీ కుటుంబాలు కొంతవరకూ స్థిరపడుతాయి. 30 శాతానికి మించి కూడా అవకాశాలున్నట్లయితే నీటిపారుదల సౌకర్యం కల్పించవచ్చు. 30 శాతానికి తగ్గరాదని వ్యవసాయ కమీషన్ ఉద్దేశ్యం. నదుల అనుసంధానంతో నీటి పంపిణీ కోసం ప్రాంతీయ మరియు జిల్లాల ప్రాధాన్యతను రూపొందించేటప్పుడు ఈ సిఫారసును ఒక కనీస మార్గదర్శకంగా తీసుకోవాలి. ఎక్కడైతే తీవ్రంగా కరువు తాండవిస్తుంటుందో అటువంటి ప్రాంతాలకు అత్యధిక ప్రాధ్యాతనిచ్చుకుంటూ రావాలి. అతి తక్కువ వర్షపాత ప్రాంతం మొదట ప్రాధాన్యతగా గుర్తిస్తే ఆ క్రమంలో అత్యంత ఎక్కువ వర్షపాత ప్రాంతం చివరి ప్రాధాన్యతను పొందాలి. దేశమంతా భౌగోళిక మరియు వర్షపాతానికి అనుగుణంగా వర్షాన్ని తగినవిధంగా ఒడుపుకొనుటకు తగిన నిర్మాణాలను నిర్మించవలెను. అప్పుడే నీటి పంపిణీలో కనీస సమతౌల్యమేర్పడుతుంది. అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను తగ్గించి, అన్ని ప్రాంతాల సమతౌల్య అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది.

ఇక మన వ్యవసాయ విధానాన్ని పరిశీలిస్తే చాలా అసంబద్ధంగా, అసమానంగా ఉంది. మన వ్యవసాయ విధానమంతా సాగునీటి ఆధారంగా వరి మరియు గోధుమ రైతుకు మేలు చేసేదిగానే ఉంది. ఈ విధానం వల్ల రైతు పండించే ఇతర పంటలకు, వర్షాధార రైతులకు అన్యాయంగా వుంది. మొదటగా నేలపరిస్థితులను బట్టి వరికి అనువైన చౌడుభూములు, జవుకు భూములలో మాత్రమే వరిని ప్రోత్సహించి మిగతా ప్రాంతాలలో ఆరుతడి పంటలు మాత్రమే పండించడానికి తగిన విధంగా పంటమార్పిడి చేయడానికి అగు నీటితో 5-6 ఎకరాలు ఆరుతడి పంటలు పండించవచ్చు. ఐనా, కొన్ని ప్రాంతాలకు అత్యధికంగా నీరు ఇవ్వడం వల్ల రైతులను వరిని మాత్రమే ప్రోత్సహించినట్లైంది. పైగా ప్రభుత్వం వరికి మరియు గోధుమకు మాత్రమే గిట్టుబాటు ధర చెల్లిస్తోంది. వరి ధాన్యం ప్రభుత్వం సేకరణ గావిస్తోంది. అదే ఇతర పంటలకు ఈ అవకాశం లేదు. వరికి గిట్టుబాటు ధర, ధాన్యసేకరణ చేసినట్లుగానే కందులు, రాగులు, సద్దలు, జొన్నలు మొదలగు వర్షాధార పంటలకు విధాన పరంగా ధర మరియు బీమా రక్షణ కల్పించవలసి వుంది. బియ్యం, గోధుమలు ప్రభుత్వ పంపిణీ విభాగంలో సబ్సిడీమీద ప్రజలకు అమ్మినట్లే అంతే సబ్సిడీతో రాగులు, జొన్నలు, సద్దలు, కందులు సబ్సిడీతో ప్రజలకు పంపిణీ చేసే విధానముండాలి.

ఈ విధానాన్ని సమగ్రంగా మార్చాలి! వరి పండించే రైతుకు ఎంత లాభంవస్తుందో, జొన్నలు, రాగులు, సద్దలు పండించే రైతుకు అంతకంటే ఎక్కువ లేదా కనీస లాభం వుండేవిధంగా వ్యవసాయ విధానాలుండాలి. ఎందుకంటే వరి రైతులు ఎక్కువ నీరు వినియోగిస్తారు. మిగిలిన రైతులు తక్కువ నీరు ఉపయోగిస్తారు. తక్కువ నీరు ఉపయోగించే రైతులను ప్రోత్సహించాలి. ఎక్కువ నీరు ఉపయోగించే రైతులను నిరుత్సాహపర్చాలి. ఎప్పుడైతే, ఈ విధంగా రైతులను ప్రోత్సహిస్తామో, రైతులకు వరిపైన వ్యామోహం తగ్గుతుంది. తద్వారా నీటి వినియోగం కూడా తగ్గుతుంది. నీటిపారుదల, వ్యవసాయ ఉత్పత్తి ధరలు, వ్యవసాయం మీద మనం హేతుబద్ధమైన సమన్యాయం విధానాలు రూపొందించనంతవరకు మనం ఈ దేశంలో ప్రాంతీయ సమతుల్యం తీసుకురాలేం. ఇప్పుడు మన రాష్ట్రంలో లభ్యమవుతున్న నీటితోనే మనం సరియైన వ్యవసాయ విధానాలతో ప్రాంతీయ సమతుల్యం, రైతు సంక్షేమం సాధించవచ్చు. తెలంగాణా, రాయలసీమ సమస్యలను పరిష్కరించవచ్చు. ఇటువంటి సమగ్ర విధానాలపై దేశంలో చర్చలు జరగకపోవడం దురదృష్టకరం. బహుశా వరి పండించే ప్రాంతం వారికి చెడ్డ కావలసివస్తుందన్న భయంతో రాజకీయ పార్టీలన్నీ ఉద్దేశ్యపూర్వకంగానే ఈ సమస్యను దాటవేస్తున్నాయనిపిస్తుంది. గ్రామీణ ఆహార సత్సంప్రదాయాలను, పౌష్టికాహార సంస్కృతిని, గ్రామీణ అవసరాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిఫలితంగా ఎన్నో రకాల పంటలను మనమిప్పటికే శాశ్వతంగా పోగొట్టుకున్నాం. అనంతపురం జిల్లాలోనే ఎన్నోరకాల పంటలు కనుమరుగైపోయాయి. ఒకప్పుడు వివిధరకాల కొర్రలు, సామలు, అరికెలు వర్షాధారంతో పండించే అనేక రకాల వట్టివడ్లు అన్నీ కనుమరుగైపోయాయి! ఈ రకాలన్నింటినీ మనం తిరిగి ముందుకుతెచ్చి అభివృద్ధి చేసుకోవాలి. ఎందుకంటే, ఇవి వర్షాధారంగా కూడా పండుతాయి. కొంతవరకు వర్షకరువును తట్టుకోగల్గిన శక్తి వీటికి ఉంటుంది. అత్యధికంగా నీటిని ఖర్చుచేసే వరి రైతుకు సబ్సిడీ తీసివేయాలి. జొన్నలు, సద్దలు, కందులు, అలసందలు, పెసలు మొదలగు ఇతర పంటలు పండించే రైతులకు సబ్సిడీలు, పంట బీమా రక్షణ ఇవ్వాలి. ఇటువంటి వ్యవసాయ విధానాన్ని నీటిపారుదల విధానాలలో జతచేసి చూడాలి. అప్పుడే మనం సమగ్రమైనటువంటి వ్యవసాయ విధానాన్ని రూపొందించుకోగల్గుతాం. నీటిపారుదల, పంటలు, వ్యవసాయ ధరలు, పంటల బీమా అన్నీ కలిపి ఆరోగ్యదాయకమైన ఆహార భద్రత మరియు వినిమయ మార్కెట్‌కు అనుసంధానించాలి. అందరికీ ఆహార భద్రత కల్పించాలి. ప్రస్తుతం వరి అన్నం తినే వ్యక్తి నాగరికుడు, జొన్నలు, ముతక ధాన్యం, తినేవారిని అనాగరికులుగా పరిగణిస్తున్నారు. ఇది పూర్తిగా అసంబద్ధమైనది.

**కరువులకు సాంప్రదాయక నీటివనరులే పరిష్కారమని, వాటిని పునరుద్ధరణ చేసుకోవడం వల్ల ఊటచెరువులు, చెక్‌డ్యామ్‌లు మొదలగునవి అభివృద్ధి చేసుకోవడం ద్వారా మాత్రమే కరువును ఎదుర్కోగలం – నదీ జల వనరుల గమనాన్ని నిరోధించరాదన్న వాదన ఒకటుంది. దానికి మీరు ఏవిధంగా స్పందిస్తారు?**

ఈ వాదనను కొంతమంది చాలా గట్టిగా వినిపిస్తున్నారు. సాంప్రదాయక నీటివినియోగ పద్ధతులు పాటించడం వలన మనం కరువులు లేకుండా చేసుకోవచ్చును అనేది వారి వాదన. సాంప్రదాయక నీటివనరులు మంచి స్థితిలోవున్న కాలంలో కరువులు లేకుండా ఉన్నట్లు వీరి అభిప్రాయంగా అనిపిస్తుంది. సాంప్రదాయక వనరులు, పర్యావరణం బాగావున్న కాలంలో కూడా తీవ్ర కరువు – కాటకాలు సంభవించాయన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. సాంప్రదాయక వనరులన్నింటినీ మనం అభివృద్ధి పర్చుకోవల్సిందే. ఐతే, ఇవి మాత్రమే పరిష్కారమని భావించడానికి వీలులేదు. ఎవరైతే ఆధునిక అనుసంధాన నీటిపారుదల విధానాన్ని వ్యతిరేకిస్తున్నారో వారి ఆలోచనలతో నేను విభేదిస్తున్నాను. ఈ వాదనలు చేసే వారిని ఒక విషయం అడగదలుచుకున్నాను. ఎవరైనా మన అనంతపురం జిల్లాలో 10–15 ఎకరాల భూమి తీసుకొని ఏ పంటలనైనా కేవలం వర్షాధారంపై పండించి, వాటిపై ఆధారపడి జీవించి, ఇతర రైతులకు చూపించండి!

ప్రస్తుతం, మన జీవన విధానానికి సంబంధించిన మరో ముఖ్య పార్శ్వాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. పాత కాలంలో లాగా వస్తుమార్పిడితో డబ్బు అవసరం లేకుండా గోచిపెట్టుకొని నిరక్షరాస్యులుగా, అనారోగ్యంగా బ్రతికినట్లు ఇప్పుడు బ్రతకడం సాధ్యం కాదు. మారకపు డబ్బుతో అవసరంలేకుండా ఈరోజు కేవలం తిండిగింజలే ఉంటే తిని బ్రతకడం లేకుంటే తిండిలేక చావడం ఇప్పుడు సాధ్యం కాదు. ఇప్పుడున్న వినిమయ మార్కెట్ వ్యవస్థను, పెరిగిన విద్య, వైద్య, ఇతర అవసరాలను, సంస్కృతిని ధ్వంసం చేసి, నూర్ల సంవత్సరాల వెనుకనున్న అనాగరిక పరిస్థితులలోకి వెళ్ళడం సమంజసమా? సాధ్యమౌతుందా? 1867లో అనంతపురం జిల్లాలో ధాతుకరువు వచ్చినప్పుడు 40% ప్రజలు చనిపోయినట్లుగా రికార్డులు చెప్తున్నాయి. అప్పుడు సాంప్రదాయక వనరులు మంచి స్థితిలో ఉన్నాయి. పర్యావరణం గొప్పగానేయుండేది. మరి కరువులెందుకు వచ్చాయి? కొన్ని విషయాలలో మనం గతాన్ని సులభంగా వైభవీకరించి నమ్ముతాం. ఉదాహరణకు రాయలేలిన సీమ రతనాల సీమ అంటాం. రత్నాలు రాసులుగా పోసి అమ్మినారని నమ్ముతుంటాం. కానీ, కరువుల చరిత్రను కనుక పరిశీలిస్తే అందరూ ఆరోజుల్లో సుభిక్షంగా వున్నారని చెప్పడానికి ఏ మాత్రం ఆధారాలు లేవు. ఈరోజు కూడా అనంతపురం పాతూరులో రత్నాలు, బంగారం రాసులుపోసి అమ్మే షాపులు చాలానే ఉన్నాయి. కొనే శక్తి వున్నవారూ వున్నారు. అంత మాత్రంచేత ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని చెప్పగలమా? ప్రస్తుత దశలో ముందుకుపోవడం గురించే ఆలోచించాలి. లేని గతాన్ని వైభవీకరించి, లేదా వక్రీకరించి ఆ ఊహాగతంలోకి పోవడం గురించి ఆలోచించడం పూర్తిగా తిరోగమనం.

**ప్రాజెక్టుల నిర్మాణాలు, పునరావాసం, పర్యావరణ పునరుద్ధణ మొదలగు వాటి విషయంలో ఎక్కువగా అవినీతి పాతుకుపోయింది కదా! ఈ నేపథ్యంలో నదుల అనుసంధానం ఏవిధంగా విజయవంతం అవుతుంది?**

మనదేశంలో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలలోని అవినీతి గురించి మాట్లాడవలసి వస్తే అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులూ ముగ్గురూ కలసి ఈ అవినీతి పదిలపరిచారు. దీనిని తగ్గించడానికి కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రవేశపెట్టవచ్చు. ఏదైనా ఒక ప్రాజెక్టు కట్టవలసి వస్తే కనీసం కొంతభాగం రైతులే ఖర్చు భరించవచ్చు. ఉదాహరణకు హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూ. 1,400 కోట్లు అవసరమనుకుంటే రెండు, మూడు వందల కోట్ల రూపాయలు రైతులు భరించేటట్లు చేయవచ్చు. అనంతపురం జిల్లాలో రైతులకు తినడానికి తిండే లేదు. ఇవి ఎలా సాధ్యమవుతుందని ఎవరైనా అడుగవచ్చు. ఐతే, ఒక బోరు మోటారు వేసుకోవడానికి 50 నుండి 75 వేలు రూపాయలు ఒకరైతు ఇప్పుడు ఖర్చు పెడుతున్నారు. ఈ పద్ధతిలో భారీప్రాజెక్టు ఐనా మూడు సంవత్సరాలలో పూర్తిచేసి నమ్మకంగా నీరిస్తామంటే ఏ రైతైనా కొంత భరించేందుకు సిద్ధమవుతాడు. అయితే, ప్రస్తుతం ఏ రైతు దగ్గరా డబ్బులేదు కాబట్టి, ప్రభుత్వం అప్పులు చేసినట్లే బ్యాంకులలో రైతుకు ఋణం ఏర్పాటుచేస్తే రైతు అందుకు సమ్మతిస్తాడు. కాకపోతే, నీరు అందించిన తర్వాత మాత్రమే ఋణ రికవరీ మొదలుపెట్టాలి. ఇది సమస్యగా కూడా ఉండదు. దీనివలన నదీ ప్రాజెక్టుల నిర్మాణంలో రైతుల పర్యవేక్షణ, భాగస్వామ్యముంటుంది. పనులలో పారదర్శకత ఉంటుంది. అవినీతిని కొంతవరకు అరికట్టవచ్చు. రైతులు కూడా సహకార సంఘాలు ఏర్పాటు చేసుకొని కొన్ని ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా చేపట్టవచ్చు. ఏ గ్రామానికాగ్రామం స్వంతంగా పనులు చేపట్టవచ్చు. ప్రణాళికలోనూ, అమలులోనూ పూర్తి పారదర్శకత పాటించాలి. పనులను వికేంద్రీకరించి, ప్రజల భాగస్వామ్యం పెంచాలి. ప్రతి పనికి ఒక నిర్ణీత కాలపరిమితి ఉండాలి. ఇలాంటి కొన్ని విధానాలు, పద్ధతుల ద్వారా రైతుల భాగస్వామ్యాన్ని పెంచవచ్చు, అవినీతిని అరికట్టవచ్చు, పనులలో నాణ్యతను పెంచవచ్చు.

**అంతర్జాతీయ నీటి ప్రైవేటీకరణ అంశానికి, ఈనాడు దేశంలో చెబుతున్న నదుల అనుసంధాన ప్రతిపాదనకు ఏమైనా సంబంధం ఉందా?**

సంబంధం ఉండినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. అన్ని దేశాలోనూ పాలకులందరికీ సాధారణంగా ఒకే భావజాలం ఉండే అవకాశం ఉంది. ప్రైవేటీకరణ అన్నది ఏ దేశంలో జరిగినా మనం తీవ్రంగా వ్యతిరేకించాల్సిందే. ఇక నదుల అనుసంధానంపై చర్చ ఇంకా ప్రజల్లోకి పోలేదు. కొంతమందికి మాత్రమే పరిమితమైయింది. అభిప్రాయాలు కూడా చాలా పరిమితంగానే వ్యక్తపరుస్తున్నారు. దేశస్థాయిలో జరిగే సమస్యల గురించి గ్రామ స్థాయిలో ఉండే అందరు వ్యక్తులు స్పందించలేకపోవచ్చును గానీ, సాధ్యమైనంతవరకూ చర్చలను ప్రజల్లోకి తీసుకుపోవడం చాలా అవసరం. వేల కిలోమీటర్ల దూరంలో వున్న సమస్యలపట్ల ప్రజలు ఆసక్తి కనపర్చకపోవచ్చు. కానీ స్థానిక పర్యవసానాలు సమస్యలపట్ల స్పందించగలరు.

శాస్త్రజ్ఞుల పథకాలను విపులంగా రచించి, పర్యావరణ నష్టాలను, పునరావాస నష్టాలను, ఇతర మానవ బాధల ఖర్చును కూడా విశదీకరించి, పథకాల ద్వారా వచ్చే లాభాలను కూడా విశదీకరించి, ప్రజల ముందు చర్చకు పెడితే ప్రజలు చర్చలో పాల్గొనే అవకాశముంది. కాబట్టి, నదుల అనుసంధానంపై విపులంగా పథకాలు మొదట తయారుచేసి వాటిపై క్రమబద్ధమైన చర్చ జరిపితే సబబుగావుంటుంది. అంతేగానీ, స్థూలంగా నదుల అనుసంధానం మంచిదా, చెడ్డదా అని ఒక సిద్ధాంతచర్చ నిరుపయోగంగా ఉంటుంది.

ప్రస్తుత దశలో నీరు ఎన్నో వివాదాలకు కారణమవుతున్నది. అన్నదమ్ముల మధ్య, ప్రాంతాల మధ్య రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య కూడా తగాదాలు సృష్టిస్తోంది. అట్లాకాకుండా ప్రజల్ని కలిపే విధంగా నీటి విధానాలు మరియు పంపిణీ జరగాలి. ప్రజల్ని విడదీసే శక్తి, నీటికే విధంగా ఉందో, కలిపే శక్తికూడా నీటికి ఆ విధంగానేఉంది. మానవచరిత్రను పరిశీలిస్తే, నీరు ప్రజలను కలిపింది. వారిని అభివృద్ధి పరిచింది. నాగరికతలకు మూలం నీరే! (ఉదా: సింధు నాగరికత) నీటిని – ప్రజల్ని సంధానం చేయడం పురోగమనం – విడదీయడం తిరోగమనం. నదీజలాలు ప్రాంతాలను కూడా అనుసంధానం చేయగలవు. అలాగే, వివిధ ప్రాంతాల ప్రజలను కూడా అనుసంధానం చేయగలవు.

*- కదలిక 2003 నదుల అనుసంధానం ప్రత్యేక సంచికనుంచి*

# అనంతపురం జిల్లా నిరంతర కరువు, నిత్య దారిద్ర్యం

**(ప్రకృతి శాపము X ప్రభుత్వ విధానాలలో వివక్ష X ప్రభుత్వాల నిర్లక్ష్యం)**

## 1) సంక్షిప్తము

అనంతపురం జిల్లా తక్కువ వర్షపాతంతో ప్రకృతిశాపం వల్ల నిత్యం కరువుకాటకాలకు బలి అవుతున్నది. అనంతపురం జిల్లాలో కరువు మరియు దారిద్ర్యం అనబడే కవల సమస్యలు శతాబ్దాల నుండి నిరంతరాయంగా ప్రజలను వెంటాడుతూనే వున్నాయి. ఇందుకు తోడు గమ్యంలేని, దిశానిర్దేశంలేని, అనర్థదాయక, అసంబద్ధ ప్రభుత్వ విధానాలు కరువును, దారిద్ర్యాన్ని శాశ్వతంగా నివారించలేకపోవడమే గాకుండా జిల్లాలో అరకొరగావున్న సహజవనరులను మరియు సాంప్రదాయ వనరులను నిర్వీర్యంచేసి, కరువుల తీవ్రతను మరియు దారిద్ర్య తీవ్రతను అధికం చేశాయి. ఈరెండింటికి తోడుగా వివిధ ప్రభుత్వాల నిరంతర నిర్లక్ష్యం శాశ్వతంగా అనంతపురం జిల్లాను కరువు, దారిద్ర్యం అనే కవల సమస్యలకు శాశ్వత నిలయంగా మార్చివేశాయి. ఇటువంటి పరిస్థితి నుంచి అనంతపురం జిల్లా బయటపడాలంటే రాజకీయ దృఢ సంకల్పంగల ఒక శాశ్వత కరువు – దారిద్ర్య నివారణా కార్యాచరణ పథకం అవసరం. ఈ పథకానికి ఒక నిర్ణీత కాలవ్యవధి కలిగి అందుకు అవసరమైన ఆర్థికవనరులు అందుబాటులోకి తేవాలి. ఈ రెండింటితో పాటు అనంతపురం జిల్లాలోని ప్రజలను చైతన్యవంతులుగా చేసి, కార్యదీక్షతో ప్రణాళికను అమలుచేయుటలో భాగస్వాములను చేయాలి. మరియు ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికకు కట్టుబడి చిత్తశుద్ధితో కృషిచేయాలి. కనీసం ఈ ప్రణాళిక అమలు అయ్యేంతవరకైనా అన్నివర్గాలు అవినీతికి దూరంగా కృషిచేయాలి.

## 2. అనంతపురం జిల్లాపై ప్రకృతి శాపం:

### 2.1 చాలీచాలని మరియు అదునుకురాని వర్షపాతం:

అనంతపురం జిల్లాలో వర్షపాతం తక్కువ కావడంతో పాటు దాని పంపిణీ కూడా చాలా అస్తవ్యస్తంగా వుండి, పంటల ఎదుగుదలకు అనుకూలంకాదు. వర్షాకాలం జూన్ నుండి అక్టోబర్ వరకు మాత్రమే పరిమితమవుతూ, ఆగష్టు నెలలో వరుపు రావడం వలన ఇది వర్షాధార పంటలకు అనువుగా వుండడం లేదు. అందుకే వర్షాధార పంటలు దెబ్బతిని తరుచూ కరువుకు గురి అవుతున్నది.

### అనంతపురం జిల్లా నెలవారీ సగటు వర్షపాతం(మి.మీలలో)

| మాసము | సగటు వర్షపాతం (మి.మీ) |
|---|---|
| జనవరి | 2.5 |
| ఫిబ్రవరి | 3.6 |
| మార్చి | 3.6 |
| ఏప్రిల్ | 19.4 |

| | |
|---|---|
| మే | 54.3 |
| జూన్ | 46.9 |
| జూలై | 55.8 |
| ఆగష్టు | 71.7 |
| సెప్టెంబరు | 122.1 |
| అక్టోబరు | .4 |
| నవంబర్ | 34.9 |
| డిశంబర్ | 9.2 |
| **మొత్తం** | **520.4** |

గత 100 సం. కాలంలో నెలవారీ వర్షపాతాన్ని విశ్లేషించినప్పుడు, వర్షపాతంయొక్క పంపిణీలో కొన్నిమార్పులు కనబడుచున్నవి. వాటిలో ముఖ్యమైనవి. (1) వర్షాకాలం మొదలులోనూ, చివరిలోనూ వర్షాలు తగ్గుచున్నాయి. అంటే వర్షాకాల సమయాన్ని ఇంకా తగ్గిస్తున్నది. (2) సెప్టెంబర్ నెలలో వర్షపాతం పెరుగుచున్నది. (3) ఆగష్టు నెలలో వరుపు కాలం పెరుగుచున్నది. అంటే వర్షం పంపిణీలో తేడాలు ఇంకా ఎక్కువగుతున్నవి. ఈ మార్పులు వర్షాధార పంటలకు మరింత హాని కలుగజేయుచున్నవి. ముఖ్యంగా విత్తనం తగిన సమయంలో పడడం లేదు. వరుపు వలన పంట మధ్యకాలంలో పూత దశలోనూ, పంట చివరికాలంలో కాయలు ఊరే దశలోనూ వర్షాలు తగ్గడం వలన పంట దిగుబడులు బాగా తగ్గడం లేదా పూర్తిగా ఎండిపోవడం జరుగుచున్నది. ఐతే, అనంతపురం జిల్లాలో పడేటటువంటి మొత్తం వర్షపాతం తగ్గినట్లు ఏమాత్రం ఆధారాలు లేవు.

## ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలవారీగా సగటు వర్షపాత వివరాలు

## (అత్యల్ప సగటు వర్షపాతం గల జిల్లా నుండి మొదలుకొని)

| **వరుస సంఖ్య** | **జిల్లా** | **వర్షపాతం** |
|---|---|---|
| 1) | అనంతపురం | 521 |
| 2) | కర్నూలు | 630 |
| 3) | కడప | 695 |
| 4) | నల్గొండ | 742 |
| 5) | ప్రకాశం | 752 |
| 6) | మహబూబ్‌నగర్ | 754 |
| 7) | రంగారెడ్డి | 812 |
| 8) | హైదరాబాద్ | 845 |
| 9) | గుంటూరు | 890 |
| 10) | చిత్తూరు | 908 |
| 11) | కరీంనగర్ | 953 |
| 12) | మెదక్ | 959 |
| 13) | నెల్లూరు | 981 |
| 14) | కృష్ణా | 1029 |

| | | |
|---|---|---|
| 15) | ఖమ్మం | 1045 |
| 16) | ఆదిలాబాద్ | 1046 |
| 17) | వరంగల్ | 1049 |
| 18) | పశ్చిమగోదావరి | 1076 |
| 19) | శ్రీకాకుళం | 1085 |
| 20) | విశాఖపట్నం | 1085 |
| 21) | నిజామాబాద్ | 1089 |
| 22) | తూర్పుగోదావరి | 1160 |
| 23) | విజయనగరం | 1161 |

అనంతపురం జిల్లా మన ఆంధ్రరాష్ట్రంలో అత్యల్ప వర్షపాతంగల జిల్లా. దేశంలోనే అత్యల్ప వర్షపాతం గల జిల్లాలలో రెండవది. అనంతపురం జిల్లా సరాసరి సంవత్సర వర్షపాతం 521 మి.మీ. ఆంధ్రప్రదేశ్ సగటు వర్షపాతం 925 మి.మీ. అనంతపురం కంటే ఒకమెట్టు ఎక్కువ వర్షపాతం వున్న కర్నూలు జిల్లాలో 630 మి.మీ. సగటు సంవత్సర వర్షపాతం వుంది. ఆ తరువాత కడప జిల్లాలో 695 మి.మీ. సగటు వర్షపాతం వుంది. అనంతపురం జిల్లా దక్షిణ భారతంలోని "వర్షాచ్ఛాయ ప్రాంతానికి" కేంద్రబిందువుగా వుంటుంది. ఈ వర్షాచ్ఛాయ ప్రాంతంలో ముఖ్యంగా తమిళనాడులోని కొన్ని జిల్లాలు, కర్ణాటకలోని కొన్ని జిల్లాలు, ఆంధ్రలోని కొన్ని జిల్లాలు వున్నాయి. ఈ వర్షాచ్ఛాయ ప్రాంతమంతా కూడా కరువులకు గురౌతున్నా, అనంతపురం లాంటి తీవ్రత ఏ జిల్లాలోనూ లేదన్నది వాస్తవం. ఇదే జిల్లాలోనే వివిధ ప్రాంతాల మధ్య వర్షపాతంలో తేడాలు ఎక్కువగా వుండటాన్ని కూడా గమనించవలసివుంది. అనంతపురం జిల్లాలోని కూడేరు, ఆత్మకూరు మండలాలు దాదాపు 250 మి.మీ. సగటు వర్షపాతం మాత్రమే వున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే దక్షిణ అనంతపురం జిల్లాలోని కదిరి, పుట్టపర్తి, హిందూపురం, మడకశిర ప్రాంతాలలో 600 మి.మీ. మించి వర్షపాతం నమోదవుతూ వుంది.

### 2.2 తేమను నిల్వుకోలేని, లోతు తక్కువ పంటనేలలు మరియు వర్షపు నీటిని ఇంకించుకోలేని గట్టి భూగర్భం:

తక్కువ వర్షపాతానికి తోడు అనంతపురం జిల్లాలోని వ్యవసాయ నేలలు చాలావరకు తక్కువ లోతుగల ఎర్రనేలలు. అంటే ఈ భూములలో తేమను నిలుపుకొనే గుణం అతి తక్కువ. దాని మూలంగా ఇప్పటికే తక్కువగావున్న వర్షపాతం పంటలకు ఉపయోగపడే విధంగా నేలలో తగినంత కాలం తేమ నిల్వ లేకపోతోంది. ఇటువంటి నేలలుండడం కూడా మన జిల్లాకు ప్రకృతి శాపమే. ఇటువంటి నేలలుండటం కూడా అనంతపురం జిల్లా కరువులకు తోడు అవుతున్నది. జిల్లాలో కేవలం 18% మాత్రమే నల్లరేగడి భూములున్నాయి. ఈ నల్ల రేగడి భూములలో తేమను నిలిపే శక్తి ఎక్కువ అయినందువల్ల కరువుల తీవ్రత ఈ నల్లరేగడి భూములున్న ప్రదేశాలలో కొంతవరకూ తక్కువగా వుంది. భూగర్భం పై భాగం నుండి చాలా గట్టిగానూ మరియు బండబారి వుండుట వలన పడిన వర్షంలో 10 శాతం కంటే తక్కువ మాత్రమే భూగర్భజలంగా మారుచున్నది. భూగర్భంలో నీటిని ఇంకించుకోగల పొరలు లేకపోవడం కూడా మనకు ప్రకృతి శాపమే.

### 2.3 వృక్షసంపద లేని అడవులు:

తక్కువ వర్షపాతానికి, బీడునేలలకు తోడు ఈ జిల్లాలో అటవీ సంపద లేకపోవడం ఇంకొక శాపం. జిల్లాలో అటవీ సంపద దాదాపు 11 శాతం విస్తీర్ణంలోవున్నట్లు రికార్డులు చెబుతున్నా, అడవి

అనదగ్గ వృక్ష సంపద కేవలం 2 శాతం విస్తీర్ణంలో కూడా వుండదని తెలిసినవారి అభిప్రాయం. ఒక జిల్లా విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 33 శాతంగా వున్నప్పుడే ఆ జిల్లా పర్యావరణంలో సమతౌల్యం వుంటుందని ఫారెస్ట్ కమీషన్ రిపోర్ట్ చెబుతున్నది. ఆ విధంగా 33 శాతం విస్తీర్ణంలో అడవులు వుండుటవల్ల జిల్లాలో నీటి మరియు తేమ ఆవిరి కావడం తగ్గి పడిన వర్షపాతం వృక్షసంపద రూపంలో, పంటల రూపంలో ప్రజలకు మేలుచేకూర్చుతుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మన జిల్లాలో సగటు వర్షపాతం 521 మి.మీ. కాగా, 1858 మి.మీ. తేమ ఆవిరిగా మారగల అవకాశంగా ఉంది. అంటే మన జిల్లాలో పడుతున్న వర్ష పరిమాణం కన్నా ఆవిరైపోగల నీటి తేమ పరిమాణం చాలా ఎక్కువగా ఉంది. సాధారణంగా అడవులు బాగా వున్న ప్రదేశాలలో నీరు ఆవిరి కావడం తక్కువగా ఉండడంతోపాటు, పడేటటువంటి వర్షాపాతాన్ని భూగర్భజలాలుగా మార్పుచేయును. వృక్షజాలం లేనందువల్ల నేలలో తేమ తక్కువగా పట్టి ఎక్కువకాలం నిల్వలేకపోతున్నది.

**3) ప్రకృతి శాపానికి తోడు ప్రభుత్వ శాపం – గమ్యంగానీ, ఒక దిశానిర్దేశనంగానీ లేని అనర్థదాయక, అసంబద్ధ ప్రభుత్వ విధానాలు:**

ప్రస్తుతం ప్రభుత్వ విధానాల ప్రకారం 750 మి.మీ.కు తక్కువ సగటు వర్షపాతంగల జిల్లాలను కరువుపీడిత ప్రాంతాలుగా ప్రకటిస్తారు. ఈ విధానం వల్ల 742 మి.మీల వర్షపాతం గల నల్గొండ 695 మి.మీ వర్షపాతం గల కడప జిల్లాల స్థాయిలో కేవలం 521 మి.మీ. వర్షపాతం మాత్రమే గల అనంతపురం జిల్లాను చేర్చడం జరుగుతోంది. సాధారణంగా ఒక కరువు పీడిత జిల్లాలో సంవత్సర సగటు వర్షపాతంకంటే 25% తక్కువ నమోదైనప్పుడు ఈ జిల్లాను ఆ సంవత్సరానికి కరువు దెబ్బతిన్న జిల్లాగా ప్రకటిస్తారు. దీని ఆధారంగా కరువు సహాయక కార్యక్రమాలు చేపడతారు. ఈ విధానం ప్రకారం 742 మి.మీ. వర్షపాతం గల నల్గొండ జిల్లాలో 25% వర్షపాతం తక్కువైనా 556.6 మి.మీ. వర్షపాతం పడుతుంది. 556.6 మి.మీ. వర్షం నమోదయినా, నల్గొండ జిల్లాను కరువు ప్రాంతంగా ఆ సంవత్సరానికి ప్రకటిస్తారు. మరి అనంతపురం జిల్లా సగటు వర్షపాతమే 521 మి.మీ. అనంతపురం జిల్లాను 391 మి.మీ. కంటే తక్కువ (521 మి.మీలో 75 శాతం) వర్షపాతం పడినప్పుడు మాత్రమే కరువు జిల్లాగా ప్రకటిస్తారు. ఇది జిల్లాకు ఒక ప్రభుత్వ విధాన శాపం. ఈ వ్యత్యాసం అనంతపురం జిల్లాకు విధానపరంగా ఎంతో అన్యాయం చేస్తున్నది. అదేవిధంగా కడప జిల్లాలో 521 మి.మీ. వర్షపాతం (695 మి.మీలో 75 శాతం) పడిన సంవత్సరాన్ని కరువు జిల్లాగా ప్రకటిస్తారు. అదే వర్షపాతం 521 మి.మీ. అనంతపురం జిల్లాలో పడినప్పుడు ఈ విధానం ప్రకారం అనంతపురం జిల్లాలో ఆ సంవత్సరం కరువు వుండదు! ఈ విధానం వల్ల అనంతపురం జిల్లా చాలా అన్యాయానికి గురి అవుతుంది. 750 మి.మీ ల సాధారణ వర్షపాతం ఒక కొలబద్దగా తీసుకొని అంతకు 25% తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించే విధానం వున్నప్పుడు అనంతపురం జిల్లాను 562.5 మి.మీ. కంటే తక్కువ వర్షంపడిన ప్రతి సంవత్సరాన్ని కరువు దెబ్బతిన్న జిల్లాగా ప్రకటిస్తూ, అంతకంటే ఎక్కువ వర్షం పడిన సంవత్సరాన్ని మాత్రమే "కరువులేని సంవత్సరంగా" ప్రకటించాలి!

ఇరిగేషన్ కమీషన్ (1972) సిఫారసుల ప్రకారం ఒక జిల్లాలోని వ్యవసాయ భూముల్లో కనీసం 33 శాతం సాగునీటి సదుపాయం వుండటం అవసరం. ఈ విధంగా 33 శాతం వ్యవసాయ భూమి సాగునీటి క్రింద వుండటం వల్ల ఆ జిల్లాలో వర్షాధార వ్యవసాయంతో బాటు వ్యవసాయంలో స్థిరత్వం వుంటుందని ఇరిగేషన్ కమీషన్ వారి సిఫారసు. మరి అనంతపురం జిల్లాలో సాగునీటి వసతి గల భూమి కేవలం 14 శాతం మాత్రమే వుంటున్నది. ఈ 14 శాతం కూడా చెరువులు, భూగర్భజలాలపైననే ఆధారపడి అధికభాగం ఉన్నందువలన వర్షపాతం తక్కువై "నీటి కరువు" వచ్చిన

సంవత్సరాలలో భూగర్భజలాలు బాగా తగ్గి, సాగునీటి వ్యవసాయం గణనీయంగా తగ్గిపోతుంది. ఈ ప్రాతిపదికన తీసుకున్నప్పుడు, నదీజలాల పంపిణీ ద్వారా సాగునీటి వసతి కల్పనలో అత్యధిక ప్రాధాన్యత అనంతపురం జిల్లాకు ప్రభుత్వాలు ఎప్పుడో కల్పించి వుండాల్సింది. కానీ అది జరగలేదు. దానివల్ల అనంతపురం జిల్లాలో ఇటు వర్షాధార వ్యవసాయం మరియు సాగునీటి వ్యవసాయం కూడా అస్థిరమైనందున శాశ్వత కరువు జిల్లాగానే కాకుండా ఒక ఎడారిగా మారబోయే ప్రమాదం కూడా పొంచివున్నది. మన రాష్ట్రంలో సగటు నీటిపారుదల గల భూమి వ్యవసాయ భూమిలో 40 శాతం వుంది. రాష్ట్ర సగటుతో పోల్చుకున్నప్పుడు అనంతపురం జిల్లాలో 14 శాతమే ఉన్నందున సగటుకన్నా చాలా తక్కువగా సాగునీటి వసతి కలిగి వుంది. అనంతపురం జిల్లాతో బాటు 40 శాతం సరాసరికన్నా తక్కువ సాగునీటి వసతిగల జిల్లాలు రాష్ట్రంలో 9 ఉన్నాయి. అవి అనంతపురం, ఆదిలాబాదు, మహబూబ్‌నగర్, కర్నూలు, రంగారెడ్డి, మెదక్, విశాఖపట్టణం, ప్రకాశం, కడప. ఈ 9 జిల్లాల్లోను 3 జిల్లాలు రాయలసీమలోను, 4 జిల్లాలు తెలంగాణాలోనూ, 2 జిల్లాలు సర్కారు ప్రాంతంలోనూ వ్యాపించియున్నాయి. ఐతే, ఒక్క అనంతపురం మినహా మిగతా అన్ని జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతం 630 మి.మీ. కంటే అధికంగా వుండటం గమనార్హం. ఈ 9 జిల్లాలలో సగటు వర్షపాతం ఎక్కువైనందువల్ల నీటిపారుదల తక్కువగావున్నా ఆ జిల్లాలపై కరువు తీవ్రత వుండదు. ఉదా: ఆదిలాబాదు జిల్లాలో కూడా నీటిపారుదల 14 శాతం మాత్రమే వుంది. కానీ, అక్కడ సగటు వర్షపాతం 1046 మి.మీ. అంటే అనంతపురం వర్షపాతానికి రెండురెట్లు ఎక్కువ. కాబట్టి అక్కడ కరువు సమస్యలు అరుదు. అనంతపురం జిల్లాకు ఇటు వర్షపాతం తక్కువ కావడం, దానికితోడు సాగునీటి వసతి కూడా అత్యల్పంగా వుండటం అనంతపురం జిల్లాకు గోరుచుట్టుపై రోకలిపోటులాగా కరువు, దారిద్ర్యాల తీవ్రతను పెంచుతున్నది. నదీజలాల పంపిణీ ఇటువంటి తక్కువ వర్షపాతం మరియు తక్కువ నీటిసాగు ఉన్న జిల్లాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవిధంగా "నీటివిధానాలు" ఉండవలయును. అట్లాంటి విధానం లేకపోవడం అనంతపురం జిల్లాకు ఒక శాపం.

ఇప్పటివరకూ పాటిస్తున్న కరువు నివారణా విధానాలు మరియు కార్యక్రమాలు కరువు తీవ్రతను, ఎడారీకరణను వేగవంతం చేశాయి. భూగర్భజలాలను అధికంగా తోడడం, పచ్చికబయళ్ళను, రెవిన్యూ గుట్టలను వ్యవసాయం కోసం ఆక్రమణలను ప్రోత్సహించడం చెరువులను, కుంటలను నిర్లక్ష్యం చేయడం మొదలగు కార్యక్రమాలు జిల్లాలోని వనరులను బాగా నిర్వీర్యం చేశాయి. దాని మూలంగా కరువులను, వాటి తీవ్రతను అధికం చేశాయి.

### 4. 55 సంవత్సరాల నిరంతర ప్రభుత్వ నిర్లక్ష్యం:

56 ఏండ్ల స్వాతంత్ర్యానంతరం కూడా అనంతపురం జిల్లాను కరువు, దారిద్ర్యాల బారినుండి కాపాడే సమగ్ర పథకమే లేకపోవడం అన్ని ప్రభుత్వాలు అనంతపురాన్ని నిర్లక్ష్యానికి గురిచేసినాయనడానికి సరైన నిదర్శనం. ప్రతి ఐదేళ్ళకొకసారి క్రొత్త ప్రభుత్వాలు వస్తున్నా, ఏ ప్రభుత్వం కూడా అనంతపురం కరువు–దారిద్ర్య సమస్యల నివారణ కోసం ఒక నిర్దిష్ట ప్రణాళికను కూడా రూపొందించలేదు. అంతేకాదు, సాధారణంగా అమలయ్యేటటువంటి కార్యక్రమాలకు కూడా నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇప్పటికీ పూర్తికాని పి.ఏ.బి.ఆర్. (పెన్నా అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్), జిల్లాలో అవకాశాలువుండి అధమస్థానంలోవున్న పాడిపరిశ్రమ, మరమ్మతుకు నోచుకోని పూర్వపు చెరువులు, కుంటలు, వివిధ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నాయి. ఇందుకు ఏ ఒక్క ప్రభుత్వం కూడా మినహాయింపు కాదు. అడుక్కుతినేవాడు అవిటివాడిని వాడుకొన్నట్లుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనంతపురం జిల్లా కరువులను, దారిద్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వానికి, ప్రపంచ బ్యాంకులాంటి ధన సంస్థలకు చూపిస్తూ రాష్ట్రానికి నిధులను మాత్రం అధికంగా రాబట్టుకొనగలుగుతున్నారు.

ప్రతి ఎన్నికల సమయంలోనూ అన్ని పార్టీలు అనంతపురం జిల్లాకు ఉదారమైన వాగ్దానాలు చేయడం, ఎన్నికల తర్వాత పాలకపక్షం వాటిని మర్చిపోవటం మన జిల్లా రాజకీయ వ్యవస్థకు సాధారణమై పోయింది. ప్రతి ప్రతిపక్ష పార్టీ, ప్రతిపక్షంలో వున్నప్పుడు పాలక ప్రభుత్వాలను విమర్శించడం, పాత వాగ్దానాలు, క్రొత్త ప్రమాణాలు చేయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం సర్వసాధారణం. జిల్లాలో ప్రజలు మాత్రం ప్రభుత్వాలు ఏమో చేస్తాయని ఎదురుచూడటం, ఆ విధంగా జరుగక దారిద్ర్యంలో, ఋణ భారంలో మునిగి వివిధ అవస్థలకు గురయ్యి, ఆత్మహత్యలు చేసుకోవడం, ఆస్థులను అమ్ముకోవటం, వలసలు పోవటం, అనైతిక కార్యక్రమాలవైపు మొగ్గుచూపడం, ఆత్మన్యూనతతో బ్రతకటం, ఆకలితో చావటం పరిపాటయ్యింది.

### 5. ముగింపు:

పైవిధంగా ప్రకృతి శాపానికి తోడు ప్రభుత్వ విధానాలవల్ల తీరని అన్యాయం, వివిధ ప్రభుత్వాల నిర్లక్ష్యం కలిపి మొత్తం అనంతపురం జిల్లా శాశ్వత సాంప్రదాయ నీటివనరులైన చెరువులు, కుంటలు క్షీణించి, జిల్లా ఎడారిదిశగా వేగంగా పరుగెడుతోంది. మరి ఇటువంటి పరిస్థితినుంచి జిల్లా బయటపడాలంటే సాధారణ ప్రజలు మేల్కొనాలి. చైతన్యవంతులు కావాలి. ప్రభుత్వాలను, రాజకీయ వ్యవస్థలను నిలదీయాలి. శాశ్వత కరువు-దారిద్ర్యమనే తీవ్ర సమస్యల నిర్మూలన కోసం ఒక సమగ్ర పథకానికి నిర్దేశనం చేయాలి.

శాశ్వత సాగునీటి వసతి కల్పించుటకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూనే, వ్యవసాయ మరియు వ్యవసాయేతర పరిశ్రమల స్థాపనకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించుటకు,గ్రామాల్లో శాశ్విత వ్యవసాయేతర జీవనోపాధి, ప్రత్యేకించి భూమి లేని కుటుంబాలకు కల్పించుటకు, కుల మరియు లింగ వివక్షలను తొలగించుటకు కూడా అంతే ప్రాధాన్యత కల్పిస్తూ సమగ్ర ప్రణాళికలను రచించాలి.

ఆ సమగ్ర పథకానికి నిర్ధిష్ట కాల వ్యవధితోబాటు తగినన్ని ఆర్థిక, సాంకేతిక, మానవ వనరులు కూడా ప్రభుత్వాలు సమకూర్చాలి. ఈ ప్రణాళికను ప్రజలు భాధ్యతాయుత భాగస్వామ్యంతో అమలు చేయగలగాలి. పథకాల అమలులో అవినీతిని ప్రజలే ప్రతిఘటించాలి. అట్లా కాకుండా ప్రభుత్వాలపైన, రాజకీయ వ్యవస్థలపైన ఆశలు పెట్టుకొని నిశ్చేష్టులుగావుంటే పరిస్థితి ఇంకా దుర్భరమవుతుంది. పరిస్థితి శాశ్వతంగా చేయిదాటిపోతుంది. ఏ మాత్రం ఆలస్యం చేసినా ఇప్పటికే తగిన వనరులు, అవకాశాలు కూడా ఇంకా తరిగిపోయి మరి ముందుకు బాగుచేయలేనటువంటి క్షీణపరిస్థితిలోకి జిల్లా వెళ్లిపోతుంది. మన దేశంలో నిజంగా ప్రజాస్వామ్యం వుంటే "యథా ప్రజా, తథా ప్రభుత్వం" అనే నినాదాన్ని నమ్మి ప్రజలే మార్గదర్శకులై, చైతన్యవంతులై, క్రియాశీలురై, జిల్లాను కరువు, దారిద్ర్యాల నుండి రక్షించుకోవాలి. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నడుం బిగించాలి.

*మార్చి 2004 కదలిక సంచిక నుండి*

| | | నీటిపారుదల కల్గిన భూమి ల.హె | | | | | | సాధారణ | | అటవీ ప్రాంతం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రసం. | జిల్లా | కాలువ | చెరువులు | గొట్టపు బావులు | ఇతరములు | మొత్తం | నీటి సాగు శాతం | వర్షపాతం మి.మీ | ల.హె. | అటవీ |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | అనంతపురం | 0.31 | 0.05 | 1.00 | 0.03 | 1.39 | 14 | 521 | 2.00 | 10 |
| 2 | ఆదిలాబాద్ | 0.24 | 0.02 | 0.31 | 0.02 | 0.77 | 14 | 1046 | 6.90 | 43 |
| 3 | మహబూబ్‌నగర్ | 0.15 | 0.03 | 1.34 | 0.05 | 1.57 | 20 | 754 | 2.70 | 15 |
| 4. | కర్నూలు | 0.73 | 0.12 | 0.75 | 0.09 | 1.69 | 20. | 630 | 3.20 | 18 |
| 5. | రంగారెడ్డి | 0.01 | 0.02 | 0.71 | 0.02 | 0.76 | 25 | 812 | 0.70 | 9 |
| 6. | మెదక్ | 0.03 | 0.15 | 1.20 | 0.01 | 1.39 | 32 | 959 | 1.0 | 11 |
| 7. | విశాఖపట్నం | 0.41 | 0.33 | 0.12 | 0.26 | 1.12 | 35 | 1085 | 4.80 | 42 |
| 8. | ప్రకాశం | 0.74 | 0.15 | 0.69 | 0.26 | 1.84 | 35 | 752 | 4.40 | 26 |
| 9. | కడప | 0.20 | 0.02 | 1.09 | 0.02 | 1.33 | 36 | 695 | 5.10 | 33 |
| 10. | ఖమ్మం | 0.65 | 0.52 | 0.52 | 0.26 | 2.11 | 40 | 1045 | 0.90 | 6 |
| 11. | నల్లగొండ | 0.79 | 0.10 | 1.06 | 0.16 | 2.11 | 40 | 742 | 0.90 | 6 |
| 12. | చిత్తూరు | 0.00 | 0.25 | 1.47 | 0.00 | 1.72 | 41 | 908 | 4.50 | 30 |
| 13. | విజయనగరం | 0.36 | 0.89 | 0.16 | 0.03 | 1.44 | 44 | 1161 | 1.10 | 17 |
| 14. | వరంగల్ | 0.03 | 0.69 | 2.11 | 0.04 | 2.87 | 57 | 1049 | 3.70 | 29 |
| 15. | గుంటూరు | 3.09 | 0.06 | 0.42 | 0.16 | 3.72 | 58 | 890 | 1.60 | 14 |
| 16. | శ్రీకాకుళం | 0.89 | 0.73 | 0.15 | 0.05 | 1.82 | 59 | 1086 | 0.70 | 12 |
| 17. | తూర్పుగోదావరి | 1.85 | 0.35 | 0.52 | 0.11 | 2.83 | 64 | 1160 | 3.20 | 30 |
| 18. | కృష్ణా | 2.38 | 0.33 | 0.37 | 0.17 | 3.25 | 64 | 1029 | 0.70 | 8 |
| 19. | నిజామాబాద్ | 0.25 | 0.24 | 1.17 | 0.04 | 1.70 | 65 | 1089 | 1.70 | 21 |
| 20. | కరీంనగర్ | 0.64 | 0.32 | 1.57 | 0.03 | 2.56 | 66 | 953 | 2.50 | 21 |
| 21. | పశ్చిమగోదావరి | 1.88 | 0.34 | 1.37 | 0.09 | 3.68 | 75 | 1076 | 0.80 | 10 |
| 22. | నెల్లూరు | 0.71 | 0.64 | 0.89 | 0.08 | 2.32 | 77 | 981 | 2.50 | 19 |
| 23. | హైదరాబాద్ | 0 | 0 | 0 | 0.10 | 0.10 | 100 | 845 | 0.0 | 0 |
| | మొత్తం | 15.45 | 6.52 | 18.99 | 2.08 | 43.04 | 40 | 925 | 62.1 | 23 |

# అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి బహుముఖ వ్యూహం

## చర్చాపత్రం

అనంతపురం జిల్లాను పట్టిపీడిస్తున్న సమస్యలు నిరంతర కరువు మరియు దారిద్ర్యం. ఈ రెండు సమస్యలు ఒకదానికొకటి తోడై జిల్లాలోని మొత్తం జనాభాను కృంగదీస్తున్నాయి. శతాబ్దాల నుంచి ఈ రెండు సమస్యలు ప్రజలను వేధిస్తున్నా ఇంతవరకూ అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఏమి చేయాలనే ఒక నిర్దిష్ట దృక్పథం కూడా లేదు. అనంతపురం జిల్లా ప్రస్తుత జనాభా 36.69 లక్షలు. మొత్తం భూమి వైశాల్యం దాదాపు 20 లక్షల హెక్టార్లు. అందులో వ్యవసాయ భూమి దాదాపు 10.5 లక్షల హెక్టార్లు. 75 శాతం అనగా దాదాపు 27.5 లక్షల జనాభా వ్యవసాయంపైన ఆధారపడి వుండగా కేవలం 1.4 శాతం అనగా కేవలం 1,20,000 మంది మాత్రమే వ్యవసాయేతర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారు. సాధారణంగా కరువు మన జిల్లాను పట్టి పీడిస్తున్న ఒక ముఖ్యమైన సమస్యగా చెప్పుకున్నా, భూమిలేని పేదలు కరువులేని సంవత్సరాలలో కూడా దాదాపు 30 శాతం జనాభా దారిద్ర్యంలో జీవిస్తున్నారనేది ఒక వాస్తవం. భూమిలేని నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులు, కులవృత్తులపై ఆధారపడినవారు, దళితులు, గిరిజనులు మొదలగువారు కరువుతో నిమిత్తం లేకుండా దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, పౌష్టికాహార లోపం, వలసలు, కుల, లింగ, రాజకీయ బాధితులై, నిస్సహాయులై, దారిద్ర్య ఊబిలో చిక్కుకుని ఉన్నారు. పంటలు రాక, పెట్టుబడులు లేక, బోరుబావులు ఎండిపోయి, కొత్తబోర్లలో నీళ్ళురాక, పండ్లతోటలు, పంటలు ఎండిపోయి, అధిక రుణభారంతో కొట్టుమిట్టాడుతున్నారు. అనేకమంది మధ్యతరగతి రైతులు, అప్పుల ఊబిలో కూరుకొని పోయి, పిల్లలను చదివించుకోలేక, వారికి పెళ్ళిళ్ళు చేయలేక, చదువుకొన్న వారికి ఉద్యోగాలు రాక, కనుచూపు మేరలో ఎటువంటి ఆశాకిరణం కానరాక మానసికంగా కృంగిపోయి, జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. ఒకప్పటి అన్నదాతలే నేడు అన్నమో! రామచంద్రా! అని పట్టణాలకు వలసలు వెళ్ళి గేట్‌మ్యాన్ ఉద్యోగాలైనా దొరుకుతాయేమోనని పెద్దపెద్ద గేట్ల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరైతే ఆత్మహత్యలే శరణ్యమని అర్థాంతరంగా బతుకును చాలిస్తున్నారు. మరి గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణాలలోనూ యువత అప్పుచేసి పై చదువులు చదివి, ఉద్యోగాలు రాక, వ్యవసాయం చేయలేక, రెంటికి చెడిన రేవడిగా, తీరంలేని సముద్రంలోని పడవలుగా నీటిలో మునిగి తేలుతున్నారు. ఈ పరిస్థితులలో అనంతపురం జిల్లాలోని ప్రజలు భౌతికంగానూ, మానసికంగానూ తీవ్ర క్షోభలో మగ్గిపోతున్నారు.

కరువు–దారిద్ర్యం రెండూ ఒక దానితో ఒకదానికి సంబంధం వున్న కవల సమస్యలైనా పరిష్కారదిశలో వీటిని విడిగా రెండు భిన్న సమస్యలుగా కూడా పరిగణించవలసిన అవసరమున్నది. అనంతపురం జిల్లాలోని ప్రజలందరూ కరువు–దారిద్ర్యం అనే ఈ కవల సమస్యల నుంచి బయటపడి సాధారణ జీవన ప్రమాణాలతో జీవించాలంటే ఒక బహుముఖ ప్రణాళిక అవసరం. అటువంటి

బహుముఖ ప్రణాళికను మన జిల్లాలో వున్నటువంటి అన్ని రకాల సహజవనరులను, మానవ వనరులను దృష్టిలో వుంచుకొని రూపొందించాల్సి ఉంటుంది.

*అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఒక బహుముఖ వ్యూహ ప్రతిపాదనను చర్చకోసం ప్రజల ముందు ఉంచుతున్నాను. దీనిపై అధికారులు, అనధికారులు, మేధావులు, నిపుణులు, పౌరసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రచయితలు, సాధారణ ప్రజలతో సహా అన్ని వర్గాలలోనూ విస్తృతంగా చర్చ జరిగి, ఈ బహుముఖ వ్యూహాన్నింకా విస్తృతపరచి, అన్ని వర్గాల ప్రజల అవగాహనతో, ఆమోదంతో ఒక ఆచరణీయ ప్రణాళికగా రూపొందగలదని ఆశిస్తున్నాను. అటువంటి ప్రణాళిక అమలుకోసం ప్రజలు, ప్రభుత్వాలు, చిత్తశుద్ధితో సంకల్పిస్తాయని, అందుకు ఒక నిర్దిష్ట కాలవ్యవధితో, నిధుల కొరత లేకుండా నిరాఘాటంగా అమలు చేస్తాయని కూడా ఆశిస్తున్నాను.*

2) **నమ్మకమైన సాగునీటి వ్యవసాయాన్ని కనీసంగా 4 లక్షల హెక్టార్లకు పెంచడం: అంటే ప్రస్తుతమున్న 14 శాతం నుండి 40 శాతానికి పెంచడం:**

అనంతపురం జిల్లాలో ప్రస్తుతం దాదాపు 1,39,000 హెక్టార్ల భూమి వివిధ రకాలైన సాగునీటి వనరుల క్రింద వున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. ఇది వ్యవసాయ భూమిలో 14 శాతం మాత్రమే. కానీ, ఈ 1,39,000 హెక్టార్ల భూమి అన్ని సంవత్సరాలలోను నీటిసాగు క్రింద వుండదు. ఉదా: చెరువుల క్రింద, బిటి ప్రాజెక్టు, ఎగువ పెన్నా ప్రాజెక్టు, చెన్నరాయగుడి ప్రాజెక్టులాంటి అనేక పథకాల క్రింద వున్న సాగుభూమి నీటిపారుదల క్రింద వున్నట్లు లెక్కలో వున్నా, అవి కనీసం ఐదు సంవత్సరాలకొకసారి కూడా సాగునీరందించడం లేదు. అంతేగాకుండా అనంతపురం జిల్లాలో ఉన్న కొద్దిపాటి నీటిసాగు ఎక్కువ భాగం నమ్మకంలేని భూగర్భ జలాలపైన చెరువులు, కుంటలపైన ఆధారపడియున్నది. భూగర్భజలాలు, చెరువులు, ప్రతి సంవత్సరం ఒకే రకంగా నీటిసాగు నందించడంలేదు. చెరువులు నిండని సంవత్సరాలలో భూగర్భజలాలపై ఆధారపడిన బోరు బావుల క్రింద నీటిసాగు కూడా గణనీయంగా తగ్గిపోతుంది. కాబట్టి 14 శాతం వ్యవసాయ భూమి సాగునీటి క్రింద వున్నదని గణాంకాలు చెబుతున్నా, వాస్తవంగా నీటిసాగవుతున్న భూమి ఏటా ఏ 8 శాతమో వుంటుందని అంచనా. ఇంత తక్కువ నీటిసాగు విస్తీర్ణం వున్నప్పుడు రైతులు కరువులకు తట్టుకోవడం అసాధ్యం. వ్యవసాయ కూలీలకు పని లభించడం అంతకన్నా అసాధ్యం. ఇరిగేషన్ కమీషన్ 1972 సిఫార్సుల ప్రకారం ఒక బ్లాకు స్థాయిలోని వ్యవసాయ భూమిలో కనీసం 33 శాతము భూమి నమ్మకమైన నీటి సాగు క్రింద వుండినప్పుడు మాత్రమే ఆ ప్రాంతంలో వ్యవసాయం కొంత స్థిరంగా (Stability) వుంటుంది. మన రాష్ట్ర స్థాయిలో సాగునీటి క్రింద వున్న సగటు మొత్తం వ్యవసాయ భూమిలో 40 శాతము అంటే అనంతపురం జిల్లాలో రాష్ట్ర సగటుకన్నా అతి తక్కువ స్థాయిలో (8 శాతం మాత్రమే) నీటిపారుదల క్రింద వ్యవసాయం వున్నది. కాబట్టి:

1) **అనంతపురం జిల్లా అభివృద్ధికి అతి కీలకమైన అంశం నమ్మకమైన సాగునీటి వ్యవసాయాన్ని కనీసం రాష్ట్ర సగటు స్థాయికి (40 శాతం) పెంచడం. అంటే కనీసం 4 లక్షల హెక్టార్లను నమ్మకమైన సాగునీటి పారుదల క్రింద తీసుకురావలసి వుంటుంది. దీనికి తగిన విధంగా హంద్రీ-నీవా, సమాంతర కాలవ, పెన్నాఅహోబిళం లాంటి భారీ నీటిపారుదల నిర్మాణాలు చేపట్టి త్వరగా పూర్తిచేయవలసి వుంది.**

2) **వాటితోపాటు, ప్రతి గ్రామ స్థాయిలోనూ వాటర్‌షెడ్ కార్యక్రమాలు మరియు సాంప్రదాయ నీటి వనరులైన చెరువులు, కుంటలు, కాలవలు, తలిపిరులు మొదలగు వాటినన్నీ పూర్తిస్థాయికి**

**పునరుద్ధరించవలసి వుంటుంది. అదనంగా నదీజలాలు అనంతపురం జిల్లాకు తప్పనిసరి. మన రాష్ట్రంలోని తుంగభద్ర, కృష్ణా, గోదావరి నదులలో లభించే జలవనరులతో అనుసంధానం చేయడం సాధ్యమని నిపుణులు చెబుతున్నారు. అటువంటి చర్యల ద్వారా అనంతపురం జిల్లాకు అదనపు నదీ జలాలను తరలించ కుండా జిల్లాలోని కరువు దారిద్ర్యం సమస్యలు పరిష్కారం కాజాలవు. ఈ అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయాలి. ఆచరణ సాధ్యం చేయాలి.**

## 2.1 జిల్లా వ్యాప్తంగా సమతౌల్య నీటి పంపిణి కోసం "జిల్లా నీటివలయం" (District Water Grid) మరియు అనుసంధాన నీటి వినియోగాల్ని (Conjunctive Use of Water) అమలు పర్చడం:

పై ప్రాతిపదికన 4 లక్షల హెక్టార్లు సాగునీరు కూడా జిల్లాలో ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా జిల్లా అంతటా సాధ్యమైనంత సమతౌల్యంగా సాగునీటి పంపిణీ (Equitable Distribution of Irrigation Water) జరగాలి. అందుకు మన జిల్లాలో వున్న చెరువులను, మధ్యతరహా ప్రాజెక్టులను కలుపుతూ ఒక జిల్లా వ్యాప్త నీటి వలయం (District Water Grid) ఏర్పాటు చేయవలెను. అవసరమైనచోట్ల ఇంకా బ్యాలన్సింగ్ రిజర్వాయర్లను కూడా నిర్మించాలి. వీటిద్వారా కొంతమేరకు ప్రత్యక్షంగా చిన్న, సన్నకారు రైతుల మెట్ట భూములకు నదీజలాల ద్వారా సాగునీరు అందించి, కొంతమేర ప్రస్తుతమున్న చెరువులు, మధ్యతరహా నీటివనరుల ద్వారా జిల్లా వ్యాప్తంగా సాగునీటిని వీలైనంత వరకూ సమతౌల్యంగా పంపిణీ చేయవచ్చును. ఆ విధంగా కాకుండా భారీ ప్రాజెక్టుల ద్వారా ఏ కొన్ని మండలాలకో పరిమితమై సాగునీరు అందించిన ఎడల జిల్లాలోనే ప్రాంతీయ అసమానతలు, అసంతృప్తులు పెరిగే అవకాశముంది.

చెరువుల వలయం ద్వారా నీటి పంపిణీ చేయుట వలన, వర్షంతో అరకొరగా నిండే చెరువునీటికి తోడుగా నదీజలాల ద్వారా పూర్తిగా నింపడం వలన, జిల్లాలోని వర్షపు నీటికి అదనంగా నదీజలాలను అనుసంధానం చేసినట్లవుతుంది. అదేవిధంగా చెరువులు, భారీ ప్రాజెక్టుల ద్వారా నీరు పారే నేలలలో కూడా అనువైన చోట బోరుబావులను నిర్మించుకొని, చెరువులు, కాలువలలో నీరు అయిపోయినప్పుడు మాత్రమే బోరు బావులను ఉపయోగించు కొనవలయును. ఈవిధంగా 1) నెలలలో వర్షపు తేమను, 2) చెరువుల నీటిని, 3) నదీజలాలను 4) భూగర్భజలాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి, వినియోగించడం అవసరం. దీనినే "అనుసంధాన నీటి వినియోగం" (Conjunctive Use of Water) అంటారు. ఈ విధానం వలన ఒక రకము నీటికి ఇంకొక రకము నీరు తోడై వృధా కాకుండా మానవ అవసరాలకు అత్యధికంగా ఉపయోగపడుతుంది. అంతేగాకుండా జిల్లా వ్యాప్తంగా సమతౌల్య నీటి పంపిణీ చేయడం కూడా వీలవుతుంది.

## 2.2 తాగునీరు మరియు ఇతర వ్యవసాయేతర ఉత్పాదక అవసరాలు తీర్చడం:

జిల్లా నీటి వలయం ద్వారా జిల్లాలోని అన్ని పట్టణాలకు గ్రామాలకు, తాగునీరు ప్రాథమిక ప్రాధాన్యత (First Priority) గా అందించవలసి వుంటుంది. తాగునీరుకు సంబంధించి, జనాభా పెరుగుదలను, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని, పట్టణాలకు అన్ని గ్రామాలకు, వాటిలోని అన్ని వర్గాలకు అవసరమైన తాగునీటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయవలసి వుంటుంది. గ్రామాలలో మరియు పట్టణాలలో తాగునీటి అవసరాలు తీర్చడంతోపాటు, వ్యవసాయేతర ఉత్పాదక జీవనోపాధులైన చేతివృత్తులు, గృహ పరిశ్రమలు, ఇతర గ్రామీణ పరిశ్రమలకు కావలసిన నీటి అవసరాలను కూడా తీర్చవలయును.

## 2.3 సూక్ష్మనీటిసాగును (Micro-Irrigation)తప్పనిసరి (Compulsory) చేసి, అభివృద్ధి పర్చడం:

మన జిల్లాలో నీటి వినియోగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి "ప్రతి నీటి చుక్కకు ఎక్కువ పంట" (More Crop Per Each Drop) విధానాన్ని అనుసరించవలసి వుంటుంది. ఈ విధానం 'ప్రతి ఎకరంలో ఎక్కువ పంట' (More crop per acre) కంటే కొంత భిన్నమైంది. అందుకోసం సూక్ష్మసాగు (Micro-Irrigation) పద్ధతులైన బిందుసేద్యం, తుంపెర సేద్యాల్ని పాటిస్తూ, ప్రతిరైతూ తనకున్న భూమిలో కొంత నేలలో అధిక విలువగల (high value) పంటలను ఉదా: దానిమ్మ, బత్తాయి పండించవలసి వుంటుంది. తద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగులోనికి తీసుకురావడంతోబాటు, తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకతను, లాభాలను సాధించవచ్చును. సూక్ష్మనీటిసాగుతో పెట్టే పంటలలో కూడా వైవిధ్యం పాటించవలసి వుంటుంది. అంటే తిండిగింజలు, కూరగాయలు, పండ్లు, పశువుల మేత, ఎగుమతి పంటలు మొదలైనవి తగు పాళ్ళలో ప్రతి రైతూ అనుసరించవలసి వుంటుంది.

## 2.4. భూసంస్కరణలు మరియు బీడు భూముల సమగ్రాభివృద్ధి

జిల్లాలో భూసంస్కరణలను కఠినంగా అమలు చేయాలి. అలాగే, రెవిన్యూ, దేవాదాయ భూములను నిరుపేదలకు, కౌలుదారులైన రైతులకు పట్టాలివ్వాలి. భూసంస్కరణల క్రింద భూస్వాములు వదులుకొన్న భూములు, రెవిన్యూ డిపార్టుమెంట్ ఆధీనంలోని బీడు భూములు, ఇప్పటికీ ప్రభుత్వం డి-ఫారం పట్టాలు యిచ్చిన భూములు - ఇవన్నీ చాలావరకు రాళ్ళు, రప్పలు, కటాలు, పొదలతో నిండియుండి వ్యవసాయ యోగ్యంగా లేవు. నీటి సదుపాయం అంతకంటే లేదు.

ఈ భూములు అభివృద్ధి కోసం మరియు ఈ రైతుల పేదరిక నిర్మూలన కోసం ఒక ప్రత్యేకమైన సమగ్రాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేయవలసి వుంది. తద్వారా బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా అభివృద్ధి చేయడంతోబాటు, నీటి పారుదల అవకాశాలను కల్పించడం, పండ్లతోటల అభివృద్ధి, పాడి పరిశ్రమ పెంపకంలాంటి విస్తృత వ్యవసాయావకాశాలను కల్పించవలెను. ఈ వ్యాసంలో 3,4,5,6 పేరాలలో చెప్పిన అంశాలతో ఈ రైతులను ప్రధాన భాగస్వాములుగా పరిగణించ వలయును. గ్రామీణ దారిద్ర్య నిర్మూలనలో వీరికి ప్రాధాన్యత కల్పించ వలయును.

## 3. 30 శాతం వ్యవసాయ భూమిలో (వర్షాధారం, సాగునీటి కింద కలిపి) పండ్లతోటల పెంపకం: ప్రస్తుతమున్న 33,600 హెక్టార్ల నుండి 3 లక్షల హెక్టార్లకు పెంచడం:

మన జిల్లాలో వ్యవసాయ భూమి చాలా రకాలైన పండ్ల తోటలకు అనువుగా వున్నది. ఉదా: చీని, సపోట, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి, మామిడి, చింత మొ॥వి. వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం భూమి ఇటువంటి పండ్లతోటల పెంపకానికి వినియోగించడం ఇటు రైతులకు, అటు పర్యావరణానికి శ్రేయస్కరం. అంటే మనజిల్లాలోని ప్రతి రైతూ తనకున్న మొత్తం వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం పండ్లతోటలు పెంచాలి. ప్రతి రైతూ వేరుశెనగలాంటి వర్షాకాల పంటలతోపాటు, బహువార్షికాలైన చెట్ల పంటలు కూడా పండించాలి. తద్వారా ఒకరకమైన పంట నష్టపోయినా ఇంకొక రకమైన పంట వచ్చి రైతుకు కొంతవరకూ ఆదాయ భద్రత ఏర్పడుతుంది. తద్వారా అటవీ సంపద జిల్లాలో తక్కువైనా, పండ్లచెట్ల ద్వారా పర్యావరణం అభివృద్ధి చెందడంతోబాటు రైతుకూలీలకు సంవత్సరం పొడవునా పనికూడా లభిస్తుంది. మన జిల్లాలోవున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, తక్కువ నీటిసాగుతో లేదా వర్షాధారం పైన ఆధారపడి పండే మామిడి, చింత, సపోట, సీతాఫలం,

నేరేడు మొ॥ పండ్లతోటలకు అధిక ప్రాముఖ్యత ఇవ్వడం సమంజసం. తద్వారా అనేకమంది బీదరైతులకు ప్రయోజనం కలుగుతుంది.

## అనంతపురం జిల్లాలో దీర్ఘకాలిక పండ్లతోటల విస్తీర్ణం (హె.)

| వ. నెం. | పండ్లతోట రకము | విస్తీర్ణం (హె.) | ఉత్పత్తి (మెట్రిక్) టన్నులలో |
|---|---|---|---|
| **1** | చీనా | **20000** | **300000** |
| **2** | దానిమ్మ | **3000** | **58000** |
| **3** | రేగు | **1600** | **40000** |
| **4** | సపోటా | **960** | **14400** |
| **5** | మామిడి | **3800** | **18200** |
| **6** | జామ | **1300** | **20000** |
| **7** | చింత | **1600** | **7800** |
| **8** | ద్రాక్ష | **140** | **5100** |
| **9** | నిమ్మ | **950** | **6800** |
| **10** | టెంకాయ | **250** | **358000** |
| | మొత్తం | **33600** | **828300** |

ప్రస్తుతం మన జిల్లాలో కేవలం 33,600 హెక్టార్లు మాత్రమే దీర్ఘకాల పండ్ల తోటలు ఉన్నట్లు అంచనా. దీనిని కనీసం 3 లక్షల హెక్టార్లకు (30 శాతం వ్యవసాయ భూమి) పెంచడం అవసరం. ఒక ప్రత్యేక పండ్లతోటల దీర్ఘకాల ప్రోత్సాహ కార్యక్రమం ద్వారా ఇది సాధ్యమవుతుందని ఆర్.డి.టి. నిరూపించింది. తద్వారా పంట మార్పిడి పెరిగి, పర్యావరణం కూడా అభివృద్ధి అవుతూ, రైతులకు ఆదాయ భద్రత పెరిగి, కరువుకు తట్టుకొనే శక్తి వస్తుంది. తద్వారా పండ్లపై ఆధారపడిన వ్యవసాయ పరిశ్రమలు ప్రోత్సహించి, చదువుకొన్న గ్రామీణ నిరుద్యోగులకు (Educated unemployed) ఉద్యోగాలు కూడా కల్పించుకొనవచ్చు. రైతులకు కూడా గిట్టుబాటు ధర లభిస్తుంది. జిల్లా ఆర్థిక వ్యవస్థ కొంతవరకూ బలవర్ధకమవుతుంది.

> ***కొన్ని ప్రోత్సాహకాలతో వర్షాధార పండ్లతోటల పెంపకాన్ని నీటి వసతిలేని సన్న, చిన్నకారు రైతులకు కూడా అవకాశం కల్పించ వచ్చును. ఆర్‌డిటి ఆధ్వర్యంలోని పండ్లతోటల పెంపకం కార్యక్రమంలో 3 నుండి 4 సంవత్సరాలు పండ్లతోటలకు చెరువులు, చెక్‌డ్యామ్‌ల నుండి ఎద్దులబండ్లతో నీళ్ళు తరలించి, ఎండాకాలం లోనూ, వరుపు కాలంలోనూ కూడా నీరు పోసేందుకు ప్రోత్సాహమిస్తున్నది. తద్వారా అనేక బీద మెట్టరైతులు ముఖ్యంగా దళితులు, గిరిజనులు పండ్లతోటలను పెంచుకోగలుగుతున్నారు. ఇదే పద్ధతిని శ్రీ సోమేష్‌కుమార్‌గారు జిల్లా కలెక్టర్‌గా వున్నపుడు పాటించి పండ్లతోటల పెంపకానికి మంచి ప్రోత్సాహమిచ్చినారు (2001-03).***

### 4) వర్షాధార వ్యవసాయం ఒక బహుళపంట వ్యవస్థగా (Multiple Corpping System) తీర్చిదిద్దటం:

మనజిల్లాలో దాదాపు 9 లక్షల 50 వేల హెక్టార్లు వర్షాధారం మీద పంట పెడుతున్నారు. దాదాపు 8 లక్షల హెక్టార్లు వేరుశనగ పంటను ఏకపంటగా పెడుతున్నారు. కేవలం ఒక లక్ష హెక్టార్లలో

మాత్రమే, ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో ఇతర పంటలు పెడుతున్నారు. ఇతర పంటలలో ముఖ్యమైనవి శనగలు, జొన్నలు, పొద్దుతిరుగుడు, ధనియాలు మొదలగునవి. మొత్తం వ్యవసాయ భూమి 10 లక్షల 50 వేల హెక్టార్లలో దాదాపు ఒక లక్ష 80 వేల హెక్టార్లు నల్లరేగడి భూమి వుంది. అనంతపురం జిల్లాలోని గ్రామాలలో నివసించే దాదాపు 5 లక్షల కుటుంబాలలో 55 శాతం మంది కుటుంబాలు అంటే 3 లక్షల కుటుంబాలు కేవలం వర్షాధార వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అంటే వీరికి బోర్లు, బావులు, చెరువులులాంటి ఎటువంటి నీటిసాగుగల భూమి లేదు. వీరిలో అత్యధిక భాగం చిన్న, సన్నకారు రైతులుగా స్వంత వ్యవసాయంతో పాటు వ్యవసాయ కూలీలుగా కూడా జీవనం సాగిస్తున్నారు. తరచూ పంట కరువులతో అప్పుల ఊబిలో కూరుకొనిపోయి కూలీ కూడా దొరకక వలసలపై ఆధారపడి చావలేక బతుకుతున్న బడుగుజీవులు. వర్షాధార రైతులకు జీవం పోయాలంటే మొదట నీటిపారుదల సౌకర్యం కలిగించాలి.

***సాగునీటి ప్రాముఖ్యతను రెండవ పేరాలో చర్చించినాము. ఆవిధంగా జిల్లాలో 4 లక్షల హెక్టార్లు (40 శాతం) వ్యవసాయ భూమి నమ్మదగిన సాగునీటి క్రిందకు తీసుకొని వచ్చినా దాదాపు 2 లక్షల (40 శాతం) మంది రైతులకే నీటిసాగు అంతో ఇంతో దక్కుతుంది. జిల్లాలో ఇంకా దాదాపు 3 లక్షల రైతు కుటుంబాలు వర్షాధార వ్యవసాయంపైననే జీవించవలసి వుంటుంది.***

**కానీ మొత్తం జిల్లాలో ఉన్న దాదాపు 10 లక్షల 50 వేల హెక్టార్ల భూమినంతా సాగునీటితో పారించడం సాధ్యం కాదు. 4 లక్షల హెక్టార్లు సాగు కిందికి తెచ్చినా మిగిలిన 6.5 లక్షల హెక్టార్లు వర్షాధారంపైన పంట పెట్టాల్సిందే. కాబట్టి వర్షాధార వ్యవసాయం కూడా లాభసాటిగా వుండేటట్లు విధానాలు, పరిస్థితులు కల్పించుకోవాలి.**

***వర్షాధారంపై వ్యవసాయంచేసే, సన్నచిన్నకారు రైతుల శాశ్వత అభివృద్ధి కోసం క్రింది చర్యలు చేపట్టవలసి వుంటుంది.***

**4.1. వర్షాధార పంటల ఆదాయ బీమా: సాధారణ (వర్షాధార) వ్యవసాయ ఆదాయంలో కనీసం 75 శాతం ఆదాయానికి ప్రతిరైతుకు బీమా భద్రత కల్పించాలి:**

ప్రస్తుతమున్న పంటల బీమా రైతులకు ఆశించినంత మేలు చేయడంలేదు. ఇది అందరు రైతులకు అందుబాటులోనూ లేదు. వ్యవసాయ బీమా పథకానికి ఆదాయం ఆధారంగా ఒక కనీస ప్రాతిపదిక ఉండాలి. ఆ కనీస ఆదాయ ప్రాతిపదిక రైతును ధైర్యంగా వర్షాధార పంట పెట్టడానికి ప్రోత్సహించాలి. అంటే సాధారణ పంట ఆదాయంలో కనీసం 75 శాతం పంట ఆదాయానికి బీమా భద్రత కల్పించాలి. ఇటువంటి బీమాపథకంలో పంట మోతాదుతోపాటు కనీస గిట్టుబాటు ధర కూడా జోడించబడుతుంది. కనీసం 75 శాతం ఆదాయ భద్రత ఉన్నపుడే రైతు పంటరాని కరువు సంవత్సరాలలో కూడా కనీసం పంట అప్పును తీర్చగలడు. అట్లా తీర్చగలిగినపుడు తిరిగి అతనికి రాబోయే సంవత్సరానికి అప్పు దొరుకుతుంది. కాబట్టి 75 శాతం ఆదాయ బీమా భద్రత పథకం మనజిల్లా మెట్టరైతులకు తప్పనిసరి. ఆ బీమా పథకం యొక్క ప్రీమియంలో అధికభాగం రైతుకు ప్రభుత్వం సబ్సిడీగా యివ్వాలి. ఆ విధంగా బీమా ప్రీమియం సబ్సిడీగా ప్రభుత్వం యిచ్చినపుడు యిక రైతులకు పంట నష్ట పరిహారం యివ్వవలసిన అవసరం వుండదు.

***హెక్టారు వేరుశనగ వర్షాధారంతో పెట్టడానికి దాదాపు రూ॥ 4,500/- పెట్టుబడి అవసరమవుతుంది. సాధారణ పంటవస్తే హె.కు వెయ్యి కిలోల పంట వస్తుంది. ధరలు ఇప్పటిలాగా (రూ. 1800 క్వింటాలు) ఉంటే రూ॥ 18,000/- స్థూల ఆదాయం (రూ॥***

*10,500/- నికర ఆదాయం) వస్తుంది (హెక్టారుకు 1000 కేజీల పంట ప్రకారం). స్థూల ఆదాయంలో 75 శాతం అంటే కనీసం రూ॥ 13,500/- లకు బీమాభద్రత కల్పించాలి. అంటే ఒక సంవత్సరం హె.కు. రూ॥ 10,000/- స్థూల ఆదాయం వాస్తవంగా వచ్చిందనుకుంటే ఆదిపోనూ మిగిలిన రూ॥ 3,500/- ఆదాయాన్ని బీమా కంపెనీ చెల్లించవలసియుంటుంది.*

## 4.2 పంటలకు గిట్టుబాటు ధర:

ప్రపంచీకరణ మరియు సరళీకరణల మూలంగా "పంటధరల కరువులు" (Price Droughts) వస్తున్నాయి. ఈ దుష్ప్రభావాన్ని తీవ్రంగా ప్రతిఘటించవలసి వుంది. సరైన జాతీయ వ్యవసాయ విధాన నిర్ణయాల ద్వారా దేశీయ వ్యవసాయ ఉత్పత్తులకు, ముఖ్యంగా వర్షాధార పంటలకు గిట్టుబాటు ధరలతో రక్షణ కల్పించవలసి వుంది. పట్టు, పామాయిల్‌లాంటి దిగుమతులను పూర్తిగా ఆపుచేయవలసివుంది. ఇంత పెద్ద వ్యవసాయికదేశమై వుండి, వంటనూనె లాంటి ప్రాథమిక ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం ఏమిటి? ఇది మనదేశానికే అవమానం. ఇది అనేకమంది రైతులకు మరణశిక్షతో సమానం.

## 4.3 పంటమార్పిడి:

**బహుళ పంట వ్యవసాయ విధానం** (Multiple Cropping System)- **లేదా సమగ్ర వ్యవసాయ విధానం** (Integrated Rainfed Farming System)

ప్రస్తుతం అనంతపురం జిల్లాలో చాలా వరకు వేరుశెనగ ఏకపంటగానూ కొంతవరకు నల్లరేగడి నేలల్లో ప్రొద్దుతిరుగుడు, ధనియాలు, జొన్న, వాము లాంటి పంటలు పండిస్తున్నారు. ఐతే ఈ పంటలన్నీ ఖరీఫ్ లేదా కొంతవరకూ రబీ సీజన్లలో వేసే స్వల్పకాల వర్షాధార పంటలు. ఈ పద్ధతి కొంత మార్చి, బహుళ పంట వ్యవసాయ విధానాన్ని పాటిస్తే, ఇటు రైతుకూ అటు పర్యావరణానికీ, వ్యవసాయ స్థిరత్వానికీ తోడ్పడుతుంది. బహుళ పంట వ్యవసాయ విధానమంటే ఒకరైతు తనకున్న వ్యవసాయ భూమిలో సమగ్రంగా ఈ క్రింద పేర్కొన్న బహుళ పంటలను ఒక పద్ధతి ప్రకారం పెంచడం.

**స్వల్పవ్యవధి వర్షాకాల తిండి పంటలు:**

కొంతభాగంలో వేరుశెనగ, జొన్నలాంటి తిండిగింజలు, టమోట, బెండ, వంకాయ, బీరలాంటి కాయగూరలు, ఆకుకూరలు మరియు అవసరమైన స్వల్పకాల గడ్డి మొక్కలు. వీటిలో చాలా రకాలు తిండిగింజలతోపాటు, గడ్డిని కూడా సమకూరుస్తాయి.

**దీర్ఘకాల పండ్ల మొక్కలు:**

కొంతభాగంలో మామిడి, చింత, సపోట, రేగు, నేరేడు, సీతాఫలం మొ॥గు పండ్ల చెట్లను పెంచుట. నాటిన మొదటి మూడు, నాలుగు సంవత్సరాలు ఎద్దులబండ్లపై నీటిని తరలించి, నీళ్ళు పోసుకొని చెట్లను బ్రతికిస్తే ఆ తరువాత అవి వర్షాధారంపైన పంటనిస్తాయి.

**దీర్ఘకాల గడ్డిమొక్కలు:**

సూబాబుల్, అవిశ, వేప, తుమ్మలాంటి గడ్డికి ఉపయోగపడే చెట్లు పెంచుట. మొదట ఒకటి రెండు వేసవి కాలాలలో కొంతనీరు పోసిన తర్వాత వర్షాధారంపై జీవించి, గడ్డిని శాశ్వతంగా ఉత్పత్తి చేస్తాయి.

**దీర్ఘకాల ఇంధన మరియు ఔషధ మొక్కలు:**

ఆమ్ల, కానుగ, జెట్రోప, అడవిఆముదం, గోరింటాకు మొదలైనవి. ఇవి కూడా మొదట

రెండు లేక మూడు సంవత్సరాలు వేసవికాలంలో నీరు పోసిన తర్వాత వర్షాధారంపై జీవించి దీర్ఘకాలంగా ఫలితాన్నిస్తాయి. రాబోయే సంవత్సరాలలో వీటికి మంచి భవిష్యత్తు వుండబోతున్నట్లు నిపుణులు అంటున్నారు.

**పాడి పశువులు, చిన్న జీవాలు:**

సమగ్ర వ్యవసాయంలో భాగంగా భూవిస్తీర్ణాన్ని బట్టి కనీసం రెండు మూడు పాడి పశువులను లేదా 5 నుండి 10 వరకూ మేకలు మరియు గొర్రెలను కూడా పెంచుకోవాలి. వాటికి అవసరమైన గడ్డి తన పొలంలోనే స్వల్పకాల గడ్డి మొక్కల నుండి మరియు గడ్డిచెట్ల నుండి దొరుకుతుంది. అందుకు అదనంగా కొంత దాణా (Cattle Feed) కూడా వేసుకొని లాభసాటిగా వాటిని పెంచుకోవచ్చు.

పైన పేర్కొన్న చెట్ల పంటలు అన్నీ తనకున్న వ్యవసాయ భూమిలో ఒక పద్ధతి ప్రకారం, ఒక పంటకు ఇంకొక పంటకు లేదా ఒక చెట్టుకు ఇంకొక చెట్టుకు పోటీలేకుండా ఉండే పద్ధతిలో, ఒకదానికొకటి తోడుచేసే పద్ధతిలో పెంచుకోవచ్చు. పొలం చుట్టూ కలబంద నార మొక్కలను పెంచుకోవచ్చు. దీనివల్ల పొలానికి రక్షణతోపాటు, కొంత ఆదాయం కూడా వస్తుంది. ఈ బహుళ పంట విధానం వల్ల రైతుపొలంలో విస్తారంగా వర్షాధార స్వల్పకాల పంటలతోపాటు చెట్లు కూడా వుంటాయి. కాబట్టి పొలంలో గడ్డి, ఆకులు రాలడం, పచ్చి ఎరువులతో వ్యవసాయ భూమిలో మంచి జీవపదార్థం (Bio-mass) సత్తువ పెరిగి, తేమ అధికకాలం నిల్వ వుంటుంది. భూమి ఉత్పాదకత బాగా పెరుగుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా రైతుకు ఆదాయ భద్రత పెరుగుతుంది. బహుళ ఆదాయ అవకాశాలు (Multiple Income Opportunities) పెరుగుతాయి. స్వల్పకాల వర్షాకాల పంటలు కరువుకు గురి అయినా, పండ్లమొక్కల నుండి, పాడిపశువుల నుండి, లేదా గొర్రెలు మేకలనుండి, ఔషధ మొక్కలనుండి కొంత ఆదాయం నిలకడగా లభిస్తుంది. కరువులేని సంవత్సరాలలో కొన్ని తిండి గింజలతోపాటు, కూరగాయలు కూడా లభిస్తాయి. పచ్చదనం, జీవవైవిధ్యం పెరిగి పర్యావరణ సమతౌల్యం ఏర్పడుతుంది. కరువు ప్రాంతాలలో, వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడే రైతులకు ఈ పద్ధతి ఆచరణీయం, అభిలషణీయం, శాస్త్రీయం కూడా.

పైవిధంగా "సమగ్ర వ్యవసాయాన్ని" పాటించే రైతులకు మొదట్లో దీర్ఘకాల ప్రోత్సాహకాలు (3–5 సం.లు) ఇవ్వాలి. వర్షాధార పండ్ల తోటలను గడ్డి, ఔషధచెట్లను పెంచే రైతులకు, 3 నుండి 5 సం॥ల వరకు నీళ్ళుపోసి కాపాడేందుకు ఆర్థిక సదుపాయం కల్గించి ప్రోత్సహించాలి. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ప్రోత్సాహకాలను కల్పించవచ్చు. అలాగే సజ్జలు, జొన్నలు, కందులు, అలసందలు, నూవులు మొదలగు తిండిగింజలకు తగిన గిట్టుబాటు ధర, ఆదాయ బీమా సదుపాయం యివ్వవలసి వుంటుంది. ఇటువంటి కాయధాన్యాలకు, నూనె గింజలకు చిరుధాన్యాలకు ముందుగానే గిట్టుబాటుధర ప్రకటిస్తే రైతులు పంటమార్పిడి చేసే అవకాశం వుంది. ఔషధ మొక్కలు మరియు జీవ ఇంధనానికి (Bio-diesel) ఉపయోగపడే కానుగ, అడవి ఆముదం, మొదలగు పంటలను గిట్టుబాటు ధరలు ముందుగానే ప్రకటించి, వాటిని పెంచుటకు ప్రోత్సహకాలు యివ్వాలి. పశుపోషణకు తగిన మార్కెటింగ్ మరియు ఆరోగ్య సదుపాయాలు కలుగజేయాలి.

### 4.3.1. మేలైన వేరుశనగ రకాలను ఆవిష్కరించాలి:

ప్రస్తుతం జిల్లాలో పండిస్తున్న టి.యం.వి–2, వేమన, జె.యల్.24 మొదలగు వేరుశనగ రకాలు ప్రధానంగా నూనె కోసం ఉద్దేశింపబడినవి. మనం తిండి పదార్థాల కోసం (Confectionary Purpose) పనికి వచ్చే లావు పాటి, నూనె శాతం తక్కువ గల వేరుశనగ రకాలను కూడా

కనుగొనవలసివుంది. ప్రస్తుతం ఇటువంటి తిండికి ఉపయోగపడే రకాలు అధికంగా ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలలో పండిస్తున్నారు. తద్వారా (కేవలం నూనె మాత్రమే గాకుండా) తిండి పదార్థాల ఉత్పత్తులు విస్తృతంగా తయారు చేయడానికి మరియు వాటి ఎగుమతులకు కూడా అవకాశం కలుగుతుంది. తిండి పదార్థాల ఉత్పత్తి పరిశ్రమ కూడా పెరుగుతుంది. వేరుశనగ ధరలలో కొంత నిలకడకూడా ఏర్పడుతుంది. అదనంగా ఇంకొంతమందికి ఉపాధి లభిస్తుంది.

**5. పాడిపరిశ్రమ, గొర్రెల మేకల పెంపకం ద్వారా భూమిలేని కూలీల మరియు చిన్న రైతుల దారిద్ర్యాన్ని శాశ్వతంగా పారద్రోలాలి:**

పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, ఉమ్మడి భూముల అభివృద్ధి, అడవుల పెంపకం ఉపాధి హామీ పథకం, బీదకూలీల శాశ్వత అభివృద్ధి – ఈ అంశాలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. వీటన్నింటినీ తగినవిధంగా సమన్వయంతో అనుసంధానం చేయాలి. దీనివలన బీడుభూములు, బోడికొండలు, సామాజిక ప్రయోజిత పండ్లమొక్కలు మరియు గడ్డితో పచ్చదనంగా మారడంతో పాటు, పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకలు పెంపకం ద్వారా, నిరుపేదలకు శాశ్వత దారిద్ర్య నిర్మూలనకు కూడా ఉపయోగపడే విధంగా సమన్వయం చేసి, ఒకదానితో ఒకటి అనుసంధానం చేయడం అవసరం. ఈ క్రింద చెప్పిన విధంగా చేయడం ద్వారా అది సాధ్యం అవుతుంది.

**5.1. జిల్లావ్యాప్తంగా పాడిపరిశ్రమ, మార్కెటింగ్ సదుపాయాలు, పశు ఆరోగ్య సేవలు, కృత్రిమగర్భోత్పత్తి సదుపాయాలు విస్తరించబడాలి.**

**మన జిల్లాలో పాడిపశువుల సంఖ్య విస్తృతంగా పెంచడానికి, క్రింద తెల్పిన రెండు మార్గాలను అవలంబించవలసి ఉంది.**

**1) కృత్రిమ గర్భధారణ ద్వారా ప్రస్తుతమున్న నాటి ఆవుల మరియు గేదెల రకాలను అధికోత్పత్తి (high yielding) రకాలుగా మార్చుట:**

జిల్లాలోవున్న నాటి రకం ఆవులు మరియు ఎనుములన్నిటినీ కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా మేలైన అధిక ఉత్పత్తి రకాలతో సంకరపరచి, మేలురకం పశువులుగా మార్చవచ్చు. తద్వారా తక్కువ పెట్టుబడితో, ఇప్పటికేవున్న నాటీ పశువుల ఫలదీకరణం ద్వారా పాల ఉత్పాదకతను బాగా పెంచే అవకాశమున్నది. మేలు రకము పశువులను బయట నుండి కొనటం కంటే ఈ పద్ధతికయ్యే ఖర్చు చాలా తక్కువే. కాబట్టి ఇప్పటికే నాటీ పశువులున్న బీదరైతులకు ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా, అనంతపురం జిల్లా వాతావరణానికి, ఎండుమేతకు కూడా ఈ పశువులు తట్టుకొని, లాభసాటిగా పాలను ఉత్పత్తి చేస్తాయి. ఇట్లా పశువుల రకాలను మార్చడంలో దేశీయ రకాలైన షాహివాల్, సింధీలాంటి అధికోత్పత్తి రకాల వీర్యంతో నాటీ ఆవులను కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా మన అనంతపురం జిల్లా వాతావరణ పరిస్థితులకు మేత లభ్యతకు అనుకూలంగా వృద్ధి చెందగల మేలురకాలు తయారవుతాయి. అనంతపురం జిల్లాలో దాదాపు 2 లక్షల 50 వేల నాటీ ఆవులు మరియు 2 లక్షల 50 వేల నాటీ ఎనుములు వున్నట్లు ఒక అంచనా. వీటన్నింటినీ ఎక్కువ దేశీరకాలతో సంకర పరచి "జాతి అభివృద్ధి" (Upgrade) చేయవలసి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం వారు ఒక ఉధృతమైన కార్యక్రమం చేపట్టవలసి వుంటుంది. ఇప్పటికే ప్రభుత్వ నిధులతో జె.కె. ట్రస్ట్ వారు 50 సెంటర్లలో మన జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వారు కూడా ఈ పనిని చేస్తున్నా, ఆశించినంత ఫలితాలు రావడం లేదు. మరి సమర్థవంతంగా చేయగలిగితే, తద్వారా అతి తక్కువ ఖర్చుతో లక్షలాది రైతులకు పాడి పరిశ్రమ ఒక అదనపు ఆదాయ వనరుగా తయారౌతుంది.

***పూర్తి విదేశీ రకాలైన జెర్సీ ఆవులు మరియు ముర్రా ఎనుములు చాలా సున్నితమైన పశువులు కాబట్టి మన వాతావరణ పరిస్థితులకు అంత అనుకూలం కాదు. ఈ విదేశీరకాలకు నిరంతరము మంచి రకాలైన పచ్చిగడ్డి, ఆరోగ్యసేవలు, మంచి పాక సౌకర్యాలు అవసరం. మన జిల్లాలో పచ్చిగడ్డి సంవత్సరం పొడవునా లభించదు. కాబట్టి అన్ని అనుకూలాలు, సౌకర్యాలు కలుగజేయు స్థోమత గల రైతులు మాత్రమే విదేశీరకాల పాడి పశువులను ఎన్నుకొనవలయును.***

**2) ఋణసౌకర్యం ద్వారా రైతులకు అధిక దిగుబడినిచ్చే పశువుల పంపిణీ:**

ప్రస్తుతం పశుసంపదలేని గ్రామీణ పేదలకు ఋణసౌకర్యం ద్వారా అభివృద్ధి చేయబడిన (Upgrade) పాడిపశువులను అందచేయాలి. బ్యాంకులు పాడిపరిశ్రమను ఒక ప్రాధాన్య అంశంగా పరిగణించి విస్తృతంగా రైతులకు, రైతుకూలీలకు ఋణసౌకర్యం కల్పించాలి. తద్వారా బీదరైతుల జీవనోపాధులు శాశ్వతంగా మెరుగుపడతాయి.

అనంతపురం జిల్లాలో దాదాపు 4 లక్షల 20 వేల కుటుంబాల ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. కనీసం 3 లక్షల కుటుంబాలకైనా ప్రతి కుటుంబానికి కనీసం రెండు మేలురకం పాడి పశువులు వుండే విధంగా ప్రణాళిక రూపొందించి అమలుచేయాలి.

**5.2 పశుఆరోగ్య సేవలు మరియు మార్కెటింగ్ సౌకర్యం కల్గించాలి:**

పాడిపరిశ్రమ జిల్లా అంతా వ్యాపించి, రైతులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చెందాలంటే, పశు ఆరోగ్య సేవలను మరియు పటిష్ఠమైన పాలు, పాల ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను నెలకొల్పాలి. ప్రస్తుతం మన జిల్లాలో అటువంటి సేవలు లేకపోవడమే పాడిపరిశ్రమ దుస్థితికి ఒక ముఖ్యకారణం.

**5.3 గొఱ్ఱెలు మరియు మేకల పెంపకం:**

**5.3.1 మేలుజాతి రకాలను మరియు ఉమ్మడి బీడు భూములలో గడ్డి ఉత్పత్తులను ప్రోత్సహించాలి.**

అనంతపురం జిల్లాలో 20 లక్షల గొఱ్ఱెలు మరియు 5 లక్షల 50 వేల మేకలు వున్నట్లు అంచనా. గొఱ్ఱెలు మరియు మేకల పెంపకంపై ఆధారపడి దాదాపు 75 వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నట్లు అంచనా. ఐతే గొర్రెల మరియు మేకల పెంపకానికి సంబంధించిన ప్రధాన సమస్య జిల్లాలో తగినంత మేత లేకపోవడం. మేతలేమి కారణంగా సంవత్సరంలో దాదాపు 6 నెలలు దూర ప్రాంతాలకు "మేతవలసలు" పోయి, జీవాలను రక్షించు కొంటున్నారు. జిల్లాలో వున్న గొర్రెలు, మేకల రకాలు కూడా అంత మేలైన జాతులు కావు. ఇప్పుడిప్పుడే అధిక మాంసోత్పత్తికి అనువైన నెల్లూరు గొర్రెల రకానికి మార్పుచెందడం జరుగుతూవుంది. మేకలలో రాజస్థాన్‌లోని కొన్ని దేశీరకాలు మేలైనవిగా చెప్తూతారు. అటువంటి మేలైన రకాలను గుర్తించి అనంతపురం పర్యావరణ పరిస్థితులకు సరిపడే మేలైన గొర్రెల మరియు మేకల రకాలను వృద్ధి చేయవలసి వుంది.

**5.3.2 పశువుల పెంపకందార్ల స్వయం సహాయక సంఘాలకు ఉమ్మడి భూములను తగిన ఫలసాయ హక్కులతో అప్పగించాలి.**

భూమిలేని నిరుపేదలను మరియు పశువుల పెంపకం దార్లను స్వయం సహాయ సంఘాలుగా ఏర్పాటుచేసి, ఉమ్మడి భూములను అభివృద్ధి చేయడానికి, వాటి ఫలసాయాన్ని సంపూర్ణంగా అనుభవించడానికి హక్కులతో అప్పగించాలి. వాటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని 5 నుండి 10 సంవత్సరాలపాటు ఆ స్వయం సహాయ గ్రూపులకు అందించాలి. 5 నుండి 10 సం॥లు గడ్డిని, చెట్లను నాటి, రక్షించి పోషిస్తే గానీ ఆ ఉమ్మడి భూములు ఉత్పాదక

స్థాయికి రాలేవు. ముఖ్యంగా ఈ భూములలో భూసార సంరక్షణ, వర్షపు నీటిని నిలుపుటకు కందకాలు, విస్తృతంగా చేపట్టవలయును. అందుకుతోడుగా నర్సరీలో పెంచిన చెట్లను పెంచడంతోపాటు, తగిన విధంగా విత్తనాలను కూడా పూడ్చాలి. ఇటువంటి అభివృద్ధి పనులను కొనసాగిస్తూ, వాటి సంరక్షణకు తగిన సాంఘిక నియంత్రణను అమలుచేయాలి.

**5.3.3 ఉమ్మడి భూముల అభివృద్ధి – కొండ గుట్టలను మరియు బీడు భూములను పశువుల మేత మరియు ఇతర ప్రయోజనకరమైన మొక్కలతో అభివృద్ధి చేయాలి.**

మన జిల్లాలో 5 లక్షల హెక్టార్లకు మించి పశువుల మేతకోసం అభివృద్ధి చేయగల కొండ గుట్టలు, బీడుభూములు, చౌడుభూములు, పంటపెట్టని ఇతర భూములు (రిజర్వుడు అడవులు కాకుండా) ఉన్నాయి. అటువంటి భూములన్నింటినీ పచ్చీకరణ (Greening) చేయవలసి వుంది. ఆ భూములలో అనువైన దీర్ఘకాల గడ్డిరకాలైన చెట్లు, స్వల్పకాల గడ్డిరకాలతోపాటు, వేప, అవిశ, సిగెర, తుమ్మ, చింత, సీతాఫలం, శీకాయ, కుంకుడు, రేగు, నారప లాంటి (గడ్డి మరియు పండ్లచెట్ల రకాలతో,) నింపి, రక్షించి, పోషించవలసి వుంటుంది.

**5.3.4 ఉపాధి హామీ పథకాన్ని ఉమ్మడి భూముల అభివృద్ధి, స్వయం సంఘాల అభివృద్ధి కోసం వినియోగించాలి.**

మనజిల్లాలో భూమిలేని నిరుపేదలు మరియు కూలిపైన కూడా ఆధారపడే సన్న, చిన్నకారు రైతులు వలసలు పోకుండా కరువుకు తట్టుకోవాలంటే, శాశ్వత ఉపాధి హామీ పథకమొక్కటే శరణ్యం. సంవత్సరంలో కనీసం 100 రోజులు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పని కల్గించవలసిన అవసరం వుంది. అటువంటి ఉపాధి హామీ పథకాన్ని క్రింది విధంగా మనకున్న సహజవనరులను బహుళ ప్రయోజన పద్ధతిలో అభివృద్ధి చేయడానికి తద్వారా శాశ్వితంగా బీదరిక నిర్మూలనకు ఉపయోగించాలి.

- ➪ **ఉమ్మడి భూములైన కొండలు, గుట్టలు, బీడు భూములను దీర్ఘకాల ప్రణాళిక ప్రకారం పశువులమేత కోసం మరియు ఇతర ఫలాల కోసం 5.3.2 పేరాలో చెప్పిన విధంగా స్వయం సహాయ సంఘాల ద్వారా అభివృద్ధి చేయుటకు**
- ➪ **స్వంత భూములైవుండి, రాళ్ళు రప్పలతో, గులకరాళ్ళతో, పొదలతో నిండి బీడులుగా వున్న భూములను వ్యవసాయయోగ్యంగా అభివృద్ధి చేయడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం చేకూర్చుటకు**
- ➪ **సన్న చిన్నకారు రైతుల మెట్టభూములలో వర్షాధార పండ్లతోటలు అభివృద్ధి చేయుటకు**
- ➪ **సాంప్రదాయక చిన్న నీటి వనరులను పూడికతీయుటకు మరియు కట్టల మరమ్మత్తుల ద్వారా పునరుద్ధరించుటకు**
- ➪ **రిజర్వు అటవీ ప్రాంతంలో భూసార సంరక్షణ, నీటి సంరక్షణకోసం భూమి అభివృద్ధి మరియు చెట్ల పెంపకం చేయుటకు**
- ➪ **తద్వారా గ్రామంలోని భూమిలేని పేదలకు చిన్న, సన్నకారు రైతులకు ఇటు ఉపాధి, అటు సహజ ఉత్పాదకవనరుల అభివృద్ధి కోసం రెండు విధాలుగా ఉపయోగ పడుతుంది. బీదలకు ఉపాధి ద్వారా తక్షణ ఉపశమనంతోబాటు, దీర్ఘకాల, శాశ్వత అభివృద్ధికి తోడ్పడుతుంది. దీర్ఘకాలంలో వారికి జీవనోపాధి కలిగించే స్వంత భూములు, ఉమ్మడి భూములు, చిన్న నీటి వనరులు, అడవులు శాశ్వతంగా అభివృద్ధి చెందుతాయి. ఆ పరిస్థితులలో భూమిలేని నిరుపేదవారికి కూడా ఉమ్మడి వనరుల ఆధారంగా పాడిపశువుల మరియు గొర్రెలు, మేకలు పెంచడం ద్వారా మెరుగైన జీవనోపాధి కలిగే అవకాశం వుంది.**

| భూవినియోగము | వేల హెక్టార్లు | శాతం |
|---|---|---|
| అడవి ప్రాంతం | 197 | 10.3 |
| వ్యవసాయేతర ప్రయోజనాలకు | 175 | 9.1 |
| ఉపయోగిస్తున్న భూమి | 159 | 8.3 |
| సాగుకు అనువైన బంజరు | 70 | 3.7 |
| శాశ్వత పచ్చిక బయళ్ళు, మైదానాలు | 24 | 1.3 |
| చెట్లు పొదల క్రింద ఉన్నది | 11 | 0.6 |
| వ్యవసాయానికి పనికిరాని ఇతర పడావులు | 105 | 5.5 |
| ప్రస్తుతం పంట పెట్టని భూములు | 196 | 10.2 |
| నికర సాగు విస్తీర్ణం | 976 | 51.0 |
| ఒకసారికి మించి విత్తిన భూమి | 31 | 1.6 |
| మొత్తం సాగు విస్తీర్ణం | 1007 | 52.6 |
| మొత్తం జిల్లా విస్తీర్ణం | 1913 | |

### 5.3.4. పశువులను, గొర్రెలను మేకలను, విచ్చలవిడిగా మేపే విధానంలో మార్పులు రావాలి:

ప్రస్తుతం మన జిల్లాలో స్వేచ్ఛా విధానంలో విచ్చలవిడిగా ఉమ్మడి భూములలోనూ మరియు ప్రయివేటు భూములలోనూ (పంటలేని కాలంలో) పశువులను మేపుతున్నారు. ఇది చాలా అశాస్త్రీయం మరియు పర్యావరణానికి, పశువులకు రెండింటికీ అనర్థదాయకం. గొర్రెలు, మేకలు తొందరగా పెరగాలన్నా, పాడి పశువులు బాగా పాలు యివ్వాలన్నా, వాటికి శారీరక శ్రమను తగ్గించాలి. మేత మేయుటకు చాలా దూరం నడిచి ప్రయాణం చేయుట వలన, తినిన మేత నడవడానికి అవసరమైన శక్తికే సరిపోతుంది. కాబట్టి, బరువు పెరగలేవు. తొందరగా ఎదగలేవు. తద్వారా వాటి ఉత్పాదకత, ఆదాయం కూడా తగ్గుతుంది. మంచి లాభాలు రావాలంటే అన్ని రకాలైన పశువులను మేపడంలోనూ నియంత్రణ మరియు శాస్త్రీయత ఉండాలి. అందుకోసం ఈ క్రింది పద్ధతులను పరిశీలించవలసి ఉంటుంది.

1) **అర్ధదినం మాత్రం బయటమేపి, అర్థ దినం పశువుల పాకలోనే పశువుల దాణా** (Cattle Feed) **తో మేపడం (పాక్షిక సాంద్ర పద్ధతి).**
2) **అర్ధదినం బయటమేపి, అర్ధదినం పశువులపాకలోనే కోసుకొని వచ్చిన ఎండుగడ్డితో మేపడం.**
3) **బయటకు పోనీయకుండా పశువులపాకలోనే పచ్చగడ్డితోనూ, దాణాతోనూ మేపడం (సాంద్ర పద్ధతి** Stall Feeding).
4) **బీడుభూములలో గడ్డి పంటలు మాత్రమే పెంచి, రొటేషన్ పద్ధతిలో ఆ భూములలో మేపడం.**
5) **మేకలు మేసే చెట్లను పొలాలగట్లపైన, మేరలలోనూ, కటములలోనూ పెంచి, మేతకోసుకొని వచ్చి ఇంటి దగ్గర మేపడం.**
6) **గడ్డి కాలంలో బయట మేపుతూ, ఎండాకాలంలో ఇంటి దగ్గర దాణాతోనూ, కోసిన మేతతోనూ మేపడం.**

పై పద్ధతులను గ్రామంలోవున్న భూములు మరియు మేత పరిస్థితుల కనుగుణంగా మేపే పద్ధతులను ఎన్నుకొనవలెను. కరువు సంవత్సరాలలో కూడా మేత లోటును తట్టుకొనేవిధంగా అధికంగా లాభాలు వచ్చే పద్ధతులు పాటించవలెను. పైపద్ధతులను పాటించడం ద్వారాతక్కువగా ఉన్న గడ్డి గ్రామాలలో కూడా ఎక్కువ పశువులను లాభదాయకంగా పెంచుకోవడానికి అవకాశంతోపాటు, దీర్ఘకాలంగా గడ్డి కొరతను నివారించుకోవచ్చును. పైన చెప్పిన విధంగా పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు పెంచడం, బీదవారి స్వయం సహాయక బృందాలు, ఉమ్మడి భూముల అభివృద్ధి, బీడుభూముల అభివృద్ధి, చిన్న

నీటి వనరుల అభివృద్ధి మొదలగు వాటిని సమన్వయంతో ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసిన యెడల దారిద్ర్య నిర్మూలనకు, కరువు తీవ్రత తగ్గించడానికి, పర్యావరణ అభివృద్ధికి తోడ్పడును. మన జిల్లాలో విస్తృతమైన అటవీ సంపద లేని లోటును కొంతవరకూ తీర్చును.

## 6. రిజర్వుడు అడవులను జీవ వైవిధ్య వృక్షసంపదతో వృద్ధిచేయడం:

భారత ఫారెస్ట్ కమీషన్ వారి సిఫార్సుల ప్రకారం ఒక జిల్లా విస్తీర్ణంలో కనీసం 33 శాతం భూభాగం అడవితోనిండి వున్నప్పుడే ఆ జిల్లాలో పర్యావరణం కూడా సమతౌల్యంతోపాటు వ్యవసాయం స్థిరంగా, ఉత్పాదకంగా వుంటుంది. పర్యావరణ సమతౌల్యం వ్యవసాయ దీర్ఘకాల మనుగడకు తప్పకుండా అవసరం. మనజిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్ల (10శాతం) విస్తీర్ణంలో అడవులు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. కానీ, నిజంగా అడవిమాత్రం 2 శాతం కూడా లేదని నిపుణుల అంచనా. అంటే మన జిల్లాలో తగినంత వృక్ష సంపదలేని అటవీ భూమి దాదాపు ఒక లక్షా యాభైవేల హెక్టార్లు ఉండవచ్చు. తగినంత స్థాయిలో వృక్షసంపద, పచ్చదనం ఉన్నప్పుడే పడే వర్షపాతం భూమిలోనికి ఇంకి భూగర్భజలాలను పెంచుతుంది. దూది నీటిని పీల్చినట్లు, అడవులు వర్షాన్ని పీల్చుకుంటాయి. తద్వారా తలిపిరిలు, వంకలు, నదులలో నీటి ప్రవాహకాలం పెరుగుతుంది. భూగర్భజలాలు పెరుగుతాయి. గడ్డి, పచ్చదనం ఎండాకాలంలో కూడా ఎక్కువకాలం వుంటుంది. చెట్లు, గడ్డి భూములలో భూసారం కొట్టుకొని పోకుండా భూమిని రక్షిస్తాయి. చెరువులు, కుంటలు పూడి పోకుండా వుంటాయి. జీవవైవిధ్యం పెరిగి వ్యవసాయానికి తోడుచేసే మిత్రప్రాణులు, మిత్ర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు వృద్ధి చెంది వ్యవసాయోత్పత్తికి తోడ్పడుతాయి. పశువులకు మేతతోపాటు పండ్లు, కాయలు, కలప, ఔషధ మొక్కలు, సుగంధ మొక్కలు మొ॥గు ఉత్పత్తులు అడవుల నుండి లభించే అవకాశం వుంది. అడవులున్న ప్రాంతాలు సుభిక్షంగా వుంటాయి. అడవులు లేని ప్రదేశాలే ఎడారులు! ఈ విషయం మనకందరికీ తెలుసు.

### 6.1 స్వయం సహాయక సంఘాల ద్వారా అడవుల అభివృద్ధి:

అడవుల ఫలసాయం పై హక్కులతోపాటు, సంరక్షణ, పెంపకం బాధ్యతలను కూడా బీదవారి స్వయం సహాయ సంఘాలకు అప్పగించి, ఉపాధి హామీ పథకం ద్వారా దీర్ఘకాల ఆర్థిక, సాంకేతిక వనరులు సమకూర్చితే అడవులు పూర్వవైభవం సంతరించుకోవచ్చు. అడవి ప్రాంతాలలో భూసారాన్ని సంరక్షించుటకు, వర్షపు నీటిని ఒడుపుటకు తగినవిధంగా కాంటూరు కందకాలను విస్తృతంగా త్రవ్వాలి. వాటిలో మొక్కలునాటాలి. అనువైనచోట్ల విత్తనాలను పూడ్చాలి. విమానాల ద్వారా తగిన విత్తనాలను అడవి ప్రాంతంలో విస్తృతంగా వెదజల్లాలి. అడవి ప్రాంతంలో అదును చూసుకొని వున్న చిన్న కుంటలను పునరుద్ధరించాలి. అడవులను సంరక్షించడానికి సాంఘిక నియంత్రణతోపాటు, అధికారిక నియంత్రణ కూడా అవసరం. అటవీ ఉత్పత్తులను ఒడుపుకొనుటలో కూడా స్వయం సహాయక సంఘాల నియంత్రణ అవసరము. దీర్ఘకాలంలో అడవి సంపదను క్షీణించని విధంగా అటవీ ఉత్పత్తులను ఒడుపు కొనవలయును.

***మన జిల్లాలో ఎడారీకరణ ఆగిపోవాలంటే:***

1) **పై విధంగా అడవులను దీర్ఘకాల ప్రణాళికతో అభివృద్ధి చేయాలి.**
2) **ఉమ్మడి భూములను, బీడు భూములను అభివృద్ధిచేసి, శాశ్వత పచ్చదనాన్ని పెంచాలి.**
3) **వ్యవసాయ భూమిలో 3 లక్షల హెక్టార్లలో పండ్లతోటలు పెంచాలి.**
4) **40 శాతం వ్యవసాయ భూమిలో సాగునీటిని పెంచాలి.**

పై నాలుగు అంశాలను సాధించినప్పుడే అనంతపురం జిల్లాలో ఫారెస్ట్ కమీషన్ వారు సిఫార్సుచేసినట్లు దాదాపు 33 శాతం అటవీ ప్రాంతమున్నంత పర్యావరణ ప్రయోజనం చేకూరి, శాశ్వతంగా పర్యావరణ సమతౌల్యం ఏర్పడుతుంది. మన జిల్లాలో ఎడారీకరణ ఆగిపోతుంది.

**7) కృత్రిమవర్షాలు ఒక నిరంతర దీర్ఘకాల కార్యక్రమంగా, వర్షాభావ ప్రాంతానికంతా వర్తింపజేయుట:**

కృత్రిమవర్షాలు నిజంగా కురిపించడం సాధ్యమౌనో లేదో యిప్పుడికింకా మనకు నిర్ధారణ కాలేదు. అయినా సాధ్యాసాధ్యాలను పరిశోధించవలసిన అవసరం మాత్రం వుంది. అనంతపురం లాంటి కరువు జిల్లాకు ఏ ఒక్క వర్షం అదనంగా కురిపించగల్గినా గొప్పమేలు రైతుకు కల్గుతుంది, కాబట్టి కృత్రిమ వర్షాలను ఒక దీర్ఘకాల మేఘమథన పరిశోధన ప్రాజెక్టుగా (Long term Research Project on Cloud Seeding) చేపట్టవలసి వుంది. కానీ యిటువంటి ప్రాజెక్టు ఒక్క అనంతపురం జిల్లాకో, రాయలసీమకో పరిమితం చేయకుండా, ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలలోని వర్షాభావ ప్రాంతాలను నదీ పరివాహక ప్రాంతాలను మొత్తం కలిపి ఒక అంతర్ రాష్ట్ర ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టవలెను. కృత్రిమ వర్ష ప్రయోగాలకు ఒక జిల్లా విస్తీర్ణం చాలా చిన్నది అవుతుంది. ఈ వర్షాభావ ప్రాంతంలోకి రెండు రాష్ట్రాలలోని కోలారు, చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, తుంకూరు, చిత్రదుర్గ, బళ్ళారి, రాయచూరు, గుల్బర్గా, బీదర్ లాంటి కరువు జిల్లాలు కలుస్తాయి. విస్తీర్ణం పెరిగితేనే మంచి ఫలితాలు వుండవచ్చు. ఉదా: నైరుతి ఋతుపవన కాలంలో తుంకూరు జిల్లాలో మేఘమథనం జరిగితే అనంతపురం జిల్లాలో వర్షాలు పడే అవకాశం వుంది. కర్ణాటక సరిహద్దు జిల్లాలలో వర్షాలు కురిసినా తుంగభద్ర కృష్ణా, హగరి, పెన్నా, చిత్రావతి, పాపాఘ్ని నదుల ద్వారా రెండు రాష్ట్రాలకు ఉపయోగం ఉంటుంది. దక్షిణదేశ వర్షాభావ ప్రాంతానికి అనంతపురం కేంద్ర బిందువుగా వుంది. కాబట్టి ఆ పరిశోధన కేంద్రాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయడం సమంజసము. అవసరమైనన్ని ఉపకేంద్రాలను కూడా ఏర్పాటు చేయవలెను. వాటి ద్వారా వర్షాభావ ప్రాంతాన్నంతా ప్రభావితం చేయగల్గినంత మౌలిక సదుపాయాలు ఈ కేంద్రాలలో వుండవలెను. ఉదా: అంత విస్తీర్ణానికి సరిపడే రాడార్ సదుపాయాలు అవసరమైనన్ని విమానాలు, సాంకేతిక నిపుణులు మొదలగునవి ప్రతి జిల్లాస్థాయిలోనూ అందుబాటులో ఉండవలెను.

**8) వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమల ద్వారా చదువుకొన్న నిరుద్యోగులకు ఉపాధి:**

మన జిల్లాలో చదువుకొన్నవారి నిరుద్యోగం (Educated unemployment) పోవాలంటే, గృహ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించవలెను. వ్యవసాయాధారిత పరిశ్రమల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కూడా లభించును. వ్యవసాయేతర పరిశ్రమల ద్వారా ఇతర ఉత్పత్తులు పెరిగి, వ్యవసాయేతర వ్యాపార, వాణిజ్య, ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. మన జిల్లాలో స్థాపించే పరిశ్రమలు, మానవ వనరుల (Labour intensive) ఆధారంగా ఉపాధి అవకాశాలు పెంచేవిగా ఉండాలిగానీ, నిరుద్యోగులను పెంచే అధిక యాంత్రీకరణ (High mechanization) విధానం సరిపోదు. కాబట్టి, పరిశ్రమలను ఎన్నుకొనడంలోనూ, సాంకేతిక-యాంత్రీకరణ విషయంలోనూ అతి జాగ్రత్తగా వ్యవహరించడం చాలా అవసరం. వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమల విషయంలో మన జిల్లాకు అనువైన పరిశ్రమలను సూచించుటకు తగిన పరిశోధన జరుగవలెను. మన జిల్లాలోవున్న మానవ వనరులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర ముడి పదార్థములు, మార్కెటింగ్ అవకాశాలు దృష్టిలో వుంచుకొని ఈ పరిశోధన మరియు అభివృద్ధి (Research & Development) జరుగవలెను. పెద్దపరిశ్రమలకు అనుబంధంగా మానవశ్రమతో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల ఉత్పత్తులను గుర్తించవలెను.

ఈ పరిశోధన కోసం ఒక నిపుణుల కమిటీని నియమించడం సమంజసం.

**8.1 వ్యవసాయ పరిశ్రమలు:**

మనజిల్లాలోని వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా వ్యవసాయ పరిశ్రమను గుర్తించి మన వ్యవసాయ ఉత్పత్తులకు "విలువాధిక్యత" (Value Addition) చేకూర్చవలసి వుంటుంది. వేరుశెనగ నూనెతోబాటు తిండి పదార్థాల ఉత్పత్తి, ప్రొద్దుతిరుగుడు విత్తనాలతో నూనె ఉత్పత్తి, నల్లరేగడి నేలలో పండించే వివిధ పంటలకు విలువాధిక్యత కలిగించే విధంగా పరిశ్రమలు ప్రోత్సహించి స్థాపించాలి. వేరుశనగను పప్పు, నూనెగానూ, పండ్లను పండ్లరసంగానూ, ఇతర పండ్ల ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించవలెను. ఉదా: చీని పండ్లరసం, దానిమ్మరసం, జామరసం, సపోట రసం, మామిడి రసం మొ.వి ధనియాలను పొడిగానూ, జొన్నలను పిండిగానూ, కందులను బేడలుగానూ నాణ్యతను బట్టి రకాలుగానూ వాటి విలువను పెంచవలయును. పాడి ఉత్పత్తులను, మాంస ఉత్పత్తులను, చర్మ పరిశ్రమను ప్రోత్సహించవలయును. తగిన శాస్త్ర పరిజ్ఞానంతో, ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా నాణ్యత, ప్యాకింగ్, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్టు వ్యవస్థలను నెలకొల్పవలెను. తద్వారా రైతుకు గిట్టుబాటు ధర రావడంతోబాటు, నిరుద్యోగ సమస్య కూడా తగ్గుతుంది.పారిశ్రామిక ఔత్సాహికులకు, చదువుకొన్న యువతీయువకులకు పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కలుగజేస్తూ, తగినవిధంగా పరిశ్రమల రాయితీలు యిచ్చి ప్రోత్సహించ వలయును. ఇచ్చే రాయితీలు ఎక్కువగా ఉపాధి కల్పన ఆధారంగా ఉంటే మంచిది.

## 8.2 వ్యవసాయేతర పరిశ్రమలు:

మనజిల్లాలో వున్న ముఖ్యమైన, అతివిలువైన వనరు మానవ వనరులు. కాబట్టి ముఖ్యంగా తక్కువ యంత్రాలతో ఎక్కువగా మనుషుల శ్రమ చేత ఉత్పత్తి చేయగల వ్యవసాయేతర ఉత్పత్తులను, సేవలను గుర్తించవలయును. <u>ఉదా</u>: అగరబత్తి, కుట్టు పనులు, చేనేత మొదలగునవి. మన జిల్లాలో అన్నిస్థాయి నైపుణ్యాలు కల మానవ వనరులు ఉన్నాయి. పై స్థాయి కంప్యూటర్ యింజనీర్ల నుండి, సాధారణ నిరక్షరాస్యుల వరకూ ఉన్నారు. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా అర–కొర అక్షరాస్యులు, తక్కువ నైపుణ్యం గల ఉత్పత్తులు మాత్రమే చేయగలవారు అత్యధికంగా వున్నారు. కాబట్టి వారి నైపుణ్యస్థాయికనువైన ఉత్పత్తులను గుర్తించి ప్రోత్సహించవలెను. దాని ద్వారా వాటి ప్యాకేజింగ్, మార్కెటింగ్, రవాణా ఎగుమతులు, ముడిపదార్థాల దిగుమతులు మొదలగు సేవలలో చదువుకున్న నిరుద్యోగులు (Educated unemployed) ఉపాధి పొందవచ్చును. పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా వికేంద్రీకరించగల వస్తు ఉత్పత్తి అవకాశాలను శోధించవలెను.

ఇంకనూ మన జిల్లాలో లభ్యమవుతున్న ముడిపదార్థాల ఆధారంగా భిన్న ఉపయోగాలుగల ఉత్పత్తులను రూపొందించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయవచ్చును. ఇటువంటి ఉత్పత్తులపైన తగిన వస్తుపరిశోధన (Product Research) చేయడం కూడా అవసరం.

అనంతపురం జిల్లాలో ప్రచ్ఛన్న నిరుద్యోగం కూడా ఎక్కువ. అంటే చాలామంది దినంలో కొన్ని గంటలు మాత్రమే పనివుండి, మిగిలిన గంటలు పనిలేకుండా ఉంటారు. ఇటువంటి వారికోసం తీరిక గంటలలో మాత్రమే చేయగల ఉపాధి అవకాశాలను పరిశోధించవలెను. తద్వారా భిన్న జీవనోపాధుల ద్వారా ఆదాయం పెరగడంతోపాటు, ఆదాయ భద్రత కూడా ఏర్పడుతుంది.

## 8.3 దేశ, విదేశ స్థాయిలలో ఉద్యోగాల కోసం పోటీ పడగల మానవ వనరుల అభివృద్ధికోసం విద్యాసంస్థలలో ప్రమాణాల పెంపు:

మన జిల్లాలో చాలా విద్యాసంస్థలు ఉన్నాయి. అనేక జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, పై చదువులకు,యస్.కె. యూనివర్శిటీ, జె.ఎన్.టి.యు., మెడికల్ కాలేజీలు లాంటివి కూడా ఉన్నాయి. అయితే వాటిలో విద్యా ప్రమాణాలు మాత్రం చాలా తక్కువ స్థాయిలో వున్నాయి. దానిమూలంగా మన జిల్లాలో పైచదువులు చదివినవారు కూడా ఉద్యోగాలలో ఇతరులతో పోటీ పడలేక పోతున్నారు. ఇది

చాలా దురదృష్టకరం. కాబట్టి విద్యా ప్రమాణాలు ఉన్నత స్థాయికి పెంచవలసిన అవసరం ప్రాథమిక స్థాయి నుండి, ఉన్నత చదువుల వరకు ఉంది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ రంగాలలో ఉన్నత విద్యార్హత గల అధ్యాపక వర్గం వుంది. అనంతపురం జిల్లాను నిజమైన ఒక 'విద్యానగరం' (Educational City) గా "మానవ వనరుల అభివృద్ధి కేంద్రం"గా (Human Resource Development Centre) తీర్చిదిద్దుటకు అవసరమైన అన్ని హంగులు మనకు ఉన్నాయి. ఆ దిశగా గట్టి ప్రయత్నం జరగాలంటే, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలోవున్న విద్యాసంస్థలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పౌరసమాజం నడుంబిగించాలి. అందుకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, వారి విద్యార్థి సంఘాలు సంపూర్ణ సహకారం ఇవ్వాలి.

**8.4. పరిశోధన మరియు అభివృద్ధి (Research & Development):**

మన జిల్లా లాంటి వర్షాభావ ప్రాంతాలకు ఉపయోగపడే విధంగా వివిధ రకాల వర్షాధార పంటలపై పరిశోధన విస్తృతంగా చేపట్టవలసి వుంది. వర్షాభావానికి తట్టుకోగల (Drought resistant) పంటలు, చెట్లు మరియు తక్కువ పంట కాలం (Short-duration) గల రకాల పంటలను ఆవిష్కరించవలసి వున్నది. అలాగే మనజిల్లాలో ఈత వనములు, వంకలు ఎక్కువగా వున్నాయి. నీరాను కల్లుగా మార్చకుండా నిల్వ చేసి, ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేయడం, అలాగే కొబ్బరి నీరును నిల్వచేసి ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేయడం మొదలగు వాటిపైన పరిశోధన జరగవలసివున్నది. కోకోకోలాకు, పెప్సీకి ప్రత్యామ్నాయంగా నీరాను, కొబ్బరినీటిని మనదేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా అమ్మకాలను విస్తరించడం లాభదాయకం, అందరికీ ఆరోగ్యకరం. అలాగే మనజిల్లాలో సీతాఫలమునకు మంచి అనుకూల పరిస్థితులున్నాయి. మంచిరకాలను ఆవిష్కరించడంతో పాటు, వాటి నిల్వకాలాన్ని పెంచడం పై పరిశోధనలు చేయవలసివుంది. ఇంకనూ మన జిల్లాలోని అడవులలో అనేక రకాలైన మంచిరుచిగల చిరుపండ్లరకాలు ఉన్నాయి. ఉదా. నేరేడు, గేదర, నారవ మొదలగునవి. వాటిపై వాణిజ్య దృష్టితో తగిన పరిశోధనలు జరిపి, వాటి నాణ్యతను, రుచిని పెంచడము, అలాగే వాటి నిల్వ కాలాన్ని పెంచడం, వాటి ప్రవర్ధనానికి అవసరమైన పరిశోధనలు చేయడం అవసరం. అలాగే వేప, కానుగ, చింత మొదలగు ఉత్పత్తులమీద కూడా పరిశోధనలు చేయవలసి వుంది. ఇటువంటి ఉత్పత్తులలో మనం ప్రపంచ మార్కెట్‌లోకి, ఎగుమతులతో ఉధృతంగా ప్రవేశించగల అవకాశాలను పరిశీలించ వలసియున్నది. ఇవి మనజిల్లా మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు మంచి బలాన్నివ్వగలవు. మనకు విస్తృతంగా ఉన్న ఇంకొక సహజవనరు సూర్యరశ్మి. సూర్యరశ్మి ద్వారా ఎలక్ట్రిసిటి (Electricity) ను ఉత్పత్తి చేయవచ్చు. ఎలక్ట్రిసిటిని విస్తృతంగా, గాలిమరల ద్వారా ఉత్పత్తి చేసినట్లు సూర్యరశ్మి ద్వారా ఉత్పత్తిచేసి, పవర్‌గ్రిడ్ (Power Grid) తో అనుసంధానము చేయగల అవకాశాలను పరిశోధించవలయును. వేరుశనగ పంటకు బదులు మన పొలాలలో సూర్యరశ్మిద్వారా ఎలక్ట్రిసిటీని పండించ వచ్చునేమో! అట్లా చేయగలిగితే మన కరువు, దారిద్ర్యం రెండూ తీరినట్లే!

*– కదలిక మే – 2004*

*డా॥ వై.వి. మల్లారెడ్డి రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ వారి ప్రచురణ ఈమాసపు సమాచారంలో గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులపై అనేక రచనలు చేశారు. గ్రామీణప్రజలు రైతులలో మనోధైర్యాన్ని పెంపొందించడానికి మల్లారెడ్డి ఎంతో కృషి చేశారు. రైతు సోదరుల జీవితాలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి డా॥ వై.వి. మల్లారెడ్డి "ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం" లో వ్రాసిన వ్యాసాలను విషయ ప్రాధాన్యత దృష్ట్యా ఈ "అనంత ప్రస్థానం" లో ప్రచురిస్తున్నాం.*

- పబ్లిషర్

# అనంతపురం జిల్లాలో మెట్ట రైతులకు జీవనోపాధి

*రైతు సోదరులు, సోదరీమణులారా! నమస్కారములు!!*

**1. పరిచయం.**

అనంతపురం జిల్లాలో వ్యవసాయము ఒక జూదములాంటిది. మరీ వర్షాధార వ్యవసాయమైతే అదియొక మోసపూరిత జూదమే. ఈ జూదంలో ఎంతోమంది రైతులు తమ ఆస్తులను, మానాలను, ప్రాణాలను సహితం పోగొట్టుకుంటున్నారు. గ్రామీణ వ్యవస్థ మరియు గ్రామాలలో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమయి, గ్రామీణ జీవనం పరమ దారిద్ర్యస్థితికి పడిపోవడం జరిగింది. మరి ఇటువంటి దుర్భర పరిస్థితులలో గ్రామాలలో వర్షాధారంపై ఆధారపడిన రైతాంగ జీవనాన్ని పునరుద్ధరించడం సాధ్యమా? అది ఎలా?

**మన భూములన్నిటికీ సాగునీరు ఎప్పటికైనా వస్తుందా?**

అనంతపురం జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడు కరవు గురించీ, నీటిసాగు లేకపోవడం గురించీ, సమాంతర కాలువ, హంద్రీ-నీవా లాంటి నీటి ప్రాజెక్టులద్వారా సాగునీరు తీసుకొని రావలసిన అవసరం గురించీ పదేపదే చెపుతాం. ఆవిధంగా సాగునీటి వ్యవసాయాన్ని అభివృద్ధి చెయ్యడం అత్యంత ప్రాధాన్యమనీ, అత్యవసరమనీ నేను కూడా భావిస్తున్నాను. అందుకోసం 'అనంత' రైతాంగం ఉధృత పోరాటం చేయవలెనని కూడా నేను మనవి చేస్తున్నాను.

ఐతే, పెన్న అహోబిళం, సమాంతర కాలువ, హంద్రీ-నీవా ప్రాజెక్టులన్నింటినీ మనం సాధించినా మన జిల్లా అంతటా 27 లక్షల ఎకరాలకు నీరు పారించలేవు. రైతాంగ సమస్యలను అవి అందరికీ తీర్చలేవు. మహా అంటే 6 లేక 7 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించగలవు. మన అనంతపురం జిల్లాలో మిగిలిన 20 లక్షల ఎకరాలకు ఎప్పుడైనా వర్షాధారమే గతి! కాబట్టి, వర్షాధార వ్యవసాయాన్ని పునరుద్ధరించడంపైననే మన జిల్లా రైతాంగ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

నీకు గ్రామంలో 5 ఎకరాలు లేదా 10 ఎకరాల మెట్టభూమి వుంటే, దానిపైన ఆధారపడి నీవు జీవనం సాగించడం సాధ్యమౌతుందా? 5 సంవత్సరాలు కష్టపడితే సాధ్యమౌతుంది! కష్టమైననూ సాధించడం తప్ప మనకు వేరే మార్గమేమీ లేదు.

నీకు కేవలం 5 ఎకరాల భూమి ఉందనుకో. ఆ 5 ఎకరాలలో క్రింది చర్యలను పాటించి, నిలకడైన ఆదాయం వచ్చే విధంగా నీవు వ్యవసాయం చెయ్యవచ్చు. కరవుకు తట్టుకొనే ఆర్థిక పరిస్థితిని నీవు కల్పించుకోవచ్చు. అందుకు మన సంస్థ తరపున మీకు తగిన ప్రోత్సాహం, సహకారం మీకు అందించుటకు మేం సిద్ధంగా ఉన్నాం. వాటర్‌షెడ్ గ్రామాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మిగతా గ్రామాలకు కూడా మార్గం చూపండి.

**మొదటి చర్య**

**నీ పొలంలో కుంట కట్టలు మరియు వర్షపునీటి గుంత (Farm Pond) ఏర్పాటు**

మొట్టమొదటగా, నీ పొలంలో తగినవిధంగా భూసార సంరక్షణకు మరియు వర్షపు తేమను కాపాడుటకు కట్టలు వేసుకొనవలెను. అంతేగాకుండా తగ్గుభాగంలో ఒక వర్షపునీటి గుంతను త్రవ్వుకొనవలెను. కుంట కట్టలు, చెట్లు నాటుటకు అనుకూలంగా వుండునట్లు వేయించుకొనవలెను. నీటి గుంత లోపల భాగంలో ఒకపొరగా చౌడును వేసి, నీరు భూమిలోకి ఇంకిపోకుండా చేసుకొనవలెను. ఆ నీటిని పంటలకు ఒక తడి ఇచ్చే దానికి ఉపయోగించుకొనే ఉద్దేశ్యంతో ఆ నీటి గుంతను నిర్మించవలెను.

**రెండవ చర్య**

**మూడు ఎకరాలలో పండ్ల చెట్లు**

5 ఎకరాలలో దాదాపు 3 ఎకరాలను వర్షాధార పండ్లతోటలు మిశ్రమపంటగా పెంచవలెను. మూడు ఎకరాలలో కొన్ని మామిడి, చింత, కొన్ని సీతాఫలం, కొన్ని సపోట, కొన్ని రేగులాంటి మొక్కలను పెంచవలెను. మిశ్రమ పంటలుగా/భూమి వృధాకాని విధంగా వరుసలను, వరుసల మధ్యన చెట్లు నాటవలెను. మొదటి 3 సంవత్సరాలు వాటికి నీటిని పోసి పోషించవలెను. నీరు బోరుబావులు ఉండనవసరం లేదు. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లద్వారా నీటిని తరలించి కీలక సమయాలలో తడినిచ్చి పోషించవలెను. అవసరమైతే, నీటిని యితరుల దగ్గర కొనుక్కొని అయినా వాటిని పోషించవలెను. వాటర్‌షెడ్ గ్రామాలలో ఈ విధంగా పండ్ల మొక్కలు పెంచుటకు 3 సంవత్సరాలు సహాయ సహకారాలను మన సంస్థ అందిస్తుంది.

5 లేక 6 సంవత్సరాల తర్వాత పండ్లతోటలు పంటనియ్యడం మొదలౌతుంది. కనీసం 3, 4 రకాల పండ్ల చెట్లు వుండటం వలన, ఒక్కొక్క సీజన్‌లో ఒక్కొక్క పండ్ల పంట ద్వారా ఆదాయం చేతికొస్తుంది.

**నీటిని కొనడమా? అని మీకు అనుమానం రావచ్చు!**

ఔను! మిగిలిన వస్తువులను, ఆస్థులను కొన్నట్లే నీటిని కూడా మితంగా, కీలకంగా తగిన (Life Saving or critical irrigation) విధంగా పంటను రక్షించుకొనుటకు అవసరమైనంత కొనవచ్చు. చెక్‌డ్యామ్‌లు, చెరువులలో నీరు లేనప్పుడే ఆ విధంగా కొనవలసిన అవసరం ఏర్పడుతుంది. అనంతపురంలో త్రాగునీటి కోసం ఒక ట్రాక్టరులో 20,000 లీటర్లుగల ట్యాంకరు రు.150/–లకు అమ్ముతున్నారు. ఆవిధంగా 20,000 లీటర్లను ఒక్కొక్క చెట్టుకు 4 లీటర్ల ప్రకారం 5,000 చెట్లకు ఒకసారి తడి ఇవ్వవచ్చును. లేదా ఒక అర్థ ఎకరా కూరగాయలకు ఒక తడి వేసుకొనవచ్చును.

బీహార్, ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రాలలో 70 శాతం పైగా రైతులు ఈ విధంగా కొన్న నీటితోనే వ్యవసాయం చేస్తున్నారు. ఇది వాస్తవం! కాబట్టి, మనం కూడా చేయవచ్చు. ఆశ్చర్యపోవద్దు!

**మూడవ చర్య**

**రెండు ఎకరాలలో వర్షాధార మిశ్రమ పంటలు**

మిగిలిన రెండు ఎకరాలలో వర్షాధారంపైన కొంత వేరుశెనగ, కొంత కూరగాయలు, కొంత పచ్చిమేత, కొంత కంది, ఆముదం, బంతిపూలు లాంటి పంటలకు నీకు నచ్చిన మోతాదులో పెట్టవలెను. వర్షాధార పంటలకు కూడా ఒరుపులో అవసరమైతే కొన్ని పంటలకైనా నీటిని తరలించి, ఒక్కతడి ఇచ్చే ఏర్పాట్లు చేసుకొనవలెను. చెక్‌డ్యామ్‌ల నుండీ, చెరువులనుండీ తరలించే ఏర్పాట్లు చేసుకోవాలి. అక్కడ నీరు లభ్యంకాని సందర్భాలలో నీటిని కొనుక్కొని అయినా ఒక తడి నీరు ఇస్తే, వర్షాధార పంటలు కొంతకు కొంత చేతికి అందే అవకాశముంది. మనం పంటలు విత్తేటప్పుడు ఆ విధంగా నీటి తడి పెట్టుటకు అనుకూలంగా ఉండునట్లు వివిధ పంటలను విత్తుకొనవలెను.

**నాలుగవ చర్య**

**రెండు పాడిపశువులు లేదా 10 గొఱ్ఱెలు / మేకలు పెంచడం**

రెండు పాడి పశువులను కానీ, లేదా పది చిన్న జీవాలను (గొఱ్ఱెలు/మేకలు)కానీ పెంచే ఏర్పాట్లు చేసుకోవలెను. 'వెలుగు' పథకం ద్వారా, బ్యాంకుల ద్వారా, పొదుపు గ్రూపుల ద్వారా అప్పులను పొంది, ఆవిధంగా పశువులను పెంచుటకు అవకాశాలు ఉన్నాయి. ఐతే, వాటికవసరమైన మేతను కూడా మనమే పెంచుకొనవలెను. అదనంగా కొంత దాణాను కూడా కొని వేయవలెను. వర్షాకాలంలో గడ్డి బాగావున్న కాలంలో బయట మేపి, అట్లా లేని కాలంలో ఇంటి దగ్గరే వట్టిమేత, దాణాలతో మేపే ఏర్పాట్లు చేసుకోవాలి.

పాడి ద్వారా చిన్న జీవాల ద్వారా సంవత్సరానికి దాదాపు రు.10,000/–లు అదనపు ఆదాయాన్ని సంపాదించడం సాధ్యమౌతుంది.

**ఐదవచర్య**

**పొలం మేరలలో భిన్నపంటలు**

నీ పొలం మేరకు చుట్టూ కలబంద, సూబాబుల్, నీలగిరి, వేప, అవిశె లాంటి పంటలు వర్షాకాలంలో నాటవలెను. అవన్నీ వర్షాధారానికి బ్రతికే అవకాశమున్నవి. అట్లా నాటినప్పుడు, 3 సంవత్సరాలలో నీ పొలం చుట్టూ కోటగోడలాంటి మేర ఏర్పడుతుంది. ఆ పొలం మేర, అడవి పందుల బారినుండి మరియు రోగాలు, దొంగల బారి నుండి పంటలను రక్షించడమే గాకుండా నార, పశువుల మేత, వ్యవసాయ పనిముట్లు మొదలగు వాటి ద్వారా కొంత ఆదాయం కూడా పెరుగుతుంది.

**ఆరవచర్య**

**వానపాములతో ఎరువులు, పచ్చి ఎరువులు, రసాయన ఎరువులు (ఇంగ్లీషు మందులు లేకుండా చీడపీడల నివారణ)**

నీవు వానపాముల ఎరువు తయారు చేసుకోవలెను. అదనంగా పచ్చి ఆకులతో కంపోస్టు కూడా తయారు చేసుకొని, రసాయనిక ఎరువులపై ఖర్చును బాగా తగ్గించవలెను. అదేవిధంగా, చీడపీడల నివారణకు కూడా సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా అనగా, వేప, కానుగ, మిరప లాంటి కషాయాల ద్వారా, మిత్రపురుగుల ద్వారా రసాయనిక మందుల వాడకాన్ని, తద్వారా ఖర్చును తగ్గించుకొనవలెను. నీవు ఎంత ఖర్చు తగ్గించుకొంటే, అంత ఆదాయం నీకు వచ్చినట్లే!.

**నీ పొలానికి ఒక సమగ్ర వ్యవసాయ ప్రణాళిక తయారు**

పైన చెప్పిన 5 రకాల పద్ధతులను దృష్టిలో వుంచుకొని, నీ పొలానికి ఒక సమగ్ర ప్రణాళిక తయారు చేయవలెను. సమగ్ర ప్రణాళికలో వివిధ రకాలైన పండ్ల చెట్లకు, వేరుశెనగ, మేత, పూలు మొదలగు గడ్డి చెట్లకు, నారచెట్లకు, వీలైతే కొన్ని ఔషధ మొక్కలకు, తగినంత ప్రాధాన్యం ఇవ్వవలెను. అన్ని పంటలనూ 'అంతర పంటలు'గా మరియు 'మిశ్రమ పంటలు'గా వ్యవసాయ ప్రణాళిక చేయవలెను. పండ్ల మొక్కలకు నీరుపోసే అవకాశాలు ఏమున్నాయో ప్రణాళికలో కనపరచవలెను. పాడిపశువులను, గొఱ్ఱెలు, మేకలను సంపాదించుకొనుటకు, వాటిని పొలంలోనే పోషించుటకు తగినవిధంగా ప్రణాళిక వేయవలెను.

**ముగింపు**

పైన చెప్పిన పద్ధతిని సమగ్ర వ్యవసాయ పద్ధతి అనీ, లేదా 'బహుళ పంటల విధానము' అని అనవచ్చును. తద్వారా మెట్టరైతు జీవనం చేయడానికి, తగిన ఆదాయాన్ని పొందడానికి రైతు ప్రయత్నించవలెను. వాటర్‌షెడ్ గ్రామాలలో ఇటువంటి వ్యవసాయ పద్ధతిని పాటించి, ఇతరులకు మార్గదర్శకంగా నిలువవలెను. ఈ పద్ధతి గురించి, ఇందులోని మంచిచెడులను, సాధ్యాసాధ్యాలను గురించి రైతులు చర్చించవలెను. ఇంకనూ, మంచి ఉపాయాలు ఇందుకు తోడు చేయవలెను. తద్వారా ఈ పద్ధతిని ఆచరణాత్మకంగా తయారుచేసి మన వాటర్‌షెడ్ గ్రామాలలో అమలు చేయవలెనని నా మనవి.

*– ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం – ఫిబ్రవరి – 2005*

# పశుసంపదను పెంచుకునే ప్రయత్నం చేయాలి

ఈ మాట అంటే వెంటనే పశువులను మేపడానికి గడ్డెక్కడిది? నీళ్ళెక్కడివి? అనే ప్రశ్నలు వేస్తారని తెలుసు. నిజమే గత పది సంవత్సరాలుగా జిల్లాలో మేత కొరతవల్ల, కరువుల వల్ల పశుసంపద క్షీణించిపోతోందని తెలుసు. మేతలేక సేద్యానికి ఉపయోగపడే ఎద్దులను కూడా రైతులు అమ్ముకున్న సంఘటనలున్నాయనీ తెలుసు. ఐతే ఈ విషయం వివరించే ముందుగా మరికొన్ని ఇతర విషయాలు వివరించాలనుకుంటున్నాను.

మన జిల్లాలోనే కాదు, దేశం మొత్తంగా మెట్ట వ్యవసాయమే సంక్షోభంలో ఉంది. వర్షాలు సకాలంలో రావు. వచ్చినా మేమున్నామంటూ తెగుళ్ళు, మొలకెత్తని విత్తనాలు, తగ్గుతున్న దిగుబడులు, పంటల కాలంలో రైతు అమ్మాలనుకునేసరికి ధరలు లేకపోవడం లాంటి సమస్యలు రైతులను వెన్నాడుతూ ఉన్నాయి. మరి ఈ సంక్షోభాల చిక్కుముడులు మనంతకు మనమే విప్పుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయం మనకు జీవనాధారం కనుక దానిని మన చేతనైనంతగా బాగుపర్చుకునే ప్రయత్నం చేయాల్సి వుంటుంది. అంతేకాకుండా, వ్యవసాయమంటే కేవలం భూమిలో పంటలు పెట్టడమే కాదు. వ్యవసాయాధారిత కార్యకలాపాలన్నీ వ్యవసాయ పనుల కిందకే వస్తాయి. ఇందుకు మొట్టమొదటగా మనం చేయాల్సిన పని పాడి పశువులను పెంచడం. పాడి వలన ఎంతో కొంత ఆదాయం కుటుంబానికి వస్తుంది. మహిళలకు ఆదాయ వనరు ఏర్పడుతుంది. మహిళల చేతికొచ్చే ఆదాయం కుటుంబాదాయంగా ఉంటుందనీ, పురుషులకు వచ్చే ఆదాయంలో దుబారా శాతం ఉంటుందనీ మనం మర్చిపోరాదు. పాడి పశువుల పెంపకం ద్వారా కేవలం పాలు అమ్మడం ద్వారా వచ్చే ఆదాయమే కాదు, పశువుల పేడ కూడా మనకు వ్యవసాయానికి ఎంతో విలువైనది. ఈ విషయం తరువాత వివరిస్తాను.

గడిచిన రోజులలో ఎంతో కరువును అనుభవించాం. రానున్న రోజులు కూడా మరింత గడ్డుగా ఉంటాయని మనం భావించాలి. అందుకు మనం మానసికంగా సన్నద్ధం కావాలి. ముసలివారు, చిన్న పిల్లలు తప్ప అందరం పనిని గూర్చి ఆలోచించాలి. మునుపటి రోజుల్లా కేవలం పంట ఆదాయం మీదనే బ్రతగ్గలమనే రోజులు పోయాయి. కాబట్టి ఎంత కష్టమైనప్పటికీ, పట్టుదలగా మనం ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలి.

పాడిపశువులంటేనే మనకు మేత, ఆ తర్వాత పాలు అమ్మకం రెండూ సమస్యలుగా కనపడుతాయి. ముందుగా పశువుల మేత గురించి చర్చించుకుందాం.

బావులు, బోర్లు వున్నవారు, ఇతర నీటిపారుదల వసతి ఉన్నవారు అర్ధ ఎకరానుంచి, ఎకరా వరకు గడ్డి పెంపకం చేయాలి. కేవలం 3-4 తడులతోనే ఒక గడ్డి పంట తీయవచ్చు. చాలామంది

ఏమాత్రం వీలున్నా శెనక్కాయ వేయడమో లేదా వరి వేయడమో చేస్తారు. గడ్డి పెంచడం పనికి మాలిన పనిగా, ఆదాయం లేనిదిగా భావిస్తారు. కానీ, ఒక ఎకరా పొలంలో వరి లేదా శెనక్కాయ వల్ల వచ్చే ఆదాయం కంటే గడ్డివల్ల వచ్చే ఆదాయం ఏమాత్రం తక్కువ కాదు. మీకు తెలుసు, పోయినసారి గడ్డి కోసం ప్రభుత్వ అధికారులే ఎంత అవస్థలు పడినారో, గడ్డి సరఫరా ఎంత ఖర్చుతో కూడుకున్నదో ఆలోచించండి. ఈ గడ్డివల్ల పాడిపశువులకు మేత దొరకడమే కాదు, పశువుల పేడ చేనుకు ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. పశువులకు మేత ఎంత ముఖ్యమో, చేనుకు పేడ కూడా అంతే అవసరం. సెప్టెంబర్ – అక్టోబరు మాసాల్లో వచ్చిన వర్షాలతో అక్కడక్కడా చెరువుల్లోకి, కుంటల్లోకి నీళ్ళు వచ్చినాయి.

ఇప్పుడింకా చెరువు, కుంట గర్భాల్లో తేమ ఉన్నచోట సామూహికంగా గడ్డి విత్తనాలు విత్తుకుంటే పశువులకు మేత లభిస్తుంది.

ఇక పాల మార్కెట్ సంగతి ఆలోచిద్దాం. గ్రామంలో కనీసంగా 50 లీటర్ల పాలైనా దొరుకుతాయి. వాటిని పట్టణ ప్రాంతాలకు పంపితేనే నాలుగు డబ్బులు వస్తాయి. గ్రామంలోనివారే అందరూ కలిసి పాలు సేకరించుకుని పట్టణాల్లో పోసి వచ్చేటట్లుగా ఒక నిరుద్యోగికి బాధ్యతలు అప్పగిస్తే, పాలకు ఆదాయం రావడమే గాకుండా, నిరుద్యోగికి కూడా ఉపాధి దొరుకుతుంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వంవైపు నుండి కూడా పాడి పరిశ్రమకు మంచి ప్రోత్సాహం లభించబోతున్నట్టు తెలుస్తున్నది. ఈ విధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే కుటుంబానికి ఆదాయం రావడంతోపాటు, మనం మళ్ళీ మన దిబ్బల్లోని ఎరువును మనచేలల్లోకి తోలే అలవాటుకు మళ్ళుతాము.

ఇక మన మెట్ట పొలాల విషయానికొస్తే, పశువుల ఎరువు లేకపోవడం వల్ల, దాదాపు రైతులందరూ పొలాల్లోకి డి.ఏ.పి., సూపర్ ఫాస్ఫేట్ లాంటి ఎరువులు మూటలకు మూటలు గుమ్మరించడంవల్ల మన జిల్లాలోని భూముల్లో భాస్వరం నిల్వలు ఎక్కువగా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రజ్ఞులు అంటున్నారు. అంటే భూమి సారవంతంలో సమతుల్యం లోపించడమన్నమాట. దీనివలన మొవ్వకుళ్ళు, కాండం కుళ్ళు, ఆకుముడతలాంటి తెగుళ్ళ దాడికి పైర్లు తట్టుకోలేకపోతున్నాయి. భూమిలో పోషకాలు సమతుల్యంగా ఉంటే, రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రకృతి రీత్యా దొరికే పేడ ఎరువుగానీ, ఆకు అలముల కుళ్ళు పదార్థాలను గానీ, ఎరువుగా వాడితే భూమిలో పోషకాలు సమతుల్యంగా ఉంటాయి. ఏదైనా పోషకం తగ్గినప్పుడు వాటి భర్తీకై వ్యవసాయాధికారుల సలహాతో తగుమాత్రంగా రసాయనిక ఎరువులు వాడవచ్చుగానీ, పూర్తి రసాయనిక ఎరువుల మీద ఆధారపడడంవల్లనే మనకు చీడపీడల బాధ ఎక్కువయింది. ఈ సందర్భంగా మీకు ఒక విషయం తెలియజేస్తాను. మన పొరుగునే వున్న చైనా దేశం కూడా మనలాగే వ్యవసాయక దేశం. ఆ దేశంలోని రైతులు పండించే దిగుబడి, మనకంటే ఎక్కువగా వుంటుంది. వారు 1998 నుంచీ తిండిగింజలు పండించడం తక్కువచేసి, బాగా ఆదాయాన్నిచ్చే కూరగాయలు, పండ్లు పండించడం మొదలు పెట్టారు. ఎక్కువ దిగుబడి కోసం సాంప్రదాయకమైన సేంద్రీయ ఎరువులకు బదులు రసాయనిక ఎరువులు అధికంగా వాడడం మొదలు పెట్టారు. దీనితో భూములలో భాస్వరం, నత్రజని నిల్వలు పేరుకుపోయి, తెగుళ్ళు విపరీతంగా వస్తున్నాయట. రసాయనిక ఎరువులు దిగుబడులు పెంచుతాయేగానీ, కొంతకాలానికి భూమి ఉత్పాదకత మీద విపరీత ప్రభావం చూపి మనల్ని కోలుకోనీయకుండా నష్టం కలుగ జేస్తాయి. వాటిని అవసరం మేరకు తగుమాత్రంగా వాడితేనే సత్ఫలితాలనిస్తాయి. మన వ్యవసాయాన్ని తిరిగి పెంచుకునే దిశగా రసాయనిక ఎరువుల బదులు సేంద్రీయ ఎరువులు వాడాలని మనవి జేస్తున్నాను.

– ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం – డిసెంబర్ – 2004

## జిల్లాలోని భూగర్భ జలాలు ఒక మునిగిపోతున్న పడవ లాంటివి

## నియంత్రణ లేకపోతే తప్పని సామూహిక మునక

అనంతపురం జిల్లాలోని వ్యవసాయం పూర్తి సంక్షోభంలో వుంది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంవల్ల కరువు దాదాపు నిరంతరమైంది. గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతుల ఆర్థిక పరిస్థితి క్షీణించి చిన్నాభిన్నమై అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకరికి అన్నం పెట్టే అన్నదాతలే అడుక్కుతినే దుస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులలో రైతులకు అంతోఇంతో ఉపశమనం భూగర్భ జలాల ద్వారా నీటిసాగు వ్యవసాయం. మెట్ట వ్యవసాయ సంక్షోభం నిరంతర కరువులతో ఒక ప్రక్క ముదురుతూ వుంటే ఇంకొక ప్రక్క భూగర్భ జలాల విచక్షణారహిత వినియోగం పెరుగుతూ వుంది. నీటి కరువువల్ల ప్రతి సంవత్సరం అత్యధికంగా బోర్లువేసి వున్న భూగర్భ జలాలను తోడేయడం జరుగుతూనేవుంది. రెండు సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లాలో ఒక లక్షా ముప్పై వేల బోరుబావులు వున్నట్లు ప్రభుత్వ సమాచారం. ఐతే గడిచిన రెండు సంవత్సరాలలో తీవ్ర వర్షాభావంవల్ల తీవ్ర నీటి కరువు కూడా నెలకొని వుంది. దాని మూలంగా గడచిన రెండేళ్ళలో దాదాపు ఒక లక్ష బోర్లు అదనంగా వేసినట్లు అంచనా. ఐతే, లక్ష బోర్లలో విజయవంతమైనవి పదివేల నుంచి ఇరవై వేల వరకు మాత్రమే వుంటాయని అంచనా. రెండేళ్ళ క్రితం పనిచేస్తున్నటువంటి ఒక లక్షా ముప్పైవేల బోర్లు, బోరుబావులలో కనీసం నలభైవేలు దాకా ఎండిపోయినట్టు అంచనా. ఇటువంటి పరిస్థితులలో నీటి కరవు ఒక విష వలయంగా తయారైంది. నిత్య కరవులు భూగర్భ జలాలను పూర్తిగా అడుగంటేస్థితికి తీసుకొని పోతున్నాయి. రైతులకు ప్రస్తుత జీవనం దుర్భరమై, అష్టకష్టాలు పడి అప్పులు చేసి అధికంగా బోర్లు వేసుకొంటున్నారు. వర్షాధార వ్యవసాయంపై ఆశలు వదులుకొని, ఏ కొద్దినెలలైనా సాగునీరు లేనిదే కుటుంబ జీవనం సాగదని కొందరు బోరుబావులు తవ్వితే, మరికొందరు ఉన్న బోర్లు, బావులు ఎండిపోయి, ఇప్పటికే పెట్టిన పంటలను, పండ్ల తోటలను రక్షించుకోవడానికి ఇంకా కొన్ని బోర్లు వేస్తున్నారు. చాలామంది రైతులు కనీస బ్రతుకు కోసమే ఇదంతా చేస్తున్నా కొంతమంది మాత్రం దురాశతో ఎక్కువ నీటిని దోపిడీ చేస్తున్నారు. 500 నుండి 800 అడుగుల వరకూ లోతు బోర్లు వేస్తున్నారు. చాలా బోర్లు విజయవంతం కాకపోవడంవల్ల అప్పులు మాత్రమే మిగిలి ఇంక వేరే ఆధారం అగుపించక ఆత్మహత్యలకు తలపడుతున్నారు. ఆత్మహత్యలు చేసుకొన్న రైతులలో ఎక్కువ భాగం బోరుబావుల కోసం పెట్టుబడి పెట్టినవారే కావడం విశేషంగా గుర్తించదగ్గ విషయం. తీవ్ర వర్షాభావ పరిస్థితులవల్ల మన జిల్లాలో మామిడి, చీని, టెంకాయ చెట్లు చాలా వరకు ఎండిపోవడం జరిగింది. తద్వారా రైతులకు తీరని నష్టం కల్గించడంతోబాటు పర్యావరణాన్ని కూడా క్షీణింపచేస్తున్నాయి.

ప్రస్తుతం అమలులోవున్న ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, మరియు చెట్లు ఆథారిటీ చట్టం (AP Water, Land & Trees Authority) భూగర్భ జల వినియోగాన్ని ఏమాత్రం నియంత్రించ లేకుండా పోతోంది. వినియోగంలో కొంత సమతుల్యత పాటించడానికి కఠినమైన చట్టాలతోపాటు, చర్యలు కూడా

అవసరం. కానీ చట్టాలే భూగర్భ జల దోపిడీని నియంత్రించలేవు. ఉదా. అస్పృశ్యత నివారణా చట్టం వున్నప్పటికీ ఆచరణలో ఇంకా అస్పృశ్యత పూర్తిగా పోలేదు కదా! చట్టాలు సాంఘిక చర్యలకు (Social Action) ఒక పునాదిగా పని చేస్తాయి. చట్టాలు అమలు చేసే బాధ్యతను ప్రభుత్వాలపై మాత్రమే నెట్టివేసి ప్రజలు ప్రేక్షకులుగా మారిపోతే ఆ చట్టం ఉద్దేశ్యం నెరవేరదు. భూగర్భ జలాల విచక్షణారహిత తోడివేతను కట్టడి చేయాలంటే ప్రతి గ్రామంలోనూ సాంఘిక కట్టుబాట్లు గ్రామస్థులే ఏర్పాటు చేసుకోవాలి. ఇది కొంత ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ వాస్తవంగా ఇంతకు మించిన దారి లేదు. సాంఘిక కట్టుబాట్ల ద్వారానే మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలలో, ఆయా గ్రామాలలో లభ్యమయ్యే జలాలను గ్రామంలోని అందరికీ సమానంగా పంచగల్గినారు. ఆ గ్రామాలలో భూమిలేని వారికి కూడా నీటిపై హక్కు వారికి వారే కల్పించుకున్నారు. భూమిలేని వారు ఆ నీటిని భూములకు కౌలుకు తీసుకొని వాడుకోవడమో లేక నీటిని భూమి ఉన్నవారికి అమ్ముకోవడమో జరుగుతూ వుంది. ఇటువంటి వ్యవస్థను వారు పాణీ పంచాయితీగా పిలుస్తున్నారు.

వాస్తవానికి భూగర్భ జలాలు అందరికీ సంబంధించినవి. నా భూమి కాబట్టి నా నీరు అనే ఆలోచన అర్థం లేనిది. ఆ నీరు ఒకరికే పరిమితం గాదు. భూగర్భంలోని నీరు కూడా ఎక్కడో వర్షపు నీరు భూమిలోనికి ఇంకి, భూగర్భం ద్వారా నిదానంగా తగ్గుకు ప్రవహిస్తు ఉంటాయి. అందు మూలంగానే ఒకరి భూమి తగ్గుభాగంలో ఇంకొక బోరు వేసి నీరు తోడితే పై బోరులోని నీరు తగ్గిపోతుంది. కాబట్టి నీరు నిజంగానే అందరి సొత్తు. నీరు జీవరాసుల కోసం ప్రకృతి మనకిచ్చిన వరం. అయితే నీటిని సమానంగా అందరికీ పంచడం అంత సులభం కాదు. కానీ విచక్షణా రహిత నీటి దోపిడీని నియంత్రించి తీరాల్సిందే. అట్లా నియంత్రించకుండాపోతే రాబోయే సమీప భవిష్యత్తులోనే భూగర్భ జలాలు పూర్తిగా ఎవ్వరికీ లేకుండా అడుగంటిపోతాయి. ఇప్పుడు ఏ కొద్దిమంది రైతులో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అప్పుడు ప్రతి రైతు ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఒక్క రైతులే కాదు, ప్రతి జీవి ఆత్మహత్య చేసుకోవలసి వుంటుంది. కాబట్టి, కాస్తంతయినా ముందు చూపు అవసరం. ఆ విధంగా గ్రామాలలో గ్రామస్థులందరూ కలిసి భవిష్యత్తు కోసం సామూహిక సాంఘిక కట్టుబాట్ల ద్వారా నియంత్రణ చేసుకొన్న సందర్భాలు మనదేశంలోనూ, ఇతర దేశాలలోనూ అనేకం ఉన్నాయి. అంతేకాదు ప్రపంచ దేశాలన్నింటిలోనూ భూగర్భ జలాలు అడుగంటి పోవడం గురించి ఉధృతమైన చర్చలు జరుగుతున్నాయి. మానవ జీవనంపై జరగబోయే దుష్పరిమాణాలను గురించి శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఇది గ్రామంలోని అన్ని కుటుంబాలకు సంబంధించిన విషయం. భూమిలేని వారికి కూడా సంబంధించిన విషయం. ఎందుకంటే నీటి మీద మొదటి హక్కు అందరికీ త్రాగడానికి మరియు నిత్యావసరాలకు మాత్రమే. ఆ తర్వాతనే వ్యవసాయానికి. గ్రామాలలో భూగర్భ జలాల వినియోగంపై సాంఘిక కట్టుబాట్ల కోసం నేను కొన్ని సూచనలు చేస్తున్నాను. వాటిపైన గ్రామాలలో గ్రామ నాయకులు, ముఖ్యంగా రైతులు, గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించి చర్చించవలసినదిగా కోరుచున్నాను. చర్చించి తగిన కట్టుబాట్లు చేసుకొనే దిశగా నిర్ణయాలు చేయవలసినదిగా కోరుతున్నాను.

- ఒక్కొక్క రైతు కుటుంబం బోరుబావుల క్రింద పంట పెట్టడానికి గరిష్ట పరిమితి నిర్ణయించవచ్చును. లేదా ఇంటిలో వున్న కుటుంబ సభ్యుల మీద ఆధారపడి, ఒక్కొక్క తలకు పెట్టుకొనే పంట గరిష్ట పరిమితిని నిర్ణయించవచ్చును.

- ఎన్ని అడుగులకు మించి బోర్లు వేయరాదో గరిష్ట పరిమితిని నిర్ణయించవచ్చును.

- వరి పంటను పూర్తిగా గానీ, పాక్షికంగాగాని నిషేధించవచ్చును. లేదా కుటుంబ అవసరాలకు తగినంత మాత్రమే వరి పంట పెట్టుటకు గరిష్ఠ పరిమితిని నిర్ణయించవచ్చును. అది కూడా "శ్రీ"వరి సాగు పద్ధతిలోనే పెట్టవలెనన్న నిబంధన చేయవచ్చును.
- సంవత్సరము పొడవునా నీరు అవసరమయ్యే చెరకు, మల్బరీ లాంటి పంటలకు గరిష్ఠ పరిమితిని నియమించవచ్చును.
- తగ్గు భూములలో బోరుబావులను నిషేధించి, దిగుడు బావులకే పరిమితం చేయవచ్చును. బోరు బావుల ద్వారా నీరు తోడకపోతే, మన పూర్వపు బావులు తిరిగి పూర్వంలాగా పనిచేసే అవకాశముంది.
- సూక్ష్మ నీటి సాగు విధానం తప్పనిసరిగా పాటించుటకు నిర్ణయించవచ్చును.
- కమ్యూనిటీ బోరు బావులను మాత్రమే ప్రోత్సహించి, ఒక్క బోరుబావి వలన నాలుగు లేక ఐదు కుటుంబాలు లబ్ధిపొందునట్లు నిర్ణయించవచ్చును.

పైన చెప్పినవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వాటిలో ఏవి సమంజసమో, ఏవి ఆచరణ సాధ్యమో చర్చించి చూడవలెను. ఆ గ్రామంలో ఉన్న జనాభానుబట్టి, లభ్యమయ్యే భూగర్భ జలాలు, చెరువులు, వంకలు, అడవులు మొదలగు సహజ వనరుల పరిస్థితిని బట్టి తగిన నిర్ణయాలు చేయవలసి వుంటుంది. ఆయా సంవత్సరాలలో పడే వర్షపాతాన్ని బట్టి, లభ్యమయ్యే భూగర్భ జలాలు, చెరువులు, వంకలు, అడవులు మొదలగు సహజ వనరుల పరిస్థితిని బట్టి తగిన నిర్ణయాలు చేయవలసివుంటుంది. ఆయా సంవత్సరాలలో పడే వర్షపాతాన్ని బట్టి ఎక్కువ మందికి మంచి మేలు చేకూరేవిధంగా ప్రతి సంవత్సరం నిర్ణయాలను మార్చుకొనవచ్చును. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా మనము కూడా మారి కొత్త పద్ధతులకు అలవాటు పడవలసి వుంటుంది.

ఈ నిర్ణయములో ప్రజలతోపాటు ప్రభుత్వాలు కూడా తగిన విధంగా స్పందించవలసి వుంటుంది. వర్షాధార వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ఎక్కువగా కల్పించవలసి వుంది. తద్వారా సాగునీటి ప్రాముఖ్యతను కొంతమేర తగ్గించవచ్చును.

**భూగర్భ జలాలు నిజంగానే ఒక మునిగిపోతున్న పడవ. పడవ దరికి చేరాలంటే మనమందరమూ కృషి చేయాలి. లేదా మనమందరమూ పడవతోపాటు మునిగిపోయే ప్రమాదముంది.**

*- ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం - జూన్ - 2004*

## రైతు సోదర సోదరీమణులారా!
## ఆత్మహత్యలు పిరికితనం సమస్యలను ఒకరికొకరు
## తోడుగా, ధైర్యంగా ఎదుర్కొందాం

మొన్న 10.06.2004 వరకూ 365 మంది రైతు సోదరులు, సోదరీమణులు మన అనంతపురం జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్నారు. వారందరికి ఆత్మశాంతికై శ్రద్ధాంజలి ఘటిస్తూన్నాను. మరీ ముఖ్యంగా చనిపోయిన వారి కుటుంబీకులకు సానుభూతి ప్రకటిస్తున్నాను.

క్రొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైతులకు కొన్ని ముఖ్యమైన రాయితీలు ప్రకటించింది. కరెంటు బకాయిల రద్దు, ఉచిత కరెంటు లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు ఇంకా ఆచరణలోనికి రాకముందే మరింతగా ఆత్మహత్యలు చేసుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు. అనుకూలమైన, సానుభూతి పరిస్థితులలో కూడా తొందరపడి ఆత్మహత్యలు చేసుకునేవారు, సమాజంలోని మిగతా ప్రజల సానుభూతి కోల్పోతున్నారేమోనని అనిపిస్తుంది. మౌళికంగా ఆత్మహత్యలు చేసుకున్నవారు వారి కుటుంబాలకు అప్పులు, సంసారభారంతోపాటు, అవమాన భారం కూడా మిగిలిస్తున్నారు. వారి భార్యాపిల్లలు విపరీతమైన అవమానాలకు, మానసికక్షోభకు, న్యూనతాభావానికి, నిరాదరణకు గురవుతున్నారు. కుటుంబ భారాన్ని తూగించేవారు లేక, వ్యవసాయం చేసేవారు లేక, అప్పుల ఒత్తిడికి జవాబు చెప్పుకోలేక, పిల్లలు అనాధలుగా తిరుగుతున్నారు. ఆత్మహత్యలు చేసుకున్నవారు ఒక్కసారే చస్తే, వారి భార్యాపిల్లలు దినదినమూ నరకయాతనతో చస్తూ బతుకుతున్నారు. వీరి కుటుంబాల ప్రస్తుత పరిస్థితుల్నీ గమనిస్తే, హృదయమున్నవారు ఎవరూ ఆత్మహత్యలు చేసుకుంటారని నేను అనుకోవడం లేదు.

రైతు సోదర, సోదరీమణులారా! ఒక్కసారి నిదానంగా, లోతుగా ఆలోచించండి. ఈ ప్రపంచంలో ప్రాణంకన్నా విలువైనది ఏదీ లేదు. ఈ ప్రపంచంలో ఎవరు ఏది చేసినా జీవించడానికేగానీ, అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకోవడానికి కాదు. మానవుడు శాస్త్ర, సాంకేతిక రంగాలలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాడు. చంద్రమండలానికి పోగలుగుతున్నాడు. భూగర్భాన్ని శోధిస్తున్నాడు. మానవుని అవయవాలను మారుస్తున్నాడు. ఇంకా ఎన్నెన్నో చేస్తున్నాడు. ఇవన్నీ కేవలం మానవుడు జీవించడానికే! మానవ కళ్యాణానికే! ఎందుకంటే సృష్టిలో మానవ జీవితం ఎంతో పవిత్రమైనది, విలువైనది, అత్యున్నతమైనది. కాబట్టి అటువంటి జీవితాన్ని అర్థాంతరంగా చాలించడం ఏమాత్రం క్షమార్హంకాదు. కష్టాలు వచ్చినాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలేగానీ, భయపడి ఆత్మహత్యలు చేసుకోకూడదు. ఇంట్లో ఎలుకలున్నాయని, ఇంటికి నిప్పంటించవద్దు. అప్పులున్నాయని ఆత్మహత్యలకు పాల్పడవద్దు. రైతులకు మంచికాలం రానే వస్తుంది. ధైర్యంగా నిలబడండి.

విత్తనం పంటగా మారేంతవరకూ ఎన్ని మార్పులు చెందుతుందో రైతు అన్ని రకాలుగా శ్రమను ధారబోస్తాడు. ఈ రకంగా పురుగుమందులు, నాసిరకం విత్తనాలు రైతును మోసం చేయడం, వీటన్నిటికి తోడు ప్రకృతి నిరాదరణ చూపడం, పండించిన పంటకు మార్కెట్టు లేకపోవడం – ఇవన్నీ రైతును నిస్సహాయుణ్ణి చేస్తాయనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. వీటన్నిటిని ఎదరించి పోరాడి విజయం కోసం ఆరాటపడడంలోనే రైతుకు ప్రత్యేకత ఉంటుంది. వ్యవసాయమంటేనే పోరాటం. ఇన్ని పోరాటాలలో రాటు దేలిన రైతు తనకు ప్రతికూలంగా మారిన ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితుల్ని మార్చుకోవటానికి పోరాటం చేయాలేకాని పిరికివాడై ఆత్మహత్యలకు పాల్పడడం రైతు లక్షణం కాదు. విలువైన ఓటుహక్కు ద్వారా తనకు అనుకూలంగా లేకపోతే దీనిని కూడా మార్చుకునే హక్కు ఎప్పుడూ ఉంటుంది.

జరిగిన ఆత్మహత్యల కేసులన్నీ పరిశీలించినప్పుడు, చాలావరకు కేసుల్లో ఎన్ని బోర్లు వేసినప్పటికి నీరు పడకపోవడంతో తలకు మించిన అప్పులవల్ల భవిష్యత్తు మీద నమ్మకం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్నారు. మరికొన్ని కేసులలో కరెంటు బకాయిలు పేరుకుపోవడం, కరెంటువారి పీడనకు తట్టుకోలేక పంట పండేదశలో కరెంటువారు స్టార్టర్లు ఎత్తుకెళ్ళిన సందర్భాలలో కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. బ్యాంకులు, సొసైటీలు పంపే నోటీసులకు అవమాన భారంతో తనువులు చాలించినవారున్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పండకపోవడం మన చేతుల్లో లేదు కానీ, పైన చెప్పుకున్న కేసుల్లో రైతుల స్వయంకృతాపరాధాలు కూడా చాలానే వున్నాయి. బోర్లువేస్తే నమ్మకంగా నీరు దొరుకుతుందని చెప్పలేనప్పుడు, చిలక శాస్త్రాలు చూసో, అశాస్త్రీయ పద్ధతుల ద్వారానో బోర్లమీద బోర్లు, అప్పులుచేసి వేయడం సరైనది అనిపించుకోదు. ప్రక్కచేను బోర్లో నీళ్ళు వస్తున్నాయని, దానికి దగ్గరగానే మరింత లోతుగా బోరు వేయించుకున్న రైతు బోర్లో తాత్కాలికంగా నీరు రావచ్చు కానీ, పక్కచేను రైతు నాశనమై పోతాడు. తన పక్కచేను రైతు మరింత లోతుగా బోరువేయిస్తే, ఈ రైతు కూడా నాశనమైపోతాడు. ఒకరకంగా ఇది పరస్పరం ఒకరినొకరు నాశనం చేసుకోవడం లాంటివి. అంతమంది విషయంలో చెప్పలేను కానీ కొంతమంది క్రొత్తగా వ్యవసాయం బాధ్యతవహించిన యువకులు కష్టపడడం మాని సులభంగా పంట పండించే మార్గాలను వెతుక్కోవడం, సుఖాలకు, ఆడంబరాలకు, అలవాటుపడడం జరుగుచున్నది. అప్పులు చేసి ఆడంబరాలకు పోవడం సరిఅయిందికాదు. ఇప్పటికీ కొన్ని పెళ్ళిళ్ళలో ఆడంబర ఖర్చు చూస్తే తల తిరిగిపోతుంది.

మరొక కారణం సాంప్రదాయంగా వస్తున్న గ్రామీణ పరపతి వ్యవస్థ దెబ్బతినడం. గ్రామాలలో అవసరాలకు రైతులనుండి మరొక రైతుకు రుణ సదుపాయం చెలామణిలో ఉండేది. ధర్మవడ్డీతో ఏ రైతు కూడా అంత బాధపడేవాడు కాదు. సంవత్సరానికొకమారు వడ్డీ చెల్లుచేస్తే, సంవత్సరాల తరబడి ఉన్నా అప్పులిచ్చిన ధనిక రైతులు రైతులను పీడించిన సందర్భాలు తక్కువగా ఉండేవి. కేవలం నమ్మకం మీద మాత్రమే సాగే ఈ పరపతి వ్యవస్థ బడుగు రైతులకు ఎంతో ఆలంబనగా ఉండేది.

ఇప్పుడు పరపతి విధానం గ్రామాల సరిహద్దులు దాటి పట్టణ ప్రాంతాలతో సంబంధాలు కలుపుకోవడం వల్ల దురాశ వర్గం కార్పొరేషన్ పద్ధతిలో వడ్డీలకు ఇవ్వడం మొదలు పెట్టింది. రైతు స్థితిగతులతో, చావు పుట్టుకలతో సంబంధం లేకుండా అధిక వడ్డీలు, చక్రవడ్డీలు దండుకోవడమే వీరి ధ్యేయం. ఒకసారి వీరి ఉచ్చులో పడినవాడు బయటికి రావడం చాలా కష్టం. ప్రతిఏటా పంటలు పండుతూ ఉంటే ఏదో మేరకు సర్దుబాటు జరిగేది. కానీ వరుసగా 4-5 సంవత్సరాలు పంటలు

పండకపోవడంతో అప్పుదారుల వేధింపులు పెరిగాయి. ఈ అవమానాలు భరించలేకే చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం ప్రైవేటు అప్పుల వసూలు విరామం 6 నెలలపాటు ( డిసెంబర్, 2004 వరకు) ప్రకటించింది. గ్రామీణ ధర్మవడ్డీ ఋణపరపతిని వేరుచేసి వాస్తవ దృక్పథంతో చూడకపోతే సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించే బదులు, మరింత సంక్షోభం లోకి తోసినట్లవుతుంది. వ్యవసాయం, గ్రామీణ ఋణపరపతి జోడెద్దులలాంటివి. అవి రెండూ బతకాలి. ఆరోగ్యంగా ఉండాలి. చర్యలు తీసుకోవల్సిందల్లా రైతుల్ని పీడనకు గురిచేసే అధిక వడ్డీ సంస్థల మీద, అధిక వడ్డీలతో, అవినీతితో రైతులను ముంచుతున్న వడ్డీ వ్యాపారులు, బ్యాంకులు, సొసైటీల మీద. ఒక రకంగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టడంలో అధిక వడ్డీగాళ్ళతోపాటు బ్యాంకులు, సొసైటీల పాత్ర కూడా చాలా ఉంది.

అప్పు చేయడం తప్పుగాదు. అప్పు చేయడం అవమానమూ కాదు. అప్పు చేయకుండా వ్యాపారులెవరూ వ్యాపారం చేయరు. అంతేగాదు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా అప్పులు చేస్తున్నాయి. మన రాష్ట్రం చేసిన అప్పులే ఈ రోజుకు దాదాపు రు. 60 వేల కోట్లు. మన అందరి కుటుంబాల తరపున ఒక్కొక్క కుటుంబానికి దాదాపు రు. 50 వేలు అప్పు మన రాష్ట్ర ప్రభుత్వం చేసింది. పాత అప్పులు తీర్చడానికి క్రొత్త అప్పులు కూడా చేస్తున్నది. కొంతమంది బడా పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు నూర్ల వేల కోట్ల రూపాయలు బకాయిలు పడి చేతులెత్తేసినారు. వారెవరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. మరి రైతులెందుకు భయపడాలి? ఎందుకు అవమానంగా భావించాలి?

రైతులనెవ్వరినీ వేధించవద్దని వడ్డీలకిచ్చిన వడ్డీ వ్యాపారస్థులకు, పెద్ద రైతులకు విన్నవించుకొంటున్నాను. పంట చేతికి వచ్చినప్పుడు అడిగితే రైతులు అప్పు కడతారు గానీ, విత్తనం వేసే కాలంలో అప్పు కట్టలేడని అప్పులిచ్చిన వారందరికీ తెలుసు. తెలిసీ ఈ పరిస్థితులలో అప్పులు కట్టమని అడగడం సమంజసం గాదు. కట్టి తీరాలని వేధించడం అమానుషం. దయయుంచి ఓపిక పట్టండి. సమస్యను మానవత్వ దృష్టితో చూడండి. వీలైతే పంట ఖర్చుల కోసం ఇంకొంత అప్పు ఇవ్వండి. అప్పు ఇచ్చిన వారందరూ దుర్మార్గులు కారని అందరికీ తెలుసు. అప్పు ఇచ్చిన వారిలో చాలామంది సాధారణ రైతులేకానీ, వడ్డీ వ్యాపారస్థులు కారు. అప్పులు ఇచ్చిన రైతులకు కూడా కష్టాలుంటాయని తెలుసు. అయినా ఓపిక పట్టడం తప్ప ప్రస్తుతం చేయగల్గింది ఏమీ లేదు.

గ్రామాల్లో ముఖ్యంగా మనం చేయాల్సిన పనేమిటంటే, అప్పులున్న రైతులందరికీ ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవడం. రైతులను నొప్పించకుండా కాస్త సున్నితంగా వ్యవహరించడం. మరీ ముఖ్యంగా కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు ఈ బాధ్యత వహించాలి.

రైతులందరూ ఒకరికొకరు సంఘీభావం తెల్పి తోడుగా ఉండండి. పంట చేతికి వచ్చేదాకా అప్పులు కట్టే పరిస్థితే లేదని ఖండితంగా అప్పులు ఇచ్చిన వారికి చెప్పండి. అట్లే అప్పు తీర్చడానికి మాత్రం కట్టుబడి వున్నామని కూడా చెప్పండి. వేధింపుల వల్ల అప్పు వసూలు కాదని చెప్పండి. ఇన్ని చెప్పినా వినకుండా వేధిస్తే ఇతర రైతులకో, బంధువులకో, స్నేహితులకో విషయాన్ని తెలిపి వారి సహాయంతో వేధించేవారిని ఎదుర్కొనండి. అవసరమైతే ప్రభుత్వ సహకారం కూడా తీసుకోండి. ప్రభుత్వ హెల్ప్‌లైన్ ఫోన్ నెం.275080. అంతేగానీ, ఆత్మహత్యలకు మాత్రం పాల్పడవద్దు.

*- ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం - జూలై - 2004*

## వలసల్ని ఆపుదాం! పనికి ఆహార పథకాన్ని సద్వినియోగం చేసుకుందాం!

గ్రామాల్లో పనులు లేనప్పుడు, ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్ళడం, వర్షాలు వస్తూనే తిరిగి రావడం మన జిల్లాలో కొత్త కాదు. అయితే గత 7-8 సంవత్సరాల వరకూ కర్నాటక, చిత్తూరు జిల్లాకు సరిహద్దున ఉన్న గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ కూలీలు మాత్రమే వలస వెళ్ళేవారు. కర్నాటకలోని కోలారు, చిత్రదుర్గ, మరికొంతమంది బెంగుళూరు పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ తోటల్లో పనికి పోయేవారు. చిత్తూరు జిల్లా సరిహద్దుకు ఆనుకుని వున్నవారు చిత్తూరు జిల్లాలోని బెల్లం బట్టీలలో పనికి కుదిరేవారు. వలసలు పోతున్నవారు, ఇంటిదగ్గర ముసలివాళ్ళని, చిన్న పిల్లల్ని గొడ్డు గోదాల్ని వదిలి, వారికి భత్యం ఏర్పాటు చేసిపోతారు. కుటుంబంలో శారీరక కష్టం చేయడానికి శక్తిసామర్థ్యాలు ఉన్నవారు మాత్రమే వలస వెళ్తారు. పోయినవారు తోటల్లోని పంపు రూముల్లోనూ, గ్రామంలోని సత్రాల్లోనూ గుంపులుగా కాపురం ఉండి పనులు అయిపోయిన వెంటనే తిరిగి ఇంటికి వచ్చే అలవాటు ఉంది. ఈ రకంగా ఇక్కడ మన జిల్లాలో వ్యవసాయ పనులు లేని కాలంలో వలసలు వెళ్ళి రావడం కొత్తేమి కాదు. వీరు పనికి పోయిన ప్రాంతంలోని పొలం, తోటల యజమానులు ఆయా గ్రామాల గ్రామస్థులు కూడా వీరిని బాగానే చూచేవారు. వలస వెళ్ళిన వారికి సమస్యలు ఉత్పన్నం కావడం చాలా అరుదుగా ఉండేది.

అయితే గత 7-8 సంవత్సరాల నుంచి మన జిల్లా నుంచి వలస వెళ్ళేవారి సంఖ్య పెరుగుతోంది. మామూలుగా వలస వెళ్ళే వ్యవసాయ కూలీలే కాకుండా, ఏనాడూ ఊరి పొలిమేరలు దాటని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కుటుంబాలలోని యువకులు కూడా పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసపోవడం ఎక్కువయింది. 15-20 ఎకరాలు గల రైతు కుటుంబానికి చెందిన యువకులు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు సైతం బెంగుళూరులోని కోళ్ళఫారాలలో పనికి కుదురుతున్నారు. మామూలుగా వర్షాలు రావడంతోనే ఇళ్ళకు తిరిగి రావడం కాకుండా, కొంతమంది అక్కడే ఉండిపోతున్నారు. ఈ రకంగా పని ఉన్న ప్రాంతాలకు వలసలు పోవడం, తిరిగి ఇళ్ళకు చేరడం మన జిల్లాలోనే కాదు, దేశంలోని మెట్ట ప్రాంతాలలో నివశించే అందరి పరిస్థితి ఇదే.

అయితే గడచిన 5-6 సంవత్సరాలుగా మన జిల్లాలో వలస పోయేవారి శాతం ఎక్కువయినట్లే, ఇతర ప్రాంతాల నుండి కూడా పనుల కోసం వలసలు వెళ్ళడం ఎక్కువయింది. ఫలితంగా అనారోగ్యకరమైన పోటీ ఏర్పడి తక్కువ కూలీకే, ఎక్కువ పని గంటల పనులు చేస్తూ దోపిడీకి గురవుతున్నారు. కొన్నిచోట్ల కేబుల్ గుంతలు తవ్వడానికని కాంట్రాక్టర్లు తీసుకెళ్ళి, ఒకనెలా – నెలన్నర పనులు చేయించుకుని, మోసం చేసి ఉడాయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అదేమని ప్రశ్నించిన వారి మీద దొంగతనం కేసులు పెట్టి, జైలుకు పంపుతామని బెదిరించడాలు కూడా జరుగుతున్నాయి. అన్నిటికంటే ముఖ్యమైన సమస్య ఏమిటంటే, కొన్నిచోట్ల వీరి వస్తువులు దొంగతనాలకు గురికావడం, మహిళలపై లైంగిక వేధింపులు, వారికి మాయమాటలు చెప్పి, వంచించడానికి కూడా ప్రయత్నాలు

చేస్తున్నట్లు కొన్ని సంఘటనలు చెప్తున్నాయి. కొన్ని సందర్భాలలో మహిళలు బయటికి చెప్పుకోలేక అవమానాలు దిగమింగుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పనికి ఆహార పథకాన్ని గురించి ఆలోచించాలి.

**జాతీయ పనికి ఆహార పథకం - కరువు జిల్లాలకు ఒక వరం**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశంలో తరచుగా కరవుకు గురవుతున్న ఐదు జిల్లాల్లో పనికి ఆహార పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎంపిక చేసిన జిల్లాల్లో మన అనంతపురం జిల్లా కూడా ఒక్కటి. దీని ప్రకారం గ్రామాల్లో పనులు కోరేవారందరికీ పనులు కల్పించాలని దీని ముఖ్య ఉద్దేశం. ఒకరకంగా ఇది మన జిల్లాకు వరం లాంటిది. ఈ పనులు అన్నీ కూడా శారీరక శ్రమతో కూడుకున్నవిగానే ఉంటాయి. యంత్రాలు గానీ, ఇతరత్రా వాటికి గానీ (అంటే రాళ్ళు, సిమెంట్, ఇనుము తదితరాలు) ఖర్చు పెట్టరాదు. ఎన్ని పని దినాలు కల్పించగలమన్నది ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది. ఈ పాటికే జిల్లాలో అక్కడక్కడా పనులు ప్రారంభించారు. చేయించే పనులలో 50 శాతం పనులకు బియ్యం, యాభైశాతం డబ్బు రూపేణ పంపిణీ చేస్తున్నారు. ఈ పనులు ప్రారంభించడంలోనూ, వాటిని పర్యవేక్షించడంలోనూ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టరుగారు, జాయింట్ కలెక్టరుగారు చాలా పట్టుదలగా పథకాల అమలుకు కృషి చేస్తున్నారు. కూలి రేట్లు కూడా ఒక్కొక్కరికి కనీసం రు. 100/- లు గిట్టుబాటు అయ్యేలా పని రేట్లు రూపొందించారు. ఈ 2005-06 సంవత్సరం నుండి ప్రతి ఏటా 60 కోట్ల రూపాయలు ఇందుకోసం ఖర్చు చేస్తారని అంచనా. ఈ పథకం అయిదు సంవత్సరాలపాటు అమలులో ఉంటుంది. ఇప్పటికే మన జిల్లాలో 18 కోట్ల రూపాయల పనులు మంజూరు చేసినట్లు, 4,400 పనులు ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. కూలీలకు అవసరమయ్యే పనిముట్లను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోంది.

**పథకం అమలులో ఎదురయ్యే సమస్యలు**

ఏ పథకమైనా అనుకున్నరీతిలో విజయవంతం కాదు. ప్రభుత్వం పథకాలు రూపొందించడం, కాగితాల మీద నిధులు కేటాయించి, విడుదల చేయడం సులభం కావచ్చును కానీ, పథకాల అమలుస్థాయిలో అసలు సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఇందులో కొన్ని సమస్యలు యాదృచ్ఛికమైతే చాలా వరకూ సమస్యలు అధికార యంత్రాంగం, స్థానిక రాజకీయ నాయకులవల్ల వస్తాయి. యాదృచ్ఛికమైన సమస్యలు ఏమిటంటే, ఒక పనిని గుర్తించినప్పుడు నేల గట్టిగా ఉండి పనులు జరుగక, పనులు అర్థాంతరంగా ఆగిపోవడమో, లేదా అసలు ప్రారంభం కాకపోవడమో జరుగుతుంది. దీనివల్ల పనులు జరగకపోగా, కూలీలకు పనులు లేకుండా పోతాయి. గత రెండు సంవత్సరాలుగా మన జిల్లాలో కొన్ని పనులు ఇలాగే మూలపడినాయి. రెండోరకం సమస్యలు రాజకీయ నాయకులు, గ్రాస్‌రూట్ లెవల్ అధికార యంత్రాంగం వల్ల వస్తాయి. అవినీతికి అలవాటుపడిన కొంతమంది అధికార యంత్రాంగం, ఛోటా రాజకీయ నాయకులు కలిసి పనులను కాంట్రాక్టరు పద్ధతిలో దారిమళ్ళించే విధంగా ప్రయత్నం చేస్తారు. పోయినసారి జిల్లా అధికారులు యంత్రాలతో పనులు చేయించరాదని ఎంత గట్టిగా వార్నింగ్ ఇచ్చినా, కొన్ని చోట్ల రాత్రికి రాత్రే యంత్రాలతో పనులు చేయించినారు. పైగా పనుల పర్యవేక్షణ కొరవడడం వల్ల కొన్ని చోట్ల మండల స్థాయి అధికారులకు ఆడింది ఆట, పాడింది పాట అనే విధంగా కొనసాగింది. జిల్లా ఉన్నతాధికారులు నిజాయితీగా ఉంటేనే సరిపోదు. క్రిందిస్థాయి సిబ్బంది ముఖ్యంగా మండల స్థాయిలో ఇంజనీరింగ్, అధికారులతో నిజాయితీగా ప్రజల సంక్షేమ దృక్పథంతో పని చేయించేటట్లు చూడగలిగినప్పుడే ఈ పథకం ఆశించిన ఫలితాలనిస్తుంది. అదృష్టవశాత్తూ,

ఈ మధ్యకాలంలో మన జిల్లాకు మంచి కలెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లు వస్తున్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టరు శ్రీమతి అనురాధ, ఐ.ఏ.ఎస్. గారు జిల్లా అంతటా పర్యటిస్తూ, ఈ జిల్లా సమస్యలను చక్కగా ఆకళింపు చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నారు.

**పనికి ఆహార పథకాన్ని ఉపయోగించుకోవడంలో మన పాత్ర**

గతంలో ప్రభుత్వం ద్వారా చేపట్టిన పథకాలన్నీ దాదాపు దళారుల పాలుకావడమో లేదా పక్కదారులు పట్టడమో చూసిన అనుభవంతో ప్రజలకు ఈ పథకం పట్ల ఇంకా పూర్తి విశ్వాసం ఏర్పడలేదు. అందుకే అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినప్పటికీ, ఎప్పటిలాగానే ఈసారి కూడా చాలామంది గ్రామాలు ఖాళీ చేస్తూ వలస వెళ్ళిపోయారు. బయట రోజుకు రు.100/-లు కూలి గిట్టుబాటు అయినా, స్వంత ఊరులో రు.50/-లు కూలి దొరికితే ఇదే ఎక్కువ అనే అభిప్రాయం కూడా చాలామంది వలస వెళ్ళేవారిలో ఉంది. దీనికోసం మండలస్థాయిలో అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి, ఏయే గ్రామాలలో ఎవరు వలస వెళ్ళారో తెలుసుకొని అక్కడ కుటుంబంలో ఉన్న మిగతావారికి నచ్చజెప్పితే, పోయిన వారంతా తిరిగి వస్తారు. ఇలా వచ్చినవారికి, వారి జీవనానికి సరిపోయేటట్టుగా నెలకు కనీసం 15 రోజులు గ్యారంటీ పని కల్పించాలి. ఈ పనికి ఆహార పథకాన్ని గురించి, వాటి ఉపయోగాన్ని ప్రజలందరికీ అవగాహన కల్పిస్తే, పథకం అమలుపర్చే అయిదు సంవత్సరాలలో వలస వెళ్ళేవారి సంఖ్య తగ్గిపోతుంది.

తనకు పని కావాలని మండలస్థాయి అధికారులను సంప్రదించాలి. ఒకవేళ ఈ క్రమంలో ఇబ్బందులు ఏర్పడితే వ్రాతమూలకంగా జిల్లా కలెక్టరు గారికి ఫిర్యాదు చేస్తే వారికి పనులు కల్పిస్తారు. మరింకో ముఖ్య విషయమేమిటంటే, గడచిన సంవత్సరంలో జిల్లా అధికారులు పట్టుదలగా కాంట్రాక్టరు పద్ధతి ఉండకూడదని నిక్కచ్చిగా ఆదేశాలు ఇచ్చినా, పనులు కూలీల పేరుతో, కూలీలు తామే స్వంతంగా పనులు చేసినట్లుగా బినామీ రికార్డులు తయారు చేసుకుని కాంట్రాక్టర్లు అక్కడక్కడా చేసినట్లుగా నా పరిశీలనలో గమనించాను. అనుమానం వచ్చి అడిగితే, పని చేస్తున్నవారు తామే పని చేసుకుంటున్నట్లు చెప్పినారు. కానీ, బినామీ కాంట్రాక్టర్ల పేరు చెప్పలేదు. ఇది ఒకరకంగా కూలీలు కూలీలకే అన్యాయం చేసుకుంటున్నట్లు లెక్క. ఈ ధోరణి నుండి బయట పడాలి.

వలసలవల్ల తాత్కాలికంగా ఉపాధి పొందవచ్చును గానీ, దీర్ఘకాలంగా అది మన కుటుంబ వ్యవస్థ పట్ల తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇంటిపట్టున ఉండే వృద్ధులకు సరైన ఆలనాపాలనా లేకుండా తీవ్రంగా జబ్బు పడతారు. జబ్బు పడినవారికి వైద్య సహాయం దొరకదు. పిల్లల విద్యావకాశాలు దెబ్బతింటాయి. తల్లిదండ్రుల ప్రత్యక్ష పర్యవేక్షణ లేక పిల్లలు గాలికి తిరిగే అవకాశముంది. ఇల్లు, గొడ్డు, గోదా ఇవన్నీ నిర్లక్ష్యానికి గురవుతాయి. బయటికి వెళ్ళిన మగవారు క్రొత్త అలవాట్లు నేర్చుకునే ప్రమాదం కూడా వుంది. కుటుంబం అనేది కేవలం ఆర్థిక సంబంధాలమీదే నడవదు. తల్లి, తండ్రి, అన్నలు, తమ్ముళ్ళు, అక్కలు, చెల్లెళ్ళతో సజీవ మానవ సంబంధాల మీద కుటుంబం నడుస్తుంది. కుటుంబం మానవ సంబంధాల బాటలో నడిస్తే, సమాజం, ఊరు, దేశం కూడా మానవ సంబంధాల బాటలోనే నడుస్తాయి. కుటుంబం విచ్ఛిన్నమైనప్పుడు, సమాజంలో కూడా విచ్ఛిన్న పోకడలు వస్తాయి. అందుకే సాధ్యమైనంతవరకూ కుటుంబ సభ్యులు విడిపోకుండా బతకడం నేర్చుకోవాలి. దానికోసం జాతీయ పనికి ఆహార పథకాన్ని ఒక మంచి అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

*- ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం - మార్చి 2005*

# అనంత ఎడారిలో ఒయాసిస్సులు

అనంతపురం జిల్లా ఒక ఎడారే! ఆ ఎడారిలో జీవనానికి చెరువులే ఒయాసిస్సులు. అందుకే మన జిల్లాలో జనజీవనం 'నల్ల చెరువు', 'రామసాగరం', 'చోళ సముద్రం', 'కాలవపల్లి', 'యిప్పేరు' 'వంకరకుంట', 'బుక్కరాయసముద్రం' లలో సాగుచున్నది. అవే మన గ్రామాలు – అవే మన నాగార్జున సాగర్, శ్రీశైలాలు.

జిల్లాలో మానవులే కాదు అనేక ప్రాణకోటికి ఈ చిన్న నీటి వనరులే జీవనాధారము. వర్షాధార 'పంట కరువులకు' నిలయమైన మన జిల్లాలో కొంతైనా 'నీటి కరువు'ను తగ్గించుటలో, సాంప్రదాయ నీటి వనరులైన కుంటలు, చెరువులే కీలకం. పశుపక్ష్యాదుల 'నీటి కరువు' ను మరియు మేత కరువును కూడా అధిగమించడానికి చెరువులే కీలకం. తద్వారా తిండి కొరతను అధిగమించడానికి ప్రత్యక్షంగా పండే చెరువు క్రింద సాగు పంటలే కాదు, భూగర్భ జలాల అభివృద్ధికి మన జిల్లాలో చెరువులే కీలకం. తద్వారా బావులకు, బోరు బావులకు చెరువులే ఏకైక నీటి ఆధారం. అనంతపురం జిల్లాలో అన్ని రకాల సాగునీటికి చిన్న నీటి వనరులు కీలకం. ఈ విధంగా రైతులకు, రైతు కూలీలకు, చేతివృత్తుల వారికి, మొత్తం గ్రామానికే చిన్న నీటి వనరులు కీలకం. అందుకే చిన్న నీటి వనరులు అనంతపురం ఎడారిలో ఒయాసిస్సులైనాయి. మన మరియు మన ప్రభుత్వరాహిత్యం వల్ల చిన్న నీటి వనరులు నిర్లక్ష్యానికి గురి అయినాయి. అంతేకాకుండా, చిన్ననీటి వనరులపై ఆధారపడిన భూగర్భ జలాలను బోరుబావుల ద్వారా విచ్చలవిడిగా తోడేస్తున్నాం. చెరువులు, కుంటలలో పూడిక చేరి వాటి సామర్థ్యం సగానికి పడిపోయింది. దాదాపు 20 శాతం చెరువులు, కుంటలు తెగడమో, మొరవలు కొట్టుకుపోవడమో, కట్టలపై చెట్లు పెరగడం, పశువులు, మనుషులు తిరగడం వలన కట్ట పొర్లిపోయి, బలహీనమైపోవడమో జరిగింది. కొన్ని చెరువులు, కుంటలు ఆనవాళ్ళు కూడా కనిపించకుండా పోయినాయి. చెరువులను వర్షపు నీటితో నింపే ఫీడరు కాలువలు పూడిపోయినాయి.

చిన్న నీటి వనరులు గత 50 సంవత్సరాలుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయినాయి. నాగార్జున సాగర్, తుంగభద్ర ప్రాజెక్టు లాంటి పెద్ద నీటి వనరులపై ఎనలేని ప్రేమ పెరగడం, కేవలం భారీ నీటి పారుదల ప్రాజెక్టులే నీటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారమని నమ్మడమే అందుకు కారణం. భారీ నీటి ప్రాజెక్టులు అవసరమని నేను నమ్ముతాను. కానీ, మన జిల్లాలో వున్న వ్యవసాయ భూమి మొత్తం 25 లక్షల ఎకరాలకు కేవలం భారీ నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా నీటిని పారించుకోగలమా? అంతవరకూ మన గ్రామ ప్రజల జీవనమెట్టా జరగాలి? కాబట్టి వాస్తవ దృక్పథంతో ఆలోచిస్తే మన జిల్లాకు చిన్న నీటి వనరుల అవసరం ఎప్పటికీ ఉంటుంది. వాటితోపాటు భారీ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నదీ జలాలు అవసరమే! రెండు రకాలైన నీటి వనరులూ అవసరమే! ప్రస్తుతం మన జిల్లాలో చెరువులు 5 లేక 6 సంవత్సరాల కొకసారి మాత్రమే పూర్తిగా నిండి పంటలకు ఉపయోగపడుతున్నాయి. చెరువుక్రింద నమ్మకంగా పంట పండాలంటే, చిన్న నీటి వనరులను భారీ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నది జలాల అనుసంధానము చేయాలి.

దీనినే అనుసంధాన నీటి వినియోగం (Conjunctive Water Use) అంటారు. అంటే, భారీ నీటి ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని, ప్రత్యక్ష వ్యవసాయానికి మాత్రమే కాకుండా, మన చెరువులన్ని ప్రతి సంవత్సరం నదీ జలాలతో నింపి, తద్వారా చెరువుల క్రింద వున్న సాగుభూమికి నమ్మకంగా నీరందించడం. ఆ విధంగా అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాంతాలలోని చెరువులన్నింటినీ బయటనుంచి వచ్చే నదీ జలాలతో, కాలవద్వారా పూర్తిగా అనుసంధానం చేసి జిల్లాను ఒక జలవలయం (Water Grid)గా తయారు చేయాలి. అటువంటి జలవలయ సాధన కోసం మనం ఉద్యమించాలి.

తద్వారా మన జిల్లాలో నీటి లభ్యతను జిల్లా అంతటా సమతౌల్యంగా నిండే చెరువులకు బయటి జలాలతో నింపి, జిల్లా నలువైపులా కరవు తీవ్రతను తగ్గించడం జరుగుతుంది. జిల్లాలో ప్రాంతీయ అసమానతలను బాగా తగ్గించినట్లవుతుంది. రైతులకు, రైతు కూలీలకు, చేతివృత్తుల వారికీ, మొత్తం గ్రామ జీవనానికే కొంత క్రొత్త జీవం పోసినట్లవుతుంది.

ఈ రోజు ఈ చిన్ననీటి వనరులను క్రొత్తగా నిర్మించాలంటే మనకు సాధ్యమౌతుందా? ఎన్ని వేల కోట్ల రూపాయలు రావాలి? ఎంతమంది నిపుణులు కావాలి? ఎంత సమయం పడుతుంది? వీటికి లెక్కే లేదు. కనీసం ఉన్న వాటినైనా సంరక్షణ చేయడానికి, పునరుద్ధరించడానికి మనం నడుం బిగించాలి. అందుకు సంబంధిత ప్రజలు బాధ్యత వహించాలి. ప్రభుత్వం తగిన సహకారం, ప్రోత్సాహం ఇవ్వాలి. గ్రామంలోని రైతులు కలిసి శ్రమదానంతో చేసుకోగల్గిన పనులను కూడా ప్రభుత్వం చేయాలని కోరడం, అసమంజసం. అదేవిధంగా గట్లు తెగిన చెరువులను నిర్లక్ష్యం చేసి, పునరుద్ధరించకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. ప్రజలు బాధ్యత తీసుకొని వారు చేయగల్గిన సంరక్షణ చేస్తూ, వారి శక్తికి మించిన సంరక్షణ చేపట్టడానికి ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

### కదలిక కృషిని అభినందించాలి

కదలిక చేపట్టిన చిన్న నీటి వనరుల గురించి సమాచార సమీకరణ చాలా విలువైనదిగా నేను భావిస్తున్నాను. విలువ కట్టలేని ఈ నీటి వనరుల సమాచారం ఎక్కడా ఒకచోట సంపూర్ణంగా ఇంతవరకూ లేదు. ఈ చిన్ననీటి వనరులు, కొన్ని ప్రైవేటు చెరువులు మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలోనూ ఉన్నాయి. ఐతే, ఆయా శాఖల వద్ద కూడా తగిన సమాచారం సంపూర్ణంగా అందుబాటులో లేదు. నూర్ల సంవత్సరాల క్రితం బ్రిటీషు ప్రభుత్వం ఒక్కొక్క చెరువుకు సంబంధించిన విపులమైన సమాచారాన్ని చెరువు మెమొయిర్స్(Memoirs of Tanks)గా ప్రతి చెరువుకు తయారుచేసేది. ఈ మెమొయిర్స్‌లో చెరువు స్వరూపం, దాని చరిత్ర, సముద్రానికి ఎంత ఎత్తులో వుంది, ఎన్ని ఎకరాలు అధికారికంగా సాగులో వుంది, ఎవరు కట్టించినారు, సంరక్షణ ఎట్లా జరుగుతుంది మొదలగు అంశాలతో దాని చరిత్ర ప్రతి చెరువుకు విపులంగా తయారు చేసినారు. ఐతే ఆ మెమొయిర్స్ కూడా మనం భద్రపరచుకోలేక పోయాం. అటువంటి మెమొయిర్స్ ఇంకొక్కసారి ప్రస్తుత పరిస్థితి ఏమిటో పూర్తి వివరాలతో సవరించి తయారు చేయవలసిన అవసరం ఎంతోవుంది. ఆ పని ప్రభుత్వమే చేయవలసి వుంది.

చిన్ననీటి వనరుల గురించి ప్రజలు, ప్రభుత్వం మర్చిపోతున్న తరుణంలో "కదలిక" తరపున శ్రీ ఇమామ్ గారు, శ్రీ బాషా గారు చొరవ తీసుకొని ఇటువంటి విలువైన సమాచారాన్ని సేకరించి ముద్రించడం ఎంతో అభినందనీయం. ఆర్‌డిటి/ఎ.ఎఫ్ చేపట్టిన వాటర్‌షెడ్ కార్యక్రమాలలో చెరువుల పునరుద్ధరణకు, చిన్ననీటి వనరుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తుంది. 1987 సంవత్సరం నుంచి 2003 నాటికి దాదాపు 2000 చిన్న నీటి వనరులను నిర్మించడంగాని, పునరుద్ధరించడంగాని ఆర్.డి.టి. చేపట్టింది. చాలా సంవత్సరాలు ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసినా, శ్రీ సోమేష్‌కుమార్ గారు

కలెక్టర్‌గా వున్న 2000–02 సంవత్సరాలలో మాత్రం ఆయన వ్యక్తిగతంగా చిన్ననీటి వనరుల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినారు. తద్వారా నిద్రావస్థలోవున్న ప్రజలను మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన మేల్కొలిపి వీటి సంరక్షణకు, పునరుద్ధరణకు ప్రాధాన్యత కల్పించినారు. జిల్లా ప్రజల తరపున ఆయనకు అభినందనలు.

చిన్న నీటివనరుల ప్రాధాన్యతను చర్చిస్తూ, చిన్ననీటి వనరుల ప్రాముఖ్యతపై సజీవంగా చర్చను ప్రజలలోను, ప్రభుత్వంలోనూ కొనసాగిస్తూ, వాటి గురించి సమాచార క్రోడీకరణ చేసినందుకు కదలికకు మరియు వ్యక్తిగతంగా శ్రీ ఇమామ్ మరియు శ్రీ బాషా గార్ల కృషికి ధన్యవాదములు. జిల్లా అభివృద్ధి కోసం వారు నిరంతరం పడే తపనకు, స్వచ్ఛందంగా చేసే శ్రమకు జోహార్లు.

– (*అనంత సాంప్రదాయక నీటి వనరులు* 18–05–2004కదలిక ప్రత్యేక సంచికనుండి)

# అనంత కరువు అంతం కావాలంటే...

## 1. పరిచయం.

అనంతపురం జిల్లాలో నిరంతర కరువు, నిత్య దారిద్ర్యం విలయతాండవం చేస్తున్నాయి. కేవలం వర్షాధార వ్యవసాయంపైననే ఆధారపడి దాదాపు 30 లక్షల మంది రైతులు, రైతు కూలీలు జీవచ్ఛవాలుగా గ్రామాలలో బ్రతుకుతున్నారు. జిల్లాలో ఏ ఇతర పరిశ్రమలు గానీ, ఉద్యోగావకాశాలుగానీ లేవు. కొంతమాత్రంగా వున్న చేనేత రంగం కూడా సంక్షోభంలోనే కొట్టుమిట్టాడుతున్నది. మూతపడిన గుంతకల్లు స్పిన్నింగ్ మిల్లు, ఏ.పి. లైటింగ్‌లు తెరుచుకొనే అవకాశాలు కనపడటంలేదు. జిల్లాలో వ్యాపార వాణిజ్యాల ఆర్థిక వ్యవస్థ కూడా, వర్షాధార కరువు వ్యవసాయంపైననే ఆధారపడి పట్టణాలు ఆర్థిక సంక్షోభంలో వున్నాయి. రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. రైతులేకాదు, చేనేత, వ్యాపార వాణిజ్య రంగాలలో కూడా చాలామంది దివాళాతీసి, ఆత్మహత్యలకు చేరువలో వున్నారు.

***ఇటువంటి పరిస్థితులలో మన జిల్లా కరువు-దారిద్ర్యమనే కవల సమస్యలనుండి బయటపడాలంటే క్రింది కార్యక్రమాలు తప్పనిసరిగా, ఒక నిర్దిష్ట కాలవ్యవధిగల ప్రణాళిక రూపంలో, నిధుల కొరత లేకుండా యుద్ధప్రాతిపదికన చేపట్టవలసియున్నది.***

## 2. అనంతపురం జిల్లాకు ఒక నూతన భూవినియోగ విధానం (New Land Use Plan).

ప్రస్తుతం మన జిల్లాలో వున్న భూవినియోగం ఇటు పర్యావరణానికి, అటు ప్రజలకు అనర్థదాయకంగా వుంది. మన జిల్లాలో మొత్తం భూమి విస్తీర్ణం దాదాపు 20 లక్షల హెక్టార్లు. అందులో 2 లక్షల హెక్టార్లు దాదాపు వృక్ష సంపదలేని రిజర్వుడు ఫారెస్ట్, 4 లక్షల హెక్టార్లు బోడిగుట్టలు, 10 లక్షల హెక్టార్లు వ్యవసాయ భూమి, వ్యవసాయ భూమిలో దాదాపు లక్ష హెక్టార్లు నీటి సాగు. 9 లక్షల హెక్టార్లు వర్షాధార వ్యవసాయం. వర్షాధార వ్యవసాయంలో 8 లక్షల హెక్టార్లు వేరుశనగ, మిగిలిన 4 లక్షల హెక్టార్లలో జొన్న, కుసుమ, ధనియాలు, శెనగ మొదలగు పంటలు. ఈ భూవినియోగంలో సమగ్ర మార్పు అవసరం. కనీసం 4 లక్షల హెక్టార్లు నీటిసాగు, 3 లక్షల హెక్టార్లు పండ్లతోటలు మరియు ఇతర వృక్ష పంటలు, 4 లక్షల హెక్టార్లు కొండగుట్టలు, బీడు భూములలో వివిధ గడ్డి, వృక్ష పంటలు మరియు 2 లక్షల హెక్టార్లు అడవి ప్రాంతంలో వివిధ రకాలైన వృక్ష పంటలు వుండేవిధంగా భూ వినియోగంలో మార్పు తీసుకురావలెను.

### 2.1.1 కనీసం 40 శాతం వ్యవసాయ భూమికి సాగునీటి వసతి కల్పించడం.

మన జిల్లాలో దాదాపు 10 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. అందులో కేవలం 1 లక్ష హెక్టార్లు మాత్రమే (10శాతం) బోరుబావులు, మరియు తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా నీటి పారుదల క్రింద ఉంది.

నదీ జలాల ద్వారా కనీసం 40 శాతానికి సాగునీటి సదుపాయాన్ని పెంచవలసి యున్నది. అంటే, కనీసం 4 లక్షల హెక్టార్లకు నమ్మదగిన నదీజలాల ద్వారా సాగునీటి వసతి కల్పించవలెను.

అటువంటి నదీ జలాలను ముఖ్యంగా మనజిల్లాలోని చెరువులను నింపుటద్వారా అనుసంధానం చేసి, ఒక నీటి వలయం(Water grid)గా నిర్మించవలెను. అప్పుడే అనంతపురం జిల్లాలోని వ్యవసాయంలో కొంతవరకైనా నిలకడ ఏర్పడుతుంది.

### 2.1.2 త్రాగునీటి సౌకర్యం

దినదినానికి తీవ్రమవుతున్న త్రాగునీటి కొరతను తీర్చడానికి మరియు ఫ్లోరైడ్ సమస్యను అధిగమించడానికి అవసరమైనంత త్రాగునీటిని జిల్లా వ్యాప్తంగా నదీజలాల ద్వారా అందించవలెను.

### 2.2 మూడు లక్షల హెక్టార్లలో పండ్లతోటలు పెంచడం

మనకున్న వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం అంటే 3 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు ప్రోత్సహించి, పెంచవలయును. మనజిల్లాకు అనువైన పండ్లతోటలు మామిడి, చింత, చీనీ, దానిమ్మ, సపోట, నిమ్మ, రేగు మొదలైనవి. వర్షాధార మరియు తక్కువ నీటితో పండించగల పండ్లతోటలకు, ఔషధ మొక్కలకు, మేతచెట్లకు ప్రాధాన్యమివ్వవలెను. వాటిని పెంచి పోషించుటకు రైతులకు 5 సంవత్సరాలపాటు ఆర్థిక సహాయం అందించవలెను.

### 2.3 సూక్ష్మనీటిసాగు తప్పనిసరి చేయడం.

పండ్ల తోటలకన్నింటికీ “డ్రిప్ ఇరిగేషన్” తప్పనిసరిగా చేసి, అందుకు 90 శాతం సబ్సిడీ ఇవ్వవలెను.

### 2.4 పాడిపరిశ్రమ మరియు పశువుల పెంపకంతో 3 లక్షల కుటుంబాలకు అదనపు జీవనోపాధి.

మనజిల్లాలో దాదాపు 5 లక్షల కుటుంబాల రైతులు మరియు రైతు కూలీలు ఉన్నారు. వారిలో కనీసం 3 లక్షల కుటుంబాలకు, ముఖ్యంగా రైతు కూలీలకు, చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమను మరియు గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించవలెను. మేత సమస్యను తీర్చుటకు బీడుగా వున్న చౌడు భూములను, కొండగుట్టలను పశువుల పెంపకందారులకు పట్టాలు ఇచ్చి, వాటిలో మేతను మరియు ఇతర ప్రయోజనకరమైన చెట్లను అభివృద్ధి పరచడానికి, కనీసం 5 సంవత్సరాలపాటు ఉపాధి హామీలాంటి పథకాల ద్వారా సహాయం అందించవలెను. అనువైన చోట్ల నీటి సదుపాయం సామూహిక బావులద్వారా కల్పించవలెను. పశువులను విచ్చలవిడిగా మేసే పద్ధతికి స్వస్తిచెప్పి, ఇంటి దగ్గరే కోసుకొనివచ్చిన గడ్డితోనూ మరియు ఫీడ్‌మిక్స్(ఓలిలిఖి శీరిని) తోనూ మేసే పద్ధతిని ప్రోత్సహించవలెను.

### 2.5 ఉపాధి హామీ పథకం ద్వారా పాడి, పశువుల పెంపకంతోపాటు, బీడు భూములను, కొండగుట్టలను, అడవులను ఉత్పాదక వనరులుగా మార్చుట.

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలుపరిచి కనీసం సంవత్సరంలో 100 రోజులు పని అడిగిన కూలీలందరికి కల్పించవలెను. ఈ కార్యక్రమాన్ని (2.2 మరియు 2.4 పేరాలలో వివరించినట్లుగా) వర్షాధార చిన్న, సన్నకారు రైతులు, పండ్లతోటలు పెంచుటకు బీడు భూములను, గుట్టలను గడ్డిమొక్కలతోనూ, గడ్డికి పనికొచ్చే చెట్లు (అవిశె, సూబాబుల్, తుమ్మ, వేప మొ॥వి.) పెంపకమునకు ఉపయోగించవలెను. వర్షాధార పండ్లమొక్కలైన సీతాఫలం, రేగు, చింత మరియు ఇతర ప్రజోపయోగమైన ఔషధ మొక్కలు, ఇంధన మొక్కలు, నార, కలప మొదలగు మొక్కలను పెంచవలెను. వాటిపై హక్కును ఆ పనిచేసిన కూలీలకే భవిష్యత్తులో చెందునట్లు హక్కు కల్పిస్తూ వారికి అదనంగా పశువులు, గొర్రెలు, మేకలు కొనుటకు ఋణసౌకర్యం కల్పించవలెను. తద్వారా బీదవారి జీవనోపాధికి తోడ్పడవలెను.

ఉపాధి హామీ పథకాన్ని మనజిల్లాలోని అటవీ సంపదను పునరుద్ధరించుటకు ప్రజల భాగస్వామ్యం కల్పించి, ఫలసాయపు హక్కులతో ప్రోత్సహించవలెను.

**2.6 పంటల భీమా పథకాన్ని అన్ని పంటలకు, అందరు రైతులకు వర్తింపజేయుట.**

మనజిల్లాలో పండించే ప్రతి పంటకు పంటల బీమా పథకాన్ని సాధారణ పంట దిగుబడి ప్రాతిపదికన అమలు చేయవలెను. బ్యాంకు అప్పులతో సంబంధంలేకుండా ప్రతిరైతుకు ఈ సదుపాయం కల్పించవలెను.

**2.7 ప్రతి రైతుకు ఋణ సదుపాయం కల్పించుట**

ప్రతి రైతుకు పంట పెట్టుటకు బ్యాంకు అప్పు సదుపాయమును కల్పించవలెను. అప్పులు తగినంత మొత్తంలో, సకాలంలో రైతుకు అందుబాటుచేసి వడ్డీ వ్యాపారులనుండి, దళారులనుండి రక్షించవలెను.

**2.8 ప్రతి పంటకు కనీస మద్దతు ధర గిట్టుబాటుగా ఉండేటట్లు ప్రకటించడం.**

ప్రతిపంటకు కనీస మద్దతు ధర ప్రకటించి, మార్కెట్‌లో అంతకు తక్కువ ధర వున్నప్పుడు ప్రభుత్వం ఆహార ఉత్పత్తులను కొనుటకు తగిన ఏర్పాట్లు చేయవలెను. కనీస మద్దతు ధర రైతుకు గిట్టుబాటు అయ్యేంతగా నిర్ణయించవలెను. దళారుల దోపిడీకి గురికాకుండా రైతుకు తగినమౌలిక సదుపాయాలు కల్పించవలెను.

**2.9 రైతుల యాజమాన్యంలో, పరస్పర సహకార చట్ట పరిధిలో వ్యవసాయ పరిశ్రమలు మరియు వ్యవసాయ మౌలిక సదుపాయాలు.**

వ్యవసాయ మార్కెట్‌లను ఆధునీకరించడంతోపాటు, వాటిలో కోల్డ్ స్టోరేజ్ (Cold storage) లను స్థాపించవలెను. పరస్పర సహకార రంగంలో (Mutually Aided Cooperative Societies / MACs) రైతులకు భాగస్వామ్యం ఉండే విధానంలో వ్యవసాయ పరిశ్రమలు స్థాపించాలి. వేరుశెనగ ద్వారా వివిధ తిండి ఉత్పత్తులను, జొన్నలు, సజ్జలు, నువ్వులు, పెసలు, ధనియాలు, కందులు మొదలగు కాయధాన్యములకు, చిరుధాన్యములకు విలువను జోడించడటంతోపాటు, వాటి ద్వారా నిల్వవుంచగల వివిధ తిండి పదార్థాలను తయారుచేయు పరిశ్రమలను స్థాపించవలెను. చీని, నిమ్మ, మామిడి, జామ, సపోట మొ॥గు పండ్ల రసాలు (Fruit juices), జామ్‌లు (Jams), నిల్వవుంచగల వివిధ పండ్ల ఉత్పత్తులను, కూరగాయల ఉత్పత్తులను తయారుచేయు పరిశ్రమలను స్థాపించవలెను. పాడిపరిశ్రమ పాల ఉత్పత్తులతో సంధానం చేసి, పాలపొడి, చాక్‌లెట్లు, నెయ్యి, వెన్న(Butter &Cheese) మొదలగు పాల ఉత్పత్తులను తయారు చేయవలెను.

"అమూల్" (AMUL - Anand Milk Union Ltd.) తరహాలో పాడిపరిశ్రమను మరియు పాల ఉత్పత్తులను ప్రోత్సహించి, పాల ఉత్పత్తులలో వచ్చే ఆదాయంలో కూడా రైతుకు భాగస్వామ్యం కల్పించవలెను. తద్వారా, రైతుకు గిట్టుబాటు ధరతోబాటు, జిల్లాలోని విద్యావంతులకు ఉపాధి కూడా లభించవలెను.

**3 ముగింపు.**

పై కార్యక్రమాలన్నీ ఒక నిర్దిష్ట కాలవ్యవధిగల ప్రణాళికతో, తగిన నిధులను సమకూర్చి, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టవలెను. ఈ కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన, పార్టీ రాజకీయాలకు,

వర్గాలకతీతంగా అమలు చేయుటకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించవలెను. ప్రతిస్థాయిలోనూ ప్రజలు మరియు పౌరసంఘాల నిఘాను ఏర్పరచి, పారదర్శకతతో అమలు చేయవలెను. అమలు చేసే యంత్రాంగాన్నీ, ప్రజలను సరైన మార్గంలో నడిపించుటకు అన్ని రాజకీయ పక్షాలు కలిసి కృషి చేయవలెను.

అప్పుడే, అనంతపురం జిల్లాలోని ప్రజలలో నెలకొనివున్న నిరాశానిస్పృహలను తొలగించి, భవిష్యత్తుపై ఆశలను చిగురింపజేయవచ్చును.

– ఆర్.డి.టి. ఈ మాసపు సమాచారం – జనవరి–2005

| వ.నెం. | మండలం | చెరువులు | | కుంటలు | | జవుకు కాలువలు | | ఊటకాలువలు | | తలిపిరులు | | సప్లైఛానల్స్ | | కాలువలు | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో |
| 1) | అగళి | 27 | 2994 | 6 | 4 | - | 8 | 3 | 151 | - | - | 1 | - | 13 | 517 | 50 | 3666 |
| 2) | ఆమడుగూరు | 16 | 661 | 22 | 235 | 1 | - | 2 | 1 | 7 | 41 | - | - | 19 | 209 | 67 | 1155 |
| 3) | అమరాపురం | 24 | 4534 | 13 | 52 | - | 37 | - | - | - | - | - | - | 3 | 47 | 40 | 4633 |
| 4) | అనంతపురం | 16 | 1106 | 22 | 9 | 3 | - | - | - | 7 | 56 | - | - | 43 | 686 | 91 | 1894 |
| 5) | ఆత్మకూరు | 13 | 1377 | 44 | 165 | - | 14 | - | - | 21 | 270 | - | - | 24 | 390 | 102 | 2202 |
| 6) | బి.కె.సముద్రం | 10 | 3368 | 10 | 334 | 1 | 10 | - | - | 13 | 289 | - | - | 32 | 732 | 66 | 4737 |
| 7) | బత్తలపల్లి | 12 | 868 | 16 | 681 | 1 | 11 | 3 | 75 | 2 | 50 | 2 | 30 | 63 | 2346 | 99 | 4060 |
| 8) | బెళుగుప్ప | 17 | 714 | 6 | 160 | 1 | - | 6 | 410 | 2 | 24 | 4 | 472 | 8 | 40 | 44 | 1831 |
| 9) | బొమ్మనహాళ్ | 5 | 467 | 5 | 187 | - | - | 4 | 753 | - | - | - | - | 14 | 2673 | 28 | 4080 |
| 10) | బ్రహ్మసముద్రం | 13 | 1715 | 1 | - | 1 | 5 | 5 | 44 | 3 | 90 | - | - | 23 | 713 | 46 | 2567 |
| 11) | బుక్కపట్నం | 15 | 1432 | 13 | 115 | - | - | 1 | 48 | 4 | 160 | 1 | - | 16 | 303 | 50 | 2058 |
| 12) | సి.కె.పల్లి | 22 | 2153 | 6 | 137 | - | - | - | - | - | - | 1 | 119 | 46 | 1338 | 75 | 3747 |
| 13) | చిలమత్తూరు | 93 | 4008 | 45 | 403 | - | - | 1 | 20 | - | - | 2 | - | 5 | 164 | 146 | 4595 |
| 14) | డి.హీరేహాళ్ | 10 | 563 | 43 | 267 | - | - | 5 | 208 | - | - | - | - | 5 | 188 | 63 | 1226 |
| 15) | ధర్మవరం | 27 | 5070 | 52 | 663 | - | - | 6 | 330 | 4 | 19 | 6 | 246 | 39 | 1418 | 134 | 7745 |
| 16) | గాండ్లపెంట | 18 | 341 | 74 | 110 | 1 | - | 2 | 6 | 3 | 18 | 2 | 26 | 14 | 21 | 114 | 522 |
| 17) | గార్లదిన్నె | 18 | 1011 | 32 | 217 | - | - | 3 | 284 | - | - | 20 | 737 | 34 | 1889 | 107 | 4138 |
| 18) | గుత్తి | 23 | 2759 | 22 | 28 | - | - | - | - | 2 | 21 | 2 | 63 | 97 | 867 | 146 | 3737 |
| 19) | గోరంట్ల | 75 | 4457 | 75 | 522 | 1 | 9 | - | - | - | - | 3 | 95 | 11 | 253 | 165 | 5336 |
| 20) | గుడిబండ | 27 | 2392 | 13 | 240 | - | - | - | - | - | - | - | - | 24 | 724 | 64 | 3356 |
| 21) | గుమ్మగట్ట | 10 | 13538 | 29 | 150 | - | - | 7 | 554 | 2 | 13 | 2 | 197 | - | - | 50 | 14452 |
| 22) | గుంతకల్ | 12 | 1649 | 13 | 60 | - | - | 11 | 61 | 5 | 126 | - | - | 29 | 496 | 70 | 2392 |
| 23) | హిందూపురం | 28 | 10992 | 38 | 333 | - | - | 2 | - | - | - | - | - | 1 | - | 69 | 11325 |
| 24) | కదిరి | 25 | 1242 | 67 | 843 | - | - | 5 | 43 | 7 | 34 | 6 | 62 | 30 | 438 | 140 | 2661 |
| 25) | కళ్యాణదుర్గం | 24 | 639 | 2 | - | 6 | 22 | 4 | 188 | 10 | 111 | 1 | 8 | 54 | 513 | 101 | 1481 |
| 26) | కంబదూరు | 43 | 2848 | - | - | 2 | 11 | 6 | 294 | 13 | 67 | 1 | 189 | 23 | 279 | 88 | 3688 |
| 27) | కనగానిపల్లి | 17 | 1086 | 64 | 2180 | - | - | - | - | 1 | 17 | 2 | 25 | 44 | 1005 | 128 | 4313 |
| 28) | కనేకల్ | 9 | 631 | 1 | 10 | - | - | 10 | 2032 | - | - | 1 | 2227 | 6 | - | 27 | 4900 |
| 29) | కొత్తచెరువు | 13 | 4401 | 21 | 362 | 3 | 10 | 2 | 316 | 1 | 18 | 2 | 66 | 34 | 1143 | 76 | 6316 |
| 30) | కూడేరు | 19 | 837 | 7 | 67 | 3 | 17 | 3 | 59 | 3 | 11 | 4 | 64 | 103 | 1107 | 142 | 2162 |
| 31) | కుందుర్పి | 14 | 1284 | 11 | 30 | - | - | 1 | 4 | 1 | 102 | - | - | 114 | 1012 | 141 | 2432 |
| 32) | లేపాక్షి | 21 | 5037 | 18 | 149 | - | - | - | - | - | - | 1 | - | - | - | 40 | 5186 |

| ప.నెం. | మండలం | చెరువులు | | కుంటలు | | జవుకు కాలువలు | | ఊటకాలువలు | | తలిపిరులు | | సప్లైఛానల్స్ | | కాలువలు | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో | సంఖ్య | ఎకరాలలో |
| 33) | మడకశిర | 36 | 4401 | 140 | 453 | - | - | - | - | - | - | 1 | 63 | 7 | 302 | 184 | 5219 |
| 34) | ముదిగుబ్బ | 27 | 1741 | 38 | 183 | - | - | 3 | 233 | 1 | 15 | 2 | 207 | 35 | 679 | 106 | 3058 |
| 35) | ఎన్.పి.కుంట | 33 | 872 | 32 | 193 | - | - | - | - | - | - | - | - | 1 | 8 | 33 | 872 |
| 36) | నల్లచెరువు | 16 | 929 | 38 | 525 | - | - | - | - | 2 | 3 | - | - | 5 | 97 | 16 | 929 |
| 37) | నల్లమాడ | 25 | 685 | 108 | 354 | - | - | 1 | 3 | 3 | 6 | - | - | 17 | 265 | 25 | 685 |
| 38) | నార్పల | 9 | 449 | 26 | 69 | 4 | 22 | - | - | 9 | 75 | - | - | 26 | 561 | 9 | 449 |
| 39) | ఓ.డి.చెరువు | 17 | 1085 | 77 | 661 | - | - | 2 | 6 | 4 | 14 | - | - | 26 | 362 | 126 | 2128 |
| 40) | పామిడి | 14 | 1040 | 12 | 82 | - | - | 6 | 455 | - | - | - | - | 42 | 1969 | 74 | 3546 |
| 41) | పరిగి | 10 | 2404 | 10 | 3234 | - | - | - | - | - | - | 1 | - | - | - | 21 | 5638 |
| 42) | పెద్దపప్పూరు | 8 | 10 | 31 | - | - | - | 11 | 2124 | - | - | - | - | 12 | 488 | 62 | 2622 |
| 43) | పెద్దవడుగూరు | 35 | 750 | 33 | 110 | - | - | 1 | 125 | - | - | 1 | - | 61 | 2342 | 131 | 3327 |
| 44) | పెనుకొండ | 34 | 2839 | 17 | 155 | 2 | 45 | - | - | 3 | 45 | 3 | 22 | 22 | 166 | 81 | 3272 |
| 45) | పుట్లూరు | 7 | 2090 | 70 | - | 4 | - | 2 | 42 | - | - | 2 | 126 | - | - | 81 | 2258 |
| 46) | పుట్టపర్తి | 27 | 1316 | 7 | 180 | - | 13 | 3 | 342 | 1 | 21 | 2 | 109 | 58 | 411 | 102 | 2392 |
| 47) | రామగిరి | 18 | 1341 | 36 | 244 | - | - | - | - | - | - | - | - | 63 | 1485 | 117 | 3070 |
| 48) | రాప్తాడు | 15 | 1373 | 18 | 356 | - | - | - | - | 13 | 404 | - | - | 36 | 916 | 82 | 3049 |
| 49) | రాయదుర్గం | 42 | 1407 | 1 | - | - | - | 13 | 1004 | - | - | 1 | 397 | 12 | 188 | 69 | 2996 |
| 50) | రొద్దం | 26 | 4569 | 63 | 820 | - | - | 2 | 127 | - | - | - | - | 10 | 550 | 101 | 6066 |
| 51) | రొళ్ల | 13 | 910 | 68 | 226 | - | - | 6 | 80 | 4 | 46 | 15 | 409 | 29 | 347 | 135 | 2018 |
| 52) | సెట్టూరు | 9 | 1584 | 3 | 25 | - | - | - | - | 2 | 18 | - | - | 34 | 244 | 48 | 1871 |
| 53) | సింగనమల | 13 | 3242 | 42 | 193 | 1 | - | 12 | 1394 | 1 | 6 | 3 | - | 54 | 3037 | 126 | 8772 |
| 54) | సోమందేపల్లి | 29 | 4130 | 58 | 671 | - | - | - | - | - | - | - | - | 1 | - | 88 | 4801 |
| 55) | తాడిమర్రి | 18 | 758 | 5 | 12 | - | - | 9 | 357 | 6 | 22 | 6 | - | 63 | 1030 | 107 | 2179 |
| 56) | తాడిపత్రి | 17 | 1669 | 70 | 2278 | 1 | 2 | 18 | 2164 | - | - | 1 | 120 | 20 | 1116 | 127 | 7349 |
| 57) | తలుపుల | 89 | 1613 | 56 | 536 | - | - | - | - | 4 | 48 | - | - | 21 | 155 | 120 | 2352 |
| 58) | తనకల్లు | 223 | 1728 | 68 | 427 | - | - | 2 | 8 | 2 | 3 | 4 | - | 36 | 1105 | 135 | 3270 |
| 59) | ఉరవకొండ | 22 | 394 | 8 | 5 | - | - | 4 | 129 | 6 | 22 | - | - | 54 | 366 | 94 | 916 |
| 60) | వజ్రకరూరు | 26 | 297 | 10 | 21 | - | - | 2 | - | - | - | - | - | 38 | 312 | 76 | 630 |
| 61) | విడపనకల్లు | 18 | 1057 | 39 | - | - | - | - | - | - | - | - | - | - | - | 57 | 1057 |
| 62) | యాడికి | 19 | 657 | 93 | 89 | 1 | 40 | 1 | 67 | 1 | - | - | - | 77 | 1168 | 192 | 2021 |
| 63) | యల్లనూరు | 12 | 4127 | 26 | 265 | - | - | 13 | 2107 | - | - | 4 | 445 | 3 | 243 | 58 | 7187 |
| | మొత్తం | 1373 | 137640 | 2094 | 21079 | 37 | 276 | 203 | 16648 | 173 | 2285 | 110 | 6523 | 1834 | 42321 | 5 8 | 2 4 |



## STATEMENT SHOWING THE RECEIPT OF RAINFALL FOR THE LAST 130 YEARS(IN M. STATGRICULTURAL YEAR IN ANAI STATꝚ DIST.,

| | | SOUTH-WEST MONSOON | | | NORTH-EAST MONSOON | | | WINTER PERIOD | | | HOT WEATHER PERIOD | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Dist.NORMAL | | 47.0 | 53.2 | 78.8 | 131.8 | 92.8 | 46.3 | 7.9 | 3.4 | 5.0 | 4.2 | 19.2 | 54.3 | 544.0 | |
| YEAR | | June | July | August | Septem-ber | October | Novem-ber | Decem-ber | January | February | March | April | May | Total | |
| 1876 - | 77 | 53.8 | 17.3 | 32.5 | 31.8 | 0.5 | 3.6 | — | 0.5 | — | 31.8 | 0.8 | 64.0 | 236.6 | |
| 1877 - | 78 | 105.7 | 36.1 | 35.3 | 164.6 | 231.4 | 33.8 | 2.3 | — | — | 2.5 | 13.2 | 42.4 | 667.3 | |
| 1878 - | 79 | 113.0 | 145.3 | 193.0 | 201.2 | 184.7 | 55.9 | 2.5 | 0.3 | 20.6 | 1.5 | 1.0 | 208.8 | 1127.8 | |
| 1879 - | 80 | 35.1 | 135.9 | 53.6 | 64.5 | 78.2 | 11.4 | — | — | — | 1.5 | 7.1 | 58.7 | 446.0 | |
| 1880 - | 81 | 88.6 | 23.1 | 87.1 | 43.4 | 197.9 | 73.7 | 2.3 | — | — | 3.3 | 16.5 | 33.5 | 569.4 | |
| 1881 - | 82 | 24.6 | 5.6 | 104.9 | 131.3 | 40.6 | 65.0 | 2.5 | 8.4 | — | 2.0 | 6.1 | 55.1 | 446.1 | |
| 1882 - | 83 | 16.3 | 27.2 | 140.7 | 119.1 | 46.5 | 141.7 | — | - | — | 14.2 | 14.2 | 19.8 | 539.7 | |
| 1883 - | 84 | 74.4 | 46.7 | 194.6 | 9.4 | 192.5 | 38.6 | 12.2 | 4.1 | | — | 5.1 | 24.4 | 602.0 | |
| 1884 - | 85 | 24.1 | 11.7 | 32.3 | 32.5 | 97.5 | 49.0 | 11.4 | — | — | 14.2 | 2.0 | 41.9 | 316.6 | |
| 1885 - | 86 | 30.2 | 72.1 | 27.9 | 89.2 | 170.7 | 18.3 | 24.4 | — | — | 1.0 | 4.1 | 51.6 | 489.5 | |
| 1886 - | 87 | 55.9 | 124.2 | 171.2 | 55.4 | 125.2 | 59.4 | 15.5 | - — | — | — | 2.0 | 60.7 | 669.5 | |
| 1887 - | 88 | 40.4 | 28.4 | 201.4 | 178.3 | 73.7 | 73.9 | 14.0 | - — | — | — | 33.8 | 51.3 | 695.2 | |
| 1888 - | 89 | 28.4 | 42.4 | 34.5 | 152.1 | 40.1 | 125.7 | 1.5 | - | | — | 7.9 | 31.0 | 463.6 | |
| 1889 - | 90 | 69.6 | 94.5 | 59.4 | 295.9 | 251.5 | 21.6 | 3.0 | - — | — | 4.8 | 26.7 | 32.8 | 859.8 | |
| 1890 - | 91 | 43.4 | 27.2 | 60.2 | 108.7 | 105.9 | 100.8 | 14.5 | - — | — | 3.3 | 13.0 | 7.4 | 484.4 | |
| 1891 - | 92 | 49.3 | 38.4 | 43.4 | 8.4 | 89.2 | 22.6 | 1.3 | — | 0.8 | — | 19.3 | 18.3 | 291.0 | |
| 1892 - | 93 | 167.1 | 118.1 | 165.9 | 92.2 | 110.0 | 4.8 | 16.8 | 1.5 | 3.8 | 18.5 | 24.5 | 62.5 | 785.7 | |
| 1893 - | 94 | 97.1 | 101.9 | 49.8 | 71.6 | 157.5 | 54.9 | — | — | 0.5 | 3.0 | 27.7 | 37.6 | 601.6 | |
| 1894 - | 95 | 24.6 | 62.2 | 165.9 | 59.9 | 162.3 | 22.9 | — | — | 0.8 | — | 38.1 | 39.1 | 575.8 | |
| 1895 - | 96 | 44.7 | 61.0 | 43.7 | 224.3 | 159.3 | 30.2 | 7.1 | — | — | 0.8 | 5.3 | 61.7 | 638.1 | |
| 1896 - | 97 | 72.1 | 34.3 | 58.2 | 62.0 | 10.4 | 38.4 | 3.3 | 0.3 | 2.5 | 1.0 | 9.1 | 30.7 | 322.3 | |
| 1897 - | 98 | 85.1 | 39.1 | 97.3 | 304.3 | 64.4 | 2.3 | 4.8 | — | 2.5 | — | 25.7 | 40.6 | 666.1 | |
| 1898 - | 99 | 43.9 | 22.9 | 30.8 | 188.5 | 27.9 | 90.4 | 12.2 | — | — | — | 44.7 | 20.0 | 481.3 | |
| 1899 - | 1900 | | 11.4 | 5.1 | 49.3 | 233.9 | 52.8 | 8.4 | — | — | — | — | 41.4 | 25.1 | |
| 427.4 | | 1900 | - | 01 | 46.5 | 127.5 | 44.5 | 194.3 | 76.7 | 2.5 | 3.0 | 3.6 | 39.4 | — | 8.9 |
| 67.1 | 614.0 | | | 1901 | - | 02 | 36.6 | 27.4 | 21.1 | 145.3 | 66.8 | 49.0 | 6.1 | 5.1 | — |
| — | 26.4 | 36.1 | 419.9 | | | 1902 | - | 03 | 78.2 | 34.3 | 57.4 | 153.7 | 160.3 | 15.7 | 3.8 |
| 1.3 | — | — | 13.5 | 51.8 | 570.0 | | | 1903 | - | 04 | 64.0 | 88.9 | 87.0 | 207.0 | |
| 110.8 | 202.4 | 5.3 | 2.0 | — | 1.0 | 16.0 | 102.6 | 887.0 | | | 1904 | - | 05 | 33.8 | 47.0 |
| 17.3 | 74.4 | 161.0 | — | 1.5 | 2.3 | 3.0 | 14.0 | 7.9 | 53.8 | 416.0 | | | | | |

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1905 - 06 | 37.8 | 24.4 | 194.3 | 26.4 | 113.0 | 3.6 | 0.5 | 18.3 | — | — | — | 13.5 | 431.8 |
| 1906 - 07 | 69.9 | 79.5 | 133.6 | 141.2 | 115.1 | 8.1 | 99.3 | 0.3 | — | 1.0 | 46.7 | 5.8 | 700.5 |
| 1907 - 08 | 47.5 | 135.1 | 21.8 | 103.9 | 16.0 | 54.1 | 4.8 | 9.9 | 0.3 | 13.7 | 6.4 | 32.8 | 446.3 |
| 1908 - 09 | 46.5 | 41.9 | 18.0 | 186.4 | 30.7 | | — | 21.6 | 0.3 | — | 38.9 | 87.4 | 471.7 |
| 1909 - 10 | 33.8 | 36.1 | 236.7 | 179.8 | 26.2 | 6.9 | 0.3 | — | — | — | 9.9 | 36.8 | 566.5 |
| 1910 - 11 | 40.6 | 162.3 | 124.7 | 193.5 | 116.1 | 87.4 | — | — | — | 2.5 | 20.1 | 58.7 | 805.9 |
| 1911 - 12 | 58.9 | 48.8 | 52.3 | 96.8 | 78.5 | 11.2 | 5.3 | — | 5.1 | 2.3 | 8.9 | 20.6 | 388.7 |
| 1912 - 13 | 40.6 | 54.4 | 132.1 | 228.3 | 129.0 | 100.6 | — | — | – | — | 2.3 | 74.4 | 761.7 |
| 1913 - 14 | 53.1 | 83.1 | 10.7 | 164.6 | 87.9 | | 2.0 | — | – | — | 14.5 | 47.0 | 462.9 |
| 1914 - 15 | 38.1 | 45.2 | 93.0 | 127.0 | 32.5 | 29.5 | 2.5 | 16.5 | – | 38.6 | 10.4 | 67.8 | 501.1 |
| 1915 - 16 | 61.0 | 118.1 | 27.7 | 235.2 | 52.8 | 102.9 | 0.5 | — | — | — | 6.4 | 81.3 | 685.9 |
| 1916 - 17 | 31.8 | 212.9 | 132.6 | 158.2 | 154.9 | 71.1 | — | — | 81.8 | 5.8 | 9.4 | 45.4 | 903.9 |
| 1917 - 18 | 90.9 | 33.8 | 148.8 | 225.0 | 114.6 | 76.5 | 0.3 | 6.9 | — | 3.3 | 14.2 | 94.0 | 808.3 |
| 1918 - 19 | 22.4 | 12.4 | 28.7 | 182.9 | 1.0 | 113.5 | 8.9 | 5.1 | — | 13.7 | 41.1 | 56.6 | 486.3 |
| 1919 - 20 | 62.5 | 73.4 | 13.7 | 324.4 | 39.9 | 98.3 | 6.6 | 21.8 | 0.5 | — | 3.6 | 24.9 | 669.6 |
| 1920 - 21 | 18.8 | 14.5 | 54.9 | 118.4 | 41.7 | 16.5 | — | 4.6 | — | — | 60.2 | 8.6 | 338.2 |
| 1921 - 22 | 57.9 | 88.4 | 34.3 | 61.2 | 241.8 | 57.2 | — | 40.1 | — | — | 9.1 | 46.5 | 636.5 |
| 1922 - 23 | 16.8 | 25.7 | 47.8 | 10.2 | 96.3 | 153.9 | 0.5 | 15.2 | 14.5 | 16.3 | 20.3 | 37.6 | 455.1 |
| 1923 - 24 | 38.9 | 43.4 | 11.2 | 114.0 | 19.8 | | 0.3 | — | — | — | 17.8 | 58.9 | 304.3 |
| 1924 - 25 | 46.5 | 51.3 | 81.5 | 181.4 | 33.8 | 66.8 | — | — | — | — | 25.4 | 103.9 | 590.6 |
| 1925 - 26 | 14.7 | 43.7 | 80.3 | 122.7 | 98.9 | 52.8 | 55.6 | 15.2 | — | 1.5 | 38.1 | 43.8 | 567.3 |
| 1926 - 27 | 89.2 | 42.4 | 16.8 | 149.4 | 84.1 | 3.3 | — | — | 1.0 | — | 1.5 | 32.0 | 419.7 |
| 1927 - 28 | 65.0 | 88.9 | 48.5 | 194.8 | 42.4 | 106.4 | — | — | 33.5 | 4.3 | 20.8 | 32.5 | 637.1 |
| 1928 - 29 | 62.5 | 93.0 | 75.9 | 85.1 | 145.8 | 5.6 | 5.1 | 2.8 | 17.0 | 2.3 | 32.0 | 62.0 | 589.1 |
| 1929 - 30 | 26.4 | 15.2 | 24.1 | 228.6 | 112.3 | 85.6 | 6.4 | 3.3 | 2.3 | 10.4 | 4.6 | 109.7 | 628.9 |
| 1930 - 31 | 54.1 | 35.3 | 45.0 | 143.0 | 188.5 | 50.0 | 30.2 | — | — | 3.3 | 2.3 | 39.6 | 591.3 |
| 1931 - 32 | 83.6 | 21.6 | 10.9 | 143.8 | 31.5 | 43.9 | 9.4 | — | 8.6 | — | 5.8 | 56.4 | 415.5 |
| 1932 - 33 | 41.0 | 44.2 | 146.7 | 83.1 | 113.3 | 66.0 | 0.8 | — | 2.5 | 3.0 | 25.1 | 102.4 | 628.1 |
| 1933 - 34 | 17.5 | 82.6 | 195.3 | 67.3 | 110.7 | 18.3 | 37.1 | 1.5 | 0.5 | — | 28.4 | 28.2 | 587.4 |
| 1934 - 35 | 41.9 | 66.0 | 22.4 | 5.3 | 72.1 | 39.1 | 0.8 | — | 1.3 | 3.3 | 35.3 | 33.0 | 320.5 |
| 1935 - 36 | 65.8 | 36.8 | 259.3 | 50.3 | 118.9 | — | 1.0 | — | 8.6 | 13.7 | 11.4 | 76.5 | 642.3 |
| 1936 - 37 | 52.6 | 28.4 | 31.0 | 160.8 | 55.9 | 103.6 | 4.1 | — | 13.0 | 5.8 | 86.4 | 45.5 | 587.1 |
| 1937 - 38 | 36.1 | 49.3 | 27.2 | 126.5 | 143.8 | 24.6 | 5.1 | — | 1.3 | 5.3 | 2.3 | 74.4 | 495.9 |
| 1938 - 39 | 31.5 | 47.2 | 327.2 | 232.2 | 13.0 | 3.0 | — | 0.5 | — | 14.7 | 45.0 | 18.0 | 732.3 |

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1939 - 40 | 74.7 | 31.0 | 94.7 | 127.0 | 87.9 | 52.3 | — | — | — | — | – 43.4 | 122.9 | 633.9 |
| 1940 - 41 | 37.3 | 29.7 | 47.5 | 104.1 | 209.8 | 66.3 | 1.0 | 1.8 | 8.9 | — | – 9.7 | 29.2 | 545.3 |
| 1941 - 42 | 20.6 | 39.9 | 60.7 | 163.8 | 95.3 | 22.9 | 71.4 | 2.3 | 1.0 | — | 18.8 | 33.0 | 529.7 |
| 1942 - 43 | 121.2 | 22.1 | 81.0 | 31.8 | 27.9 | 11.9 | 2.5 | 7.1 | — | — | 24.9 | 126.2 | 456.6 |
| 1943 - 44 | 13.0 | 22.4 | 35.6 | 120.4 | 140.2 | 47.8 | — | — | 17.8 | 38.1 | 4.3 | 21.3 | 460.9 |
| 1944 - 45 | 100.3 | 95.3 | 17.0 | 116.8 | 182.1 | 21.1 | — | — | — | — | 23.4 | 61.2 | 617.2 |
| 1945 - 46 | 20.6 | 79.0 | 58.4 | 69.3 | 29.0 | 24.1 | — | — | 1.0 | 4.6 | 8.9 | 74.4 | 369.3 |
| 1946 - 47 | 14.2 | 37.3 | 106.2 | 142.0 | 70.9 | 114.8 | 34.0 | 1.8 | 1.5 | — | 6.4 | 11.5 | 540.6 |
| 1947 - 48 | 66.8 | 58.2 | 94.5 | 190.5 | 59.2 | 7.4 | 6.1 | 0.8 | — | 0.3 | 36.6 | 54.9 | 575.3 |
| 1948 - 49 | 21.1 | 46.7 | 90.7 | 84.8 | 58.1 | 89.7 | — | — | — | — | 4.1 | 72.4 | 467.6 |
| 1949 - 50 | 43.4 | 65.5 | 127.7 | 161.0 | 114.3 | 11.2 | — | — | – 5.1 | — | 2.0 | 69.3 | 599.5 |
| 1950 - 51 | 33.8 | 88.6 | 88.9 | 102.6 | 117.3 | 30.7 | — | — | — | 17.8 | 2.5 | 78.7 | 560.9 |
| 1951 - 52 | 52.8 | 63.5 | 17.8 | 135.3 | 17.8 | 8.6 | — | — | — | 10.4 | 19.1 | 84.6 | 409.9 |
| 1952 - 53 | 7.6 | 50.8 | 38.1 | 40.6 | 106.6 | | 35.5 | — | — | — | 50.4 | 22.9 | 352.5 |
| 1953 - 54 | 55.8 | 137.1 | 20.3 | 134.6 | 218.5 | 0.2 | — | | | — | 10.2 | 40.6 | 617.3 |
| 1954 - 55 | 30.4 | 109.2 | 63.5 | 35.5 | 124.4 | | — | — | — | 10.2 | 30.5 | 106.7 | 510.4 |
| 1955 - 56 | 30.4 | 55.4 | 101.6 | 167.6 | 104.1 | 25.4 | 2.5 | 12.7 | 1.0 | — | 50.9 | 47.7 | 599.3 |
| 1956 - 57 | 56.9 | 99.3 | 28.4 | 170.0 | 222.2 | 70.1 | 8.3 | — | – 2.3 | 10.9 | 16.0 | 53.1 | 737.5 |
| 1957 - 58 | 110.7 | 52.1 | 47.0 | 77.7 | 87.1 | 42.1 | 0.2 | — | — | — | 25.4 | 91.4 | 533.7 |
| 1958 - 59 | 30.5 | 85.5 | 106.7 | 121.9 | 111.7 | 35.5 | | | | | 12.7 | 48.8 | 553.3 |
| 1959 - 60 | 106.6 | 81.3 | 63.5 | 170.2 | 25.4 | | — | — | — | — | – 12.7 | 50.8 | 510.5 |
| 1960 - 61 | 25.4 | 51.8 | 12.7 | 231.1 | 35.5 | 55.9 | — | — | — | — | – 15.2 | 76.0 | 503.6 |
| 1961 - 62 | 73.6 | 35.7 | 35.5 | 30.2 | 137.2 | 15.5 | — | — | — | — | 38.1 | 45.7 | 411.5 |
| 1962 - 63 | 43.2 | 85.5 | 124.4 | 83.8 | 149.8 | 10.1 | 68.4 | — | — | 6.3 | 30.8 | 40.6 | 642.9 |
| 1963 - 64 | 30.5 | 33.0 | 101.6 | 106.7 | 152.4 | 6.3 | — | — | | | 6.3 | 10.1 | 446.9 |
| 1964 - 65 | 80.9 | 134.6 | 35.5 | 210.8 | 40.2 | 43.2 | — | — | — | — | – 20.3 | 10.1 | 575.6 |
| 1965 - 66 | 43.2 | 22.8 | 132.0 | 86.3 | — | 5.1 | 33.0 | 32.0 | — | — | – 15.3 | 38.1 | 407.8 |
| 1966 - 67 | 83.8 | 66.0 | 88.1 | 137.2 | 81.3 | 86.3 | 12.7 | — | — | 10.2 | 10.2 | 65.9 | 641.7 |
| 1967 - 68 | 43.2 | 116.2 | 17.8 | 121.9 | 119.8 | 12.1 | 10.2 | — | – 16.7 | 16.4 | 30.3 | 39.8 | 544.4 |
| 1968 - 69 | 42.0 | 39.4 | 6.2 | 184.9 | 83.0 | 28.8 | 10.2 | — | — | — | 5.4 | 91.2 | 491.1 |
| 1969 - 70 | 21.9 | 23.7 | 163.3 | 27.4 | 142.9 | 8.5 | 11.2 | 0.6 | 1.1 | — | 11.3 | 108.4 | 520.3 |
| 1970 - 71 | 18.7 | 25.0 | 69.7 | 147.5 | 117.3 | 3.4 | — | 1.6 | 1.0 | 2.3 | 13.3 | 41.5 | 441.3 |
| 1971 - 72 | 23.1 | 25.7 | 96.4 | 117.2 | 165.8 | 6.8 | 1.4 | — | — | — | 8.3 | 113.9 | 558.6 |
| 1972 - 73 | 43.8 | 13.3 | 6.5 | 140.2 | 147.4 | 42.0 | 8.4 | — | — | — | 2.9 | 17.2 | 421.7 |

| | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1973 - 74 | 66.9 | 26.1 | 91.5 | 193.8 | 177.3 | 21.5 | 2.1 | — | — | — | 0.9 | 12.9 | 107.4 | 700.4 | — | |
| 1974 - 75 | 45.3 | 50.3 | 30.7 | 217.7 | 164.6 | 2.7 | — | — | — | — | 12.4 | 2.5 | 48.0 | 574.2 | — | |
| 1975 - 76 | 21.3 | 128.5 | 87.3 | 127.9 | 247.9 | 72.4 | 1.0 | — | — | | — | 23.7 | 13.6 | 723.6 | — | |
| 1976 - 77 | 48.5 | 33.2 | 117.6 | 17.2 | 34.4 | 31.8 | — | — | — | | 3.4 | 14.8 | 134.4 | 435.3 | — | |
| 1977 - 78 | 76.7 | 69.1 | 100.6 | 100.3 | 126.9 | 60.7 | — | | 2.1 | | 0.9 | 19.1 | 37.4 | 593.8 | — | |
| 1978 - 79 | 30.3 | 76.0 | 42.1 | 161.5 | 54.0 | 62.3 | 22.8 | — | 12.7 | | 0.4 | 5.9 | 36.1 | 504.1 | — | |
| 1979 - 80 | 48.2 | 45.0 | 61.2 | 228.2 | 47.3 | 108.4 | — | — | — | | 3.7 | 13.7 | 46.1 | 601.8 | — | |
| 1980 - 81 | 51.0 | 32.8 | 39.3 | 101.6 | 48.4 | 46.6 | 4.7 | 3.8 | — | | 14.6 | 10.0 | 47.6 | 400.4 | — | |
| 1981 - 82 | 37.8 | 76.8 | 81.7 | 276.1 | 86.1 | 40.8 | 6.8 | — | — | | 0.7 | 15.7 | 44.6 | 667.1 | — | |
| 1982 - 83 | 69.2 | 67.3 | 12.6 | 138.5 | 65.6 | 121.6 | — | — | 0.1 | | — | 0.1 | 50.5 | 525.5 | — | |
| 1983 - 84 | 79.8 | 25.1 | 100.9 | 179.2 | 41.2 | 3.5 | 21.4 | — | 2.9 | | 33.8 | 15.0 | 10.9 | 513.7 | — | |
| 1984 - 85 | 8.5 | 113.8 | 10.6 | 77.9 | 59.5 | 5.3 | 7.8 | 0.9 | — | | 2.8 | 13.2 | 29.0 | 329.3 | — | |
| 1985 - 86 | 34.5 | 57.3 | 17.6 | 48.3 | 75.9 | 13.4 | 2.1 | 11.7 | 11.9 | | — | 7.5 | 14.4 | 294.6 | — | |
| **Normals:** | **46.9** | **55.8** | **71.7** | **122.1** | **96.4** | **34.9** | **9.2** | **2.5** | **3.6** | | **3.6** | **19.4** | **54.3** | **520.4** | — | |
| 1986 - 87 | 65.8 | 15.8 | 42.4 | 128.9 | 37.6 | 38.2 | 3.9 | — | — | | 0.8 | 0.3 | 21.4 | 355.1 | — | |
| 1987 - 88 | 66.0 | 6.4 | 95.4 | 66.6 | 170.2 | 30.5 | 11.8 | — | 0.4 | | 5.4 | 32.4 | 87.2 | 572.3 | — | |
| 1988 - 89 | 11.7 | 138.1 | 233.3 | 250.5 | 21.1 | 4.6 | 16.9 | | — | | 12.4 | 8.4 | 10.0 | 707.0 | | |
| 1989 - 90 | 44.7 | 258.0 | 21.7 | 208.4 | 21.5 | 4.1 | 1.8 | 0.1 | — | — | 4.8 | 1.1 | 98.4 | 664.6 | — | |
| 1990 - 91 | 47.0 | 31.5 | 43.7 | 42.1 | 110.6 | 68.0 | 4.3 | 1.9 | — | — | 1.8 | 22.6 | 53.4 | 426.9 | — | |
| 1991 - 92 | 115.1 | 14.8 | 23.9 | 79.1 | 184.9 | 59.5 | — | — | — | | — | 6.5 | 52.4 | 536.2 | — | |
| 1992 - 93 | 61.6 | 41.7 | 59.7 | 72.9 | 83.6 | 80.4 | — | — | — | | — | 5.1 | 24.2 | 429.2 | — | |
| 1993 - 94 | 66.1 | 40.4 | 88.6 | 92.7 | 149.0 | 36.0 | 53.8 | 11.7 | 1.6 | | — | 18.4 | 36.8 | 595.1 | — | |
| 1994 - 95 | 19.8 | 45.2 | 34.1 | 29.7 | 171.5 | 23.5 | — | 1.6 | — | | 1.0 | 7.0 | 42.3 | 375.7 | — | |
| 1995 - 96 | 32.7 | 112.2 | 153.0 | 97.3 | 80.1 | 5.1 | — | — | — | | — | 35.7 | 29.0 | 545.1 | — | |
| 1996 - 97 | 170.2 | 44.5 | 120.6 | 188.3 | 188.5 | 4.4 | 9.0 | 1.2 | — | — | 8.7 | 4.3 | 5.0 | 744.7 | — | |
| 1997 - 98 | 39.5 | 10.3 | 63.0 | 161.5 | 41.5 | 43.0 | 9.0 | — | — | — | 0.4 | 11.4 | 24.7 | 404.3 | — | |
| 1998 - 99 | 25.8 | 111.2 | 165.5 | 151.3 | 139.2 | 37.3 | 4.3 | — | 4.5 | | 0.8 | 3.4 | 57.8 | 701.1 | — | |
| 1999 -2000 | 31.8 | 41.1 | 92.4 | 125.3 | 110.0 | 24.3 | 0.3 | — | 29.5 | | — | 10.5 | 55.4 | 520.6 | — | |
| **Normals:** | **64.0** | **67.0** | **89.0** | **118.0** | **111.0** | **35.0** | **10.0** | **2.0** | **1.0** | | **3.0** | **13.0** | **40.0** | **552.0** | | |
| 2000 - 2001 | | 70.3 | 54.3 | 171.3 | 75.8 | 159.1 | 5.5 | 5.4 | 0.3 | | 0.0 | 2.3 | 58.1 | 9.8 | 612.2 | 2001 |
| 2002 | 18.9 | 20.9 | 69.2 | 244.1 | 226.2 | 11.7 | 1.0 | 6.6 | 1.6 | | 0.1 | 18.6 | 83.2 | 702.1 | 2002 | |
| 2003 38.3 | 21.5 | 38.0 | 59.5 | 105.1 | 14.3 | 1.0 | 0.0 | 0.1 | 4.9 | | 7.4 | 0.2 | 290.3 | 2003 | | 2004 |
| 21.2 40.7 | 71.6 | 46.1 | 171.6 | 1.4 | | | | | | | | 352.6 | | | | |

# కలలు కంటూ వుంటాను...

ఎప్పుడు అనంతపురం జిల్లాలో ప్రతి ఎకరం
పచ్చగా పూర్తిగా వికసించి ఫలించునో
ఎప్పుడు ప్రతి కూలి, రైతు కరువులో కూడా
సంతోషంగా సగౌరవంగా జీవించునో
ఎప్పుడు జిల్లాలో ప్రజాస్వామ్యం, శాంతి,
సహజీవనం, సహకారం సాకారమౌనో
అప్పటివరకు కష్టపడుతుంటాను...
కలలు కంటూ వుంటాను...

**-డా॥ వై.వి. మల్లారెడ్డి**